UNIVERSAL
LIBRARY
OU_204120
UNIVERSAL
LIBRARY

Osmania University Library
Access

# దక్షిణాఫ్రికా

(రెండు భాగములు)

గ్రంథకర్త:

దిగవల్లి వేంకటశివరావు, బి. ఎ, బి. ఎల్.

బెజవాడ: ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే,
ముద్రింపఁబడియె.

1928

[అన్ని హక్కులు గ్రంథకర్తవి.] [వెల రు. 2—0—0

PAGES 1 TO 144 IN PART II
ARE PRINTED AT THE BHAVANI PRESS,
AND
THE REST AT THE A. G. PRESS, BEZWADA.



దక్షిణాఫ్రికా భారతీయ సత్యాగ్రహయోధుడు
గాంధిమహాత్ముడు.



దక్షిణాఫ్రికా బారిష్టరు (న్యాయవాది).

గాంధిమహాత్ముడు.

# పీఠిక.

భరతవర్షము స్వతంత్రముకొఱకు పోరాటము సలుపుచున్నట్టి తరుణమున దక్షిణాఫ్రికా చరిత్రమును శ్రీయుత దిగవల్లి శివరావుగారు ఆంధ్రులకు సమర్పించుట మిగుల సమంజసముగ నున్నది. ఇందుకు గ్రంథకర్తగారికి విజ్ఞానచంద్రికా మండలి వారెంతయు కృతజ్ఞులు. గ్రంథము మిగుల మనోహరమగు శైలిని వ్రాయబడినది. గ్రంథకర్త అనేక గ్రంథములను పరిశీలించి పెక్కువిషయములు క్రోడీకరించి చరిత్రను సమగ్రముగా నేటివరకును తెచ్చి గ్రంథమును ఎక్కువ యుపయోగకరముగా చేసియున్నారు.

ప్రపంచ చారిత్రమున దక్షిణాఫ్రికా మిగుల ప్రాముఖ్యము కలిగియున్నది. ధనతృష్ణచే తెల్లజాతులవారు తమదేశములనుండి బయలుదేరి బలహీనులగు నల్లజాతులు నివసించుచున్న దక్షిణాఫ్రికా ప్రదేశములను జేరి అచ్చటి నల్లవారిని నాశనము జేసియు బానిసలుగ చేసియు ఆప్రదేశములలోని ఫలవంతములైన భూములను గనులను అడవులను స్వాధీనముచేసికొని వలసరాజ్యములను స్థాపించిరి. ఈరాజ్యమున వసించు నల్లవారికి మానవ సత్వములను సంపూర్ణముగ తీసివేసి తెల్ల పాలకులు వారిని తమకు కూలిపనివారిగ నుపయోగించుకొనుచున్నారు. ఆదేశములలోని భూములలో నల్లవారికి జిరాయితీ హక్కులైన లేవు. తెల్లవారు నిర్ణయించిన ప్రదేశము

లలో తెల్లవారికి దూరముగ నల్లవారు కాపురముండవలెను. ఓట్ల హక్కులుగాని రాజ్యములో పాల్గొను హక్కులుగాని లేవు.

కాల కర్మవశమున దక్షిణాఫ్రికాదేశము తెల్లజాతులలో ఆంగ్లేయులకును, డచ్చివారికిని స్వాధీనమయ్యెను. ఈ రెండుజాతులకును అచ్చటి ధన రాజ్య లాభములను గూర్చి అసూయ, స్పర్థ, తగవులు కలిగెను. బోయరులు ధైర్యశాలురైనను ఆంగ్లేయులకు వెనుక బ్రిటీషు సామ్రాజ్యము అండ యైయున్నది గావున ఆంగ్లేయులే బోయరుల నోడించి వారి ప్రజాస్వామ్యములను బ్రిటీషు సామ్రాజ్యమున జేర్చిరి. బోయరుల స్వాతంత్ర్యసమరము ప్రపంచములో సుప్రసిద్ధమైనది. బోయరులు తాత్కాలికముగ స్వాతంత్ర్యము గోల్పోయినను బ్రిటీషు సామ్రాజ్యమున స్వపరిపాలనమును కలిగి ఆంగ్లేయులతోపాటు సమస్తముగు రాజకీయ హక్కులను కలిగియున్నారు. దక్షిణాఫ్రికా సమితిలో బోయరులసంఖ్యయే అధికమైనందున నచ్చటి ఆంగ్లేయులను తమలో కలిపివైచికొని ఒక ప్రత్యేక జాతీయతను దేశాభిమానమును కలిగి దక్షిణాఫ్రికా సమితిని బ్రిటీషు పతాకముక్రింద గాక ప్రత్యేక స్వతంత్రజండాక్రింద నుంచుకొనుటకు ప్రయత్నించుచున్నారు. ఇది ఇష్టములేని బ్రిటీషు ప్రభుభక్తులు వలసకేగుచున్నారు. బ్రిటీషు సామ్రాజ్య మీదేశము నెట్లు నిలుపుకొనునో చూడవలసి యున్నది.

దక్షిణాఫ్రికా చరిత్రలో భారతీయులకు ముఖ్యముగు స్థానము కలదు. ప్రథమమున దక్షిణాఫ్రికాలోని తెల్లవారు తమ పొలములందు తోటలందు గనులందు పనిచేయుటకు నమ్మకమగు కూలివారు కావలసి భరతఖండమునందలి దరిద్రుల కచ్చట వసతులు కల్పింతుమని చెప్పి వారిచే ఒడంబడికలు వ్రాయించి తీసికొనివెళ్లిరి. వీరితోపాటు కొందరు భారతీయ వర్తకులును, విద్యాధికులును వెళ్ళిరి. వీరచ్చట నెలకొనుటయు వీరచ్చటి యాదిమవాసులకన్న నాగరకు లగుటయు జూచి, వీరికి వీలుకలిగించినచో తమ యౌన్నత్యమున కిబ్బందివచ్చునని అసూయాపరులై ఆదిమవాసులతోపాటు, వీరికి పౌరహక్కులుగాని, సామాన్య నాగరక జీవనపు వసతులు గౌరవము కాని లేకుండగ తెల్లవారు చేసిరి. భారతీయుల బాధ లధికమయ్యెను. వీరికి భారతీయ ప్రభుత్వమువా రెట్టి సాహాయ్యమును జేయరైరి. అంతట భారతీయులు గాంధిమహాత్ముని నాయకత్వమున సత్యాగ్రహ సమరమును ప్రారంభించిరి. ఈ మహోద్యమ చరిత్ర మీ గ్రంథమున విపులముగ వర్ణింపబడినది. దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారికిని భారతీయులకును అప్పుడప్పుడు ఒడంబడికలు జరుగుచుండుటయు అవి భగ్నము లగుచుండుటయు భారతీయుల బాధలు హెచ్చుచు తగ్గుచు నుండుటయు వీరి యాందోళనముకూడ నాయా సమయములందు హెచ్చుచు తగ్గుచుంటయు నేటివరకును జరుగుచునే యున్నది. భరతఖండమునకు స్వరాజ్యము చేకూరినగాని

ఖండాంతర భారతీయులకు గౌరవకరమగు పరిస్థితు లేర్పడవని స్పష్టమయ్యెను. దక్షిణాఫ్రికాలో ప్రయోగించి కొంత విజయమునందిన సత్యాగ్రహ మహాస్త్రమును భారతీయ స్వరాజ్య సంపాదనకొఱకు నేడు గాంధిమహాత్ముడు సంధించియున్నాడు. ప్రపంచమున కాశ్చర్యము కలిగించిన భారతీయ "సహాయ నిరాకరణ" మహోద్యమము దీనియొక్క పరిణామమే.

అయ్యదేవర కాళేశ్వరరావు,

కార్యదర్శి, విజ్ఞానచంద్రికామండలి.

# తొలిపలుకు.

"దక్షిణాఫ్రికా నాజీవితమునకొక పురుషార్థ సాధనను గల్పించినది"  —గాంధిమహాత్ముడు.

గాంధిమహాత్ముని జీవితమునకే పురుషార్థసాధనము కలిగించిన దక్షిణాఫ్రికాచరిత్రను తెలుగున వ్రాయు భాగ్యము నాకు కలిగినది.

నే నీ గ్రంథరచనను 1924 సంవత్సరములోనే పూనుకొని చాలవరకు వ్రాసియుంటిని గాని కారణాంతరములచేత నిదిప్రకటించుటకింత యాలస్యమైనది. ఇదియు మేలేయయ్యెను. కారణమేమన నిందుచేత నెన్నియో క్రొత్త సంగతులను తెలిసికొని ఈ చరిత్రయందు చేర్పగలిగితిని. నాకీగ్రంథరచనమున తోడ్పడిన ముఖ్యములగు గ్రంథములు పత్రికలు నింకొకచోట పేర్కొనియున్నాను. ఈ గ్రంథమున గుణలేశమున్నచో నది నేను సేకరించిన చరిత్ర సాధనములదే యని మనవిచేయుచున్నాను.

దక్షిణాఫ్రికానుండి మనదేశమునకు వచ్చిన రాయబారులలో నొకరగు పత్తర్ గారు 1926 సంవత్సరము ఫిబ్రవరు నెలలో నాభాగ్యవశమున బెజవాడకు వచ్చిరి. వారి పరిచయము నాకు గలిగినది. ఈచరిత్ర విషయవిభాగమును నావలన దెలిసికొని సంతసించి దక్షిణాఫ్రికా ప్రభుత్వవార్షిక

నివేదిక (The Official Year Book) ను దయతో నాకు జదువనిచ్చిరి. దక్షిణాఫ్రికా సమితియొక్క చరిత్రను వ్రాయుపట్ల నాకది చాల నుపయోగించినది. వారికి నేను కృతజ్ఞుడను.

ఈ గ్రంథరచనకు మొదట నన్ను ప్రోత్సహించినది శ్రీయుతులు అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు. వారీ గ్రంథమును విజ్ఞానచంద్రికగ్రంథమాలలో నొక కుసుమముగ నన్ను ప్రకటింపనిచ్చిరి. వారికి నావందనములు.

ఈ గ్రంథముసంగతి తెలిసికొని శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఈచరిత్ర రెండవ భాగమునకు గావలసిన 5 చిత్రపట ప్రతిమలను తమ భారతీ కార్యాలయమున జేయించి నాకంపిరి. వారికి నావందనములు.

ఈ గ్రంథమునందలి 4 దేశపటములును 6 ఎంగ్రేవింగు బొమ్మలును, బెజవాడ ఆంధ్రగ్రంథాలముద్రాశాలలోని శిల్పియగు వేలమూరి వీరరాఘవశర్మగారు చెక్కినారు.

14-2-28 — ఇట్లు విధేయుడు.

బెజవాడ. — దిగవల్లి వెంకటశివరావు.

# విషయసూచిక

(మొదటి భాగము.)


| ప్రకరణము | శీర్షిక | పుటలు. |
|---|---|---|
| 1 | ఇండియా - ఆఫ్రికా ... | 1—9 |
| 2 | దేశము - జనులు ... | 9—23 |
| 3 | పాశ్చాత్యులరాక ... | 24—38 |
| 4 | బోయరులవలస ... | 38—55 |
| 5 | కేపుకాలనీ నేటాలు రాజ్యములు ... | 55—76 |
| 6 | బోయరు ప్రజాస్వామ్యములు ... | 76—96 |
| 7 | బోయరులు - బోయరేతరులు ... | 97—120 |
| 8 | బ్రిటీషుమంత్రుల రాజతంత్రము ... | 121—130 |
| 9 | బ్రిటీషుబోయరుల యుద్ధము ... | 130—151 |
| 10 | దక్షిణాఫ్రికాసమితి ... | 151—180 |
| 11 | ఇతర వలసరాజ్యములు ... | 180—199 |


(రెండవ భాగము.)


| అధ్యాయము | శీర్షిక | పుటలు. |
|---|---|---|
| I | దక్షిణాఫ్రికా భారతీయులు ... | ౧—౨౯ |
| II | వలసకూలి The Indentured labour... | ౩౦—౪౬ |
| III | గాంధిమహాత్ముడు ... | ౪౭—౬౦ |
| IV | నేటాలు-ట్రాన్సువాలు ... | ౬౧—౭౮ |
| V | సత్యాగ్రహ మహోద్యమము ... | ౭౯—౧౦౧ |
| VI | గాంధీవిజయము ... | ౧౦౨—౧౨౬ |
| VII | సామ్రాజ్య పౌరసత్వము ... | ౧౨౭—౧౪౦ |
| VIII | గాంధీస్మట్సుఒడంబడికయొక్కగతి... | ౧౪౧—౧౫౬ |
| IX | రాయబారములు ... | ౧౫౬—౧౭౭ |
| X | దక్షిణాఫ్రికా ఒడంబడిక ... | ౧౭౮—౧౯౭ |
| XI | తూర్పు ఆఫ్రికాలోని భారతీయులు | ౧౯౮—౨౧౪ |

# ఈగ్రంథములోని చిత్తరువులు.

## ఆర్టుకాగితపు చిత్రములు.


౧ దక్షిణాఫ్రికాభారతీయసత్యాగ్రహయోధుడు ముఖపత్రము
(గాంధిమహాత్ముడు)

౨ దక్షిణాఫ్రికాబారిష్టరు (న్యాయవాది)
(గాంధిమహాత్ముడు) (వెనుకపత్రిక)

3 భారతీయ శాంతిసైన్యము ట్రాన్సు వాలు దండ యాత్ర. (రెండవభాగము) పుట ౧౧౪

౪ డిటో డిటో (వెనుకపత్రిక)

౫ భారతీయ సహాయనిరాకరణ మహోద్యమవీరుడు
గాంధిమహాత్ముడు రెండవభాగ (ముఖపత్రము)

౬ గాంధిమహాత్ముని చేవ్రాలు ,,

౭ పియర్సన్ ఆండ్రూస్ గారలు వెనుకపత్రిక


## దేశపటములు.


| | | | |
|---|---|---|---|
| ౧ ఇండియా - ఆఫ్రికా | మొదటిభాగము | పుట. | 2 |
| ౨ క్రీ॥ పూ॥ 500 నాటి హిందూదేశము | ,, | ,, | 2 |
| 3 దక్షిణాఫ్రికాదేశము జనులు | ,, | ,, | 14 |
| ౪ దక్షిణాఫ్రికా—తూర్పుఆఫ్రికా | ,, | ,, | 26 |
| ౫ దక్షిణాఫ్రికానమితి | ,, | ,, | 56-57 |


## చిత్రపటములు.


| | | | |
|---|---|---|---|
| ౧ ఆదిమవాసులు. హాట్టెంటాటు, పొదలవాడు. | ,, | ,, | 15 |
| ౨ ఆదిమవాసులు, బంటూలు. కాఫరు, నీగ్రో. | ,, | ,, | 20 |
| 3 జూలూవీరుడు | ,, | ,, | 21 |
| ౪ ప్రిటోరియా చెరసాల (రెండవభాగము) | | | ౫౦ |

## నా ఈ గ్రంథరచనలో తోడ్పడిన గ్రంథములు, పత్రికలు.


The Official Year Book of the Union Government of South Africa.

Published under the Authority of the minister for the Interior, Pretoria (1923),

War in South Africa by William Harding

South Africa, by George M'call Theal.

Harms worth's History of the World Vols. I, VI, & VIII.

The Union of South Africa. by Hon. R. H. Brand.

William Ewart Gladstone by John Morley.

The Aryan Rule in India by Havell.

A History of Europe by Grant.

The Encyclopaedia Brittannica.

The Hindu Superiority by Har Bilas Sarda.

Gandhi's Speeches and Writings.

The Indians of South Africa by H. S. L. Polak.

An Indian Patriot in South Africa-Rev. John Doke.

The Speeches of Hon. G. K. Gokhale.

Zanzibar, the Island Metropolis of Africa by Major F. B. Pearce.

The Moderen Review.

The Indian Review.

The Golden Number of the Indian Opinion.

The Green Pamphlet.

The Indian Annual Register 1921-1923.

The Indian Quarterly Register 1924.

The Indians Abroad.

The Swarajya.

The Hindu.

Young India.

The Daily Mail Year Book.

బౌద్ధమహాయుగము-వేలూరిసత్యనారాయణగారు.బి.ఏ,బి.ఎల్.

# దక్షిణాఫ్రికా

## కొన్ని వింతమాటలు.

| గ్రంథమునవాడిన పదము | దీనికి ఇంగ్లీషు వర్ణక్రమము | డచ్చియుచ్చారణము | అర్థము |
|---|---|---|---|
| బోయరు | Boer | "బూయరు" | డచ్చిరైతు |
| బ్లూంఫాంటీన్ | Bloemfontien | బ్లూంఫాంటీన్ | పుష్పసరోవరము |
| రాండ్ | Rand | రాంట్ | అంచు, దరి |
| విట్ వాటర్స్ రాండ్ | Witwater's Rand | విట్ వాటర్ స్ రాంట్ | తెల్లనీటిదరి |
| వాల్ | Vaal | "ఫాల్" | బయలు |
| ట్రాన్సువాలు | Transvaal | "ట్రాన్స్ ఫాల్" | వలయాకారముగలబయలు |
| యూట్ లాండరు | Uitlander | "ఓయిట్ లాంటర్ | బోయరేతరుడు |
| వోక్సురాట్ | Volksraad | "ఫక్సురాడ్" | ప్రజాసభ |

# కొన్ని సవరణలు

## మొదటి భాగము

| | పుట | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ఇండియా ఆఫ్రికాపటము | 2 | అరేబయా | అరేబియా |
| | ,, | టంగనాయికా | టంగన్యికా |
| దక్షిణాఫ్రికా | 14 | 'టేబలుఅఖాతము' | "టేబిలుబే" |
| దక్షిణాఫ్రికా | 26 | ఆంగ్గఈజిపు | ఆంగ్లఈజిప్టు |
| తూర్పుఆఫ్రికా | | సూడాన్ | సూడాన్ |
| | ,, | టంగనయికా | టంగన్<br>యికా |
| | | టంగనయికా | టంగన్ |
| | | సరస్సు | యికాసరస్సు |
| | ,, | గుడ్ హెూపు | గుడ్ హెూపు |
| | | అగ్రిము | అగ్రిము |
| | | | (కేపుకాలనీరాజ్యము) |
| దక్షిణాఫ్రికాసమితి | 56 | కెపురాజ్యము | కేపుకాలనీ<br>రాజ్యము. |

(రెండవభాగము)

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు. |
|---|---|---|---|
| ౧ | 9 | పృణ్యనదుల | పుణ్యనదుల |
| ౧౦ | 17 | ఆదాదాఅబ్దుల్లా | దాదాఅబ్దుల్లా |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ౩౬ | 21 | డివిజనులు | డివిజినల్ |
| ౪౩ | 9 | ప్రశ్నింప వారు | ప్రశ్నింపగ కొందరు కూలివారు |
| ౪౮ | 15 | మూరిట్జిబర్గు | మూరిట్జుబర్గు |
| ౫౦ | 22 | గాంధిగారి న్యాయ కత్యము | గాంధిగారినాయ కత్వము |
| ౬౧ | 13-14 | మంత్రిగారిని ట్రాన్సువాలు భారతీయులను | మంత్రిగారిని దర్శింప దలచిరి కాని దర్శనమీ యబడు ట్రాన్సువాలు భారతీయులను |
| ౬౫ | 4 | జోహానుబర్గులో | జోహాన్సుబర్గులో |
| ౭౮ | 4 | మూడవమారు | రెండవమారు |
| ౭౧ | 15 | Ampthil | Ampthill |
| ౧౦౪ | 9 | యెడలనంపు | వెడలనంపు |
| ౧౦౧ | 21 | గోపాలకృష్టగోఖలే | గోపాలకృష్ణగోఖలే |
| ౧౧౪ | 10 | పోలీసువారినొక పత్రికనుండి | పోలీసు వారికొక పత్రికనుండి |
| ౧౩౯ | 7 | డర్మన్ | డర్బన్ |

# దక్షిణాఫ్రికా

## మొదటి ప్రకరణము

### ఇండియా - ఆఫ్రికా

ఆర్యగ్రంథములందు వర్ణింపబడిన కుశద్వీపమె ఆఫ్రికా ఖండమని కొందఱు పండితులనుచున్నారు ఏది ఎట్లున్నను ఆఫ్రికా మన సప్తద్వీపములలో నొక్కటి యనుటకు సందియము లేదు. ఆఫ్రికాదేశమున నీశాన్యప్రదేశములను పూర్వచరిత్రకారులు ఎతియోపియాయని వ్యవహరించిరి. ఎతియోపియాలో నేటి న్యూబియా, అబ్సీనియా, శేనర్, డార్ఫర్, డోంగోలా దేశములు చేరియున్నవి. ఎతియోపియా ఈజిప్టు దేశములలోని జనుల పూర్వులు ఆర్యులేయనియు, భారతీయులీదేశములకు క్రీస్తుకుపూర్వ మేడెనిమిది వేల వత్సరములక్రిందట వలసకేగి నెలకొనిరనియు పాశ్చాత్య చరిత్రకారులె నిర్ణయించినారు. ఐరోపా ఆశియా అమెరికా దేశములకు భారతీయులు వలసకేగినట్లును రాజ్యములు స్థాపించినట్లును అనేకములగు నిదర్శనములున్నవని పాశ్చాత్యగ్రంథకర్తలు వ్రాసియున్నారు. భారతీయ నాగరకతనుగూర్చియు ఔన్నత్యముగూర్చియు ఖండాంతర భారతీయ చారిత్రకథనుగూర్చియు చెప్పుట కిచ్చట తావులేదు. నాటి భారతీయ నౌకాజీవనము ఆఫ్రికాతీరములందు విలసిల్లెనని చెప్పవచ్చును.


మధ్యధరా సముద్రము
నైలునది
ఆసియా
అరేబియా
ఇండియా
ఈజిప్టు
సహారా ఎడారి
ఫ్రెంచి
సూడాను
అట్లాంటిక్ మహాసముద్రము
భూమధ్యరేఖ
ఉగాండా
కెన్యా
టాంగనాయికా
జాంజిబార్
కాంగోనది
పోర్చుగీస్
మడగాస్కర్
దక్షిణాఫ్రికా సమితి
హిందూ మహాసముద్రము

ఇండియా - ఆఫ్రికా

ఆఫ్రికాలో ఈజిప్టు అబ్సీనియా ప్రాంతముల దేశనదీ నగనామములకును నుత్తరహిందూస్థానములోని దేశనదీ నగనామములకును పట్టణనామములకును పోలికలుండుటయేగాక, అవియెల్ల సంస్కృతనామములె యైయుండుటయు- ఈ రెండు చోట్లను జనుల యాచారవ్యవహారములు, మత సంఘ రాజకీయ సిద్ధాంతములు, సంస్థలు, నొకేరీతి నుండుటయు, అచ్చటి రాజులు మనరామనామ సదృశమగు 'రామ్సెస్' బిరుదునుదాల్చుటయు, ఆఫ్రికాభరతఖండముల శిల్పములొకతీరున నుంటయు నీదేశములలోని జనులకపాలములు నొకవిధముగనేఉండుటయు చరిత్రికారులు గమనించినారు, అబ్సీనియా-ఈజిప్టు దేశములలోని జనులు తమపూర్వులు సింధునదీప్రాంతములనుండి వలస వచ్చినట్లు చెప్పకొనుచున్నట్లు ఫిలోస్ట్రాటసు, యూసీబియస్, సింసిల్లసులు వ్రాసియున్నారు. పాశ్చాత్య పండితులగు పోకాక్, హీరన్, టాడ్లు నీసంగతులను విపులముగ జర్చించియున్నారు. *

క్రీస్తుకుపూర్వము మూడువేల అయిదువందలేండ్లకు పూర్వము వర్ధిల్లిన నగరరాజముల యొక్క శిథిలములు ఆర్యావర్తమున సింధునదీతీరమున వంగదేశీయుడగు బెనర్జీగారిచేవల కనుగొనిరి. అందొకటి మొహెంజోదారో దగ్గరను, హారప్ప దగ్గర నొకటియు బయల్పడినవి. ఆనగరములందు కనబడిన గృహ

* Hindu Superiorty by Har Bilas Sarda.

ములు అంగళ్లు నాకాలమున అరేబియాలో బేబిలోన్ (Babylon) దగ్గరను, మెసపోటేమియాలో సుమేరు (Sumer) లోను ఆఫ్రికాలో నైలునదీతీరమున ఉర్ (Ur) నగరమునను వర్థిల్లిన పట్టణములలోనివానివలెనేయున్నను, అచ్చటివానికన్న నీనగరములందలివి మిన్నలుగనుండి ఎక్కుడు నాగరికతను చూపుచున్నవి. ఇండ్లప్రక్కను మురికికాలువలుకూడ నుండెను. అవి యీశిథిలములందు బయల్పడినవి. హారప్పయొక్క నాగరికత మెసపొటేమియాలోని సుమేరు నాగరకతను పోలుచున్నది. బేబిలోన్, భాషలో నూలునకు 'సింధ్' అనియందురు. గ్రీసుదేశపువారు 'సింథన్' అందురు. ఈరెండు దేశములవారును పూర్వకాలమున నుపయోగించుచుండిన నూలుబట్టలు ప్రత్తి ఎక్కడిదాయని శాస్త్రజ్ఞులు వితర్కించుచుండిరి. ఇట్టి వీశిథిలములందు కనబడుటచేత సింధునదీప్రాంతములవే యని స్థిరపడుచున్నది. ఆకాలమున సుమేరునందువలెనే ఇచ్చటి పురుషులును నడుమున నొకవస్త్రమును పైమీద నొకశాలువను ధరించుచుండిరి. స్త్రీలు పురుషులు ధరించు నాభరణములు కుమ్మరిపనులు, వ్రాత, ముద్రికలు, శిల్పకళ, మతము, నాగరకతలను దెలుపువస్తువులు ఎన్నోకనబడినవి. శిల్పప్రతిమలందు సింధునదీతీరపు నాగరకతకును మెసపొటేమియా, బేబిలోన్ శిల్పములకును చాలపోలికలు కనబడుచున్నవి. ఉత్తరాఫ్రికాలో ఖ్యాతిచెందిన రాజవంశమునకు పూర్వమునాటి ఈజిప్టు

దేశముతో నీనగరరాజములకు రాకపోకలుండినట్లు చాల నిదర్శనములు కనబడుచున్నవి. ఈశిథిలములందు కనబడిన ముద్రికలలో నొకదానిపైన ఈజిప్టుదేశపు వంశచిహ్నమగు నాల్గు కేతువులు కనబడుచున్నవి. సింధునదీ ప్రదేశములకును సుమేరు బేబిలోనియాలకును గల పోలికలను బట్టి జాతియందును, భాషయందునుకూడ నీదేశవాసులకు పరస్పరసంబంధముండెనని శాస్త్రజ్ఞులనుచున్నారు. ఇప్పటికే కొన్ని భేదములు కనబడుచుండుటవలన నీసంబంధము చిరకాలముక్రిందట నుండి యుండెననుటకు సందియములేదు. శీయిస్తాన్ (Seistan) ట్రాన్సుకాస్పియ (Transcapsia) పశ్చిమ పెర్షియాదేశములతోడను, ఈజిప్టుదేశములతోడను ఈనగరములకు సంబంధముండినట్లు కనుబడుచున్నది. సుమేరియా ఈదేజిప్టుదేశముల నాగరకతల జన్మస్థానము మెసపొటేమియా యనుట కెన్ని కారణములు కలవో ఆ నాగరకతలు ఆర్యావర్తమున సింధునదీతీరమున జన్మించెనుటకు నన్ని కారణములు కలవని భరతఖండపు ఆర్కిలాజికల్ డైరెక్టరు జనరల్ గారైన సర్ జాన్ మార్షల్ గారే వ్రాసియున్నారు. *

క్రీ॥ పూ॥ 3000 వత్సరములక్రిందట బేబిలోన్ రాజ్యమునేలిన ఉర్ బగస్ నృపాలుడుకట్టిం ఉర్ నగరశిథిలములందు నాప్రాంతముననొక దేవాలయశిథిలములందును భరతఖం

* The Hindu 4-1-1928.

డపు బేసుదూలములు కనబడినవి. ఆకాలమునాటి ఈజిప్టు దేశపు రాజులశవములను భారతీయుల జిలుగుపలువలతో నలంకరించి పేటికాగారములందు పండబెట్టుచుండిరి. నేడు త్రవ్వి, యెత్తబడుచున్న శవములప్రక్కన గనబడు దంతపుబనులు భారతీయులవని గుర్తించుచున్నారు. ఏక్సుం అలెగ్జాండ్రియాలకును భరుకచ్ఛ ఉజ్జయినీలకును రాకపోకలుండెను. తమిళ వాఙ్మయములోని పాటలవలనను ఈజిప్టు వాఙ్మయమువలనను భారతీయ ప్రాచీన నౌకాజీవనము తెలియుచున్నది. క్రీ పూ॥ 860 సం॥ ప్రాంతమున అస్సీరియా పాలించిన మూడవ షార్ మెనసర్ నాటిన జయస్తంభముపైన హైందవ వానర గజచిత్రములు కనబడుచున్నవి. అలెగ్జాండర్ దండయాత్రకాలమున నీజిప్టునకును ఇండియాకును వర్తకముండెను.

పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ (Periplus of the Erythrean Sea) అను గ్రంథమున ఈజిప్టుదేశములో క్రీస్తుశకారంభమున నివసించిన గ్రీకువర్తకుడు తూర్పు ఆఫ్రికా అరేబియా పెర్షియా పశ్చిమ హిందూదేశము దక్షిణహిందూదేశము యొక్క రేవులనెల్ల వర్ణించెను. ప్రాచీన అబ్సీనియా సామ్రాజ్యము యొక్క ముఖ్యపట్టనమగు "ఏక్సుం" (Axum) లో భారతీయ శిల్పము యొక్క ప్రతిబింబమున్నదని ఫెర్గుసన్ అను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. ఏక్సుం, అలెగ్జాండ్రియాలతో ఉజ్జయినీ భరుకచ్ఛములకు వర్తకముండెను. భూమిమీదకూడ


బౌద్ధయుగారంభమునందలి
హిందూదేశము.
(క్రీ. పూ. ౫౦౦)
తక్షశిలా.
సింధు
బ్రహ్మపుత్ర.
హిమాలయపర్వతము.
ఇంద్రప్రస్థము.
(ఢిల్లీ)
మథుర.
అవంతి
ఉజ్జయిని
శ్రావస్తి.
కాంపిల్య.
కౌశాంబి.
సాకేత.
ప్రయాగ.
యమున
మిథిలానగరము.
విదేహ
మగధదేశము.
తామ్రలిప్తి.
గంగాసాగర
సంగమము
అంగ
గంగ

వ్యాపార ముండెను. పశ్చిమ భారతమున ఆంధ్రమహారాజుల రేవుపట్టణముల నుండి నేడు మస్సోవా (Massova) అని పిలువ బడుచున్న అడ్యులిస్‌కును అట్బారనదికిని, నౌకావ్యాపార ముండెను. హిందూదేశమునుండి ఇనుము, ఉక్కు, నూలు బట్టలు, చర్మకవచములు, రంగువేసిన బట్టలు, లక్క, మజిలిన్ బట్టలు నెగుమతియగుచుండెను. దంతము, తాబేలు బొరుసు, ఉక్కు, ఖడ్గమృగము కొమ్ములు నిచ్చటనుండి యెగుమతి యగుచుండెను.

క్రీస్తుశకారంభమున హిందూదేశములోని గుజరాతు రాష్ట్ర ప్రాంతములనుండి అరేబియాఖాతప్రాంతములకు గోధుమలు, బియ్యము, నెయ్యి కొబ్బెరనూనె, నూలుబట్టలు, పంచదారయు నేడు జాంజిబారుకు బ్రిటిషు వర్తక నౌకలు తీసికొనిపోవుసామగ్రులను నెగుమతి యగుచుండెను. వాస్కోడా గామా పదునైదవ శతాబ్దిలో తూర్పు ఆఫ్రికా తీరమును చూచినప్పటికె హిందూవర్తకులు నెలకొని యుండుటను చూచెను. మలిందినుండి గామాయొక్క నౌకను కల్లికోటకు దారిజూపినది గుజరాతు దేశమువాడగు 'కానా' యైయుండెను. జాంజిబారు, పెంబా మాఫియాలలోని మూరుజాతివారు భారతీయులపట్టు బట్టలు, నూలుబట్టలును మొంబాసాలోనుండిన కాంబె (Cambay) వర్తకుల వద్ద కొనుచుందురని భార్బోసా 1512 లో వ్రాసినాడు. 1591 నాటికి జాంజిబారు వర్తక మీ వర్తకుల

చేతిలో నుండుటయు, భరతఖండమునుండి వర్తకనౌకలు వచ్చుచుండుటయు, కెప్టెన్ లంకాస్టర్ (Captain Lancaster) చూచినాడు. అచటివారెల్లరు 'కచ్చి' Cutch నుండియు కాంబే నుండియు వచ్చి హిందుస్తానీనే మాట్లాడుచుండిరి. *

## రెండవప్రకరణము

### దేశము - జనులు.

దేశము:—ఆఫ్రికాఖండము మన భరతఖండమునకు బశ్చిమముగ ఐరోపాకు గ్రిందుగ భూమధ్యరేఖ కిరుప్రక్కలను వ్యాపించియున్నది. దీనికుత్తరమున మధ్యధరాసముద్రమును దూర్పున హిందూమహాసముద్రమును పడమర అట్లాంటిక్ మహాసముద్రమును నున్నవి. దీనివైశాల్యము 12000000 చదరపుమైళ్లు. ఆశియాఖండముకన్న గొంచెము చిన్నదెకాని ఇండియాకన్న నేడింతలు పెద్దది. ఈదేశముష్ణప్రదేశమున నున్నందున చాలవేడిగ నుండును.

ఆఫ్రికాఖండము ప్రపంచమునందలి దేశములలో కెల్ల దుర్గమమగుభాగము. ఇందుత్తరమున పెక్కువేలేండ్లకిం

* Zanzibar the Island metropolis of Africa by Major F. B. Pearce.

దటనె ప్రపంచము నలరించిన సామ్రాజ్యములు వర్థిల్లి నశించెను. భీకరమగు సహారా యెడారియు, అగాధమగు నైలునదియు ఆఫ్రికాలో నుత్తరమున గలవు. పశ్చిమమున నైగరునదియు, మధ్యసరస్సులును కాంగోనదియు, దక్షిణమున జంబేసీ, ఆరెంజి ట్ర్యాగేలా నదులును కాలహారి ఎడారియు తీరములందు పర్వత పంక్తులును దేశమునందలి భీకరారణ్యములును భరతఖండ మును జ్ఞాపకమునకు దెచ్చును.

మృగములు:- ఆఫ్రికాలోకూడ మనదేశమునందువలెనె సింహశార్దూలఖడ్గమదేభాదివన్యమృగములును,విషసర్పములును ఇతరములగుమచ్చికమృగములునుమాత్రమెగాక వింతజంతువు లనేకములు కలవు. మార్జాలజాతికి జెందిన 'పిల్లిపులు' లనదగు హాయినాల యరవు వెడగునవ్వువలె నుండునట. రాక్షసులయవ తారమో యనదగు వానరజాతికి జెందిన గోరిల్లాలును, పొడు గైన మెడగలిగి లేళ్లజాతికి జెందిన గిరాఫీలును, చారలగాడిద లనదగు జీబ్రాలును ఇంకనెన్నో వింత జంతువులును కలవు. క్రీ॥ పూ॥ 2000సం॥ క్రిందట లేని ఒంటెను తరువాత ఆశియావారచ్చ టికి తెచ్చినారనిచరిత్రకారులనుచున్నారు. గుఱ్ఱములను పూర్వ కాలము ఈజిప్టువారుపయోగించు చుండిరి. కుక్కలను గొర్రె లను,ఎనుములను ఆఫ్రికావారు పెంచుచుండిరి. ట్సెట్సీయను నీఁగపశువులను గుఱ్ఱములను గఱచి నాశనముచేయుచున్నది.

జనులు:—ఆఫ్రికాలో కొంచెము లేతరంగు గోధుమ వన్నెకు జెందిన జనులు ఎడారి ప్రదేశములందు నుత్తరమున తిరుగుచుందురు. అరబ్బీదేశీయులకును వీరికిని సంబంధము లుండెను. ఆఫ్రికామధ్య భాగమున నలుపురంగు నీగ్రోలున్నారు. వీరాఫ్రికాలో చిరకాలము నుండియున్నట్లు స్పష్టము. దక్షిణమున పసుపుబచ్చనకు జెందిన హాట్టెంటాటులను పొదలవారును ఇతర పొట్టిజాతివారును కలరు. మధ్యాఫ్రికాలో కొన్ని చోటుల మానవహంతకులు నున్నారు. ఊబిజ్వరములు కల ప్రదేశములలో కొందరు బలహీనులగు పొట్టివారు తలదాచికొనినారు.

జీవనము:—ఆఫ్రికాలోని జాతులలో మహమ్మదీయ మతము వ్యాపించినచోట పందులను కొన్నిజాతులలో కోళ్ళను గుడ్లను కూడ తినరు. చాలజాతులలో నెనుములను భక్తితో చూతురు. వాని పాలుకూడ త్రాగకుండిన వారును గలరు. తూర్పు ఆఫ్రికాతీరమున చేపలను ముట్టరు. నీగ్రోజాతులు కొన్ని మొక్కలను పెంచుచు జీవించుచున్నారు. వారి వ్యవసాయపనిముట్లు చాల సులభములైనవి. నీగ్రోలు కొన్ని పానీయముల కుపయోగములగు చెట్లను పెంచుదురు. మొక్కజొన్న వారి ఆహారపదార్థము. ఆఫ్రికాలో అన్ని విధములగు కాయధాన్యములు పండును. బటానీలు, చిక్కుడుకాయలు, ఇతర కంద మూలములును దేశములోనివె. బనానా

అరటి నచ్చుటివారు చాలమంది తిందురు. ఖర్జూరము ఉత్తరమున, కోకో చెట్టు తీరములను, నూనెచెట్లు పశ్చిమ తీరములను పెరుగును. నూనెచెట్టు కొబ్బెరచెట్టు వంటిది. దీనిపండ్లు ఎగుమతిచేసి చాల ధనమార్జించుచున్నారు.

నీగ్రోలు-పొట్టివారు:—నీగ్రో చాల తెలివికల కర్షకుడు. ఎడారివారు సూడానులోనికి దాడివచ్చిన తరువాత ఖర్జూరాహారములను వదలిపెట్టిరి. నీగ్రో రంగులోను రూపములోను ఒకజాతిగ కనబడును. కాని జాతిలో భాషలో నొకేజాతి కాఁడు. ఇతని పూర్వనివాస స్థానమేదో తెలియదు. వర్ణభేదము లన్ని జాతులలోను కనబడుచున్నవి. మిశ్రమ వర్ణములు కనబడుచున్నవి. ఇతని తలకాయయొక్క స్వరూపము కొంతవఱకు నీగ్రోజాతిగ తెలియఁజేయును. వీరికిని అరబ్బీ దేశీయులకును చాల భేదములు కనబడుచున్నవి. ఇతని తల వెండ్రుకలు పొట్టిగ గొత్తియున్నివలె చుట్టుకొని యుండును. ఇందు భేదములు కనబడినచో జాతిమిశ్రమమువలన కలిగినవని చెప్పవచ్చును. వీరి భాషలొక తెగకు చెందినవి కావు. "హాట్టెంటాటు" "పొదల"జాతుల పొట్టివారి బంటూ భాషలకు దీనికి చాల భేదముకలదు.

పొదల జాతులవంటివి ఆఫ్రికాఖండమున నుత్తరముగ కనబడుచుండెను. బెంగ్వ్యేలాఅడవులలో వసించు మాసెశ్వేరు జాతివారు నిట్టివారె. వీరిది కొంచెము లేతనలుపురంగు.

ఆఫ్రికాలోని మఱుగుజ్జుజాతివారు మధ్యాఫ్రికా ఖండమున వసించుచున్నారు. అచ్చటవడవులు మెండుగనున్నవి. స్టాన్లీఅను ఆంగ్లేయుడు చాలాజాతులు చూచినాడు. బటంగాతీరమున అత్యంతకుబ్జు లున్నారు. వీరు వేటవలన జీవించుచున్నారు. ఈ జాతులు భూమధ్య రేఖదగ్గరను చెలువులపాంతములను కన బడుచున్నారు. తూర్పు ఆఫ్రికాలోకూడ కొందఱు పొట్టివారు డోకోలనుపేర నున్నారు.

దక్షిణాఫ్రికాదేశపు జనులు :—దక్షిణాఫ్రికా దక్షిణ హిందూస్థానమువలెనే పీటభూమిగ కనబడును. సముద్రతీర ములందు తూర్పుపశ్చిమ కనుమలకువలెనె కొండలున్నవి. ప్రక్కలను సముద్రతీరపు భూమియుకలదు. తూర్పుకనుమలు చాల నెత్తైనవి. అందువలన తూర్పునంక వర్షవాయువులు వచ్చుచుండుటవలనను వర్షపాతమును పంటయు నధికములు. ఆరెంజినది పశ్చిమతీరమున ప్రవహించియు తూర్పుకనుమలలో పుట్టినది. దాని చిలువలు నచ్చటనే పుట్టినవి. కాలహారీ యెడారిలో నల్పవర్షములు పట్టుభూమియు సమకూడుచున్నవి. దక్షిణాఫ్రికాలోని సాంఘికజీవనము భూగోళ పరిస్థితులను బట్టియే యున్నది. మధ్యను తిరుగుచుండు (Bush men) "పొదల" వారున్నారు పశ్చిమమునగొత్తెకాపరులతెగలున్నవి. తూర్పున యుద్ధములన్న ప్రీతికల "కాఫరు" లున్నారు. వారు బంటూజాతివారు. కొంచెముగా గొత్తెకాపరులు. కొంచెము వ్యవసాయదారులుగా నుండి దక్షిణాఫ్రికాలో ముఖ్యజాతిగ

దక్షిణాఫ్రికా


జంబేసీనది
కాలహారి
ఎడారి
లింపోపోనది
డెలగోఅఖాతము
ట్యుగేలానది
(ఫిష్) చేపలనది
ఆరెంజినది
నదులు.
పర్వతములు.
పొదలవారు.
హాట్టెంటాటులు.
బంటూలు.

నున్నారు. దక్షిణమున చాల క్రిందిభాగమున నల్ల తెగకుఁ జెందని హాట్టెంటాటు తెగవారు ఇతర తెగలనుండి తప్పించుకొని ఇటకు చేరిరి.

ఆదిమవాసులు (నేటీవులు)
పొట్టిజాతులు.



హాట్టెంటాటు పొదలవాడు

హాట్టెంటాటులు, పొదలవారు:— హాట్టెంటాటులును, పొదలవారును పసుపుపచ్చనకుఁ జెందు రంగువారు. ఎల్లప్పుడు తిరుగుచు కాలయాపనజేయుదురు. హాట్టెంటాటు కొంచెము పొట్టిగనే యుండును. ఇతనికి సమీపబంధువగు పొదలవాడు పొట్టివాడు. ఈరెండు తెగలకును కొంచెము సంబంధ

ముండవచ్చును. పాశ్చాత్యులు దక్షిణాఫ్రికా కనుగొను నప్పటికి హాటెంటాటులు కేపు రాజ్యమున్న పరిదేశములోనుండిరి. వారికి "కేయి" నదియే తూర్పు సరిహద్దు. వారు తమ్ము "కోయికోయిను"లని పిలుచుకొనుచుండిరి. వీరు గొఱ్ఱెకాపరులు. పశువులు, గొఱ్ఱెలు, మేకలు పుష్కలముగా నుండెను. వీరికి వ్యవసాయముగాని, కుమ్మరిపనిగాని రాదు. ఇనుముకరుగుటయు పోతపోయుటయు వీరెరుగుదురు. "సాను"లను పొదలవారు గొఱ్ఱెలను పెంచుటలో హాటెంటాటులను పోలినప్పటికిని నిలుకడలేక తిరుగుచు బందిపోటులుచేయుచు తిరుగుచుండిరి. వీరి దేశము కాలహారి యెడారి మొదలు యునామా చెరువువరకు వ్యాపించి యుండెను. పొదలవారె దక్షిణాఫ్రికాలోని ఆదిమ నివాసులని చెప్పవచ్చును. వీరు కుబ్జులు. వీరి యొడళ్ళపైన కల చర్మము కోతులకువలె వ్రేలాడుచుండును. వీరిబుగ్గలు లోతుగ నుండును. తలమీద వెంకటేశ్వరుని గూర్చిన మ్రొక్కులజెడలవంటి చిన్నపిలకలపరిమితముగ నుండును. వీరి ముఖము వెడల్పుగ నుండును. అడ్డతలకాయలు, చప్పిముక్కులు, తుట్టపెదవులు, వెనుకకుపోయిన చిరుగడ్డములు, వీరి యందమునకు వన్నెపెట్టుచుండును. వీరు తమదేహములకు నల్లనిరంగును, క్రొవ్వును పూసికొందురు. పురుషులు ధరించినచో చర్మములు ధరింతురు. లేనిచో లేదు. స్త్రీలు చర్మములనె ధరించుచుండిరి. వీరు విల్లు నంబులతో వేటాడు

చుందురు. యుద్ధములందు విషము పూసిన అంబులను వాడు చుండిరి.

పొదలవారికి పెద్దనాగరకత లేకపోయినను లలితకళ లెఱిగి యుండినట్లు వారి చెక్కడపుఁ బనులు బొమ్మలు తెలుపుచున్నవి. కాఫరుల పశువులపై దాడివెడలుటను గూర్చిన చిత్తరువులు కనబడుచున్నవి. హట్టెంటాటులకు చిన్న నాయకులనేకులుండిరి. వీరిఆహారము గొఱ్ఱెపాలు, ఆవుపాలు. వీరు తమమందలకొఱకు పచ్చికకై తిరుగుచుండిరి. వీరు నివసించు గుడిసెలు కఱ్ఱల పంజరములపైఁ గట్టఁబడిన చాపలు. నేటి ఎఱుకయేనాదివారి చుట్టుగుడిసెలవంటివి. వెన్నెలరాత్రులలో స్త్రీపురుషులు బాలురుకూడ పిల్లనగ్రోవులఁబోలు వాద్యములతో నాట్యముచేయు హట్టెంటాటుగుంపులు దక్షిణాఫ్రికాలో నిప్పటికినికలవు. ఆరోగ్యము, వేటలోనొక జింక చేతఁబడుట, హట్టెంటాటును పరమానంద భరితునిగ జేయును.

మిశ్రిమ జాతులు:— హట్టెంటాటులు పొదలవారిస్త్రీలను పట్టుకొని పెండ్లాడుటవలన మిశ్రమజాతులు జన్మించిరి. వారియందు రెండుతెగలవారి గుణములు, పోలికలును కనబడుచుండును. ఈ రెండుతెగలకును కొన్ని పోలికలుకలవు. ఇరువుర విగ్రహములు పొట్టివె చిన్న చేతులు, చిన్న కాళ్ళు. వీరి రంగు, తల వెండ్రుకలు,నొకేవిధముగ నుండును.

ఆంగ్లేయులరాకనాటికి పొదలవారికి పెద్దఆయుధము లుగాని పరికరములుకాని లేవు. రాతిమొనలను అంబునకు తుదినివేయుచుండిరి. చిన్నకత్తులు మాత్రముండినవి. ఇట్టివి దేశములో త్రవ్వినప్పుడు కనబడుచుండును వీరికిమచ్చికపడిన జంతువు కుక్కయొక్కటె. వీరికి వ్యవసాయము తెలియదు. వెఱ్ఱిమొక్కలు చీమలు వీరి ఆహారము. పుట్టతేనె వీరుతినుచుం డిరి. వీరు బలహీనులైనను చాలదూరము చూడఁగలశక్తి గలిగి యుండిరి. అతివేగముతో పరుగెత్త గలఁగుచుండిరి. హాట్టెం టాటు పురుషులు చాలపొడవులు. వారు మందలను మేపు కొనుచుండిరి. వారిపశువులు చాల భయంకరముగ నుండెను. వారు పెంచినగొఱ్ఱెలకు ఉన్నికాక వెండ్రుకలుండెను. తోకలు చాలబరువుకలిగి బలిసి లావుగనుండెను వీరికిని కుక్కయొకటి మాత్రమె మచ్చికపడియుండెను. వీరు పాలు ఆహారముగ చేసికొనిరి. పాలు కఱవయినప్పుడు వీరిస్త్రీలు కందమూలము లనేరి తీసికొని వచ్చుచుండిరి.

పోలికలు:—హాట్టెంటాటులకు పొదలవారికన్న నీగ్రోల తో నెక్కుడు పోలికలు కనబడుచున్నవి. వారి ముఖ్యమైన దుస్తుకఱ్ఱాసు. (చర్మపుఅంగీ). వారికొయ్యసామానులు కొయ్య పాత్రలు కాఫరులవానివలెనె యుండును. వారి సంగీతవాద్య ములు నట్టివె. వీరిరువురు నొకేవిధముగు జంతువులను పెంచు చున్నారు. ఇరువురకును ఇనుము కరిగించుట తెలియును.

అయినను కాఫరునివలె హాట్టెంటాటు వ్యవసాయకుడు కాడు. పొదలవానివలె కందమూలములను త్రివ్వి తినును. వేటాడును. వాని ఆయుధములు కాఫరులు, పొదలవారు నుపయోగించు మాదిరివె. హాట్టెంటాటు దూరదృష్టిలేనివాడు. 17 వ శతాబ్దములో హాట్టెంటాటులు కాఫరు బంటూతెగల యాగడములవలన ఫిష్ నదివైపునకు పోయిరి. కొందరు మాత్రము నేటాలులో దిగబడిరి. వీరు కుబ్జులు. వీ రితర తెగలలో కలసిపోయిరి. వీరు కొయ్యసామానులను పాత్రములను చేసికొనుచుండిరి. వారికిని సంగీతపు సాధనములుండెను ఇవి కాఫరు తెగవారి సామానులను పోలుచుండును. పొదలవారికి నాగరకత లేదు. హాట్టెంటాటు కందమూలములను సంపాదించి తినును. వేటాడును. వీరికి భయభక్తులు నిలుకడలు లేవు. హాట్టెంటాటులు ఇతర తెగలతోడి పోరులవలన మెల్లగ పైకి పోయిరి. ఆరెంజి నదిప్రాంతము, కేపు ప్రాంతములలో ఆంగ్లేయుల రాకనాటికి పొదలవారు విచ్చలవిడిగ తిరుగుచుండిరి. హాట్టెంటాటులు గుంపులుగ వచ్చుచు పోవుచుండిరి. డచ్చివలస ప్రజలు వీరితో వర్తకము కూడ చేయసాగిరి. మెల్లమెల్లగ యుద్ధములు వచ్చెను. హాట్టెంటాటులు బీదవారై కఱవులతో మసూచితో హతమగుచుండిరి. తుదకు కొందఱు హాట్టెంటాటులు పాశ్చాత్యుల యిండ్లలో పనులు చేయుచుండిరి.

## ఆదిమ వాసులు - బంటూజాతులు



కాఫరు



నీగ్రో

బంటూలు, కాఫరులు:— మధ్య ఆఫ్రికాలోను దక్షిణాఫ్రికాలో చాలభాగమును బంటూభాషనే నీగ్రోజాతి వారు మాట్లాడుదురు. హాట్టెంటాటులకు తూర్పుగనున్న బంటూజాతివారి నాకాలమున నాగరకులగు అరబ్బీదేశీయులు "కాఫరు"లని పిలుచుచుండిరి. వీరు పూర్వ ముత్తరముననే యుండి తరువాత దక్షిణమునకు వచ్చిరి. మన మెఱిగిన కాలము నాటికి దక్షిణాఫ్రికాలో కాఫరు తెగలవారిరువురుండిరి. వారు క్షోసాలు, జూలూలు నని వ్యవహరింపబడిరి.

"క్షోసా" కాఫరులు మెల్లగ 17వ శతాబ్దినాటికి హాట్టెంటాటుల దేశమునకు వచ్చిరి. ఉత్తరపు తెగవారు జూలూలని పిలువ బడుచుండిరి. వీరు నేటాలు, స్వాజేదేశములం దుం

డిరి. పాశ్చాత్యులు రాకపూర్వమె ఈతెగలో అంతఃకలహాములు కలిగి బలహీనులను బలవంతులు లోబర్చుకొనిరి. క్షోసా కాఫరులింతలో తెల్లవారితో యుద్ధము సాగించిరి. కాఫరు యుద్ధములు జరిగెను. "జూలూ" తెగవారు తమతెగను



జూలూ వీరుఁడు.

సైనికవర్గముగఁ జేసికొనిరి. వీరొక సేనానినేర్పరచుకొని పటాలముల వారివలె జీవించుచుండిరి. వారిస్త్రీలును వారివెంట తిరుగుచుండిరి. వారోడించిన ప్రజలలోనుండిన యువకులను బానిసలగను కొందరిని వీరులుగను చేయుచుండిరి. "ఆరెంజి" "వాలు" నదులమధ్య పూర్వముండిన జూలూజాతివారిలో నొకతెగ "మటాబెలు" శాఖ యనుపేర బయలుదేరెను. వీరికిని కొరానా హాట్టెంటాటులకును బసూటోలకును యుద్ధములు కలిగెను.

కాఫరుసంఘము:- కాఫరులకు ప్రజాపరిపాలనము కాని స్థిరమగు రాజులపరిపాలనముగాని లేదు. ఎవ్వఁడో యొకనాయకుఁడు పరిపాలించుచుండెను. వారికిని పశువులముందలుండెను. మగవారు వానిని కాచుచుందురు. ఆడువారు భూమిని దున్నుచుండిరి. భార్యలను పశువులనిచ్చి కొనుచుండిరి. వారిసంఘమును పరిపాలించు నాయకులు నిరంకుశముగ వక్రమములను చేసినచో వారిని హత్యచేయుచుందురు. వీరు ఏనుగులను దంతములకొరకు వేటాడుచుందురు. ఖడ్గమృగపువేట చాలగౌరవముగ నెంచబడుచుండెను. దీనిచర్మముతో నీటెలు, కొరడాలు చేయుచుండిరి. జూలుతెగలో మాంత్రికు లనేక చిత్రములు చేయుచుండిరి. వారి దివ్యదృష్టి, సోదె ఆశ్చర్యకరము గనుండెను. మోమున కొక తెల్లనిరంగు పూసికొని చేపలతిత్తులను తలచుట్టు చుట్టుకొని వింతకేకలతో గంతులి

చుచు జూలూ వీరులగుంపులలో తిరుగుచుండురు. చేతుల లోని చీపురువంటిదానితో వారిప్పుడప్పుడుకొట్టుచు మట్టిని తుక్కును చూపరులనోటఁ గొట్టుచుందురు

పాశ్చాత్యులు వచ్చునప్పటికి లింపోపో ఉంటాటనదీ ముఖముల వైపునకు బంటూతెగలవారు చొచ్చుకొని వచ్చు చుండిరి. ఈతెగలవారు అజానుబాహులు. వ్యవసాయమును కమ్మరమును ఎరిగినవారు. వీరికి క్రమమైన పరిపాలనము ధర్మము నుండెను. వీరిది మిశ్రమజాతియైనట్లు పోలికలు చెప్పు చున్నవి. నీగ్రో ఆసియా వారల పోలికలు వీరికుండెను. వీరికి మంచి ఆరోగ్యముండెను. వీరికి బహుభార్యాత్వ ముండెను. 17 వ శతాబ్ది నాటికి ఉత్తరమున జంబెసీనది యొడ్డుల నిరు ప్రక్కలను తూర్పు పడమర తీరములవరకును తూర్పుతీరమున క్రింద లింపొపోనది ట్యుగేలానది క్రిందిభాగమునగూడ బంటూ తెగలు వ్యాపించెను. పడమరతీరమునను అగ్రిభాగపుతీరము నను హట్టెంటాటులు వ్యాపించియుండిరి. మధ్య ఆరెంజినది యొక్క శాఖలకిరుప్రక్కలను కారూపర్వతముల కిరుప్రక్క లను ఇతరచోట్లను గూడ పొదలవారు తిరుగుచుండిరి. ఈ జాతులొండొరులతో నెల్లప్పుడును పోరాడుచు నుండిరి. బం టూ కాఫరులకు హట్టెంటాటు సంపర్కము తగిలినది.

## మూడవ ప్రకరణము

### పాశ్చాత్యుల రాక.

15 వ శతాబ్ది:—చాలకాలమునుండియు ఐరోపా ప్రజలు దేశాంతరములకుపోయి ధనమునార్జించుటకుఁ గుతూహలురైయుండిరి. మధ్యయుగమునాటి క్రైస్తవ మహమ్మదీయ సమరములు హిందూదేశపుసంపదకు చైనాదేశపు వింతలకు ఇతర ప్రాగ్దేశములవర్తకమునకు మార్గములను చేఁజిక్కించుకొనుటకు చేయబడియుండెను. క్రీ.శ.13 వ శతాబ్దాదిని మార్కోపోలో అనునతడు చాలకష్టములఁబడి దేశయాత్రలనుచేసి క్రొత్తమార్గములను కనుగొనఁ బ్రయత్నించెను. తురుష్కుల యొక్క బలము యూరోపువారికి భూమిమీద ప్రాగ్దేశములకు పోవుటకు వీలులేకుండచేసెను. ఇతర మార్గములను కనుగొనుటకు వీరు సమకట్టిరి. హెన్రీ రాజకుమారుడు పోర్చుగీసువారి నౌకానాయకుఁడై ఆఫ్రికాయొక్క పడమర తీరమున నౌకాయానములు చేయసాగెను. మెల్లమెల్లగ నీదుర్గమఖండముయొక్క సంగతి బయల్పడసాగెను. సముద్రముల పైన కలిగిన కష్టములు రోగములు వీరిపరిశోధనలకు అడ్డుకలిగించినను క్రమక్రమముగ వీరికష్టములు ఫలించుచుండెను. ఎట్టకేలకు డియాజు 1487 లో దక్షిణాఫ్రికాగ్రముఁ జేరెను. అదిదాటినతరువాత నింక నెంతో దేశము కనుగొనవలసి యు

న్నదను సంగతి తెలిసినది. 1498 నాటికి వాస్కోడాగామా హిందూదేశము వచ్చినాడు.

నౌకాయానములు:— పాపము, హిందూదేశమునకు దారి కనుగొనుట కనేకులు విశ్వప్రియత్నములుచేసి ఇతరదేశములు, వింతలు కనుగొనుచుండిరి. కొలంబసు చాలకష్టపడి స్పెయినురాజుసహాయముతో 1492లో నమెరికాకుపోయి అచ్చటిదీవులను ఆసియాదీవులని తలచినాడు. అమెరికా కనబడినది కాని పాశ్చాత్యులు కలగనుచున్న హిందూదేశముున కావల నున్న బంగరుభూములు, "కెతే" దేశము, కనబడలేదు. దానికి ఉత్తరమునుండియు దక్షిణమునుండియు దారులుకనుగొన బ్రయత్నించిరి. ఆఫ్రికా దక్షిణాగ్రమునకు తూర్పుగను రష్యాకు అడ్డముగను అమెరికాగ్రముల మధ్యనుండియు పోవుటకు ప్రియత్నించిరి. ఈ ప్రియత్నములవలన 16 వ శతాబ్దినాటికి మనమెఱిగిన దేశములలో ఆస్ట్రేలియా న్యూజీలాండులు తప్ప తక్కిన దేశములును, సముద్రమార్గములును కనుగొనబడినవి. ఈనూతన పరిశోధనములవలన ప్రజలదృష్టులు మరలినవి. ఆశయములు మారినవి. వెనీసు జినోవాలవర్తకము పడిపోయినది. ఆంటువర్పు లండనుల దేశాంతర నౌకావర్తకము విజృంభించినది.

# దక్షిణాఫ్రికా - తూర్పుఆఫ్రికా



హిందూదేశమునకు దారిని కనుగొనుటకు ప్రయత్నించుచుండిన పోర్చుగీసువారి నౌకాధికారి డియాజు 1487 లో 'ఆంగ్రాపెక్వెనా'ను చూచినాడు. తరువాత తుపానువచ్చినది. తానుచూచిన అగ్రమును తుపానుల అగ్రమని పేరిడిపోయినాడు. పదిసంవత్సరములు గడచెను. పోర్చుగీసువారు వాస్కోడాగామాను పంపినారు. గుడ్ హోప్ అగ్రమును చుట్టి నేటాలునుచూచి "లింపోపో" నదీ ముఖద్వారము చెంతవిడిసి విశ్రమించి హిందూదేశమునకు 1498లో వచ్చినాడు. అప్పటి నుండి వచ్చునప్పుడు పోవునప్పుడు పోర్చుగీసువారి యోడలు దక్షిణాఫ్రికా దగ్గర నిలుచుచుండెను. 1503లో సల్డానాఅను నాతం డొక మంచి నలుచదరవు ప్రదేశమును గమనించినాడు. 1509లో హిందూదేశమునుండి వచ్చుచుండిన "అల్మేడా" అచ్చట విడిసినాడు. అచ్చట ఆదిమనివాసులతో కొంతబేరములనాడినాడు. కాని అచ్చటివారితో కలహము కలిగినందున 65 మంది వారివిషతూపులబారిఁబడిరి. అప్పటినుండి పోర్చుగీసువారు భయపడి రేవుస్థానమునుస్థాపింపరైరి. అప్పుడప్పుడు వారి యోడలు నిలువవలసివచ్చినపుడు మాత్రము దిగుచు స్థలములకు పేరులు పెట్టుచువచ్చిరి.

రేవుస్థాపించుట:—కొన్ని సంవత్సరములు గతించినవి. ఇంగ్లీషువారు, (హాలెండు) డచ్చివారు, ఫ్రెంచివారును హిందూదేశమునకు రాకపోకలు చేయుచుండిరి. దక్షిణాఫ్రికాగ్ర

ముచెంత 1591లో ఆంగ్లేయుల పతాకము మొదటిసారి దిగినది. వారియోడ హిందూదేశమునకు పోవుచు "టేబిలుబే" అఖాతము దగ్గర నాగెను. 1601లో ఆంగ్లేయ తూర్పుఇండియా వర్తకసంఘమువారి యోడలు సాగినవి. అంతియకాని ఎవ్వరు వచ్చుట వలనగ నెలకొనలేదు. స్పెయినురాజ్యపాలనమును సహింపలేక పోరాడి స్వాతంత్ర్యమును పొందిన డచ్చిజాతి విజృంభించుచుండెను. వారును హిందూదేశముతో వర్తకము చేయ తలపెట్టిరి. 1595లో వారియోడ దక్షిణాఫ్రికా దగ్గరనుండిపోయెను. 1601 లో వారినాకాధిపతి కొన్ని ప్రదేశములచూచి వేళ్లనిడెను. పోర్చుగీసువారికి హిందూదేశములోనుండిన ఆస్తి డచ్చివారికి వశమగుచుండెను. 1619 లో ఇంగ్లీషువారును డచ్చివారును తమ ప్రయాణములకు వీలుగనుండునట్లు రేవుపట్టణము నొకదానిని దక్షిణాఫ్రికాలో స్థాపించుట యత్యావశ్యకమని యోచించిరి. కాని కుదరక పోవుట వలన విడిగ స్థాపించుకొన నిశ్చయించిరి. ఆంగ్లేయ అధికారులిరువురు "టేబిలుబే" దగ్గర బ్రిటిషు ప్రభుత్వమును సాటించిరి. కాని బ్రిటిషు పరిపాలకవర్గ ముపేక్షాభావము వహించెను. డచ్చివారు నుపేక్షించిరి. అయిన నిరుతెగలవారి యోడలును మంచినీటికొఱకు చేపలను పట్టుటకును అచ్చటనాగుచుండెను. 1647లో "హార్లాం" అను నోడ యొకటి యాగెను. కొంచెము తుపానువచ్చినది. టేబిలుబేలో కొంత లోనికి

పోయి నిలచెను దానిఉద్యోగులు ప్రస్తుతము కేపుటవున్ అను పట్టణమున్న స్థలమున గుడిసెలనువేసికొని తలదాచుకొనిరి. తమదేశమునకుబోయి రేవుస్థానమునుస్థాపించు టావశ్యకమని తెలిపిరి. డచ్చి గవర్నమెంటువారు నాలోచించి 1650 లో అట్టిరేవు స్థాపింప నిశ్చయించిరి. 1652 లో మూడునావలను సన్నిద్ధముచేసి వాన్‌రిబీకు అనువైద్యుని ఆధిపత్యముక్రింద కొందఱ నావికులనుపంపి దక్షిణాఫ్రికాలో నేడు "టేబిలుబే" అని వ్యవహరింపబడు ప్రదేశమును వశముచేసికొని రేవు స్థాపించిరి.

డచ్చివారు వలసనెలకొనుట:—అప్పుడాప్రదేశమున అరువదిమంది హాట్టెంటాటులను నాదిమవాసులుండిరి. అచ్చట విడిసిన డచ్చివారు ప్రాణములనఱచేతిలో పెట్టుకొని యుండిరి. వర్షకాలము, గ్రహణిజాడ్యము, వచ్చినవి. కాని పచ్చిక, కూరగాయలు కొంచెములాభము గలిగించెను. ఆదిమవాసుల గుంపులు వచ్చినవి. వారితో మారుబేరములు చేసిరి. రాగి, పొగాకునిచ్చి పశువులను గొఱ్ఱెలను సంపాదించిరి. ఒకసంవత్సరము గడచునప్పటికి, ఒకచిన్నతోట, ఒకవైద్యశాల లేచినవి. ఇంకొక గుంపుతో మారుబేరము సాగెను. మఱల చలికాలము వచ్చెను. సింహములు ఇతర క్రూరమృగములు బాధపెట్టెను. డచ్చివారికిని ఆంగ్లేయులకును యుద్ధమువచ్చినది. కాని భయములేక పోయినది. 18 నెలలు గడచినవి. ఆదిమవాసులు దొంగ

తనములు సాగించి యెల్లరకును నష్టము కలిగింపసాగిరి. దీనివలన నొకఆవరణ మవసరమయ్యెను. ఆవరణలోనికి ఆదిమవాసులురానందున బయటకుపోయి బేరములు సాగించుటయవసరమయ్యెను. అంతట దేశముయొక్క స్థితిగతులు తెలియవచ్చెను. ఐరోపా, హిందూదేశములలో కనుపడుచెట్లు ఫలవృక్షములు కూడ నీదక్షిణాఫ్రికా ఒబిలు అఖాతపుతీరమున పెరుగుచుండెను. జావాలోనుండి గుఱ్ఱములు, గొఱ్ఱెలు, కుక్కలు, చెవులపిల్లులు, పందులు తెచ్చిరి. గోధుమ బార్లి, పండింపసాగిరి. వచ్చుపోవునోడలకు మంచి ఆహారము నీరు నివ్వగలిగిరి. అంతట నీసముద్రతీరమున కొన్ని రైతుకుటుంబములను నెలకొల్పుట యుక్తమని గవర్నమెంటువారికి తోచెను.

1657 లో డచ్చి ఇండియావర్తకసంఘమువారి కొలువులోనుండిన తొమ్మండ్రుగురకుపకారవేతనము లిచ్చి దక్షిణాఫ్రికాలో వలసప్రదేశమున ఈనాముల నిచ్చి వారికిఁ గావలసిన పెట్టుబడిని పెట్టి నెలకొల్పిరి. ఇట్లె మెల్లమెల్లగ చాలమందిని పంపిరి కాని దేశమును వశపరచుకొనవలెనను తలంపులేదు. 1658 లో అచ్చట క్రొత్తగ వ్యవసాయమును సాగించువారికి లాభకారిగ నుండునని తలంచికాఁబోలు, సీగోబ్రా నిసలను దిగుమతిచేసిరి. తరువాత నిది గొప్పపారబాటుగ పరిణమించెను. పోర్చుగీసు ఓడలో దొరకిన బానిసలను దింపిరి. మఱల గినియానుండి తెచ్చిరి. అయినను డచ్చిధర్మశాస్త్ర

ముల పరికార్యము బానిసలకు స్వాతంత్ర్యము సులభముగ నిచ్చుటకు వీలుండెను. వారికి హక్కులుగూడ నుండెను. కాని వారేమిలాభమును పొందగలరు? నీగ్రోలుగాక ఆసియాదేశము మలాకా, జావా దీవులనుండియు నేరములుచేసిన వారిని తీసుకొనివచ్చి విడచుచుండిరి కొంతకాలమునకు హిందూదేశమునుండి రాజకీయ ఖైదీల నిచ్చటికితెచ్చి విడచుచుండట ప్రారంభించిరి. దీనినుండి ఆసియాదేశీయుల జాతి యొకటి యిచ్చట వెలసెను. 1659 లో హాట్టెంటాటు తెగవారికి పాశ్చాత్యులు తమ దేశములో అడ్డువచ్చిన వారుగ కనబడిరి. కొంత కలహముకలిగెను. కొందరు డచ్చివారి గొఱ్ఱెలను తోలుకొనిపోయిరి. అంతట కోటగోడలు గట్టిచేయబడెను. మెల్లగ ఆదిమనివాసులతో సంధి కుదిరెను మరల వర్తకము సాగెను. "రీబీకు"కు బదులు "వాగెనార"ను నాతఁడు దళాధిపతియయ్యెను ఆంగ్లేయులధాటి అధిక మగుచున్నందున మంచిదుర్గము కట్టుట యవసరమయ్యెను. హాట్టెంటాటుల ధాటికి నిలచిన మట్టిగోడలు ఇప్పుడూ చాలవయ్యెను. 1671 లో ఐదారు కుటుంబములు వచ్చెను.

డచ్చి న్యాయాధిపతి యొకఁడు తన దేశమునకు పోవుచు వచ్చి, చూచి, దేశమును డచ్చివారు ఎవ్వరి నడుగకయె ఆక్రమించుకొని యుండినందున పత్రమొకటి యుండుట మంచిదని కాఁబోలు ఆదిమనివాసులజాతి నాయకు నొకనికి 135

రూపాయీలు 9 అణాల 3 పైసల నిచ్చి దేశము కొనెను. పత్రమునందుమాత్రము 24,000 రూపాయిల ప్రతిఫలమున్న ట్లువ్రాసిరి. డచ్చివారు దేశమును నలుగడల తిరుగుచు చూచుచుండిరి. "హొనక్వా" గ్రిక్వా" "అట్టొక్వా" తెగలతో వర్తకము చేయుచుండిరి. పొదలలో తిరుగు సడవివారు డచ్చి వారి నప్పుడప్పుడు బాధించుచుండిరి. 1678 లో డచ్చివారు మృగముల నశింపజేయుటను చూచి సహింపక హాటెంటాటులు యుద్ధముజేసిరి కాని అంతఃకలహమువలన నోటుపడిరి. అప్ప టికి దక్షిణాఫ్రికాలో నుండిన డచ్చివారిసంఖ్య 1000లోపుగ నుండెను. 1679 లో ఆరు కుటుంబములు వచ్చునప్పటికి బ్రిహ్మాండ మయ్యెను. మాంసాహారములు, పశువులు, గొఱ్ఱెలు కావలెనన్న చో, ఆదిమవాసులతోడి నెయ్య మవసరమని డచ్చివారును గ్రహించి "గొన్నెమా" యను నాయకునితో సంధిచేసికొనిరి. ఇక్కడకువచ్చు డచ్చికుటుంబములకు కావలసి నంత భూమి వలసినచోట పన్నులులేకుండగ నిచ్చెదమని గవ ర్నమెంటువారు ప్రచురించుచుండిరి. "వాణ్ డెర్ స్టెల్" అను నాతడు డచ్చి సేనానియై వచ్చెను. ఇతనికి దేశాభిమానము మెండు. మెల్లగ కుటుంబములను ప్రోత్సహించి దేశాక్రమణ ము జరిగించెను. వచ్చుచుబోయెడి నావలలోని వారి నచ్చ టనుండుడని ప్రోత్సహించెను. 1685లో పదునాల్గవ లూయీ తాను పూర్వము మతములపట్లచూపినసమభావము మానెను

అంతట ఫ్రెంచిదేశములో నున్న ప్రొటెస్టెంటు మతమువారు దేశము విడచిపోయిరి. వారు మెల్లగ వలసవచ్చి మన డచ్చిప్రజలలో కలసిరి. నూతనములగు డచ్చికుటుంబములు 400 వచ్చెను. అందరును కలసియె నెలకొనిరి. కొందరు కొంచెము దూరముపోయి విడసిరి. 1400 ప్రజల వరకును జనసంఖ్య పెరిగెను వీరెల్లరు డచ్చిభాషను మాటలాడుచుండిరి. అప్పుడు మూడుక్రైస్తవదేవాలయములు, కేపుట వునులోనొకటి స్టెల్లెన్‌బాష్‌లోనొకటి డ్రాకెన్ స్టీనులో నొకటియు వెలసెను. అంతట నీ వలసరాజ్యము నేలుసేనాధిపతికి "గవర్నరు" బిరుదమిచ్చిరి. ఒకకార్యాలోచనసభకూడ నుండెను. కేపుటవునులో నొకన్యాయస్థానము స్టెల్లెనుబాషులో నొక న్యాయస్థానమునుండెను. బటేవియాకోర్టుకు అప్పీళ్ళు నుండెను. కేపుటవునులో నొక అనాధశరణాలయము, వివాహవిషయములు తీర్మానించుట కొకన్యాయస్థానము నేర్పరుపఁబడెను. అన్నిటికిని కార్యనిర్వాహక సభలును, వానికి ఎన్నుకొనబడిన రైతు సభ్యులును నుండిరి. రైతులు కవాతునేర్చుకుని యుద్ధసన్నద్ధులుగ నుండిరి. కేపుటవునులో 80 బంగాళాలుండెను. వాన్ డెర్ స్టెల్ వేయించిన గొప్పతోటలో వివిధవృక్షములుండెను. 1699 లో అతఁడుపకారవేతనము పొంది యచ్చట వసించెను. పన్నులపద్ధతి బాగుగలేదు. ఇజారాలు పాడుచు కొందరు వర్తకులు వారి యిష్టానుసారముగ వస్తువుల

నమ్ముచుండిరి. గవర్నమెంటువారికి మాత్రము చౌకగ నమ్మవలెను. పరదేశీయులకు ప్రియముగ నమ్మవలసియుండెను. డచ్చియోడలకు సర్దుబాటయిన గాని ఇతరయోడలకు వస్తువులమ్మరాదు. ఆ భూమిమీద అమ్ముటకు కంపెనీ గవర్నమెంటువారికే అన్నివస్తువులకు ఇజారా అయినను డచ్చియోడలలోని నావికులు రహస్యముగ జపాను పట్టుబట్టలు మొదలగు వస్తువులు తెచ్చి విక్రయించుకొనుచుండిరి. ఓడలపైన వివిధములగు మృగములుండెను. ఆకాలమున డచ్చివారికి మెల్లగ "ఆరెంజి"నది సంగతి తెలిసెను. దానిపైనంతర్భాగముల నెవ్వరును చూడలేదు.

1751 మొదలు 1771 వరకును 'రిక్ టులబాగ్'అనునతడు గవర్నరుగ నుండెను. ఈ కాలమునాటి డచ్చిప్రభుత్వము చక్కగనుండెను. 1755 లో నొక యోడవలన మశూచి దేశములోనికి వచ్చెను. రెండువైద్యశాలలను స్థాపించినను చాల నష్టము సంభవించెను. సాగాయిధర పడిపోయి నష్టము కలిగెను. మరల ఫ్రెంచియోడల రాకతో ధరలు పెరిగెను. ఫ్రెంచివారు నాంగ్లేయులును వలసరాజ్యముపైన కన్నువేసిరి.. డచ్చివారు దేశములో కొన్ని క్రొత్తప్రదేశములను చూచి వచ్చిరి. కేపు టవునులో 5, 6, వేలమంది యుండిరి. అందు సగమువంతు బానిసలు. మంచిగృహములు ఒకటే అంతస్తువి యుండెను. స్టెల్లెన్ బాషులోని తోటలు వర్ధిల్లెను. సైమన్సు

టవునులో పెద్ద వర్తకశాలలు కట్టిరి. అంతట తూర్పున ఫిష్ నదివరకును వలసరాజ్యము వ్యాపించెను. 1771 లో టులబాగు చనిపోయెను. ప్లెట్టెనుబర్గు గవర్నరయ్యెను. ఫిష్‌నది సరిహద్దుగ ఆదిమవాసులతో ఖరారుచేసికొనెను. అడవిమనుష్యుల బాధ యధికమగుటవలన వారిని దండించి 235 మందిని పట్టుకొనిరిగాని కొందరిని విడచి కొందరిని పదేండ్లు బానిసలుగ చేసిరి.

1779 లో మొదటి కాఫరుయుద్ధము సంభవించెను. ఆదిమనివాసులతో సంధిచేసుకొనుట చూచి మగటిమి లేమిగ నెంచి క్షోసాతెగవారు విజృంభించిరి. 1779 లో యుద్ధములో నాకతెగవారు వెనుకకు పోయిరి. 1781 లో బ్రిటిషువారు డచ్చివారిపైన యుద్ధము సాగించిరను సమాచారము తెలిసెను. వలసరాజ్యమున నరాజకముగ నుండెను. ఇంగ్లీషువారు వలసరాజ్యమును పట్టుకొనుటకు ప్రయత్నించిరి. కాని ఆసంగతి ముందుగ తెలిసికొనిన డచ్చివారు వారి నెదిర్చి గెలిచిరి. కంపెనీ గవర్నమెంటుకు ధనములేక కాగితపుద్రవ్యము నుపయోగింపసాగిరి. ప్లెట్టెనుబర్గు పరిపాలనము బాగుగలేదు. అంతట అతనిపైన డచ్చిప్రజలు హాలెండుకు ఫిర్యాదుపంపిరి. కాని అది నాలుగేడులకు త్రోసివేయబడెను. అప్పుడు ఫ్రెంచివారికి వస్తువులు ధాన్యము కావలసి ధరలు పెరుగుచుండెను. వలసరాజ్యములోని ఉద్యోగులన్యాయము చేయుచుండిరి.

1790 లో కంపెనీవారికి ధనములేకపోయెను. అంతట గవర్న మెంటు వారిరువురను లెక్కలను తనిఖీచేసి ఆర్థిక సమస్యను పరిష్కరించుటకు పంపిరి. కొన్నిపన్నులను వృద్ధిచేసియు కొన్ని వ్యయములను తగ్గించియు కొంతపనిచేసిరి. కాగితపు ధనము మఱల నుపయోగించిరి. మఱల నొకయుద్ధము వచ్చునట్లు 1789 లో కనబడెను. క్జోసాలు ఫిష్ నది దాటివచ్చిరి. గవర్న మెంటుకు యుద్ధముచేయుట యనిష్టము. పలసప్రజలే వారి నెదిర్చిరి కాని లాభములేకపోయెను. గవర్నమెంటువారు మఱల యుద్ధముచేసి సంధిచేసిరి. ఆక్షణమున డచ్చివారి నెథర్లాండు దేశములో రెండుకక్షలుండెను. ఒకటి ఫ్రెంచి వారికి సైదోడు. రెండవది ఆరెంజీపార్టీ. ఇంగ్లాండుకు స్నేహముకలది. 1793 లో ఫ్రెంచివారు బ్రిటీషువారిపైన యుద్ధము చాటించిరి. 1794లో వలసరాజ్యములో గ్రాఫ్‌రీనెట్టు ప్రజలు ప్రజాస్వామ్యము స్థాపించిరి. వీరినిజూచి స్వెల్లెండాము ప్రజలును ప్రజాపాలనముస్థాపించిరి. పరిపాలనావిధానమునందు లోపములుండెను. కాని వారిష్టపడి వ్యవహరించుకొనుచుండిరి. వీరిని మరల నణగద్రొక్కి తమ పరిపాలనస్థాపించుటకు వలసిన బలము డచ్చి ఇండియా కంపెనీవారికి లేకపోయెను. వివిధములగు దేశముల వారితో నిండినను సైనికులదళము జాతీయ పటాలముగ మారినది. ప్రజల ప్రభుత్వము జాతీయ పరిపాలనమైనది.

బ్రిటీషువారి ఆక్రమణము:—1794సం॥లో ఐరోపాలో చలి తీవ్రముగనుండెను. నదులు పేరుకొనెను ఫ్రెంచివారు బ్రిటీషువారిని జర్మనీలోనికి పారదోలిరి. నెథర్లాండులోని ఫ్రెంచి కక్షివారు ఫ్రెంచివారితో కలసిరి. డచ్చిప్రభువు ఇంగ్లాండునకు చేపలదోనెలో పారిపోయెను. ఇంగ్లీషువారీ ప్రభువు వలన నొక యధికారపత్రము పుచ్చుకొని వలసరాజ్యము నాక్రమించుటకు నావికాదళ మంపిరి. 1795 లో వారినెదిరించుట కిష్టములేక డచ్చిరైతు ప్రజలు సైమన్సుటవును వదలి మ్యూజెనుబర్గుకు బోయిరి. పదునైదు దినములలో 800 ఇంగ్లీషు సైనికులు సైమన్సుటవున్‌లో విడిసిరి. అగస్టు ఏడవతారీఖున మ్యూజెనుబర్గుకూడ ఆంగ్లేయుల వశమయ్యెను ఏలన నచటిసైన్యాధిపతి నిజముగ ఆరెంజిపార్టీవాడు. ఇంతవరకును ఆంగ్లేయులను గవర్నమెంటు ఎదిరించుననుకొన్న డచ్చి ప్రజలు నిరాశజెందిరి. పాపము, ప్రజలె ఆత్మగౌరవముకొరకు నిలిచి యెదిర్చిరి. కాని వారిపక్షమున వచ్చిన సైన్యాధిపతులే వెనుదీసిరి. సెప్టెంబరులో ఆంగ్లేయులతో సమాధానపడిరి. వలసవచ్చిన ప్రజల హక్కులకు భంగములేకుండ క్రొత్తపన్నులు విధింపకుండ డచ్చికంపెనీవారి ఆస్తిమాత్రము స్వాధీనము చేసికొను పద్ధతితో ఆంగ్లేయదళము దేశము నాక్రమించుకొనెను. ఇట్లు నూటవలుబదిమూడు వత్సరము లేలిన డచ్చికంపెనీ పరిపాలన మంతమొందెను. నిజముగ నిచ్చటి పరిపాలన మంతరింపకపూ

ర్వామె కంపెనీ అంతరించెను. ఆంగ్లేయ చరిత్రకారులు వ్రాసి నట్లు డచ్చిప్రభుత్వ మంత చెడుగనుండి యుండలేదు. ఆంగ్లే యుల పరిపాలనము వలెనే అదియునుండెను. తుదిదినములలో పాడైనమాట వాస్తవము. కంపెనీవారి దస్తావేజులు పరిశీలిం చినచో కొన్ని అపవాదులు అసత్యములని తేలుచున్నది.

డచ్చి గవర్నమెంటువారు మరల దేశము తీసికొనప్రయ త్నించిరి. కాని లాభములేక పోయెను. 1802 వరకును బ్రిటీషు వారే పరిపాలించిరి. అప్పుడు జరిగినసంధి ప్రకారము దేశము డచ్చి వారికిచ్చిరి. కాని మరల నెపోలియనుతోడి యుద్ధమును పురస్కరించుకొని 1806 లో వశముచేసికొని డచ్చిప్రభువుకు కొంతసొమ్మిచ్చి 1814 లో కొనిరి. ఆవిక్రయమువలన బ్రిటీషు వారి హక్కులు స్థిరపడినవి.

## నాలుగవప్రకరణము

### బోయరుల వలస.

బ్రిటిషుపాలనము:—దక్షిణాఫ్రికాగ్రమందలి "కేపు కాలనీ" వలస రాజ్యములలో బ్రిటీషువారి పరిపాలనము వచ్చినది. బోయరులు (డచ్చిరైతులు) పన్నులు తప్పించుకొను టకు అబద్ధములాడెదరని బ్రిటీషువారు నిందింపగ జాతివిషయ

ములను గూర్చి అసత్యము లాడెదరని బ్రిటిషువారిని డచ్చి
రైతులు నిందించిరి బేరములు చెప్పుటలో లాభములు తీయు
టలో డచ్చి ప్రజలు నిపుణులు. ఇది అన్యాయమని బ్రిటీషు
వారితలంపు. రైతులు నిరక్షర కుక్షులని బ్రిటీషువారు నీచము
గ చూచిరి వలసరాజ్యములో బానిసల చేతను పనులు చేయించు
కొను అలవాటుండెను. అందువలన శుభ్రము లేకుండెను మత
విషయమున పట్టుదల లధికముగనుండెను. డచ్చిరైతులు ఆంగ్లే
యులు గర్వితులనియు అత్యాశపరులనియు ఇతరులవాక్కులను
లక్ష్యపెట్టరనియు స్వార్థపరులనియు ఆక్షేపణజేయువారలనియు
తలచుచుండిరి. అయినను మెల్లగ నొకతెగవారింకొక తెగవారి
తో సంబంధ బాంధవ్యములు చేసికొనుచుండిరి. కాగితపు
ద్రవ్యమును కొంతవఱకు మార్చి నష్టము రాకుండ చేయుటకు
బ్రిటీషువారు ప్రయత్నించిరి. వర్తకము నిరాక్షేపణముగ నిజా
రాలు లేకుండ జరుగనిచ్చిరి. గవర్నమెంటువారు నితరులవలెనె
ప్రతివస్తువును క్రయమిచ్చి కొనునట్లు శాసించిరి. ఇది కొంచెము
లాభమును కలిగించెను. డచ్చిదక్షిణాఫ్రికా ఆంగ్లేయుల వశ
మైనసంగతి ఇంగ్లాండుకు తెలియగనె మెకార్ట్నే అను ప్రభువు
ను 1797 లో గవర్నరుగా పంపిరి. ఇతఁడు మంచివాడె కాని
అధికారమన్న ప్రీతి. తన దేశమునకు లోఁబడియున్నవారిని
బాగుగచూచి అనిష్టులకు కంటకుఁడుగనుండెను. స్వేచ్ఛముగ
అభిప్రాయములు వెల్లడిచేసికొను హక్కునుకూడ అణగఁద్రొ

క్కెను. రైతులెల్ల రాంగ్లేయరాజుకు భక్తి చూపవలెనని శాసించెను. ఇష్టపడనివారిని దండించెను. అగ్రిమునకు తూర్పుప్రదేశములలో స్వేచ్ఛముగ వర్తకము చేసికొను హక్కు పోయినది. అది ఆంగ్లేయులకు ప్రత్యేకముగ నుంచెను ఇతఁడు 1798లో ఇంగ్లాండునకు పోయెను. "యంగు" గవర్నరయ్యెను. గ్రాఫ్రినెక్ లో రైతులు తిరుగుబాటు చేసిరికాని పితూరీదార్లు లోబడిరి. అంతట వారిని కఠినముగ శిక్షించిరి.

బ్రిటీషువారు "కేపుకాలనీ" (అగ్రిములోనివలస) రాజ్యము నాక్రమించినప్పుడు వారిసంఖ్యయె స్వల్పముగనుండెను. అందువలన వారిపరిపాలనము నిరంకుశముగనుండెను. వారి గవర్నరు సర్వాంసహాచక్రవర్తిగనుండెను. అయినను ప్రజల ప్రాతపద్ధతుల నెక్కుడుగ మార్చకుండగనె పరిపాలించిరి. వలసరాజ్యములోని బోయరులకును ఆదిరు నివాసులకునుగల పరస్పరసంబంధములతో వీరు ప్రసక్తి కలుగజేసికొనలేదు కాని సరిహద్దులకవతలనున్న హాట్టెంటాటు ప్రజలకును దచ్చి రైతులకును బోయరులకును గలకలహములలో హాట్టెంటాటులకు సాహాయ్యమొనరింపసాగిరి. ఇదిబోయరులకు కష్టముగ నుండెను.

రాజ్యములనేలు ఆంగ్లేయులు చాల కట్టుదిట్టముగ పని చేయుచుందురు. ఇది వారి స్వార్థపరత్వము ధనకాంక్షవలన

కలిగిన గుణమని పరులనుకొనుచుందురు. ఆంగ్లేయులే ఉన్న తోద్యోగము లెల్ల నాక్రమించుచుందురు. బ్రిటీషువారనాగరక దేశముల నేలునప్పు డేచిక్కునుండదుగాని, నాగరకులగు తెల్లవారి నేలవలసివచ్చినప్పుడుమాత్రము చిక్కుకలుగుచుండును. వారు స్కాటులాండుతో తమ పరాక్రమము చూపలేకపోయిరి. ఐర్లాండు నడగద్రొక్కబోయి శాశ్వతవిరోధిగ జేసికొనిరి. అమెరికాను వంచింపబోయి దేశమునె పోగొట్టుకొనిరి. ఇదియె దక్షిణాఫ్రికాలో వారిని యుద్ధములలో దింపినది. తుదకు స్కాటుజాతితో కయ్యము మాని నెయ్యము సలుపుట యుక్తమని బ్రిటీషుజాతి గ్రహించెను. అట్లె దక్షిణాఫ్రికాయు నీ నీతినే బోధించెను.

1820 లో చార్లెసు సోమరుసెట్టుప్రభువు గవర్నరయ్యెను. అతడు ఆంగ్లేయప్రభుత్వముయొక్క అనుమతితోడనే వలసరాజ్యముయొక్క తూర్పు సరిహద్దున కొందఱు బ్రిటీషువారిని నెలకొల్పెను. అక్కడ నిదివరకెవ్వరును లేరు. ఇట్లు బ్రిటీషుకుటుంబములను స్థాపించుటవలన వలసరాజ్యములపైన బ్రిటీషువారికిని కొంత అభిమానముగలిగెను. తూర్పుభాగమున బ్రిటీషురక్తస్పర్శ మెక్కుడయ్యెను. ఇది బోయరులకు కన్నెఱ్ఱగ నుండెను. ఇదిఅక్రమమని వారు తలచిరి. ఈస్థితిలో జాతివైషమ్యములు పెరుగజొచ్చెను. ప్రభుత్వమువారు ప్రజల నాంగ్లేయనాగరకతా మహాత్మ్యము నంగీకరించునట్లు చేయుటకు

కాబోలు, ఆంగ్లేయపద్ధతుల ననుసరించి కొన్ని చట్టములను నిర్మించిరి. ఇది బోయరులకిష్టము లేదు. ప్రజలలో ఆనువవంతులలో నైదువంతులు డచ్చిరైతులు. ఇంగ్లీషు, ప్రభుత్వశాఖలలో ప్రథానభాషగ నుపయోగింపఁబడుట న్యాయముగ లేదని బోయరులు మొరవెట్టిరి. బోయరులను హాట్టెంటాటులను సమభావముతో చూచుచట్టమునకు వారంగీకరింపలేదు. గవర్నరు యొక్క నిరంకుశాధికారముపైన అంకుశముగ నుండునని పరిపాలకు లేర్పరచిన కార్యనిర్వాహకసంఘమువలన లాభము లేదని వారు గ్రహించిరి ముఖ్యమగు కారణ మింకొకటి కలిగెను. బ్రిటీషు వారు 1807 నుండియు నీగ్రోబానిస వర్తకమున కనిష్టముగనె ఉండిరి. 1833 లో ఆంగ్లేయ మంత్రులు బానిసత్వమును బాపుటకు పూనుకొనిరి. బానిసయజమానులకు నష్టపరిహారముగ నిచ్చుటకు పార్లమెంటువారు 20000000 పౌనుల నిచ్చెదమనిరి కాని అందు దక్షిణాఫ్రికాకు వచ్చిన వంతు 3000000 మాత్రమె. పోనిమ్మనుకొనినను బానిస యజమానులు తమకు రావలసిన పరిహారముల నింగ్లాండునకుబోయి రుజువుపరచుకొనవలెను. అంతట నింగ్లాండునుండి బేరగాండ్రు వచ్చి బోయరులవలన హక్కులను చాలతక్కువ కిమ్మతులకు గొనిపోవుచుండిరి. బోయరులకు చాలనష్టము కలిగెను. బోయరుల పొలములు చాలవరకు బానిసల వ్యవసాయము వలననె సాగగుచుండెను. అందువలన బానిసత్వము బాపుటవలన గొందఱు

దివాలా తీసెరి. 1884 లో బెంజమెను డీఅర్బను గవర్నరుగ వచ్చెను. బోయరుల కింకను తమబానిసలు పోవుటయెగాక తగిన పరిహారము లభింపదను సంగతి తెలియలేదు. ఈ లోపుగ కాఫరుసమస్య తీవ్రమయ్యెను. "ఫిష్" నది కావలనున్న కాఫరు తెగలతో షువారు ఏబదివత్సరములనుండి కలహములు జరుగుచుండెను. బ్రిటీషువారువచ్చిన తరువాత రెండు కాఫరుయుద్ధములు వచ్చెను. క్రైస్తవ గురువులగు మిషనరీలకు తప్ప తక్కిన ఉద్యోగులకును ప్రజలకును కూడ కాఫరు తెగలపై నభిమానము లేదు. కాఫరులు నిష్కపటులనియు, తెల్లవారు వారికి కోపముకలిగించినగాని వారు యుద్ధము చేయరనియు మిషనరీలనిరి. తక్కిన ప్రజలకు వారుదుర్మార్గులుగ హత్యగాండ్రుగా కనబడుచుండిరి. వారు బలపరాక్రమములను చూచి వెరతురు కాని లేనిచో క్రూరకృత్యములకు వెనుదీయని వారని తలచుచుండిరి.

ఆదిమవాసులు:—బంటూజాతులు విజృంభించుచుండెను. జాలూనాయకుడగు ఛాకా 1783 లో జననమొందెను. అతడు తన తండ్రినుండి తప్పించుకొని ఇంకొకనాయకునొద్ద పెరిగి తనయసమానప్రజ్ఞవలన జాలూ తెగకు నాయకుడయ్యెను. జాలూల నత్యద్భుతముగ యుద్ధప్రవీణులుగ చేసెను. అతడు తక్కిన తెగలను నాశనముచేయ నమకట్టెను. వాడియైన పెద్ద ఈటెలతో తన సైన్యము నాయుధపాణులుగ చేసెను.

తాను జయించిన తెగలలో స్త్రీపురుషులనునరికివైచెను. కొందఱు సందకత్తెలను మాత్రము మిగుల్చును. బలశాలురగు యువకులు వీరైలెనచో వీరులు కావలెను. లేనిచో బానిసలు కావలెను. ఈ యొత్తిడికి ఆదిమవాసుల తెగలందు కలవరములు కలిగెను.

ఛాకా చాలయుద్ధములు చేసి 1828 లో తన సోదరుని వలననె హత్యచేయఁబడెను. అతని సోదరుఁడు 'డింగానా' నాయకుడయ్యెను. మొసిలెకాట్సీయను నింకొకనాయకుడు ఛాకా వలెనే తెల్లవారికి బలవద్విరోధియయ్యెను. అతనికి రమారమి 10,000 మంది సైనికులుండిరి. వీరిది మటాబెలు తెగ, అతడు మరికా్వనదీతీరమున తన జండా పాతెను. క్రైస్తవ మిషనరీ లితనితో స్నేహముచేసిరి. ఇంతలో బసూటోదేశములో 'మోషేషు' అను శూరుఁడొకఁడు బయలుదేరెను. అతని ముఖ్యస్థానము తాబాబోసిగో. ఛాకాడింగానాలకు దాసుఁడనని చెప్పుచు జూలూలతో స్నేహముగనుండి వారికి పక్షియీకలను తోళ్ళను బహుమానమంపుచు, చుట్టుప్రక్కల పెక్కుజాతులవారిని వశముచేసికొని బాగుగ పరిపాలింపసాగెను. అతనిపరిపాలనమున మానవహంతకులకుకూడ హక్కులుండెను. 1831 లో మటాబెలు సైన్యములు తాబాబోసిగోను ముట్టడించెను. గాని వశపర్చుకొనలేకపోయెను. వారికాహారములు లేకపోవుచుండగ మోషేషు తినుబండారములనిచ్చి ఆదరించెను. అంతట వారితని నెన్నడును బాధింపలేదు. 1833 లో

క్షించి క్రైస్తవగురువులు (మిషనరీలు) మోషేషుతో స్నేహ
ముచేసి అతనికి సహాయముచేయుచు బంటూ, హాట్టెంటాటు
తెగలను కాలిడన్‌నదికి కుడివైపుటొడ్డున నుండునట్లు జేసిరి.
1836 లో కేపు కాలనీ రాజ్యమునకు ఉత్తరమునను, తూర్పు
నను బంజరు భూము లమితముగ నుండెను. 'కేయిస్ కామా'
ఉంజింవ్రూబూలమధ్య క్సోసా, టెంబూ, పోండో, ఫింగో తెగ
లుండెను. వీరికి నాగరకతను నేర్పుటకులండన్, గ్లాస్గో, వెస్లియన్
మిషనరీలు (క్రైస్తవగురువులు) ప్రయత్నించుచుండిరి. ఉంజిం
వ్రూబూ ట్యూగేలా నదులమధ్య 5 లేక 6 వేలకన్న నెక్కుడు
జనులులేరు. ట్యూగేలానదికి ఉత్తరమున డింగానా నాయకత్వ
ముక్రింద జూలూతెగవారు ఉండిరి. వారికి 25 లేక 80 వేల
సైనికులుండిరి. 1836 లో ప్రస్తుతపు ట్రాన్సువాలు పరగణా
ను పడమరసరిహద్దులో మారిక్వానది వెంబడిని మటాబెలు
తెగయుండెను. చాలవరకు తక్కినభూమి నిర్జనప్రదేశముగనె
యుండెను. అక్కడక్కడ ప్రాతకాపులగు ఆదిమనివాసు లుం
డిరి. ప్రస్తుతపు ఆరెంజిరాజ్యమున కొన్నివందలు గ్రిక్వాలును
హాట్టెంటాటు నీగ్రోపాశ్చాత్యుల మిశ్రమజనములు నుండిరి.
మాంటాసియొక్క తెగలో మిగిలినవారు విషునె దగ్గరను
బంటూతెగ మెకౌట్లింగు దగ్గరను తాబానీట్సు బెతులీల దగ్గ
రనుండిరి. బ్రిటిషు బెచూనాదేశ మనుకొనబడుచోట బట్లా
పిన్, కొరనా తెగలుండెను. బసూటోదేశములో మోషేషు

చేర్చిన మిశ్రమజాతివారుండిరి. నేటాలులో అమెరికను మిషనరీలు పనిచేయ ప్రయత్నించుచుండిరి. మటాబెలు తెగయందు పనిచేయుటకు ప్యారిసు లండన్ బెర్లిన్ వెస్లియన్ మిషనరీలు డింగానావద్దకు వెళ్ళిరి.

డీఅర్బన్ గవర్నరు మిషనరీలనాయకుని ఆజాతుల నాయకులకడకు రాయబార మంపెను. కాని తెల్లవారు తమ్ముఁజూచి భయపడి యట్లు కబురంపి రనుకొనిరి. క్రిస్టమసుపండుగ వచ్చెను. డీఅర్బను ప్రజలు ఉద్యోగులు వేడుకచూచుచుండిరి. ఆక్షణమున కాఫరులు ఫిష్‌నదిని దాటిరని తెలియవచ్చెను. అంతట కాఫరుయుద్ధము సంభవించెను. ఈయుద్ధమున బ్రిటీషు సేనాని హారిస్మిత్తు సేన నడిపెను. ఈపోరు తీవ్రముగ నొకవత్సరము జరిగెను. తరువాత కాఫరులు లోఁబడిరి. బ్రిటీషుప్రజలకు కాఫరుల యొత్తిడి తగలకుండ యుద్ధములుచేయు కాఫరులకడ్డముగ నొక కాఫరు తెగవారిని నెలకొలిపిన మంచిదని గవర్నరుకుతోఁచి సరిహద్దుదేశమున బ్రిటీషు ప్రభుత్వము ప్రకటించి యచ్చటి కాఫరుతెగవారి నాయకులకె పరిపాలనమువదలి డీ అర్బన్ దూరదృష్టితో ప్రజలకీవిరోధుల బాధను మాన్పఁబ్రయత్నించెను. మిషనరీ లిపద్ధతులను హర్షింపక కాఫరుల స్వాతంత్ర్యమును పోగొట్టుట మంచిది కాదని ఇంగ్లాండులోని పరిపాలకులకు చెప్పగా వారు డీఅర్బన్‌గారి రాజ్యాంగవిధానమును తిరస్కరించిరి. ఉత్తరమునను తూర్పునను కాఫరుల

బాధల ననుభవించుచుండిన ప్రజలు తత్తరపడిరి. గవర్నరు పరి
పాలకులకు మఱల వ్రాయగ నీయనను రాజ్యపరిపాలనమును
మాని వెనుకకు రమ్మనిరి. డీ అర్బనుగారిని తొలగించుట ప్రజ
లకు కష్టముఁ కలిగించెను. ఆక్షణముననే బానిసత్వముబాపు విష
యమునఇంగ్లాండు తమకన్యాయము చేసినదని బోయరుప్రజలకు
తెలియవచ్చెను. బానిసల విడుదలవలన కొన్నికుటుంబములు
నష్టమునుపొంది దివాలాతీసెను. ఇదివఱకు కఱవు, బీదతనము
నెఱుగనివారికి కష్టము సంభవించెను. ఇదివఱకువలె గోధుమ,
ద్రాక్షయు విరివిగ పండింపలేకపోయిరి. తక్కువ కూలివారితో
పనిజరుగు ఉన్నిపరిశ్రమయు "మెరీనో" గొఱ్ఱెలను పెంచుటయు
నధికమయ్యెను. ఇట్టియక్రమములు బాధలుఁకలుగుచున్న బ్రిటీ
షుపరిపాలనమునుండి, దేశమునుండి, వెడలిపోవుటయు క్షేమని
డచ్చిరైతులకు తోచెను. బ్రిటీషువారిరాక, వారిప్రభుత్వపద్ధతుల
యందనిష్టము, బోయరులమాతృభాషయగుడచ్చిభాషకుబదులు
నింగ్లీషునే రాజభాషగ నుపయోగించుట, దేశమున కాగితపు
ధనముపయోగించుటవలన దొంగనోట్లు సృష్టింపబడుటయు,
దానివలనకలిగిన ఆర్థికదుగవస్థ, ప్రజలఅభిప్రాయముఁ దెలుపు
ఆడ్వర్టయిజర్ అనుపత్రిక నడఁగఁద్రొక్కి దానిముద్రాశాలను
వశపరచుకొనుట, ప్రభుత్వమే చాలధనము వ్యయముచేయు
చుండుట, పన్నులధికమగుటయు, నిప్పుడీకాఫరులపట్ల పక్ష
పాతము వహించుటయు బోయరుప్రజలకు చాలకష్టమును

విషాదమును కలిగించెను. వారిజీవనము దుర్భరమయ్యెను. అందువలన వారి కేపురాజ్యమునుండి వెడలిపోదలచిరి.

1836 సంవత్సరము మొదలు ఈనష్టములు భరింపలేక బోయరులు ప్రక్కలనున్న అరణ్యములకు వలసపోవఁ జొచ్చిరి. స్పెయిన్ దేశపురాజగు రెండవ ఫిలిప్ను, ఫ్రెంచి దేశపు రాజగు 14 వ లూయీని ఎదిరించి దేశములను విడచిన ధైర్యశాలుర బిడ్డలీబోయరులు. వీరు కష్టముల కలవాటు పడిన వారు. పెద్దగూడుబండ్లలో కాపురములు చేయుచు తిరుగుటకలవాటు పడినవారు. ఈపెద్దగూడు బండ్లలో సామానులనెక్కించిరి. తినుబండారములను మందు గుండు సామానులును చేర్చిరి. ఒకరికొకరు బంధువులగు కుటుంబములు లొకతండముగ బయలుదేరి వారిలోనొకనిని నా యకునిగా నెన్నుకొనుచుండిరి. గొఱ్ఱెలు గుఱ్ఱములు పశువు లను వారు తమవెనుకనే తోలుకొని పోవుచుండిరి. బోయ రులు దేశమునువిడిచి పోవకుండ బ్రిటిషువారు ఆటంకపరుప లేదు. దానిని నిషేధించు చట్టమును చేయలేదు అయినను తమ రాజ్యమును విడచిపోయినంతమాత్రమున తమ పరిపాలనము నుండి విడిపోయినట్లు తాము భావింపమని బ్రిటీషువారు కొం తకాలమైనపిదప పలికి మఱల నిరంకుశప్రభుత్వమును బోయ రుల దేశమున స్థాపింపయత్నింతురని బోయరులప్పుడు కలనైన

తలంపలేదు. నిజముగ ఆరెంజినదియె కేపుకాలనీ రాజ్యము నకు సరిహద్దుగ నెల్లరు తలచిరి.

ఫిష్‌నది కావలనున్న కాఫరులదేశమున కొండలకును సముద్రమునకును మధ్యనున్న దేశమున కవతలకు పోవుట యనుపయోగము. మటాబెలువీరులు కొండలుదాటి ఆ రెంజి వాల్ నదుల మధ్యప్రదేశమును ధ్వంసముజేసిరి. కాని వాల్‌నది కవతలనె వారు విడిసిరి. అందువలన నా రెండు నదుల మధ్యను వసించుటకు బోయరులకు వీలుదొఱకెను. అయినను మొట్టమొదట వలసకేగిన బోయరులగుంపులు బ్రిటీషువారికి సాధ్యమగునంత దూరముగ పోవసమకట్టి "వాలు" నదిని దాటెను. అంతట వారు మటాబెలుల చేతులలో పడి మడసిరి. మిగిలినవారు మెల్లగ డెలగో అఖాతము తీరముననున్న పోర్చుగీసువారిచెంతఁ జేరి తరువాత తిరిగివచ్చిరి. రెండవగుంపు పెద్దది. "వాలు" నదికి దిగువగనె విడిసెను. అక్కడ మొసెలెకట్సేని అతని మటాబెలు తెగను చూచి భయపడిన యొక తెగవారితో స్నేహముచేసి నిలచెను. వారిలో కొందఱును వారినాయకుడగు (Hendrik Potgieter) హెండ్రిక్ పోట్జీయటరును "వాల్" నదిదాటి "లింపొపో" నదివరకును దేశమును పరికింపఁ బోయిరి. వారు తిరిగివచ్చునప్పటికి మటాబెలులు తమ గుంపులో నిరువదియైదుగుర నడ్డగించిచంపి తక్కినవారి నెదిరించి పోయిరని తెలియవచ్చెను. వారు మఱల వత్తురను భయ

మెల్లరకు నుండెను. పోట్జీయుటరు పెద్దగూడుబండ్లను వలయాకారముగ చేర్చి కోటకట్టి దానిమధ్య 45 ఫిరంగులతో స్త్రీలను పిల్లలను రక్షించెను. అంతట మటాబెలు తెగ వచ్చెను. కాని బోయరుల యగ్నివర్షమునకుఁ దాళజాలక వెనుదిరిగిపోయెను. అట్లు పోవుచు బోయరుల మందల నపహరించుకొని పోయెను. ఇంతలో గెర్రీటు మారిట్జు (Gerrit Maritz) ఆధిపత్యమున వచ్చిన మూడవ బోయరుగుంపు వీరికి సహాయ్యముగవచ్చి వీరి బండ్లను తమ పశువులచే వెనుకకు లాగించెను. పోట్జీయుటరును, మారిట్జును, ఈదురదృష్టమునకు భయపడి వెనుదీయలేదు. బోయరులు పట్టినపట్టు విడుచువారు కారు. బ్రిటీషువారి రాజ్యమునకు మరల పోవుట వారి కవమానకరముగ తోచెను. తమ్మి నన్యాయముగ కష్టపెట్టుచున్న తెగలపై పగతీర్చుకొనుటకు స్త్రీలుకూడ నుత్సాహపడుచుండిరి. అంతట 150 మంది పైయుద్దేశ్యముతో ధైర్యముగపోయి ఒక తెగయొక్క సైనిక వర్గము నోడించి వారిలో చాలమందిని వధించి గొప్ప పశువుల మందను వశపరచుకొనిరి. "విజబర్గు" అనుచోట తమ జయ స్తంభమును నాటి విడిసిరి. అచ్చట వారుండగ వలస వచ్చిన క్రొత్తబోయరు కుటుంబములు వచ్చి వారిని కలసెను. 1837 జూను నెలలో వారు తమకొరకొక నూతన ప్రభుత్వవిధానము నేర్పరచుకొనిరి. ఒక ప్రజాస్వామ్యరాజ్యమును (Republic) స్థాపించుకొని "పీటర్ రెటీఫ్" ను (Pieter Retief) సర్వసే

వానిగ చేసికొనిరి "మొసెలెకట్సీ" పైన దాడివెడలుట ముఖ్యా వసరమయ్యెను. మటాబెలు దేశములోనికి 185 మంది బోయరులు పయనమయిరి. తమకన్న నూరురెట్లు అధికముగ సంఖ్యగల సైనికులతో ఆనాయకుడున్న సమయమున వారితో 9 దినములు యుద్ధముచేసి వారిలో చాలమందిని వధింప మటాబెలులు వెనుదిరిగి "లింపోపో" వంక పారిపోయిరి. "ఆరెంజి" "లింపోపో" నదులమధ్యనున్న దేశము బోయరులవశమయ్యెను. అంతటనా దేశమునెల్ల తమప్రజాస్వామ్య పరిపాలనక్రిందకు వచ్చినట్లు ప్రకటించిరి. తరువాత రెండుప్రజాస్వామ్యములును వర్థిల్లిన దేశమిదియె. ఇట్లు బోయరులు క్రొత్తరాజ్యమును స్థాపించిరి.

డింగానాయుద్ధము, నేటాలు:—పోట్జీయటరు మటాబెలుల నడగద్రొక్కుచుండగ, రెటీఫ్ మున్నగువారు కొండలుదాటి సముద్రముచెంత నేటాలులో రాజ్యస్థాపనము చేయుటకు వీలుకలదాయని చూచుచుండిరి. అప్పుడు నేటాలులో ఛాకా తదనంతరము రాజ్యమేలుచున్న డింగానా జూలూనాయకుడు. డింగానా నాశ్రయించికొంబోలు నప్పుడు నేటాలులో కొద్దిమంది బ్రిటీషు వారుండిరి కాని వారిపైన కేపు కాలనీ గవర్నమెంటుకు కట్టి అధికారమును లేదు. ట్యూగేలా నదివరకు నుండిన ఆదిమవాసులెల్లవారే తమప్రభువులని ఎంచుచుండిరి. వీరికెల్లరకు రాజాధిరాజు జూలూనాయకుడు. ఈసందర్భములో రెటీఫ్‌ను తక్కినవారును డింగానాను ప

ర్పించి కొంచెము భూదానమును గోరిరి. డింగానా వారి నాదరించి వారిచే నొక తెగను జయింపఁజేసి బుజ్జగించి తుదకువారు పోవునప్పుడు మోసగించి ఎల్లరను వధించెను. తరువాత నతఁడు కొందఱు సైనికులను జనేవరు 1804 లో బోయరులమీఁదికి దాడివెడలించెను. ఒకగుంపులోని బోయరులను స్త్రీలను పిల్లలను దయదాక్షిణ్యములు లేకుండ చంపెను. దొరకినంతవరకు హట్టెంటాటు సేవకులనుకూడ చంపించెను 400 మంది చనిపోయిరి. ఒకచిన్నవాఁడు తటాలున లేచి గుఱ్ఱమెక్కి తక్కిన గుంపులకు కబురుచెప్పగ వారు మేల్కొని బండ్లను తమచుట్టును పెట్టుకొని ఫిరంగులతో సిద్ధముగనుండిరి. జూలూ సైనికులు వచ్చి ఇది భేదింపజాలక వెడలిపోయిరి. ఆమరునాఁడు గుంపులెల్ల కలసికొనెను. ఈధైర్యశాలురు వెనుదీయుట కిష్టపడక పగతీర్చుకొనుటకుఁ గృతనిశ్చయులైరి అంతట కొండల కావలనున్న గుంపులయొక్క సేనానులు వచ్చి యీ బోయరు గుంపులను కలసిరి. నేటాలురేవులోనున్న బ్రిటీషువారుకూడ వీరికి సాహాయ్యులైరి. కాని వీరెవ్వరు నొకని నాయకత్వమున నుండుట కిష్టపడలేదు. బ్రిటీషువారును డచ్చివారును రెండు పటాలములుగ డింగానాపైకి దాడివెడలిరి. డచ్చివారు జూలూలమోసమున జిక్కుపడి కష్టముమీఁద వెలువడిరి. బ్రిటీషు పటాలములో 17 గురు తెల్లవారును 1500 నల్లవారు నుండిరి. వీరు తమకన్న అయిదురెట్లు బలముకల జూలూవారి చేతిలో

పడిరి. అంతట వారిలో మూడవవంతు పారిపోయినవారుతప్ప తక్కినవారెల్లరు చచ్చిరి. అంతట 1838 ఏప్రియల్‌లో బోయరుల దండయాత్ర ఆగిపోయెను బోయరులు జూలూలధాటికి ప్రతిఘటింపలేక పోయిరి.

నవంబరు వచ్చినది. "ఆండ్రిస్ ప్రిటోరియస్" అను క్రొత్తనాయకుడొకఁడు వచ్చెను. ఇతడు చాలసమర్థుడగు వీరుడు. బోయరులు విడిసినచోట నొకచిన్న సైన్యమును కావలియుంచి 460 మందితో "ప్రిటోరియసు" జూలూలపైనదాడి వెడలెను. ప్రతి మజిలీలోను బండ్లతో కోటలుకట్టుకొనుచు చారులను బంపుచు నడిచెను. పట్టుబడిన జూలూలచేత సంధికబురు లంపుచుండెను. 'డింగానా' రాయబారుల నంపుటకు బదులు సైనికుల నంపుచుండెను. 16 వ డిశంబరు తేది "డింగానా" దినము అని ఇప్పటికిని ప్రజలందురు. ఆదినమున డింగానాపంపిన సైన్యము బోయరులపైన బడెను. కాని బోయరులు ధైర్యముతో పోరాడి 3000 జూలూలను వధించిరి నలుగురు బోయరులు మడసిరి అప్పటినుండియు నాప్రక్కపాఱు సెలయేటిని 'రక్త నది'యందురు. ప్రతియేటను డింగానాపర్వము జనులు చేయుదురు.

అప్పటికి డింగానా పారిపోవలసివచ్చెగాని అతనిబలము పూర్తిగ నడగలేదు అందువలన దేశమున పలుచోటులను

పోయి వసించుటకు భయపడి బోయరులు పీటర్ మారిట్జుబర్గు చెంత కూడిరి. తరువాత డింగానా సహోదరుఁడగు పండా అతనినివదలి తెల్లవారి యండఁజేరువరకును డింగానాబలము పోలేదు. డింగానాను పెద్దయుద్ధమున 1840 జనవరి నెలలో పండా సైన్యము లోడించెను. డింగానాను కొద్దికాలమునకు హత్యచేసిరి. అతని స్థానమున నూతన ప్రజాస్వామ్యమునకు లోబడి "పండా" రాజయ్యెను

ఇట్లు బోయరు లెంతో కష్టపడి జయించిన నేటాలునందు వారు తమ ప్రభుత్వమును ప్రకటింప సమకట్టిరి. బోయరుల నూతనప్రభుత్వమునకు పరిపాలనాపద్ధతి బాగుగ తెలియదు వీరు బంటూ తెగలనుగూర్చి వింతశాసనములను చేసిరి. వీరు బంటూనా[illegible]ను నొకనిని కేపుకాలనీరాజ్యమునకును నేటాలునకును మధ్యదేశమున్లో నన్యాయముగ నెదిరించిరని దగ్గరదేశములో నున్న బ్రిటీషువారనిరి ఆంగ్లేయ క్రైస్తవ గురువులు ఆదిమనివాసులపైన తప్పులేదనియు బోయరులదే తప్పనియు పలికిరి. ఫలస్సకేగిన బోయరులను వెనుకకు మరలింపనలెరని కొందరనిరి. ప్రిటోరియస్ నాయకత్వమున వచ్చి ప్రజాస్వామ్యము తన పనిని మానలేదు. బ్రిటీషువారు నేటాలును కాంక్షించిరి. అంతట నేటాలు నాక్రమింపుడని కేపుకాలనీ రాజ్యములోని బ్రిటీషుగవర్నరాజ్ఞయిచ్చెను యుద్ధసన్నాహములు జరిగెను. బ్రిటీషుసేనలు నేటాలుపై కరిగెను. వానిలో నొకయంశము బో

యరులచేతనె యోడింపఁబడెను. అది యొక బోయరుల గుంపు లోఁ జిక్కుపడెను బ్రిటీషుసైనికులు తమకందకములందు దాగి యుండిరి. అంతట 1842 సం॥ జూన్ 25 తేదీన సైన్యములు బ్రిటీషుసైనికులకు సాహాయ్యముగ వచ్చెను. బోయరులు ముట్టడిని మానిరి. వలసకేగిన ప్రజలును బ్రిటీషు ప్రజలేయను సిద్ధాంతమును ప్రకటించి బ్రిటీషుపాలనము ప్రకటింపసాగిరి. అంతట బోయరు లాప్రదేశమును విడిచి యింకను దూరముగ పోవసాగిరి. పశ్చిమముగ 'డ్రాకిన్సుబర్గు' కొండలుదాటి బ్రిటీషువారింకను క్రాంతింపని ప్రదేశములో విడిసిరి. 3 సంవత్సరములలో నేటాలున బ్రిటీషుప్రభుత్వము పూర్తిగ సాపింపబడెను.

## అయిదవప్రకరణము.

### కేపుకాలనీ - నేటాలు రాజ్యములు.

కాఫ్రేరియా:—బ్రిటీషువారు కేపుకాలనీకి 18[illegible] సర్ జార్జిగ్రేగారిని గవర్నరుగబంపిరి ఇతనికాలమున నొకవింతజరిగెను అగ్రమున బ్రిటీషువారి దక్షతలో వారిప్రోత్సాహమున కాఫరులు నివసించిరి కాఫ్రేరియాలో ఖోసా తెగవారుండిరి. ఆదిమవాసులనాయకులే యచ్చటివారిని పరిపాలించుచుండిరి. కాని బ్రిటీషువారు వారిని కనిపెట్టిచూచుటకు కేపు



బెచూనాదేశము
ప్రొటెక్టరేటు
పోర్టుఎలిజబెత్
గ్రేటుఫిష్‌నది
కింగ్‌విలియమ్సుటవున్
కెయినది
ఉంటాబూనది
గ్రాహామ్సుటవున్
డర్బన్
పీటర్‌మారిట్జుబర్గ

## "దక్షిణాఫ్రికా సమితి" పటములోని అంకెల భావసూచిక.

1 మెఫెకింగ్ (Mafeking) పట్టణము. దీనికిని జోహానసుబర్గునకును మధ్య విట్ వాటర్సురాండ్ అను పర్వతములున్నవి

2 పోచెఫ్‌స్ట్రూం (Pochef stroom) పట్టణము.

3 స్టాండర్టన్ (Standerton) పట్టణము. చార్లెసుటవునుండి ఇక్కడికి వచ్చు దారిలో వోక్సురస్టు (Volks rust) పాంఫోర్డు (Palmford) పార్డెబర్గు (Pardeberg) పట్టణములున్నవి, ఇచ్చటనుండి జోహానసుబర్గుకు పోవుదారిలో గ్రేలింగ్‌స్టాడ్ (Grayling stad) బాల్ఫర్ (Balfour) హీడల్‌బర్గు (Heidelberg) పట్టణములున్నవి.

4 లెయింగ్స్‌నెక్. (Laings Nek) దీనికి తూర్పుగ యుట్రెక్టు (Utrecht వ్రైహీడ్ (Vryheid)ను కలవు.

5 న్యూకాసిల్ (New Castle) పట్టణము. దీనికి దక్షిణముగ దండీపట్టణమున్నది.

6 రోర్క్సుడ్రిఫ్టు (Rorkes Drift) 7. ఉలుండి (Ulundi) 8. కోలెన్సో (Colenso) పట్టణములు

9 హారిస్మిత్ (Harrismith) 10 బెత్లెహేం (Bethlehem) పట్టణములు

11 డ్రాకెన్సుబర్గు పర్వతములు. (Drakensberg) ఇచ్చటనుండి బసూటో ఆరెంజి దేశముల తూర్పు సరిహద్దున ఉత్తరముగ స్వాజి దేశము వరకును వ్యాపించియున్నవి. (పర్వతములు నదులు పటము చూడుడు)

12 ఉంటాటా. (Umtata) ఉంటాటా నదీతీరముననున్న పట్టణము. ఈ ప్రాంత దేశమే కాఫ్రేరియా.

13 గ్రాఫ్‌రీనెట్ (Graaf Reinet). పట్టణము.

14 కోలెస్‌బర్గు (Colesberg) పట్టణము. ఇక్కడనుండి జోహానసుబర్గుకు ఇనుపదారిపోవుచున్నది. దీనికి పడమరగనున్న డీ ఆర్ (De Aar) అను జంక్షన్ కేపుటవునుండి కింబర్లీ మెఫెకింగులకు పోవు ఇనుపదారికిని పోర్టు ఎలిజబెత్ గ్రాహమ్సుటవున్‌నుండి పశ్చిమోత్తరముగ పొదలవారిదేశమునకు పోవు ఇనుపదారికిని కేంద్రస్థానము.

15 స్మిత్‌ఫీల్డు (Smith field) పట్టణము. దీనికుత్తరముగనె జాగర్సుఫాంటీన్ (Jagers fontien) గనులున్నవి.

16 గ్రీక్వాటవున్ (Griqua Town) దీనికి నైరుతిప్రదేశమున ఆరెంజి నదికి దక్షిణమున పొదలవారిదేశమున్నది. కింగ్ విలియమ్సు టవునకు దక్షిణముగ తూర్పులండన్ (East London) అను రేవుపట్టణమున్నది.

కాలనీగవర్నరునే "హైకమీషనరు" లేక పాలకప్రతినిధిగ నియమించియుండిరి. సర్ జార్జి గ్రేగారు అనుభవశాలి. బ్రిటీషుపతాకముక్రింద చిన్నచిన్న రాజ్యములనెల్ల చేర్పదలచెను గాని చుట్టుప్రక్కల వారి వ్యవహారములందు ప్రసక్తిచేసికొనవలదని బ్రిటీషువారనియుండిరి. గవర్నరగు గ్రే తనదేశములోని ఆదిమవాసులందు నాగరకతగలిగింప ప్రయత్నించెను. ప్రజలీపద్ధతుల ననుమానముతో చూచిరి. బ్రిటీషువారు చేసిన సంస్కరణములెల్ల వారికి రోతగనుండెను. ప్రజలలో ముఖ్యముగ ఆదిమవాసులలో తెల్లవారిని వదలించుకొనుట యెట్లాయను యోచనప్రబలెను. నల్లవారగు ఆదిమవాసులు తమదేశమును పోగొట్టుకొని దీనులైరి. కాఫ్రియాలోని క్షోసాలు కాఫరుజాతివారే. అక్కడ కాఫరులతోనే కాఫరుయుద్ధము జరిగియుండెను. కాఫరులు పాశ్చాత్యుల నేవగించుకొనిరి. బ్రిటీషుసరిహద్దునకు దూరమున నొకదీర్ఘదర్శి దివ్యదృష్టికలవాడనని వింతసంగతులు చెప్పుచుండెను (Umhlakaza) "ఉమ్లకాజా"యని అతనిపేరు. అతడును అతని చిన్ని మేనకోడలు (Nong Kause) "నోంగ్ కాజ్"ను కీర్తిశేషులయిన క్షోసాతెగవారి పితృదేవతలతో మాటాడ గలుగుచున్నామనియు వారి సువార్త వారితెగకు బోధించుచున్నామనియు చెప్పుచుండిరి. కొలదికాలములో తెల్లవారి నంతమొందింప వచ్చుననియు, ఆ సుదినము వచ్చినప్పుడు పితృదేవతలెల్లరు దిగివచ్చి

తమ తెగకు విజయము చేకూర్తురనియు అంతట భరతఖండమం దలి రామరాజ్యము నందువలె పాడిపంట లధికమగుననియు, అంతవఱకు దేవపితృతృప్తికొఱకు పశువులను వధింపవలెననియు పంటలను మంటపెట్టవలయుననియు అతఁడు బోధించెను. క్సోసా తెగనాయకు లీబోధనముల నాదరించి ఆచరించిరి. ఆ తెగలకు వీరావేశము హెచ్చెను. ఈ పిచ్చిభ్రమలో మునిగి పోయిరి. 1857 లో నాశనమైన పశువులకు పంటలకు మేర లేదు. తెగల వారెవ్వరును సైన్యములను సిద్ధపరుప లేదు. దేవుఁడే ఒక్క బ్రిటిష్వానును పంపునని తలంచిరి. ఆది నము వచ్చినది. ఒక్క గింజయైన మిగులలేదు. ఒక్క పశువైన మిగులలేదు. క్రొత్త పంటపండలేదు దేవలోకమునుండి పశువులు రాలేదు. పితృదేవతలును రాలేదు. అంతట నాసుదిన మింక కొన్నాళ్ళకు వచ్చుననువార్త వ్యాపించెను. ఈ వెఱ్ఱి, భ్రమము తీవ్రమగు నమ్మకయు హెచ్చుచుండగ సైన్యము లుకూడుటయు తెల్లవారిపైఁ బడుటయు నసంభవము. తినుబండారములకొరకు ఏదైన దొరికిన చాలునని ఒకరితో నొకరు పోరాడుకొనిరి కడుపున బాధపడలేక సరిహద్దులను దాటి కడుపులు కొట్టుకొనుచు బయలుదేరిరి. దేశమున తెల్లవారు సేకరించియుంచిన ఆహారములు చాలలేదు. 30000 మందికి అధికసంఖ్యగల నల్లవారు భీకరమగుదారిద్ర్యమున తిండిలేక మరణించిరి. 1857 సంవత్సరాదినుండిన కాఫ్రేరియాం జనసంఖ్యలో

ఆ సంవత్సరాంతమున మూడవవంతు మిగిలెను. కాఫరులు వదలిపోయిన నిర్జనభూములందు కేపుకాలనీ నుండి కొందఱు ప్రజలను తెచ్చి నెలకొల్పిరి కొందరింగ్లాండునుండి వచ్చి నెల కొనిరి. కొందరు జర్మనీనుండియు వలసవచ్చిరి. ఇందువలన నారాష్ట్రము స్వభావమె మారిపోయెను. 7 సంవత్సరములకు కాఫ్రేరియా కేపురాజ్యములో కలసిపోయెను ఇట్లు ఖోసాల దురదృష్టమున బ్రిటీషు పరిపాలనకు లాభము కలిగెను. బ్రిటీషు ప్రజలె దీనియందుండుటవలన సహజముగ దీనిని కేపు కాలనీలో కలుపుట మంచిదని తోచెను. అట్లు చేయవలసిన దని కేపుకాలనీ పార్లమెంటులో పలుపురు చెప్పిరిగాని వారు వినలేదు. ఎట్టకేలకు బ్రిటీషు పార్లమెంటువారె ఒక సమ్మే ళనచట్టము (Act of Union) ను చేసిరి. కొంతకాలము లో పుగ కేపు పార్లమెంటువారే కాఫ్రేరియాను కలుపుకొననిచో నీచట్టమువలన సమ్మేళన చేయబడునని తీర్మానింప బడెను. అందువలన "గ్రే"గారి తరువాత వచ్చిన గవర్నరును హై కమీషనరు నగు సర్ ఫిలిఫ్ వుడ్ హౌస్ దీనివికింగ్ విలియ మ్సటవున్, తూర్పు లండను ఫిర్కాలుగ కేపురాజ్యమున కలుపుటకు చిత్తుచట్టమును ప్రవేశపెట్టగ నది 1865 లో శాస నమయ్యెను కాఫ్రేరియా కేపురాజ్యమున గలసెను.

బెచునా దేశము:-గ్రిక్వాదేశము కేపురాజ్యమున1880 లో కలుపబడెను. 1880 సంవత్సర ప్రాంతముననే బ్రిటీషు కేపుగ వర్నమెంటువా రూరకుండినందువలన జర్మనివారు

దక్షిణాఫ్రికాలో పశ్చిమమున అంగ్రాపెక్వెనాదగ్గర నొక చిన్న రాజ్యమును స్థాపించుకొనగలిగిరి. అంతట బ్రిటీషువారు మేల్కొనిరి. ట్రాన్సువాలుకు పశ్చిమమునను న్న బెచూనా దేశము మధ్యఆఫ్రికాలోనికి పోవుమార్గము అచ్చట సుప్రసిద్ధ మిషనరీ దేశద్రిమ్మరి డాక్టరు లివింగుస్టోను తిరుగుచు ఆ దేశమును స్వాధీనము చేసికొనుటకు బోయరులు చేసిన ప్రయత్నములను విఫలముచేసెను. అచ్చటి బంటూజాతులలో అంతఃకలహములు పెరిగెను. వారికి సహాయము చేయుటకు తెల్లవారు మెల్లగ వచ్చిరి. వచ్చి బెచూనాదేశమును కబళింప ప్రయత్నింపసాగిరి. బ్రిటీషువా రూరకున్న తరుణమున ట్రాన్సువాలు ప్రజాస్వామ్యాధ్యక్షుడగు క్రూగరు 1884 లో కల్లోలములు గలిగిన ప్రదేశమునందు ప్రజాస్వామ్య పరిపాలనమును బ్రకటించెను. బ్రిటీషు సామ్రాజ్యప్రభుత్వ మీప్రకటనము చెల్లదనెను. ఈలోపున కొంతమంది తెల్లవారు మెల్లగ నచ్చటచేరి చిన్నప్రజాస్వామ్యములను స్థాపించుకొనిరి అంతట నచ్చటిప్రజలను కాపాడుమని సర్ చార్లెస్ వారెన్ సేనానిని బ్రిటీషువారు పంపిరి. గోషెన్ ప్రజలు బ్రిటీషువారిని జూచి వెనుకకుపోయిరి. స్టెల్లాప్రజా స్వామ్యమువారు బ్రిటీషువారికి లోబడిరి. వారెన్‌కు యుద్ధము తటస్థింపలేదు. ఆ ప్రాంతమును 1885 సెప్టెంబరులో బ్రిటీషుప్రభుత్వ వలస రాజ్యము (Crown Colony)గ చేసిరి. ఆదేశము 5 జిల్లాలుగ

విభజించబడెను. వానిపరిపాలకుడు బ్రిటీషు హైకమీషన రుకు లోబడి పరిపాలించుచుండెను. వ్యవసాయము వృద్ధిచెం దెను. సైంధవలవణము తప్ప వేరు ఖనిజములు దొరకలేదు. కేపుటవును పోర్టు ఎలిజబెత్తు తూర్పులండన్ (East London) నుండి కింబర్లీకి పోయిన ఇనుపదారి నీప్రాంతములో వేసిరి, బెచూనా వలసరాజ్యమును బ్రిటీషు ప్రభుత్వమువారు కేపు కాలనీ రాజ్యమున 1895 సం॥లో కలిపివైచిరి.

కేపుకాలనీ రాజ్యపరిపాలనము:—1853 లో కేపు కాలనీరాజ్యాంగ నిర్మాణము చేయబడెను. బ్రిటీషుసామ్రాజ్య ప్రభుత్వమువారు కేపుకాలనీకి ప్రజాప్రతినిధ్య స్వపరిపాల నము నీయ నిశ్చయించి మార్చి 11 తారీఖున నట్లు ప్రకటిం చిరి. అందువలన రెండురాజ్యాంగ శాసనసభలు (అసెంబ్లీయు ను కౌన్సిలును) స్థాపింపబడెను. వీనికి సభ్యులనెన్నుకొను హ క్కులు ప్రజలకీయబడెను. "కవున్సిలు"లో మొదట 15 గురు సభ్యులుండిరి. తరువాత 26 గురు సభ్యులుండవచ్చుననిరి. ఎన్ని కలకు వీలగునట్లు దేశమును ఫిర్కాలుగ విభజించిరి. "అసెం బ్లీ"లో మొదట 46 సభ్యులుండిరి. తరువాత 107 సభ్యుల నెన్నుకొనవచ్చునని శాసించిరి. 5 సంవత్సరములు వారు సభ్య లుగనుండవచ్చును. 21 సంవత్సరముల వయస్సుగల బ్రిటిషు పౌరులలో 25 పౌనులవిలువగల ఇల్లుగాని భూమిగాని కలిగి యున్న వారికిని, వత్సరమునకు భోజనవసతిగాక 25 పౌనులవేత

సము7గాని, 50 పౌనుల వేతనమే కాని వచ్చువారికిని ఎన్నికహక్కులుండెను. తరువాత నీనియమములను మార్చిరి. 1892 లో చేవ్రాలును పైవిలాసమును వ్రాయగలిగి 75 పౌనుల విలువగల ఆస్తిగాని 50 పౌనుల వేతనముగాని ఉన్నవారికి ఎన్నికహక్కులీయబడెను. కేపుపార్లమెంటు (శాసనసభలు) 1854 సం॥లో మొదటిమారు కూడెను అప్పటినుండి విక్టోరియా మహారాజ్ఞిగారికి లోబడి శాసనములు చేయసాగెను. జూను మొదలు ఆగస్టునెల తుదివరకు ప్రతిసంవత్సరమును పార్లమెంటు కేపుటవునులో కూడుచుండెను. ఈపరిపాలనాపద్ధతి ప్రజలకు తృప్తికలిగించెను. గవర్నరును ఆయన కార్యనిర్వాహక సంఘములోని పెద్దఉద్యోగులును ఇంగ్లాండునుండియే పంపబడుచుండిరి. వీరు బ్రిటీషువలసరాజ్యాంగమంత్రి (Secretary of State for Colonies) గారి యిష్టప్రకారము నియమింపబడుచుండిరి. వారే ప్రభుత్వచట్టములను చేసి పార్లమెంటులో పెట్టుచుండిరి. వారు పార్లమెంటులో సమ్మతినిచ్చుటకు అర్హులుకాకపోయినను అన్నివిషయములను చర్చించుచుండుదురు. 18 సంవత్సరములైన తరువాత 1872 లో బాధ్యతాయుత స్వపరిపాలనము కేపుకాలనీకి ప్రసాదింపబడెను. అప్పుడు పార్లమెంటులో అధికసంఖ్యాకులగు కక్షిలోనిముఖ్యులనే కార్యనిర్వాహకసంఘసభ్యులుగ నియమించుపద్ధతి వచ్చెను. ఈమంత్రులు వలసకార్యదర్శి, కోశాధిపతి, అటర్నీజనరల్, నేటీవుల

కార్యదర్శియని వ్యవహరింపబడిరి. తరువాత వ్యవసాయకార్యదర్శియు నియమింపబడెను. వీరిలో నొకనిని ప్రధానమంత్రిగ నియమించిరి. ఏపనులుచూచినను చూడకపోయినను ముఖ్యమంత్రి నలుపురంగు మిశ్రమజాతివారి వ్యవహారములు మాత్రము చూడవలసియుండెను. 1882 వరకును పార్లమెంటులో ఇంగ్లీషుభాషనే యుపయోగించుచుండిరి. న్యాయస్థానములయందును ప్రభుత్వకార్యస్థానములందు నంతియే. దేశములో 3/5 వంతు తెల్లవారును నలుపురంగుజాతివారెల్లరును డచ్చిభాషనే మాట్లాడుచుండుటవలన నిది అన్యాయముగతోచెను. అందువలన కొన్నాళ్ళకు పార్లమెంటువారిదిచూచి ఉభయభాషలు నుపయోగించవచ్చుననిరి. ఈభాషలు రెండును బాగుగరానివారికి నుద్యోగములిచ్చుచుండిరి. బ్రిటీషువారు దక్షిణాఫ్రికాలోని ఇతరరాజ్యములను మెల్లగకలుపుకొనుచున్నందున వానిని పరిపాలించుటకు కేపు గవర్నరునే హైకమీషనరుగ నేర్పరచిరి.

అభివృద్ధి :— కేపుకాలనీరాజ్యము స్వపరిపాలనాలాభములను పొందెను. రాకపోకలకు మార్గములేర్పరచుట యత్యావశ్యకమని 1874 సం॥రం లో అయోమార్గములను నలుగడల వేసిరి. కేపుటవును మొదలు వెల్లింగ్టను వరకు నుండిన అయోమార్గమును పడమరబ్యూఫోర్టు (Beaufort West) వరకును పోర్టు ఎలిజబెత్తు రేవుదగ్గరనుండి గ్రాఫ్‌రీనెట్

(Graaf Reinet) వరకును పాదలవారి నదివరకును తూర్పులండన్ దగ్గరనుండి క్వీన్సుటవున్ (Queenstown) వరకును వృద్ధిచేసిరి. 'టేబిలుబే'లోను తూర్పులండన్‌లోను నౌకాశ్రయములుకట్టిరి. సముద్రతంతి కార్యస్థానముల నేర్పరచి ఏడెన్ (Aden) తో తంతివార్తలను సాగించిరి. విద్య యభివృద్ధిచేయబడెను. 1873 లో గుడ్‌హోపు విశ్వవిద్యాలయము స్థాపింపబడెను. ఉష్ట్రపక్షులను పెంచి వాని యీకల నెగుమతిచేయు వర్తకము సాగెను. గ్రిక్వాదేశమును బెచూనాదేశమును ఇతర భాగములను కేపులో కలుపగ కేపుకాలనీరాజ్య మభివృద్ధిచెందెను. ఈ రాజ్యము 276565 చ॥ మైళ్ళవైశాల్యము కలిగినదయ్యెను. మెరినోగొఱ్ఱెలను అంగోరామేకలను కారూ ఎడారి ప్రాంతములనుండు బయళ్ళలో పెంచుచుండిరి. దీనిదిగువ ఆరెంజి భూములలో గొఱ్ఱెలను పశువులను పెంచిరి. జాక్ (Zak) నదీప్రాంతభూములు సారవంతములై నవధాన్యముల కిరవులయ్యెను. దక్షిణతీరభూములలో వ్యవసాయ మభివృద్ధిజెందెను. గోధుమ మొక్కజొన్న బాగుగపండెను. మొదట పెంచుచుండిన ద్రాక్షతోటలను మానుకొనిరి. ఓటు, బార్లీ ధాన్యములు పండెను. నైరుతీ ప్రదేశమున గోధుమ ఫలవృక్షములు ద్రాక్ష లమితముగ పెరిగెను. ఉత్తరముగనున్న రత్నగనులెల్ల కేపురాజ్యములో కలిపిరి. 1852 లో రాగిగనులు చిన్ననమక్వాదేశమున గనబడగ ప్రజలచ్చటిగనులుత్రవ్వి లాభ

ము పొందసాగిరి. సైంధవలవణము, బొగ్గుగనులు, కేపులోనుండెను. మృగములచర్మములవర్తక మభివృద్ధి జెందెను. కీటకములబాధ యధికముగనుండెను. పశువులరోగములు అధికములైనవి. కాలనీలోని బంటూలలో కొంతమంది క్రైస్తవులైరి. పాశ్చాత్య క్రైస్తవసంఘము లీపనిని చేసెను. ఈ రాజ్యమున బానిసలు హాట్టెంటాటులు మిశ్రమజాతులుకూడ క్రైస్తవాచార్యులవలన మతోపదేశమును పొందిరి. పాశ్చాత్యపద్ధతులనె జను లెల్ల రనుకరించుట నేర్చికొనిరి. వీరు రక్షకులుగ పనిచేసిరి. పట్టణములందును పనులు చేసిరి. కాని వీరు నిలుకడగపనిచేయరైరి. ఆసియావా రనునొకజాతి కాలనీలో వృద్ధియయ్యెను పూర్వము డచ్చిసుగంధద్వీపులనుండి డచ్చివారంపిన రాజకీయఖైదీల సంతతివారును వారిపరివారజనములును కొందరుండిరి. వీరు మలయప్రజలు (Malays). వీరిలో చాలమంది మహమ్మదీయులైరి. ఇతరజాతులతో కలిసి వీరిలో చాలమంది మిశ్రమజాతులైరి. తెల్లవారికిని ఆదిమవాసులకును పుట్టినవలుపురంగు మిశ్రమజాతులకన్న వీరు నాగరకులు. వీరు కేపుకాలనీలోని పట్టణములందె వసించిరి. భారతీయులుకొందరుకూడ నీదేశమునకువలసవచ్చిరి. కేపుకాలనీలో తెల్లవా కూడ చాలమంది విద్యావిహీనులుగ. నుండుటవలన క్రైస్తవగురువులు వీరికిని నలుపురంగు జాతివారికిని చదువుచెప్పుచుండిరి. తరువాత 1910 నాటికి విద్య యభివృద్ధిజెంది పాఠశాల లేర్పరుపబడెను. ధర్మపరిపాలనము జాగ్ర

త్తగచేసిరి. 100 మంది మెజస్ట్రేటు లేర్పరుపబడిరి. గ్రాహంస్ టవును కింబర్లే కేపుటవునులలో సుప్రీముకోర్టు న్యాయాధిపతులు న్యాయసభలు చేయుచుండిరి. స్థానికస్వపరిపాలన మభివృద్ధి జెందెను. కేపురాజ్య తీరములందు మార్గసూచక దీపస్తంభముల (Light Houses) నిర్మించి గొప్ప హార్బరులను నిర్మించిరి. ఐరోపాతోకూడసముద్రతంతి నేర్పరచుకొనిరి ఐరోపాకు ప్రతివారమును జాబులను గొంపోవుటకు ధూమనౌకలు పోవుచుండెను. 1897-1902 లో బ్రిటీషువారికిని బోయరులకును జరిగిన యుద్ధమువలన కేపుకాలనీకి చాలనష్టము కలిగెను. ఋణము వృద్ధియయ్యెను. మునిసిపాలిటీవారు పన్నులు హెచ్చుచేసిరి. ప్రభుత్వమువారును పన్నులధికము చేసిరి. కానిపరిస్థితులు మెల్లగ బాగుపడెను. పంటలువృద్ధియయ్యెను. ట్రాన్సువాలులోని బంగారు గనుల లాభము వృద్ధియై కేపుకాలనీ వాణిజ్యము నభివృద్ధి జేసెను. అందువలన కేపుకాలనీరాజ్యము ధనవంతమై వైభవముగ నున్నది.

## నే టా లు.

1848 సంవత్సరప్రాంతమున నేటాలు బ్రిటీషువారివశమైనది. అయినను బ్రిటీషువారుకాని తెల్లవారుకాని అధికసంఖ్యాకులుండరైరి. 'పండాకు' భయపడివచ్చిన బంటూకాఫరులచ్చటికిచేరి బ్రిటీషువారి పాలనమున నెలకొనిరి. కొందరు క్రైస్తవగురువులు వీరి మధ్యవిడిసి మతమును బోధింపసాగిరి.

బంటూప్రజలు శీఘ్రముగ వృద్ధియయిరి. తెల్లవారినల్లవారిమధ్య నుండుటకు ఇష్టపడలేదు. 1848-51 సం॥ ల మధ్య 4, 5 వేలు మాత్రమే తెల్లవారుండిరి. 1872సంవత్సరమునకు ఉత్తరమున కొండప్రదేశమందలి డచ్చి కుటుంబములతో 19 వేలమంది మాత్రమె యుండిరి. బంటూవారిపాశ్చాత్యులకు ఎట్టిబాధను కలిగింపలేదు. 1878 వరకు నిట్లు జరిగినది.

1848 లో జూలూదేశమునుండి హ్లూబీతెగవారు కొంతమంది డ్రాకెన్సుబర్గుదగ్గరకు వచ్చి నెలకొనియుండిరి. ఛాకా యుద్ధమున హ్లూబీతెగవారు చాలమంది మడసియుండిరి. వీరిలో పోగామిగిలినవారును వీరినాయకుడు 'లంగాలిబాలేలే' (ప్రకాశించుసూర్యుడు) యు నేటాలులో తలదాచికొని యుండిరి. బ్రిటీషువారు వీరికొరకు కొన్నిచట్టములు చెసియుండిరి. తుపాకులుంచుకొనిన బంటూజాతివారెల్లరును తమపేర్లనుతెలిపి లైసెన్సులుపొంది రిజష్టరుచేయించుకోవలెనని శాసించిరి 'లంగాలిబాలేలే' లేక 'లంగా' తనతెగవారిని వజ్రపుగనులకుపోనిచ్చెను. అట్లుపోయినవారు ధనముగడించి తుపాకులనుకొని మరల వచ్చుచుండిరి. లంగాయొక్కప్రజలు చట్టమునకు వ్యతిరేకముగ తుపాకులుచేర్చుచుండిరి. బ్రిటీషువారు లంగానుపిలిచి కారణముచెప్పుమనిరి. కాని అతడు ఏమియు చెప్పక కాలయాపనముచేయుచుండెను. బ్రిటీషువారి పాలనమునుండి వెలువడుటకు లంగా ప్రయత్నించుచుండెను. అం

తట పీరతనిపైకి సైన్యమంపిరి. అందులో కొంత భాగము లంగా సైనికుల చేజిక్కెను. అం దారుగురు మడిసిరి. దీనివలన నితరులును తిరుగుబాటు చేయుదురను తలంపుకలిగెను. తెల్లవారి బాహుబలపరాక్రమము నొకమారు ప్రదర్శించినగాని మాటదక్కదని తలచిరి. బోయరుప్రభుత్వముకూడ సాహాయ్యము చేసెదమని వాగ్దానము జేసెను. అంతట కేపుకాలనీరాజ్యము ముందంజవైచెను. లంగా తనకు బసూటోలు సాహాయ్యము చేయుదురని తలచెను కాని తుద కతనిని బ్రిటీషుసైన్యములు పట్టుకొనగ అతడు లొంగిపోయెను. అతని సైన్యములు చెల్లాచెదరయ్యెను. అతనినీరాజ్యమునుండి తీసికొనిపోయి విచారించి 12 సంవత్సరములు చెఱసాలలోనుంచిరి. అతని తెగను చెదరగొట్టిరి వారిదేశములో క్రొత్తగవలనవచ్చిన తెల్లవారిని నెలకొల్పిరి. లంగాయొక్క యుద్ధమువలన నేటీవులస్థితి కొంచెము బాగుపడెను. బ్రిటీషువారు బంటూధర్మశాస్త్రముననే పరిపాలించిరి. ఒకనేటీవుహైకోర్టుస్థాపించిరి. వివాహములపైన విధింపబడినపన్ను తీసివేసిరి. గుడిసెలమీద పన్నుమాత్రము వత్సరమునకు 14 షిల్లింగులు హెచ్చుచేయబడెను.

జూలూ దేశము:—

దక్షిణాఫ్రికాను బ్రిటీషు సంయుక్త రాష్ట్రముగ చేయుమని పలువురు కోరుటవలన అట్లుచేయుటకు బ్రిటీషు ప్రధానమంత్రి డిజ్రేలీ 1877 లో బార్టిల్ ఫ్రేరును కేపు.

కాలనీ గవర్నరుగ నంపియుండెను. కాని అతడు వచ్చినం తనే దేశములోని జాతుల సంగతి విమర్శించుట ముఖ్య మయ్యెను. కాఫరులు తిరుగుబాటు చేయుటకు సిద్ధమైరి. అతడు తగిన జాగ్రత్తపుచ్చుకొనుటవలన వారిప్రయత్నము విఫల మయ్యెను. అయినను నేటాలునకు దూరముగనుండిన జూలూలు తమ ముఖ్యపట్టణమగు 'ఉలుండి'నుండి వచ్చిపడుటకు ప్రయత్నించుచుండిరి. 'డింగానా' తదనంతరము 'పండా' రాజయ్యెను. అతడు సోమరి. అతని తరువాత ఆతని కుమారుడు 'కేచ్వాయో' (Ketshwayo) రాజయ్యెను అతడుచాల పరాక్రమశాలి. అతఁడు సైన్యములను బాగుగ శిక్షచేయసాగెను. ఇతనికిని దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యమునకును విరోధము రగులుకొనుచుండెను ఈకలహముదీర్చి వ్యవహారము తీర్మానించుటకు 1878 లో ఫ్రేరు గవర్నరు మధ్యస్థుడయ్యెను. ఆతని తీర్పు జూలూల కనుకూలముగానే యుండెను కాని వారి దౌర్జన్యమునకు మేరలేనట్లుండెను. వారు బ్రిటీషువారిని తిరస్కరించిరి. అందువలన నీతీర్పును 'కేచ్వాయో' కి పంపుచు అతనిసైనికులు కావించిన నష్టమునకు పరిహారమిచ్చి సైన్యమును తీసివైచి అతని ముఖ్యపట్టణమున ఆంగ్లరాయబారినొకని నుంచికొనుట కంగీకరించనిచో యుద్ధమని ప్రకటించిరి. ఈపద్ధతుల కతడు ప్రత్యుత్తరమంపలేదు. కేచ్వాయో దాడి వెడలి వచ్చినచో నేటాలులోని బంటూతెగ వారును తిరుగు

బాటు చేయుదురని స్పష్టమయ్యెను. అందువలన ముందుగ బ్రిటీషువారే అతనిని తాఱ్కొనుట మంచిదని ఫ్రేరుతలచి మూడు పటాలములను పంపించెను. రెండు పటాలము లతని సైన్యముతో పోరుచు నడువగలిగెను. కాని ఒకపటాల మతనిచేత జిక్కెను. అందువలన తక్కిన రెండు పటాలములు నాగి ఆత్మరక్షణను చేసి కొనుచుండెను. ఛెలమ్సుఫోర్డు ప్రభువు యొక్క ఆధిపత్యమున ముఖ్య పటాలము 'ఈశాండ్ ల్వానా' (Ishandlwana) పైకి వెడలెను. కొన్నిగుంపులు మాత్రము వెనుకదారిని రక్షించుచుండిరి. ఛెలమ్సుఫోర్డు (Chelmsford) 1300 సైన్యము నొక చోటనుంచి ఒక తెగను ముట్టడింపబోయెను. ఇంతలో నొక జూలూసైన్యము 15000 బలము కలది ఛెలమ్సుఫోర్డును తప్పించుకొని వచ్చిపడి దానిని నాశనము చేసెను. తరువాత నేటాలుపైన పడుటకు పోవుచుండగ కాపుగ నుంచబడిన120 మంది 'రోర్కెస్ డ్రిఫ్టు' చెంత ప్రాణములకు తెగించి పోరాడిరి. చార్డ్, బ్రూముహెడ్ ల నాయకత్వముక్రింద 4000 మంది నాటంకపరచిరి.

బ్రిటీషువారి సైన్యములకట్లు కొంచెమాటంకము కలిగెనుగాని శీఘ్రముగనె వెనుకనుండి సాహాయ్యమునకు సైన్యములువచ్చెను. 'ఈశాండ్ ల్వానా' తరువాత6నెలలలో ఛెలమ్సుఫోర్డ్ 'కేచ్ వాయో' సైన్యములను 'ఉలుండి' దగ్గిరనుండి చెదరగొట్టగలిగెను. అంతట కేచ్ వాయో పరా

అయి పట్టుబడెను. అతనిని 1883 వరకును చెరసాలలోనుంచిరి. తరువాత నితని నొకచోటనుంచిరి. జూలూదేశమును బ్రిటీషువారు పరిపాలింప ప్రయత్నించి విఫలులై కేచ్ వాయోనే 1883 లో తమకు సామంతరాజుగ చేసిరి. అతనికి నింకొకనికి యుద్ధమువచ్చెను. రాజ్యమునకు తగవులాడిరి. ఒక సంవత్సరమున కితడు చనిపోయెను. అంతట ట్రాన్సువాలునకు '(ఫ్రైహీడ్' దేశమునిచ్చి కేచ్ వాయో కుమారుడు 'డినిజూలూ' వారి సాహాయ్యమున నాయకు డయ్యెను. కుట్రి లధికమయ్యెను. 1887 లో బ్రిటీషువారు నేటాలు గవర్నరును జూలూదేశమును పరిపాలింప నియోగించిరి. అంతట 'డినిజూలూ' కుట్రిచేసెను. అంతట 1880 లో బ్రిటీషువా రితనిని ద్వీపాంతరమునకు బంపిరి 1897 లో జూలూదేశము నేటాలులో కలుపబడెను. తరువాత డినిజూలూను 500 పౌనుల వేతనముతో ఎట్షోవే (Etshowe) లో నుంచిరి.

1906 సంవత్సరమున వచ్చిన జూలూ పితూరీలో నితడు కుట్రలు చేసినట్లు అనుమానముకలిగి న్యాయస్థానమున విచారించిరి 1907 డిశంబరునుండి 4 సంవత్సరముల శిక్ష 100 పౌనులు అపరాధము విధింపబడెను. తరువాత నతడొకచిన్నభూమిలో కాపురముండి 1913 లో చనిపోయెను. బ్రిటీషు దళమొకటి శత్రువుల చేతజిక్కి నాశమొందుటవలన ఫ్రేరుచేసిన

దంతయు పొరపాటైయని ఇంగ్లాండులో కొందరనిరి. 1881 లో ఆయనను వెనుకకు రమ్మనిరి.

అభివృద్ధి; పరిపాలనము:— నేటాలు ఫలవంతమై వాణిజ్య వ్యవసాయములందు అభివృద్ధి జెందెను. మొక్కజొన్న బాగుగ ఫలించుచుండెను. చెఱకుతోటలు వృద్ధియయ్యెను. తిమింగిలచేప వర్తకము సాగెను మారిట్జుబర్గు పట్టణమును డర్బను పట్టణమును ప్రఖ్యాతిజెందెను. వార్తాపత్రికలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు వివిధమతముల క్రైస్తవాలయములు వెలసెను. విద్యయభివృద్ధిజెందెను. డర్బను రేవుపట్టణముగ ప్రఖ్యాతిజెందెను. రైల్వే సరుకులను డర్బనుకు అన్నివైపులనుండి తెచ్చిపడవైచుచుండెను. నేటాలును కలుపుకొన్న తరువాత కొంతకాలమువరకును అది కేపుకాలనీరాజ్యమునకు లోకువరాష్ట్రముగ నెంచబడుచుండెను దీనికిని కేపుపార్లమెంటువారే చట్టములు చేయుచుండిరి. తరువాత నేటాలును విడదీసి ఒకసాహాయ్యక పరిపాలకులని (Lieutenant Governor) క్రిందనుంచి ఒకశాసన సభను నిర్మించిరి. ఇందెల్లరు యుద్యోగులైయుండిరి. బ్రిటీషు దక్షిణాఫ్రికాలోని ఇతర రాజ్యములకు సామ్రాజ్యపరిపాలక ప్రతినిధి (హైకమీషనరు) కే నేటాలు పరిపాలన మందింకను అధికారము లెల్ల నుండెను. కేపుకాలనీ గవర్నరె హైకమీషనరు. 1856 లో మహారాజ్ఞి గారు నేటాలులో ప్రజాప్రతినిధులశాసనసభను స్థాపించెను.

1873 లో నియమింపబడిన సభ్యులధికముగ చేయబడిరి కాని మఱల ఎన్నుకొను బడువారి సంఖ్యనె అధికముగ చేసిరి. నేటాలు చాల సారవంతమైన భూమియైనను దానిని సాగుచేయు కర్షకులు తక్కువగ నుండిరి. తెల్లవారి వ్యవసాయము పనులను తోటల పనులను బంటూ కూలివని వారు చేయుచుండిరి. బంటూలు సోమరులును నిలుకడలేని వారునగుట రైతులకు నష్టము కలుగు చుండెను అందువలన నేటాలువారు కూలిపని చేయువారిని హిందూదేశమునుండి దిగుమతి చేసిరి. అంతట భారతీయ వర్తకులును వచ్చిరి క్రొత్తవారు వచ్చి చౌకగ వ్యాపారము చేయుటవలన తెల్లవారికి కోపము వచ్చెను. ఇదియుగాక భారతీయులు నల్లవారనియు అనాగరకులనియు తెల్లవారు వారిని ఏవగించుకొని బాధలు పెట్టసాగిరి ఇది తీవ్రసమస్యగ పరిణమించెను. నేటాలులో భారతీయులు చాలమంది వచ్చిచేరిరి. డర్బన్ పట్టణమున భారతీయులు చాలమంది యుండిరి. డర్బన్ రేవు నభివృద్ధిచేసి ఒక (హార్బరు) నౌకాశ్రయమును గట్టిరి. డర్బనునుండి ట్రాన్సువాలు ఆరెంజి దేశములలోనికి ఇనుపదారిని వేసిరి. ఇనుపదారి పోయిన డ్రాకెన్సు బర్గుకొండ బయళ్ళలో బొగ్గుగనులు కనబడెను. ఈబొగ్గు నెగుమతి చేయసాగిరి. నేటాలుచుట్టుప్రక్కల నున్నటోంగా దేశము, జూలూదేశము, యుట్రెక్టు (Utrecht) వ్రైహీడ్ (Vryheid) ను కూడ బ్రి

టీషువారు నేటాలులో చేర్చిరి. 1910 నాటికి నేటాలు 36173 చదరపుమైళ్ళ వైశాల్యము కలిగినదయ్యెను.

1897 లో బాధ్యతాయుత ప్రజాప్రాతినిధ్యప్రభుత్వ పరిపాలనము (Responsible Government) దయచేయబడెను. 11 గురుసభ్యులుకల కవున్సిల్ అను శాసనసభ వచ్చెను. సభ్యులను గవర్నరే నియమించెను. అచ్చటి బంటూ వారి క్షేమమును కాపాడుట యతని కర్తవ్యమగుటవలన వారికొరకు తెల్ల సభ్యులను నియమించెను. వీరు 10 సంవత్సరములు సభ్యులుగ నుందురు. ఇదిగాక అసెంబ్లీయను శాసనసభయుండెను. ఇందు 37 గురుసభ్యు లెన్నుకొనబడుచుండిరి. వీరు 4 సంవత్సరములు సభ్యులుగ నుందురు. ఎన్నికహక్కులు కేపుకాలనీ రాజ్యమునందువలె లేవు. భారతీయులు ప్రజాప్రాతినిధ్యము లేని దేశమునుండి వచ్చిరిగాన వారికి యెన్నిక హక్కు లివ్వమనిరి. భారతీయులును బంటూలును కాని ఇతర బ్రిటీషు పౌరులకు 50 పౌనుల ఆస్తికలవారికిని 10 పౌనుల వేతనము వచ్చువారికిని ఎన్నిక హక్కులివ్వబడెను. తెల్లవారివలెనే జీవించుచుండిన మిశ్రమ జాతి మనుష్యులకు సమ్మతులనిచ్చు హక్కునిచ్చిరి. బంటూలకుఆస్తియు విద్యయునున్నను, గవర్నరు ప్రత్యేకముగ నిచ్చినగాని యెన్నికహక్కులుండవు. గవర్నరు అట్లు ఇవ్వడు. 1899-1902 సం॥ వరకును బోయరు ప్రజాస్వామ్యముల యుద్ధమువలన ఆర్థికముగ కొంతనష్టము కలిగెను. 1905 లో గుడి

నెలవైన పన్నులిచ్చుకొను బంటూలుతప్ప తక్కినబంటూలును ఆసియా (భారతీయ) ప్రజలును ఐరోపాహారను 1 పౌను తల పన్ను నిచ్చుకొనవలెనని శాసింపబడెను. 1906 లో జూలూలు తిరుగుబాటు చేసిరి దీనిలోనె గాంధిమహాత్ముడును భారతీయులును స్వచ్ఛంద సేవకులుగ పనిచేసిరి జూలూలను అణచుటకు 90,0000 పౌనులు వ్యయమయ్యెను. చావగా మిగిలిన జూలూలలో చాలామందిని దేశాంతరముల కంపియు కఠిన శిక్షలు విధించియు అడచిరి.

---

## ఆరవప్రకరణము.

## బోయరు ప్రజాస్వామ్యములు.

బ్రిటీషు వారిరాజతంత్రము:—బ్రిటీషు రాజ్యమునకు సరిహద్దులలో చిన్నచిన్న పరరాజ్యములను కాపుకొలు కేర్పర చుపద్ధతిని బ్రిటీషువారు మొదలిడిరి. ఇందువలన తమకు రక్షణముండుటయెగాక దచ్చివలస ప్రజలకు వెనుకకు వచ్చుటకు మార్గములేకపోవుటవలన బుద్ధివచ్చునను నభిప్రాయము ఇంగ్లీషుప్రభువులకుండెను. బసూటోనాయకుండగు మోషేషును ఆరెంజినది కుత్తరముగ కాలిడోనది ప్రదేశములలో 'తాబా బోసిగో'కు రాజుగ 1843 లోనే అంగీకరించిరి మోషేషు రాజ్యమునకు పడమరప్రక్క నీయుద్దేశ్యముతోనే ఒక గ్రికా

రాజ్యమును నెలకొల్పిరి. దానికి రాజుగ 'ఆడంకాక్' అను నతని నియమించిరి. అయిన నీరెండుప్రదేశములలోను బోయరులును నెలకొనిరి. వారు బసూటో గ్రిక్వాపరిపాలనములకు లోబడియుండుట కంగీకరింపరైరి. అందువలన నీ రాజ్యములందు కల్లోలములుకలిగెను. బ్రిటీషువారి సహాయముతో ఆడంకాక్ బోయరులపట్ల నిరంకుశముగ ప్రవర్తించుచుండెను. బ్రిటీషువారు ప్రసక్తికలిగించుకొనగనె బోయరులు మెల్లమెల్లగ దూరదేశములకు పోవుట ప్రారంభించిరి. కొందఱు ప్రముఖులు ఇరువంకలవారికిని సంధికుదిర్చి ఆడంకాకు రాజ్యములో నొకభాగమున బ్రిటీషుగవర్నరు పరిపాలనమున బోయరుల నుండునట్లుచేసిరి. గ్రిక్వారాజుకు ఒకవిధముగు పన్ను నీయవలెను. ఇదియు నంత తృప్తికరముగలేదు. కొందరుమాత్ర మూరకొనిరి.

ఈలోపున కాఫరు సరిహద్దుదగ్గర పరిస్థితులు బాగుగలేవు. కాఫరులప్పుడప్పుడు దాడివెడలుచునె యుండిరి. అంతట 1846-47 లో నేడవకాఫరుయుద్ధము జరిగెను. ఈ యుద్ధమువలన చాలధనము వ్యయమయ్యెను. ఈయుద్ధమువలన నొక లాభము మాత్రము కలిగెను ఇంగ్లాండులోని మంత్రులు నిజమునుగ్రహించిరి. ఇతరులు చెప్పుమాటలను నమ్మి 6000 మైళ్లదూరమునుండి దక్షిణాఫ్రికాను పరిపాలించుట చాలపిచ్చిపనియనియు దేశముయొక్క పరిస్థితులనెరిగి

అచ్చటనే యున్న వారి సాహాయ్యముననె పరిపాలించుట శ్రేయస్కర మనియు తెలిసికొనిరి. సర్ హారిస్మిత్తును కేపు కాలనీరాజ్యమునకు గవర్నరుగ పంపిరి. ఇతఁడు పూర్వము దక్షిణాఫ్రికాలో సైనికోద్యోగిగనుండి అందరివలన మెప్పువడసెను. కేయినదికి దగ్గరనున్న కాఫరుదేశము 'బ్రిటీషు కాఫ్రేరియా' రాష్ట్రముగ చేయఁబడెను. దానిలోని తెగల నాయకులకు చాలవరకు హక్కులునిల్పియుంచబడెను. అచ్చటి ఆదిమవాసుల నాయకుల పరిపాలనమును కనిపెట్టిచూచుట కొక యుద్యోగిని నియమించిరి. తూర్పు గ్రిక్వారాజ్యమున నిమిత్తమాత్రముగ నప్పటికిని రాజుగనుండిన ఆడంకాకు రాజ్యాధికారబిరుదమును రద్దుచేసి. అతనికుపకారవేతనమిచ్చి యూరడించిరి. హారిస్మిత్తు 1848 సం॥ ఫిబ్రవరులో ఆరెంజివాలు నదుల మధ్యదేశమును బ్రిటీషుదేశముగ ప్రకటించి అచ్చట మేజర్ వార్డెనును పరిపాలకునిగ నియమించెను. ఆతడు బ్లూంఫాంటీను (Bloemfontien) లో తనకార్యస్థానము నేర్పరచికొనెను. అంతట ఉత్తరదేశములోని బోయరులు ప్రిటోరియను నాయకత్వమున వచ్చిపడి వార్డెను సేనానిని ఓడించిరి. అతడును సైనికులును వారికి లొంగిపోయిరి. అంతట హారిస్మిత్తు క్రొత్తసేనల నచ్చటికి పంపెను. ఈ సైన్యములు ప్రిటోరియసుయొక్క బోయరుపటాలమును బూంప్లాట్సు (Boom Platts) యుద్ధమున నోడించెను. అంతట బోయరు

లు "వాల్" నదినిదాటి వెడలిపోయిరి. వాల్ నది కావలిదేశమె ట్రాన్సువాలయ్యెను. 1850 లో కాఫరులు మరల బోయరులపైకి దాడి వెడలివచ్చిరి. ఇదియె 8వ కాఫరుయుద్ధము. రెండు సంవత్సరము లిరుకక్షులకు నెడతెగని పోరుకలిగెను. చాలమంది మడసిరి. తుదకు విసిగి వేసారి ఆదిమజాతులు బోయరులతో సంధి జేసికొనెను.

శాండ్ నది సంధి:—అట ఆరెంజిప్రాంతదేశములలోని బ్రిటీషుప్రభుత్వమునకు చెడ్డదినములువచ్చెను. బ్రిటీషువారిని సులభముగ పారదోలవచ్చునని మోషేషుకు తోచెను. చిన్నజాతులలో అంతఃకలహముల బురికొల్పెను. సామమువలననో దండోపాయమువలననో పనులు చక్కపెట్టవలసినదని హారీస్మిత్తు ఆప్రాంతముల పరిపాలకుడగు వార్డెనుతో చెప్పెను. మోషేషు ఇంతవరకునుచూపిన నమ్రభావమును మూలవెట్టి విజృంభించెను. ఆదేశములో కాపురముండియు బ్రిటీషుపాలనమన్న నిష్టములేని బోయరుప్రజలు మోషేషుతో నొకవిధముగ సంధిచేసికొని వాలునది కావలప్రక్క దేశములో ప్రిటోరియసు నాయకత్వముక్రింద స్వతంత్రముగనున్న బోయరులను తమకు సాహాయ్యముచేయుడని కోరిరి. బ్రిటీషువారి పరిపాలనమునకు విరోధియు బ్రిటీషువారికండ్లలో విప్లవకారుడునగు ఆండ్రియస్కు రాజతంత్రము నుపయోగించుటకు వీలుకలిగె

ను. తమబోయరు ప్రజాస్వామ్యముయొక్క స్వాతంత్ర్యము నంగీకరింపనిచో తానువారికి సాహాయ్యము చేయుదునని మేజరువార్డెనుకు కబురంపెను. ఇంతమంది యేకమైనచో తానేమియు చేయఁజాలనని వార్డెను భయపడెను. అతనికి సాహాయ్యము చేయుటకు కాఫరు యుద్ధమధ్యమందుండిన స్మిత్తుకు వీలు లేదయ్యెను. అందువలన కేపుకాలనీరాజ్యపుగవర్నరు చేయునదిలేక ఒకసభనుకూర్చెను. ట్రాన్సువాలుబోయరు ప్రజానాయకులును బ్రిటీషుసేనానులును 1852 సం|| జనేవరులో (Sand River Convention) శాండ్‌నదిసంధియను నొకసంధి చేసికొనిరి. అప్పటినుండి ట్రాన్సువాలు లేక దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యముయొక్క స్వాతంత్ర్యమును బ్రిటీషువారంగీకరించిరి.

బ్లూంఫాంటీన్ సంధి:—అప్పుడు స్మిత్తుకు బదులు క్యాతుకార్టు గవర్నరుగవచ్చెను. అతడు కాఫరు యుద్ధములనుండి వచ్చిన సైన్యములను తెచ్చి పరిపాలనమును కట్టుదిట్టముగ చేయసాగెను. మోషేషు సమయముమించిన కార్యము లేదనిలొంగిపోయెను. క్యాతుకార్టు ఇందులకుహర్షించి వెనుకకు మరలెను.అంతట ఇంగ్లాండుప్రభుత్వమువారు ఆరెంజినదిదేశములోని సార్వభౌమత్వపు బిరుదమును వదలుకొన నిశ్చయించిరి. (Bloemfontien) బ్లూంఫాంటీన్ లో 1859 సం|| ఫిబ్రవరు నెలలో నొక క్రొత్తసంధి జరిగెను. దానివలన డ్రాకెన్సు

బర్గుకు పడమర ఆరెంజి వాలు నదుల మధ్యగల దేశమున బోయరుల యొక్క ఆరెంజినది ప్రజాస్వామ్యమునకు సంపూర్ణ స్వాతంత్ర్యమును అంగీకరించిరి. ఇట్లు రెండు బోయరు ప్రజాస్వామ్యములు స్వతంత్రరాజ్యములుగ నంగీకరింపబడెను.

ఆరెంజినది ప్రజాస్వామ్య పరిపాలనము:—ఆరెంజిఫ్రీ స్టేటు (Orange Free State) అనబడు ప్రజాస్వామ్యములోని బోయరులు తమపరిపాలనావిధానమును చక్కజేసికొనిరి. వీరుతమప్రజాప్రతినిధులసభయగు వోక్‌సాౡ్ (Volk sraad) ను తమపరిపాలనావిధానమున ముఖ్యాంగముగ చేసిరి దీనియందె ప్రభుత్వాధికారము లెల్ల నుండెను. దీనికి ప్రతినిధుల నెన్నుకొను అధికారము కొంచెము ధనముగల తెల్లవారికెల్లరకు నుండెను. ఈ ప్రజాస్వామ్యమును పరిపాలించుటకు గవర్నరు లేడు వీరెన్నుకొనిన అధ్యక్షుడే వీరి పరిపాలకుడు. ఆయనకు కార్య నిర్వాహక సంఘ మొకటి యుండెను. దాని సభ్యులను ప్రజలే ఎన్నుకొనిరి. నల్లవారికి ఎన్నుకొనుట కధికారములేదు. వోక్‌సాౡ్ సభ అట్టిఅధికారమివ్వదయ్యెను. ప్రజాస్వామ్యప్రభుత్వము బాగుగనెయుండెను. కాని బసూటోనాయకుడగు మోషేషుతో తగవులుకలిగెను. అతనికి రాజ్య కాంక్ష అధికమయ్యెను. ప్రజాస్వామ్యము పరిపాలనము ప్రకటించిన దేశములో కొంతభాగము తనదెయని యితడనెను. 1858లో నీతగవు లధికమయ్యెను. దీనివలన మొదటి బసూ

టోయుద్ధమువచ్చెను. ఆదిమవాసులు విజృంభించిరి. బోయరులు బసూటోదేశముపైకి దాడివెడలిరి. కాని జయముచేకూరలేదు. ఆరెంజి ప్రజాస్వామ్యపు అధ్యక్షుడు బోషోఫ్ (Boshof) దక్షిణాఫ్రికా ట్రాన్సువాలు ప్రజాస్వామ్యము తనతో కలసివచ్చునని యెంచి సర్ జార్జి గ్రే గారిని మధ్యస్థునిగ వ్యవహారము తీర్మానింపుమని కోరెను. అంతట బసూటోల కనుకూలముగ తీర్పువచ్చెను. అటు, పడమరప్రక్క గ్రిక్వాలు తమదేశమును ప్రజాస్వామ్యమునకమ్మి నేటాలునకు దక్షిణముగనున్న గ్రిక్వాదేశమునకు వెడలిపోయిరి. బోషోఫ్కు బదులు మార్టినస్ వెస్సెల్ ప్రిటోరియస్ అధ్యక్షుడయ్యెను. ఆయన బోయరురాజ్యము లనేకముచేయవలెనని తలచుచుండెను కాని లాభము లేకపోయెను.

రెండవ బసూటో యుద్ధము:—"గ్రే" తీర్పువలన వచ్చినలాభములకన్న నెక్కుడులాభములను పొందవలెనని మోషేషు కృతనిశ్చయుండయ్యెను. మరల తగవులు ప్రారంభమయ్యెను. 1865లో "హేండ్రిక బ్రాండు" "ప్రిటోరియసు"కు బదులుగ ఆరెంజి ప్రజాస్వామ్యమునకు అధ్యక్షుడయ్యెను. అప్పుడు కేపుకాలనీ గవర్నరగు సర్ ఫిలిప్ వుడుహౌసును మధ్యస్థునిగ నీవ్యవహారమును తీర్మానింప గోరెను. వుడుహౌసు న్యాయదృష్టితో పరిశీలించి ప్రజాస్వామ్యమునకు పూర్వముండిన సరిహద్దును మరల నేర్పరచుచు తీర్పు

నిచ్చెను. బసూటోలు తామాక్రమించిన భూమిని విడిచి పోజాలమని బదులుచెప్పిరి. బసూటోలు తిరుగుబాటుచేసి తెల్లవారి భూములపైన దండయాత్రలుచేయసాగిరి దానితో రెండవ బసూటోయుద్ధము ప్రారంభమయ్యెను. బోయరులు కొన్ని స్థానముల నాక్రమించిరి. యుద్ధము తీవ్రమయ్యెను. మోషేషుకు కొంచెము విరామము కావలసియుండెను. అందువలన నతఁడు సంధిమాటలాడెను. 15 నెలలవరకు నూరకొని మరల తన యుద్యమమును సాగించెను. అయినను యుద్ధమున జయము ప్రజాస్వామ్యమునకె కలిగెను. అంతట నతఁడు బ్రిటీషువారిని తమ సామ్రాజ్యపు అంగరక్ష తనకు కలిగించుడని బ్రతిమాలుకొనెను. ఇదియొక యుక్తిగ బ్రిటీషు వారంగీకరించిరి. అంతట ప్రజాస్వామ్య మాదేశమును గోలుపోయెను. 1869లో బసూటోదేశము బ్రిటీషు రాష్ట్రమయ్యెను. బ్రిటీషు రాజతంత్రము ఫలించెను.

వజ్రపుగనులు, ఆరెంజి ప్రజాస్వామ్యము:—బసూటోయుద్ధ మొకమూల జరుగుచుండగనే దక్షిణాఫ్రికాలో కొన్ని వజ్రములు కనఁబడెను. అంతట బ్రిటీషులోకము దృష్టి దక్షిణాఫ్రికాపైకి తిరిగెను. ఈ యుద్ధము ఆగగనే వజ్రముల కొఱకు పలువురు త్రవ్వట మొదలిడిరి. వజ్రపుగనులభూమి ప్రజాస్వామ్యమునకు పడమరగ నుండెను. అది నేటి పడమర గ్రిక్వాదేశము. ఆభూముల నింతవరకెవ్వరు నాక్రమింపలేదు.

ఎవ్వరును తమవని ప్రకటించలేదు. అక్కడ నొక గ్రీక్వా నాయకుడు "నిక్కోలసు వాటరుబూయరు" అనునాతడు తనకీ భూములు చెందినవని చెప్పగా బ్రిటీషువారతనిదగ్గర క్రయముపొందిరి. అతని కమ్ముటకు హక్కు లేదని ప్రజాస్వామ్యము లనెను. ఈ వ్యాజ్యమును ట్రాన్సువాలువారికిని ఆదిమవాసులకును గలతగవులను తీర్మానించుటకు నేటాలు గవర్నరు కీట్సును బ్రిటీషువారె మధ్యస్థునిగ నేర్పరచిరి. కొంతసాక్ష్యముచూచి కీట్సు (గవర్నరు) వాటరుబూయరు పక్షమున తీర్పు చెప్పెను. ఆరెంజి ప్రజాస్వామ్యము దీని కంగీకరింపలేదు. తాము మధ్యస్థునే అంగీకరింపనందున తీర్పుచెల్లదనిరి. అంతట బ్రిటీషున్యాయస్థానములలోనే భూమిహక్కులను గూర్చిన వ్యాజ్యములు వచ్చెను. వారి న్యాయస్థానములు దస్తావేజులను ఇతర సాక్ష్యములను విమర్శించి వాటరు బూయరుకు హక్కు లేదని తీర్మానించెను. అంతట బ్రిండుఅధ్యక్షుడు డీవ్యాజ్యములను గూర్చి ఇంగ్లాండువారికి తెలియపరచెను. అప్పీలు చేసెను. అచ్చట న్యాయస్థానములం దీభూములకు వాటరు బూయరుకు హక్కులు లేవనుతీర్పు ఖాయపడెను. ధర్మశాస్త్రము ప్రకారము హక్కులు పోయినను బ్రిటీషువారి కీరత్నగనుల భూములను వదలుట కిష్టములేక పోయెను అందువలన ధర్మశాస్త్రము నవతలనుంచి రాజనీతి సేవలకు దిసిరి. సర్వాంసహాప్రభుత్వము తమదేయనియు దక్షిణాఫ్రికాప్రజల

శ్రేయముకొరకు సామ్రాజ్యహక్కులు కాపాడుట యవసర మనియు వజ్రపుగనులభూములు తమయధీనమందె యుండవ లెననియు నిర్ణయించి గ్రిక్వాదేశమును కేపుకాలనీరాజ్యమున గలిపిరి. ప్రజాస్వామ్యమువారికి బ్రిటీషుప్రభుత్వమువారు ఈ భూములకు బదులుగ నష్టపరిహారముగ 90,000 పౌను లిచ్చి మెల్లగ సమాధానపెట్టిరి. తమ పాలనమునసున్న చిన్న రాజ్యముల శ్రేయమె తమ ముఖ్యోద్దేశమని బ్రిటీషువారనిరి.

ప్రజాస్వామ్యఅభివృద్ధి:--ఆరెంజిప్రజాస్వామ్యము మెల్లగ నభివృద్ధిజెందుచుండెను. ప్రెం:డ్రిక్ బ్రాండు నధ్యక్షునిగ ననేక మారు లెన్నుకొనిరి. 1888 సంవత్సరములో నతడు చనిపో యెను. అంతట రీట్జు అధ్యక్షుడయ్యెనుగాని అనారోగ్యము వలన 1895 లో పని చాలించుకొనెను. 1896 లో ఎమ్. టీ. స్టెయిన్ అధ్యక్షుడయ్యెను. జాగర్సుఫాంటిన్ గనులుమాత్రము ఆరెంజివారికి మిగిలెను. వారిఋణములు తీరెను. బ్రాండుగారి కాలములోనే బాటలు వారధులు గొప్పభవనములు ప్రభు త్వమువారు నిర్మించిరి. పాఠశాలలు స్థాపింపబడెను కేపుట వును, ఎలిజబెత్తురేవు, తూర్పు లండన్, లారెంకోమార్క్వెస్ పట్టణములనుకలుపు ఇనుపదారి నిర్మింపబడెను. ప్రజాస్వామ్య మున వ్యవసాయమె ప్రజలకు ప్రధానజీవనాధారముగ నుండె ను. పశువులమందలు మేపుకొనుటయు కొందఱుప్రజలకు ప్రధానముగ నుండెను. జాగర్సుఫాంటినులోని రత్నగను

లును కోఫీఫాంటినులోని రత్నగనులును త్రివ్విరి. కొన్ని బొగ్గుగనులును బయల్పడెను. వీనిని ప్రజాస్వామ్యమువారు త్రివ్వి లాభము పొందుచుండిరి

ట్రాన్సువాలు ప్రజాస్వామ్యము:—శాండ్ నదిసంధి వలన నీప్రజాస్వామ్యముయొక్క స్వాతంత్ర్యమును బ్రిటీషు వారంగీకరించినట్లు వ్రాసియున్నాము. అచ్చటి బోయరు ఉతి వాదులు, సర్వస్వాతంత్ర్యముల నభిలషించుచు ప్రభుత్వ పద్ధతులకు నియమములకు లోబడుట కిష్టపడరు. ఆరెంజి ప్రజాస్వామ్య పద్ధతుల ప్రకారము పరిపాలనము చేసికొనరైరి. వీరి దేశమున ఖనిజములు పంటలు సమృద్ధిగనున్నను ట్సెట్సీ యీగయు జ్వరములునువీరిని బాధించుచుండెను. బోయరు రైతులు 15, 16 వేలుండిరి. అచ్చటచ్చట మంచి ప్రదేశములందు నివాసముల నేర్పరచుకొనిరి. వారు నాలుగు తెగలుగ నుండిరి. నాలుగు పరిపాలకవర్గము (Executive) లను నియమించుకొని ఒక ప్రజాప్రతినిధుల సభ (వోక్ స్రాట్) ను నిర్మించుకొన బ్రయత్నించిరి. అంతట పోచెఫ్ స్ట్రూం (Pochefstroom జౌట్ ఫాన్సు బర్గు, లిండెన్ బర్గు యుట్రెక్టు, (Utrecht) ఉలో నాలుగు ప్రజాస్వామ్యములు బయలుదేరెను. ఆదిమవాసులగుడిసెంపయిన వీరు పన్ను విధించిరి. ఎట్టకేలకు తగవులుతీరిన పిదప నీనాలుగు ప్రభుత్వములును 1864 సంవత్సరములో మార్టినస్ వెస్సల్ ప్రిటోరియసును అధ్యక్షునిగ నెన్నుకొనెను. ట్రా

న్సువాలు వారికెల్లప్పుడును బంటూ తెగలతో తగవులు వచ్చుచుండెను. వీరు పాల్ క్రూగరును సేనానిగ నియమించుకొనిరి. అంతట 'బరమాపులన' (Baramapulana) తెగవారికిని ట్రాన్సువాలు ప్రజాస్వామ్యమునకును యుద్ధము వచ్చెను. క్రూగరుసేనాని చాల శ్రమపడెనుగాని ఆ తెగవారు తెల్లవారిని జౌట్‌ఫాన్సుబర్గునుండి తరిమివైచిరి. కాని వారికి నాగరక దేశముతోడి సంపర్కము పోయినందున 1868 లో వారు మరల ట్రాన్సువాలువారితో స్నేహముచేసికొనిరి. మరికొన్ని తెగలతో యుద్ధము వచ్చెను. పడమరప్రక్కనున్న గ్రిక్వా తెగవారు భూములతమవనిరి. వీరికిబ్రిటీషువారు సాహాయ్యముచేసిరి. బ్రిటీషు దక్షిణాఫ్రికా రాజ్యముల యొక్క పాలక ప్రతినిధి హైకమీషనరును, ట్రాన్సువాలు అధ్యక్షుడును ఈ తగవును నేటాలు గవర్నరగు కీట్సును మధ్యస్థుడుగనుంచి తీర్మానింపుడనిరి. కీట్సు ఆదిమవాసులకు స్వాతంత్ర్యమిచ్చెను ఇది ట్రాన్సువాలు వారికిరుచించలేదు. ప్రిటోరియసు తన పదవికి రాజీనామా నిచ్చెను. అధ్యక్షునికి వ్యాజ్యము నిట్లు పరునివలన తీర్మానింపించుటకు అధికారము లేదని ట్రాన్సువాలు వారనిరి. కాని బ్రిటీషు హైకమీషనరు, కీట్సుతీర్పు ప్రకారము జాతులవారి స్వాతంత్ర్యమును కాపాడెదననెను. అంతట ఫ్రాంక్వాబర్జర్సు (Francois Burgers) అను మతసంస్కర్తను అధ్యక్షునిగ నెన్నుకొనిరి ఇతడు చాల

నేర్పుగ కొన్ని వ్యాజ్యములు తీర్మానించి యుండెను. ఇతడు వోక్‌స్ట్రాట్ వారి అనుమతి పొంది రైలుదారి నిర్మించుటకు హాలెండుకు పోయి విరాళమును ప్రోగుచేసెను. కాని ఇనుపదారి వేయబడకముందే ఇతడు మఱల వచ్చునప్పటికి ట్రాన్సువాలుపైన శేకూకూనీ నాయకత్వమున బాపెడీ తెగవచ్చి పడి ధ్వంసము చేయుచుండెను. ఇతడు వారికి బుద్ధిచెప్పదలచి సైన్యములను కూర్చెను. గాని బోయరు లితడు క్రైస్తవ సంస్కర్తయగుటవలన భగవంతుడతని ప్రభుత్వమున తమకు జయముచేకూర్పడని తలంచి యుద్ధము చేయమనిరి కొందరు దేశమునే వదలిపోయిరి. ఇతనికపజయములు కలుగసాగెను. ఇతడు వోక్‌స్ట్రాటును పిలిచి ధనమిచ్చి సైనికులను నియోగించుటకు ప్రయత్నించెను. ప్రభుత్వము యొక్క ధనాగారము పట్టిదయ్యెను. సైన్యము లేదయ్యెను.

బ్రిటీషువారి ఆక్రమణము:—దేశమున ప్రజలలోనె యుద్ధములు వచ్చునటుండెను అంతట బ్రిటీషువారు నేటాలులో నేటివు వ్యవహారకార్యదర్శిగ పనిచేసిన సర్ తియోఫిలస్ షీఫుస్టోన్ అనునాయనను కమీషనరుగ పంపిరి అతడును వచ్చి బలహీనముగ నుండిన ప్రజాస్వామ్యమును తిరస్కరించి జూలూతెగవారు దేశమునపడి ప్రజలకు ఆపద కలిగింతురుగాన ప్రజల శ్రేయముగోరియే దేశమున బ్రిటీషు పరిపాలనమును స్థాపించుచున్నామని 1877 సం॥ ఏప్రిలు 12 వ తేదిన ట్రాన్సు

వాలులో బ్రిటీషు ప్రభుత్వమును ప్రకటించెను. అధ్యక్షుడు ఏమనలేక పోయెను. బ్రిటీషు సైన్యములు ట్రాన్సువాలు చొచ్చెను. దేశమును ట్రాన్సువాలు దేశమని నామమిడిరి. బోయరు ప్రజలు దీనినిచూచి అసంతృప్తిచెందిరి తమ స్వాతంత్ర్యమును తీసివేయకుండ చేయుడని క్రూగరుగారిని జోరిసక్ గారిని ఇంగ్లాండునకు పంపిరి కాని లాభము లేకపోయెను. బోయరులు క్రూగరుగారిని ఇతరులను మరల రాయబారము పంపిరి ఇదియు వృధయయ్యెను. షిఫ్‌స్టోనుగారికి బదులు ఇంకొక పరిపాలకుడు వచ్చెను శేకూ కూనీ మరల దాడివెడలి వచ్చెను గాని బ్రిటీషు వారతనిని పారదోలిరి.

ట్రాన్సువాలుయుద్ధము:—ట్రాన్సువాలు కలుపుకొనుట అక్రమమని ఎల్లరు నేకగ్రీవముగ పలికిరి. బ్రిటీషుప్రభుత్వము వారు మాత్రము తమపట్టు విడువలేదు బోయరునాయకుల మొఱలు వృధయైనవి. వాల్‌నది వెనుకకు ప్రవహించుటెంత అసంభవమో బ్రిటీషువారు ట్రాన్సువాలు వదలుటయు నంత అసంభవమని ట్రాన్సువాలు పరిపాలించుటకు 1879లో పోయిన సర్ గార్నెట్టువూల్సెలీగారనిరి. గ్లాడ్‌స్టన్ మంత్రి పరిపాలనకు రాకపూర్వము ఈఆక్రమణ మన్యాయమని లజ్జాకరమనిపలికి యుండెను. కాని ఇప్పుడు పరిపాలకవర్గమువారి యభిప్రాయమునె నమ్మెను. ట్రాన్సువాలుపరిస్థితులు బాగుపడుచున్నవనియె తలంచెను. జోసఫ్ చేంబర్లైను బ్రిటీషువలన రాజ్యాంగమంత్రి

ట్రాన్సువాలు వదలుమని మహారాజ్ఞికి సలహానివ్వజాలదనెను. వదలించో అంతఃకలహములు గలుగునని భయముగనున్నదనెను. క్రూగరుజూబర్టులు, గ్లాడ్‌స్టనుగారు ప్రధానామాత్యుడయినందున న్యాయముకలుగునని తలంచుచున్నామని లేఖవ్రాసిరి. క్రొత్తపరిస్థితులు కలిగినవనియు నేటీవుల యోగక్షేమభారము తనపై నున్నదనియు వదలుటకు వీలులేదనియు తెల్లవారెల్లరకును మహారాజ్ఞిపాలనమున న్యాయము కలుగుననియు వారు ప్రత్యుత్తర మంపిరి. అంతట ట్రాన్సువాలు ప్రజాస్వామ్యములోని బోయరులు క్రూగరును ప్రిటోరియసును జూబర్టును తమకు నాయకులుగ 'వోక్‌స్రాట్' సభలో నియమించి 1880 సంవత్సరము 6వ డిశంబరునాడు స్వాతంత్ర్యపతాకము నెత్తిరి. ప్రిటోరియా మఱల స్వాధీనమగువరకును హైడిల్‌బర్గు ముఖ్యపట్టణముగ చేసిరి. బ్రిటీషువారిని పోచెఫ్‌స్ట్రూముదగ్గరను బ్రాంకుహారస్టుస్ప్రూయిట్టు దగ్గరను ఎదిరించిరి. బ్రిటీషుసేనాని కోల్లే ఆధిపత్యమున బ్రిటీషువారు 1000 మందితో నేటాలునుండి తరలివచ్చిరి. దేశములో మూడు నాలుగు స్థలములుతప్ప తక్కినవెల్ల బోయరుల వశమయ్యెను. ఆరెంజి ప్రజాస్వామ్యాధ్యక్షుడు బ్రిటీషువారిని సంధిచేయుడని హెచ్చరించెను. కొన్ని సంధిమాటలు జరిగెను గాని 1881 జనేవరు 29 వ తారీఖున 'లెయింగ్సు నెక్కు' దగ్గర బ్రిటీషువారిసైన్యము ఓడిపోయెను. కోల్లే తెలివితక్కువగ

తొందరపడుటవలన నిది సంభవించెను. అధ్యక్షుడు బ్రాండు మరల హెచ్చరించెను. ఇంగ్లాండునుండి హిందూదేశమునుండి కొత్తసైన్యములు బ్రిటీషువారికి వచ్చుచుండెను. బ్రిటీషువారు తమసేనలను వెనుకకుతీసినచో బోయరులు వెనుకకుపోవుదురనియు బ్రిటీషుపరిపాలకు లోకవిచారణసంఘము (రాయలుకమీషను) పంపి న్యాయముచేయవచ్చుననియు క్రూగరు, కోల్లే సేనానికి ఫిబ్రవరు 12 తేదీన వ్రాసెను. ఈసంగతి ఇంగ్లాండుకు తంతినిచ్చినతరువాత కొన్నాళ్లు సంధిమాటలుజరిగెను. యుద్ధము ఆగెను గడువుదినము మించినది. బోయరుల ప్రత్యుత్తరము రాకుండగనే ఫిబ్రవరు 26వ తారీఖున కోల్లే 359 మనుష్యులతో తనగుడారము వదలి 'మజూబా' కొండనాక్రమించెను. అంతట సుప్రసిద్ధమగుయుద్ధము జరిగెను. బోయరులు కొండనెక్కిరి. కోల్లే ప్రాణములంబాసెను. బ్రిటీషువారిలో 90 మంది చచ్చిరి. 60 మంది పట్టుబడిరి. తరువాత యుద్ధము నిలిచిపోయెను. ఇట్టితరి సంధియొనర్చుట బ్రిటీషువారి గౌరవమునకు హానికరమని కొందరనిరి. ఈసందర్భములలో సంధిప్రయత్నములు మానుటయుఅన్యాయమనియుకొందరనిరి. పలువురు పలువిధములుగ తలచిరి.

బ్రిటీషు వారిసంధి:—బోయరులతో సంధికూడదనువారిసంఖ్య చాలనధికముగనుండెను. ఎట్టకేలకు ప్రభుత్వమువారు ట్రాన్సువాలును కలుపుకొనుట చాలతప్పిదమనితలంచిరి. ట్రా

న్స్వాలులోని డచ్చివారిపట్ల బ్రిటీషు అధికారులు, ఫ్రేరు, షీఫుస్టోన్ వేనన్ లు చేసిన అన్యాయములు బ్రిటీషువారు చూపిన బాహుబలము దక్షిణాఫ్రికాలోనిప్రజలయందు విషాదమును కలిగించెను. సంధిమాటలు జరుగసాగెను. ఈవిషయమున గ్లాడ్ స్టన్ మంత్రి చాలా శ్రద్ధపుచ్చుకొనెను. ఎట్టకేలకు ప్రిటోరియాలో 1881 సం॥ ఆగష్టునెలలో నొకసంధి జరిగెను మహారాజ్ఞి సార్వభౌమత్వమునకు లోబడి కొన్ని నియమములతో ట్రాన్స్వాలునకు స్వాతంత్ర్య మియ్యబడెను. కాని ఈపద్ధతులు తిన్నగ జరుగలేదు. ఇంగ్లీషుపార్లమెంటులోను మంత్రులసభలోను (Cabinet) మరల నీసమస్యవచ్చినది. చేంబర్లేను మంత్రి ఈ సమస్యయందు ముఖ్యముగ ప్రసక్తిని కలిగించుకొనినాడు. బోయరులు క్రూగరు అధ్యక్షుని లండనుకంపిరి. అతఁడు చాలశ్రమపడిపనిచేసెను. 1884 సం॥ శెప్టెంబరు1వతారీఖున ఎడింబరోలో ఉపన్యాసమిచ్చుచు గ్లాడ్ స్టన్ మంత్రి ఇట్లుపలికెను "ట్రాన్స్వాలు ప్రజలు స్వల్పసంఖ్యాకులు. జాతిలో భాషలో మతములో వారికి ఐకమత్యము కలదు. ఒండొరులయందు సానుభూతికలదు దక్షిణాఫ్రికా దేశమందంతటను ప్రజలలో బ్రిటీషుపౌరులుకానివారును వీరియందు సానుభూతిని కలిగియున్నారు అన్యాయమగు గౌరవహీనమగుప్రయత్నమునందు మనముపట్టుదలతో నుండినయెడల ఆఫ్ఘనిస్థానమును అణగద్రొక్కుటకు ప్రయత్నించినట్లే ట్రాన్స్వాలు నణచుటకు ప్రయత్నించినయె

డల కేపుకాలనీలోని బోయరులును, దక్షిణాఫ్రికా దేశములో నిబోయరులును, అందరును మనపైన తిరుగుబాటు చేసి యుందురు." 1884 లో 'లండను సంధి' ప్రాపగెను దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యమను పేరుట్రాన్సువాలుకు మఱలవచ్చెను. ప్రాతసంధిలోని సార్వభౌమత్వపు షరతు క్రొత్తసంధిలో లోపించినది. కొన్ని ఇతర మార్పులుకూడకలిగెను. ట్రాన్సువాలు ప్రభుత్వము పరదేశములతో సంధులు చేసికొనుట యందు మాత్రము బ్రిటీషువారి అనుమతి పొందవలెను. ప్రజాస్వామ్యపుదేశములో నుండుటకు వర్తకముచేయుటకు తెల్లవారందరికిని సమానహక్కు లీయబడెను. అందరికిని ఒకే రీతిని పన్నులువిధింపబడెను. కాని గ్లాడ్‌స్టన్ గారు చెప్పినటుల దక్షిణాఫ్రికా సమస్య నిజముగ పరిష్కరింపబడలేదు. బ్రిటీషు వారు ఈసంధిజరిగిన కొన్నాళ్ళకును మారకొనియుండిరను. ట్రాన్సువాలు దేశములోని విట్‌వాటర్సురాండు (Witwaters Rand) లోను ప్రిటోరియాకును వాల్‌నదికిని మధ్యను బంగారుగనులు బయలుపడినంతనే మఱల కాంక్షింపసాగిరి.

యూట్‌లాండర్లసమస్య:—ట్రాన్సువాలు తమచెయిజారి పోయినదని బ్రిటీషువారు మొదట లెక్కచేయలేదు. కాని అచ్చట బంగారుగనులున్నవనుసంగతి బయలు పడినతరువాత దుఃఖపడిరి. దక్షిణాఫ్రికాకు పలువురు గనులు త్రవ్వవారు కొనువారు వచ్చిరి. జోహానసుబర్గను నగరమువర్ధిల్లెను. అందలి

ప్రజలు చాలవరకు బ్రిటీషుపరిపాలనకు లోబడిన ప్రజలు. ఇంగ్లీషు మాట్లాడువారుఆంగ్లేయనాగరకతకలవాటుపడినవారు ట్రాన్సువాలు ప్రజాస్వామ్యమునందు ఇట్టి ప్రజ లధికసంఖ్యాకులుండిరి యూట్‌లాండువాఁడు అనగా 'ఇతరుఁడు.' బోయరేతరులను బోయరులట్లు పిలచిరి. బోయరులు గనులపరిశ్రమపైన పన్నులు విధించిరి యూట్‌లాండు తెగవారుకూడ సైనికశిక్షను పొందవలెనని శాసించిరి. ప్రభుత్వమువారి బొక్కసము నిండెను. యూట్‌లాండర్లకు పౌరసత్వము లేకుండెను. దీనికి కారణముండెను. వారికి హక్కులనిచ్చినచో వారు బలవంతులై తక్కినరైతుప్రజల నణగద్రొక్కి నిరంకుశముగ ప్రవర్తింతురని అచ్చటి బోయరుప్రభుత్వము వారి భయము. తమభూమిపైన నితరులకిట్టి అవకాశమిచ్చి వెనుకబడుటకు డచ్చిరైతులిష్టపడలేదు. ఈపద్ధతులిష్టము లేనిచో యూట్‌లాండువారు తమ దేశము లోనికి రానక్కరలేదనియే వారి యూహ. రాకపోకలు కష్టమయ్యెను. అయోమార్గముల ధరలు హెచ్చెను. దిగుమతి బండ్లమీదనే చేయవలసి వచ్చెను. గనులను త్రివ్వుచు ఆర్థిక సంపదను వృద్ధిచేయునట్టి మాకు హక్కులు లేకపోవుట అన్యాయమని ఇంగ్లీషు మాట్లాడు క్రొత్తవారనిరి. తమ భాషను పాఠశాలలందు నిరసించుటయు వారి కనిష్టముగ నుండెను. తెల్లవారి పరిపాలనమున తెల్లవారమగు మాకు కొంతస్వేచ్ఛ గౌరవమునుండవలెనని వారుకోరిరి.

అందు ముఖ్యముగ తమ ప్రభువులగు బ్రిటీషు సామ్రాజ్యమువారిచే లోబడిన నటాలురాజ్యమున తమకిట్టి యన్యాయము జరుగుటకు సహింపలేరైరి. పౌరసత్వములు లేని పాలిత ప్రజలవలె, నల్లవారివలె, తాము చూడబడుచుండుట యవమానకరముగ తలంచిరి. ఇట్టి యభిప్రాయభేదములు కలవారికి పొందు కుదురుట కష్టము. దీనికితోడు మరియొకచిక్కు కనబడెను. ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యములరుచి తెలిసినది. పరిపాలకులకు అధికారము యొక్కరుచియు తెలిసినది.

యూట్‌లాండర్లకుట్ర, జేంసన్ దాడి:— దక్షిణాఫ్రికాలోని పరిపాలనమును బ్రిటీషుజండాక్రిందకు తెచ్చు నాశయము అప్పుడు కేపుకాలనీప్రభుత్వమంత్రియైన సిసిల్ రోడ్సునకు కలిగెను. అచ్చట బ్రిటీషు డచ్చివారికి నెయ్యము కుదిరెను. దక్షిణాఫ్రికా దేశభక్తి యొకటి కలిగెను. ఆరెంజి ప్రజాస్వామ్యమునం దిది కలిగింపవలెనని అతఁడు తలంచెను. కాని ఉత్తరపు ప్రజాస్వామ్యము వ్యక్తి స్వాతంత్ర్యముం గోల్పోవుట కిష్టపడలేదు. ఇంతలో యూట్‌లాండర్లు తెలివితక్కువపని యొకటి చేసిరి. జోహానసుబర్గు ప్రభుత్వమున నొక విప్లవమును కలిగింప నముకట్టిరి. పరుల సాహాయ్యమును కోరిరి. వారికి బలమున్నదని కొందరు తలంచిరి. వీరు పరిపాలనమున బాల్గొన్నచో బ్రిటీషు ప్రభుత్వమునకు లాభకారియని తలంచి రోడ్సు మంత్రియు ఆతని క్రింద యుద్యోగి ( Jameson ) జేంసనును వీరికి

సాహాయ్యము చేయబూనిరి. వారు చేయబూనిన పని కార్యక్రమము బాగుగ నాలోచింపక పూర్వమె జేంసను తొందర పడి 1895 డిశంబరు 30 వ తేదీని జోహానసుబర్గుకు పోలీసుదళముతో దాడివెడలెను. అప్పుడు యూట్లాండర్ల కుట్ర బయల్పడెను. దాడివచ్చినవారు వలలోపడిరి. ట్రాన్సువాలు బోయరు లుత్సాహముతో వారి నుక్కడగించి పట్టుకొనిరి.

ఇది బ్రిటీషు పరిపాలకుల అనుజ్ఞఅధికారములతో చేయబడిన పని కాదని వారనినను జేంసను బ్రిటీషు ఉద్యోగియే. ఇందు రోడ్సునకుకూడసంబంధముండె ననిస్పష్టముగ తెలిసెను. ఇంగ్లాడు వారు తమ ప్రభుత్వమున కిది తెలియదనిరి. కాని ప్రజాస్వామ్యము నియమించిన సంఘమువారిందు కుట్ర కలదని అభిప్రాయమిచ్చిరి అప్పుడు ట్రాన్సువాలు ప్రజాస్వామ్య అధ్యక్షుడు క్రూగరు. ఇతడు చాల తెలివిగలవాడు. ఈ సందర్భమును చూచినాడు. మంచి సందుదొరికినది. యూట్లాండర్ల కుట్ర బయల్పడినది. బోయరుల కెల్లరకు విషాదము కలిగినది. కోపము వచ్చినది. ప్రజలకు ప్రజాస్వామ్యముపైననె సానుభూతికలిగెను. యూటిలాండర్లకు ఒత్తిడి యెక్కువయ్యెను. వారి మొరలకెల్ల నొక్కటే ప్రత్యుత్తరము. అది జేంసనుదాడి జ్ఞాపకముంచుకొనుడని! ప్రజాస్వామ్యమున సంపూర్ణ స్వాతంత్ర్యముకల రాజ్యమునందువలె అధ్యక్షుడు ప్రవర్తించుచున్నాడని బ్రిటీషు వారు గొణుగుకొనుచుండిరి.

## ఏడవ ప్రకరణము.

### బోయరులు—బోయరేతరులు

బోయరుల సాంఘిక జీవనము:— 'బోయరు' అను మాటకు డచ్చివారి భాషలో రైతు అని అర్థము. దక్షిణాఫ్రికాలో నెలకొని వ్యవసాయము చేయు పాశ్చాత్యులలో డచ్చిభాష మాట్లాడువారి నెల్లరను బోయరు లనిరి. ట్రాన్సువాలులో నొక రైతు యొక్క ఇంటిని చూడబోయినచో నది పట్టణమునకు పల్లెకు చాలదూరమున నుండును. బోయరుల కిరుగు పొరుగు అక్కరలేదు సరియైన దారియైన నుండదు. రాళ్లు రప్పలు వాగులు దాటిపోయినచో దడులు కాని గోడలు కాని లేని ఒక ఆవరణమున నొకయిల్లును దానివగ్గర నొకవింతయైన గూడు బండియు కనబడును. వారి యిండ్లను రాతితోను, ఇనుముతోను నిర్మింతురు ఇంటిముందొక అరుగు ఒకవసారా (పంచాది) ఉండును. వీనిలో నేలపైన రాళ్ళు చపటాచేయబడి యుండును. లేనిచో మంటిని దిమ్మిసచేయుదురు. ఇచ్చటనే బోయరులు సాయంసమయమున విశ్రమింతురు. ఇచ్చట పడక కుర్చీలుండును. నల్లసేవకులు ఇంటిదగ్గర కావలియుందురు. వీరే పనులెల్లచేయుదురు. వీరిండ్లలోని పడకగదులు కొంత వఱకు సౌఖ్యముగనే యుండును. వీరికి కొయ్యపెట్టెలు హార్మోనియము వాద్యము లుండును. వీరింటికి వెనుకప్రక్కనే పశువులశాల యుండును

బోయరులకు వ్యవసాయముకన్న తోటలు పెంచుట యన్న ప్రీతి. బోయరులు విద్యనభ్యసింపరు. వారు కొంచెము వ్రాయను చదువను మాత్రమె నేర్చుకొందురు. వారు సాధారణముగ చదువుగ్రంథము బైబిలొక్కటె వారు జాబులను వ్రాయరు. వారికి శుభ్రము, సింగారము తెలియవు. తక్కిన పాశ్చాత్యుల సంతతివారలవలె పండుకొనునప్పుడు దుస్తులను విప్పరు. వారితలలు, దేహములు, దుస్తులు మలినములై మట్టిరంగునె కలిగియుండును. వారిపరుపులలోను దుప్పటములలోను నల్లులును మిణ్ణల్లులు నుండును. అచ్చట వర్షకాలమున నురుములు మెఱుములు నధికముగనుండును. బోయరులు త్రాగు టీ, కాఫీలు బాగుగనుండవు. అందుముఖ్యముగవారు తయారుచేయు కాఫీ చాల నసహ్యముగ నుండును. దానిలో వారనేక వస్తువులను మాంసమును కలుపుదురు బోయరు పురుషులు ధరించు వస్త్రములు సరిపడునవికాక, అవి వికృతముగ నుండును.

బోయరులిండ్లలోనె కోళ్లు, బాతులు తిరుగును. కోడిపెట్ట లింటనె గుడ్లుపెట్టుచుండును. బోయరు లిండ్లదగ్గరనె మచ్చికజంతువులు, 'హాయినాలు' (అనగా పులివంటిజంతువులు) కూడ కట్టబడియుండును. చారలగాడిదలనదగు జీబ్రాలును గుఱ్ఱములను గాడిదలను పనిచేయుచుండును.

బోయరుల స్త్రీలుసాధారణముగ స్థూలకాయులైయున్నారు. కొందరు మఱియు సన్నముగ నెండియుందురు. కొందఱు యువతులు పిల్లలు నందముగనెయుందురు. డప్పు ముసలియవ్వలు ఘోరాకారలుగ నుందురు. వీరికి నాంగ్లేయులపైని కోపము, అని 'లండన్‌గ్రాఫిక్' అనుపత్రికవ్రాసినది.

బోయరులనుగూర్చి బ్రిటీషువారొకరీతిగను అమెరికావా రింకొకరీతిగను తలంచిరి. బ్రిటీషు దృక్పథము లండన్‌టైమ్సుపత్రిక ప్రదర్శించినది. క్రీస్తుశకము 1900 సం॥ నాటికికూడ ట్రాన్సువాలులోని బోయరులు రెండువందలేండ్లనాటి తమ ముత్తాతలవలెనె కుగ్రామములలో సరిహద్దు ప్రదేశములలోను నివసించుచుండిరి. సాయంత్రి యొకనల్లబానిస కాళ్ళు కడుగును. ప్రాతఃకాలమునను రాత్రియు బోయరు బైబిలుపారాయణము చేయును. కళ్ళములలోని గింజలను గుఱ్ఱములచేతనె త్రొక్కించుచుండిరి. పొల్లును గాలికెగురవేసియే చెరగుచుండిరి. బ్యాంకులనుగూర్చి బోయరు వినియుండెనుగాని ధనమునచ్చుట భద్రపరచుటనుగూర్చి పరిహసించును. ఇది శ్రేయస్కరమని నమ్మడు.

కొందఱు భూస్వాములు తమ యవసాయమునకుఁ గావలసివచ్చునని కఱ్ఱదొరకనిచోటుల బల్లచెక్కలను పేత్రపుపెట్టెలకొఱకు భద్రముచేసి యుంచుకొందురు. తాఱేటిరక్తము నెండఁ

బెట్టియుంచిన పాముకాటుకు మందని తలంతురు. వీరికనేకము
లగు పిచ్చినమ్మకములుండెను. కొండలలో పాముదేహమును
చెవులపిల్లితలయుంకల వింతజంతువున్నదను వెఱ్ఱితలంపు వారి
కుండెను. ఇవి నిజమని కొందఱుఆంగ్లేయ పత్రికావిలేఖరికే చె
ప్పిరి. బోయరులు రాత్రి హఠాత్తుగ లేచి శత్రువులను మృగము
లనెదిరింపవలసి వచ్చుచుండుటవలన బట్టలతోనె నిదురించుచుం
డిరి. వీరికి స్నానముచేయు అభ్యాసములేదు. వీరు దృఢకాయు
లును బలశాలురయ్యు సుందరాంగులని చెప్పుటకువీలులేదు.
వీరికి తెలివితేటలుకల మోములు లేవు. వీరిలో చాలమంది
నార్వేదేశపు పల్లెటూళ్ళమోటుమానవులవలె మొద్దుమొగ
ముల వారుగ నున్నారు. అయినను వీరు నార్వేదేశపువారిక
న్న ధనవంతులు.

ట్రాన్సువాలు ప్రజాస్వామ్యమునకు అధ్యక్షుఁడగు
క్రూగరు సరియైనబోయరు. బోయరుల దృఢకాయము నిదా
నము, తెలివి, పట్టుదల, ఆత్మవిశ్వాసము నితనికిఁగలవు. బోయ
రులు బాగుగా క్షౌరముచేసికొని ఆంగ్లేయులవలె శుభ్రము
గనుండరు. బోయరు స్త్రీలు అందముగనుండరు. వారిలో నా
ర్వేలోని ఆరోగ్యమును కానరాదు. అక్కడక్కడ అందమగు
బోయరు కన్యకకనఁబడుచుండును. వారిదుస్తులు నింపుగనుండవు.
వారుసూర్యరశ్మిసోకకుండ కాలక్షేపమునుచేసి పాలిపోయి

కళావిహీనలై యుందురు. అయినను బోయరుస్త్రీలు, ఓరిమి కలవారు. వీరికిమంచిగృహనిర్వాహకము, దేశభక్తియు కలవు.

బోయరు, భారతీయునివలెనె గృహస్థుడు. ఇతనికి సాధారణముగ పెద్దకుటుంబముండును. ఇతడు వేటకుపోయినను వ్యాపారమునకు పోయినను మరల సాయంకాలమున కింటికి చేరుచుండును. ఇతడు బ్రిహ్మచారు లన్న గౌరవింపడు. గృహస్థుల నెంతో గౌరవించును. శత్రువునైనను గృహస్థుడయిన చో మన్నించును.

చర్చిల్ ప్రభువు ట్రాన్సువాలు బోయరుల సాంఘికజీవనమును గూర్చి కఠినముగ విమర్శించి బోయరు తెలివితక్కువవాడనియు, చరిత్రలో పేరులేకుండగ నంతరించు ననియు వ్రాసెను. కాని బోయరు దేశములో నెలకొని పాటుపడు రైతు. మంచితోటలు పెంచును. డచ్చిభాష బాగుగలేని మాట వాస్తవము. ట్రాన్సువాలుబోయరు గోధుములను మంచిఫలములను పండించును. బోయరు గృహములు నాంగ్లేయుల యిండ్లవలెనె యుండును. జేరస్టు, రోస్టెక్బర్గు, పోచెఫ్స్ట్రూము, ప్రిటోరియా పట్టణములలోని బోయరులు మంచి ఫలవృక్షములతోటలను పెంచినారు. సాధారణపు బ్రిటీషు, యూదు, జర్మనులవలె ధనమునార్జించి పోవుటకు బోయరు ప్రయత్నింపడు. ఇది తన జన్మభూమిగానెంచి జీవించును.

కొంచెము సుఖముగ తాను తనకుటుంబము జీవింపగలిగినచో నతడు తృప్తిజెందును. ఇతనికి పట్టణములన్న బాజారులన్న రోత. పాశ్చాత్య నాగరకతను చూచి పెదవివిఱచును. డంబమును, సింగారమును నితఁడు నిరసించును.

బోయరులలో ననేకవిధముల వారున్నారు. కొందఱింగ్లీషు నాగరకత, యంత్ర పరిశ్రమ, గనుల పరిశ్రమ, ఆర్థిక సంపదలను రుచిమఱిగిరి. ఆంగ్లేయుల కాఫీహొటళ్లు, ఫ్లాటకూటిండ్లు వీరలంకరించుచున్నారు. కొందఱు తమ భూములను బంగరుగనుల వారికమ్మి ధనికులైనారు. కొందఱు బోయరులు తమ పిల్లల నైరోపాఖండమున కంపి విద్య గఱపుచున్నారు. కొందఱు తమపిల్లల కాంగ్లేయోపాధ్యాయినుల చేత విద్యగఱపించుచున్నారు. అయినను ట్రాన్సువాలులో ప్రొటెస్టెంటు మతాభిమానముకల పూర్వాచార పరాయణులు పాశ్చాత్య నాగరకత నేవగించి, నిజదేశవేష భాషలపై నభిమానము వహించినారు. కొందఱు పన్నులనుగూర్చి మొఱలిడుచున్నారు. కొందఱు బోయరు లాంగ్లేయ సంపర్కమున కిష్టపడక ఉత్తరదిక్కునకు వలస కేగుచున్నారు. కొందఱు వెనుకనె నిలచిరి. ట్రాన్సువాలు బోయరు లాంగ్లేయ సంపర్కముగల యూట్లాండర్లకు ఎన్నికహక్కుల నీయక పన్నులుమాత్రము విధించుచున్నారు. గనులకు కావలసిన మందుసామానుల ఇజారా నొక జర్మనీవానికిచ్చినారు. పాఠశాలలలో

నింగ్లీషుభాష నంగీకరించుట లేదు. జోహానసుబర్గులో జన సంఖ్య యధికమైనది. ఆరోగ్యము బాగుగాలేదు. యూట్ లాండర్ల సభకుపోయివచ్చుచుండిన ఆంగ్లేయప్రజలలో నొకని నిటీవల బోయరుపోలీసుజవాను చంపుటవలన యూట్లాం డర్ల ప్రాణములకే భయము కలుగుచున్నది. ఇది ఆంగ్లేయు లకు కోపకారణ మగుచున్నది. బోయరులు కాఫరుల నతికూ్ర రముగ చూచుచున్నారు. బానిసలను బండిచక్రమునకుగట్టి గొడ్డును బాదినట్లు చావగొట్టుదురు. బోయరు లిది చూచి నవ్వుదురు.

1890 సం॥ సెప్టెంబరు 12 వ తేదీని అమెరికాలోని న్యూ యార్కు నగరమున 'బెంజమిన్ డేవిస్' అను అమెరికను ఇట్లు చెప్పెను. 'ట్రాన్సువాలులో మూడు తెగలవారున్నారు. మొదట వలసవచ్చి నెలకొన్న బోయరులు మొదటివారు. వీరు పరిపా లించుజాతివారుగ నున్నారు. వీరు తమపరిపాలనముఁ దిత రులు పాల్గొనకుండ జూచుకొనుచున్నారు. పరులకు వీలుదొర కినచో నెల్లయుద్యోగములును వారే ఆక్రమించుకొందురని వీరెఱుగుదురు. వీరికి క్రమశిక్ష పొందిన సైన్యములేదు. వీరి పూర్వులు మంచిగాలిలో బయటనె శ్రమపడుచు యుద్ధము చేయుచుండిరి. వీరు నగరములలోనుండి నాకుల సమరములు మాత్రమే చేయఁగలరు.

'నేటీవులు' (కాఫరులు) ట్రాన్సువాలులో నున్న రెండవ తెగవారు. వీరినెల్లరు నీచముగచూచుచున్నారు. వీరా దిమవాసుల సంతతివారు. వీరిని తెల్లవారు తీసికొనివచ్చి గనులలో పనిచేయించుచుందురు. వీరిని తెచ్చుటకు వీరినాయకులతో బేరములు చేయు మధ్యవర్తులు చాల బాగుపడుచున్నారు. నేటీవునాయకులను పొగడి మెల్లగ మోసముచేసి వారిప్రజలలో నుండి కొందఱిని కూలీలుగా నీమధ్యవర్తులు తీసికొని వత్తురు. అట్లువచ్చిన కాఫరుకూలీలు మెడపట్టీలు తగిలింపబడిన కుక్కలవలె గుఱుతు తెలుపు లైసెన్సులతో తిరుగవలెను. జోహానుసుబర్గులో నితరులవలె రాజబాటల కిరుప్రిక్కలను మనుష్యులు పోవుట కేర్పరుపఁబడిన కాలిదారులలో కాఫరు నేటీవులు నడువఁగాదు బాటలోనే రహదారిలో బండ్లుపోవు సందడిలోనె నడువవలెను. ఇది తప్పినచో శిక్ష వేయుదురు. కాఫ రేదైన చిన్నతప్పుచేసినచో రెండువారముల శిక్షయు 25 కొరడాదెబ్బలును సామాన్యముగా విధింపబడును. ఈశిక్ష వేయుటకుఁ గొంపోవునప్పు డతఁడు గుంజుకొనినచో నాక్షణముననే వానిని చంపుట వింతగాదు హత్యలీదేశమున సర్వసామాన్యములుగ నున్నవి. జోహానుసుబర్గులో సాయంసమయమున నారుగంటల కూరక కూర్చున్నవాడు చంపఁబడుట సాధారణముగ జరుగుచుండును. తమ కాహారపదార్థముల నమ్మువర్తకుని చంపుటయన్యాయమని కాఫరులు

తలంపరు. వానిఆస్తిని దోచి అపహరించుట తప్పనియు తలంపరు. ధనాగారములందు దోపిడులు పట్టపగలె జరుగుచుండును.

యూట్‌లాండర్లు ట్రాన్సువాలులోనున్న మూడవతెగవారు. వీరు పరదేశములవారు. పెట్టుబడిదారులు. వీరేధనమును వెచ్చించి గనులను త్రవ్వించుచున్నారు. నూటికి నూటయేబదివంతున లాభము తీయుచున్నారు. ట్రాన్సువాలు ఆరెంజి ప్రజాస్వామ్యములలోని బోయరులుకాని పరులనెల్లరను యూట్‌లాండర్లు (Uitlanders) అని పిలుతురు. బోయరులకు 'పరు' లన్న నిష్టములేదు. వీరికి డచ్చివారియందు జర్మనీవారియందుమాత్రమే గౌరవము. బ్రిటీషుయూట్‌లాండర్లన్నచో వీరికి పరమఅసహ్యము. వీరివల్లనె తాము మొదటనివసించిన దేశము వదలివచ్చితిమని బోయరులు మఱువలేదు. వీరె, తమపైన నిరంకుశాధికారమును చెలాయించుటకు ప్రయత్నించుచున్నారనియు వీర యభిప్రాయము. బ్రిటీషువారు యూట్‌లాండర్లపట్ల తమ సానుభూతిని చూపుచుండిరి. 1877లో వీరికొఱకె ఇంగ్లాండు ట్రాన్సువాలును బ్రిటీషు పాలనములో చేర్చినది.

బోయరులు ఇరువది సంవత్సరములు తుపాకి చేతపట్టుకొని ఆదిమనివాసులతో పోరాడిరి. కొఱడా చేతపుచ్చుకొని వారినేలిరి. జూలూలనోడించిన తరువాత బ్రిటీషువారి యధి

కారమును తిరస్కరించిరి. ప్రజాస్వామ్యపుహక్కులను పునర్ని ర్మాణము గావించుకొనిరి. బ్రిటీషువారిపైన మజూబా యుద్ధమును గెలిచిరి. 1881 సంవత్సరపు సంధివలన మరల ప్రజాస్వామ్యపుహక్కులు స్థిరపడెను. ఇంతలో బంగరుగనులు బయలు పడినవి. చాలమంది క్రొత్తవారువచ్చి ప్రజాస్వామ్యపుదేశములో సరిహద్దులలో నెలకొనిరి. ఐదేండ్లలో గనుల పరిశ్రమ యద్భుతముగ వర్ధిల్లెను యూట్లాండర్ల సంఖ్య 60 వేలయ్యెను. కాఫరు లిరువదియైదు లక్షలుండిరి కాని ఈ రెండు తెగలకును హక్కులు లేవు. ఇరువదియైమగురు డచ్చివారు దేశమునెల్ల పరిపాలించుచుండిరి. వారు తమఅధ్యక్షుని మమ్మారెన్నుకొనవచ్చును. అతనికి సర్వాధికారము లున్నవి. ఇది బోయరులకెల్లరకు బాగుగనేయుండెను గాని ఇతరులకు కంటకముగ నుండెను.

యూట్లాండర్లదృక్పథము:—బోయరునకు పండు పంటలకు పన్ను లేదు. అతనికివర్తకము లేదు లోకవ్యవహారములతో ప్రసక్తిలేదు. ఆర్థికసమస్య బాగుగలేనిచో ఉద్యోగులపరిపాలనము బాగుగలేనిచో నతనికేమి? పోలీసువారు పనిచేసినను చేయకున్నను, పాఠశాలలు బాగున్నను లేకపోయినను, గనులను పరీక్షించు ఉద్యోగులు వచ్చినను రాకున్నను, బోయరునకు భయములేదు. బోయరునకు పదునారేండ్లు రాగానే ఉద్యోగార్హత, అధికారములు, పౌరహక్కులు వచ్చును. ఇది

అన్యాయమని యూట్లాండర్లు మొఱపెట్టిరి. బోయరుల నిరంకుశపాలనమున, తమకు బాధలు కలుగుచున్నవని, దేశమునకు ధనముఁ గూర్చి పన్నులిచ్చి పట్టణములకు రైళ్ళు నిర్మించి ప్రజాస్వామ్యము దివాలా తీయునవసరమున కాపాడిన తమకు అన్యాయము జరుగుచున్నదనిరి. తమకు నిచ్చటనే పిల్లలు పుట్టియుండగ వారు పరులుగ తలంపబడుట యన్యాయమనిరి. ఇది భరింపరాని తలవంపనిరి మొదటి ప్రజాస్వామ్యమున నొకవత్సరములో ఎన్నికహక్కు వచ్చెడిది, కాని రెండవ ప్రజాస్వామ్యము నాటికి 5 సంవత్సరములవఱకు నీహక్కు రాదని శాసనము వచ్చెను. ఎన్నో మొఱలు పెట్టుకొనగ వోక్సురాడ్ సభ రెండుమారులు కూడినపిదప, రెండువత్సరములు వసించిన వారికి హక్కు నిచ్చునట్లు శాసించిరి. కాని శాసనసభ చేసిన తీర్మానములు అధ్యక్షుఁ డంగీకరించిన రద్దు, లేనిచో లేదు. క్రొత్తవాడు వచ్చినచో 14 దినములలో రిజష్టరు కాబడవలెను లేనిచో వాని కపరాధము విధింతురు. అప్పటినుండియు నత్యధికమైన పన్నులు విధింతురు. ఎన్నికహక్కులు కావలెనన్నచో నతడు ట్రాన్స్వాలు సైనిక బృందమున చేరవలెను. ఇతడు 12 సంవత్సరములు దేశములోనున్న తరువాత సభవారికి చెప్పుకొని సంపూర్ణహక్కులు పొందవచ్చును. కాని తన స్వదేశభక్తిని మానుకొనెనని యొట్టుపెట్టుకొనవలెను. ఇట్టి సందర్భములో పౌరహక్కులును, అధ్యక్షు నెన్నుకొను

హక్కులును యూట్‌లాండర్లకు వచ్చునను నాస లేదు. వేస కు వేలు చేవ్రాళ్లుచేసి మహాజరులంపుకొనినను మెచ్చిన లేదు. తరువాత ఏమియొట్లుపెట్టుకొనెదమన్నను లాభము లేకపోయినది. యూట్‌లాండర్ల మహాజరొకటి 1895 లో సభలోనికి వచ్చినప్పు డొకసభికుడు లేచి ఈఅర్జీదారుడు ఇంగ్లీషువాడైననేమి, కూలీయైననేమి? యనెను. చేతనైనచో ధైర్యముగపోరాడి హక్కులను సంపాదించుకొనరాదాయని ఇంకొక సభికుడనెను. ఇతరసభికులు వీరిని పందలించి ఒక అంతరంగికసమితి నేర్పరుప తీర్మానించిరిగాని హిందూదేశపు సంగతుల నాలోచించు సమితులవలెనే ఇది యేమియు చేయ లేకపోయెను.

బోయరుల దృక్పథము:—బోయరుల దృక్పథముకూడ కొంచెము చూడవలసియున్నది. 'ఎంజెలెన్‌బర్గు' అనునాతడు ప్రిటోరియావోక్సుస్టెమ్‌అను బోయరు పత్రికాధిపతి. ఇతడు దక్షిణాఫ్రికా చాల బీదదేశమనియు, మంచిభూమియైనను వర్షము నిలుకడగనుండదనియు, వేసవిలో నదులెండిపోయి వర్షకాలమున పొంగుచుండుననియు, వ్యవసాయమున కనుప యోగము లగుచుండుననియు 20 లక్షలతెల్లవారు గనుల పరిశ్రమలో గాలక్షేపముచేయుచు తమఆహారమునకు ఇతర పరికరములకు నితరులపై నాధారపడియున్నారనియు, బోయ రులమాత్రమె వ్యవసాయమునుచేసి కష్టపడిపండించి కరవనక

ఎండయనక, వానయనక, కీటకబాధనుసహించి పిట్టలబాధకో ర్చుకొని పాటుపడుచున్నారనియు చెప్పుచున్నాడు. బ్రిటీషు వారు రేవుపట్టణముల నాక్రమించుకొన్నారు. తెల్లతెగలకు తగవులు మెల్లగవచ్చినవి. 1852 మొదలు 1854 వఱకు బ్రిటీ షువారు ప్రజాస్వామ్యములయందు ప్రసక్తిని కలిగించుకొన లేదు, కాని మఱల నింతలో బంగరు వజ్రపుగనులపైన కన్ను వైచిరి బోయరులపాలనము: కూలద్రోసి తా మక్రమలాభ మును పొందుటకు ప్రయత్నించిరి. చుట్టుప్రక్కలనున్న ప్రదే శము లెల్ల నాక్రమించుకొనసాగిరి. ప్రజాస్వామ్యమున చాల లోపము లున్నమాట నిజమే కాని అందువలన బాధపడునది యొక్క బ్రిటీషు యూట్లాండర్సుమాత్రమె కాదు, ట్రాన్సువా లులోని డచ్చివారును బోయరులును ఇతరులును కూడ శ్రమ పడుచునేయున్నారు. బ్రిటీషువారికి బంగారు పైనగల కాంక్ష న్యాయదృష్టిని పోగొట్టినది. బోయరులుధర్మమునాలోచింపు మని కోరుచున్నారు. ప్రజాస్వామ్యవిరోధులకు ధర్మ మెక్కడిది? అనివ్రాసినాడు

1899 సంవత్సరములో అక్టోబరునెలలో దక్షిణాఫ్రిక ప్రజాస్వామ్యాధ్యక్షుడగు క్రూగరుస హోదరుడు తన దేశ మునకుపోవుచు నమెరికాలోదిగి బోయరుదృక్పథమును గూర్చి చెప్పి పొగడుకొనెను. తమసైనికులు దేశమును బాగుగనెరు గుదురనియు తుపాకిబాగుగ కాల్చగలరనియు తమవారు

జాతీయత గోల్పోవఁజాలరనియు స్వాతంత్ర్యముపోవుటకన్న మరణమే శ్రేయమని యెంచుచున్నారనియు పలికి 'నా కరువదేండ్లున్నవి. నేనింకను దృఢముగనున్నాను. జోర్డన్నదిని దాటు తోటుల (ఫిలిష్టీనుల) 10 మందిని ఆంగ్లేయులఁ జంపి మరి చచ్చెదనను ధైర్యమున్నది' అనెను.

క్రూగరు:— 'స్టాంటి క్రూగరు' ట్రాన్సువాలులో బోయరుల అధ్యక్షుడు. ప్రధానదండనాధికారి. ఆరుఅడుగుల ఒక్కయంగుళము పొడుగుమానిసి. జోరుభుజములతో పెద్దగడ్డముతోడి ఆజానుబాహువు. బలశాలి. అతడు కఱ్ఱలేనిది బయటకు నడువఁడు. పొగచుట్టకాల్చునభ్యాసము అతనికిగలదు. అతఁడెన్నడును సారాయములను త్రాగఁడు. బోయరులు సాధారణముగ త్రాగరు. అతనికిండ్లు తేనెరంగువి. అతనికి ఇంగ్లాండును చూచిన కోపము. ఒకనాడు తనఆఫీసులో బల్లపై నాంగ్లేయ పంచాంగమునుచూచి చింపివైచెను. అతనిజీవితము బోయరుల యోగక్షేమములకొఱకు ధారవోసెను. అతనికి ఇంగ్లీషు ఫ్రెంచిభాషలు వచ్చునో రావో తెలియదు కాని ఆభాషలలో మాటాడఁడు. డచ్చియే సంభాషించును. ఆతనికి జూబార్టు క్రోంజీలు భుజములవలెనుండిరి. బోయరులుతరువాత వారినాయకత్వమున నద్భుతముగ పోరాడిరి. క్రూగరు చిన్ననాటనే ఆంగ్లేయులనువారదోలగల డచ్చిస్టేటునకు ఎప్పుడో యొకప్పుడు అధికారినయ్యెదనని చెప్పుచుండును. 60 సంవత్సరములు వచ్చిన

తరువాత నిదికలిగెను. అతఁడు ఆంగ్లేయ రాయబారుల సభలో కూడ స్వభాషలోనే మాటాడును. అతడు బాగుగ పరుగెత్తగలడు. తుపాకిని మంచిగురితో కాల్చును ఒకమారు దున్నపోతును నీళ్ళలో తనబాహుబలముచే ముంచెనని చెప్పుకొందురు. అతనికి విద్య లేదుకాని బుద్ధి యధికము. అతనికి బోయరు భాషావిషయమున చాలపట్టుదలకలదు అన్ని ఆఫీసులలో దీనిని ఉపయోగించునట్లు శాసించెను.

జేంసను ఆంగ్లసేన ట్రాన్సువాలుపైన అక్రమముగ దాడివెడలి ఓడిపోయెను. క్రూగరు దూరదృష్టితో సైన్యమును చేర్చెను. అప్పుడు జోహానసుబర్గులో హోటలులలో పనిచేయు యువతులను రహస్యరక్షకశాఖలో నుపయోగించెను. పాపము! ఇంగ్లీషువారు తమరహస్యములను హోటళ్ళలో సురాపానమున వెడలగ్రక్కిరి. క్రూగరు మంచి దైవభక్తికలవాడు. ప్రజలగౌరవమునకుఁ బాత్రుఁడయ్యెను. క్రూగరు తనయావచ్ఛక్తిని వినియోగించి బైబులునీతులను కథలను చెప్పుచు ఉద్బోధించును. డచ్చివారితనిమాటలు శ్రద్ధగవిందురు. బ్రిటీషువారితో యుద్ధముసంభవించు నవసరమున క్రూగరు మహోపన్యాసముల చేసెను.

క్రూగరుభార్య పతివ్రత. మితభాషియగు క్రూగరు విక్టోరియారాజ్ఞి గయ్యాళియనియు తనభార్య స్త్రీలకు ఆదర్శప్రాయయనియు చెప్పుచుండును. క్రూగరు ఆమెను పెండ్లాడ

నిష్టపడి ఆమెకేమి తెలియునని అడిగినప్పుడు సిగ్గుతో తలవంచి 'నేను రొట్టెలు కాల్చగలను. భూమి శుభ్రపర్చగలను, కుట్టగలను' అని బదులుచెప్పెను. ఆమెభర్త ఆమెభాగ్యమువలన వ్యవసాయకుడై, మేపరియై, వేటకాడై, సైనికుడై, మతాచారియై, అర్థశాస్త్రజ్ఞుడై, సర్వసేనానియై తుద కధ్యక్షుడయ్యెను. ఇంటపనులెల్ల పనులామెయే చేయును శయ్యలు తానే వేయును. ఆమెయింటి కతిథులు వచ్చునప్పు డామెయె పదార్థములను జాగ్రత్తగవడ్డించును. 'బట్లరు'ను రానియ్యదు. వారొక చిన్నగృహమున వసించుతురు. క్రూగరు తెల్లవారుఝామునన లేచును. 6 గంటలకు దైవప్రార్థనము జరుగవలెను. పిదప కాఫీ. 7-30 గంటలకధ్యక్షు డాఫీసులో నుండును. కార్యాలోచనసభ 9 గంటలకుకూడు నప్పటికి పనులెల్ల చక్కబెట్టుకొన సిద్ధముగనుండును. సభలేని రోజున నింటభోజనము చేసి 8-30 గంటలకు ఆఫీసుకుపోవును. మధ్యాహ్నము 4 గంటలకువచ్చి చూడవచ్చిన వారిని చూచుచు కుటుంబముతో 9 గంటలవరకు కాలక్షేపము చేసి నిదురించును.

స్టైయిన్:— ఆరెంజి రిపబ్లికుప్రెసిడెంటు, మార్టినాస్ తియూనిస్ స్టైయిను. ఇతడు 1857 లో పుట్టెను. అతని తల్లి వీరమాత. ఆమె తనకుమారులతో 'మీరు స్వాతంత్ర్యము గల పురుషులు. మీ స్వాతంత్ర్యము కాపాడుకొనుడు.' అని బోధించుచుండును. స్టైయిను మంచియాటల నాడుచు బలము

కలవాడయ్యెను. అతని విశాలఫాలము, మడత కనురెప్పలు, దీర్ఘమగు గడ్డము, గంభీరముగ నుండును. బోయరు యుద్ధమునాటికి కితనికి నలుబదేండ్లు. ఇతడు బ్లూంఫాంటీను కళాశాలలో విద్య నభ్యసించెను. ఐరోపాకు పోయి ధర్మశాస్త్రముచదివెను. కొన్ని వత్సరములు హాలెండులోను కొన్ని వత్సరములు ఇంగ్లాండులో నుండెను. అతడు తిరిగి రాగనె న్యాయస్థానమున నుద్యోగి యయ్యెను.

1896 లో జేంసను దండయాత్ర సమయమున అధ్యక్షపదవికి నిలచెను. అతని ప్రతిపక్షదారుని కింగ్లీషు పేరుండుట లాభమయ్యెనని కొందరందురు. అతఁ డధ్యక్షుడైనపిదప నిట్లుపన్యసించెను. ఈస్వతంత్రరాజ్యములలో ప్రజాస్వామ్య పతాకము నెత్తినాము. మంచి ప్రజాస్వామ్య పద్ధతులతో పరిపాలింపవలెను. ప్రపంచమున నలుప్రక్కల నుండియు మనదేశమునకు మనుజులు వచ్చుచున్నారు. అందరిని మనలో కలుపుకొనుటయు ఒక్క ప్రజాస్వామ్యము చేయుటయు యుక్తము కాదా! జ్ఞానముకల మనము ఒక దోపిడిగాడు (జేంసన్ సేనాని)మనలో జాతి వైషమ్యమును పురికొల్పుటకు చేసిన ప్రయత్నమును కొనసాగ నిత్తుమా? శాంతి, స్నేహము, భ్రాతృభావములతో మనపూర్వులు నడచినదారిని మనము తప్పుదుమా? మనచుట్టును ఇతరరాజ్యము లున్నవి. మన ప్రజాస్వామ్యము

వీని నైకమత్యమునకు ప్రయత్నించి కీర్తిని బొందవలదా అనెను.

క్రూగరు రాజనీతి:—క్రూగరు, జేంసను కుట్రదారులలో 400 మందిని దయతో 1897 జనేవరులో వదలిపెట్టెను. కొంత నష్టపరిహారమును మాత్రము కోరెను. జేంసను ప్రభృతులను చెరలో నుంచెను. వారిని క్రిగపక్రొకాగము విచారింపదలచెను. ఇందు బోయరు ప్రభుత్వము చూపిన ధైర్యమునకు న్యాయమునకు జర్మను చక్రవర్తి ప్రశంసించుచు వర్తమానమంపెను. దానికి ప్రత్యుత్తరముగ క్రూగరు 'తమదయకు పాత్రుడ నైనందుకు కృతజ్ఞుడను. దేవుని అనుగ్రహము వలన కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యమును కాపాడుకొని మాప్రజాస్వామ్యముల పాలనముగట్టిగ స్థిరపర్చుకొనగలమను ధైర్యము కలదు' అనెను. జర్మనీ బోయరులకు చేయగల సాహాయ్యము చేయునని చక్రవర్తి ఒకడప్పు యుద్యోగికి వాగ్దానము చేసెను. చక్రవర్తియిట్లు పలుకుటనుగూర్చి బ్రిటిషుపత్రికలు విమర్శించెను. యుద్ధ సన్నాహములు, తలంపులు బ్రిటీషు వారియందు కలిగెను. అమెరికాలో దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యములపైన సానుభూతికలిగెను. జనేవరు 10 వతారీఖున అమెరికా సంయుక్తరాష్ట్రప్రజల ప్రతినిధుల కాంగ్రెసు ప్రజాస్వామ్య పరిపాలనమున కభివందనము చేయుచు తీర్మానమంపెను. జర్మనీవారు తా మా విషయమున స్వయముగ కలి

గించు కొనవలెగాని బ్రిటీషు ప్రభుత్వముతో సంప్రదించుట అవసరమని తలంచు చున్నామనిరి. అంతట బ్రిటీషువారికిని జర్మనీ వారికిని గల వైషమ్యము పోయెను.

యుద్ధకారణములు:—నిజముగ బోయరు యుద్ధమునకు జేంసను కుట్రకుముందె కారణములుండెను. దక్షిణాఫ్రికాలోని యూట్‌లాండర్లు కుట్రలు చేయుచుండిరి. సిసిలురోడ్సు పత్రికలు ఇచ్చి ప్రభుత్వముపైన తీవ్రవిమర్శనములు చేసియుండెను. యూట్‌లాండర్ల సభలలో బ్రిటీషు ప్రభుభక్తిపాటలు పాడబడుచుండెను. అమెరికనులయొక్క మంచిసలహా సహకారములేకుండిన జేంసను కుట్రలకన్న నెక్కుడు చిక్కులు కష్టములు వచ్చెడివె. అమెరికను లీసందర్భములను బోయరు అధ్యక్షునకు చెప్పిరి. యూట్‌లాండర్లు ఇతర ప్రభుత్వములన్న కిష్టపడుట లేదనియు, ఇంగ్లీషువారు వారికి సాహాయ్యముచేయక మానరనియు, యుద్ధము తప్పదనియు చిక్కులు వచ్చుననియు చెప్పిరి. అమెరికనులపక్షమున బ్రౌనుగారు క్రూగరుగారితో కలసిమాటాడెను. క్రూగ రతనితో చాల మర్యాదగ మాటలాడెను. యూట్‌లాండర్ల కోరిక లన్యాయమనియు బోయరులకు హానికరము కాకుండ కొన్ని సంస్కరణములు చేయవచ్చుననియు బ్రౌననెను. దేశము బోయరులదనియు ఇందుపరులకు ఎన్నికహక్కులనిచ్చినచో అసలు ప్రజలకు నిలువ నీడయుండదనియు యుద్ధపు తుపానువచ్చుచుంట తానుగమ

నించుచునె యున్నాననియు దానికి సంసిద్ధుడ నగుదుననియు క్రూగరు చెప్పెను. ఆమరునాడె జేంసను హఠాత్తుగ బోయరుల పైకి వచ్చెనను వార్త వచ్చెను. ఆవార్తవచ్చినరోజుననే అధ్యక్షుడు రొట్టెల పైన పన్నును రద్దుచేసి ఆంగ్లేయభాషను పాఠశాలలందు జోహానసుబర్గులో వాడవచ్చునని ప్రకటించి ప్రజాస్వామ్యమునకు స్నేహితులగు వారికెన్నిక హక్కుల నిచ్చెదననియు ప్రకటించెను! కార్మికుల లాభనిమిత్తము చట్టములు చేసెదననెను. ట్రాన్సువాలు ప్రజలను ధర్మమునకు లోబడి యుండుడని హెచ్చరించెను. జేంసను అక్రమముగవచ్చి యోడిపోయి సైన్యముతో శత్రువుల వశమున జిక్కెను. సంస్కార విప్లవ సంఘమువారును ప్రభుత్వపు చేతులలోజిక్కి విచారింపఁబడిరి. జేంసనుతో వారుచేసిన కుట్రకు శిక్షింపబడిరి. కొందర కురిశిక్ష విధింపబడెను. క్రూగరు సామర్థ్యమున కెల్లరుబోయరులును కొనియాడిరి.

క్రూగరు దృక్పథము:—1896 నవంబరు 27 తారీఖున అతని కొసగిన విందులో నతఁడు జేంసనుదాడినిగూర్చి ముచ్చటించెను. ఇదివరకెన్నడును ఇంత మాట్లాడిన వాఁడుకాఁడు. ఆరోజున కొంచెము ఉపన్యాసముచేసెను. 'మనము కేపుకాలనీనుండి వలసవచ్చినది మొదలు భగవంతుఁడె మనలను కాపాడుచున్నాడని నాఅభిప్రాయము. అతఁడే మనదేశమును స్వాతంత్ర్యమును మనకిచ్చినాడు. మనము బాగుగ తుపాకులను కా

ల్పితిమని కొందఱనవచ్చును. మనజయము తుపాకులది కాదు. పరమేశ్వరుని చూపుక్కలది. మనచర్యలగూర్చి మనము పొగడు కొనరాదు. భోజనముదగ్గర రాజకీయవ్యవహారములను గూర్చి ముచ్చటించుట నా యభ్యాసముకాదు. అయిన నసత్యపు టప వాదులు ప్రబలుచున్నందున చెప్పవలసి వచ్చుచున్నది. డిశెం బరు 16వ తేదిని, డింగానా పర్వము వెళ్ళిన మఱునాడు, పూర్వపు సంధులను తిరస్కరించి స్వాతంత్ర్య ప్రకటనము చేయబోవుచున్నామని కొందఱు పలుకుచున్నారు. సంధుల షరతులు అతిక్రమించుటకేనా చేసినది? ఆసంధి నిజముగ నేమి తెలుపుచున్నది? మనహక్కులను మనస్వాతంత్ర్యమును నిర్ణ యించుచు స్థిరపరచుచున్నది. ఆ సంధిషరతులలో నేదైన మార్పు నాకు కావలసినచో నెమ్మదిగ దౌర్జన్య రహితమగు విధమున అడిగి సంపాదించగలను. ఇదియె సరియగు మార్గమ ని బోయరులెల్లరు నొప్పుకొందురని నానమ్మకము. మనము వాగ్దానముల జెల్లింతుము. ఖరారుల నతిక్రమింపము. జేంసను దాడికి నష్టపరిహారము నేలకోరవని నన్ను పలువు రడుగుచు న్నారు. నేను న్యాయముగ నుండ ప్రయత్నించుచున్నాను అది జాగ్రత్తగ అంచనా వేయవలెను. నిజముగ, వీలున్నచో, నాకు అడుగుటకు హక్కుకలదానినిగూడ అడుగను. మనప్ర జాస్వామ్యపు ఆశయము ఇతరులపైకి అక్రమముగ పోకుండ ఆత్మరక్షణము మాత్రము చేసికొనుట. ధర్మమేబలము. బల

ము ధర్మముకానేరదు. మనము మనభూమిని చాలశ్రమపడి సంపాదించితిమి. శ్రమపడియైన సంరక్షించవలెను. వలస చట్టములను మనము చెడ్డతలంపుతో చేసియుండలేదు. శాంతి కొఱకు ధర్మముకొరకే చేసితిమి. మనమితరులతో స్నేహముగ నుండుటకె కోరుచున్నాము. అక్రమములు అన్యాయములు చేయువారికే ఆచట్టములు వర్తించును. పరులనుగూర్చిన చట్టములభాష సరిగలేకున్నను భావము సరిగనే యున్నది. మన తలంపు ఇతరులకు అక్రమముచేయుటకాదని మఱల నొక్క చెప్పుచున్నాను. ఇతరులు మనచర్యల నక్రమములని తలంచుచున్నారు. ఇది సహజమె. వారిదృష్టి కిది యక్రమముగనె కనబడును. నష్టపరిహారవిషయములో నేను మూడునాల్గు మిలియనుల పౌనులు కోరవచ్చును. కాని నేనన్యాయము చేయదలచలేదు. అపకారి కుపకారముచేయుటయెగొప్ప' అని కూర్చుండెను.

ఇంగ్లీషువారిదృక్పథము :- జేంసను వ్యవహారమునుగూర్చి పార్లమెంటుకమిటీవారు విచారించి రిపోర్టుపంపిరికాని అందు వారు గోడమీదపిల్లివాటముగనుండిరి. కుట్రలో జోహానసుబర్గు ప్రజలను ప్రోత్సహించుటలో సిసిల్ రోడ్సుయొక్క చర్య సమంజసముగలేదని అభిప్రాయమిచ్చిరి. పైకి రోడ్సుయొక్క సలహాతో జేంసను పోవనప్పటికి నిజముగ నతఁడే దీనికి కారకుఁడనిరి. 1897 జూలై 28 తేదిని కామన్సుసభ క్రిక్క

కెసిటయుండెను. ఈరిపోర్టు చాలమందికినచ్చలేదు. రోడ్సు యొక్క వర్తకసంఘపుహక్కులను రద్దుపర్చవలెననిరి. చేంబర్లేను (ఇంగ్లీషువలస మంత్రి) ఈస్థితిగతులనుగూర్చి సమర్థించెను. గవర్నమెంటువారు సిసిల్ రోడ్సుసంఘముపైన అధికారము నెక్కువచేసి ఇకముందు జాగ్రత్తగ చూచెదరనెను. దక్షిణాఫ్రికాలో క్రూగరు సమదృష్టితో సంధిప్రయత్నములోనే యున్నాడనియు చెప్పెను. అంతట కామన్సుసభవారూరకొనిరి. గవర్నమెంటుపక్షముననే సమ్మతులిచ్చిరి!

యుద్ధప్రయత్నములు :— 1898 లో అసమ్మతి అశాంతి చాల నధికమయ్యెను. పత్రికలుద్ఘోషించుచుండెను. యూట్ లాండర్ల కుటిలనుగూర్చి పితూరులనుగూర్చి ముఖ్య వ్యాసములు వ్రాయబడెను. యూట్ లాండర్లను చాల కోపముతో క్రోధమువహించిరి. క్రూగరు నొక పత్రికావిలేఖరి దర్శింపగ పత్రిక లిట్లు యుద్ధసన్నాహమును చూపు పలుకులు పలుకుట బాగుగలేదనెను. జేంసను వ్యవహారమున కిష్టపడక పెద్ద సభలను జేసిరి. ఇట్లు అల్లరిచేయుటకు తానంగీకరింపననెను. ఇది కొందరు బోయరులకు కష్టము కలిగించెను. ఒక సుప్రసిద్ధ యూట్ లాండరె యిట్లనెను. 'ఇచ్చటి సందర్భములు ఆంగ్లేయులు శ్రద్ధతీసికొనవలసిన అవసరమును కలిగించుచున్నవి. క్రూగరు జర్మనీవారి సహాయము రాదని తెలిసికొనిన యప్పటినుండియు బ్రిటీషువారితో సఖ్యము చేసుకొనవలయు

ననియె యున్నాడు. అతఁడు నిజముగ దేశభక్తియున్మాదము కలవాఁడే కాని మంచివాఁడు. అయిన నతనిచుట్టును చెడ్డవా రున్నారు. వారే పరుల కిక్కట్టులు కలిగించి అక్రమపులాభము పొంద యత్నించుచున్నారు.' బ్రిటీషువారి సభ యొకటి 1899 జనేవరు 14 తేదిని జరుగగా నచ్చటి బోయరు లల్లరిచేసి తాము సభచేసిరి. క్రూగరు కిట్టి అన్యాయములు ఇష్టము లేదు.

మే 21 తేదినుండి 6 వ తేదివరకును బోయరు బ్రిటీషు రాజతంత్రజ్ఞసభలు జరిగెను కాని సంధిపొసగలేదు. ఆంగ్లేయు లితరులను మధ్యవర్తులుగనుంచి వ్యవహారములు పరిష్కరించుచో తాను కొన్నిహక్కులను యూటులాండర్ల కిచ్చెదనని క్రూగరనెను, కాని వారంగీకరింపలేదు. జూనులో యుద్ధప్రియత్నములు జరిగెను. చేంబర్లేను, హైకమీషనరగు మిల్నరును క్రూగరుతో సంప్రతింపుచునెను. జూను 24వ తేదిని వోక్సాట్ సభవారు క్రూగరుచెప్పిన హక్కులను ఇచ్చుట కంగీకరించిరి. క్రూగరు వారికి వందనము లర్పించుచు ఈచిక్కు రోజులలో నేమి యెప్పుడు తటస్థించునో చెప్పుటకు వీలులేకున్నది. బ్రిటీషువా రొక మెట్టయిన దిగుటలేదు. మన మింతేకన్న హక్కులీయఁజాలము. మన కెల్లపుడు పరమేశ్వరుఁడె అండగైయున్నాడు. మన స్వాతంత్ర్య మొకమారు పోయినను భగవంతుఁడె మరల మన కిచ్చినాడు అనెను. ఉభయ పక్షములవారును యుద్ధప్రయత్నము చేయుచుండిరి.

# ఎనిమిదవప్రకరణము.

## బ్రిటీషుమంత్రిల రాజతంత్రము.

రాజకీయపరిస్థితులు:— 1899 సంవత్సరము వచ్చినది. జూలై ఆగష్టు నెలలలో బోయరులును బ్రిటీషువారును తమ ఖడ్గముల నింకను ఒరలోనుండి తీయలేదు. యూట్లాండర్ల ఎన్నికహక్కులనుగూర్చి చేంబర్లేను(బ్రిటీషువలసరాజ్యాంగమంత్రి) పలుమరు కబురంపుచుండెను. క్రూగరు అధ్యక్షుడు బ్రిటీషు ప్రభుత్వముతో అనవసరముగ కలహము పెంచుకొనుట కిష్టము లేక ఎన్నికహక్కుల విషయమున కొంత సంస్కారము చేయుటకు నిశ్చయించెను. అయినను డచ్చిసేనానాయకులు, ప్రజలు, యూట్లాండర్లునుకూడ యుద్ధసన్నాహములను చేయసాగిరి. ప్రిటోరియాలో వోక్సారాట్ సభ రెండుమారులు కూడెను. ఆరెంజి ప్రతినిధి యొకడు వారితో కలిసి ఆలోచించుచుండెను. ఎట్టకేలకు ట్రాన్సువాలు పార్లమెంటువారును సంధియుక్షమని తలంచి దేశములో ఏడు వత్సరములు నివసించినవారి కెన్నిక హక్కులిచ్చుటకు తీర్మానించిరి కాని దక్షిణాఫ్రికా హైకమీషనరును కేపుకాలనీ పాలకుడునగు మిల్నరు (Milner) యూట్లాండర్లకు సమాన హక్కులు కావలెనని కోరుచుండెను. ఇది అత్యాశయని క్రూగరు పలికెను. చేంబర్లేనిట్లు ఎన్నికహక్కుల నిచ్చినంతమాత్రమున లాభము లేదనియు ట్రాన్సువాలువారు తమ యిచ్ఛవచ్చి

నప్పుడెల్ల చట్టములు చేయుచుండుటవలన చాల ప్రమాదము వాటిల్లునినియు, సార్వభౌమప్రభుత్వమునకు దెలుపకుండ చట్టములు మార్చమని వాగ్దానముచేయు టావశ్యకమనియు చెప్పెను. ఇందుల కొక జాయింటుకమిటీ సభ నేర్పరుపుడని కోరెను. ఇది చాల నాశ్చర్యము కలిగించెను. బ్రిటీషువారి ఆశయు, నిజాభిప్రాయములును వెల్లడియయ్యెను. అప్పటి నుండి బోయరులును సమరమునకు సిద్ధపడిరి. బ్రిటీషుమంత్రికి వోక్‌సాౙిట్ సభ సాధ్యమగునంత మంచిమాటలతోనే జబాబునంపెను. బ్రిటీషువారిట్లు తమ దేశపరిపాలనమున అనవసరమగు ప్రసక్తి గలుగచేసికొనుట అన్యాయమని చెప్పిరి. బ్రిటీషువారు సార్వభౌమత్వమును గూర్చిన తలంపు, అధికారకాంక్ష, మానినచో ఎన్నిక హక్కులను వృద్ధిచేసెదమనియు తెలిపిరి. అంతట నీ విషయమై బ్రిటీషు (వలసమంత్రి) కాలనీల కార్యదర్శి యగు చేంబర్లేన్ గారును వారి దక్షిణాఫ్రికా లోని హైకమీషనరగు మిల్నరుగారును ఉత్తరప్రత్యుత్తరములను జరపికొనిరి. ఈ వ్యవహారమును నిష్పక్షపాతులగు మధ్యస్థులచేత పరిష్కరించుకొనుటకు బ్రిటీషువా రంగీకరింపలేదు. అంగీకరింపవలదనియు మిల్నరుప్రభువు ఇంగ్లాండు పరిపాలకవర్గమువారికి వ్రాసియుండెను. చేంబర్లేను మిల్నరుతో నేకీభవించెను. బ్రిటీషువారు జాయింటుకమిటీ నేర్పరచికొందమని ఆగస్టు 20 తేదీని కబురంపిరి.

1881 సంధిలోని సార్వభౌమత్వపు షరతు 1884 సంధి షరతులలో లేదనియు, నందువలన ప్రజల నీయధికారమును చెలాయింపఁ బ్రయత్నించుట యక్రమమనియు క్రూగరు పలికెను. టాన్సువాలు గవర్నమెంటువారు బ్రిటీషువారికి తుది మాటగ 5 యేండ్లు దేశములోనున్న వారి కెన్నిక హక్కుల నిచ్చెదమని కబురంపిరి. దక్షిణాఫ్రికాలోని బ్రిటీషు రాయబారి దీని కంగీకరించుటకు సిద్ధపడెను కాని, ఈ సంగతి మరల నింగ్లండు ప్రభుత్వమునకు తెలిపి, ఉభయపక్షములవారు పరిష్కరించుకొనుట యుక్తమని తోచి అట్లు చెప్పెను.

చేంబర్లేను ప్రకటన :— చేంబర్లేను సెప్టెంబరు 1 వ తారీఖున దీనినిగూర్చి బ్రిటీషు ప్రభుత్వమువారి తీర్మానములను ప్రకటించెను. ఇది చేంబర్లేను రాజనీతి ఫలము. ఇదివరకు ప్రభుత్వమువారు ప్రకటించిన ప్రకటనలవలన ఇంక ముందు బోయరుల వ్యవహారములలో ప్రసక్తి కలిగించుకొనరని చెప్పినారనుకొనుట పొరపాటనియు నాగరక ప్రభుత్వములవారికి తమ పౌరుల కన్యాయము కలుగకుండ కాపాడుకొను హక్కు కలదనియు, ఇది విడువజాలరనియు అనేకములగు ఇతరవిషయములు కూడ నిర్ణయింప వలసియున్నదనియు కేపుటవును సభలో ఆలోచింప వచ్చుననియు ప్రకటించెను.

బోయరుల తలంపులు:— ఉభయపక్షముల సైన్యములును సరిహద్దులవైపున కరుగుచుండెను. వీనిని గూర్చి ప్రిటో

రియాలో వోక్సాట్ సభలో ప్రశ్నలు వైచిరి. కల్లోలము కలిగెను. కూగ్రిగరు అధ్యక్షుడు లేచి 'పరులగు యూట్లాండర్లకు హక్కుల నిచ్చెదమన్నను ఇంగ్లీషుమంత్రిగారు అంగీకరింపక ట్రాన్సువాలునె స్వాధీన పరచుకొనుటకు కాంక్షించుచున్నారు. శాంతికొరకు బోయరులెంత ప్రయత్నించుచున్నను లాభము లేకపోయినది.' అనెను. అందరికిని ఇంకలాభము లేదని తోచినది. 11వ సెప్టెంబరు తేదీన బ్రిటీషువారు తమ మతలు అంగీకరించి సభకూడనిచో యుద్ధము చేయుదుమని బోయరులను బెదిరించిరి.

బ్రిటీషు రాజ నీతిజ్ఞుడగు మోర్లేఅభిప్రాయములు:— ఈపరిస్థితులనుగూర్చి బ్రిటీషు రాజనీతిజ్ఞులు పలువురు పలువిధములుగ తలంచిరి. విశాల దృష్టికల లిబరల్ తెగ రాజనీతిజ్ఞుడగు జాన్ మోర్లేప్రభువు, స్కాట్లాండులో 1899 సం॥ సెప్టెంబరు 5వ తేదీని ఉపన్యసించుచు నిట్లుచెప్పెను. మనకు దక్షిణాఫ్రికాలో సార్వభౌమత్వహక్కులున్నవి. దీనినిగూర్చిన జిజ్ఞాసమనరాజనీతిజ్ఞులలో ప్రబలినది. ఇది అనవసరమనియు ఇది కేవలము శబ్దార్థజిజ్ఞాసయనియు మిల్నరుప్రభువు చెప్పుచున్నాడు. నాయభిప్రాయమేమన ఈపదముయొక్క అర్థము ఇదమిద్ధమని నిర్ణయింప వీలులేదు కాని సార్వభౌమత్వమున కొంత నిరంకుశాధికారమున్నట్లు స్ఫురించుచున్నది. అందువలననె ఈమాటను బోయరు లేవగించుకొనుచున్నారు. అందు

వలననే మనకేపు రాజ్యములోనున్న యుద్ధము చేయుమను కక్షిదారుల కీమాటయన్న ప్రీతి. ఈశబ్దమున లేనియర్థముకూడగలిగించి కొంతఅధికారమును చెలాయించవచ్చునని, కొన్ని అక్రమములను జరిగింపవచ్చునని వీరియాశ. నిజముగ నిదిశబ్దార్థ జిజ్ఞాసమెయైనను ప్రపంచమున మాటపట్టింపులు శబ్దార్థజిజ్ఞాసలవలన వచ్చిన తగవులచే నెంతరక్తపాతము కలుగలేదు, ఎన్ని తెగలకు బలవద్విరోధము కలుగలేదు, ఎంతభూమిపాడు లేదు? అందు వలన మిల్నరుగారు ఈ విషయమొక శబ్దార్థజిజ్ఞాసమని నిరసించినమాత్రమున నిదిభయంకరమగు సందిగ్ధావస్థలను తీసికొనిరాదని మనము ధైర్యముగ కూర్చుండరాదు. 1896-లో బ్రిటీషు దేశపు న్యాయాధిపతి జేంసన్ పితూరిదారుల నేరమును విచారించి తీర్పునిచ్చుచు నిట్లుచెప్పెను. ఈ పితూరీదారులు మన మహారాజ్ఞి దేశములోనుండి మనపక్కనున్న స్నేహితుల రాజ్యముపైన యుద్ధము చేసినారు. దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యము యొక్క రాజకీయస్థానము హక్కులు 1881 సంవత్సరపు సంధినిబట్టియు 1884 సంధినిబట్టియు, నిర్ణయింపఁబడినవి. ఈ సంధులవలన మనమహారాజ్ఞీగవర్నమెంటువారు ఈ ప్రజాస్వామ్యముల యొక్క స్వాతంత్ర్యమును, స్వపరిపాలనములను అంగీకరించినారు. వారి సంపూర్ణహక్కులపై నొక్కటె హద్దుకలదు. అది, వారు మనఇష్టములేకుండ ఇతరులతో సంధిచేసికొనరాదనియె. అందువలన దక్షిణాఫ్రికా

ప్రజాసామ్యముల పైనమనకున్న అధికారము నిదియె. ఈ సందర్భములో దక్షిణాఫ్రికాలో పాలక పాలిత రాజ్యసామ్య మున్నట్లు కాలనీల కార్యదర్శి (చేంబర్లేను) ఏలప్రకటించి పలుకుచుండవలెను. పూర్వపు పరిపాలకవర్గమువారు, మంత్రులు అధికారులు చెప్పిన మాటలుమాని, మఱచి, ఇప్పుడిట్లుపలుకుట ఎంతఅన్యాయముగ అక్రమముగ విషాదకరముగ నున్నది!

1896లో నీచేంబర్లేనే, ఏమని చెప్పెను? దక్షిణాఫ్రికా లోని శాంతికి, రిపబ్లికుపరిపాలన గట్టికొఱకు,రిపబ్లికుపరిపాలన లోని లోతప్పిళ్ళలో ప్రసక్తికలిగించు కొనకుండగనే, 1884 సంధివలన కలిగిన సమస్యల సందర్భమున, కొ్రత్తగవచ్చువారి క్షేమముకొఱకు, అందుముఖ్యముగ,బ్రిటీషు ప్రజలెయధికము గాన వారివిషయమున, మంచి సలహా నిచ్చుట బ్రిటీషు వారి కర్తవ్యము అనికదా పలికినాడు! మంచి సలహా నిచ్చుటనగా 50,000 సైనికులను పంపుటయా? చూచితిరా ఎంత అన్యాయమో! సార్వ భౌమత్వమునకేమి? మీరుప్రజాస్వామ్యమున కేమిచెప్పఁదలచుకొన్నారు? వారియొక్కఎన్నికహక్కులనుగూర్చి, వారియొక్క న్యాయస్థానములనుగూర్చి వారియొక్క స్థానికస్వపరిపాలనావిధానమునుగూర్చిమీరుప్రసక్తిగలిగించు కొని మీయిష్టమువచ్చిన ట్లాజ్ఞాపింపఁ దలచుకొన్నారా? ఈ సార్వభౌమత్వము బ్రిటీషువారి కేవలసరాజ్యమందు గలదు? కెనడాలో, అస్ట్రేలియాలో, మేము సార్వభౌమ పాలకులము

మీఎన్నికలిట్లుండవలె, మీన్యాయస్థానముల పాలనమిట్లుండవలె, మీస్థానికపరిపాలన మిట్లుండవలెనని మీ మంత్రులలో రాజనీతిజ్ఞులలో నెవరైన ననగలరా? అట్లుపలికిరేని మీసామ్రాజ్య మొకనెలలో చెల్లాచెదరై పోదా? బ్రిటీషువారును డచ్చివారును దక్షిణాఫ్రికాలోకలసి జీవింప వలసియున్నది. వారినేకీభవించునట్లు ఒకజాతియగునట్లు చేయుడు. వారిలో నొకజాతి వారిని మీరు ఘనులు, మీరు పైనుండుడు; వారు క్రిందనుందురని పలుకవలదు. సార్వభౌమత్వము వలదు; సర్వసమత్వమును స్థాపింపుడు. ఈసార్వభౌమత్వములోని అన్యాయము, దీనివలనవచ్చు క్రొత్తబాధ్యతలు, చిక్కులు, ఎఱిగియుండియు దీనికొఱకుమీరు వారితో పోరాడదలచిరా? అట్టియుద్ధము ధర్మయుద్ధము కానేరదు. అది యధర్మయుద్ధమగును. మనజాతికి కళంకము తెచ్చును. మనము చేసిన వాగ్దానములను ఏటఁగలపినవారమగుదుము. ప్రపంచ రాజ్యములలో భ్రాతృభావము కావలెనని మీప్రతినిధులను 'హేగ్'సభకు పంపుట ఎంతహాస్యాస్పదము! మనముధర్మముకొరకున్యాయముకొరకు పాటుపడువారమని చెప్పుకొను ప్రగల్భములెల్ల అసత్యములని మోసమని బయలు పడదా? ఇయ్యుదాహరణము మనలను నిందించుటకు ఐరోపా రాజనీతిజ్ఞుల కెంత వీలుకలిగించును.మన మహారాజ్ఞిప్రభుత్వమున కిది యెంతకళంకము! సామ్రాజ్యకాంక్ష మంచిధె కాని బందిపోటు సామ్రాజ్యము మనకువలదు.

మానవ జీవితము క్షణభంగురము. మనజాతీయ గౌరవమును, సద్గుణములను, మనఆత్మగౌరవమును కాపాడుకొని ఈఘోరాన్యాయముచేసి అపకీర్తి గడించకుండుము గాక! అని కూర్చుండెను.

పార్లమెంటులోని చర్చ:—అక్టోబరు 10 వ తారీఖున కామన్సు సభలో చేంబర్లేను రాజనీతి విధానమును పలువురు తీవ్రముగ ఖండించి విమర్శించిరి. అతడులేచి తనరాజతంత్రమును సమర్థించుకొనెను. తన్నెదిరించు కక్షివారి పలుకులె క్రూగరుకు ధైర్యముం గొలిపి ఇంతవరకు తెచ్చినవనియు,గవర్నమెంటువారికి క్లిష్టమును కష్టమునగుసందర్భమును దెచ్చిపెట్టినవనియు పలికెను. ఈ పలుకులు పార్లమెంటులోఅసభ్యములుగ నున్నవని అధ్యక్షుడు (Speaker) పలికెను. చేంబర్లేను న్యాయమగు విమర్శనములకు బదులు చెప్పుదుననెను. తాను సిసిల్ రోడ్సు సలహాకు లోబడినట్లు చెప్పువారిమాటల సత్యములనియు జేంసన్ తెలివితక్కువగ దాడివెడలిన పిదప రోడ్సుతో తానీ విషయమునుగూర్చి మాటాడనే లేదనియు అతనితో కేపువద్దనుండి కేయిరో వరకును వేయతలంచిన రైలుదారిని గూర్చి మాత్రమె ప్రస్తావించితి ననియు ఈమాట రాలేదనియు సిసిల్ ర్రోడ్సు చాలన్యాయ దృష్టికల ధైర్యశాలి యనియు అతడు లక్షాధికారియయ్యు శత్రుమధ్యమున స్వాయముగ శ్రీమపడు చున్నాడనియు పలికెను.

యుద్ధము తప్పదు:—క్రూగరు చర్యల వలనను మాటల వలనను యుద్ధము తప్పదని తోచుచున్నదని చేంబర్లేను పలికెను. ఈ యుద్ధముయొక్క పరమార్థమును గూర్చి అతఁ డిట్లనెను. 'దక్షిణాఫ్రికాలో మనకును రాజ్యము అధికారము గౌరవము నున్నవని తలంచినచో ఉన్నట్లు ప్రవర్తింపవలెనన్నచో మన బ్రిటీషు ప్రజలను కాపాడి వారికి జరుగుచున్న అన్యాయములతీర్చి వారికష్టములఁ బాపుటకు మనము నిష్టపడుచున్నామనియు మనకును శక్తికలదనియు చూపుటావశ్యకము. దక్షిణాఫ్రికాలో బ్రిటీషుప్రభుత్వము సార్వభౌమత్వముఁగలిగి యుండవలెను. జర్మను పోర్చుగీసు దేశము లాక్రమించిన ప్రదేశములందును సార్వభౌమత్వముండవలెనని నా తలంపుకాదు. ఆ రెండుప్రజాస్వామ్యముల దేశమునను బ్రిటీషు వలసరాజ్యములలోను మన కా గౌరవము, అధికారము నుండవలెను. ఈసభలోని వారెల్ల రా గౌరవమును కాపాడుదురని నానిశ్చయము. ట్రాన్సువాలు సమస్యను తీర్మానించి ఆభారము మనము వహించిననె దక్షిణాఫ్రికాలో శాంతియుండును, లేనిచో లేదు. బోయరుప్రభుత్వము మనలఁ ద్రోసి రాజిలినది. ఈదైన్యస్థితికి తలయొగ్గి నిలచినచో మన గౌరవమును గతియు నేమి కావలసినది!.

మన ప్రభుత్వప్రకటనము లందు చేరని విషయమొక్కటి కలదు. బోయరు లచ్చటి ఆదిమనివాసుల నెంతఘోరముగా

చూచుచున్నారో పరికింపుడు. వారిబాధలు వర్ణింప తరము కాదు. 1895 లో వారి విషయమై నేనొక కబురు పంపియున్నాను. ఆక్షణముననె జేమసన్ దాడిఁ కలుగుటవలన నీకబురు వారి కంపుట యుక్తము కాదని మనయుద్యోగు లూరకొనిరి.

బోయరుల నిశ్చితాభిప్రాయమును, ఆశయము, మనలఁ ద్రోసి రాజన వలెననియె. దక్షిణాఫ్రికాలోనుండి మనలను వెడలఁగొట్టి తామనుభవింపవలెననియె వారిప్పుడు సంపూర్ణ నిర్విరోధ స్వారాజ్యమునె కోరుచు నిజాశయములను బయల్పరచినారు. ట్రాన్సువాలు దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యము కోరిక, ఆశయము, మన కుపద్రవకరములు. రహస్యముగ సంపాదించుకొనిన ఫిరంగులు తుపాకులును ట్రాన్సువాలును బలవత్తరముగ చేసినవి' అనెను. బ్రిటీషు బోయరు యుద్ధము తప్పదయ్యెను.

---

## తొమ్మిదవ ప్రకరణము.

## బ్రిటీషు బోయరులయుద్ధము.

ఇరువదవశతాబ్ది:—ఇరువదవ శతాబ్ది పాశ్చాత్య నాగరకత మహోన్నతి నందినకాలము. అయినను పాశ్చాత్యనాగరకతయొక్క ప్రదర్శనము మొదటనే వింతపరిస్థితులతోను నిరంకుశత్వమునకును వ్యక్తిస్వాతంత్ర్యమునకును

సామ్రాజ్య ప్రజాస్వామ్యములకును యుద్ధములతోను ప్రారంభ మయ్యెను. శతాబ్ది పుట్టియుపుట్టక మున్నే బ్రిటీషుమహాసామ్రాజ్యము బోయరుల చిన్నప్రజాస్వామ్యము పైన ఘోరయుద్ధమును చేసెను. రష్యాసామ్రాజ్యమునకు జపాను ప్రభుత్వమునకు కలహము తటస్థించెను ఇతర చిన్న యుద్ధములును జరిగినవి. ఐరోపా మహాసంగ్రామముతో యుద్ధముల యుగము పూర్తియయినదని చెప్పజాలము. ఈ శతాబ్దిలోని సమరములు విత్రములగు వివిధములగు పరిస్థితులకు కారణములైనవి. బోయరులకు స్వాతంత్ర్యము కలిగినది. జపానువారి నాగరకత వ్యక్తీకరింపబడినది. చైనాలో నూతనోద్యమము కలిగి ప్రజాస్వామ్యము నెలకొల్ప బడినది. రష్యాలోని నిరంకుశత్వము పోయి కార్మిక విజయము సంభవించినది. జర్మనీ సామ్రాజ్యములో వ్యక్తిస్వాతంత్ర్యము ప్రతిష్ఠింపబడినది. స్వేచ్ఛను కోల్పోయిన పోలెండువారు మరల స్వాతంత్ర్యమును పొందిరి. అఖిలప్రపంచజాతీయ ప్రతినిధుల సమ్మేళనముతో నీజగన్నాటకము యొక్కప్రథమాంకము పూర్తి అయినది. కాని భారతీయ శాంతి సమరమింకను జరుగుచునే యున్నది. తెరలో కలకలమింకను నాగలేదు. చైనాలో సమరము ప్రారంభమైనది.

నవయుగారంభమున నూతనాదర్శములను ప్రదర్శించుచు జాతీయగౌరవము, వ్యక్తిత్వము, కాపాడుకొని తను

కన్న వేయిమడుంగు లధిక బలసంపన్నులగు, సూర్యుడ స్తమిం
పని మహాసామ్రాజ్యాధీశులగు బ్రిటీషువారిని ప్రతిఘటించి
నిలిచి అనేక కష్టములు పడి రెండు సంవత్సరములు యుద్ధము
చేసిన బోయరుజాతివారి ధైర్యసాహసములు అనన్యసామాన్య
ములు.

యుద్ధారంభము ; యుద్ధతత్త్వము:—దక్షిణాఫ్రికాలోని
బోయరు బ్రిటీష్ సమస్య ఇదివరకు కొంతవర్ణింపబడియున్నది.
జేంసన్ దాడికి ముందును తరువాతను కూడ ట్రాన్సువాలు
లోని ప్రజలు, బోయరులు, బ్రిటీషువారు, ఆయుధపాణులగు
చుండిరి. బ్రిటీషు సైన్యములు బోయరు సరిహద్దులపైన నున్న
ముఖ్యస్థానములందు కూడుకొనుచుండెను. దీనినికూర్చి క్రూగ
రు అధ్యక్షుడు కొంతసామనీతి నుపయోగించి రాయబారములు
జరిపెనుగాని సంధిపొసగలేదు. బోయరుల ఆత్మగౌరవమునకు
భంగముగలిగినది. 1899 సం॥ అక్టోబరు 9వ తారీఖున 48 గం
టలలో బ్రిటీషుసైన్యముల నడకను పరిహరింపవలసినదిగను
లేనిచో యుద్ధమును ప్రారంభించుచున్నామనియు క్రూగరు
ప్రకటించెను. శృతిమించినది. ఇరుకక్షులవారి కోపాగ్ని ప్రజ్వ
రిల్లినది. యుద్ధముప్రారంభమైనది.

12వ తేదీవచ్చినది. బోయరు సేనానులు రణరంగమున
ప్రవేశించి యుద్ధమును ప్రారంభించిరి. ఇది జాతీయగౌరవమును
స్వాతంత్ర్యమును కాపాడుకొనుటకు చేయు యుద్ధమని బోయ

రులు ప్రకటించిరి. ఇది కాదనియు బ్రిటీషువారిని దేశమునుండి సాగనంపవలెనను దురుద్దేశ్యముతోడి యుద్ధమనియు రెండవ పక్షమువారు చెప్పఁజొచ్చిరి. బ్రిటీషు రాజనీతిజ్ఞులు స్వాగరు రాజనీతినిగూర్చి పలువిధములుగ తలంచిరి. దక్షిణాఫ్రికాలో అనేకకష్టములుపడి తాము సంపాదించుకొనిన భూమిని, స్వదేశముగ చూచుకొనుచున్న దేశములను, స్వరాజ్యముగ తలంచుకొనుచున్న పరిపాలనమును సంరక్షించుకొనుటకు చేయుచున్న ధర్మరణమని బోయరుల వాదము. బ్రిటీషు సామ్రాజ్యమును భగ్నముచేసిబోయరుసామ్రాజ్యమును నెలకొల్పవలయునని దచ్చిరైతులు ప్రయత్నించుచున్నారనిబ్రిటీషువారి వాదము.

ఇరుపక్షులవారి బలాబలములు:—ఉభయపక్షములవారికిని ఒండొరుల బలాబలములు, రహస్యములు, తెలియును. బోయరు ప్రజలలో యుద్ధముచేయగలవారెల్లరును చేరినను ముప్పదివేలకన్న నెక్కుడుకాజాలరని బ్రిటీషుపక్షమువారెఱుగుదురు. తమకు వలసినన్ని సైన్యములు, ధనము, స్వచ్ఛంద సేవకులు యితరపరికరములు సామ్రాజ్య దేశములనుండి నలుప్రక్కలనుండి, నిముసములో వచ్చునని వారికిఁదెలియును. బ్రిటీషువారు యేబదివేల సైన్యమును రణరంగమున ప్రవేశపెట్టిరి. అయినను బ్రిటీషు బోయరు సైనికులకు గొప్పతారతమ్యము కలదు. మరియు తుదివరకును ప్రాణములకు తెగించిపోరాడి స్వాతంత్ర్యము నిలుపుకొనదలచిన బోయరుజాతి యొక్క వీరా

వేశము, విశాలమగు యుద్ధభూమి, కొండలమధ్య నిలుకడలేని సంకులసమరములు భయంకరములని బ్రిటీషువారు ఎఱుగరైరి. ఇట్టిసందర్భములు ఇంగ్లాండునకు స్కాట్లాండులో, సామ్రాజ్యమునకు స్విట్జర్లాండులో, నెపోలియనుకు స్పెయినులో, తటస్థించికష్టతరములుగ పరిణమించెను. మఱియు బోయరులు శూరాగ్రేసరులు దృఢకాయులు ఓర్పుకలవారు. వేట కలవాటుపడినవారు. గొప్పరౌతులు. తమదేశముకొరకు తమజాతికొరకు తమఉనికికొరకు అత్యద్భుతముగ వైరిపీకలను దునుమాడి ఘోరయుద్ధము చేయసాగిరి. బోయరులకన్న బ్రిటీషువారి బలములు అధికములైనను వానిని చూచినంతనే వీరు బయపడి పారిపోవు పిరికిపందలుకారు.

ఈయుద్ధమందు బోయరులును కొంతపొరపాటుపడిరి. పూర్వము మజూబాయుద్ధములో బ్రిటీషుసేన యోటుపడియుండుటనుజూచి వారిబలపరాక్రమములు ధైర్యసాహసములును ఇంతియయని తలచిరి. కొన్నిమారులు ఓడించినచో వారు సంధికి లొంగుదురని తలంచిరి. దక్షిణాఫ్రికాకు సామ్రాజ్యసైన్యములను తీసికొనివచ్చుటకు వీలుండదనుకొనిరి. ఐరోపాలోని యితరజాతులవారు తమయందు సానుభూతిని కలిగి బ్రిటీషువారి నీయధర్మయుద్ధమునుండి వారింతురని తలంచిరి. ఆంగ్లేయుల బలములు సముద్రముపైనుండి లెక్కలతోవచ్చి వ్రాలుదనియు, వారి యుద్ధనౌకలు ముట్టడింపలేని

ప్రదేశమే లేదనియు ఈవిషయమును నితరులెవ్వరును జోక్యము కలిగించుకొనరనియు, వీరుతలంపరైరి. దక్షిణాఫ్రికాలో, కేపు రాజ్యమునందు నితరచోట్లనున్న డచ్చివారుతమకు సాహాయ్యము చేయుదురని బోయరులు తలంచిరి.

యుద్ధపు ఏర్పాటులు:—యుద్ధారంభముననే బ్రిటీష్ వారికి ఇరువదిరెండువేల సైనికులు సిద్ధముగనుండిరి. వారు బోయరురాజ్యమునకు మూడుప్రక్కలనున్న ముఖ్యస్థానములగు లేడీస్మిత్తు, డండీ, కింబర్లే పట్టణములలో కూడియుండిరి. కింబర్లేలో బోయరుల ముఖ్యవిరోధియగు సిసిల్ రోడ్సునుండెను. ఇరుపక్షులవారును చాల పెద్దయుద్ధభూమియందు ఒండొరులతో సమరము చేయవలసివచ్చెను.

యుద్ధప్రకరణము:—యుద్ధము లేడీస్మిత్తుముట్టడితో ప్రారంభమైనదని చెప్పవచ్చును. కొన్ని చిన్న సమరములు జరిగినపిదప లేడిస్మిత్తులోని బ్రిటీషుసైనికులకును బోయరుదళము నకును డండీదగ్గరనున్న గ్లెంకోయనుచోట యుద్ధమయ్యెను. అక్టోబరు 20 వ తేదీన టలనాకొండ సమరముజరిగెను. బ్రిటీషు సేనానియగు వైటు బోయరులనుఎలాండ్సులాగ్టెదగ్గర పోరెను. 30 వ తారీఖున లేడీస్మిత్తుదగ్గర యుద్ధముజరిగెను. ఇందెల్ల బోయరుసైన్యములె విజయమునందెను. బ్రిటీషుసైన్యములు చేయునదిలేక లేడీస్మిత్తులో తలదాచికొనెను. అంతట సుప్రసిద్ధమగు లేడిస్మిత్తుముట్టడిని బోయరులు ప్రారంభించిరి. అట

పడమట బోయరులు మెఫెకింగ్ కింబర్లేలను ముట్టడించిరి. బ్రిటీషుసేనానులు బుల్లరును మెతూన్ ప్రభువును నేటాలునుండి రెండుప్రక్కలనుండియు నచ్చుటికిపోవుటకు బయలుదేరిరి. బ్రిటీషువారికింతలో సామ్రాజ్యము నలుప్రక్కలనుండియు సైన్యము వచ్చెను. నవంబరువచ్చినది. బ్రిటీషువారిసైన్యములు కింబర్లేవైపునకు పోవుచుండగ 27 వ తేదీన నొకచిన్న బోయరు సైన్యమడ్డగించెను. ఇంతలో బోయరుసైన్యములు క్రోంజీనాయకత్వమునను డిలారేసాహాయ్యనాయకత్వమునను వచ్చిపడెను. మెతూన్ ప్రభువు క్రోంజేనితారొక్కనెను. డిశంబరు 10 వ తేదిరాత్రి మెగర్సుఫాంటీన్ దగ్గర ఘోరరణమయ్యెను ఆరోజున 600 మంది బ్రిటీషుసైనికులు మరణించిరి. బోయరులను భేదింపలేకపోయిరి.

దక్షిణమున బోయరులు కేపురాజ్యమున బ్రవేశించిరి. డిశంబరు 9 వ తేదీన బోయరులు స్టాగంబర్గుచెంత బ్రిటీషువారినోడించిరి. కొలెన్సోయుద్ధమునను బోయరులకే విజయము చేకూరెను. ఈయుద్ధమున రాబర్ట్సు (ప్రభువు) సేనానికుమారుడు మరణించెను.

బుల్లరుసేనానియు వైటుసేనానియు నిరుప్రక్కలనుండి లేడీస్మిత్తుకు పోదలచిరి. బుల్లరు టూగేలానదిని దాటవలసియుండెను.

1900 సం॥ జనేవరి ఆరవతేదీన బోయరులు వేగన్ హిల్ అను కొండ దగ్గరను సీజర్సు క్యాంప్ అను ప్రదేశమునను బ్రిటీషువారిని ముట్టడించి విజయులైరి. స్పియాన్ కోప్ దగ్గర బ్రిటీషువారికి జయముగలిగెను గాని మంచువలన విజయముసంగతి నెఱుగక మఱల నోడిపోయిరి బుల్లరు సేనాని ఎట్టకేలకు టుగ్గెలానదిని కొలెన్సో యుద్ధమయినపిదప దాటగలిగెను స్పియాన్ కోపు చెంత ఘోరరణమయ్యెను. సాహాయ్యదళములు రానందున బ్రిటీషువారు వెనుదిరుగుట చూచి బోయరులు విజృంభించి వారిని తరిమిరి ఇంకను లేడీస్మిత్తు మెఫెకింగు కింబర్లే ముట్టడులు అట్లేయుండెను.

1900 సంవత్సరము ఫిబ్రేవరు రెండవవారములో బ్రిటీషువారికి రాబర్ట్సుప్రభువు సేనానిగవచ్చెను. క్రొత్తసైన్యములతో క్రొత్తవ్యూహమును పన్నినాడు నాలుగు దినములొకే రీతిని గుఱ్ఱములను నడిపించుచు పోరాడుచు కింబర్లే వైపునకు పోయెను. 'ఫ్రెంచి' సేనానిని బోయరులను చుట్టు తిరిగి గమ్మనెను ఇతడు క్రోంజీని పట్టుకొన నడుకట్టెను. ఫిబ్రేవరు 28వ తేదీన పార్డెబర్గు సమరముజరిగెను. ఇది బోయరు సంగ్రామము నం దెల్లతీవ్రరణము. క్రోంజీకి నలుప్రక్కలను బ్రిటీషుసేనలు ముట్టడించెను క్రోంజీపైన 27 తేదీన నె బ్రిటీషువారు అగ్నిగోళవర్షముఁగురిపించిరి. అత్యద్భుతముగ పోరాడియు క్రోంజీ యోటువడెను. రాబర్ట్సు సేనాని తనసైన్యములను బ్లూం

ఫాంటీనువంకకు త్రిప్పెను బుల్లరుసేనాని ఇంతలో టుగ్గేలా నదికి దక్షిణమునుండిపోయెను. కింబర్లేముట్టడి విడిపోయిన రెండునెలలలో నొక యుద్ధముజరిగెను. 'రైల్వేహిల్' అను కొండను బ్రిటీషువారు పట్టుకొనప్రయత్నించిరి. పోరు తీవ్రమయ్యెను. బ్రిటీషువారిని లేడీస్మిత్తునకు పోకుండ నిలుపలేరని బోయరులు 28 తేదీన గ్రహించిరి. బ్రిటీషుసేనలత్యధికములయ్యెను. బోయరులు చేయునదిలేక లేడీస్మిత్తు ముట్టడి వదలిరి. బ్రిటీషుబలములు మహాసముద్రమువలె వచ్చిపడుచుండెను.

బోయరులెదిరించి నిలువలేమని తెలిసికొని ప్రతిఘటించి నిలువక మెల్లగ ప్రక్కలనుండి యెదుర్కొనుచు చిన్న చిన్న యుద్ధములుచేయుట ప్రారంభించి. పోప్లగ్రూవ్, డ్రీఫాంటీను (Drie fontien) యుద్ధములిట్టివె మార్చి 13 వ తారీఖున రాబర్ట్సుప్రభువుబ్లూంఫాంటీన్ ప్రవేశించెను అక్కడనుండి ట్రాన్సువాలు ప్రిటోరియాలపైకి పోవుటకు ఒకటిన్నరనెలల విశ్రామము కావలసియుండెను. యుద్ధములవలని శ్రమము మాత్రమెగాక టైఫాయిడుజ్వరమువలనకూడ బ్రిటీషుసేనలకు నష్టముగలిగెను. ఈలోపున 1900 సంవత్సరము మేనెల 24 తారీఖున బోయరు ప్రజాస్వామ్య దేశములను బ్రిటీషువారాక్రమించినారని బ్రిటీషుపరిపాలనమును, రాబర్ట్సుసేనాని

ప్రకటించెను. ప్రిటోరియా చేరుటకు ముందొకదళము మెఫె కింగుకుపోయి సాహాయ్యము చేసెను.

బోయరుల పట్టుదల:—ప్రజాస్వాతంత్ర్యప్రభుత్వము యుద్ధముమానక ధైర్యముగ నిలచెను వారికింకను సేనలుమిగిలి యుండెను. ప్రిటోరియాకగ్గరగనున్న ట్రాన్సువాలు సైన్యములకు బోథా సేనాని నాయకుడు. సెప్టెంబరు నెల వచ్చినది. యుద్ధములింకను జరుగుచునే యున్నవి. క్రూగరుగారికి ధైర్యముపోయెను. ఆయన ఐరోపాకుపోయెను. బ్రిటీషువారు కోమటిపూర్తు నాక్రమించిరి. కాని యుద్ధము ఆగలేదు 18 నెలలవరకును జరుగుచునేయుండెను. బోయరు లత్యంత ధైర్య సాహసములతో పోరాడసాగిరి. బోయరుదళములు త్వరితగ తినిపోవుచు బ్రిటీషువారిని తాకుచు 'గొరిల్లా' యుద్ధములు చేయసాగెను. బ్రిటీషుసైనికులిటు నటుపోవకుండ వెంటాడు చుండిరి. వారి ఆహారపదార్థములను ఇతర సామగ్రిలను అడ్డము కొట్టి లాగుకొనుచుండిరి. బ్రిటీషువారీ కలహములందు లొంగిపోవుచుండిరి. ఈయుద్ధములందు క్రిష్టియన్ డీవెట్టను బోయరు సేనాని ప్రాముఖ్యముగాంచెను. ఇతడీయుద్ధములందు నిపుణుడు. అతడద్భుతముగ శత్రుమధ్యమునుండుటకి పోరాడి పోవుచుండును. ఇతని ధైర్యసాహసములవలనను పరాక్రమ చాతుర్యములవలనను బోయరు లీబ్రిటీషుమహాసేనల కెదురుగ నన్నినెలలు పోరాడగలిగిరి. ఈయుద్ధములందు డీవెట్టు నెట్టైనను

పట్టుకొనవలెనని ఇంగ్లీషువారు విశ్వప్రయత్నములు చేసిరి. కాని అతఁడువీరి చేజిక్కలేదు. డీవెట్టనేకమారులు ఇంగ్లీషువారిని వంచించెను.

బోయరు సేనాధిపతియగు జూబర్టు చనిపోవుచు బోథాను సేనాధిపతిగ చేయుడని చెప్పగ నట్లుచేసిరి బోథాసేనానియు చాల తెలివికలవాడు. యుద్ధములందు నిపుణుడు. క్రూగరు అధ్యక్షుడు 1900 శెప్టెంబరు 19 వ తారీఖున హాలెండునకు సహాయముకోరుటకు పోయెను. బోథాసేనాని ధైర్యమును వీడలేదు. ఇతడు చాల దేశభక్తికలవాడు. ఎల్లప్పుడును స్వభాషలోనే మాటాడును. యుద్ధానంతరమితడు దక్షిణాఫ్రికాసమితిస్థాపింపబడినప్పుడు ప్రథమ ప్రధానామాత్యుడైనాడు.

బోయరు సేనానులలో మఱియొక ఘనుఁడు డిలారే. ఇతడు ననేక యుద్ధములలో జయమొందెను. ఇతని కుమారుడుకూడ యుద్ధములో మరణించెను. ఇతనికి జబ్బుగనున్నప్పుడు రాబర్ట్సుసేనాని ప్రిటోరియాకు వచ్చుచున్నాడన్న వార్త తెలిసెను. ఇతడు తనఅస్వస్థతను లెక్కచేయక తత్క్షణమే లేచి యుద్ధసన్నాహముఁగావించి తానుకూడ యుద్ధము చేసెను. డీవెట్టు ట్రాన్సువాలుకు పోవుచున్నప్పుడాంగ్లేయు లతని నడ్డగింపగ నెన్నో కష్టములుపడి ఇతడు వారిదృష్టినిమరలించి డీవెట్టుకు సహాయుడై నిలచెను.

సంధిమాటలు:—1900 డిశంబరులో పడమర డిలారే, తూర్పున బోథా, దక్షిణమున డీవెట్టు, విజయయాత్రలు చేయుచుండగ కొన్ని సంధిమాటలు జరిగెను. యుద్ధము కొంచెము ఆగెను. కాని మఱలయుద్ధము కొన్నాళ్ళవరకును జరిగెను. రాబర్ట్సుసేనాని తరువాత కిచనరు సర్వసేనానియయ్యెను. బ్రిటీషువారిసైన్యము లత్యధికముగ నలుప్రక్కలనుండియు వచ్చెను. మందుగుండుసామానులు ఇతరసామాగ్రిలు వారి కమితముగవచ్చెను బోయరుసైన్యములకు ఆహారము, సామగ్రిలు దొరకకుండజేసిరి. వారియిండ్లను తగులబెట్టిరి. మధ్య మధ్య రక్షకగృహముల నేర్పరచి సైన్యములఁ గాపుంచిరి. బోయరుల నెన్నివిధముల సంధికిరమ్మనినను వారు రాలేదు. వారు తమ ఆత్మగౌరవమును స్వాతంత్ర్యమును పోగొట్టుకొనుట కంగీకరింపక తుదివఱక ధైర్యముతో పోరాడిరి. ఇందు వారిస్త్రీలుకూడ సహాభాగినులై పాల్గొనిరి.

1902 ఫిబ్రవరునెలలో క్లార్కుజార్జివద్దర జరిగినయుద్ధములో డిలారే కొంపుసేనాని లత్యద్భుతముగ పోరాడిరి. అందు 500 ఆంగ్లేయులు పట్టుపడిరి. 60 బోయరులు చచ్చిరి. 23 గురు గాయపడిరి. ఇట్లు బోయరులింకను పోరాడుచునే యుండిరి. కాని బోయరులపని దైవెనది.

యుద్ధమునందలి న్యాయాన్యాయములు:— ఈయుద్ధమునుగూర్చి పలువురు పలువిధములుగ తలంచిరి. బ్రిటీషువారి

యుద్ధము ధర్మయుద్ధమనిరి. బోయరులిది అధర్మయుద్ధమనిరి. ఈయుద్ధమునకు కారణభూతులని ఒండొరులను నిందించుకొనిరి. దక్షిణాఫ్రికా యుద్ధమునకు బ్రిటీషువారే కారణభూతులని కొందరు విమర్శకులు పలికిరి. గనుల పరిశ్రమవలన ధనమునార్జించుచున్న సాహుకారు పెట్టుబడిదారు (Capitalists) లకొఱకును బంగారు గనులను వశపఱచుకొను కాంక్షవలనను తమ బాహుబలమును ప్రదర్శించి సామ్రాజ్యము వృద్ధిచేసి బోయరుల నడగత్రొక్కుటకును బ్రిటీషువారీయుద్ధమును చేసినారనియు మధ్యవర్తులు చెప్పిన మంచిమాటలనైన పాటింపక, తోడిజాతుల మాటలు మన్నింపక త్రోసివైచిరనియు ఈయుద్ధమును చేయుటకు బ్రిటీషువారు నిశ్చితసంకల్పులై మానలేదనియు కొందఱు తలంచిరి. ఇదికాదనియు బ్రిటీషువారియం దేదోషమును లేదనియు కొందఱు, కోనండాయలు (Conan Doyle) వంటివారు సమర్థించియున్నారు. కాని ఏదియెట్లున్నను యుద్ధము మొదలుపెట్టినతరువాత మాత్రముకొన్ని అక్రమములు జరిగెను. బోయరు రైతుల యిండ్లనంటియుండు చిన్నితోటలదొడ్లను బ్రిటీషువారు కాల్చివైచుట మొదలిడిరి. దీనికి కారణము వారెచ్చటను నిలిచి యుద్ధములు చేయక దాగుకొనియుండి బ్రిటీషుసైన్యములను తుపాకులతో కాల్చి పారిపోవుచున్నారనియు దారులలో మందుగనులను పూడ్చియుంచి పేల్చుచున్నారనియు రైలుపట్టాలను పెరికి పారవైచుచున్నా

కనియు అందు వలన అనుమానమునకు కారణములగు ఆవరణము లను కాల్పించు టావశ్యకమైనదనియు చెప్పిరి. అయినను తమ సేననెట్టి అక్రమమును చేయవలదని ఆజ్ఞాపించినట్లును చెప్పిరి. రైతుల స్త్రీలు ఆహారపదార్థముల కధిక వెలలు చెప్పుచుండి నందున వారికి అన్న క్రోధము కలిగెను. రాబర్ట్సు సేనాని ప్రిటోరియాకు పోవుదారిలో నార్డికాల్ లీయూకాప్ అను రెండుదొడ్లను తగులబెట్టిరి. ఏలయని అడుగగ అచ్చటనుండి కొన్ని తుపాకిగుండ్లు వచ్చినందున కాల్చితిమనెను! ఇంగ్లీషు సేనానులకు బుల్లరు రాబర్ట్సు అనుమానించిన దొడ్లను నిర్దయతో కాల్పించిరి. వీనిని మొదట నాశ్రయించి తరువాత బోయరులను చేరినవారికి కష్టముకలిగించిరి. ఈప్రకారము 630 ఇండ్లు నాశనము లైనవి. ఇందు అనుమానము మీద కాల్చినవి 250. ఇట్లు కాల్చుటవలన బోయరు సైనికుల కుండుటకు స్థలమును తినుట కాహారమును దొరకకుండునని కూడ వారీపని చేసిరి.

బోయరుస్త్రీలను పిల్లలను తీసికొనిపోయి ఒక్కొక్క చోటనుంచి కొన్నిస్థానములలో బిడారములను నిర్మించిరి. 20,000 జనులను 1900 సం॥ లోను 100,000 కు పైబడిన జనమును 1901 సం॥ లోను నిర్బంధించియుంచి పోషించిరి. దీని వలన వారితరులకు సహాయముచేయుటకు వీలులేకపోయినది. వారికి తగిన సౌకర్యములు లేక చాలకష్టములు కలిగెను. రైలుమార్గము పెరికివేయఁబడియుండెను. వారి కాహారము

కలవరమయ్యెను. స్త్రీలు బిడ్డలు చాలబాధనొందిరి. బ్రిటీషు వారు చేయుగల సౌకర్యములు వీరికి సౌఖ్యము కలిగింపలేదు. ఈబిడారములను గూర్చి ఆంగ్లేయ నారీమణియగు మిస్‌హాబుహౌస్‌గారిట్లు వ్రాసినారు. 'బోయరుస్త్రీలు బిడ్డలు వసించు చోటికి చుట్టుప్రక్కలనుండు ధాన్యముచాలదు. నీరు చాలినంతలేదు. గొఱ్ఱెలమందలను దొడ్లలో చేర్చియుంచులాగున వీరిని చేర్చియుంచినారు. చాలమంది శిశువులు మరణించుటకు గారణమగుచున్నది.' ఈమె యింగ్లాండునకుబోయి పత్రికలలో వ్రాసి విమర్శించిన తరువాత బ్రిటీషు ప్రజలును కండ్లు తెఱచిరి. ఇంతలో మశూచి ప్రబలినది. అనేకులు మరణించిరి. ఈబిడారములె దీనికి కారణములు.

బ్రిటీషు సేనలు బోయరులపైన చేసిన యుద్ధములో కొన్ని అధర్మములను చేసిరి. ఈయుద్ధములో దేహములోనికి చొచ్చుకుని పోవగనె వ్యాపించి చీల్చు 'డం డం గుండ్లు' ప్రయోగింపఁబడెను. మూడు నెలల వరకును లక్షలకొలది తోటాలిట్టివె ఉపయోగింపఁబడెనని ఒక ఆంగ్లేయపత్రికయే వ్రాసినది కాని డండంగుండ్ల నుపయోగింపకూడదని శాసింపఁబడియుండెనని యచ్చటి అధికారులనిరి. అయిన నిటీవల నొకసంగతి బయలుపడినది. బ్రిటీషుకర్మాగారము లో నియమములకు విరుద్ధముగ తోటాలుకొన్ని చేయబడగ వానిని తుపాకి ప్రేల్చుట నేర్చుకొనువారికొరకు దక్షిణాఫ్రికాకు పంపియుండగ

వానిలో కొన్ని డండీలో మిగిలియుండెననియు 30అక్టోబరునాడు మొదటజరిగిన యుద్ధములో దీనినిగూర్చి బోయరులు మొఱ పెట్టగనె బ్రిటీషువారు నిషేధించిరనియు తెలిపిరి.

ఖైదీలను బాధించుట:— యుద్ధములో చెఱబెట్టబడిన వారిని బ్రిటీషువారు క్రూరముగ చూచిరనుట కల్లయని డాక్టరు కోనండాయిలుగా రనిరి. బోయరులు చెఱబెట్టబడినది మొట్టమొదటనే 1899 అక్టోబరు 21 తేదీనాడు ఎలాండ్సు లాగ్టేదగ్గర. ఆరాత్రి వర్షము కురియుచుండెను. అప్పుడు బోయరులను తిన్నగజూడలేదని ఒక పత్రిక వ్రాసియుండెను. ఒకప్పుడు మాత్రము శరణాగతులనుకూడ చంపుట తటస్థించినది. దానిని చేసిన దుర్మార్గులను బ్రిటీషువారు శిక్షించిరయే యున్నారు. అయినను ఈయుద్ధమున చెఱపెట్టబడినవారికి కొన్ని మరణదండనలు విధింపబడినవి. వీరు బ్రిటీషు కాలనీలో నుండి కుట్రలుచేసిన బోయరులు. బోయరులతో చేరిన కొందఱికి వివిధములగు కారాగారవాసశిక్షలు విధించిరి. రైలు దారిని పెరికివేసి గుడారమును పెరికినవారికి మరణదండన విధించిరి. ఇది అక్రమమని పలువురు పలుకగ తరువాత బోయరులను చాలమందిని చెరసాల కంపసాగిరి.

యుద్ధమువలని ఫలితము:— యుద్ధమువలన చాల నష్టము సంభవించెను. సంధియగునప్పటికి 31 వేల నాలుగు వందల బోయరులు శత్రువులచే జిక్కి పరదేశములకు పంప

బడిరి. మూడువేల ఎనిమిదివందలమంది చనిపోయిరి. 10 వేల మంది యుద్ధము మాని దీనులైరి. ఈ యుద్ధమువలన బ్రిటీషువారికి 250,000,000 పౌనులు ఖర్చుపడెను. ఈ ధనము జర్మనీవారికి చాలవఱకు చేరెను. వారును గొప్ప నౌకాదళమును నిర్మించుకొనగలిగిరి. ఈ యుద్ధసమయమున బ్రిటీషువారి వశమందనుండి ప్రాణములతోనుండిన స్త్రీలలో పిల్లలలో 26 వేలమంది చెడు ఆహారములవలన రోగములువచ్చి మరణించిరి. 13 వేలు బ్రిదికియుండినవారు పరదేశములలో ఖైదీలుగ నుంచబడిరి. బోయరుల స్వార్థత్యాగము ఓర్పు పట్టుదల ప్రపంచచారిత్రమున నెచ్చటను కనుబడదు. చివరకు ఆహారమే దొరకలేదు గుఱ్ఱములు చిక్కిపోయినవి. ఏది ఎట్లయినను డచ్చి రైతుల ధైర్యసాహసములు పట్టుదల చూచి బ్రిటీషువారును పరులును ఆశ్చర్యము నొందిరి. వారియందు గౌరవముచూపిరి. ట్రాన్సువాలు ఆరెంజి ఫ్రీస్టేటు ప్రజాస్వామ్యములోని వారింక నేమియు చేయజాలకపోయిరి. కాని వైరులకు లొంగుట కిష్టపడరైరి. స్త్రీలును ధైర్యముతోడను ఓర్పుతోడను పురుషులను ప్రోత్సహించుచుండిరి. ఐరోపా దేశము లేవైన దయదలచి యీ సమరమున ప్రసక్తి కలిగించుకొని తమ కుపకారము చేయుననను నాసపోయినది. కాంగ్రెసు అధ్యక్షుడు ఐరోపావారికి విన్నవించుటకు పోయియుండెను. స్కాల్కుబర్గర్ (Mr. Schalk. W. Burger) తాత్కాలిక

ముగ నధ్యక్షుడయ్యెను. కూగ్రిరును ఇతరులను రాయబారులుగ హాలెండు ప్రభుత్వమువారు గౌరవించి యాదరించిరి కాని ఇతర ప్రభువులు వీరికి సాహాయ్యము చేయలేదు.

1902 సం॥ జనేవరునెలలో ప్రజాస్వామ్య రాయబారులను దక్షిణాఫ్రికాకుపోయి ప్రజా ప్రతినిధులతో నాలోచించి యుద్ధము నాపుట కంగీకరించునట్లు అనుజ్ఞనీయుడని హాలెండు ప్రభుత్వమువారు బ్రిటీషుపరదేశ రాజ్యాంగమంత్రి (Secretary of State for Foreign affairs)లాన్సుడవున్ (Lansdowne) ప్రభువునకు చెప్పిరి. అతడు దీనికి అంగీకరింపలేదు. దక్షిణాఫ్రికానాయకులు తిన్నగ బ్రిటీషు సర్వసేనానితో మాట్లాడ వచ్చునని బర్గరుగారు సర్వసేనానియగు కిచనర్ ప్రభువుతో ఉత్తరప్రత్యుత్తరముల నెరపెను. అంతట ఏప్రిలు 1902 లో అధ్యక్షుడగు బర్గర్, ప్రభుత్వకార్యదర్శియగు ఎఫ్. డబ్లియు రీట్జు, బోయరు సర్వసేనానియగు బోథా, డిలారే సేనానియు మరియు నారుగురు ట్రాన్సువాలు రిపబ్లికు పక్షమునను, ఎమ్. టి. స్టెయిన్ (ఆరెంజి అధ్యక్షుడు) సర్వసేనానియగు డీవెట్టును, జె. బి. ఎమ్. హెర్టుజాగ్ సేనానియు ఆరెంజి ప్రజాస్వామ్యముపక్షమునను, సమావేశమై 11 వ తేదీన కిచనరుగారిని సందర్శనము నిమ్మని కోరి తమ ప్రభుత్వములు బ్రిటిషువారితో స్నేహముగ నుండి ప్రజలెల్లరకు సమానహక్కులని చ్చెదరనిరి. ఈసంగతి ఇంగ్లాండుకు కిచనరు తంతి నంపెనుగాని రాబర్ట్సు

సేనాని 24-5-1900 తారీఖున నీప్రిజాస్వామ్యములందు బ్రిటీషు పరిపాలనము ప్రకటించియుండినందున వాని స్వాతంత్ర్యమునకు బ్రిటీషుప్రభుత్వము వా రంగీకరింపలేదు. ప్రజల స్వాతంత్ర్యములను పోగొట్టుకొను సంధి కోడంబడుట కా ప్రజాస్వామ్యముల ప్రతినిధుల కధికారము లేనందున కర్తవ్యమాలోచించుటకు ప్రజలనే 80 క్రొత్తప్రతినిధులను ఎన్నుకొని 1902 మే15వ తేదీన వెరీనిజింగ్ (Vereeniging) లో సమావేశపరచుటకు నిశ్చయించిరి.

వెరీనిజింగ్ సంధి:—అట్లుకూడిన సభవారు విట్ వాటర్సు రాండు (Witwaters rand) ను స్వాజీదేశమును పూర్తిగ బ్రిటీషువారి కిచ్చెదమనియు పరదేశముల వ్యవహారములందు బ్రిటీషువారికిలోబడెదమనియు బోథా,డీవెట్టు,డీలారే, స్మట్సు, హెర్టుజాగుగారలను ప్రిటోరియాకు సర్వసేనాని యగు కిచనరు ప్రభువునకును సామ్రాజ్యమువారి హైకమీషనరుగనున్న మిల్నరు ప్రభువుగారికిని రాయబారమంపిరి. మిల్నరుగారును కిచనరుగారు నది నిరాకరించిరి. ఇంకను చిల్లర యుద్ధములుచేయుచున్నవారు లోబడి యుద్ధపరికరములు బ్రిటీషువారికిచ్చి ఎడ్వర్డుచక్రవర్తిగారిని రాజుగ నంగీకరించి ప్రజాస్వామ్యములు దేశాంతరములకంపిన యుద్ధఖైదీలను మరలతెచ్చి బ్రిటీషువారి వశముచేయువలెననియు యుద్ధధర్మమున జరిగిన పనులకు ప్రజాస్వామ్యప్రజలపైన బ్రిటీషువారు సివిలు క్రిమినలం

చర్యతీసికొనరనియు ప్రజలుకోరినచో వారిబిడ్డలకు డచ్చిభాష యె నేర్పబడుననియు న్యాయస్థానములందు అవసరమునుబట్టి డచ్చి యుపయోగింపబడుననియు తుపాకు లుంచుకొనువారు లైసెన్సులు పొందవలెననియు అప్పటి యుద్ధప్రభుత్వమునకు బదులు సాధ్యమగునంత త్వరలో (Civil Government) శాంతి ప్రభుత్వము నెలకొల్పబడుననియు, తరువాత ప్రజాప్రతినిధుల సంస్థలు నెలకొల్పబడుననియు, దేశమునకు స్వపరిపాలనమిచ్చు లోపల నేటీవులకు ఎన్నికహక్కు లిచ్చువిషయము తీర్మానింపబడ దనియు యుద్ధవ్యయమునకుగాను క్రొత్తపన్ను లుండవనియు యుద్ధ పరిహారమునకు ప్రత్యేకించిన సొమ్మునుండి బ్రిటీషు ప్రభుత్వము వారే ఇదివరకుండిన ప్రభుత్వమువారి బాధ్యతలను అంగీక రింతురనియు నీపద్ధతులు మార్చుటకు వీలులేదనియు చెప్పిరి. బోయరురాయబారము మే నెల 29 తారీఖున 'విరీనిజింగు' కు తిరిగిపోయెను. సభలో మరలచర్చజరిగెను. కొందరేమైనను యుద్ధము తుదివరకు చేయుదుమనిరి. కాని మే 31వ తారీఖున 51 మంది యీ షరతులంగీకరించుటకు సమ్మతించిరి. 6 మంది వ్యతిరేకముగనిరి. ఆరాత్రి 11 గంటలకు సంధిపత్రమున బోయరురాయబారులును కిచనరు మిల్నరు ప్రభువులును చే వ్రాళ్లు చేసిరి. అట్లుబోయరు ప్రజాస్వామ్యము లంతరించెను. ఇవి బ్రిటీషువలస రాజ్యములుగ బ్రిటీషుపరిపాలనమున గలసి నవి. మిల్నరుప్రభువును బ్రిటీషువారు ఈవలసరాష్ట్రములు

పాలించుటకు హైకమీషనర్ గ నియమించిరి. 1903 సంవత్సరమున పెద్దకఱవువచ్చెను. పంటలు నాశనమయ్యెను. ప్రజలు చాల బాధ ననుభవించిరి. యుద్ధమున దరిద్రులైనప్రజలు మలమలమాడుచుండిరి. ఆర్థికముగ దేశము దీనస్థితియందుండెను. ఆరోగ్యముపోయెను. ఈదౌర్భాగ్యమున ప్రజలుండగ బ్రిటీషువారు కొంతకొంతముగ దాక్షిణ్యముగ పరిపాలింపసాగిరి. ప్రజలలో కొందరిని మెల్లగ బ్రిటీషుపరిపాలక కార్యాలోచన సంఘమున నియమించి ఒకశాసనసభను స్థాపించిరి కాని దీనిలో నున్న సభ్యులెల్లరు నుద్యోగులె. ప్రజలకు ఎన్నికహక్కులేమియు లేదు. శాసనసభాతీర్మానములు హైకమీషనరు కాదనవచ్చును. వారుచేసిన చట్టములను బ్రిటీషు పరరాజ్యకార్యదర్శి (Secretary for Foreign affairs) గారి యిష్టముతో చక్రవర్తిగారు తోసివేయవచ్చును. ప్రభుత్వమువారు వ్యవసాయమును పురికొల్పిరి. అప్పుడె చైనాదేశమునుండి కూలివారిని దిగుమతిచేసిరి. ఇది ప్రజలకిష్టములేనందున నాపివైచిరి. 1904 సంవత్సరమున మహామ్మారి వ్యాధి దేశమున ప్రవేశించెను. 1905 సంవత్సరమున మిల్నరుప్రభువునకు బదులుగ సెల్బోర్న (Selbourne) ప్రభువు బ్రిటీషు హైకమీషనరయ్యెను. పురపాలకసంఘములలోను శాసనసభలలోను నల్లవారికి తావులేనందున బ్రిటీషుబోయరు సభ్యులెల్లరేకమై భారతీయులకు వ్యతిరేకముగ శాసనములు చేయుచుండిరి 1906 సంవత్సరమున

నేటాలులోని జూలూతెగవారు కుట్రచేసిరి ఇందువలన దేశమునకు జాలనష్టము సంభవించెను. బ్రిటీషువారు రొడీశి యా దేశమును వర్తకసంఘమువారి పరిపాలనము నుండి హైకమీషనరు పరిపాలనమున జేర్చిరి. ఇట్లు దక్షిణాఫ్రికాలోని బోయరురాజ్యములు కేపుకాలనీ నేటాలులతోపాటు బ్రిటీషు వలసదేశము లయ్యెను కాని కేపుకాలనీ నేటాలురాజ్యములోనిప్రజలకు ఎన్నికహక్కులును, ప్రతినిధులను శాసనసభలకు పంపి స్వపరిపాలనమును చేసికొను భాగ్యముండగ వానికి లేదయ్యెను.

---

## పదినాల్గవ ప్రకరణము.

## దక్షిణాఫ్రికా సమితి.

## (The Union of South Africa.)

కేంద్ర ప్రభుత్వాభిలాష :— 1906, 1907, సంవత్సరములలో బ్రిటీషువారు రాజ్యాంగ సంస్కరణము చేసిరి. ఆరెంజి ట్రాన్సువాలు దేశములకు కేపుకాలనీ నేటాలు రాజ్యములతోపాటు బ్రిటీషు వలసరాజ్యముల కీయబడు బాధ్యతాయుత ప్రజాప్రాతినిధ్య స్వపరిపాలనము (Parliamentary Colonial Self Government) ను బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వమువారు దయచేసిరి. వీనికి ఎన్నుకొనబడిన ప్రత్యేక శాసన

సభలు (పార్లమెంట్లు) నుండెను. నాలుగు ప్రభుత్వములు, నలుగురు గవర్నరులు నాలుగు పరిపాలకవర్గములు, నాలుగు ముఖ్య న్యాయస్థానములు నాలుగు ధనాగారములు నుండెను. వీనిని దక్షిణాఫ్రికాలో బ్రిటీషు పరిపాలక ప్రతినిధి కనిపెట్టి చూచుచుండెను. నాలుగు రాజ్యములును బ్రిటీషుదేశ వలస రాజ్యాంగ కార్యదర్శిగారి యధికారముక్రిందనున్నను ఆంతరంగిక విషయములందు స్వాతంత్ర్యముగలిగి యుండిరి. ఎన్నికలు జరిగినవి. ప్రజలప్రతినిధులె శాసనసభలకు పోయిరి. వారి ప్రతినిధులె మంత్రులైరి. ట్రాన్సువాలులో బోథాసేనాని ప్రధానామాత్యుడయ్యెను. స్మట్సు సేనాని వలస మంత్రి (Colonial Secretary) యయ్యెను. ఇట్టి ప్రత్యేకపరిపాలనములు దుర్బలములై ధనవిహీనములై వివిధములగు చిక్కులకు లోనగుచుండెను. బోయరుయుద్ధమువలని ఆర్థిక అనర్థము లింకను పోలేదు. ప్రజల ఆరోగ్యము బాగుపడలేదు. స్థానిక స్వపరిపాలనము దీనస్థితియం దుండెను. దక్షిణాఫ్రికాలోని అఖిల పాశ్చాత్య జనముల పురోభివృద్ధికి ఈ ప్రభుత్వములు తోడ్పడలేకుండెను. డచ్చిభాషనే మాట్లాడు ప్రజల కెల్లర కొకేవిధమగు సాంఘికాచారము లుండెను బ్రిటీషువారును డచ్చిబోయరులును కలసిపోవుచుండిరి. దక్షిణాఫ్రికా దేశాభిమానము ప్రజలందు కలుగుచుండెను. ఇంతలో పాశ్చాత్యులకును ఆదిమవాసులకును పుట్టిన వర్ణభేదములు కల మిశ్రమ

జాతి మనుష్యులు వృద్ధియైరి. క్రైస్తవ గురువుల బోధవలన నాదిమవాసులును నాగరకులై అభివృద్ధి జెందుచుండిరి కొందఱు ఆదిమవాసులు అప్పుడప్పుడు తిఱుగబాటు చేయుచుండిరి. ఇట్టి వివిధ సమస్యలైకమత్యమును పురికొలుపసాగెను. దక్షిణాఫ్రికా ప్రజలందు ఐకమత్యముకలిగి వివిధ వలసరాష్ట్రములవారొకరికొకరు సహాయముచేసికొనవలెనను తలంపు కలిగెను అట్లు చేసిరి కాని కేంద్ర ప్రభుత్వమున కుండు సహకారము గలుగలేదు. అందువలన నొక ప్రభుత్వమును స్థాపించుకొనవలెనను నుద్దేశము కలిగెను.

**రాజకీయ సంస్కరణ ప్రతినిధుల సభ:**— అంతట 1908 లో వివిధరాజ్యముల పార్లమెంటులు నీ రాజకీయ సంస్కరణ విషయమును దక్షిణాఫ్రికా పురోభివృద్ధి, శాంతి, నాగరకత, ఆర్థిక సమస్య నేటీవుల సమస్యలను తీర్మానించుటకు కార్యాలోచనము చేయుటకు ప్రతినిధుల నెన్నుకొనెను. దౌర్జన్యముచేసి బోయరులపైకి దాడవెడలిన డాక్టర్ జేమసన్ (Jameson) ఇతనిని తుపాకితో కాల్చుమనిన బోథాసేనానియు, యుద్ధమున బ్రిటీషువారితో పోరిన బోయరుప్రముఖులగు స్టెయిన్, స్మట్సు, డిలారే, డీవెట్టుగారలును, వీరిని ప్రతిఘటించిన జార్జిఫరార్, పెర్సీ, ఫిట్జుపాట్రిక్ మొన్నగువారును ఇతర ప్రతినిధులును కలసి కార్యాలోచనము చేయసాగిరి. ఈ ప్రతినిధుల సభ (Convention) డర్బనులోను కేపు

టవ్రునులోను సమావేశమై కార్యాలోచనము చేసెను. వివిధ రాజ్యము లిప్పటినుండి కేంద్రసమితి ప్రభుత్వమున నుండుట కును నాలుగు రాజ్యములును రాష్ట్రములుగ విభజింపబడు టకును వీనిని ఒకపరిపాలకుడు నొకకార్యాలోచన సభయు కలసి పరిపాలించు చుండుటకును ఈరాష్ట్రములు కేంద్రశా సనసభల పరిపాలనమునకు లోబడుటకును రాజకీయ నాయ కులు తీర్మానించిరి. 1909 సం॥లో ఈ రాజ్యాంగవిధానము వివిధరాజ్యముల పార్లమెంటులలో చర్చింపబడెను. నేటాలు వారుమాత్రము దీనివలన బోయరుల కధికలాభము కలుగు ననియు బ్రిటీషువారి యధికారము తగ్గుననియు భయపడిరి. తుద కీరాజ్యాంగవిధాన చట్టమును ఇంగ్లాండున కంపిరి. అచ్చ టిపార్లమెంటువారు దీనిని శాసింపగ చక్రవర్తిగారు 1910 సం మే 31 తారీఖున చేవ్రాలు చేసెను. ఇదియె 'దక్షిణాఫ్రికా సమితిచట్టము' దీనివలన రాజ్యాంగపద్ధతి మారినది. 479114 చతురపు మైళ్ళదేశము 62,74000 జనసంఖ్యయు గలదేశము, దక్షిణాఫ్రికా సమితిగ చేయబడెను.

రాజ్యాంగ పద్ధతి:—దక్షిణాఫ్రికాసమితి ప్రభుత్వము నందలి సర్వాధికారములును రాజ్యాంగ సిద్ధాంతమును బట్టి బ్రిటీషు సార్వభౌమునవె. ఆచరణమున నీప్రభుత్వమున ఆ యన నియమించిన ప్రతినిధియగు గవర్నరుజనరలుగారు నాయ నకవున్సిలును పరిపాలించును. ఆయన కవున్సిలులోని సభ్యులె

మంత్రులు. వీరిని గవర్నరు జనరలె నియమించును. వీరుబ్రిటీషు రాజ్యాంగము నందువలెనే వివిధములగు డిపార్టుమెంటుల పరిపాలన వ్యవహారములను చూచుచుందురు. వీరాంగ్లేయ (సెక్రిటరీస్ ఆఫ్ స్టేట్) రాజ్యాంగ మంత్రులవంటివారు. ఇట్టి మంత్రులు పదిమందియున్నారు. గవర్నరు జనరలుగారికి సంవత్సరమునకు 10,000 పౌనులు వేతనము. అనగా 150,000రూపాయిలు. మన భరతఖండపు గవర్నరు జనరలుగారికి వత్సరమునకు 2,56,000 రూపాయలు. దక్షిణాఫ్రికా ప్రభుత్వమునకు 1910 సంవత్సరమున మొదటిగవర్నరు జనరల్ వైకౌంటుగ్లాడ్ స్టన్ప్రభువు. 1914 సం॥లో ఏరల్ బక్స్టన్ ప్రభువు. 1920 సం॥లో ప్రిన్సు ఆర్థర్ ఆఫ్ కన్నాటు ప్రభువును గవర్నరు జనరలుగ నుండిరి. 1924 లో ఎత్లోన్ ప్రభువు ప్రభుత్వమునకు నియమింపబడినాడు. సమితిలో చేరని ఇతరభాగములకు గవర్నరుజనరలుగారినె పరిపాలక ప్రతినిధి (హైకమీషనరు)గ బ్రిటీషు సామ్రాజ్యమువారు నియమించినారు.

మంత్రులు; వీరి డిపార్టుమెంట్లు:—పదుగురు మంత్రులలో నొకడు ప్రధానామాత్యుడుగ నియమింపబడును. మొదటిమంత్రులను బ్రిటీషు గవర్నరుజనరలు రాజ్యాంగసభలో నుండియు ఇతరులలో నుండియు నియమించెను. లూయీ బోథా సేనానినే ప్రధానామాత్యునిగ చేసిరి. పదిమంది మంత్రులును పది డిపార్టుమెంటులను చూచుచున్నారు. (1) రైల్వే

హార్బరులు (2) స్వదేశవిషయములు (Interior) గనులు, సైన్యము (3) న్యాయశాఖ (4) ఆదాయవ్యయములు ప్రభుత్వకోశాగారము (Finance) (5) విద్యాశాఖ (6) భూములు (7) నేటివ్‌వ్యవహారములు (8) వాణిజ్యము, హస్తకళలు (9) పబ్లికువర్క్సు, తపాలాతంతి వ్యవహారములు (10) వ మంత్రికిప్రత్యేకడిపార్టుమెంటు లేదు. ప్రధానా మాత్యుడును ప్రత్యేకముగనే వ్యవహారములను చూడడు. ఇందు ముఖ్యముగ స్వదేశవిషయముల డిపార్టుమెంటుచాల ముఖ్యమైనది. ఈమంత్రిచూచుపనులు, వైద్యశాలలు, కుష్ఠరోగశరణాలయములు, వలసవారి రాకపోకలు, ఆసియావారివ్యవహారములు, జనాభాలెక్కలు, ఇతరలెక్కలు, వాతావరణ దర్శకకార్యాలయములు, జాతీయచిత్రవస్తు ప్రదర్శనశాలలు, జననమరణ వివాహములు, ప్రభుత్వముద్రణాలయములు, భారతీయవలససంస్థ. న్యాయశాఖమంత్రిచూచుపనులు, ముఖ్యన్యాయస్థానములు, నేటాలు నేటివ్‌హైకోర్టు, దండవిధాయి (మేజస్ట్రీటు) కోర్టులు, స్పెషల్ జస్టిసెస్ ఆఫ్ ది పీస్ కోర్టులు, అటార్నీజనరలు, పోలీసు, ఉపకారవేతనములు, ఆఫీసులు, పేటెంటులు, కాపీరైటులు, షెరీఫులు. ఈమంత్రులక్రింద పనిచేయుటకు కార్యదర్శులును సహాయకార్యదర్శులును, (Under Secretaries) కలరు.

మొదటిమంత్రులు:— వీరు 31-5-1910 సంవత్సరమునుండి 19-12-1912 వరకును పరిపాలించిరి. తరువాత క్రొత్త

వారు నియమింపబడిరి. అయినను బోథాగారే మఱల ప్రధానామాత్యుడుగ నియమింపబడెను. మూడవమారు మంత్రులు మారినప్పుడు 1919 సం॥ సెప్టెంబరు 3వ తేదీన జే. సీ. స్మట్సు సేనాని ప్రధానామాత్యుడయ్యెను. ఈయన 1924 సం॥ జూన్ నెలవరకు ముఖ్యమంత్రిగనుండెను. 19-3-20వ తేదీన నాలుగవమారు మంత్రులు మారిరి. అయినను స్మట్సుసేనానినే ప్రధానా మాత్యునిగ మరల నేర్పరచిరి. 1921 సం॥లో (జనరల్ ఎలక్షన్) ఎన్నికలు వచ్చినవి. అందుస్మట్సు గారిపక్షమువారే చాలమంది విజయులైరి. 10-3-1921వ తేదీన ఆయన మఱల నైదవమంత్రి వర్గమునకుకూడ ప్రధానామాత్యుడైనాడు. ఈయన అనేకఉద్యోగములు, పదవులు, పొంది ప్రఖ్యాతి గాంచినాడు. 1923సం॥ లో జరిగిన బ్రిటీషు సామ్రాజ్య మహాసభకు ప్రతినిధిగ కూడ పోయినాడు. 1924 సం॥ జూన్ నెలలో జరిగిన ఎన్నికలలో(J. B. M. Hertzog) జె. బి. యం. హెర్టుజాగ్ గారిపక్షమువా రధిక సంఖ్యాకులు శాసనసభలయందు విజయులైనందున హెర్టుజాగ్ గారిని ప్రధానా మాత్యునిగ నియమించినారు. మెజారిటీ పక్షమువారు ప్రభుత్వములో మంత్రులుగ నియమింప బడుటయు వారికి ప్రతికక్షులుగ నిలచిన పక్షమువారు పార్లమెంటు సభలలో వారికి వ్యతిరేక పక్షముగ నుండుటయు నేటి రాజ్యాంగ విధానములందొక ముఖ్యలక్షణముగ నున్నది. అందువలన స్మట్సు సేనాని ప్రభుత్వమునకు

వ్యతిరేక పక్షమునకున్నాడు. స్వదేశవిషయముల మంత్రి (Minister for the Interior) పదవిని 1910 సం॥ లో గౌరవనీయులగు జె, సీ స్మట్సు సేనానిగారు పొందిరి. 1912 సంవత్సరములో ఎ. ఫిషర్ గారును, 1916 సంవత్సరములో సర్ తామస్ వాట్ గారును, 1921 లో పాట్రిక్ డంకన్ గారును స్వదేశమంత్రులు. 1924 సం॥ మొదలు డాక్టరు మాలన్ గారు స్వదేశమంత్రులుగ నున్నారు. న్యాయశాఖామంత్రి (Minister of Justice) పదవిని 1910 సంవత్సరమున జె. బి. ఎమ్. హెర్టుజాగ్ (General, J. B. M. Hertzog) గారును 1912 లో జే. డబ్లియు సవుర్ గారును 1913లో ఎన్. జే. డీవెట్టుగారును పొంది పరిపాలించిరి.

దక్షిణాఫ్రికా పార్లమెంటు:— దక్షిణాఫ్రికా చట్టపు రాజ్యాంగ విధానమున పార్లమెంటును 1910 సం॥ డిశంబరు 4వ తేదీన కన్నాటు ప్రభువు ఉత్సవముతో తెరచెను. దక్షిణాఫ్రికా శాసననిర్మాతలు గవర్నరు జనరలును పార్లమెంటును (అనగా అసెంబ్లి శాసనసభయు, సెనేటుశాసన సభయు) అసెంబ్లీసభకు ప్రతిరాష్ట్రమును సభ్యుల నెన్నుకొనును. అందలి సభ్యుల నైదేండ్లకొకమారెన్నుకొందురు. ఈరాష్ట్రములందు పూర్వపు సభలకుండిన ఎన్నికపద్ధతులు నిలిపిరి. కేపురాజ్యములో నల్లవారికి గూడఎన్నుకొను హక్కులున్నవి. కాని ఐరోపా

వారిని మాత్రమె ఎన్నుకొనవలెను. జనసంఖ్య హెచ్చుతగ్గులనుబట్టి ఎన్నిక ఫిర్కాలను మార్చుచుందురు.

సెనేటు:—సెనేటుసభ, మనస్టేటుకవున్సిల్ సభవంటిది. ఇందు నలుబది సభ్యులుందురు. 1910 సంవత్సరములో నాలుగు రాష్ట్రముల పార్లమెంటులును ఎనిమిదిమంది చొప్పున ఎన్నుకొనిరి. గవర్నరు జనరులుగా రెనమండ్రుగురను నియమించెను. వీరు పదేండ్లవరకును సభ్యులుగనుండిరి. 1920 సంవత్సరము మార్చినెలలో రెండవసెనేటు కూడినది. దీనియందు నదేప్రకారము 40 మంది సభ్యులుండిరి. ఇప్పుడును నాలుగు రాష్ట్రములవారును చెరియొక ఎనిమిదిమందిని గవర్నరు జనరలుగారొక ఎనమండ్రుగురను నియమించిరి. గవర్నరు జనరలుగారు నియమించిన సభ్యులలో నలుగురు, బంటూతెగల నెరిగి వారి క్షేమము నరయుటకు నియమింపబడినవారు సెనేటుసభకు అసెంబ్లీ సభవారి చట్టములను నిలుపుచేయు నధికారమేగాని రద్దుచేయు నధికారములేదు. ఉభయసభలకు నభిప్రాయభేదమువచ్చినపుడు ఉభయసభ్యుల జాయింటు సభలో అధిక సమ్మతులనుబట్టి తీర్మానము లంగీకరింపఁబడును.

పార్లమెంటు సభ్యులకు వత్సరమునకు 400పౌనుల చొప్పున వేతనమిత్తురు. వీరూరక రైళ్లమీదపోవచ్చును. అసెంబ్లీసభలో మొదట 121 సభ్యులుండిరి. వీనిని కూర్చి దక్షిణాఫ్రికా సమితి చట్టముయొక్క 44 వ శెక్షనులో వివరింపబడి

యున్నది ముప్పది సభ్యులైన వచ్చినగాని శాసనసభ యొక్క వ్యవహారములు జరుపరాదు. సభికునికి సంవత్సరమునకు నాల్గు వందల పౌనులు వేతనముగ నిత్తురు. పార్లమెంటు సెనేటునకును అసెంబ్లీకిని ప్రత్యేకముగ కార్య నిర్వాహకోద్యోగులును కలరు. అధ్యక్షుడు, స్పీకర్, లేఖకుడును కలరు. గ్రంథాలయాధికారి ఈ రెండు సభలకు నొక్కడె. 1910 సంవత్సరము మొదలు 1921 వరకును అసెంబ్లీ సభవారు ప్రజల అంతరములను హక్కులను గూర్చి 15 చట్టములను చేసినారు. అందు ముఖ్యముగ 1913 వ సంవత్సరపు (ఇమిగ్రేషను) వలస చట్టము, 1914వ సం॥ ఇండియన్ రిలీఫుచట్టము 1919 వ సం॥ ఆసియాటిక్ ల్యాండ్ ట్రేడింగు అమెండ్‌మెంట్ చట్టము. (ఆసియావారి భూమి, వర్తకములను హక్కులను గూర్చినది.) 1920 వ సంవత్సరపు ఇండియన్ ఇమిగ్రేషన్ ట్రస్టుబోర్డు ట్రాన్సుఫరుచట్టము మనకు సంబంధించినవి. 1921 వ సంవత్సరము తరువాత వర్ణభేదములను గూర్చియు ఆసియావారలను గూర్చియు చట్టములుచేయుటకు బిల్లులు ప్రవేశ పెట్టబడినవి. చిన్నచట్టములు చాలచేయబడినవి. తరువాత వర్ణభేదపు చట్టమును ఆసియాచట్టమును హెర్టుజాగ్ ప్రభుత్వమువారుచేసిరి. దక్షిణాఫ్రికా చట్టము ప్రకారము మొదటి పార్లమెంటు 1910, 1911, 1912, 1913, 1914, 1915, సంవత్సరములలో కూడుచు పనిచేసినది. 1915 సంవత్సరము అగస్టు 23 వ తారీ

ఖున అసెంబ్లీ చాలింపుచేయబడెను. సెనేటు మాత్రము 1920 వరకును మొదటిదె.

రెండవపార్లమెంటు 1915 మొదలు 1919వ సంవత్సరమువరకును సభకూడినది. మూడవపార్లమెంటు 1921లో పని చేసినది అంతట 6-2-1921వ తేదీన అసెంబ్లీయు 31-11-21వ తేదీన సెనేటును ముగింపబడెను. క్రొత్తసెనేటు చట్టము 1921లో అమలులోనికి వచ్చినది. క్రొత్తసెనేటు మార్చి 1921 సం॥ లో ఎన్నుకొనబడెను. నాలుగవపార్లమెంటు 1921, 1922 సంవత్సరములలో కూడినది అసెంబ్లీ సభ్యులసంఖ్య మొదటి నాలుగుపార్లమెంటులలో కొంచెము వృద్ధిజెందెను.

| రాష్ట్రము | మొదటి పార్లమెంటు సంఖ్య | రెండవ పార్లమెంటు | 3,4 పార్లమెంట్లు. |
|---|---|---|---|
| కేపుకాలనీరాజ్యము | 51 | 51 | 51 |
| నేటాలు | 17 | 17 | 17 |
| ట్రాన్సువాలు | 36 | 45 | 49 |
| ఆరెంజిఫ్రీస్టేటు | 17 | 17 | 17 |
| సమితిఅసెంబ్లీమొత్తం | 121 | 134 | 134 |

రాష్ట్రీయప్రభుత్వము:—నాలుగు రాష్ట్రములను పరిపాలించుటకు గవర్నరుజనరలుగారు నలుగురు పరిపాలకులను (Administrators) ను నియమించును. వీరికి ప్రావిన్షియల్ కవున్సిళ్ళను సభలున్నవి. ఈసభలలో కార్యనిర్వాహక కమిటీ సభ్యుల నెన్నుకొందురు ఆకమిటీలవారె పరిపాలకులకు సలహా నిత్తురు. రాష్ట్రీయప్రభుత్వ వ్యవహారములు: (౧) ప్రైమరీ సెకండరీ (ప్రాథమిక, మాధ్యమిక) విద్యలు. వైద్యశాలలు ధర్మసంస్థలు, పురపాలకసంఘములు, డివిజనల్ కవున్సిల్లు, ఇతర స్థానికసంస్థలు. (౨) రోడ్లు, బాటలు, (3) చేపలు (౪) మృగములు (౫) పురుగులనిర్మూలనము, విషవృక్షనిర్మూలనము. రాష్ట్రీయపరిపాలనమున ప్రత్యేకోద్యోగులు కలరు. వీరుమాత్రి మెగాక అవసరమునుబట్టి ఇతరులను నియమింతురు. 1921 సంవత్సరములో శాశ్వతఉద్యోగులు పురుషులు 661, స్త్రీలు 86. తాత్కాలికోద్యోగులు పురుషులు 135, స్త్రీలు 56. రాష్ట్రములలో ఎసెంబ్లీసభకుగల ఎన్నికఫిర్కాలునుబట్టి రాష్ట్రీయ కవున్సిలుసభలలోని సభ్యుల సంఖ్యయు నుండును. కాని ఎంతతక్కువ జనసంఖ్యయైనను 25 సభ్యులకు తక్కువమందియుండరు. నేటాలులోను ఆరెంజిస్టేటులోను 25 మందిచొప్పున సభ్యులున్నారు. ప్రతిసభయు మూడు వత్సరములుండును సభనుకూడుమని పిలుచుటయు ముగించుటయు పరిపాలకుని చిత్తమునుబట్టియుండును, గాని వత్సరమున కొకమారైనను సభకూడి

తీరవలెను. సభ్యులకు వత్సరమునకు 150 పౌనుల వేతనమిచ్చె దరు. వారు సభకురాని దినములకు వేతనము మినహాయింపబడును. ఈకవుస్సిలుసభలు రాష్ట్రీయవ్యవహారమునుగూర్చి మాత్రమె శాసనములుచేయును.

రాష్ట్రప్రభుత్వమునందలి పరిపాలకుని సమితి గవర్నమెంటువారు నియమింతురుగదా, రాష్ట్రీయసభలకు ప్రజలు పార్లమెంటుకువలెనె సభ్యులనెన్నుకొందురు. రాష్ట్రీయకార్యనిర్వాహకసభకు రాష్ట్రీయసభవారు నలుగురుసభ్యుల నెన్నుకొందురు. వీరు రాష్ట్రీయసభ్యులుగ నుండనక్కరలేదు. ఇతరపెద్దమనుష్యులెవరైన గావచ్చును. ఈనలువురును పరిపాలకుడును కలసి రాష్ట్రీయకార్యనిర్వాహకసభ (Executive Commitee) గ పరిపాలింతురు. పాలకునికి స్వపరిపాలనముగల (కాలనీలగవర్నరు) వలనరాజ్యపరిపాలకునకు కల అధికారములె యున్నవి. ఇతడే రాష్ట్రీయ పార్లమెంటుసభ ఎప్పుడుకూడవలెనో నిర్ణయించును. ఇతనికి సభలోసమ్మతి (వోటు) కలదు. ధనమువెచ్చించుటకితని యనుజ్ఞకావలెను.

కార్యస్థానములు:— దేశమునకు ముఖ్యపట్టణము స్థాపించు విషయమున తగవులువచ్చెను. ప్రిటోరియాలో ప్రభుత్వకార్యస్థానముల నేర్పరచి గొప్పభవనములను నిర్మించిరి. కేపుటవునులో పార్లమెంటుశాసనసభలయొక్క కార్యస్థాన

-ములను కట్టిరి. బ్లూంఫాంటీన్ నగరమున ఉన్నతన్యాయస్థాన మును స్థాపించిరి.

భాషః—దేశములో నింగ్లీషు డచ్చిభాషలకు రెంటికిని సమానగౌరవము నుపయోగము నున్నవి. ప్రభుత్వ కార్యస్థానములందుకూడ నింతియె.

లండన్ ప్రతినిధిః—దక్షిణాఫ్రికా కింగ్లాండులో నొక ప్రతినిధియుండును. ఈయన లండన్ నగరమున దక్షిణాఫ్రికా భవనమున వసించును. 1926 లోని దక్షిణాఫ్రికా ప్రతినిధి (Agent general) జే. ఎస్. స్మిట్టుగారు.

రాజ్యాంగపద్ధతిః—దక్షిణాఫ్రికాప్రభుత్వమున కార్య నిర్వాహక అధికారము (Executive) ప్రజాప్రతినిధులకు లోబడియుండలేదు. పార్లమెంటుకు పరిపాలకవర్గముపైన నంతగ నధికారములేదు. పరిపాలకవర్గమువారి డిపార్టుమెంటులు మంత్రులకు లోబడియుండును. వాని యుద్యోగములపైన పార్లమెంటుకు అధికారము లేదు.

కొన్ని దేశములందువలె ప్రజలు రాష్ట్రముల సభల నెన్నుకొనిన ప్రతినిధులచేతగాక సమితిప్రజలవలననె తిన్నగః పార్లమెంటుకు సభ్యులెన్నుకొనబడుచున్నారు. ఈ విషయమున కెనడా అమెరికా సంయుక్తరాష్ట్రపద్ధతులను సమితివారు సమ్మేళనముచేసిరి. ఎన్నికపద్ధతు లింగ్లాండునందువలె శాస్త్ర ప్రకారముగ లేవు.

దక్షిణాఫ్రికా రాజ్యాంగపద్ధతికిని భారతీయప్రభుత్వ పద్ధతికిని పోలికలు కలవు. దేశమెల్ల డివిజనులుగ విభజింపబడినది ఒక్కొక్క డివిజను కొక్కొక దండవిధాయి. (Magistrate) యుండును. ఈమేజస్ట్రీటు రాష్ట్రీయప్రభుత్వమువారి యాజ్ఞలకును సమితిప్రభుత్వమువారి యాజ్ఞలకును బద్ధుడై ప్రవర్తింపవలెను. కొన్ని వ్యవహారములను రాష్ట్రములు చూచును. కొన్ని సమితియే చూచును. పబ్లికుశాఖలో బాటలు, వారధులు (Bridges) పాఠశాలలు రాష్ట్రప్రభుత్వము పరిపాలింపగ తక్కినపనులు సమితి పరిపాలించును. స్థానిక సంఘములు రాష్ట్రముచేతిలోనుండగ ఆరోగ్యశాఖసమితి చేతిలోనున్నది. మునిసిపాలిటీలు లోకలుబోర్డులు నిందువలన నిరువురు ప్రభువులకు గొలువవలెను. ఆరోగ్యవిషయమున సమితి ప్రభుత్వమువారియాజ్ఞలకును ఇతరవిషయముల రాష్ట్రీయప్రభుత్వమువారి యాజ్ఞలకును బద్ధులుకావలెను. ఇది రాజ్యాంగమున లోపమని చెప్పకతీరదు.

రాజ్యాంగతత్వము:—దక్షిణాఫ్రికాసమితి రాజ్యాంగ విధానము చూచుటకు కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా సంయుక్తరాష్ట్రముల 'ఫెడరల్' రాజ్యాంగపద్ధతివలె కనబడును గాని దానికిని దీనికిని చాల తారతమ్యము కలదు 'ఫెడరల్' పద్ధతియొక్క ముఖ్యలక్షణము లని రాజ్యాంగశాస్త్రజ్ఞు డగు డైసీగారు చెప్పిన లక్షణములిందు లేవు. I రాజ్యాంగవిధాన

చట్టము (Constitution) నకులన్ని విషయముల ప్రాముఖ్యము, సర్వాధికారములు నుండుట, II ప్రభుత్వమున వివిధాంగము లకు పరిపాలన కావశ్యకములైన అధికారములు సమానముగ నివ్వబడుట, III రాజ్యాంగపద్ధతియందు వచ్చుసమస్యలు వివా దములను న్యాయస్థానములె తీర్మానించి సిద్ధాంతీకరించుట. ఇవి ఫెడరల్ రాజ్యాంగవిధానమును ప్రజల కుపయోగకరము లుగ చేయుచున్నవి. ఈ లక్షణములు దక్షిణాఫ్రికా రాజ్యాంగ విధానమున గానరావు. దక్షిణాఫ్రికా ప్రభుత్వమున సమితి పార్లమెంటు ప్రాముఖ్యమైనది దీనికే సర్వాధికారములుగలవు. రాజ్యాంగవిధానమున కివిలేవు.

అధికారములెల్ల పార్లమెంటునందె యిమిడియున్నవి. రాజ్యాంగములకు సమానాధికారము లివ్వబడి యుండలేదు. న్యాయసభలు రాజ్యాంగపద్ధతినిగూర్చిన అభియోగములనె పరిష్కరింపవలెను కాని రాజ్యాంగముగూర్చి సిద్ధాంతీకరింప రాదు. దక్షిణాఫ్రికాసమితి రాజ్యాంగపద్ధతికి పట్టుగొమ్మ పార్లమెంటె.

ఫెడరలు రాజ్యాంగపద్ధతివలన స్వేచ్ఛ, రాష్ట్రీయ స్వా తంత్ర్యము, రాజ్యాంగ నిర్ణిరోధాధికారము, అందువలన కలుగు బలహీనత అభివృద్ధిలేకపోవుటయుకూడ కలుగును. దక్షిణాఫ్రికావారు స్వేచ్ఛ స్వాతంత్ర్యములను బాగుగ అను భవించిరి. దానివలని అనర్థములను కూడ ననుభవించిరి.

స్మట్సు సేనాని చెప్పిన గొప్పన అధికారబలముకల ప్రభుత్వము లాభకారియని దక్షిణాఫ్రికావా రెంచిరి. అప్పట చాల భయంకరములగు సమస్యలుండెను బ్రిటీషు డచ్చిజాతులకు కల పరస్పరసంబంధమును గూర్చిన సమస్యలును పెట్టుబడిదారులకును కార్మికులకును పట్టణములకును పల్లెలకును మధ్యనుండిన ఆర్థిక సాంఘిక సమస్యలును, పశువులకువచ్చు వింత జబ్బులు మొదలగు రాష్ట్రీయ రాజ్యాంగ సమస్యలును మంచి కేంద్రప్రభుత్వముకాని పరిష్కరింపజాలదు. ఈ సమస్యలకన్న భయంకరములగు నేటీవుల సమస్య దక్షిణాఫ్రికాలో విజృంభించెను. ఈసందర్భములో నప్పుడుండిన ప్రాత రాష్ట్రీయ పరిపాలక విధానములను రద్దుచేసి క్రొత్తవిధానములను స్థాపించిరి. కేంద్రప్రభుత్వ పార్లమెంటు రాష్ట్రములకు ఇచ్చు అధికారములతో మునిసిపాలిటీలను వైక్యమును నిర్ణయింపవచ్చును. రాష్ట్రములకు విద్యపైనకూడ కొంచె మధికారమున్నది. కొంత చట్టనిర్మాణ రాజ్యాంగాధికారములు నున్నవి.

ధర్మ పరిపాలన; న్యాయశాఖ:— దక్షిణాఫ్రికాలోని ముఖ్య న్యాయస్థానము సుప్రీముకోర్టు. ఇది బ్లూంఫాంటీన్‌లో నున్నది. ఇందలి న్యాయాధిపతులె అప్పీలుశాఖగ రాష్ట్రీయ స్థానిక శాఖలుగను పరివేష్టించి న్యాయపరిపాలన చేయుదురు. దక్షిణాఫ్రికాలోని ధర్మపరిపాలనముకూడ చట్టమునుబట్టియె నిర్ణయింపబడినది. అందలి ముఖ్యమగు క్రిమినలు కోర్టుకూడ

సుప్రీముకోర్టై. సుప్రీము కోర్టు డివిజనులు కేపుకాలనీలో నొకటి నేటాలులో నొకటి ట్రాన్సువాలులో నొకటియు ప్రాతసుప్రీము కోర్టులకు బదులు రాష్ట్రీయ డివిజనులును, ఆరెంజి కాలనీలోను తూర్పు జిల్లాలలోను, గ్రిక్వాలాండులోను. విట్ వాటర్సు రాండ్ లోను డివిజనులును, సర్క్యూటు కోర్టులును వెలసినవి. ఇవిగాక నేటీవు హైకోర్టును, రాజద్రోహములకొఱకు ఒక ప్రత్యేకన్యాయస్థానమును వాణిజ్య వ్యాజ్యములకొక్కటియు కలవు. వీని తీర్పులపైన సుప్రీముకోర్టుకు (అప్పీలు) ఉపర్యభియోగము చేయవచ్చును.

దేశములోని మేజస్ట్రీటుకోర్టులు 50 పౌనుల యపరాధము 6 నెలల శిక్ష, 15 దెబ్బలు విధింపవచ్చును క్రిమినలు ప్రొసీజరు, సాక్ష్యస్మృతి 1918 లో వచ్చినవి (గౌరవదండవిధాయిలు) స్పెషల్ జస్టిసెస్ ఆఫ్ ది పీసు కోర్టులు చిన్న నేరములకును సేవకులు కూలివారు చేయు అపరాధములకును, నేటీవు కమీషను సబ్ కమీషను కోర్టులు నేటీవుల నేరములకును కలవు. ఇదిగాక మేజస్ట్రీటుగారికి 200 పౌనులవరకు విలువ కల సివిలువ్యాజ్యములను విమర్శించు అధికారమును గలదు. స్పెషల్ కోర్టులకు 25 పౌనుల కిమ్మతుకు మించని వ్యాజ్యములను నేటీవు కమీషన్ వారికి నేటీవులకును తెల్లవారికిని వచ్చు వ్యాజ్యములను తీర్మానించు నధికారము కలదు.

అప్పెల్లేటు ప్రావెన్షియలు లోకలుడివిజనుకోర్టులకుఅమి తముగు అధికారములు కలవు. ఇవి అన్నియు వ్యాజ్యములను విమర్శించును.

కేపు టవునులోను, పీటరుమారిట్జుబర్గులోను ప్రిటోరియాలోను బ్లూంఫాంటీనులోను, రాష్ట్రీయ డివిజను కోర్టులున్నవి.

కేపు డివిజనులో 5 గురును నేటాలులో నలుగురును, ట్రాన్సువాలు డివిజనులో 7 గురును, ఆరెంజి డివిజనులో ముగ్గురును న్యాయాధిపతులుందురు. ఒకడివిజను కోర్టుతీర్పు మరియొక డివిజనులోకూడ అమలు జరుపబడును.

దక్షిణాఫ్రికా చట్టము 96 వ శెక్షను ప్రకారము నియమింపబడిన అప్పెల్లేటు డివిజనులో (ఛీఫుజస్టిసు) ప్రధాన న్యాయాధిపతియు, అప్పెల్లేటు డివిజను నియమించు ఇరువురు సాధారణ న్యాయాధిపతులును, ఏడివిజనులోనైనను న్యాయాధిపతులుగనున్న ఇరువురు అడిషనలు న్యాయాధిపతులు నుందురు. ఒక న్యాయాధిపతి తీర్పుపై నుపర్యభియోగమును ముగ్గురును ఇరువురు న్యాయాధిపుల తీర్పుపైన ఐదుగురును తీర్పుచెప్పవలెను.

దక్షిణాఫ్రికాలో నాచరణలోనున్న ధర్మశాస్త్రము రోముగాజ్యపుధర్మమును డచ్చివారిధర్మమును ఆంగ్లేయధర్మమును కలసిన మిశ్రమ ధర్మశాస్త్రము.

1921 లో సుప్రీముకోర్టులోనున్న న్యాయవాదులు

| అడ్వొకేటులు. | అటర్నీలు. | నోటరీలు. | కన్వేయన్సర్లు. |
|---|---|---|---|
| 928 | 3548 | 2518 | 1231 |

వీరిలో కొందరు కేపు డివిజనులోను కొందరు తూర్పుజిల్లాల డివిజనులోను కొందరు గ్రీక్వాలాండు, నేటాలు, ట్రాన్సు వాలు, ఆరెంజిలుడివిజనులలోను పనిచేయుచున్నారు.

వివిధవిషయములు:— 1921 లో దక్షిణాఫ్రికాలో నరక శిక్ష లనుభవించుటకు 9 కారాగారములును, 183 సాధారణ కారాగారములును 7 రిఫర్మేటరీలును (బాలురను సంస్కరించు శరణాలయములు) నుండెను 6338 యూరోపియనులును, 3791 నేటీవులును మిశ్రమజాతివారును పోలీసుదళమందుండిరి. 1912 లో డిఫెన్సు చట్టమువలన ఆరోగ్యముకల ప్రతి తెల్లపురుషుడు ను 16 మొదలు 61 సంవత్సరములోపుప యస్సువాడు సైనిక శిక్ష పొందవలెనను నియమము వచ్చెను. ఇందువలన 1914 లో ఐరోపా మహాసంగ్రామమునకు 40,000 మంది సైనికులను దక్షిణాఫ్రికా పంప గలిగెను. ఈ సైనికపద్ధతివలన డచ్చివా రికిని ఆంగ్లేయులకును స్నేహామభివృద్ధి జెందెను.

కేపుటవునులోను స్టెల్లెన్ బాషులోను విట్ వాటర్సు రాండ్ లోను విశ్వవిద్యాలయము లున్నవి. గ్రాహామ్సుటవున్ లోని రోడ్సు విశ్వవిద్యాలయము ప్రిటోరియాలోని ట్రాన్సు వాల్ యూనివర్సిటీ కాలేజి బ్లూంఫాంటీన్ లోని గ్రే విశ్వ

విద్యాలయకాలేజి గాక జోహానుసుబర్గులో వైద్యవిద్యా పరిశోధక సంస్థలుకలవు. 1921 సం॥ నాటికి వార్తాపత్రికలు 322 కలవు. 221 గ్రంథాలయములు, 10 చిత్రవస్తు ప్రదర్శన శాలలు, 3 జూలాజికల్ తోటలు, 4 బొటానికల్ తోటలును కలవు. అనేక వైద్యశాలలును కలవు. సమితి సర్వవిధముల నభివృద్ధిజెందినది.

ఋణము:—పూర్వము నాల్గుపరగణాలకు నున్నఋణము (110,000000 పౌనులు.) సమితి ప్రభుత్వము భరించెను. ఇది యుద్ధమువలన నమితమైనది 1916 లో 142881000 అయినది. అది పెరుగుచునేయున్నది. ఇందు చాలవరకు రైళ్ళు తంతులు రేవులు మున్నగు వానికొరకె వ్యయమై దేశమునకు లాభకరముగనె ఉపయోగపడినది 1916 జనవరిలో సమితిపరిపాలనమున 8874 మైళ్ళ ఇనుపదారి యుండెను 110 మైళ్ల సైనికుల రైలుదారియు నుండెను దీనికి 83494328 పౌనులు ఖర్చయ్యెను. హార్బరులకు 12326915 పౌనులు వ్యయమయ్యెను. 50000 మైళ్ళ తంతిమార్గముండెను.

సమితిదేశమున 1913 లోని ఎగుమతులు:—బంగారు, వజ్రములు, బొగ్గు, రాగి, తగరము, వెండి, ఉన్ని, ఉష్ట్రపక్షియీకలు, తోళ్ళు, మొహెయిరు, వాటిల్ బెరడు, మొక్కజొన్న, పండ్లు, బుదూ, తిమింగిలనూనె, మృగములు, సారాయము, ఇతరవస్తువులు, 63466550 పౌనుల

కిమ్మతువి ఎగుమతియయ్యెను. ఇందు 69492629 పౌనుల విలువవి ఇంగ్లాండునకు పోయెను. 3,972,921. ఇతరదేశములకు పోయెను. ఆ సంవత్సరమున బ్రిటీషు సామ్రాజ్యమునుండి 25566314. పౌనులు విలువగల సామానులను ఇతరదేశముల నుండి 121842284 విలువ సామానులును దిగుమతియయ్యెను. డర్బనురేవు చాల ప్రసిద్ధిచెందెను. 'డెలగోబే' యు ప్రాముఖ్యము చెందెను. 1913 లో సమితిఆదాయము 15806176 పౌనులు. సమితి ఎగుమతులును ఆదాయమును చాల వృద్ధిచెందినవి.

1913 సంవత్సరమున సమితిదేశము వైశాల్యము జనసంఖ్య:—

| దేశము | వైశాల్యము చ॥ మైళ్లు. | జన సంఖ్య. |
|---|---|---|
| కేప్కాలనీ | 276565 | 2617844 |
| ట్రాన్సువాలు | 111196 | 1847600 |
| నేటాలు | 36173 | 1224278 |
| ఆరెంజిఫ్రీస్టేటు | 55180 | 584284 |
| సమితిదేశము | 479114 | 6274006 |

సమితిలోని జనులు.

| సంవత్సరం | జన సంఖ్య. | తెల్లవారు. | నల్లవారు. | (ఆసియావారు) |
|---|---|---|---|---|
| 1904 | 5175824 | 1116806 | 4059018 | 122734 |
| 1911 | 5973394 | 1276242 | 4697152 | 152309 |
| 1921 | 6926992 | 1522442 | 5404550 | 163896 |

బాంటూలు:—

| | |
|---|---|
| 1904 | 3491056 |
| 1911 | 4019006 |
| 1921 | 4699433 |

1911 సంవత్సరములో సమితిలోనుండిన ఆసియా వారిలో హిందువులు 115580 మహమ్మదీయులు 20892 పారశీ వారు 341 ఇతరులు 12978.

తెల్లనల్లసమస్య:—దక్షిణాఫ్రికాలో నేడు రంగులను బట్టి ప్రజలజాతిభేదము నిర్ణయింపబడి ప్రభుత్వ పరిపాలనమందే గాక ప్రజలసాంఘిక వ్యవహారములందును భేదభావము కన బడుచున్నది. అన్నిజాతుల ఐరోపావారును యూధులును 'తెల్ల' వారని వ్యవహరింపబడుచున్నారు. భారతీయులు ఆసియావారని వ్యవహరింపబడు చున్నారు. ఐరోపావారికిని బంటూ లేక బాంటూ జాతివారికిని పుట్టిన మిశ్రమజాతివారిని 'రంగువారు' (Colored people) అని పిలుతురు. డచ్చివారు పూర్వకాలమున జావాద్వీపమునుండి తీసికొనివచ్చిన వారు మహమ్మదీయులైనారు. వారిసంతతివారు కొద్దిమంది కేపుటవునులోనున్నారు. వీరిని 'కేపుమలయు' లందురు. ఆఫ్రికాదేశములోని ఆదిమవాసుల సంతతివారు జూలూలు, పొసాలు, బసూటోలు. వీరి నెల్లరను 'నేటివ్స్'లని పిలుచు చున్నారు. విద్యావంతులైన దేశీయులనుకూడ ఇట్లు పిలు

చుట యాచారమైనది అని సీ. ఎఫ్. ఆండ్రూసుగారు 1926. సం॥ జూలైలో వ్రాసినారు.

నేడు 50 లక్షల బంటూజాతివారును, 10 లక్షల ఐరోపావారును, 5 లక్షల రంగు వారును, 160000 భారతీయులును, 12000 కేపుమలయులును దక్షిణాఫ్రికాలో నున్నారు. బంటూల జనసంఖ్య శీఘ్రముగ పెరుగుటచూచి వీరే తెల్లవారిని మ్రింగివేసితమలో కలిపివేసి కొందురను భయముకలిగెను.

'నలుపురంగు మిశ్రమప్రజలలో నందు ముఖ్యముగ దక్షిణాఫ్రికాగ్రములోని వారు కొందరు తెల్లవారివలెనె సర్వవిధముల పార్లమెంటు సభ్యులు కాదగి యున్నారని యంగీకరింపకతప్పదు'. అని మాననీయులగు ఆర్. హెచ్. బ్రాండుగారు తమ 'దక్షిణాఫ్రికా సమితి'యను పుస్తకమున వ్రాసి ఈ సమస్యను చర్చించియున్నారు. అయినను నలుపురంగువారు సభ్యులగుటకు వీలులేదు. యూరపియను సంతతివారేకాని ఇతరులెన్నుకొనబడరాదు.

'అమెరికా సంయుక్తరాష్ట్రములలోని నల్లవారు నీగ్రోలు. వీరిసంఖ్య తెల్లవారిసంఖ్యకన్న చాలతక్కువ. పశ్చిమయిండీసు దీవులలో నల్లవారె అధికసంఖ్యాకులు. వారిమధ్య సైనికబృందమువలె తెల్లవారున్నారు. కాని దక్షిణాఫ్రికాలో ఒకతెల్లవానికి ఐదుగురు నల్లవారున్నందువలన నీజాతి సంబం

ధసమస్య 'తెల్ల నల్ల' తారతమ్యసమస్య భయంకరరూపముఁ దా
ల్చినది. బ్రిటీషువారు తెల్లనల్లసమస్య లేనంత వఱకద్భుతముగ
సులభముగ దేశములను పరిపాలించుచున్నారు. వీరు కొంత
దాతృత్వము న్యాయము దయయుఁ జూపి కాలక్షేపము చేయఁ
గలుగుచున్నారు. కాని తెల్లనల్లసమస్యవచ్చి తెల్లవారు నల్ల
వారు దేశమున నెలకొన్న తరువాత కలుగు పరస్పరసంబంధ
ముల విషయమున వీరిధర్మము తిన్నగలేదు. ఇందు ముఖ్య
ముగ బ్రిటీషువారు తమదేశములో లండను నగరమున ప్రి
ధానమంత్రిగారుండు 'డౌనింగు' వీధినుండి వలసరాజ్యములోని
తెల్లనల్లసమస్యను పరిష్కరింపఁజూచిరి. తెల్లవారికి స్వాతం
త్ర్యము స్వపరిపాలనమును దయచేసియు నల్లవారి యోగ
క్షేమమును తా మరయఁ జూచుచున్నారు. ఇది దక్షిణా
ఫ్రికావా రంగీకరింపలేదు దక్షిణాఫ్రికావారి దృక్ప
థమే వేరు. ఇది అవిద్యవలన అవినీతివలన మోటుతనము
వలన వచ్చిన వచ్చియుండును. బజారులోపోవు మానిసి
సభలలో కూర్చుండుపురుషుడు ఈ సమస్యయొక్క ప్రా
ముఖ్యమును గమనింపడు. అతనికి నిరంకుశత్వమున ప్రీతి.
నేటివులదగ్గఱనుండి వారిభూములను లాగికొని తెల్లవారికొర
కు పనిచేయించుటయె న్యాయమని తలంచును. వానికి విద్య
నేర్పినచో స్వేచ్ఛ స్వాతంత్ర్యమును గోరును గనుక విద్యఁ
గఱపవలదు. వానిని వానియంతరముననే ఉంచవలెను. ఇది

న్యాయముకాదని శ్రేయముకాదని తెల్లవాడెరుగఁడు కాఫరులు ఆరు మిలియనులు (60 లక్షలు) నూతనరాజ్యాంగ సంస్కరణములనాటికె యుండిరి. వారు 10 లేక 20 మిలియనులుగ శీఘ్రముగనె వృద్ధిజెందుదురు. వారి కన్యాయము జరిగినదను తలంపు కలిగించుట మంచిది కాదని తెలిసికొనడు.' ఇంగ్లాండులోని కార్మికపక్షపువాడైన కేయిర్ హార్డీ గారు మంచి రాజనీతిజ్ఞుడు. ఆయన దక్షిణాఫ్రికాసమితి చట్టమును గూర్చి 'ఇది తెల్లవారి కైకమత్యము కలిగించుటకును, నల్లవారికి ఎన్నిక హక్కుల లేకుండుటకేగాని దక్షిణాఫ్రికాలోని జాతుల సమ్మేళనముకొరకుగాదు,' అని చెప్పినాడు.

తెల్లవారిలో 'కాఫరు' పనిచేయుట యగౌరవమని తలంచి సోమరులుగనేయుండి దారిద్ర్య మనుభవించుచున్నవారు చాలమంది కలరు. 'రంగువారు' అని తెల్లవా రుపయోగించు పదము కాఫరులకు వర్తింపదు. (Coloured Man.) రంగువాడన తెల్లనల్లరంగుల మిశ్రమజాతివాడు. ఈ నలువు రంగుజాతివారు చామనచాయగనె గాక తెలుపు నలుపురంగుల మధ్య ననేక వన్నెలగ నుందురు. ఈతెగవారు కేపుకాలనీలో నందుముఖ్యముగ కేపుటవునులో చాల నధిక సంఖ్యాకులున్నారు. వీరు యూరపియనులకును కాఫరులకును పుట్టినవారెగాక యూరపియనులకును ఆదిమవాసులగు హాట్టెంటాట్లు

కును ప్రాతబానిసలకును మలయజాతి వారికిని పుట్టినవారు. ఈ రెండు తెగలనుగూడ పాశ్చాత్య సోదరులు నల్లవారనియు రంగువారనియు వ్యవహరించుచున్నారు. ఆదిమజాతివారిని ఆసియావారినిగూడ నల్లవారేయని వ్యవహరించుచున్నారు. ఈ తెల్ల నల్ల భేదభావము తీవ్రరూపము దాల్చినది.

ట్రాన్సువాలు ఆరెంజి పరగణాలలో తెల్లవారికిమాత్రమే ఎన్నికహక్కు (వోటు) కలదు. నేటాలులో కొన్నినియమముల ననుసరించి నేటివులకు వోటుకలుగును. కేపు కాలనీలో తెల్లవారికి నల్లరంగువారిలో కొంత ఆస్తియుండి వేరువ్రాయగలిగినవారికి సమ్మతినిచ్చు హక్కు 'వోటు' కలదు కాని తెల్లవారినె ఎన్నుకొనవలెను. మిశ్రమ వర్ణజాతివారి విషయముననె ఇట్టి భేదబుద్ధియుండగ నిక ఆదిమవాసులపట్లను ఇతర నల్లవారిపట్లను దక్షిణాఫ్రికా ప్రభుత్వమువా రెట్లు న్యాయబుద్ధితోనుందురు? బంటూసమస్య పరిష్కరించుటకు ప్రభుత్వమువారు ప్రయత్నించిరి. కొన్నిచోటుల తెల్లవారును కొన్నిచోటుల నల్లవారును భూములను కొనకూడదని శాసించిరి. వర్ణభేదమునుగూర్చి పార్లమెంటువారుచేసిన చట్టములలో కొన్నిటి నిదివరకె యుదాహరించి యుంటిమి. ఇట్టి వెన్నో కలవు.

హెర్టుజాగ్ గారి 'తెల్లదక్షిణాఫ్రికా' విధానము:—నేటిప్రధానమంత్రి హెర్టుజాగ్ గారు రంగువారిని (తెలుపు

సంకపు మిశ్రమజాతివారిని) తెల్లవారిలో కలుపుకొని వారికి
ఎన్నికహక్కుల నిచ్చి పనులుచేసికొను సౌకర్యములు కల్పించి
ఒకే తెల్లజాతిగచేసి వైచి ఇకముందు మిశ్రమజాతి రంగువారు
లేకుండగచేసి బంటూజాతివారితో కలియకుండ వారిని వేఱు
చేసి డచ్చివారు జావాలో చేసినట్లు దక్షిణాఫ్రికాను తెల్ల
వారి దేశముగ చేయవలెనని సంకల్పించినారు దీనివలన
నేటీవులు తెల్లవారితో సంపర్కము చేయరాదు. అట్లు చేసిన
శిక్ష విధింపబడును. ఇట్లు చేసినచో తెల్లవారిని రక్షించవచ్చు
నని వారియూహ

వర్ణభేదచట్టమునొకదాని నీయుద్దేశ్యముతో హెర్ట్జ
జాగ్ ప్రధానామాత్యుని ప్రభుత్వము చేయతలపెట్టినది.
దీనివలన రంగువారికిని బంటూతెగవారికిని భేదము నేర్ప
రచిరి. కొన్ని తెగలను కార్మికవృత్తులందును వృత్తికళలం
దును పని చేయరాదని శాసించుచట్టము బంటూ ప్రజల
పైన ప్రయోగింపబడినది. ఇది రంగువారికి వర్తింపదు. ఇట్లు
రంగువారికి ఆర్థికలాభమును కల్పించినారు ఇట్లే ఎన్నికహ
క్కులందును రంగువారికి ప్రత్యేకముగ హక్కులనిచ్చినారు.
వీరిని తెల్లవారిస్థితికి తీసికొని వచ్చుటకు ప్రయత్నములు జరు
గుచున్నవి. నేటీవుల నడగద్రొక్కుటకు నిశ్చయించిరి. భార
తీయులను నేటీవులతోపాటు అడగద్రొక్కుటకె నిశ్చయిం
చిరి దక్షిణాఫ్రికా జాతీయవాదులు భారతీయులు పరులని.

యు వారిని బంటూ 'నేటీవుల' కన్న నెక్కుడు మర్యాదగ చూడనవసరము లేదనియు పలుకుచున్నారు. హెర్ట్జుజాగు గారు 'రంగువారిని' బాగుచేయుపద్ధతిలోనే బంటూ నేటీవుల నడగద్రొక్కు నుపాయము నాలోచించిరి. తెల్లవారి కొరకేర్పరుప బడిన ప్రదేశములందుగాక ప్రత్యేక నివేశనములందె బంటూలు భూములను కొనవచ్చును. అట్లె తెల్లవారు వర్తకవ్యాపారములు చేయుటకును భూములు కొనుటకును బంటూ ప్రదేశములందు నిషేధింపబడుచున్నారు. ఇది 'సెగ్రిగేషన్' లేక నివేశనములను నిర్ణయించు పద్ధతి. బంటూలు తమ నివేశనములందే వృత్తికళలు (skilled industries) చేసికొనవచ్చునుగాని ఇతర చోటుల చేయరాదు. ఇతరచోటులవారికి వోటునిచ్చు హక్కునుండదు. వారి ప్రదేశములందే వారికి చిన్నసభల నేర్పరచి ఎన్నికహక్కు లివ్వబడును. సమితిశాసనసభకు వారి పక్షమున నేడుగురు తెల్ల (ఐరోపా) ప్రతినిధుల నెన్నుకొనవచ్చును. వారు బంటూ వ్యవహారములందు తప్ప ఇతర వ్యవహారములందు పాల్గొనరాదు. ఈ పద్ధతి ఆసియావారికిగూడ వర్తించునట్లు హెర్ట్జుజాగు ప్రభుత్వమువారు శాసించిరి. కేపుకాలనీలోనున్న 6000 భారతీయులును కేపు మలయులతో కలసి పోవుచున్నారు. కాని నేటాలులో నున్న 140,000 భారతీయులును ప్రత్యేక జాతీయత కలిగియున్నందున ఆశియా చట్టమును చేసి

వారి హక్కులను తీసివేయ దలచినారు. ఇందువలన వారికి తీరమున నివేశనము లేర్పరుపబడినవి. మునిసిపలు ఎన్నిక హక్కులు వారికి నేటాలులో తీసివేయబడినవి. ఇట్లు నేటీవు సమస్య 'తెల్ల నల్ల' సమస్యగ మారినది.

డచ్చి జాతీయత:— డచ్చివారు మెల్లమెల్లగ వృద్ధి జెంది దక్షిణాఫ్రికాలోని బ్రిటీషువారిని మించిరి. వీరికి దక్షిణాఫ్రికా దేశాభిమాన మొకటి కలిగినది. దేశము తమదే యనియు బ్రిటీషువారు పరులనియు తలచిరి తమ కొక ప్రత్యేక పతాకము కావలెననిరి. ప్రభుత్వమునందలి మంత్రులు చాలమంది డచ్చివారే. మెల్లమెల్లగ బ్రిటీషువారిని ద్రోసిరాజన జూచుచున్నారు. బ్రిటీషువారు చాలమంది వలస కేగుచున్నారు.

---

## పదకొండవ ప్రకరణము.

### ఇతర వలసరాజ్యములు.

మెడగాస్కర్:— దక్షిణాఫ్రికాకు తూర్పున నున్న పెద్దద్వీపమె మెడగాస్కర్. దీనియందు మన భరతఖండమునకు తూర్పునగల ద్వీపకల్పములోను ద్వీపములోను నివసించుచున్న మలయసంతతివారే ప్రాతకాపులుగ నున్నారు. ఆఫ్రికా

కుశద్వీప మనియు నందు సంస్కృతధ్వనికల పేరులున్న భాగము లార్యుల వాసస్థానములనియు చేయబడిన సిద్ధాంత మున కిది బలమిచ్చుచున్నది. ఏది యెట్లున్నను భారతీయ ప్రాచీన నాగరకత కిది దృష్టాంతముగ నున్నది. భారతీయుల నౌకాజీవనము వాణిజ్యసంపద నిది వేనోళ్ళ జాటుచున్నది. తామరాకుల బాటపైన నిచ్చటికి తమ పూర్వులు వచ్చిరని మలయజాతి 'హోవా' లు చెప్పుచుందురు. వీరికి అరబ్బుల నాగరకత తగిలినది. నౌకాయానము వాణిజ్యము వీరెరుగు దురు. వీరి నాగరకత ఆచారములు మన మలయుల నూదిరివె. భాషయు మలయ కుటుంబమునకు జెందినదె. పోర్చుగీసువారు 1506 లో నిచ్చటికి వచ్చిరి. కాని రేవు స్థాపించలేదు. డచ్చి వారును స్థాపించలేదు. 1642 లో ఫ్రెంచివారు డాఫిన్ అను రేవు స్థాపించిరి. కాని వారి గవర్నరు చేసిన దౌర్జన్యమువలన 1672 లో మలయజాతివారు వారిని నాశముచేసిరి. మరల 1750 లో సెంట్ మేరీద్వీపమును వశముచేసికొని ఫ్రెంచి వారు డాఫిన్ పునరుద్ధరించుకొనిరి. ఫ్రెంచి గవర్నరు నేర్పర చిరి. దేశాక్రమణ మొదలిడిరి. ఇంతలో 'హోవా'జాతివారు అభివృద్ధిజెంది రాజ్యము నేలుచుండిరి. హోవాపరిపాలకులు బలహీనులైరి. ఫ్రెంచివారును మెల్లగ దేశాక్రమణముచేయు చు తుదకు 1895 లో మెడగాస్కర్‌ను ఫ్రెంచి కాలనీ వలస రాజ్యముగ ప్రకటించిరి. వీరి పరిపాలనమున వర్తక మభివృద్ధి

జెందెను. ముఖ్యముగ బంగారు, ఇండియారబ్బరును ఫ్రెంచి దేశము కెగుమతియగుచున్నవి ఫ్రెంచి గవర్నరును సంస్థలును దీనిని పరిపాలించుచున్నారు.

పోర్చుగీసు దక్షిణాఫ్రికా:—పోర్చుగీసువారు పదునైదవ శతాబ్దాంతమున దక్షిణాఫ్రికా తూర్పుతీరమున సోఫాలవరకును అరబ్బులె ఆక్రమించియుంట చూచిరి అచ్చట బంగారు దొరకుచుండెను. దీనిని బంటూవారు అరబ్బులకిచ్చుచుతమకు కావలసిన వస్తువులను పుచ్చుకొనుచుండిరి. దీనిని చూచి పోర్చుగీసువారు 1505లో సోఫాలను ఆక్రమించిరి. అరబ్బులతో స్నేహముచేయుచు బంగారును దంతమును కొనుచుండిరి. 1544లో డెలగో అఖాత ప్రాంతములందు దంతము దొరకునని తెలిసికొనిరి. గాని రేవు స్థాపింపలేకపోయిరి 1569 నాటికి బంగారు గనులను ఆక్రమించవలెనను ఆశకలిగెను. కాని వీరి ప్రయత్నము నిష్ఫలమయ్యెను. ఆసమయముననె కొందఱు క్రైస్తవ గురువులు తూర్పుతీరమున నెలకొన ప్రయత్నించియు, విఫలమనోరథులైరి 1892లో 'టీటీ సేనా' లలో నుండిన పోర్చుగీసు దళము నాదిమవాసు లంతమొందించిరి. జంబేసికి దక్షిణమున పోర్చుగీసువారికి చెప్పతగిన స్థలములేలేవు. అయినను ఆదిమవాసుల నాయకుల నొండొరులపైఁ బురికొల్పి తామ ఆడించుచుండిరి. ఛాకావలన తరుమబడిన ఆదిమవాసులు 1886 నాటికి సోఫాలలో నుండిన పోర్చుగీసువారిని

కూడ రూపుమాపిరి కాని మరల సోఫాలను పోర్చుగీసువారు కొంతమంది ఆదిమవాసుల సాహాయ్యముతో ఆక్రమించుకొనిరి. 1861లో ఆదిమవాసులలో పట్టాంగన నాయకుడగు మణికుశుడు మరణింప పోర్చుగీసువారికి ప్రాణములు చేరుకొనెను. 1869 జూలైలో పోర్చుగీసుప్రభుత్వమువారికిని దక్షిణాఫ్రికాప్రజాస్వామ్య ప్రభుత్వమువారికిని జరిగిన సంధిలో సరిహద్దు లేర్పరుప బడెను. ఈ సంధి బ్రిటీషువారికిష్టము లేదు డెలగో అఖాతప్రాంతము తూర్పు దక్షిణప్రదేశములు తమవని తగవులు పెట్టిరి. కాని మధ్యస్థుని తీర్మానమున వారికి వ్యతిరేకమయ్యెను. 1875 సం॥ తరువాత రైలుదారి నిర్మింపబడి లోరెంకో ముఖ్యపట్టణమయ్యెను బ్రిటీషువారి ప్రాంతముల నాయకులను లోబరచుకొని తమ ప్రభుత్వము నెలకొల్పుటకు ప్రయత్నించిరి పోర్చుగీసువారు దీనికిష్టపడలేదు. కొందరు పోర్చుగీసు ఉద్యోగులను బ్రిటీషు దక్షిణాఫ్రికా కంపెనీ అధికారి ఫోర్బసు (Forbes) అరెస్టు చేసెను. అంతట పోర్చుగీసువారికిని బ్రిటీషువారికిని 1891లో ఆండ్రిడా దగ్గర యుద్ధము జరిగెను. జూను 1891 లో నీ రెండు ప్రభుత్వములకును సంధిజరిగి, సరిహద్దు లేర్పరుపబడెను. ఇనుపదారి వేయు యేర్పాటుకూడ జరిగెను. 'పోర్చుగీసు దక్షిణాఫ్రికాను 'మొజాంబిక్ కంపెనీ' అనునొక సంఘమువారు పరిపాలింపసాగిరి దీనికొక గవర్నరు 'బెయిరా' (Beira) లోనుండెను. పోర్చుగీసు

ప్రభుత్వమువారే న్యాయపరిపాలకులను లిస్బను (Lisbon నియమించిపంపి తమగవర్నరుజనరల్ కుమాత్రిమె లోబడునట్లు శాసించిరి. గవర్నరుకు వీరిపై నధికారములేదు. బంగారుగనుల పని సాగుచుండెను. సంవత్సరమునకు 24,000 పౌనులు బంగారము తీయబడుచుండెను. 1914 లో 28,000 టన్నుల పంచదార ఎగుమతిచేయగలిగిరి పదిటన్నులప్రత్తి 26,000 టన్నుల మొక్కజొన్న 100 టన్నుల నూనెగింజలను ఎగుమతిచేయగలిగిరి పోర్చుగీసు మొజాంబిక్ ప్రభుత్వముక్రింద 1913 లో 1401 యూరపియను (పాశ్చాత్య) పురుషులు, 471 యూరపియను స్త్రీలు, 1033 ఆసియా పురుషులు, 62 ఆసియా స్త్రీలు, 131,488 బంటూపురుషులు, 140,073 బంటూ స్త్రీలు, 779 మిశ్రమజాతిపురుషులు, 705 మిశ్రమజాతిస్త్రీలును ఉండినట్లు జనాభావలన తేలినది. లింపోపో మనీసానదుల మధ్యభాగము నింకొక పోర్చుగీసుసంఘమువారు పరిపాలించిరి.

కాంగోరాజ్యము:—1876 లో బెల్జియములోనుండి ఒకసంఘమువారు మధ్యాఫ్రికాలో నెలకొని లాభముపొందుటకువచ్చిరి. స్టాన్లీ అను దొర ఇంతకుముందె కాంగోనదీతీరము చూచెను. ఇతడు బెల్జియంరాజు కీసంగతులు చెప్పెను. ఫ్రెంచివారప్పుడే కాంగోలో కొంతభాగము వశము చేసికొనిరి. 1878 లో స్టాన్లీ మరియొక బెల్జియంకంపెనీ స్థాపించి కాంగో నదిమీద ప్రయాణముచేసి సిగ్రోలతో ఒడంబడికలుచేసి ఆక్రి

మింపసాగెను. పోర్చుగీసువారు కాంగోముఖద్వారము తమ దనిరి. అంతట జర్మనీవారొక సభ చేయగ నందు బెల్జియము రాజుహక్కులు స్థిరపడెను. మొదట అందరికి నీరాజ్యమున నుద్యోగములిచ్చిరి. కాని తరువాత బెల్జియమువారే అన్నిటి నాక్రమించిరి వీరి పరిపాలనమున చాల దౌర్జన్యములుజరిగెను. తరువాత 1908 లో బెల్జియుల ప్రభుత్వఅధికారము రాజునుండిపోయి ప్రజలయధీనమయ్యెను ఇందువలన కాంగోదేశ పరిపాలనముకూడ కొంచెము బాగుపడెను.

జర్మను దక్షిణాఫ్రికా:—ఆరెంజినదికిని క్యూనేణనదికిని మధ్య పశ్చిమతీరముననున్న 325000 చతురపుమైళ్ళ వైశాల్యము కలభూమి యిసుకపట్టలతోనిండియున్నది. అందుకొంచెము వాసయోగ్యమగు ప్రదేశము కాలహరి యెడారినంటియున్న పీఠభూమి ఇది నమాకాప్రదేశము. పైకిపోయినకొలది వర్షపాతము ఎక్కుడై సారవంతముగనుండును. హెరేరోతెగయు హాట్టెంటాటులును పూర్వముపోరాడి ఒండొరులను నాశనము చేసికొనుచుండిరి. 1791 లో పాశ్చాత్యులీభూమి చూచిరి. 1814 లో లండనుమిషనరీ లచ్చటచేరిరి. 1840 లో హాట్టెంటాటు నాయకుడు 'యాంకేరు ఆఫ్రికేనరు' హెరేరో తెగ నోడించెను. వారికి వీరిమందలను కాయు దురవస్థవచ్చెను. 1863 లో హెరేరోలు మఱల యుద్ధసామగ్రిలను సంగ్రహించుకొని మందలను తోలుకొనిపోయిరి. అంతట హెరే

రోల స్వాతంత్ర్యయుద్ధము మొదలిడెను. సందలకొలది హా
ట్టెంటాటులు మడసిరి. 1870 లో ఆఫ్రికేనరు సంధి కొడంబడెను.
దక్షిణాఫ్రికా ట్రాన్సువాలు ప్రజాస్వామ్యము నుండి కొన్ని
కుటుంబములు దమారా దేశముఁజొచ్చినవి. ఈసంగతిని అచ్చటి
వారు కేపుకాలనీలోని బ్రిటీషువారికి వర్తమాన మంపిరి అప్పు
డు 1875 లో సముద్రతీరమున 'వాల్విసుబే' వరకును
బ్రిటీషువారు తమదని ప్రకటించిరి. 1880 లోను 1882 లో
ను హాట్టెంటాటులకును హెరేరోలకును యుద్ధములు జరి
గెను. తరువాత నుభయులును సంధిచేసికొనిరిగాని కొందరు
దొమ్మియుద్ధము చేయుచునె యుండిరి. పాశ్చాత్యజాతులు నెల
కొనుటకు విశాలములగు ప్రదేశములను వెదకుచుండిరి. ఇం
తలో జర్మనీవారు వచ్చి దేశమునాక్రమింతురని ఎవ్వరనుకొ
నలేదు. 1888 లో బ్రిమెనువర్తకుడొకడు "అంగ్రాపెక్వే
నా" దగ్గర నొక రేవును స్థాపించి తరువాత మే నెలలో ఒక
హాట్టెంటాటునాయకునివద్దనుండి కొన్ని నిర్జనభూములను కొ
న్ని తుపాకులను 100 పౌనుల నిచ్చికొనెను. ఆగస్టులోనింకను
విశాలమగు దేశమును 60 తుపాకులు 600 పౌనుల నిచ్చి
కొనెను. అతడు జర్మనుప్రభుత్వమువారి సాహాయ్యమును
కోరగ జర్మనీవారీవిషయమునుగూర్చి బ్రిటీషువారితో ప్ర
స్తావించిరి. కాని ఈదేశమెల్ల జర్మనీప్రభుత్వము ఆక్రమించు
నని ఎవ్వరనుకొనలేదు. బ్రిటనుకు ఖర్చులేనిచో సముద్రతీర

ము నాక్రమింపవచ్చునని బ్రిటీషు రాజ్యాంగ కార్యదర్శి కేపు ప్రభుత్వమునకు కబురంపెను. 1884లో కేపుపార్లమెంటువారుతీర ప్రదేశమును వశపరచుకొన నిశ్చయించిరి అచ్చటి ఆదిమవాసుల నాయకులును బ్రిటీషుపాలనకిష్టులై. ఇంతలో 1884 సంవత్సరము అగస్టు 7 వ తేదీని అంగ్రాపెక్వేనాదగ్గర విలియము చక్రవర్తియాజ్ఞ ప్రకారము జర్మనీవారి నౌకాధికారి జర్మను పతాకమునాటి సముద్రతీరమునందును దానినంటి 20 మైళ్ళ వెడల్పునను ఆరెంజినదినుండి 20 వ డిగ్రీవరకును జర్మను పరిపాలన ప్రకటించెను రెండుదినములలో అక్కడనుండి ఉత్తరముగ 26 వ డిగ్రీవరకును ఆంగ్లేయుల యొక్క వాల్విస్ బే అఘాతప్రదేశము తప్ప తక్కినప్రదేశమున జర్మను పరిపాలనము ప్రకటించిరి. 1886 లో జర్మనీవారు పోర్చుగీసు వారితో సరిహద్దులను మార్చి సంధి చేసుకొనిరి అట్లె బ్రిటీషు వారితోను 1890 సం॥ లో సంధి చేసికొనిరి జర్మనీవారు తాము మాక్రమించినదేశము నభివృద్ధి చేసికొనిరి.

జర్మనీవారు 'ఒట్జింబింగ్వా' లో ప్రభుత్వస్థాన మేర్పరచికొనిరి గాని తరువాత యాంకేరునలన "విండ్ హాక్"ను విక్రయమువపొంది తమముఖ్యపట్టణమును అచ్చటికిమార్చి ధనము వెచ్చించి పెద్దసౌధములు కట్టి అలంకరించిరి. ఇచ్చట నిరువదియైదేండ్లలో గొప్ప వాయువార్తా కార్యస్థాన మేర్పడెను. గొప్ప హోటళ్లు, బజారులు, క్రైస్తవాలయములు, వార్తా

పత్రికాలయములు చిత్రవస్తుప్రదర్శనశాలలు, పుస్తకభాండాగారము, రైలుస్టేషను, విద్యుచ్ఛక్తి ఏర్పడెను. దీనిని చాలబలవత్తరముగ చేసిరి. సైన్యములను స్థాపించిరి. దీని చుట్టునున్న పొలములలో ఊటలు త్రవ్వి సాగుచేసిరి. చాలధనము వెచ్చించి పంట పండింపసాగిరి. ఒక కుటుంబముకొర కెన్నో ఎకరములభూమి కావలసియుండెను. మంచిగుఱ్ఱములను పశువులను దిగుమతిచేయుచుండిరి. రాగి గనులు బయల్పడెను. హైఖ్యవేసి యీపరిశ్రమను వృద్ధిచేసిరి. పదియేండ్లు 1893 మొదలు 1904 వరకును హాటెంటాటులును హెరెరోలును జర్మనీవారితో యుద్ధములుచేసి స్త్రీ పురుషుల నెందరినో హత్యచేసిరి. వారిపైన జర్మనులు పగదీర్చుకొనిరి. చాల మందిని నాశనముచేసిరి. 1908 లో అంగ్రాపెక్వేనా దగ్గిర వజ్రములు కనబడెను. ఇందువలన రివిన్యూ ఆదాయము వృద్ధి యయ్యెను. 1913 లో 8000,000 పౌనుల విలువగల వజ్రములు 400,000 పౌనుల విలువగల రాగి, 31608 పౌనుల తగరము నెగుమతి చేసిరి. ఇచ్చట తెల్లవారిలో 8820 పురుషులు, 468 స్త్రీలు, 1625 పిల్లలుండిరి. 2000 సైన్యముండెను 15,000 హాటెంటాటులు 18000 డమారాలు 20,000 హెరెరోలుండిరి. గవర్నమెంటు నిరంకుశముగ నుండెను. బెర్లిను నుండి గవర్నరును పంపిరి. కార్యాలోచన సభయనుపేరున నొకటి యుండెను. కాలహారి యెడారివలన రాకపోకలు కష్ట

ముగ నుండెను. తీరపు వర్తకము బాగుండెను. సైన్యముల కొరకు కోటలుకట్టిరి. 1297 మైళ్ళ ఇనుపదారియు నుండెను.

1914 సం॥ లో ఐరోపా మహా సంగ్రామమున జర్మనీ వారు దక్షిణాఫ్రికాలో యుద్ధముచేసిరి. కాని లాభములేక పోయెను. బోథా సేనానియె సైన్యముల నడిపి దేశము నాక్రమించెను. దక్షిణాఫ్రికా ఆంగ్లేయుల వశమైనది. మేకంజీ సేనానియు బాగుగ యుద్ధముచేసెను. జూలై 1915 నాటికి దేశము పూర్తిగా బ్రిటీషువారి వశమయ్యెను. జర్మను పాలన మంత మొందెను గొప్ప సైన్యము వచ్చుటనుంచిరి. కెయిజరు చక్రవర్తి నియమించిన ఉద్యోగులకు బదులు బ్రిటీషు ఉద్యోగస్థులువచ్చిరి.

జర్మన్ తూర్పు ఆఫ్రికా.—1884వ సంవత్సరము ఏప్రిలు 3 వ తారీఖుననె జర్మన్ కాలనైజేషన్ కంపెనీ సంఘము తూర్పు ఆఫ్రికాను వశపరచుకొనుటకు బయలుదేరెను. దాని నాయకుడు కారల్ పీటర్సు ఆదిమవాసులనాయకులతో సంధి జేసికొని జర్మనుప్రభుత్వమువారివలన 1885లో పట్టాపొంది అచ్చట నెలకొనెను. తూర్పుప్రక్క జాంజిబార్ సుల్తాను వీరి నడ్డగించెను. ఇది బ్రిటీషువారికుట్రయని వీరనిరి. ఎట్లయిననేమి జర్మనీవారికిని బ్రిటీషువారికిని సుల్తానుకును 1886 లో సంధిజరిగెను. 'డర్ సాలాం'మును, పంగనియు, జర్మనీవారి వశముందుం

దుటకును తక్కిన తీరము సుల్తాను పాలనమందుండుటకు నేర్పాటుజరిగెను. కంపెనీవారు లోపల దేశములోనికి చొచ్చుకొనిపోయి వర్తకస్థానములను స్థాపించి నెలకొనిరి. 1888లో రేవులు వీరికే కవులియ్యబడెను. బానిసవర్తకమున కిది యడ్డు వచ్చినందున బుషిరీ అరబ్బియుడు వీరి నెదిరించెను. 'డర్ సాలాం' వృద్ధిజెందెను. టంగాదేశమెల్ల జర్మనీవారి వశమయ్యెను. ఇనుపదారి వచ్చినది. జర్మనీ తూర్పు ఆఫ్రికా అభివృద్ధిజెందెను. దీని కిరుప్రక్కలను బ్రిటీషువారు దేశాక్రమణముచేసి దీని పైన కన్ను వేసిరి. ఐరోపా సంగ్రామమువలన నీదేశము బ్రిటీషువారి ప్రతిపత్తి (Mandate) దేశమైనది. జర్మనీవారి యుద్యోగులకు బదులు బ్రిటీషు ఉద్యోగులు వచ్చిరి. టంగనయికా (Tanganyika) దేశములోని ప్రజల యోగక్షేమములను చూచి పరిపాలించుటకై యీదేశమును బ్రిటీషువారు వశపరచుకొనినట్లు నానాదేశ ప్రతినిధుల సభయందు చెప్పిరి.

రొడీశియా:—శిసిల్ రోడ్సు (Cecil Rhodes) అను నొక ఆంగ్లేయయువకుడు తన బుద్ధికుశలతవలన కేపు కాలనీలో ప్రముఖుడగుచుండెను. ఇతడు తరువాత కేపు కాలనీరాజ్యాంగమున మంత్రియయ్యెను. దక్షిణాఫ్రికాలో అగ్రముమొదలు కెయిరోవరకును నల్లతెగలనడచి తెల్లసామ్రాజ్యమునుస్థాపించవలెనని యితనియాశయము. కేపు కెయిరో, యినుపదారివేయు

డని బ్రిటీషు రాజ్యాంగమంత్రిని ప్రోత్సహించినవాఁడు నితడె. ట్రాన్సువాలుకు ఉత్తరమున పడమరను రత్నగనులుబయలుపడుటచూచి పలువురు దాని నాసించిరి. ఉత్తరముననున్న దేశము మటాబెలుతెగవారిది వీరు క్రూరులు, భయంకరులు. వీరిముఖ్యపట్టణము బులవాయో. వీరి రాజగు "లోబెంగ్యూలా" వలన గనులు త్రవ్వుట కనుజ్ఞ సంపాదించి రోడ్సు ఒక సంఘమును స్థాపించెను. ఇతర వర్తకసంఘముల నడగద్రొక్కెను. మెల్లగ మటాబెలుదేశమును బ్రిటీషు రాష్ట్రముగ చేయమని రోడ్సు బ్రిటీషు హైకమీషనరును ప్రోత్సహించెను జంబేసీ వరకుగల దేశమును, దానిపైనగల దేశమును పరిపాలించుటకు 1889 లో రోడ్సుసంఘము బ్రిటీషు ప్రభుత్వమువల్ల ఫర్మానా పొందెను ఈ సంఘము ఉత్తరమునఁగల దేశము నాక్రమించెను మటాబెలు తెగవారు "లోబెంగ్యూలా" నాయకత్వమున బోయరులను ఇతరజాతులను బాధించియుండిరి. వారి యాగడములకు మితిలేనందున బ్రిటీషువారుకూడ వారిపైన దాడి వెడలవలసివచ్చెననిరి. రోడ్సుకంపెనీవారి ఆంగ్లయుద్యోగి జేంసను వారి నుక్కడఁచెను. అంతట మటాబెలు దేశము బ్రిటీషువారి వశమయ్యెను. (Bulawayo) బులవాయో బ్రిటీషు దేశమునకు ముఖ్యపట్టణమయ్యెను. ఈ దేశమునకె రొడీశియా యని పేరువచ్చినది. లోబెంగ్యూలా 1894 లో చనిపోయెను. బ్రిటీషు దక్షిణాఫ్రికా కంపెనీవారే

దీనిని పరిపాలించిరి. పాఠశాలలు, తంతి కార్యాలయములు స్థాపింపబడినవి. బంగారుగనుల పరిశ్రమ వృద్ధియైనది. 2903268 పౌనుల విలువగల బంగారము 1913 లోను, 3580209 పౌనుల బంగారము 1914 లోను 3823168 పౌనుల బంగారము 1915 లోను తీయబడెను. 1915 లో 224314 పౌనుల విలువగల రాగి 17144 పౌనుల విలువగల వెండి ఎగుమతి చేయబడెను. ఇచ్చట మొక్కజొన్న బాగుగ పండును. పశువులను ఐరోపా వారు పెంచుచున్నారు. రొడీశియా వైశాల్యము 143,830 చతురపుమైళ్ళు. ఇందు 24000 యూరపియనులు, 750000 బంటూప్రజలు 3000 ఆశియావారును ఇతరులు నున్నారు. రొడీశియాయు బ్రిటీషు హైకమీషనరు పరిపాలనమున నుండెను.

న్యాసాదేశము:— న్యాసాసరస్సునకు నైరుతి ప్రదేశమున బ్రిటీషు క్రైస్తవ మిషనరీలు మెల్లగ నెలకొనుట ప్రారంభించి కొన్నివత్సరములైనది. రోడ్సు వర్తక సంఘమువారికి ఈ ప్రదేశమును ఆక్రమించి బ్రిటీషురాజ్యముగ చేయుట ముఖ్యకార్యముగ తోచెను. అందువలన మెల్లగ నచ్చటి "నేటీవు" నాయకులతో సఖ్యముచేసికొనియు వారిని భయపెట్టియు టంగన్యాయికాసరస్సువరకును గల దేశమును బ్రిటీషు వారు వశముచేసికొనిరి. ఈ కార్యమందు హారీజాన్స్టన్ చాల పనిచేసెను. పోర్చుగీస్ తూర్పు ఆఫ్రికాకు పడమర భాగ

మెల్ల బ్రిటీషు సామ్రాజ్యప్రభుత్వమువారును రోడ్సు వర్తక సంఘమువారను పంచుకొనిరి. ఈదేశమే నేటి న్యాసాలాండు ప్రొటెక్టరేటు (దక్షితరాజ్యము). దీనికి దక్షిణభాగమె ఉత్తర రోడీశియాదేశము.

కెన్యా, ఉగండాలు:— పశ్చిమమున రాజ్యాక్రమణ చేయుచుండిన జర్మనీవారి వర్తకసంఘము తూర్పునగల టాంగన్యికాసరస్సుప్రాంతము నాక్రమించిరి. ఈప్రదేశము లను వశముచేసుకొనుటకు ఐరోపావారెల్లరు ప్రాకులాడు చుండిరి. బ్రిటీషువారుకష్టపడి కొన్నిదేశములలో అధికారము సంపాదించి 1888లోఆప్రదేశము నెల్ల బ్రిటీషు తూర్పుఆఫ్రికా కంపెనీఅను సంఘమునకు వశముచేసిరి. ఈప్రదేశములుతూర్పున మొంబాసా పట్టణముమొదలు పడమర విక్టోరియాన్యాంజా సరస్సువరకుగల దేశము. ఇది కెన్యాకాలనీగా పరిణమించినది. దీనికి పడమర మ్వాంగారాజు క్రింద ఉగండా ( Uganda ) రాజ్యముండెను. ఈదేశమును 1895లో బ్రిటీషు ప్రొటెక్టరేటు గా సాటించిరి.ప్రొటెక్టరేటనగా దక్షితరాజ్యము.బ్రిటీషువారిఅధి కారమును ప్రభుత్వమును మెల్లగప్రాకెను. తరువాత నీదేశమును బ్రిటీషు సామ్రాజ్య వలసరాజ్యము (Crown colony) గా చేసిరి. ఉగండాకు "కంపాల" ముఖ్యపట్టణమయ్యెను. కాని పరిపాలక కార్యస్థానమును ఎంటెబ్బె (Entebbe) పట్టణముననే స్థాపిం చిరి. ఉగండా 150000 చతురపు మైళ్లుండెను. 4000000 ప్రజ

లిందుండిరి. ఇనుపదారులు వేయబడెను. కెన్యా రాష్ట్రము నకు మొంబాసా ముఖ్యపట్టణము. ఇదిగొప్పరేవుగానుండెను. తమదేశముమధ్య జర్మనులుండుట బ్రిటీషువారి కిష్టములేకున్నను తప్పదయ్యెను. ఐరోపా మహాసంగ్రామము ను సాకుగ గొని బ్రిటీషువారు టంగన్యికాను తమ ప్రతిపత్తిదేశముగ చేసికొనిరి. తూర్పు ఆఫ్రికా వైశాల్యము రమారమి 58400 చతురపుమైళ్లు. 4000000 జనసంఖ్యయుండెను. కెన్యా ఉగండాలు ప్రభుత్వవలసరాజ్యములుగ చేయబడినపిదప వీని ప్రభుత్వము బ్రిటీషుకాలనీల కార్యదర్శిగారి పాలనముక్రింద నుండెను. సామ్రాజ్య వ్యవహారములందు తప్ప తక్కిన విషయములందు స్వపరిపాలన మివ్వబడినది. వీనికి ప్రత్యేక శాసనసభలు నిందెన్నుకొనబడిన సభ్యులు నున్నారు. పరిపాలకునికి బదులుగ గవర్నరు నియమింపబడినాడు.

జాంజిబార్:— జర్మనీవారి కాలనైజేషన్ కంపెనీ అను సంఘమువారు 1884లో తూర్పున దేశము నాక్రమింపసాగిరి. జాంజిబారు ద్వీపపరిసరములను వశముచేసికొని అచటినాయకులతో ఒడంబడికలు చేసికొనుచు జర్మనుసామ్రాజ్య ప్రభుత్వమువారివలన పట్టాపొందిరి. తీరము వారిక్రిందికి వచ్చెను. 1890 సం॥ జూలైలో జరిగిన సంధివలన జాంజిబారు బ్రిటీషు ప్రొటెక్టరేటయ్యెను. జాంజిబారు సుల్తానుకు నలభైలక్షల 'మార్కు'లిచ్చి బ్రిటీషువారు దానిని వశముచేసికొనిరి. అందు

వలన జర్మనీవారి అభివృద్ధికి చాలనష్టము కలిగెను. ౧౯౦౪ మొదలు ౧౯౦౭ వరకు జర్మనీకి వదలిరి.

బెచూనాదక్షితరాజ్యము:—కేపు కాలనీలో కలుపబడిన బెచూనా దేశమున కుత్తరమునయున్న బెచూనా దేశము బ్రిటీషు వారి దక్షతలోనున్న రాజ్యము (Protectorate). ఇందుకూడ దేశీయప్రజలె ప్రబలముగా నున్నారు. ఈదేశములోని తెల్ల వారు బ్రిటీషు హైకమీషనరు నియమించిన దండవిధాయి (Magistrate) ల యధికారము క్రిందనుండిరి. బంటూ తెగల పరిపాలనము వారి నాయకులే చేయుచుండిరి. కాని వీనిపై నను హైకమీషనరున కధికారముకలదు. ఈ దేశములో చాలభాగము మిశ్రమజాతులున్నారు. బంగ్వాకెట్సీ, బక్వేనా, బాకట్లా, జాతులు మాత్రము ప్రత్యేక తెగలుగనున్నవి. ఖామాయను నాయకుడు క్రైస్తవుడై నాగరకత నభివృద్ధిచేసెను. అతనితెగ బమంగ్వాటో వారు. ఖామా క్రైస్తవుడైనందున తోడి తెగవారికి క్రోధము కలిగి ఆ తెగపైన దాడివెడలి నాశనముచేయ ప్రయత్నించిరి. కాని లాభము లేకపోయెను. ఈ తెగలెల్ల "మొసిలెకట్సి" వలన తరుమబడియుండి యిచ్చట నెలకొనిరి. దేశములో నిలుకడలేక తిరుగు జాతులును కలవు. బకలహారీ, మసర్వా, వారుసు పొదలవారు నిట్టి దేశదిమ్మరులు. ఈ దేశములోనుండి జంబేసీ, కేపుటవును, ఇనుపదారి పోవుచున్నది. దీని వైశాల్యము 275,000 చతురగ

పుమైళ్లు, ఇందొక వేయిమంది తెల్లవారు, 175000 బంటూ ప్రజలు, 20000 మిశ్రమజాతులవారున్నారు. ఇది జిల్లాలుగ విభజింపబడెను. బ్రిటీషు హైకమీషనరు ఆజ్ఞనుపొంది పరిపాలకు లేలుచుండిరి.

స్వాజిదేశము:—స్వాజిజాతివారు జూలుజాతికి సామీప్యబంధువులనవచ్చును. "సోఫుజా" అను వీరుడు వీరికి నాయకుడై ఈ తెగకు ఖ్యాతిఁదెచ్చెను. ఇతని కొమారుడు స్వాజీయు అతని తరువాత మనుమడు 'ఉంబడిని'యు రాజ్యము చేసిరి. మనుమని రాజ్యకాలములో మెల్లగ యూరపియనులు వర్తకహక్కులు పొందిరి. దక్షిణాఫ్రికా రిపబ్లికు ప్రజాస్వామ్యము స్వాజులతో స్నేహముగనుండి 1881 లో వారిని స్వతంత్రులుగ అంగీకరించెను. బ్రిటీషువారీదేశములో తమ ప్రభుత్వము స్థాపింపదలచి తుదకు 1906 లో తమ హైకమీషనరు పరిపాలనక్రిందకు చేర్చిరి. ఈదేశము వైశాల్యము 6536 చతురపుమైళ్లు మాత్రమె. దీని జనసంఖ్య 90,200.

బసూటో రాజ్యము:—బసూటో దేశమున బంటూలే ప్రబలముగనుండిరి. మోషేషుని తరువాత బ్రిటీషువారు 1871 లో దీనిని కేపుకాలనీ ప్రభుత్వముక్రింద చేర్చిరి. 1877 లో కుట్రకలిగెను. దేశీయనాయకులు చెలరేగిరి. అక్కడ మన పశ్చిమోత్తర పరగణావలె నాయకుల పోరాటములతో కాలము గడచుచున్నది. అప్పటినుండియు నీదేశము బ్రిటీషు

హైకమీషనరుగారి పరిపాలనము క్రిందనే యుండెను. ఒక పరిపాలకుని, దండవిధాయిల నేర్పరచిరి. దేశీయనాయకులు నిమిత్తమాత్రముగ రాజులుగనున్నారు. బసూటో రాజ్యము 10293 చతురపుమైళ్ళ వైశాల్యమున్నది. ఇందు 350,000 బంటూ తెగవారును 900 యూరపియను ప్రజలు నున్నారు తెల్లవారు ఉద్యోగులుగ మిషనరీలుగ వర్తకులుగ నున్నారు ఇతరులు అచ్చట నేల కొనుటకు వీలులేదు.

బ్రిటీషు వలసరాజ్యాంగపద్ధతి:—దక్షిణాఫ్రికా సంయుక్తరాష్ట్ర సమితి (Union of South Africa) స్థాపనమునకు ముందే బాధ్యతాయుత ప్రజాప్రాతినిధ్య స్వపరిపాలనమును కేపుకాలనీ నేటాలు రాజ్యమునకు వలెనే ట్రాన్సువాలు ఆరెంజి రాజ్యములకును బ్రిటీషువారు దయచేసిరని చెప్పియుంటిమి. దక్షిణాఫ్రికాలోని ఇతరభాగములు అందు ముఖ్యముగ నల్లవారధికముగ నుండిన దేశములను బ్రిటీషువారు మెల్లగ వశముచేసికొనిరి. బ్రిటీషువారు దక్షతక్రింద నుంచుకొనిన దేశములును, 1914 స॥ ఐరోపా మహాసంగ్రామానంతరము ప్రతిపత్తిదేశములును, వృద్ధియయ్యెను. నేడు బసూటో దేశము, బెచూనా దేశము స్వాజిదేశము, రొడీశియా, ఉగండా, జాంజిబార్, టంగన్యికా, కెన్యాదేశము లెల్ల బ్రిటీషువారియధికార పరిపాలనములందున్నవి. మొదట వలసదేశముల నాక్రమించినప్పుడు బ్రిటీషువారు వానిని నేటి

నాయకులక్రిందనే యుండనిచ్చి ప్రత్యేక పరిపాలకులను దండవిధాయిల నేర్పరచి వారిపై యధికారము బ్రిటీషు పరిపాలక ప్రతినిధియగు హైకమీషనరున కిచ్చిరనియు కేపు గవర్నరునె హైకమీషనరుగ నియోగించుచు వచ్చిరనియు చెప్పియుంటిమి. దేశమున శాంతికలిగి తెల్లవారధికమైనపిదప బాధ్యతాయుత ప్రజాప్రతినిధ్య స్వపరిపాలనమును బ్రిటీషు వారు తమ సోదర జాతీయపౌరులకు ప్రసాదించిరి. ఆయా వలసరాజ్యముల శాసనసభలె వారి వ్యవహారములను చూచి కొని చట్టములు నిర్మించును. వారిశాసనసభ (పార్లమెంటు) లలోని ప్రజాప్రతినిధులె రాజకార్య నిర్వాహకులు (Executive) గ నియమింపబడుదురు. ఈ మంత్రులలో నొకడు ప్రధానామాత్యుడుగ నుండును. ఈ వలసరాజ్యములెల్ల బ్రిటీషు వలసరాజ్యాంగ మంత్రి (Secretary of State for Colonies) గారి యధికారమున తమ పరదేశ వ్యవహారములను చక్కబెట్టుకొనును. ఇవి బ్రిటీషు సామ్రాజ్యమునకు లోబడిన స్వతంత్రరాజ్యములుగ నున్నవి. వీని యాంతరంగిక పరిపాలనమున బ్రిటీషువారు ప్రసక్తి గలిగించుకొనరు. వీనిని పరిపాలించుటకు బ్రిటీషు సామ్రాజ్యమువారే పరిపాలక గవర్నరులను పంపుదురు.

బ్రిటీషు గవర్నరులకు కార్యాలోచన సభలుండును. ఈ కార్యనిర్వాహక సంఘములతో, శాసనసభలతో, వారివలస

రాజ్యములను పరిపాలింతురు. ప్రజాప్రాతినిధ్యము లేని వలసరాజ్యములకును, దక్షిణరాజ్యములకు బ్రిటీషు హైకమీషనరె పరిపాలక ప్రతినిధిగానున్నాడు. ఆయన యధికారమునకు లోబడి యొక పరిపాలకుడును, ఉద్యోగులును వానిని పరిపాలింతురు. ప్రతిపత్తి (Mandate) దేశములును బ్రిటీషువారే పరిపాలించుచున్నారు.

మొదటిభాగము సంపూర్ణము.

దక్షిణాఫ్రికా (రెండవభాగము)



M.K.Gandhi

భారతీయ సహాయనిరాకరణ మహోద్యమ వీరుడు

గాంధిమహాత్ముడు.

పుట ౧౫౪.



ఆండ్రూసు, పియర్సన్ గారలు.

పుట ౧౧౪.

# దక్షిణాఫ్రికా.

## I

## దక్షిణాఫ్రికా భారతీయులు.

ఆశియావారు :— పాశ్చాత్యనాగరికత యవతరింపక పూర్వమే యౌన్నత్యముజెందిన భారతభూమి క్రీస్తుశకము పదు నేడవశతాబ్దినాటికి గళావిహీనమై కల్లోలములందు కఱవులందు మునిగి అసాహాయ్యస్థితియందుండెను. పశ్చిమదేశమువారి నలరించిన ఆర్యవిద్యలు పుణ్యనదులయందు కొట్టుకొనిపోయినవి. ప్రాచీన నౌకాజీవనము సముద్రమునబడి మాయమైనది. భారతీయులు బానిసలైరి. ఆర్థిక నైతికదారిద్ర్యములు దేశము నకు దాపురించినవి ఖండాంతరముల నేలిన భారతీయులు ఖండాంతరముల ప్రవాసములను అనుభవించియు కూలిపని చేసియు కాలక్షేపము చేయవలసినవారైరి. పాశ్చాత్యులు మతప్రచారము వర్తకము వలసల పేరున సామ్రాజ్యములను స్థాపించిరి. హాలెండుదేశపుడచ్చివారు మన దేశమునకొన్ని రేవుపట్టణములు స్థాపించిరి. సుగంధద్వీపములు మలాకా జావా బోర్నియోలు వారివశములైనవి. అప్పటికె వారు దక్షిణాఫ్రికాగ్రమున నొక వలస రాజ్యమును స్థాపించియుండిరి. వారు తమ పరిపాలనమున నుండిన హిందూమహాసముద్రములోని ద్వీపములందు నేరములు

చేసినవారికి దేశాంతరవాస శిక్షలు విధించి శిక్షలనుభవించుట కప్పుడు జనసంఖ్య తక్కువగనుండిన దక్షిణాఫ్రికాకు పంపుచుండిరి. మలాకా జావా ద్వీపములనుండికూడ కొందరినట్లు తెచ్చివిడచిరి కొన్నాళ్ళకు భరతఖండములోని రాజకీయ నిర్బంధితులనుకూడ డచ్చివర్తక సంఘపరిపాలకవర్గము వారిచ్చటికితీసుకొనివచ్చి నిర్బంధించియుంచసాగిరి. అట్లుదక్షిణాఫ్రికాకు పంపబడినవారిలో కొందరు గౌరవముకలవారును ధనవంతులును దేశనాయకులును రాజులు నుండిరి వీరి కుటుంబములు పరివారములు స్త్రీలు, పురుషులుకూడ దక్షిణాఫ్రికాకు వచ్చిరి. వీరికి డచ్చి గవర్నమెంటువారు మనోవర్తినిచ్చుచుండిరి. నియమిత కాలము తీరినపిదప ప్రభువులు తమదేశమునకు పోవుచుండగ వారిపరివారము వారి కుటుంబము లిచ్చటనేయుండుట కిష్టపడి నెలకొనుచుండెను. ఇతరులు నిచ్చట నెలకొనిరి. ఇట్లు దక్షిణాఫ్రికాను తమ దత్తభూమిగ చేసికొనినవారొక తెగగనుండిరి. ఇదియే కేపురాజ్యములోని ఆసియావారి తెగ. ఇంకనూరేండ్ల వరకును డచ్చివారు నిర్బంధితులనిట్లు పంపుచునేయుండిరి. దక్షిణాఫ్రికాలోనికిపంపబడిన శిక్షితులందు కార్మికులునుండిరి. తాపీపని కుట్టుపని మున్నగుపనులు చేయువారునుండిరి. చాలమంది తెలివికలవారు నుండిరి. వీరికి నితరజాతులవారికిని కొంతకాలమునకు వివాహములు జరుగుటవలనను మహమ్మదీయమతమును వీరిలోకొంతమంది అవలంబించుటవలనను ఒకమిశ్రమజాతి యేర్పడెను. వీరిలోకొందరు క్రైస్తవులైరి. వీరెల్లరు నాశియావారిగ వ్యవహరింప బడిరి.

**భారతీయ కర్షకులు; వర్తకులు:—** (దక్షిణాఫ్రికాలోని పాశ్చాత్య కర్షకులకు వ్యవసాయమందు తోటపనులందు పాటుపడుటకు మనుష్యులు కావలసియుండిరి దేశము చాలసారవంతమైనదియైనను అచ్చటి యాదిమవాసులజాతివారు చాలసోమరులు) వారు పాశ్చాత్యులకు నిలుకడగ సేవచేయకుండిరి. ఇంగ్లీషువారు పదునెనిమిదవశతాబ్దినాటికి భరతఖండమున రాజ్యస్థాపనము చేసినందున అచ్చటిజనులు కరువులవలన బాధపడుచుండుటయు వారు ధర్మచింత పాపభీతికలిగి పాటుపడునేర్పరులగు కర్షకులనియు తెలిసికొని మెల్లగనచ్చటివారిని ప్రోత్సహించి దక్షిణాఫ్రికాలో పనులుచేయుటకు వారిచేత ఒడంబడికపత్రములను వ్రాయించి కొంతమంది కూలివారిని ఇంగ్లీషుకర్షకులు తీసికొని వచ్చి పనిచేయించుకొనసాగిరి.)

క్రీ॥ శ॥ 1860 సం॥లో మొదట మన హిందూదేశమునుండి కూలివారిని దక్షిణాఫ్రికాకు తీసికొనివెళ్ళిరి. అప్పుడు మారిషసు, ఫిజీ, జమెయికా, డమరారాలకు చెన్నరాజధాని, కలకత్తారాజధానులనుండి మాత్రమే కూలివారిని తీసికొనిపోన వీలుండెను. అట్టిచట్టమును చేసిరి. (కూలివారివలన దక్షిణాఫ్రికాలో పంటలు వృద్ధిజెందినవి. ధరలుపెరిగెను. వీరివలననే పంచదార తేయాకు పరిశ్రమలు బాగుపడినవి. అచ్చటికూరగాయలు చేపలవర్తకములు, ఆరోగ్యము సహవృద్ధిచెందినవి.) వీరినిజూచి వచ్చిన హిందూదేశపు వర్తకులు, వీరికిగావలసిన వస్తువుల నమ్ముటకై మొదట పోయియుండిరిగాని తరువాత నచ్చటి

"జూలూ" కాఫరు, తెగలతోను వ్యాపారముసాగించిరి. ఈవర్తకులు సాధారణముగ బొంబాయిలోనుండి పోయిన "మెమను" మహమ్మదీయులు. వీరుతమదేశములోనుండి వచ్చినకూలీలకన్న గౌరవముగనుండి ధనముగలవారగుటచే వారియోగక్షేమములు వీరి అధీనములైయుండెను. మొత్తముమీద దూరదేశమునకు పోయి కష్టజీవనము చేయు భారతీయులు బొంబాయి కలకత్తా మద్రాసు పరగణాలనుండివచ్చి మూడుభాషలు మాట్లాడువారైనను అచ్చటి పరిస్థితులలో నిదినుంచి యైకమత్యములో భారతీయులమని గ్రహించిరి ఇచ్చటభూమి సారవంతమైనది. భరతఖండమునందువలెనె ఫలవంతమైనది అచ్చట గంగా సింధు గోదావరి కావేరులున్నచో నిచ్చట జంబేసీ, లింపోపో ఆరెంజి వ్యాసేలా నదులున్నవి. అచ్చటి పాడిపంటలు సస్యములు నిచ్చటకలవు. అచ్చటివలెనె ఇక్కడను తెల్లవారి ప్రభుత్వము. అంతట కూలీచేయుటకు, వర్తకముచేయుటకు ఉద్యోగములకొరకు వచ్చినభారతీయులెల్లరు దక్షిణాఫ్రికాను దత్తభూమిగ చేసికొనిరి. ఇది తెల్లవారికి కంటకమాయెను. తెల్ల నల్ల తారతమ్యము వచ్చినది. ఇందు బోయరులును బ్రిటీషువారునేకమైరి. అది తెల్లవారిదేశమనియు పరులు దానియందు లాభము పొందరాదనియు నల్లవారి కెట్టిహక్కులు నుండరాదనియు తెల్లవారనసాగిరి. ఆసియావారెల్లరు నల్లవారె యనిరి. భారతీయులను విద్యావంతులను కూడ సేవగించుకొనిరి. 1890 సంవత్సరమునాటి కొకలక్ష భారతీయులు దక్షిణాఫ్రికాకు వలసవచ్చి నెలకొనియుండిరి. నేటాలులో 51,000 మంది భారతీయులుండిరి. అందు 30,000 మంది

పలనకూలియొడంబడికల కాలము గడచి నెలకొని వివిధవృత్తు లలోనుండిరి. సేవకులుగ తోటకూలీలుగ వర్తకులుగ నుండిరి. 5,000 మంది అక్కడ వర్తకముచేయుటకు వెళ్ళినవారు. వీరు గాక ఉపాధ్యాయులు ద్విభాషులు గుమాస్తాలు నుండిరి. కేపు కాలనీరాజ్యమున 10,000 భారతీయులును, ట్రాన్సువాలు బోయరు ప్రజాస్వామ్యమున 15,000 మందియు నుండిరి. భారతీయులను చూచి తెల్లవారేవగించుకొనిరి.

దక్షిణాఫ్రికాలో గడించినసొమ్ము నచ్చటనే వ్యయము చేయక తమదేశమున కంపుదురనియు వీరి యనారోగ్యపు ఆచార ములవలన దేశమున కనిష్టమనియు వీరు చౌకగ జీవించి, చౌక యగు నిండ్లలో నివసించి వర్తకముచేసి తక్కువ అద్దెలనిచ్చి, పలువురొక ఇంటిలోనే జీవించుచు, దివాలాలుతీసి బాకీదారులను నష్టపెట్టుచు, తమ యనుచరులకు తక్కువ జీతములనిచ్చి వర్త కము చేయుటకు నిర్ణయించిన కాలములయందుగాక ఇతరవేళ లందును వర్తకముచేసి, సరుకులలో కల్తీచేసియు తక్కువతూచి యు యూరపియనులకన్న తక్కువధరలకువిక్రయించియు యూర పియనులనోట మన్నుకొట్టుచున్నారనియు, దేశములోని వస్తు వు లుపయోగింపక తమదేశమునుండి సరుకులు తెప్పించుకొందు రనియు, వీరిచ్చట జీవించుటవలన నేటివులుకూడ పాడైనారని యు వీరి వేషభాషలు మతము ఆచారము యూరపియనులకు భిన్నమనియు, సాధారణముగ వీరినడత మంచిదికాదనియు నేటి వులకు దొంగతనము నేర్పిరనియు వీరు యూరపియనులతోను

వారిస్త్రీలతోను చనువుగ వ్యవహరించి నేటీవులకు వారియందుండు గౌరవమును పోగొట్టుచున్నారనియు, భారతీయ విద్వేషులు 1919సం॥లో ఆశియావారి విచారణ సంఘముAsiati Commission వారియెదుట చెప్పియుండిరి. విచారణ సంఘము వారు భారతీయులను గూడ విచారించిరి. విచారలో కొందరు యూరపియనులును గూడ మనపక్షమున వాదించియుండిరి. పైన చెప్పబడిన సంగతులలో నవతనుగూర్చినవి ముఖ్యముగ అబద్ధమనియు వీరు గడించినసొమ్ము అక్కడ ఖర్చు పెట్టుకొనుట కనేక ప్రతిబంధకములను యూరపియనులె కల్పించినారనియు చెప్పినారు. భూములు కొనుటలో బాగుచేయుటలో ప్రతిబంధకములు కలిగించినారు. నాటకశాలలకు భారతీయులను రానీయరు. ట్రాన్సువాలులో రైళ్ళలో మనలను మంచి తరగతులలో ప్రయాణముచేయనీయరు మనలను బాధింతురు. మోటారులో ప్రయాణముచేయు భారతీయుని కన్నియుకష్టములే. వీరువర్తకము చేయనిచో యూరపియనుల ధరలకు మితియుండదు. బ్రిటీషు పౌరులై యుండియు పౌరసత్వపు హక్కులువీరికి లేవు వీరు యూరపియనుల కనేక లాభములు కలిగించిరి. యూరపియను వర్తకులు పోవనంగీకరిపని మారుమూలలకు వీరుపోయి రైతులకుపకారముగ సరకులందించుచుండిరి. తెల్లవారికి సరకులను చౌకగవిక్రయించి ఆర్థికముగ బీదతనము లేకుండ చేసిరి. యూరపియనులు సాహయ్యము చేయ నిరాకరించినవారికి వీరు సాహాయ్యము చేసిరి. బేరసారములు సరసముగ చేసిరి. భారతీయులను మారుమూలగనున్న గూడె

ములలోనికి త్రోసినారు. అట్టిప్రదేశములు సంఘము వారు చూచి అచ్చటి అనారోగ్యమునకు ఏవగించుకొనిరి ఇది ఎవరి తప్పు? ప్రెడిడ్రాపుగూడెమె 1904 వ సంవత్సరపు ప్లేగు వ్యాధికి మూలము. ట్రాన్సువాలులోని కొన్ని ప్రదేశములలో కనబడు రోగములకు అనారోగ్యమునకు పరిపాలకుల అశ్రద్ధయు భారతీయులను నిర్బంధించి అనారోగ్య ప్రదేశములలో నుంచుటయు కారణములని భారతీయులనుచున్నారు. ఇట్టినిర్బంధములు పెట్టి నయెడల మరల సత్యాగ్రహము ప్రారంభమగును. దక్షిణాఫ్రికాను వృద్ధిలోనికి తెచ్చిబాగుచేసినది ఈభారతీయుల పూర్వులే. పాపము, భారతీయులు దక్షిణాఫ్రికాకు పోకముందు పనిచేయు వారులేనిచో క్రొత్తవ్యవసాయము సాగదనియు కొద్దిమంది కూలీలను తెప్పించుడనియు కేపుకాలనీ గవర్నరుకు 64 వత్సరముల క్రిందట డర్బనుమునిసిపాలిటీ మొరపెట్టుకొనెను. 1885సం॥లో భారతీయులనుగూర్చి విచారించుటకేర్పరుపబడిన విచారణసంఘములు, నేటాలును ఘోరదారిద్ర్యావస్థనుండి కాపాడినవారును బ్రిటీషువలస కనుకూలముగ చేసినవారును భారతీయులేయని స్పష్టముగ చెప్పిరి. విచారణసంఘసభ్యుడు J. Sanders శాండర్సుగారు భారతీయులవలన దేశమున కాదాయమధికమైనదని వ్రాసిరి.

నేటాలు, తెల్లవారివలన గాక భారతీయుల మూలముననే బాగుపడినది. మొదటి దినములలో యూరపియనులకు అరువివ్వని డర్బనువర్తకులు భారతీయవర్తకులకు అరువునిచ్చు

చుండిరి. ఏలన, వారు పాటుబడి తమ ఋణములను చెప్పినవో
ప్పున తీర్చుచుండిరి. అని "క్యాంబెల్" Hon Marshall Camp
bell అను సెనేటు సభ్యుడు గోఖలే గారి గౌరవార్థము జరిగిన
సభలో చెప్పెను. 1908 లో నేటాలు అసెంబ్లీ శాసనసభలో
Sir Liege Hullet హ్యూలెట్టు గారిట్లు చెప్పిరి. భారతీయు
లీవలస రాజ్యములోనికి రాకముందు దేశము దారిద్ర్యమున
పడిపోవు స్థితిలోనుండెను. గవర్నమెంటువారు భారతీయులను
వలస రప్పించుటవలన దేశము బాగుపడి దక్షిణాఫ్రికాలో నెల్లనీ
తీరము సారవంతమైనది. భారతీయులవలననే 10,000యకరము
లొక్క ఖండముగ చక్కనిపంట పండుచున్నది. 1924 సంవత్సర
ములో నివేశనముల శాసనము. Class AreasBill దక్షిణాగవ
ర్నమెంటువారుపపాదింపగ Dr Forsyth ఫోర్సైత్ అను సభ్యుడు
సమితిశాసనసభలో నిట్లుచెప్పెను, "భారతీయులిచ్చటికి వచ్చిన
ప్పుడు వారి ఒడంబడికలు పూర్తియైనపిదప నిచ్చట నుండనిచ్చె
దమను భావముతోవచ్చిరి. (మంత్రివర్గమునుండి Nonsense
"నాన్సెన్సు"అను కేకలు) కొందరను నెలకు 10.షిల్లింగుల చొప్పు
నను కొందరను 5 షిల్లింగుల చొప్పునను పనిచేయించిన కారణ
మున నేటాలుబాగుపడినది. అనిచెప్ప భారతీయులను సమ
ర్థించివాదించెను. వారువచ్చిన తరువాతనె వర్తక మభివృద్ధిచెం
దినదనుటకును, నిదర్శనములుచూపెను. అయినను తెల్లవారు
భారతీయుల నసహ్యించుకొనుచున్నారు.

నేటాలులోని భారతీయులు:— నేటాలు దక్షిణాఫ్రికా కోనసీమయని చెప్పవచ్చును (ఇచ్చట ఉష్ణదేశములో పెరుగు వృక్షములు పంటలు సమృద్ధిగనున్నవి, అచ్చట కాఫీ, చక్కెర, అల్లము, ఆరోరూటు, ప్రత్తి తేయాకు పండించుటకు వలసిన సౌకర్యములుండెను. కానియచ్చట రైతు కూలములేరు) బంటూ ప్రజల సంఖ్యను చూచి తెల్లవారు నెలకొనుటకు సందేహించు చుండిరి. ఉన్న తెల్లవారికి పనిచేయువారు లేరు. (బంటూ తెగ వారు తిన్నగపనిచేయరు. చెప్పకయే పారిపోవుదురు. నేటాలులోని తోటలవారి బాధపడలేక ఆంగ్లప్రభువులు సామ్రాజ్యము స్థాపించిన భరతఖండమునకు తమ ప్రతినిధులనంపి యచ్చటినుండి కూలివారిని తీసుకొనివచ్చిరి. భారతీయులు భూమినిసాగుచేసి తోటలు వేసి చాల పనిచేసిరి. మొదట ప్రత్తియు కాఫీయు పండు సూచనలుకనబడెను. గాని చెరకే ముఖ్యపంట యయ్యెను. బనానా అరటితోటలును బాగుగవేసిరి. హిందూదేశ ఫలవృక్షములను నేటాలులో పెంచిరి. కూలివారు నిర్ణీత కాలమైన తరువాత భరతఖండమునకు పోవుటకు ఓడకేవు నిచ్చుటకు దక్షిణాఫ్రికా తెల్లవారు సిద్ధముగనుండిరి గాని కూలివారు ఈ భూమిని, పాడిపంటలను చూచి ఇచ్చటనే నివసింపసాగిరి. కొందరు వర్తకులు కూడ హిందూదేశము నుండివచ్చి వ్యాపారముచేయసాగిరి. ఈదేశపు స్థితిగతులను ధనమును గూర్చి ఇంగ్లండుకుపోయిన భారతీయ మిత్రులతో చెప్పినందున ఇతరులుకూడ ఇచ్చటికివలస రాసాగిరి. హిందువులు చాల చౌకగజీవింపగలిగిరి. వీరు చౌకగ వ్యాపారములు చేయసాగిరి. ఇందువలన పాశ్చాత్య వర్తకుల వ్యాపారమునకు నష్టముకలిగెను. భారతీయులు తెల్లవారు

అనాగరకులు తెల్లవారితో సమానగౌరవమును పొందుటకుతగరని అసూయాగ్రస్తులై తెల్లవారనిరి. భారతీయులు సైన్యమున పనిచేయలేరు. వీరు దేశరక్షణము చేయజాలరు. వీరివల వచ్చు ఆదాయములేదు. అని తెల్లవారనిరి. వీరు తండోపతండములుగ వలసవచ్చి తెల్లవారి జనసంఖ్యను మీరుటనుచూచి తెల్లవారు భయపడిరి. వీరి నేవగించుకొనిరి. ప్రాతవారిని మెల్లగ తరిమివైచుటకును క్రొత్తవారిని రాకుండచేయుటకును దక్షిణాఫ్రికావారు నిశ్చయించుకొనిరి.) తక్కిన విషయములలో పోరాడుకొనుచున్న బ్రిటీషువారును బోయరులు నీవిషయమున నేకమైరి.

భారతీయులన్న అసహ్యము:—దక్షిణాఫ్రికాలోనిభారతీయుడు చాల నసహ్యించుకొనబడుచున్నాడు తారతమ్యము లేకనే అచ్చట ప్రతిభారతీయుని 'కూలీ' యని పిలుతురు. లేనిచో సామి రామసామియని నిందార్థకముగ పిలుతురు. కానిభారతీయుడని వ్యవహరింపరు. భారతీయోపాధ్యాయులను కూలీపంతులనియు భారతీయవర్తకులను కూలీవర్తకులనియు పిలుతురు. అదాదా అబ్దుల్లామూన్ హాజీకాసీము వర్తక సంఘమువారి కాఫ్రికాలో పొగయోడలున్నవి. వానిని తెల్లవారు కూలీయోడలని వ్యవహరింతురు. డర్బనులో కొలందవేలు కంపెనీవారు కట్టినగొప్పసౌధమును కూలీస్టోరులనియు ఆవర్తకులను కూలీమేస్త్రీలనియు పిలుచుచున్నారు. ట్రాముబండ్లవారు పొగబండ్లవారును మనలను జంతువులుగ చూచుచున్నారు. బాటలపక్క బాటసారులు నడచుట కేర్పరుపబడిన కాలి దారులలో మనము క్షేమముగ నడువలేము. వారికండ్లలో మనము ఆశియా

దేశపుమురికితోసమానులము దుర్మార్గులము. కంపుకొట్టు కూలీలము. నూనెగుడ్డలవారము. నల్లకీటకములము. వారిప్రకటనములందుమన "మనాగరకఆశియా" వారము మనముపందికొక్కులవంటి జంతువులము. వానిని వేటాడినట్లు మనలవేటాడ వీలులేదని ఒక పెద్దమనుష్యుడు వగచినాడు. ట్రాన్సువాలులో ఒక యూరినుండి యింకొకయూరికి పోవుటకు గుఱ్ఱముబండ్లున్నవి. కాని అందు కూర్చుండి మనము ప్రయాణము చేయరాదు. బండ్లకప్పుపైన కూర్చుండి పోవలయును. ఎంత వేసవియైనను శీతాకాలమైననుసరియె. పూటకూటిండ్లలో మన కెడములేదు. (తెల్లవారి హోటళ్లనుండి భారతీయులకు తినుబండారములను తెచ్చుకొనుటయు సులభముకాదు.) నేటాలులో డండీపట్టణమున నొక తెల్లవారి మూక కొన్నిదినములక్రిందట భారతీయుల సామగ్రికొట్టునకొక దానికినిప్పంటించెను. డర్బనులోనిసామానులంగడిలోనికి తెల్లవారు రాళ్లురువ్విరి. అని గాంధి మహాత్ముడు 1896లో మద్రాసులో చెప్పెను.

(భారతీయులకు వ్యతిరేకములగు చట్టములు:— భారతీయులపైన తెల్లవారికిగల అసహ్యమువలనభారతీయులహక్కులకు భంగముకలిగించు చట్టములనేకములు దక్షిణాఫ్రికా రాజ్యములు శాసించినవి.)

(1894సం॥ ఎన్నికహక్కులచట్టము:— నేటాలులో 1894 వరకును తెల్లవారితోపాటు భారతీయులకును యెన్నిక హక్కులుండెను. అచ్చటిఎన్నికచట్టముల ప్రకారము 50పౌనుల స్థిరాస్తి

యున్నగాని సాలుకు 10 పౌనులు అద్దెను ఇచ్చినగాని యెన్నిక హక్కుండెను. జూలూలకు ప్రత్యేకపు యెన్నికహక్కులుండెను. అంతట 1894లో ఆశియాదేశీయులకు ఎన్నికహక్కులు తీసివేయుచున్న శాసనమొకటి చేసిరి. అచ్చటిశాసనసభలో దానిని గాంధిగారును ఇతరులును కొందరిని వేడుకొని అడ్డగించినను లాభములేకపోయినది. అంతట గాంధిగారు ఇంగ్లాండులో (కాలనీల కార్యదర్శి) వలసరాజ్యాంగ మంత్రిగారికి మహాజరునంపగ నీ శాసనము తొలగించి యింకొక శాసనమును చేసిరి. ఇదియు చెడ్డ చట్టమె. దీనివలన ఎన్నికల సాంప్రదాయము పార్లమెంటరి ప్రభుత్వములును లేని దేశములవారు వలసరాజ్య గవర్నరు యొక్కయు కౌన్సిలువారియొక్కయు ప్రత్యేక అనుజ్ఞ పొందనిది యెన్నికహక్కులుపొంద నర్హులుకారని శాసింపబడినది. ఇది యూరపీయనులు కానివారిపైన ప్రయోగించుటకుచేసిరి. ఎన్నికల పట్టీలపై నిదివరకే పేరులున్నవారికిమాత్రము ఈచట్టము వర్తింపదు. ఈ చట్టమును ఇంగ్లాండులోని రాజ్యాంగమంత్రి చేంబర్లేనుగారికి పంపగా నతడు సమ్మతించెను. దీనిని గాంధిగారు అడ్డగించి ప్రాతినిధ్యసంస్థలును ప్రభుత్వమును భారతీయులకున్నవనియు, ఈచట్టమును వారికిగూడ వర్తించుటకే చేయబడినను, దానిని భారతీయులపై ప్రయోగించినచో దానినిగూర్చిన వ్యాజ్యములు బయలుదేరుననియు చెప్పిరి. నేటాలు ప్రభుత్వపక్ష పత్రిక యిట్లువ్రాసెను:—"ఇండియాలో ప్రాతినిధ్యప్రభుత్వము లుండెననియు, ఈచట్టమువారికి వర్తింపదనియు మేమెరుగుదుము. కాని ఈచట్టము మంచికొరకో చెడ్డకొరకో చేయవలసియున్నది. దీనివలన భారతీయులకును హక్కులు లేకుండ

పోయిన మరియు మంచిది. అట్లు చేయలేకున్నను భయములేదు. వారి దేశమున రాజకీయగౌరవమును సంపాదింపజాలరు. అంతగ నవసరమయ్యెనేని ఐరోపావారికి చిక్కులు లేకుండ ఒక్క ఐరోపా వానికిగూడ ఎన్నికహక్కు పోకుండ భారతీయులెల్లరును ఎన్నిక హక్కులు లేనివారిగ చేయు విద్యానియమము ఆస్తినియమముల నేర్పరతుము.”

[ఈ శాసనము రాజకీయాధికారమునకు వలసినదికాదు. కేవలము భారతీయుల నవమానించి “నేటాలులోకన్న తన స్వదేశముననే జీవనము బాగున్నదని భారతీయుడనుకొని వెడలిపోవునట్లు చేయుటకై చేయబడినది భారతీయులను శాశ్వతముగ కూలివారిగ, బానిసలగ నుంచుకొనుటకొరకిదియుపాయమని ఒక నేటాలు దేశీయుడు చెప్పెను.]

1896సం॥ లో 10,000 మంది యూరపియనులకు ఓటు (ఎన్నికహక్కు) లుండ 250 మంది భారతీయులకు మాత్రమే యుండెను. 1896సం॥ జూనులో 27వ తేదీన టైమ్సుపత్రిక యిట్లు వ్రాసినది. “చేంబర్లేను ఇప్పుడు తీర్మానించవలసిన సమస్య అర్థ నాదముకాదు. మన ప్రజలలో అంతఃకలహము లుండుటను మనము చూచి యూరకొనరాదు. నేటాలులోనికి వలసయే పోనరాదని ఇండియాగవర్నమెంటు శాసించినచో ఎంతతప్పో అనేక సంవత్సరములు కష్టపడి ఆర్థికాభివృద్ధికితోడ్పడి పౌరసత్వ హక్కులనుసంపాదించిన భారతీయులకు ఎన్నికహక్కులను నేటాలు ప్రభుత్వమువారివ్వకపోవుటయు నంతతప్పే. నిజముగ ఆశియా

వారా దేశమున బలవంతులగుదురనుభయము వారికుండినచో నెన్నిక నియమముల నెక్కుడుగ నేర్పరచినతప్పులేదు. ఆస్తియు విద్యయు నియతయుండవలెనని చెప్పనచ్చును. తెగలనుగూర్చియు రంగులనుబట్టియు చట్టములు చేయుటయే అన్యాయము

( 1895 సం॥ వలస చట్టము:—భారతీయులను, కాఫరుల సతికి త్రోయుటకు) నేటాలు (అటర్నీ జనరలు) ప్రభుత్వన్యాయవాది చెప్పినట్లు (భావి దక్షిణాఫ్రికాజాతీయతలో భారతీయులకు భాగము లేకుండగ 1895 లో నేటాలు గవర్న మెంటువారు భారతీయవలస చట్టమును శాసనమును చేసిరి ఇది చక్రవర్తిగారిసమ్మతి కూడపొందినది. భారతీయులను దేశమునుండి వెడలగొట్టుట కిది చేయబడెను 1894 ఆగష్టు 18 తేదీవరకును 5 సంవత్సరములు కూలిపని చేయుటకును ఓడకేవులేకుండనే వారి కుటుంబమునకు ఇల్లు, ఆహారమునిచ్చి మొదటిసంవత్సరమున నెలకుపదిషిల్లింగులు జీతమునిచ్చి తరువాతిసంవత్సరమునకొక షిల్లింగుచొప్పున అభివృద్ధి చేయుచు తరువాత నైదేండ్లు స్వేచ్ఛముగ కూలిపనిచేసినవారికి మరల తమదేశమునకు పోవుటకు ఓడకేవునిచ్చు పద్ధతులతో భారతీయులను నేటాలుకు వలసకు దీసుకొనివెళ్లుచుండిరి ఈచట్టమువలన నికముందుభారతీయులు బానిసలుగనుండుట కొడంబడవలెను. వారు 9 సంవత్సరములు పూర్తియగునప్పటికి 20 షిల్లింగులవరకు వృద్ధియగు జీతము పుచ్చుకొనుచు శాశ్వతము గకూలీలుగ నుండవలెను. అటుగానిచో వారు తమ దేశమునకైనను పోవలెను. లేనిచో అచ్చటనున్న వారిపైన వత్సరమునకు ఒక్కొక్క స్త్రీ కిని పురుషునకును 3 పౌనులు (రు 45-0-0)

చొప్పున తలపన్ను వసూలుచేయబడును. ఇది భారతీయుడు ఆరు నెలలు గడించు వేతనము.) 1893 లో నేటాలుగవర్నమెంటువారు తలపన్ను మాట చెప్పక తక్కినపద్ధతులను చెప్పుచు సీమార్పునకు అంగీకరింపుమని మన దేశముయొక్క గవర్నరు జనరలుగారికడ కిరువుర ప్రతినిధులను పంపగ నతఁడీమార్పున కంతగ నిష్టపడకయే, ఇంగ్లాండు ప్రభుత్వమువారు తరువాత అంగీకరించు పద్ధతిని ఒప్పుకొనెను. భారతీయులు ఒడంబడిక యనంతరము తప్పక తమ దేశమునకు పోవలెననియు లేనిచో ఆ నేరమునకు శిక్షింపబడుదురనియు నున్న షరతులకు మాత్రము ఆయన అంగీకరింపలేదు. అందులకే నేటాలు ప్రభుత్వమువారుపాయముఁబన్ని తలపన్ను విధించిరి. ఇందువలన భారతీయుని గుడిసెలోనున్న వస్తువులను జప్తుచేసి, నష్టపెట్టి ఇంటికిపోవునట్లు చేయవచ్చును (భారతీయపక్షమువారు నేటాలు పార్లమెంటులో నీ చట్టము విమర్శించి అడ్డగించిరి. ఈచట్టము నంగీకరించవలదనియు నులేనిచో నేటాలు వలసనే మాన్పుమనియు చేంబర్లేను గారికి మహాజరుపంపుకొనిరి.)

ఈ సమస్య పదేండ్లక్రిందటనే వచ్చియుండెను. వలసరాజ్యనాయకు లనేకులు దానిని ఖండించిరి. అప్పుడు నేటాలులోని భారతీయుల స్థితిని తెలిసికొనుటకొక విచారణసంఘ మేర్పరుపబడెను. అందలి సభికులలో నొకఁడగు శాండర్సుగారు ఇది అన్యాయమనియు తమ నివేదికలో వ్రాసిరి. ఈశాసనమును ప్రవేశపెట్టిన అటర్నీజనరల్ గారా విచారణసంఘము నెదుట నిట్లుచెప్పియుండిరి. నే నెఱిగినంతవరకు భారతీయులు

మనకు హానిచేయుటలేదు సరికదా, చాలవరకు మేలే చేయుచున్నారు. ౬ సంవత్సరములు చక్కని ప్రవర్తనము కలవారిని దేశాంతరమునకు బంపుటకు తగిన కారణములు నాకుగనపడుట లేదు."

ఇట్టి అభిప్రాయములను వెలుబుచ్చినవారియందే మార్పులు కలిగినవి. ఒక వస్త్రమును విడిచి మరొక దానిని ధరించినంత సులభముగ నభిప్రాయమును మార్చుకొనిరి. కొద్దికాలమునకు వీరు భారతీయులకు వ్యతిరేకులైరి. చట్టము శాసనమైనది.

వలసకూలీల స్థితి:—అచ్చట వలస షరతుల ప్రకారమున్న వారి స్థితియు బాగుగలేదు. వారునురంగున నల్లనగుటవలన నితరుల అసహిష్ణుతకు పాలగుచుండిరి. నేటాలులోని తోటలలో చాల మంది ఆత్మహత్యలు చేసికొనిరి! దీనికి కారణము బాధలుపడలేక పోవుటయే యజమానుడు బాధలు పెట్టుచున్నాడని ఇంకొక చోటికి మార్చుమన్న మార్చు ప్రభువులెవ్వరు?

గురుతుపత్రములు:—వలసకూలిపని తీరినపిదప భారతీయుల కొక కాగితమునిచ్చుచుండిరి. అదిచరసాలనుండి వచ్చినవాని సత్ప్రవర్తన తెలుపుపత్రమువలె నెవ్వరడిగినను అతడు చూపించవలెను. అదిలేనిచో సేవకవృత్తినుండి తప్పించుకొని వచ్చినట్లెంచి శిక్షించుచుండిరి ఇది చాలమందికి కష్టము కలిగించెను. ఈ నియమము పైకి కష్టముగ కనబడదు కాని నియమమును పరిపాలించు ఉద్యోగుల యందుగల నిర్దయ వలనను కోపమువలనను

భారతీయులకిది కష్టతరమగు బాధగ పరిణమించెను తెలుగు,
అరవము హిందుస్థాని, తెలిసిన భారతీయోద్యోగియున్నచో
సిదికష్టముగ నుండదు కాని అట్లుజరుగ లేదు. ఆపత్రముపోయిన
చో 3 పౌనుల నిచ్చిమరల నొక నకలును సంపాదింప
వలెనను నియమము ఘోరమయినది.

(రాత్రినడువరాదు: —నేటాలులో రాత్రి 9 గంటలైన
పిదప భారతీయుడు బయటకు పోవదలచినచో నొకఅనుమతిపత్రి
ముతీసికొనిపోవలెను. లేనిచో చెరసాలలోనికి పంపుదురు. చెన్న
రాజధానినుండిపోయిన పెద్దమనుష్యులకు నీయవమానము తట
స్థించుచుండెను. ఇందు వీరు వారను భేదములేదు. ఇందువలన
శిక్షలుపొందినవారు నుండిరి. మనభారతీయ బాలురు మంచి
విద్యనే అభ్యసించి పాశ్చాత్య రీతిని దుస్తులు ధరించుచుండిరి.
వారుగూడ రాత్రి 9 గంటలు దాటినతరువాత బయటికివచ్చిన
చో ఖైదులోనుంతురు పాశ్చాత్య దుస్తులధరించిన భారతీయు
లనుచూచి దక్షిణాఫ్రికావారు మరింత ఏవగించుకొనుచుండిరి.

కొన్నిసంవత్సరముల క్రిందట డర్బను పోలీసువారు ఒక
అరవ ఉపాధ్యాయుడును ఆదివారపు పాఠశాల ఉపా
ధ్యాయునియు రాత్రిపోవుచుండగ నరెస్టుచేసిరి. కానివారికి
న్యాయస్థానములో న్యాయము జరిగెను. వారిని విడుదలచేసిరి.
పాశ్చాత్యదుస్తులను ధరించినవారిని 'రాత్రి 9 గంటల తరువాత
నైనను పోనివ్వవచ్చుననిరి కాని ఇట్టిదుస్తులను ధరించిన భారతీ
యులు న్యాయస్థానములందు తప్పించుకొనకుండ చట్టమును

మార్చవలెనని దక్షిణాఫ్రికావారు కొందరు ప్రయత్నింపసాగిరి.

రిజిష్టరు కాఁబడవలెను:—డర్బనులో నల్లసేవకులెల్లరుతమ పేరులను ప్రభుత్వమువారికి చెప్పిరిజిష్టరు చేయించుకొనవలెనను నియమముండెను. పని చేయుటకు వెనుదీయు కాఫరులకీ శాసనము వర్తింపవలెను. కాని భారతీయులనుకాఫరులలో చేర్పవలెనను పట్టుదలతో వారికినీ ఈ శాసనము వర్తింపఁజేసిరి. భారతీయులచేత వ్రేలు ముద్రలు వేయించిరి.

ఇతర భారతీయప్రజలు పడుకష్టములు:—కష్టములు పడుటకుపోయిన కూలివారిమాటయేల? తోడిబ్రిటీషుప్రజని వలెనే తనకును హక్కులుగల భారతీయవర్తకుడును, ఉద్యోగియు పడుకష్టములును వర్ణనాతీతములు. భారతీయుల నెల్లగను తెల్లవారేవగించుకొనిరి. ట్రాంబండ్లలో, రైళ్ళలో, మనలను మృగతుల్యులుగ చూచుచున్నారనుసంగతి లోకప్రసిద్ధము. ఈ సంగతి పత్రికలలో ప్రకటింపబడినది. ఏజంటుగారు లేదన్న మాత్రమునపోదు. నేటాలు పార్లమెంటు సభ్యులకీసంగతిని బహిరంగలేఖలలో గాంధిగారు తెల్పిరి. లండనుస్టాక్ నేటాలు మెర్కూరీ పత్రికలు గాంధిగారివిషయమున అతిశయోక్తులనాడ లేదని వ్రాసియున్నవి. 1894 సంవత్సరమున నొకభారతీయుడు నేటాలురైలుపైన 2 వ తరగతి టికెట్టుకొని యెక్కెను. ఆరాత్రిప్రయాణములో మూడుమారు లతనిని లేపిరి. పాశ్చాత్య ప్రయాణీకులను సంతోషపెట్టుటకు కాఁబోలును రెండుమా

రులు ఆబండిలోనుండి మఱియొక బండిలోనికి మార్చిరి. అతడు కోర్టులో వేసిన వ్యాజ్యమున అతనికి 10 పౌనులు నష్టపరిహార మిప్పించబడెను. కోర్టులో వాది సాక్ష్యమిచ్చెను. సాక్షి, తాను రాత్రి 1 గం॥ 30 ని॥ లకు ఛార్లెసు టవును నుండి పోవు రైలులో 2 వ తరగతిబండిలో నెక్కెను. అబండిలో ముగ్గురితర భారతీయులెక్కిరి. కాని వారు (Newcastle) న్యూకాసిలులో దిగిపోయిరి. అంతట నొక తెల్లవాడు బండితలుపు తీసి బయటకురా "సామీ!" అనెను వాదియెందులకనెను. తెల్ల వాడు నీకెందుకు నేనిక్కడ నింకొకరినెక్కించెదను. అనెను. వాది నేను క్రమమైన రుసుము చెల్లించితినిగదా ఏలదిగవలెను? తెల్లవాడంతట వెడలిపోయి రైలులో పనిచేయుచున్నట్టు కనబడుచుండిన భారతీయునొకనిని తీసుకొనివచ్చి వానితో దిగుమని చెప్పమనెను. అంతట నాభారతీయుడు ఆ తెల్లఆయన నిన్ను దిగమనిఆజ్ఞాపించుచున్నాడు. నీవుదిగవలెను అని వెడలిపోయెను. నేను సరియైనరుసుమునిచ్చియుంటిని ఇక్కడనేయుండుటకు నా కుహక్కున్నది కదా, నీవేల నన్నిట్లు కదలించుచున్నావు అని వాదియడిగినాడు. తెల్లవానికి కోపమువచ్చినది. నీవుదిగనిచో తన్నెదను. అని లోనికివచ్చి అతని చేయిపుచ్చుకొని లాగ ప్రయత్నింప నేను దిగెదను విడువుమనివాదియనెను. వాదిదిగినాడు. అంతట తెల్లవాడతనికింకొక రెండవతరగతి బండిచూపి ఎక్కుమనినాడు ఆబండియందెవరును లేరు. వాది యెక్కినాడు. వాది దిగిపోయినబండిలో బ్యాండుమేళము వాయించువారి నెక్కించినట్లు వాదికి తెలిసినది. ఈ తెల్లవాడు న్యూకాసిలు

రైళ్ళయొక్క జిల్లాసూపరెంటు అంతట వాది మారిట్జిబర్గువరకును ఆబండిలోనే ప్రయాణముచేయుచు, నిద్దురవచ్చుటవలన నిదురించుచుండెను. అతనికి మారిట్జిబర్గుదగ్గర మెలుకువ వచ్చినది. అంతట తనబండిలోనొక తెల్లమనుజుడు, ఒక తెల్లస్త్రీ, ఒకశిశువు నుండుట తెలిసినది. అంతట నొక తెల్లవాడు బండిదగ్గరకువచ్చి ఆ తెల్లవానితో "ఆతడుమీవాడా" అనెను. అవును వాడు మాపిల్లవాడనెను రెండవ తెల్లవాడు వానిమాటకాదు ఆమూలనున్నకూలీ Damned coolie సంగతి అడుగుచున్నాను అనెను. ఈపెద్దమనుష్యుడు రైలుబండ్లగొలుసాలు కలుపువాడు. అంతట బండిలోనున్న తెల్లవాడు పోనిమ్ము వానితో మనకేల? అనెను. అంతట రెండవ తెల్లవాడు తెల్లవారున్న బండిలో నేను కూలీల నుండనీయను అని భారతీయునివంకతిరిగి సామీ బయటకురమ్ము అనెను. వాదియెందులకు? నన్ను న్యూకాసిలులో నీబండిలోనికి మార్చినారే? అనెను. సరియె కాని నీవు దిగితీరవలెను. అని బండిలోనికి వచ్చుటకు ప్రయత్నించుచుండగా న్యూకాసిలులో జరిగినట్లి ఇచ్చటను జరుగునుగదా యని వాది తలచి దిగెదనని దిగెను. తెల్లవాడీయన కింకొక 2 వ తరగతిబండినిచూపెను. ఆబండిలో నప్పుడెవరును లేరు. భారతీయుడు (వాది) యెక్కెను అంతట మరలనింకొక తెల్లవాడెక్కెను. అంతట నింకొక తెల్లయుద్యోగివచ్చి ఆకంపుకొట్టుకూలీతో ప్రయాణముచేయుట కిష్టములేనియెడల నీకింకొక బండి చూపెదననెను. ఇది22 వ నవంబరు1897సం॥ నేటాలుమెర్క్యూరీ పత్రికలో ప్రకటింపబడినది. ఈకేసులో ప్రతివాదితరుపున సాక్షు

లలో నొకడుత్తర్వు కైవచ్చినట్లు తెలిసినది. ఈ అక్రమమును గూర్చి దక్షిణాఫ్రికా పత్రికలెల్ల వ్రాసినవి. నేటాలు మెర్క్యూరీ "ఈయనిబ్బంది యతనిని వారు తిన్నగచూడలేదనుట స్పష్టము. ఇటు వంటివారికి 2 వ తరగతి టిక్కెట్టు నిచ్చిన తరువాత నిట్టి చర్య చేయుట తప్పు. తెల్లవారైన నల్లవారైన నిట్టి అక్రమచర్యలకు పాల్పడకుండ మొదటనే చూచుట మంచిది" అని వ్రాసినది. చదువుకున్నవారైనను, శుభ్రముగనున్నను లేకున్నను భారతీయులందరును కూలీలుగ వ్యవహరించి అట్లు చూచుట అలవాటయినది. యూరపియనులను చూచినట్లే నల్లప్రయాణీకులను తెల్లయుద్యోగులు చూడవలెనని ఉద్యోగులను కోరుట అన్యాయముకాని కొంచెము మర్యాదగ చూచుట మంచిదని తేలుచున్నది." కేపుటైమ్సు నేటాలువ [illegible] ప్రజలనేల అన్యాయముగ చూచుచున్నారు. వారు [illegible] కూడదు. రైలుబండిలో తెల్లవారితో పాటు కూర్చుండకూడదు. భోజనము, వసతి, తెల్లవారితోపాటు హోటళ్ళలో వీలులేదు. ప్రజలుపయోగించు స్నానశాలలలో వీరు స్నానముచేయరాదు." అని వ్రాసినది.

ట్రాన్సువాలులోని భారతీయులు:—ట్రాన్సువాలులోని భారతీయుల స్థితి బాగుగలేదు. మనవారచ్చట భూమిని సంపాదింపరాదు. అచ్చట [illegible] ప్రత్యేకింపబడిన గూడెముల వంటి చోటులతప్ప నివసింపరాదు. వర్తకము చేయరాదు. ఆప్రదేశములు బ్రిటిషు ప్రతినిధి (యేజంటు) గారు చెప్పినటుల నట్టి చెత్త తుక్కు, అశుద్ధము, పారవేయు స్థలములు. అచ్చట మురికి

నీరుతప్ప జలములేదు జోహానసుబర్గులో ప్రిటోరియాలో బాటలప్రక్క నడుచువారికొరకు వేసిన కాలిదారులలో మనము నడువరాదు 9 గంటలైనతరువాత బయటకు పోకూడదు. అనుమతి పత్రములులేకుండ ప్రయాణము చేయరాదు రైళ్ళలో మొదటి రెండుతరగతులలో ప్రయాణములు చేయరాదు.)

పౌరసత్వములు, తలపన్ను:—1884 సం॥ న బోయరు ప్రజా స్వామ్యమువారికిని బ్రిటీషు సామ్రాజ్యమువారికిని జరిగిన లండన్ సంధిప్రకారము ట్రాన్సువాలులోని (ఆదిమవాసులకు) నేటీవులకుహక్కులు లేవనుసిద్ధాంతము అంగీకరింపబడెను. ట్రాన్సువాలు వారంతటితో నూరకొనక ఆశియా (భారతీయులను) వారిని నేటీవులతోపాటు హక్కులులేనివారిగచేసిరి. 1885సం॥ 3 వ చట్టమును శాసించిరి. దీనివలన కూలివారు, అరబ్బులు, మలయులు, మహమ్మదీయపరిపాలితులును, దేశములో పౌరసత్వములు పొందుటకు అర్హులుకారనిరి. వారుభూములను ఇండ్లను సంపాదింపరాదు. ప్రజాస్వామ్య దేశమందు వర్తకముచేసికొనుటకు నివసించువారు తమపేరురిజిస్టరు చేయించుకొనవలెను. అట్లురిజిస్టరు చేయించుకొనుటకు 25పౌనులివ్వవలెను. దీనినితరువాత 3పౌనులుగ తగ్గించిరి కూలీలు తదితర నేటివులునుభూములను ఇండ్లను ట్రాన్సువాలు ప్రభుత్వమువారు నిర్ణయించిన ప్రదేశములందుమాత్రమే కొనవచ్చునని 1887 లో ట్రాన్సువాలు ప్రజా ప్రతినిధుల సభయగు వోక్స్రాట్ సభవారుతీర్మానించిరి. అయినను భారతీయుల నెల్లను ప్రత్యేక

స్థలములందు నివసించునట్లుచేయలేకపోయిరి. హక్కులులేకుండ చేసినను భారతీయులు దేశములోనికి రాకూడదని మాత్రము నిషేధింపలేదు 1898నాటికి స్త్రీలును బాలురునుగాక ట్రాన్సు వాలులో 15,000 భారతీయులుండిరి. ప్రాతవారిని నివసించు చున్న ప్రదేశములనుండి వెడలగొట్టి ప్రత్యేకస్థలములందు కాపు రముండుడని నిర్బంధించియు క్రొత్తవారి నాప్రదేశములందు కాపురముండకూడదనియు బాధపెట్టుచుండిరి.

ఆరెంజి రాజ్యములోని భారతీయులు:—1880 సం॥ మొదలు 1890సం॥వరకును ఆరెంజిరాజ్యములోని భారతీయుల నెల్లరను దేశమునుండి తరిమివైచిరి వారి గిడ్డంగులను బోయరులు బలవంతముగ మూసివైచి వారికి కొంతనష్టపరిహారమిచ్చి పంపివైచిరి. ఈవిధముగ 9000పౌనులు భారతీయులకు నష్టము కలిగెను. భారతీయుడు అధ్యక్షుని యనుమతిలేనిది రెండు నెలలకన్న నెక్కుడు కాలమురాజ్యము లోనుండరాదని శాసించిరి. అనుమతినిపొందవలెనన్న నొకనెలకు ముందుగనె విన్నపమంపుకొనవలెను. అట్లంపినవనింకెన్నో యడ్డంకులుండెను. అట్లనుమతిపొందినవారైనను వత్సరమునకు 25 పౌనుల తలపన్ను ప్రభుత్వమువారి కిచ్చుకొనుచుండవలెను. ఆరెంజిరాజ్యమున కొంతమందిసేవకులును పూటకూటింటివారును మిగిలిరి. వీరెల్లరు నాదిమవాసులతో తుల్యులుగ చూడబడుచుండిరి. ఆరెంజి రాజ్యమున భారతీయు లెట్టిస్థిరాస్తినైనను కలిగి యుండరాదు. ఎట్టివ్యాపారమును చేయరాదు. వ్యవసాయపు పనులుగూడ చేయరాదు. బోయరు యుద్ధమునపిదప భారతీయులను మజిల

హానిత్తుమని పరిపాలకులనియుంచిరిగాని భారతీయులు అనుమతి కోరగ నిరాకరించిరి. పాశ్చాత్యవర్తకులె అసూయాగ్రస్థులై యిట్లుచేసిరి. ఆ కేంపు రాజ్యమున భారతీయ సమస్యయె లేకుండుట కిదియొకారణము.

రొడీశియాలో భారతీయులు:— ట్రాన్సువాలునకుత్తరమునున్న దక్షిణ రొడీశియా దేశమున వర్తక సంఘమువారి వలన పరిపాలింపబడుచున్నను బ్రిటీషుపరిపాలక ప్రతినిధియగు హైకమీషనరు నధికారమునకు లోబడియుండెను. ఆదేశము విశాలమైనది. జనసంఖ్య కొంచెమెయుండెను. దేశాభివృద్ధికొరకు పాశ్చాత్యులు పాటుపడి భారతీయులచేత పనులుచేయించుకొనుచుండిరి. అచ్చటికి పోవుటకెల్లరకును వర్తింపు వలసచట్టములుండెను. రొడీశియాలో మొదట 400మంది భారతీయులుండిరి. దక్షిణాఫ్రికాలో నెల్లరకును భారతీయులపట్ల గలిగిన ద్వేషము యిచ్చటివారికిని కలుగసాగెను. 1908సంవత్సరము వచ్చునప్పటికి ట్రాన్సువాలు వారినిచూచి వీరునొకఘోర చట్టమును చేసి భారతీయుల వలసను నిషేధించి ఉన్న భారతీయులను రిజిష్టరు చేసికొనవలెనని నిర్బంధించి బాధపెట్టుటకు ప్రయత్నించిరి. దేశములోనివారిని వెడలగొట్టుటకు అధికారము వారియుద్యోగులకిచ్చిరి. దీనిపైన హైకోర్టుజడ్జికి ఉపప్ర్యభియోగము చేసికొనవచ్చుననిరి. అయిన నేమిలాభము? ఈశాసనము స్త్రీలకును వర్తింపజేసిరి. ట్రాన్సువాలు నేటాలుదేశములలోని భారతీయులును, గాంధిగారును, రొడిశియా భారతీయులకు

సహాయముచేయగ వీరు సామ్రాజ్య ప్రభుత్వమువారికి మొరపెట్టుకొనిరి. హై కమీషనరు సెల్‌బోర్న్‌గారి చట్టమున కనుమతించిరిగాని బ్రిటిషు వలసరాజ్యాంగమంత్రియగు క్రూ ప్రభువు ట్రాన్సువాలువారి ఘోర యుదాహరణకన్న కేపుకాలనీ నెటాలు దేశములవారి సౌమ్యపద్ధతులనె రొడీశియా పరిపాలకు లనుకరించుట లెస్సయని హై కమీషనరుగారికి లేఖ నంపి శాసనమును నిరాకరించిరి. ట్రాన్సువాలులో గాంధిగారి యుద్యమమును, భారతఖండమున ప్రజాభిప్రాయమును ప్రభుత్వమువారికన్నులు తెరచెను. రొడీశియావారు దురుద్దేశ్యముతో భారతీయ వర్తకులకును వీధులవెంట తిరిగి యమ్ముకొను వారికిని యనుమతు (లైసెన్సు)ల నిచ్చు విషయమున, క్రొత్త భారతీయుల కీయకుండుటయెగాక ప్రాతవారి లైసెన్సులను రద్దుజేయు నధికారము తీర్మానించిరి. దీనిపైన (అప్పీలు) ఉపర్యభియోగమైన లేదు. ఎవరికైన ఒక వేళ అనుమతిచ్చినను, ప్రత్యేకముగ నిర్ణయింపబడిన స్థలమందె వర్తకము చేసికొనవలెనుగాని ఎల్లప్రదేశములలోను చేసికొనరాదు. 1913 నాటికి భారతీయులసంఖ్య 3 వేలయ్యెను.

**కేపుకాలనీ రాజ్యములోని భారతీయులు:**—దక్షిణాఫ్రికాలోని రాజ్యములన్నిటికన్నను కేపురాజ్యమె నల్లవారియెడల విశాలభావమును వహించి కొంచెముదయను చూపుచున్నదని చెప్పవచ్చును. కొంచెము విద్యకలిగి నియమితమగు ఆస్తియున్న వారుగాని అర్జియిచ్చువారుకాని కేపు శాసనసభలకు సభ్యుల

వెన్నుకొనుటకు నలుపురంగు మనుష్యులకుగూడ హక్కుల నిచ్చిరి. మునిసిపల్ సభలకును వీరెన్నుకొనవచ్చును.

కేపుమలయా భారతీయ మిశ్రమజాతికి జెందిన డాక్టరు ఏ అబ్దుల్ రహిమాన్ గారిని కేపుటవునుసంఘముCape Town Town Council న సభ్యులుగ నుండనిచ్చిరి. అయినను కొన్ని పట్టణములలో భారతీయులకు వ్యతిరేకములగు చట్టములు చేయబడుచుండెను. కేపు రాజ్యముననొక పట్టనమునకునింకొక పట్టనమునకు చాలదూరము. కేపుటవునకు కింబర్లే 647 మైళ్ళు. పోర్టు ఎలిజబెత్తు 839 మైళ్ళు. తూర్పు లండన్ 887 మైళ్ళు. అందువలన నొక కేంద్రసంఘముగ లేక భారతీయులాయా పట్టణములందు ప్రత్యేకముగా సంఘముల నేర్పర్చుకొనిరి.

తూర్పు లండన్ మునిసిపాలిటీవారు భారతీయుల నాదిమవాసులవలె చూచిరి. వారు రాజబాటలప్రక్కనుండు కాలిదారులందు నడువరాదు. రాత్రి 8 గంటలైనపిదప అనుమతి పత్రములేకుండ తిరుగరాదు. మునిసిపాలిటీవా రనుమతిపత్రమునిచ్చినగాని మునిసిపలుహద్దులలో కొన్ని చోటుల కాపురముండరాదు, వర్తకమును చేయకూడదు. మునిసిపలు ఉద్యానవనముల (parks) లో పాశ్చాత్యులు మాత్రమే కూర్చుండుటకు బల్లలను ప్రత్యేకించిరి. బఫెలోనదిపైన గల బల్లకట్లపైన భారతీయులు స్వేచ్ఛముగ నెక్కరాదు బజారులలో తెల్లవారికి మంచిచోటు లిచ్చి భారతీయులను కాఫరులదుకాణములదగ్గరకు పొమ్మనిరి. "ట్రాము" బండ్లలోపల భారతీయులు కూర్చుండరాదు. ఈ

నియమనములు స్థానిక పరిపాలకులు చేసినందున కేపుకాలనీ ప్రభుత్వమువారేమనజాలరైరి.

కేపుకాలనీలోని భారతీయుల నెల్లరను బాధించు శాసనములు రెండుకలవు. వలసచట్టము, లైసెన్సుచట్టము. మొదటిది నేటాలు వలస చట్టమువంటిదే. దీనివలన భారతీయుల నుద్యోగులు బాధించిరి. దేశమువదలివెళ్లు భారతీయులుతిరిగివచ్చుట కొరకొకమారు ఒక పౌనునిచ్చి అనుమతిపత్రము (Permit) పుచ్చుకొనుచుండవలెను. అట్లు పుచ్చుకొననిచో నతనిని నిషేధింపబడవలసినవానిగ పరిగణింతురు. నేటాలువారు దేశములోనివారి కొరకు గుఱుతుపత్రము (Domicile Certificate) ఇచ్చుచుండిరి కేపులోనట్టిది లేదు. అందువలన దేశములోనివారైనను, అనుమతిపత్రము పొందియున్నను, ఒకసంవత్సరము దాటినచో అనుమతి చెల్లదనిరి. అందు తనుభార్యను బిడ్డలనువదలివెళ్లినవారు సయితము మఱలవచ్చుటకు అడ్డంకి కలిగించిరి. భారతీయులు తమబిడ్డలను దేశములోనికి తీసికొని రావలెనన్న భారతీయ దొరతనమువారివలన వారి బంధుత్వమును వయస్సును తెలుపు గుఱుతు కాగితములు పుచ్చుకొనిరావలెనని నిర్బంధించిరి భారతీయులు సుప్రీముకోర్టులో నభియోగములు చేసికొనవలసివచ్చుచుండెను. లైసెన్సు చట్టమును కేపువారు నేటాలువారినుండి గ్రహించిరి. డివిజను కౌన్సిలు, సంఘములు (Divisional Council) వర్తకముచేసికొనుట కనుమతినీయుట నిరాకరింప వచ్చును. దీనిపైన పర్యభియోగము చేయుట చాలకష్టము. అందువలన భారతీయవర్తకులనేకులకు వర్తక

ముచేసికొను హక్కుపోయెను. కేపుకాలనీ రాజ్యమునందు వీధులవెంట తిరిగియమ్ముకొను భారతీయులకు అనుమతులనీయక నిరాకరించిరి వీరికొరకు ప్రత్యేక నియమములుచట్టముగ లే నప్పటికి నట్లుచేసిరి. పందలకొలది భారతీయులకు జీవనాధారము పోయినది. కేపుటవునులో మాత్రమనుమతులనిచ్చిరి. లైసెన్సుల అభియోగములను విచారించు న్యాయాధిపతులు భారతీయులకు వ్యతిరేకులుగ నుండిరని కేపుమంత్రి సార్ గారే యనిరి.

పోర్చుగీసు మొజాంబిక్ లోని భారతీయులు:—లోరెంకో మార్క్వెస్ జిల్లాలోనే చాలమంది భారతీయులుండిరి ఇచ్చటి వారెల్లరు బ్రిటిషుపోర్చుగీసుభారతీయ మిశ్రమజాతివారు. వీరిలో చాలామంది గోవానుండి వచ్చిన క్రైస్తవులు వీరిని పాశ్చాత్యులవలెనె గౌరవమున చూచిరి. చాలకాలమువరకు పోర్చుగీసు ప్రభుత్వమువారు భారతీయులను బాగుగ జూచిరి. ట్రాన్సువాలువారు విద్యావంతులగు భారతీయులను కూడ ఇనుపరేకులపెట్టెలలో కాఫరులతో పాటు ప్రయాణముచేయునట్లు నిర్బంధించుచుండిన దినములలో భారతీయులను మూడవతరగతిలో ప్రయాణము చేయనీయక పెద్దతరగతిలో కూర్చుండుమనిరి. భారతీయులకు ప్రభుత్వోద్యోగములనిచ్చిరి. గోవాక్రైస్తవులు కాని పోర్చుగీసుభారతీయులను బ్రిటిషుభారతీయులకన్న బాగుగ చూచిరి. తరువాత హైలగో అఖాతమున ట్రాన్సువాలువారికి పలుకుబడి యధికమయ్యెను. వారిప్రోత్సాహమున పోర్చుగీసు పరిపాలకులు భారతీయులనుబాధింపసాగిరి. ఇచ్చటి వలసచట్టములందు సమానాదరణముండినను ట్రాన్సువాలువారు తరి

మినభారతీయులను వీరునుతరిమివైచిరి. భూమిపైనను సముద్రముపైనను దేశములోనికివచ్చు భారతీయులను వారువచ్చు దేశమునందున్న పోర్చుగీసు అధికారి (Consul) వలన అనుమతి పత్రములు పొందిరావలెననిరి. మూడుసంవత్సరములు దక్షిణాఫ్రికాలో కాపురమున్న వారికి తప్ప అనుమతులివ్వరైరి. అనుమతిపత్రములతో గుఱుతుకొఱకు ఛాయాపటములుండవలెననిరి. అనుమతిపత్రము 6 నెలలకే. కాని ఈచట్టము గౌరవము విద్య ధనము కల ఆశియావారికి వర్తింపదనిరి.

# దక్షిణాఫ్రికా.

## II

## వలసకూలి

## (The Indentured Labour.)

వలసకూలి:—"ఒడంబడిక పత్రములు వ్రాయించి కూలివారిని తీసికొనిపోవుపద్ధతి తాత్కాలిక బానిసత్వము" అని సర్ విలియమ్ విల్సన్ హంటరుగారు చెప్పియున్నారు. కూలివారలను తేయాకు, కాఫీ, చెఱకుతోటలలో పనిచేయుటకు తీసుకొనిపోవుచుండిరి. రైల్లు మునిసిపాలిటీలు బొగ్గుగనులును కూలివారిపనిమీదనాధారపడియుండినందున నాసంఘములవారునువీరినితీసికొనిపోవుచుండిరి భూస్వాములు తమ వ్యవసాయముకొఱకువీరి నుపయోగించుచుండిరి. ఇంటిలోని సేవకులుగనుకూడ వీరినుపయోగించు చుందురు. దక్షిణాఫ్రికాలో కాపురమున్న భారతీయులీపద్ధతి బానిసత్వముగనెంచి అయిష్టము చూపుచుండిరి. కానిభరతఖండములో కఱవులలో బ్రదుకు తెరువులేక దురదృష్టవంతులైగు కూలి వారు వలసకు పోవుచుండిరి. ఈకూలిపద్ధతి భారతీయపాశ్చాత్యులస్నేహమునుపాడుచేసినది. యజమానులు కూలివారలను యంత్రములుగనెంచి పనిచేయించు చుండిరి. దయదాక్షిణ్యములుచూపక అమానుషముగ ప్రవర్తించుచుండిరి. భారతీయ వలస వారికొఱకు నియమింపఁబడిన రక్షకోద్యోగులుగాని వైద్య

ఉద్యోగులుగాని ఏమియు చేయఁజాలరైరి. కూలివారితోటయజమానులెల్లరును క్రూరులని చెప్ప వలనుపడదు. వారిలోను ప్రపంచములో నితర దేశములందువలె సత్పురుషులును దయార్ద్రహృదయులును కలరు. సర్ జేమ్సు లీజ్ హ్యూలెట్టు, మాననీయులగు మార్షల్ కామెల్ హిండ్సన్ గారల తోటలలో కూలిపనిచేయువారిస్థితి బాగుగనే యుండెను. కాని, ఈమంచి యుదాహరణములు స్వల్పములు. వలసకూలీల ఘోరదుర్దశను గూర్చి ఆందోళనము చేసినప్పుడెల్ల గవర్నమెంటువారును పాశ్చాత్యపక్షపాతులిది యసత్యమనియు పైన చెప్పబడినవారు చూపుచున్న దయను చూడుడనియు అనుచుందురు.

**వలసకూలి పద్ధతులు:**—వలసకూలి ఒడంబడిక యొక చిత్రమగు పత్రము. కూలివాఁడు తానేయజమానుని పాలఁబడునో ఒడంబడిక చేయునప్పుడెఱుఁగడు. అతడు భరతఖండముననే ఒడంబడిక పత్రము వ్రాయును. వలసకూలివారి రక్షకోద్యోగి ఎవరిక్రింద పని చేయుమన్న చేయుట కంగీకరించును. అందువలన నితఁడు పనిచేయుటకుఁగుదిరిన యజమానికి నితనికిని మానవస్నేహభావము లుండవు. "పశువు, పశువుల యజమానుఁడు" భావము మాత్రమె యుండును. ఖరీదు ఎక్కుడుగ నున్నందున పశువులనుకొనుట కష్టము. కూలివాఁడు సులభముగ దొరకును గనుక యజమాని వానినంతకన్న లాఁతిగఁ చూచును. ఈయొడంబడికవలన కూలివానికన్న యజమానులకె లాభమెక్కుడుగనుండును. ఈఒడంబడికషరతును యజమాని మీఱవచ్చునుగాని కూలివాఁడు మీఱినచో శిక్షాస్మృతిక్రింద దండింపఁబడుచుండును. కూలివానికష్టము

లు భరతఖండమును వదలకుండగనే ప్రారంభమగును. పాపము కూలివారలను సంపాదించుచు ధనమార్జించు మగ కుంటెనల "ఏజెంట్లు" తీయనిపలుకులు, దక్షిణాఫ్రికానుగూర్చిన కథలు, అతిశయోక్తులు నిజములని నమ్మెను. ఇది అసత్యమని ఆతనికిఁ దెలియుమార్గములేదు. అతఁడు సాధారణముగ విద్యనెఱుఁగనివాఁడు ప్రపంచజ్ఞానము లేనివాడు నగుట తనదేశమున బ్రదుకు తెరువు లేకుండుటవలన నింకొకచోట బ్రతుకవచ్చునను కొనును. శాస్త్రప్రకారము ఒడంబడిక పత్రపుషరతులు కూలివానికెఱుగునను సిద్ధాంతము కలదు. నిజముగ దానిషరతులతనికి మొదట తెలియఁజెప్పవలెనను నియమమును కలదు గాని ఈ దస్తావేజు స్వభావమాకూలివాఁడెట్లు గ్రహింపఁగలఁడు? వలస చట్టములనుగూర్చి ఇతఁడేమెఱుగును? తనదేశములో స్వేచ్ఛననుభవించు కూలివానికి నేటాలులోనున్న సందర్భములు, తాను మాలగూడెములంటె వసింపవలెనని, తనకేహక్కులునుండవని, తనకెల్లయెడల నవమానమెగలుగుచుండునని, ఎట్లు తెలియును? అతఁడు క్రొత్తదేశములో తన యింటికివచ్చును. అచ్చటచాల గంటలు పనిచేయువలెను. ఆహారము కొరతగనుండును. గృహసౌఖ్యములుండవు. దుష్ప్రవర్తనకు మార్గములుండును. అవమానములు, శిక్షలు, కలుగుచుండును ఈపద్ధతిలో మఱియు ఘోరమగు సంగతి యొకటికలదు నూరుగురు పురుషులకు 40 స్త్రీలవంతున కూలివారల స్త్రీలనుకూడ దిగుమతిచేయుచున్నారు. పెండ్లిచేసికొని గౌరవముగ నన్నవారు రారుకదా! అందువలన అట్లుదిగుమతిచేసిన అధికారుల యుద్దేశ్యము లెట్టివైనను వీరియందు వ్యభిచారము వృద్ధియైనది. అంతట సుఖరోగములు

ప్రబలినవి. అందువలన అవినీతి వృద్ధియైనది. దీనికితోడు ప్రభుత్వమువారు భారతీయవివాహముల నంగీకరింపక దుష్ప్రవర్తనలకు సహాయముచేసిరి. ఒప్పందడికలోని నిర్ణయకాలముపూర్తియైనపిదపకూడ రక్షకోద్యోగిగారి అనుజ్ఞలేనిది పెండ్లిండ్లు జరుగరాదు. ఇట్టిసందర్భములో అనారోగ్యమున దౌర్భాగ్యమున పుట్టిన పిల్లలస్థితి యెట్లుండునో, ఊహింపవచ్చును. వారికిమంచి ఆచారమెట్లుకలుగును? వీరికి విద్యనేర్చుకొనుటకు అవకాశములు లేవు. వీరి దురవస్థలను చూచువారులేరు.

ఆత్మహత్యలు.—ఒప్పందడికచేసి వచ్చిన వలసకూలివారిలో నధికముగ ఆత్మహత్యలు జరుగుచున్నవి. 1904-1905 సంవత్సరములమధ్య జరిగినవానినిగూర్చి రక్షకోద్యోగి శ్రద్ధ వహింపలేదు. 1906 లో 27 గురుచచ్చిరి. 1907 లో 26 గురు, 1908 లో 18 గురు ఆత్మహత్యలు చేసికొని చనిపోయిరి. నేటాలులో

| | | |
|---|---|---|
| 1904 లో | 10లక్షలకు | 465 |
| 1905 లో | ,, | 582 |
| 1906 లో | ,, | 661 |
| 1907 లో | ,, | 638 |

ఆత్మహత్యలు చేసికొని చనిపోయిరి. ఈ నాలుగుసంవత్సరములలో భరతఖండములోని ఆత్మహత్యలకన్న పదునాలుగురెట్లెక్కుడు ఆత్మహత్యలీచిన్నవలస దేశములో జరిగినవి. మొత్తముమీద సంవత్సరమునకు 1000000 భారతీయులలో 551 మంది చొప్పున మరణించిరి.

శాసనములు:— వలస కూలివారికొరకు చేయబడిన ప్రత్యేక శాసనములు చట్టములరూపమున చాలనున్నవి. వీనిలో ప్రధానమైనది, 1891 సంవత్సరపు 21 వ శాసనము. దీనిలో 30 వ శెక్షను ఇట్లు చెప్పుచున్నది "లిఖితరూపమగు అనుజ్ఞపత్రము లేనిది తానుజీవించుచోటికి కొక మైలుదూరము దాటి నడచు కూలివాడు, ఏదైన ఫిర్యాదు చేయుటకొరకు పోవుచున్న తప్ప, అరెస్టు చేయబడి తన యజమానునికడకు పంపబడును. ఆఖర్చు అతని కూలినుండి మినహాయింపబడును. 31 వ శెక్షనుప్రకారము కూలివారలను గురుతు తెలుపు పత్రములు చూపుమని ఉద్యోగులు అడుగవచ్చును ఒడంబడికకాలముతీరినవాని. కూడ గురుతు తెలుపు పత్రమడుగవచ్చును. చూపనియెడల మేజస్ట్రేటు వారిదగ్గరకు కొంపోవుదురు. అచ్చట నాయన తృప్తిచెందనియెడల 10 షిల్లింగుల (ఒక నెలజీతము షుమారు రు. 7-8-0 లు) అపరాధమున 7 దినముల కఠినశిక్షయు విధింతురు. రెండవమారిట్లు జరిగిన 30 దినములు విధింతురు. శిక్ష అయిన తరువాత మరల యజమానునికడకంపుదురు. అందుకుఖర్చు వాడే భరింపవలయును. అనగా జీతములో మినహాయింపబడును.

పనిలోనికి రానియెడల నెలజీతము అంతయు మినహాయించవచ్చును. ఒక సంవత్సరములో 25 దినములకు పయిబడి రానియెడల రెట్టింపుదినము లెక్కువపని చేయవలయును. కూలివానికి జబ్బుచేసినచో యజమానుడు దినమునకు 4 పెన్నీల (రు 0-4-0) చొప్పున మినహాయింపవచ్చును. రెండేండ్ల తరువాత 6 పెన్నీలను మినహాయింపవచ్చును. కొందరు దుర్మార్గపు యజమానులు లాభముపొందుటకు జబ్బుచేసి పనిమానినవారిని

సెలవు లేకుండ పోయినవారినట్లు అరెష్టు చేయించి శిక్షించి లాభము పొందుచుండిరి.

హాజరుపట్టిక పలచినప్పుడు రాకుండ నాలసించినను పనిలో నశ్రద్ధచేసినను మాటవినకపోయినను మోసము చేసినను యజమానునికి నష్టముకలిగించినను కూలివారు కఠినశిక్షలకు పాత్రులగుచుండిరి. ఇట్టిశిక్షలున్నవని వీరికి మొదటచెప్పినట్లుకానరాదు. 101 వ శెక్షను చాలవిచిత్రమైనది. కూలివారిలో అందరుకాని కొందరుకాని యజమానుని అనుజ్ఞలేకుండ అతనిపైననె రక్షకోద్యోగికి ఫిర్యాదుచేయుటకను మిషమీదనైనను పనివిడిచి పోయినచో వారినిపట్టుకొని పనిలోనుండి తప్పించుకొనిపోయిరని నేరముమోపి ౫ పౌనులు (నాల్గు నెలల కూలి) జరిమానాయును 2 నెలల కఠినశిక్షయు వారు చేసిన ఫిర్యాదుయొక్క నిజానిజములతో నిమిత్తము లేకుండ జయాపజయములతో నిమిత్తము లేకుండవిధింపవచ్చును. ఈశెక్షను క్రింద లేడిస్మిత్తు గనులలోపని చేయువారు చాలమంది శిక్షింపబడిరి. ఇట్టితరి కూలివారెట్లు బయటకుపోయి తమ యజమానులపై నభియోగములు చేయగలుగుదురు? ఈచట్టమును 1900 సంవత్సరపు మొదటి శాసనసుకొంచెము మార్చినది. అట్లుఫిర్యాదు చేసుకొనుటకు వచ్చిన భారతీయుని రక్షకోద్యోగిగారు ఫిర్యాదును విచారించకముందే వానియజమానునకు వశముచేయవలెను. ఈఫిర్యాదు అబద్ధమని తోచినచో నీవ్రయమును వాడు భరింపవలయును శిక్షయు అనుభవింపవలయును.

ఈచట్టము ప్రకారము రక్షకోద్యోగి కూలివారలను వెనుకకు పంపుచుండును, కూలివాని ఫిర్యాదు అబద్ధమనియు వానిపైన నేరముమోపి అభియోగము చేయవచ్చుననియు కూలి

వారి యజమానులకు వ్రాయుచుండును. ఇట్లు వ్రాయుటకు చాలపని కలిగినందున ఈ లేఖలు ముద్రింపబడి సిద్ధముగ నుంచిరి. దీనిక్రింద భారతీయులసవార్థని కాపాడుట కేర్పరుపబడిన రక్షకోద్యోగి చేవ్రాలుచేసి పంపుచుండును. ఈ లేఖలు 1900 సంవత్సరపు శాసనము ననుసరించి వ్రాయబడు చుండిట్లు వానిలోనేకలదు. శాసనముప్రకారము ఆఫిర్యాదు నిజమొ అబద్ధమొ మాత్రము దెలుపబడవలసియుండగ కూలీలపైనేరము మోపి అభియోగములు చేయించుడని న్యాయవాది యివ్వలసిన సలహాకూడ నీయుద్యోగి యిచ్చుచున్నాడు. పై శాసనము ప్రకారమే యజమానుడు కూలివానినిదిట్టముగ కొట్టి హింసించగా వాడు ఫిర్యాదుచేసికొనినచో వాని దేహముమీదనున్న దెబ్బలు వైద్యశాలకు పంపవలసినంత ఉపద్రవకరములు కావని రక్షకోద్యోగిగా రెంచినచో వానిని వెనుకకు పంపును. ఇట్లు వాడు వెనుకకు పోవనిచో శిక్షింపబడును. ఎన్నిమారులు తిరస్కరించిన అన్నిమారులు శిక్షింపవచ్చును. ఇదిచాలక కాంబోలు రక్షకోద్యోగికి ఫిర్యాదుచేసి కొనబోవువాడు ముందుగ తన డివిజనులోనున్న మేజస్ట్రీటుగారి అనుజ్ఞపొంది మఱియు పోనలెనను నియమము చేసిరి. మేజస్ట్రీటుగారతని కేసునుగూర్చి తృప్తిజెందనిచో అనుజ్ఞనీయరు. ఈ మేజస్ట్రీటుగారు ప్రొద్దున లేచినదిమొదలు సాయంత్రమువరకు కూలీల యజమానుల దయకు నిరీక్షించుచుండును. ఇంక భారతీయుల నరెస్టుచేయుచు కాఫరు పోలీసువారు పెట్టు బాధలు వర్ణనాతీతములు. ఉత్తరవులేకుండగ రక్షకోద్యోగికడకు పోయినకూలివాడుశిక్షకు పాత్రుడగుచుండును. క్రమముగ పోయి వెనుకకు

కానిష్టపడని కూలివాడు శిక్షకు పాత్రుడగును. ఇన్ని కష్టములుపడితుదకు తన ఖర్చుమీదనె యజమానికడ కనపబడును.

హింసలు:—దక్షిణాఫ్రికాలోని కూలివారి యజమానులనేక విధములుగ కూలివారలను హింసించుచుండిరి. యమబాధలనెల్ల వీరుపెట్టుచుండిరనిన నతిశయోక్తి లేదు. ఖడ్గమృగచర్మముతో రక్తముకారునట్లు కొట్టుట సర్వసాధారణమగు సామాన్యశిక్ష. దీనినిగూర్చి కూలివారు అభియోగము తెచ్చినచో తెల్లవారిసాక్ష్యమునువిని దండవిధాయిగారొకప్పుడు నేరమే నమ్మరు. నమ్మినను కొట్టినవారిని క్షమింతురు. క్షమించకపోయినను జరిమానా విధింతురు. తెల్లవారు తమపై నభియోగములు తెచ్చిన కూలివారిపైన నేరములు మోపి ఇతర సేవకులచే సాక్ష్యములు చెప్పించి వారికి కఠినశిక్షలు వేయించుచుండిరి అట్లు దెబ్బలు తినిన కిర్పాసింగు అను 121710 నెంబరు కూలివానిమీద కాఫరు సేవకులచేత సాక్ష్యము చెప్పించగ 6 నెలలు కఠినశిక్షయు 15 కొరడా దెబ్బలును విధించిరి. తరువాత నాయజమానికడకు పోనందులకు శిక్షించి మఱల నాయజమానికడకె పంపిరి. వందలకొలది యుదాహరణము లిట్టివికలవు. కొందఱు తమ యజమానులకడకు పోవుటకన్న చెఱసాలలోనికఠిన నరకమునే యుపేక్షించి కాలము గడుపుచుండిరి. బొగ్గుత్రవ్వగ తీయనందుల కొకని నొకయజమానుడు బాధించి కర్రతో కొట్టగ, పాలను హెచ్చుధరల కమ్మలేక తిరిగి వచ్చినందుల కింకొకడింకొకనిని తన్ని బాధించును. పశువుల కాహారము పెట్టుట కాలసించినందులకు కుక్కచేత కరపించిన యజమానులుండిరి. ఆర్మిటేజి అను నొక యజమానుడు తనసేవకుడు తన భార్య

నెదిరించెనని అతనిపైబడి చెరికోసెను! లీస్కూలను యజమానులు తమ్ము ఒక పెట్టెలో పెట్టి తిండి లేకుండ మూసియుంచిరని కొందరు కూలివారు చెప్పుకొనిరి.

వలసకూలి ఒడంబడికల ప్రకారము భార్యాభర్తలను పిల్లలను వేరుచేసి వేరువేరు యజమానులకీయరాదు కాని యజమానుల కిచ్చినతరువాత వేరుచేయబడరాదను నియమము లేదు. అందువలన నీయజమాను లీయక్రమమును చేసి బాధించుచుండిరి. సోర్నాచల్లక్ పిళ్లేయు నతనిభార్య వల్లియమ్మయు ముత్యాలను నొకసర్దారుతోపాటు ఒక యజమానునికడ నుంచబడిరి. 6 నెలలు పనిచేసిరి ముత్యాలు వల్లియమ్మపైన కన్నువేసి సోర్నాచల్లనుపైన తప్పులువెదకి కొండెములు చెప్పుచుండెను. సోర్నాచల్ల నితని అక్రమప్రవర్తన తనయజమానితో మనవిచేసికొనెను. ఈ ఫిర్యాదు గమనింపక సోర్నాచెల్లనును యజమాని కొరడాతో కొట్టి వల్లియమ్మను సర్దారుపాలు చేసి సోర్నాచెల్లనును మరల కొట్టి యింకొక చోటికి పంపివేసెను. సోర్నాచలమును వల్లియమ్మయు హిందూ ధర్మశాస్త్ర ప్రకారమేగాక దక్షిణాఫ్రికాచట్టము ప్రకారము పెండ్లాడి రిజష్టరైయుండిరి. ఇది లక్ష్యపెట్టక యజమానుడు కొన్నాళ్ళకు వల్లియమ్మను ముత్యాలను మేజస్ట్రీటుగారి కడకంపి వారి పెండ్లిని రిజష్టరుచేయించెను. వీరికిపిల్లలు పుట్టిరి. మూడేండ్లకు ఈ యజమానుని వదలి ముత్యాలును వల్లియమ్మయు నింకొక యజమానునిచేరిరి. అంతట రక్షకోద్యోగి, ముత్యాలు వల్లియమ్మల పెండ్లిఅక్రమమైనదని నేరమును మోపెను. అంతట 75 రూపాయలు జరిమానా వల్లియమ్మకు పడినది. ముత్యాలు ఆ

జరిమానానిచ్చి వల్లియమ్మను అధికారుల యిష్టముతో తీసుకొని వెళ్ళినాడు. ఇదిభారతీయుల వివాహములకు పట్టినగతి తెలుపుచున్నది. టి. బి. రాబిన్సన్, తనకడనున్న నెం128349 రు కూలిపని వాడగు రాంబల్లీని పాలు సీసా 1 కి 5 పెన్నీల చొప్పున అమ్ముమని నియోగించెను. అప్పుడు బాజారు ధర 4 పెన్నీలే యగుటవలన వాడట్లు విక్రయింపలేక కొంతతిరిగి తీసుకొనివచ్చెను. అంతట రాబిన్సన్ గారిభార్య ఆపాలనువాని మీద గ్రుమ్మరించెను రాబిన్సను వానిమీదపడికొట్టెను వానికి డపుమీద దెబ్బ దిట్టముగా తగిలినది. వాడు మెల్లగా ప్రాకుచు భారతీయ బాజారు చేరెను డర్బనులోని „గ్రేవీధి,, లో చాల నాయాసముతో పడియుండెను. నాంజీయను భారతీయ వైద్యుడు వీనిని పరీక్షించి సర్టిఫికెట్టిచ్చి రక్షకోద్యోగికి రిపోర్టుచేయమనగా నతడు వానిని తిండివిజను మేజస్ట్రేటుకడకు బొమ్మనెను. పాపము, వీడు డిపో వైద్యశాలలో 5, 6 నెలలు మంచముపట్టెను. తరువాత విరిగినకాలుతో వీనిని హిందూదేశమునకు పంపిరి వీనిభార్య 128349 నెంబరు కూలిపనిచేయు స్త్రీయగుగంగాజలియూను, శిశువును, కాపాడువారు లేరు. వీరాయజమానికడనె యుండిరి. ఆశిశువు పుట్టిన పెద్దపురిటిలోనె రాబీన్సనుగారియిల్లాలు ఈమెను మంచముమీదనుండి లాగి బట్టలూడదీసి చన్నీళ్ళుపోసి పనిచేయుమని ఇతరసేవకుల యెదుటనే చెప్పినదట.

కొన్ని అన్యాయములు:—నేటాలు అడ్వర్టయిజరులో నొక బహిరంగలేఖ ప్రకటింపబడినది. జబ్బుచేసిన భారతీయుల కూలిసొమ్ములలోనుండి రొక్కము మినహాయించుట పెద్ద

కుటుంబములను పోషింపవలసియుండు భారతీయ కూలివాని జీవితమును దుర్భరము చేయుచున్నది. కొన్నిచోట్ల పనిచేయలేనిరోగులకు జీవనమునకు సొమ్మునీయరు. శిశువుల నారుబయటనే పరుండబెట్టించి బాలింతలచేత పనిచేయించుట మరియొక అన్యాయము. చలికాలములో స్త్రీలకుపని లేదు. వేతనము లేదు. జబ్బుచేసిన భారతీయులచేతకూడ పనిచేయించి బ్రతుకుట దుర్లభమైనతరువాతనే వైద్యశాలకంపుట వలన మా వైద్యశాలలో మరణసంఖ్య అధికముగానున్నది. 1906 జూలై మొదలు 1907 జూను నెలవరకు 160 మంది అట్లుచచ్చిరి. దానిలో 30 మంది ఒకదినముననే చచ్చిరి. యజమానులు వీరిని మృగములకన్న నీచముగచూచుచున్నారు. ఒకస్త్రీని వంగియుండగ ప్రక్కలలో క్రూరముగ నొకకఱ్ఱతో కొట్టగ ఆమెప్రక్కయెముకలపైన దెబ్బతగిలి కొన్ని నెలలవరకుకు పనిచేయలేక పోయినది.

ఒకసర్దారొక స్త్రీమణికట్టుమీద కఱ్ఱతో కొట్టినాడు. ఈఅక్రమములు బయటకువచ్చినను లాభము లేకపోయినది. ఒకభారతీయుడు, యజమానుడు పెట్టుబాధపడలేక, ఆత్మహత్య చేసికొనెను. వాడొక నెల గ్రహణిజాడ్యముతో బాధపడుచుండినను వైద్యముచేయించక పనిచేయించినారు. అతడుచచ్చుటకొక నెలముందు చావగొట్టబడియుండినట్లును తేలినది.

ఒకస్త్రీ యొక మారు శస్త్రచికిత్స కొఱకు వైద్యశాలకు వెళ్ళినది. అప్పుడు బట్టతీయ నామె తొడలపైన, కాళ్ళపైన కొఱడాలదెబ్బల మచ్చలు చారలు కనబడుచుండెను. తాను పనిచేయలేనందున యజమాని కొట్టెనని ఆమె చెప్పినది.

ఒకయజమానుడుతన సేవకుడేదో తప్పుచేయగా వాని చేతులకు ఇనుపసంకెలలువైచి గొలుసుతో కట్టెననియు వాడా రాత్రి మెల్లగా ప్రాకిపోయి ఒకచిన్నగుంటలోపడి మరణించెననియు యజమానికందులకు 20 పౌనులు (రు 300-0-0) జరిమానా పడినదనియు రికార్డులోనున్నది.

ఒకతోట యజమానునింట నొక ముదుసలి కూలి వాడు గ్రహణిజాడ్యముతో బాధపడుచుండ వైద్యఉద్యోగి వైద్యశాలకు పంపెదననగ నింటివారచ్చట దినమునకొక షిల్లింగు వ్యయమగుననియు నది తాము భరింపజాలమనియు అతని నింటనే చికిత్స చేయనిమ్మనియు బ్రతిమాలుకొనిరి. అంతట వారముదినములలో వాడు చచ్చెనని వైద్యునకు తెలిసినది. కూలివారిలో స్త్రీలన్న కొందఱుయజమానుల కిష్టము. వారికి ఖర్చుతక్కువ. వానిని తమయిచ్చవచ్చినట్లు బాధింపవచ్చును. వారిచేత బాగుగ పనిచేయించవచ్చును. వారితలలపైన బరువులిడి త్రాసునెక్కించి తక్కువబరువున్నచో కొరడాలతో కొట్టవచ్చును. తిట్టవచ్చును. తేయాకు తోటలలో చిన్నపిల్లలచేత చాలపనులు చేయించుచున్నారు. ఈపద్ధతి బానిసత్వమేకాని వేఱుకాదు. ఇట్లు తెల్లవారుఝామున 5 గంటలకు వచ్చినస్త్రీలు రాత్రి అలసి తమయిండ్లలో వంటలుచేసి కొనరే నంత చీకటిపడిన తరువాత పోవుదురు. ఈలేఖలో నింకననేక విశేషములు చెప్పబడినవి. అబద్ధములని ఎవ్వరుననలేదు.

మరికొన్ని సంగతులు:—ఈ క్రిందిసంగతులు ఎమ్. మాక్మోహనుగారు చెప్పినారు. గురుస్వామయ్యరుగారు1906 నవంబరులో మద్రాసు శాసనసభలో దీనిని చదివినారు. బ్లిమెరు ఓడ్లాకనువారలిది సత్యమని చెప్పినారు.

ఆయన నేటాలు చెఱకుతోటలలో కొన్ని నెలలు గడపినాడు. వలసకూలివారు తెల్లవారుఝామునుండి రాత్రియగు వరకును పనిచేయవలెను. మఱల తోటకు పోవుదురాయని ప్రశ్నింప వారు పోవము దొరగారు మాచర్మములనే యొలిచెదరుగదా? అనిరి. అచ్చట బ్రిటీషుపరిపాలకము క్రిందనున్న బానిసత్వము, జాంజిబారులో సుల్తాను క్రిందనున్న బానిసత్వముకన్న ఘోరముగానున్నది. అట్లామితిమీరిన పనిచేయుచు నీకూలివారనేకరోగములకు పాలగుదురు. క్షయసర్వసామాన్యమైనది. వారుమరల దేశమునకు వచ్చునప్పటికి జీవచ్ఛవములై చనిపోవుదురు. సింహళములోని తోటలవారీకూలివారి దురవస్థచూచిన ఆశ్చర్యపడుదురు. హిందూదేశములోని అధికారు లీవిషయమై ఏల శ్రద్ధతీసికొనరో ఆశ్చర్యముగ నున్నది.

దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారు ఉముఫ్రూలీ అను ఓడపైన 653 మంది కూలీలనుపడవైచి హిందూదేశమునకంపిరి. ఇందు 200మంది రోగులు. ఇదిఘోర పాతకము. పురుషులను స్త్రీలను పిల్లలను సరకులవలె పడవైచిరి. వారి జవసత్వములను హరించి చావనంపిరి. వారిలో పొంగు నంజు క్షయకుష్ఠరోగములతో బాధపడుచుండిన వారనేకులుండిరి. వీరెట్లు బ్ర

తుకగలిగిరో ఆశ్చర్యము. ఈప్రయాణములో 14 గురు మరణించిరి. ఈసంగతి మొదట అసత్యమనిరి కాని తరువాత భారతీయవలస వారి రక్షకోద్యోగి 1906 సంవత్సరం రిపోర్టులో నిట్లువ్రాసెను. “ఇంటికిపోవుభారతీయులను గూర్చినశ్రద్ధవిషయమైఫిర్యాదులుస్వల్పములె కాని, ఈమారు ఉముప్రాలీ యోడమీాద సెప్టెంబరు 26 వ తేదిని నియమితసంఖ్యకన్న నెక్కుడుమంది ప్రయాణమైరి. ఇది పొరపాటేకాని దీనివలన హానికలుగలేదు. వలసవారు ఫిర్యాదుచేయలేదు”

కఱవుకు భయపడి ఇచ్చటపన్నుతీయలేనందుకు విధింపబడు శిక్షలకు వెరచి పోర్చుగీసు పశ్చిమాఫ్రికాలో బెనుగుల్లా రైళ్ళలో కూలిపనిచేయుటకు చాల మందిఅంగీకరించిరి వారికి మంచిమాటలుచెప్పిన కంట్రాక్టర్లు గవర్నమెంటు అంగీకరించువరకు కొన్నాళ్ళు వారిని పోషించిరి తరువాత 2, 3, వేలమంది కూలివారును వారికుటుంబములును లొబిటో అఖాతమునకు వెళ్ళిరి. వారిని మరల నేటాలుకు (ఒడంబడిక)కంట్రాక్టుకాలమైన తరువాత రానిత్తుమని ప్రభుత్వమువా రనియుండిరి కాని మఱల 658మంది మాత్రమే రాగలిగిరి. అచ్చట వీరుపడినబాధలు నేటాలు అడ్వర్టయిజరు పత్రిక వ్రాసినది. అచ్చట చాలమందిచనిపోయిరి. అచ్చట నీరులేదు జ్వరములధికము. ఉన్ననీరు జిడ్డుగనుండును. ఈభారతీయులు రైలుదారిని బాగుచేయుచున్నారు. పొదలను రాళ్ళనుతీసి బాగుచేయుచురు. 1908 మార్చి 14 ఇండియన్ఒపీనియన్లో తిరిగివచ్చి

నవారు చెప్పిన విషయ ములనుబట్టిఅచ్చటి సంగతులు వ్రాయబడెను. వారు తమకుఁగావలసిన నీటినిగోతులుత్రవ్వుకొని చేదుకొనవలసి యుండెను. చాలమంది కచ్చటవింతరోగములు కలిగెను. వారిదేహములు ఉబ్బుచుండెను. ఒడలిపైన పుండ్లు పడుచుండెను. అచ్చటినుండి మరలివచ్చినవారు తమలోనచ్చటి కిపోయిన మూడునెలలలో సగముమంది చనిపోయిరని చెప్పిరి. వారచ్చట పనిచేసిన 11 నెలలలో వారు తలదాచుకొనుట కొకగుడిసెయైనను లేకుండెను. కొందరు తామె కష్టపడి చిన్న మట్టిగుడిసెలు నిర్మించుకొనిరి. తక్కినవారు చెట్లక్రిందనే కాలముగడపిరి. క్రూరమృగములు విచ్చలవిడిగ తిరుగుచుండెను వారు దేవునినమ్మియుండిరి.

కొన్ని దినములలోనే గుంపులు వేరొక చోటుకుపోయి పనిజేయవలసి వచ్చుచుండుటవలన వారు వేసికొనిన గుడిసెలనుపయోగము లగుచుండెను. వీరుతమకష్టములు చెప్పుకొనగ ఖడ్గమృగ చర్మములతో చేసిన కొరడాలతో కొట్టిబాధించిరి. అట్లుదెబ్బలు తినినవారిలో నొకడు మరణించెను. ఈకూలివారిలో 390 మందికి గురుతు పత్రముల Identity Certificates పైన రెండుచోటుల నుండవలసిన వేలుముద్రలు లేవని చెప్పి వారిని నౌకలనుండి దిగనీయక వారిష్టపడకున్నను భరతఖండమునకు పంపివైచిరి. ఈసంగతులను విచారించుటకు నేటాలుభారతీయ కాంగ్రెసువారు ఇమిగ్రేషను ఆఫీసరుగారిని అనుజ్ఞకోరగ నతడు పరులచ్చటికి రాకూడదనెను.

శాశ్వత బానిసత్వము:— నేటాలు వారికి భారతీయ కూలి పనివారులేనిది ఒకదినము గడువదు. క్రొత్తవారిని తీసికొని పోవుటయెగాక ప్రాతవారిచేత మరల యొడంబడికలనులను వ్రాయించి బనిచేయించుచుండిరి. 1905 లో 8000, 1906లో 7000, 1907లో 6000, 1908లో 3000 మంది కూలివారిని తీసికొనిపోయిరి. వారికికూలిపని చేయువారె కావలెనుగాని స్వేచ్ఛగా జీవించు భారతీయులక్కరలేదు. గోఖలేగారీ వలసకూలిని ఖండించి నిషేధింపుడని భారతీయ ప్రభుత్వమువారినికోరి శాసనసభలో తీర్మానమును ప్రవేశపెట్టిరి. 1911 లో నేటాలుకు వలసకూలి వారినంపుట నిషేధింపబడెను. గాని అచ్చటనుండిన ప్రాతవారిచేత క్రొత్తయొడంబడికలు వ్రాయించి శాశ్వత బానిసత్వమున నుంచుచున్న నేటాలువారి వలసకూలి విధానముపోలేదు. ఇట్లు నేటాలువారు నిర్బంధించియు శాసనముల జేసియు వారిని బానిసలుగ చేయసాగిరి. కూలిపనివాని యొడంబడికి మైన పిదప నచ్చట జీవింపవలెనన్న నేటాలు ప్రభుత్వమునకు తలకుపౌనుల చొప్పున పన్ను నిచ్చుకొనవలెను. 16సంవత్సరములకు పైబడిన పురుషులును 13సంవత్సరములయీడుగల స్త్రీలు నిచ్చుకొనవలెను. ఇట్లొక కుటుంబమున గల స్త్రీ పురుషులు, బిడ్డలను తలపన్ను నిచ్చుకొనవలసి యుండుట వలనను ఇతర పన్నులు, ఇంటియద్దె, లైసెన్సుపన్ను నిచ్చుకొనవలసి యుండుటవలనను భారతీయులకు గతిలేక మరల కూలిపనిచేయుట కంగీకరింపసాగిరి. ఈపద్ధతిని మాన్పుడని గోఖలేగారు 1912 సంవత్సరమున సామ్రాజ్యశాసన సభ

లోవాదింపగ వలసరాజ్యములవారి యాంతరంగిక వ్యవహారములందు జోక్యము మేము కలుగ జేసికొనజాలమని భారతీయ ప్రభుత్వమువారనిరి.



# దక్షిణాఫ్రికా.

## III

### గాంధిమహాత్ముడు.

బాల్యము విద్యాభ్యాసము:-- గాంధిమహాత్ముడు 1869 సంవత్సరము అక్టోబరు నెల 2 వ తేదీన గుజరాతు రాష్ట్రమున పోర్బందరు పట్టణమున స్వగృహమున జన్మించెను. వీరితల్లిదండ్రులు గొప్పకుటుంబములోని వైశ్యులు. ఈయనతండ్రి పోర్బందరు రాణాకు ఇరువదేండ్లు మంత్రిగనుండెను. తరువాతరాజకోటసంస్థానమున ప్రధానియయ్యెను. ఆయన తనరాజుగారును ఇంగ్లీషు ప్రతినిధియు నేదైన అక్రమముచేసినచో నిర్భయముగ వారినె దిద్దించుచుండు ధైర్యశాలి. గాంధిగారితల్లియు పూర్వాచారపరాయణురాలు. ఆమె దైవభక్తియు, పతిభక్తియు నప్రతిమానములు.

మోహనదాసు కరంచంద్ గాంధిగారు వీరికడసారి తనయుడు. తండ్రియొక్క ధైర్య స్థయిర్యములు, తల్లియొక్క ధర్మనిరతియు నీయనయందు ప్రతిబింబితములై ఈయనననునిష్కామకర్మయోగిగ చేసినవి. గాంధిగారు కొన్నాళ్ళు కలియవారులోనే విద్యనభ్యసించిరి. గాని ఈయన బుద్ధి కుశలతనుజూచి వీరిబ్రాహ్మణ గురువు ఈయన నింగ్లాండునకుబంపి విద్యచెప్పిం

చుడని ప్రోత్సహించెను. గాంధిగారితల్లి యెట్టకేలకు అంగీకరించెనుగాని ఒకజైన గురువునెదుట గాంధిగారిచేత మద్యమాంస స్త్రీవర్జనము చేయుదునని ప్రమాణముచేయించుకొనెను గాంధిగారు లండన్‌నగర విశ్వవిద్యాలయమున గొన్నాళ్ళుచదివితరువాత బారిస్టరయివచ్చిరి. ఆయన కొన్నాళ్ళుబొంబాయి నగరమునఉన్నత న్యాయస్థాన న్యాయవాదిగ నుండిరి తరువాత రాజకోటలోనె న్యాయవాదిగ నుండిరి. న్యాయస్థానమున వ్యాజ్యములను నిర్వహించుటకన్న తమకార్యస్థానమున సదోప్ఫధలు చేసి, వ్యవహారములఁదీర్మానించుట వీరికిష్టముగ నుండెను. వీరీసమయమున జైనగ్రంథములను హిందూమతగ్రంథములను పఠియింపసాగిరి.

దక్షిణాఫ్రికా యాత్ర:—పోర్బందరు పట్టణమున నొక వర్తకసంఘమువారికి దక్షిణాఫ్రికాలో నొకవర్తక కార్యస్థానముండెను. వీరికి నింకొక వర్తకసంఘమువారికినచ్చట నొక తగవువచ్చెను. అందు చాల లెక్కలు పుస్తకములుచూచి పనిచేయవలసియున్నందున తమపక్షమున నిచ్చటనుండి యొక న్యాయవాదిని పంపదలచి గాంధిగారిని దక్షిణాఫ్రికాకు పోవుడని కోరిరి. అంతట గాంధిగారు 1893 సంవత్సరములో దక్షిణాఫ్రికాకు వెళ్ళిరి. నేటాలు చాల అందముగనుండెను. బనానా అరటిచెట్లు యూకలిప్టసు? లుత్సాహముతో వీచుచుండెను. చెఱకుతోటలు కన్నులపండువుగనుండెను. ఈతరుప్పలు ఖర్జూరపు చెట్లు ఇతర ఉష్ణదేశపు చెట్లు తనజన్మభూమినిజ్ఞాపకమునకుఁదెచ్చెను. తెల్లవారి మా

ములను సంతసముతో చూచి ఇంగ్లాండులో గడపినకాలమును గాంధిగారు జ్ఞాపకమునకు దెచ్చుకొనిరి. డర్బను అందమగు పట్టణము. అందలి ప్రజలును మంచివారే; కాని భారతీయుల కిచ్చట స్వాగతములేదు. నా పార్టీలు నన్ను మోసగించినారు. నేనిచ్చటికి వచ్చుటలో పొరబాటుచేసితి నని గాంధిగారు మొదటి దినముననె పలికిరి!

మొదటి అనుభవములు:—ఆయనవచ్చిన మరునాడే కోర్టులో మర్యాద కొరకు తలపాగ పెట్టుకొని కూర్చుండ దానిని తీయుమని కఠినముగ నాజ్ఞాపింపఁబడెను. ఆయన వ్యాజ్యము విషయములో ప్రిటోరియాకు పోవలసియుండెను. ఆయనను ఛార్లెసుటవును వరకె రైలుతీసికొని పోవును. రాత్రి పండుకొనుటకు వసతికిఁగూడ టికెట్టుకొనుమని ఆయనకక్షిదారులు (పార్టీలు) చెప్పిరి. కాని ఆయన తనకు పరువున్నదికదాయని అశ్రద్ధచేసెను. పీటరు మారిట్జిబర్గు ష్టేషనుదగ్గర బండికదలుటకు ముందు ఒకతోడి ప్రయాణికుడు గార్డును పిలచెను. గార్డువచ్చి ఈయనను బయటకువచ్చి ఇంకొక పెట్టెలోకూర్చుండుమనెను. గాంధిగారు నాదగ్గర మొదటితరగతి టికెట్టు ఉన్నది. బండి ఛార్లెసు టవునువరకు పోవును గనుక దిగననిరి. అంతట నొక పోలీసువానిని బిలచి ఆయనను బయటకు లాగించిరి. సామానును పారవైచిరి. ఆయనచలిలో ఆరాత్రి ష్టేషనులోగడపెను. గాంధిగారెట్లకేలకు ట్రాన్సువాలుచేరి గుఱ్ఱపుబండిలో ప్రయాణమైనారు. బండిపైన బండి తోలువాడు కూర్చుండు స్థలమున గూర్చుండిరి. బండివదలుటకు ముందు బండియొక్క

రక్షకుఁడు (గార్డు) ఒకపెద్ద డచ్చివాఁడు చుట్టకాల్చు కొనఁదలచి గాంధిగారిని లేచి తన కాళ్ళదగ్గర కూర్చుండు మనెను! గాంధిగారంగీకరింపలేదు. అంతట వాఁడాయన మోముపై బలముగ మోదెను. ఆయనపైనుండి అంచుపట్టుకొని క్రిందకు లాగ నాతఁడు మరల కొట్టెను. అంతట ప్రయాణీకులు పోనిమ్ము పాపము అని వారించిరి. పాపము, వర్ణభేదమువలని అవమాన మును గాంధిగారు ఇంతవరకెఱుఁగరు. జోహానసుబర్గులో గొప్ప జాతీయ హోటాలులకు బండిలోపోవగ నచ్చట ఆయనకెడము లేకపోయెను. ఎల్లహోటులలనునలుపురంగు అడ్డమువచ్చెను. ఆయన కక్షిదారులతో నేర్పఱచుకొన్న ఒడంబడిక ప్రకారము వ్యాజ్య విషయమున పనిచేయవలసి యుండెను. గాని లేనిచో గాంధిగా రాక్షణముననె తమదేశమునకు వెడలిపోయియుందురు. ఆయన పండ్రెండు నెలలు ప్రిటోరియాలో గడపిరి. క్రూగరు ఇంటియె దుట ద్వారపాలకుఁ డాయనను తన్నినను ఆయన మాఱుపలుక లేదు. ఆయన స్వదేశప్రజలకొరకు ఈ యన్యాయములను భరింపసాగిరి. తన కుటుంబము యొక్క గౌరవము, విద్యవలన వచ్చినగౌరవము, కూడ విడచి ఈ మంత్రిపుత్రుడు ఆత్మత్యా గము చేసెను. ఈ సమయమున ఆయన బైబిలు పాఠశాలలో క్రైస్తవ మతము నభ్యసించెను. భగవద్గీతల హిందూమతము నకు బైబిలుమతమునకును భేదమేలేదని ఆయన పలికెను.

గాంధిగారి న్యాయకత్వము:—1893 వ సంవత్సరాంత మున ఆయన మజిల దర్బనుకు వచ్చెను. తన దేశమునకు పోవఁ దలచెను. అప్పుడాయన కక్షిదారులు ఆయనగౌరవార్థ మొక

విందొనగిరి. ఆయన "నేటాలు మెర్క్యురీలో" భారతీయుల ఎన్నికహక్కులు తీసివేయుదురనియు ఇంక నితరచట్టములను చేయదలచినారనియు చదివియుండెను. ఈసంగతి నెల్లరకు చెప్పిరి. పాపము భారతీయు లిదివిని తెల్లపోయిరి వారికేమిచేయుటకును తోచలేదు. అసాహాయ్యులుగ నుండిరి. గాంధిగారినె కర్తవ్యమాలోచింపుడని ప్రార్థించిరి ఈ చట్టముచేయపలదని ప్రభుత్వమువారికి వినతిపత్రమును బంపవలెనని గాంధిగారనిరి. గాంధిగారినె యట్టివిన్నపమును వ్రాయుడని వారు వేడుకొనిరి. వీరి దీనాలాపములను చూచి గాంధిగారు వారికి సాహాయ్యముచేయ పూనుకొనిరి. అంతట భారతీయులు ప్రభుత్వము వారికంపిన విన్నపములు తమ అసమ్మతి తెలుపుచు చేసిన సభలు శాసనసభా సభ్యులకుపంపిన రాయబారములు చూచి దక్షిణాఫ్రికా వారాశ్చర్యపడిరి. ఇంతవరకు నిద్రించుచున్న భారతీయులు మేల్కొని నూతనోద్యమమును చేయుటవలన ప్రజలందు సంచలనముకలిగెను. పత్రికలు కొంత సానుభూతిని చూపెను. అప్పటి ప్రభుత్వపు ముఖ్యమంత్రియు భారతీయులకు కొన్ని కష్టములున్నమాట సత్యమని యంగీకరించెను. నేటాలువారు చట్టమును మానలేదు! బ్రిటీషువారివలస రాజ్యాంగమంత్రి (కాలనీలకార్యదర్శి) రిప్పన్ గారికొక మహజరునంపిరి. పదివేలమంది దీనిపైజేవ్రాళ్లుచేసిరి. అంతట చక్రవర్తిగారీచట్టము నంగీకరించక నిలిపిరి. అయినను నేటాలు వారింకొక శాసనమును చేసి భారతీయుల ఎన్నికహక్కులు తీసివేసిరి.

అంతట భారతీయుల యోగక్షేమములరయుటకును వారి కొఱకు పాటుపడుటకు నొక భారతీయ సంఘమును స్థాపించుట ముఖ్యమని గాంధిగారనిరి. మీరుండినగాని ఈయుద్యమము కొనసాగదని భారతీయులనిరి. నాకుజీవనాధారము వలదాయని గాంధిగారు పలుక మీరిచ్చుటనె న్యాయవాదివృత్తియందు జీవింపుడని భారతీయులు వేడుకొనిరి. గాంధిగారిహృదయము కరగినది. ఎట్టకేలకచ్చటనేయుండి భారతీయుల నుద్ధరింపవలెనని గాంధిగారు నిశ్చయించిరి. నేటాలు భారతీయ కాంగ్రెసుసంఘమును, నేటాలు భారతీయ విద్యాసంఘమును గాంధిగారు స్థాపించి పనిచేసిరి. ఆయన "సుప్రీముకోర్టు" న్యాయస్థానమున న్యాయవాదిగ పనిచేయుటకు దొరతనమువారి యనుజ్ఞనడిగెను. అంతట తెల్లవారు, తమతోపాటు, నల్లనిన్యాయవాది పని చేయరాదని యడ్డగించిరి. కాని సుప్రీముకోర్టువారు గాంధిగారు బ్రిటీషు దేశపు న్యాయవాది గనుక అంగీకరించిరి. ఈయన రెండేండ్లు న్యాయవాదిగ పనిచేయుచు నచ్చట పరోపకారమునకె కాలముగడుపుచు భారతీయుల రాజకీయ జీవనమును త్తేజముగ జేసిరి.

డర్బన్ ప్రజల దౌర్జన్యము:—1896 సం॥ లో గాంధిగారొకమారు హిందూదేశమునకు వచ్చిరి. బొంబాయి పూనా మద్రాసు నగరములందుదక్షిణాఫ్రికాలోని భారతీయులను గూర్చి యుపన్యసించిరి. ఇంతలో త్వరితముగరమ్మని నేటాలు నుండి నవంబరులోనే తంతివార్తవచ్చినందున బయలుదేరిరి. వీరి నౌకయు భారతీయులుండిన ఇంకొకనౌకయు డర్బను

రేవుచేరెను. ఇంతలో డర్బనుప్రజలందు సంచలనముకలిగెను. ఓడలోని భారతీయులను, గాంధిగారిని, దిగనీయవలదని 2000 ప్రజలు సభచేసి తీర్మానించిరి. గాంధిగారన్న ప్రభుత్వమువారికి నిష్టములేదు. భారతీయులను తుపాకులతో కాల్చివేయవలెనని డర్బను ప్రజలకుండెను గాని బహిరంగముగ నేమియు చేయజాలరు. భారతీయులను దిగకుండ నిషేధించుటకు శాస్త్రిమంగీకరింపదని ప్రభుత్వమువారనిరి. భారతీయులు వచ్చిన యోడలను రేవులోనికి రాకుండగనె దూరముగ ఆరోగ్యశాఖాధికారి నిలిపియుంచెను. అనారోగ్యము లేకుండినను, ఎట్టి కారణమును చెలుపకయె ఆటంకపరచెను. దినమునకు 150 పౌనులు వ్యయమగుచుండెను. రేవుదగ్గరకు వచ్చుటకు ప్రభుత్వమువారు అంగీకరించలేదు 24 దినములు నౌకలు రేవులో పడియుండెను. ప్రజలగుంపులు సముద్రతీరమున రేవులో చేరి యల్లరిచేయుచుండెను. వీరిని సద్దడచి మాకు నష్టపరిహారమిప్పించి భారతీయ ప్రయాణీకులను దిగనీయుడని నౌకాధికారులు మొఱపెట్టుకొనిరి. ఎట్టకేలకు మీరు సాహాయ్యము చేసినను చేయకపోయినను ప్రజలను దింపుదుమనిరి. డర్బనుప్రజలు బెదిరింపులతో వ్రాసిన ఆకాశరామన్న లేఖలకు భారతీయులు భయపడలేదు. భారతీయులు వెనుకకుపోవుట యసంభవమని గాంధిగారనిరి. అలెగ్జాండరు స్క్వేరులో 8300 ప్రజలు గుమిగూడిరి. వారిలో 500 నేటీవులు (ఆదిమనివాసులు) నుండిరి. 12 గంటగుచుండెను. ఓడలు దరిచేరినవి. ఓడలోనివారికి నేమిచేయువలెనో తోచుటలేదు. అచ్చటిగుంపులు సద్దడగెను. రెండు

గంటలలో ప్రయాణీకులు నౌకలు దిగిరి గాంధిగారిని తుదిద నుక దిగవలదని నౌకాధికారులు కోరిరి. డర్బను ప్రజల గుంపులు గాంధిగారికొఱకు నిరీక్షించుచుండెను. గాంధిగారి సతీమణియు పిల్లలునుదిగి ఆయన స్నేహితుడగు రుస్తుంజీగారి యింటికి పోయిరి.

గాంధిగారును ఒకపాశ్చాత్యన్యాయస్థానోద్యోగిలాఫ్టన్ (Solicitor Laughton) గారునునౌకదిగిరి. గాంధిగారు కన బడగనె కొందఱు బాలురు కేకలువేసిరి. అచ్చటికి వచ్చిన పౌరులు గుంపుగూడిరి. వీరు పోవుచుండగ వీరియొద్దికి వచ్చిపడిరి. లాఫ్టన్‌గారిని గాంధిగారిని వేరుపరచిరి అంతట గుంపులో నివారు గాంధిగారిపైన రాళ్లు, చేపలు, కుళ్లినగుడ్లు విసరకొట్టసాగిరి. ఒకపాశ్చాత్యుడు వెనుకనుండి వచ్చి గాంధిగారిని కాలికొలది తన్నెను. గాంధిగారికి తెలివితప్పుచుండగ నచ్చట బాటప్రక్కనున్న ఇనుపకమ్ములను పట్టుకొని నిలచిరి. ఇంతలో మఱికొందరాయనను తన్నిరి. ఆక్షణమున నచ్చటికి పోలీసు సూపరెంటు అలెగ్జాండరుగారి సతీమణివచ్చి గాంధిగారిని గుర్తించి తత్క్షణమె తనగొడుగువిప్పి గాంధిగారిపైన బడుచున్న రాళ్ళవాననాపెను. ఆమె యట్లాయన ప్రాణములను రక్షించెను. ఇంతలో గాంధిగారిని చంపుచున్నారని యొక భారతీయ బాలుడు రక్షకశాఖ వారితో చెప్పెను. పోలీసు సూపరెంటు గారు త్వరితముగవచ్చి గుంపులను తరిమివైచిరి గాంధిగారిని రక్షక కార్య స్థానమున నుండుమనిరి గాని ఆయన రుస్తుంజీ గారి ఇంటికేపోయిరి. సాయంకాలమైన తరువాత మఱల నా

యింటిముందు గుంపులుచేరెను. గాంధిగారి నవతలకు పంపనిచో నింటికి నిప్పంటింతుమని బెదరించిరి. పోలీసుసూపరెంటుగారు మఱలవచ్చిరి. ఆయన తెలివికలవాడు. మెల్లగా గాంధిగారికి బోధించిచెప్పి ఆయనకు రక్షకోద్యోగి వేషమును వేసి బయటకంపెను ఇంకొకపోలీసువాడాయనప్రక్కనెవర్తకవేషమున నుండెను. వీరు గుంపులోనుండియెపోయి అడ్డముగనడచి పోలీసు స్టేషను చేరిరి. గాంధిగారిని అట్లురక్షించి తరువాతగాంధిగారి గృహమునలేరని పోలీసుసూపరెంటుగారు ప్రజలతో చెప్పివారి నింటికంపిరి.

గాంధిగారసత్యములతో భరతఖండమున నుపన్యాసము లిచ్చిరని తంతివార్తలవారు ప్రకటించిన అసత్య వార్తలు చూచి డర్బను ప్రజలు కోపగించియుండిరి. దీనికితోడు రెండు నౌకలు రేవులోనికి రాగనె నెలకు రెండువేలమంది భారతీయులను గాంధిగారు దిగుమతి చేయదలచినారని కొందరసత్యములుచెప్పి ప్రజలయందు క్రోధముం బురికొల్పిరి. నౌకలు రేవునందుంచి మనుష్యులను దిగనీయనందుకు గాంధిగారభియోగమును చేయదలచిరనియు కొందఱనిరి. డర్బను ప్రజలయందట్టి యుద్రేకము కలుగుటకీయసత్యములె కారణములు.

బ్రిటీషుబోయరుయుద్ధము:— 1899 అక్టోబరులో బ్రిటీషువారికిని బోయరులకును యుద్ధమువచ్చినది. ఈయుద్ధమున తమప్రభుభక్తినిచూపి భయమువచ్చిన సమయమందు భారతీయులుపారిపోవుదురను అపవాదు అబద్ధమనిలోకమునకుం జెప్పి

తమహక్కులను స్థిరపర్చుకొను సామర్థ్యమెగాక బాధ్యతలలో పాల్గొని కష్ట మనుభవించు శక్తిగూడ భారతీయులకు గలదని తెలుపుటకు గాంధిగారు ఒకస్వచ్ఛందక సేవకదళమునుసృజించి మీకేవిధమగు సాహాయ్యము కావలసిన నది చేయుదుమని గవర్నమెంటువారికిఁ గబురంపిరి కాని భారతీయులసాహాయ్యము మాకక్కర లేదని వారుతిరస్కరించిరి. మీరు యుద్ధమన్న నేమియు తెలియదు మీరుమాకు యుద్ధమం దుపయోగింపరు సరి కదా అడ్డముగనుందురు. అని శాసనసభ్యుఁడు (Jameson) జేంసన్ పలికెను!! అయితే మేమేపనియుచేయజాలమా? సేవకులుగపనిచేయలేమా? వైద్యశాలలో పనిచేయజాలమా? దానికిని గొప్ప తెలివితేటలు కావలయునా? అని భారతీయులుప్రశ్నింపదానికిని అనుభవము, నేర్పు కావలెననెను. గాంధిగారు తన స్నేహితుఁడగు సాలిసిటరు లాట్టన్‌తో సంప్రదింపఁగ జేంసన్ మాటలకేమి ఇదిబాగుగ నెయున్నది. దీనివలన మీగౌరవము వృద్ధియగునని ప్రోత్సహించెను. ఇంతలో బోయరులకు జయముకలుగుచుండుటవలన నేటాలులోని ప్రజలకెల్లరకు. నికలిగెను శ్రమ యధికమయ్యెను. భారతీయులసాహాయ్యము కావలసివచ్చెను. వారి అభిప్రాయము మారినది. అక్టోబరు 30వ తారీఖున వైటుసేనాని లేడీస్మిత్తులో ముట్టడింపఁబడెను. నవంబరు 2 వతేదీన తంతివార్త లాగిపోయెను. 10 వ నవంబరున బోయరులు కొలెంసో (Colenso) టుగేలా భూములనాక్రమించిరి. 14వ తారీఖున యుద్ధపు రైలు నాశనమైనది. 18వ తారీఖున ఎస్టుకోర్టు దగ్గరకు బోయరులువచ్చిరి. 21వ తేదీకి మూయి నదిని సమీపిం

చిరి. 23వ తారీఖున విల్లోగ్రంజి చేరిరి. బుల్లరుసేనాని నదినిదా టుటకు విశ్వప్రయత్నము చేయుచుండెను. బోయరు లద్భుతముగ పోరాడుచుండిరి. డర్బనులోని ప్రజలందు ఆందోళనము భయము నధికమయ్యెను. బుల్లరుసేనానిపై నెల్లరు నాసలిడుకొనిరి. కాని అతనిపని చాల కష్టమైనది. చాలమంది దెబ్బలు తినుచుండిరి. వైద్యశాలలు, ప్రథమచికిత్స, స్వచ్ఛంద సేవకులు ఆవశ్యకమని ప్రజలకు, గవర్నమెంటుకు, తోచినది. వైద్యశాలలేర్పరచిరి. యూరపియను ప్రథమచికిత్సా పటాలమునంపిరి. వైద్యులు (డాక్టరులు) స్త్రీపరిచారికలు [నర్సులు] వాహకులు పరుగెత్తిరి. తమ్ము కుక్కలను చూచినట్లు చూచుచు కష్టపెట్టి చంపయత్నించు అపకారుల కుపకారము చేయువారరుదు. అందు వంటిదన్న చేయువారెవరు? అయినను తమఆత్మత్యాగశక్తిని పరోపకారమును ప్రభుభక్తిని చూపి తరించు తరుణము వచ్చినదని గాంధిగారును వారిసహచరులును తమశాత్రవులకె సాహాయ్యము చేయప్రయత్నించిరి. వీరిసదుద్దేశ్యమును క్రైస్తవగురువును ఇండియన్ ఆంగ్లికన్ మిషన్ అధ్యక్షుడునగు బూత్ గారును బెయిన్సు బిషప్పుగారును గ్రహించిరి. వారును గవర్నమెంటువారికి సిఫార్సుచేసిరి. ఇదివరకున్న స్వచ్ఛందసేవకులకు వీరుసాహాయ్యము చేయుదురనియు, ఇది అవసరమయనియు చెప్పిరి. మొదట గవర్నమెంటువారియ్యకొనలేదు కాని టుగేలానదీతీరమున సమరముతీవ్రమయి ఒత్తిడి ఎక్కువైనందునఎట్టకేల కంగికరించి భారతీయ ప్రథమచికిత్సా పటాల నిర్మాణమునకు అనుజ్ఞనొసగిరి.

భారతీయ ప్రథమచికిత్సాపటాలము:— పటాలమును నిర్మించుటకు అంగికరించినతరువాత నీపటాలమును సాధ్యమైనంత పెద్దదిగచేసిన లాభకరమని ప్రభుత్వమువారికిని తోచినది. అందువలన యూరోపియను ఉద్యోగులే కూలివారి యజమానులతోచెప్పి చాలమంది నిందు చేర్చిరి కూలివారును స్వేచ్ఛ కలవారును ఇష్టపడినచ్చినవారును కలసి ఒకవేయిమందియైరి సాధారణపు పనులు చేయువారికిని వాహకులకును కూలినిచ్చిరి. భారతీయనాయకు లూరక ప చేసిరి.

వర్తకులు దుస్తులు సామానులు నూరక ఇచ్చిరి. బూత్ గారే ఈపటాలమున వైద్యాధికారిగా చేరెను. గాంధిగారిస్వార్థత్యాగమునకు ధైర్యసాహసములకు ఓర్పునకుమేర లేదు బుల్లరుసేనాని ఈ ఘనత చూచి సంతసించి ఈయనను "సహాయసూపరింటె" నెను. ఇట్లుపిలచుటలోని తప్పిదము నెవరో ఎత్తిచూపగ నిట్లుగౌరవార్థము పిలుచుచున్నానని పలికెను.

కొలెన్సో యుద్ధమునకు క్రిందటిదినమున నైభారతీయులు యుద్ధభూమినిచేరిరి. ఆయుద్ధమందు దెబ్బలుతినిన వారి నతిరయమున మోసికొనిపోయి చికిత్సచేసిరి తరువాత "చివేలే"చేరి సాహాయ్యముచేసి ఆహారమైన దినకరయ కొలెన్సోకు నడిచి రాత్రియెల్లపనిచేసిరి. వీరిశ్రమ దేవునికెరుక. అక్కడ చచ్చిపడిన వారు, దెబ్బలుతిని పడిపోయినవారు లెక్కకు మీరియుండిరి. 150 మందిచనిపోయిరి. 700మందికి గాయములుతగిలెను. వీరికి భారతీయులు చేసినసేవ యద్భుతము. నిరుపమానము.

ఇందు రాబర్ట్సు సర్వసేనాని కుమారుడే పెద్దగుండు దెబ్బతి నెను. అచ్చటినుండి "చివేలే" వైద్యశాల కాయనను మోసి కొని 7 మైళ్లు భారతీయ స్వచ్ఛందసేవకులు నడచిరి. కొలెన్సో యుద్ధమైనతరువాత భారతీయసేవక పటాలమును రద్దుచేసిరి.

7 రోజులైనపిదప సేవనినుండి వారిని నిలిపిరి. మఱలకావ లసినచో పిలుతుమని చెప్పిరి. అంతట "స్పియోనుకోపు" దగ్గర మఱలనొక నెలకు వీరిసేవ యవసరమయ్యెను. ఇప్పుడువారు అగ్నివర్షమధ్యముననే నిలచి బాగుగపనిచేసిరి. ఈలోపుగనె 36 మందిభారతీయనాయకులు డాక్టరులవద్ద ప్రథమచికిత్సావై ద్యమును నేర్చుకొని సిద్ధముగనుండిరి. ఈసేవకులు యుద్ధభూ మికిదగ్గరనుండి గాయపడినవారి నిరువదిముప్పదిమైళ్లుమోసికొ నిపోవలసియుండిరి. గాంధిగారే ఒకగుంపునకు నాయకుడుగ నుం డి వుడ్గేటు సేనానినట్లు మోసికొనిపోయిరి. అతఁడు చాలబాధ పడెననియు ఆమధ్యనె మరణించునేమోయను భయమున నావే శిమిలో నిలువకయె చాలశ్రమపడి మోయించుకొనిపోతిననియు, తరువాత చెప్పిరి. యుద్ధము తీవ్రముగజరుగుచుండెను. అగ్ని గోళవర్షము కురియుచుండెను. మనుజులు రాలిపోవుచుండిరి. అప్పుడు "బాట్" సేనానాయకుఁడు గాంధిగారి దగ్గరకువచ్చి అయ్యా మీరిక్కడకువచ్చునప్పుడు యుద్ధము జరుగుచోటుకు రావలసినయగత్యములేదని మీకుచెప్పియున్న సంగతి నెఱుఁగు దునుకాని ఇప్పుడు అచ్చటమీసహాయ్యము కావలసివచ్చినది. మీరుటాల మావలివంకకుపోయి అచ్చటసేవచేసినచో చాల

బాగుండునను అనెను. ఫౌంటూర్ ప్రదేశ మగ్ని గోళవర్షమున నున్నది. గాంధిగారు తనవారివంకఁదిరిగి పోవుదమాయనిరి. వారెల్లరువల్లెయనిరి.అంతటమృత్యువునకు వెనుదీయకపోయిబ్రిడ్జిదాటి ఆప్రక్కనుండి పనిచేయసాగిరి. ఆరోజున భారతీయులుచేసిన సేవవలననె అనేకబ్రిటీషుసైనికుల ప్రాణములుదక్కినవి. వాల్‌క్రాంట్జు దగ్గర మఱలయుద్ధమున తుపాకిగుండ్లకెదురుగ నిలచియె భారతీయులు పనిచేసిరి. పైనుండి ఫిరంగిగుండ్లు పడుచుండెను. వీరట్లుపనిచేయుచు మధ్యమధ్య తిట్లుకూడతినిరి. వీరిని సైనికులు మాత్రము చాలపొగడిరి. భారతీయులు యుద్ధభూమిమీద చేసిన సేవకొంత గౌరవమునొందినది. ఈయుద్ధసందర్భమునచనిపోయిన భారతీయులజ్ఞాపకార్థము గౌరవముగ ప్రజలచందాతో జోహానసుబర్గుచెంతనొక స్మారకచిహ్నము నిర్మించిరి. ఆచిహ్నముపైన "బ్రిటీషుఆఫీసర్లు, వారంటు ఆఫీసర్లు, నేటీవు(N.C.O.) ఎన్. సి. ఓ. లు, పురుషులు, వెటర్నరీ అసిస్టంటులు నాల్కాండ్లు, భారతీయసైన్యమును వెంటాడినవారు, దక్షిణాఫ్రికాలో 1899 1902 సం॥ లో చనిపోయినవారు "అనియొకవంకను రెండవప్రక్కమూఁడుశిలలపైన

"ముసల్‌మాన్"

"క్రిస్టియన్" "జొరోస్ట్రియన్"
"హిందూ" "సిక్కు"

అని రెండవ ప్రక్కను చెక్కబడియున్నది

# దక్షిణాఫ్రికా.

## IV

### నేటాలు, ట్రాన్సువాలు.

బ్రిటీషుబోయరుయుద్ధమున భారతీయులు చూపినత్యాగము ధైర్యసాహసములు పరోపకారము, ప్రపంచము నలరించెను. బ్రిటీషుబోయరుల కాశ్చర్యము గలిగించెను. భారతీయులనిన కొంతగౌరవముకలిగెనుగాని వీరియందలి అసూయాభావము తగ్గలేదు. భారతీయులబాధలుపోలేదు. "గాంధిగారు మహానుభావుఁడు. మహావీరుఁడు. త్యాగధనుఁడు. ఈయన తనచుట్టు ప్రక్కలనున్నవారినికూడ వీరులుగ త్యాగులుగ చేయఁగల మహాత్మ్యముకలవాఁడు. ఈయన యద్భుతశక్తులు నిరుపమానములు "అని మాననీయులగు గోపాలకృష్ణగోఖలేగారు తరువాత 1912లోపలికియుండిరి. ఇదినిజమె. బోయరుయుద్ధము వలన అపకారి కుపకారముచేసు యత్యద్భుతముగ తమధర్మతత్వము నీయన ప్రదర్శించియుండిరి. తరువాత తమవలన నుపకారము పొందినవారే తమ కపకారముచేయగ సహించి సమబుద్ధిచూపిరి.

నేటాలులోని భారతీయులు:—వర్తకపు" లైసెన్సుల" సంగతి నేటాలులో చాల అక్రమముగ నుండెను. అనారోగ్యకరముగ నంగడిపెట్టుకొన్నచో, ఆంగ్లేయభాషలో లెక్కలు

వ్రాయనివో "లైసెన్సు" (అనుమతిపత్రము) నీయరాదని శాసనముచేసిరి. నేటాలు న్యాయాధిపతి లైసెన్సు లిచ్చుట, అధికారి ఇష్టమునుబట్టి యుండునని తీర్పునిచ్చెను భారతీయులకు వ్యతిరేకుడగు ఎల్. ఈ. నీము గారు "వలసరాజ్యములలో ఆశియావారి భయంకరాక్రమణ" మనివ్రాయుచు నీశాసనము నిజముగ అందరు వర్తకులకును వర్తించుటకొరకు చేయబడినను భారతీయ వర్తకులను మాత్రమే బాధించునని ఒప్పుకొన్నాడు. లైసెన్సు నిచ్చుఉద్యోగి తెల్లవర్తకుల సేవకుడు. అతడు వారి మనసు వచ్చినట్లెల్ల మెలగును. ఇది కేవల మొక తెగ వారికి వర్తించు శాసనమని అంగీకరించినాడు. శాసనమువలన జరిగిన అన్యాయములకు చాల ఉదాహరణములు చూపవచ్చును. భారతీయులు (లైసెన్సు ఆఫీసరు) అనుమతి పత్రములనిచ్చు ఉద్యోగి ఉత్తర్వులపైన చేసికొనిన అప్పీళ్లను బోర్డువారూరక త్రోసివేయుచుండిరి. నిజమగు కారణము లేకుండగనే "నాగరికులగు గౌరవము కలవారి" మధ్యనుండకూడదని వాహిదుగారికి అనుమతిపత్ర మీయబడ లేదని అతని వ్యాజ్యమున క్రాసు పరీక్షలో తేలినది.

"గోగా" గారికిని ఇంకనిరువురకును లేడీస్మిత్తులో లైసెన్సుముఖల నీయబడలేదు. "పెన్నే" కూలితెగవాడనియు నతడు అంగడిలోగాక పొలముమీద నుండవలసిన వాడనియు అందొక భారతీయుని గూర్చి లైసెన్సుల యుద్యోగియనెను. గోగా వర్తకము చేయుచుండగ కొనువారు 95 వంతులు యూరపియనులే.

తక్కిన వారిలో కొందరు భారతీయులు కొందరు కాఫరులు. గోగాగారు ఉంచునది యూరపియనునింట. కొనునది యూరపియనుదగ్గర. అమ్మునది యూరపియనులకు. మొదట అతని వ్యాపారమును లేసెన్సిత్తువారు ప్రోత్సహించినారు. అంతట అతడు సొంచి స్వయిల్లు కట్టుకొనినాడు. యూరపియనుకు భాగమిచ్చి ఆవ్యాపారము నితడు మరల చేసికొనదలంచి లైసెన్సు కోరినాడు. ఈసమయమున ఆశియావారిపైన యూరపియనులు ద్వేషించి యుండుటవలన లైసెన్సు నిచ్చుటకు అతనికి ఇంగ్లీషు లెక్కలు వ్రాయుట రాదని ఉద్యోగి నిరాకరించినాడు! ఇతనితోపాటు వ్యాపారము చేసిన యూరపియను తనకు కొంతసొమ్మిచ్చినచో సాహాయ్యము చేసెదననినట్లు 1907 సంవత్సరము మార్చి 2 తారీఖు "ఇండియన్ ఒపీనియన్" పత్రిక వ్రాసినది. అతనికిగోగాగారు 50 పౌనులిచ్చినారు. కొన్ని దినములకు గోగాగారి పేరుతో లైసెన్సు వచ్చినది. మునిసిపలు అధ్యక్షునికి సాహాయ్యము చేయుటకు తాను లైసెన్సు నిచ్చినట్లు లైసెన్సుల ఉద్యోగి చెప్పినాడు! క్రొత్తవారికిలైసెన్సులీయలేక పోవచ్చును గాని ప్రాతవారికిన క్రమముగ రద్దుపరచుట అన్యాయము. యూరపియనులు భారతీయులను స్వలాభముకొరకుపయోగించి, వర్తకముచేసి దేశములో నెలకొన ప్రోత్సహించి ఆకస్మికముగ బహిష్కరించి తరుముటఅక్రమము అని నేటాలు మర్క్యురీ వ్రాసినది.

ఎన్నికహక్కులు:—రాజకీయ సంస్థలకు ఎన్నికహక్కులు లేనివారికి స్థానిక సంస్థ (మునిసిపాలిటీ) లకునుఎన్నికహక్కు

లుండరాదని నేటాలు వారుశాసించిరి. అంతట నేటాలుభారతీయ కాంగ్రెసుసంఘమువారు ప్రభుత్వమువారికి మొరపెట్టుకొనిరి. లైసెన్సుల విషయమున విశాలభావము వహించినచో దీనినిగూర్చియె తాముతలంపమని భారతీయ ప్రభుత్వము వారనుటవలన నేటాలువారీహక్కులను తీసివైచిరి.

విద్య:—1899 సంవత్సరమునకు పూర్వము నేటాలులోని పాఠశాల నందెల్లరును జదువుకొనుట కలవిగ నుండెను. అంతట అటర్నీ జనరలు హెన్రీబేక్ గారు ప్రభుత్వ పాఠశాలలయందు రభాతీయ బాలురు చదువరాదని శాసించి భారతీయుల కొక ప్రత్యేక ఉన్నత పాఠశాల స్థాపించిరి. అయినను భారతీయ బాలికలను నిషేధించలేదు. 1905 సం॥ లో నొక క్రొత్తవిద్యాధికారి (Superintendant) వచ్చి యూరోపియను పాఠశాలల యందు చదువుచుండిన భారతీయ బాలికలను నిషేధించి ఇంతటితో నూరుకొనక భారతీయ పాఠశాలలందు కాఫరు ఆదిమ వాసుల పిల్లలను చేర్చుట కనుజ్ఞనిచ్చిరి. 1908 సం॥ లో భారతీయుల పాఠశాలలందు చదువునేర్పు ఉపాధ్యాయులను తయారుచేయుటకు (ట్రెయినింగు) వేతనము లిచ్చుటకు వలసిన ధనమును భారతీయుల యున్నతవిద్యకు వలసిన ప్రభుత్వ ఆదాయ వ్యయపట్టిక Budget నుండి తొలగించిరి. అట్లువారి విద్య యంతరించినది.

ఇతర కష్టములు:—భాషాంతరీకరణముచేయు నుద్యోగులు ద్విభాషు Dubash లుగతప్ప భారతీయులను ప్రభుత్వ

ఉద్యోగముల దునియమింపరాదని నేటాలువారు శాసించిరి. పూర్వము ప్రభుత్వోద్యోగపరీక్ష Civil Service Examinationలకు భారతీయులు అభ్యర్థులుగ నిలుచుటకు వీలుండెను. ఇప్పుడట్లు నిలువరాదనిరి. 1908 లో భూములచట్టము Income and Land Assessment Act వలన భారతీయులును కాఫరులును కొల్లకుపొంది సాగుచేయు భూములపైన హెచ్చుపన్నులు విధించిరి. ఇందువలన భారతీయులకెవ్వరును భూములను కవులు కీయరైరి.

వీధులలో, ట్రాముబండ్లలో, రైలుబండ్లలో భారతీయులకు అనాదరణము, అవమానము పొటస్థించుచునే యుండెను. భారతీయుని పేరుపెట్టి ఎవ్వరును పిలువరు. కూలీ; సామీ యనియె వారిని సంబోధించుచుండిరి. కూలీ న్యాయవాది, కూలీ వైద్యుడు, కూలీగుమాస్తా, కూలీవివాహము అను వ్యవహారపదము లెల్లయెడల వినబడుచుండెను. ఒకమారు సుప్రీముకోర్టు న్యాయవాదియు గాంధిగారి స్నేహితుడునగు హెచ్. ఎస్. ఎల్. పోలకుగారును, గాంధిగారును, ప్రిటోరియాకుపోవుచుండగ రైలుస్టేషనులో పత్రికల నమ్ముకొను యూరపియను బాలుడు గాంధిగారిని సామీ, పత్రిక లేమైనఁగావలెనా యనెను. ఆర్యసమాజ సన్యాసియగు శంకరానందస్వామిగారు మారిట్జుబర్గులో ట్రాములోపల కూర్చుండగనొక యుద్యోగి ఆయనను లోపలనుండిపోయి తక్కిన భారతీయులతోపాటు ట్రాముబండి పైకప్పుమీద కూర్చుండుమనెను. ఆయనకు ఈ ఆచారములు

తెలియనందున ఎందులకనిప్రశ్నింపగ నొకడాయనను దిట్టెను. ఈసంగతి నేటాలు టైమ్సు పత్రికయే ప్రకటించినది.

గాంధిగారి వృత్తాంతము:—దక్షిణాఫ్రికాలో నట్లుశ్రమ పడి నిద్రాహారములు లేకుండ పనిచేసినందువలన గాంధిగారి ఆరోగ్యము చెడినది. ఆయన 1901లో భార్య బిడ్డలతో హిందూదేశమునకు మరలివచ్చిరి. దక్షిణాఫ్రికా విడచివచ్చునప్పుడచ్చటివారు తమకృతజ్ఞతను ప్రేమను చూపి గాంధిగారికి అభివందన పత్రములు సమర్పించిరి బంగారు కానుకలియవచ్చిరి. కాని గాంధిగారంగీకరింపలేదు. ఈ అభివందనములుసమర్పించునప్పుడు తానురాజాలనందుకు చింతించుచు గాంధిగారిని ప్రశంసించుచు నేటాలుప్రభుత్వ ప్రధానామాత్యుడు, సర్ జాన్ రాబిన్సన్ గారు, లేఖవ్రాసిరి ఈయన బోయరుయుద్ధమున గాంధిగారు స్వచ్ఛంద సేవకదళము స్థాపించినప్పుడు వారికి విందొసగి పంపియుండెను.

గాంధిగారు బొంబాయివచ్చిన తరువాత మరల దక్షిణాఫ్రికాకు పోవుతలంపులేనందున మరల న్యాయవాదిగ పని చేయప్రారంభించిరి బోయరుయుద్ధముతో నవయుగారంభమైనదనియు పాలకుల దృక్పథము మారినదనియు బ్రిటీషు పరిపాలనమున భారతీయులకున్యాయము కలుగుననియు వారిబాధలు తగ్గుననియు తలంచిరి. కాని ఈయన కలకత్తా కాంగ్రెసుకుపోయి యింటికి వచ్చునప్పటికి భారతీయుల బాధలు మానలేదనియు వీరికి హక్కులిమ్మని మొరపెట్టుకొనవలసి యున్నదనియు బ్రిటీ

సరాజ్యాంగమంత్రి చేంబర్లేన్ గారు వచ్చుచున్నారనియు వారికి వినతిపత్రములు వ్రాయవలసి యున్నదనియు తక్షణమె రావలసినదనియు అత్యావసర తంతివార్తవచ్చినది. ఆయన ఆర్తజనరక్షణుడు. ఒక నిముసమైనను ఆలోచింపకయె తత్క్షణమె బయలుదేరి నేటాలులో ప్రభుత్వోద్యోగులకు ఈయనయందు గౌరవముండి యెదుట భారతీయులపట్ల వారుదయతో ప్రవర్తించునట్లు ఈయన చేయగలిగెను. ట్రాన్సువాలువారు గాంధిగారిసహాయమున తాముకూడ కొంచెముసుఖము పడవచ్చునని తెమదగ్గర నుండుమని ప్రతిమాలుకొనిరి. ఆయన దానికంగీకరించిరి. భారతీయ సమస్యలను న్యాయస్థానములందు తీర్మానించవలసియున్నదని గాంధిగారెఱుగుదురు. ట్రాన్సువాలులోనే న్యాయవాదిగ పనిచేయదలచి అనుజ్ఞపొంది సుప్రీముకోర్టులో అడ్వొకేటు (న్యాయవాది)గా చేరిరి.

**ట్రాన్సువాలుభారతీయులస్థితి:**— బోయరుల వలసరాజ్యపరిపాలనమున భారతీయులస్థితి బాగుండలేదు గాని ట్రాన్సువాలులోనికి భారతీయులు పోవుట కెట్టియాటంకములు లేవు. సంవత్సరమునకు మూడుపౌనుల తలపన్నునిచ్చినవారలు ఎవరైన పోవచ్చును. బోయరుయుద్ధమునాటికి స్త్రీలు బాలురుకాక 15000 భారతీయులుండిరి. అప్పుడు ట్రాన్సువాలువారు యూయిట్‌లాండర్లకు భారతీయులకు వ్యతిరేకములగు శాసనముల చేయుచుండుట చూచి బ్రిటీషుప్రభుత్వమువారు వారిపక్షముపూని అభిమానించి యుండిరి. ఇంతయేల? చేంబర్లేన్ మంత్రిగారును లాన్సుడౌన్ ప్రభువుగారును తమ

సామ్రాజ్యములోని భారతీయులను మహమ్మదీయులవంటి ప్రత్యేకస్థలము లందుంచుటకు ట్రాన్సువాలువారు ప్రయత్నించుచు చట్టములను చేయుటయె బోయరు యుద్ధమునకు ప్రధాన కారణమని చెప్పియుండిరి. కాని భారతీయులిట్లు ప్రత్యేకస్థలము లందు తప్ప నివసింపకూడదు, వర్తకముచేయరాదను శాసనము తీవ్రముగ నమలులో పెట్టబడియుండలేదు. ఏమైననేమి, యుద్ధము జరిగినది. బోయరుయుద్ధమైన తరువాత బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వమువారే దక్షిణాఫ్రికా రాజ్యమును స్వయముగ స్వాధీనమొనర్చుకొని పరిపాలించిరి. రాబర్ట్సు సేనానియు కిచనరు ప్రభువును సేనానులుగనుండి దేశమునందలి బోయరుపితూరీల నడగద్రొక్కిరి. మిల్నరుప్రభువు దక్షిణాఫ్రికాలోని నాల్గురాజ్యములకును బ్రిటీషు హైకమీషనరయ్యెను. రాబర్ట్సు సేనానియు మిల్నరు ప్రభువునుకూడ యుద్ధ పరిస్థితులుపోయి శాంతి నెలకొనిన పిదప భారతీయులకు హక్కులను కలిగింతుమని చెప్పియుండిరి. అప్పుడు వలసరాజ్యములో కాపురమున్న భారతీయులకు హక్కులను కలిగింతుమని చెప్పియుండిరి. అప్పుడు వలస రాజ్యములో కాపురమున్న భారతీయులన్నెల్లరును తమపేళ్లను లిపిరిజష్టరు చేయించుకొనుడనిరి. వీరి ప్రభుత్వమున తాము బాగుపడుదుమనుకొనిన భారతీయులు దుఃఖము నొందిరి. పూర్వము బోయరులు పరిపాలించిన నివేశనముల శాసనమును వీరు మరింత కఠినముగ పరిపాలించి, భారతీయు లాయాప్రదేశములందే యుండవలెననిరి. బోయరులును బ్రిటీషువారును కలసి భారతీయులను బాధించిరి. ప్రాతిశాసనములను మార్చుటకు తరువా

త మిల్నరు గారంగీకరింపలేదు. భారతీయులను బాధించువట్టి బోయరులతో బ్రిటీషువారేకీభవించిరి. వర్తకము చేయుటకొఱకు నివసించు భారతీయులు ప్రత్యేకస్థలములం దుండవలెనను మాటకు నివసించు భారతీయులు ప్రత్యేకస్థలములం దుండవలెనని యర్థములేదని 1904లో సుప్రీముకోర్టువారు తీర్మానించిరి. ఇది చూచి దీనికి తగిన క్రొత్తశాసనమును చేయుడని తెల్లవారు ఆందోళనము చేసిరి. రాబర్ట్సు సేనాని భారతీయులనెల్లరను రిజస్టరు చేయించి యుంచెను. హిందువులను దయచేయుడని భారతీయులు ట్రాన్సువాలుకు రాజకీయ సంస్కరణములను దయచేయుటకు కూడినసభ వారికి మనవి చేసికొనగ "నేటివు" అనుమాటకు ఆశియావాడనికూడ అర్థమున్నది గనుక శాసనము ప్రకారమే న్యాయము పరిపాలింప బడుచున్నదని చర్చిల్ గారు పలికిరి.

భారతీయుల బాధలు:—ట్రాన్సువాలు వారు ప్రత్యేకించిన స్థలములు చాల నసహ్యకరములుగ నుండెను. మనదేశములోని మాలగూడెములవలెనె యపరిశుద్ధ ప్రదేశముల నేర్పరచి మన అస్పృశ్యతా దోషఫలము ననుభవింప చేసిరి. అప్పటి నగర పాలక సంఘములు వాని యారోగ్యమును గమనింపక యుపేక్షించెను. అందువలన జోహానసుబర్గు గూడెములోకి 1904సం॥లో మహామారి వ్యాధి వ్యాపించెను. ఎట్టి ఆదిమ నివాసుల జాతివారైనను ప్రిటోరియాలో భూమిని కొనవచ్చును గాని భారతీయులకు మాత్రము గూడెములను తప్ప భూములు కొనరాదు. జోహానసుబర్గులోను ప్రిటోరియాలోను రాజబాటల

కిరుప్రక్కలను పాంథులు పోవుటకు నిర్మింపబడిన కాలిదారులందు భారతీయులు నడువరాదని పురపాలక సంఘమువారు శాసించిరి. జోహానసుబర్గులో శెట్టి విద్యావంతుడగు భారతీయుడైనను తపాలా కార్యస్థానముఖద్వారము దగ్గరకుపోయి తపాలాబిళ్లల గొనరాదు. ఒకమూలనున్న చీకటికొట్టులో ఆదిమవాసులతోపాటు నిలచి కొనవలెను.

జోహానసుబర్గులోను ప్రిటోరియాలోను ట్రాముబండ్లలో భారతీయులు ప్రయాణము చేయరాదు. అప్పుడప్పుడు కాఫరులకొఱకు ప్రత్యేకముగ పోవు ట్రాములో నెక్కవలెను. రైళ్లలోను భారతీయులు రెండవ తరగతి టిక్కెట్టుకొన్నను తెల్లవారి తరగతిలో కూర్చుండరాదు.

గాంధిగారి కార్యక్రమము:—1903 సంవత్సరమున నె గాంధిగారు ట్రాన్సువాలు బ్రిటీషు భారతీయ సంఘము Transvaal British Indian Association నుస్థాపించి దానికి కార్యదర్శిగ నుండిరి. ట్రాన్సువాలు భారతీయులీయన నాయకత్వమున ధైర్యము జెందిరి జోహానసుబర్గు మునిసిపాలిటీవారు ప్రత్యేక నివేశనములందుండవలెనని నిర్బంధించి వెడలగొట్టిన భారతీయులకు నష్టపరిహారములిచ్చు సందర్భమున వచ్చిన యభియోగములను తీర్మానించుటకు ఉభయపక్షములవారును గాంధిగారిని మధ్యస్థునిగ ఎన్నుకొనుచుండిరి. గాంధిగారు జోహానసుబర్గులోనట్లు చాలధనము నార్జించి ఇదియెల్ల భారతీయుల కొఱకె వినియోగించిరి.

ఆశియావారి కార్యస్థానము:—దక్షిణాఫ్రికా ఆశియా వ్యవహారముల కార్యస్థానమును నొక క్రొత్త సంస్థను ప్రభుత్వమువారు స్థాపించిరి. క్రొత్త ఉద్యోగులు వచ్చిరి. వీరికి భారతీయులపైన సానుభూతిలేదు. ఆకార్యస్థానము కార్యదర్శి డేవిడ్సన్ గారిని గాంధిగారు చూచుటకు ప్రయత్నించిరికాని లాభము లేకపోయెను. సహాయ కార్యదర్శిగారు గాంధిగారిని గౌరవించలేదు. భారతీయుల వ్యవహారములుచక్కబెట్టుటకు తాముండగ నీగాంధిగారేల ట్రాన్స్వాలులో తిరుగుచున్నారనియు వీరిచుట్టు భారతీయులేల తిరిగెదరనియు దూషించుచు గాంధిగారిని దేశమువదలి పొమ్మనిరి!

నేటాలు భారతీయుల పక్షమున గాంధిగారు ఇదివరకు మంత్రిగారిని దర్శించియుండిరి. అట్లే చేంబర్లేన్ మంత్రిగారిని ట్రాన్స్వాలు భారతీయులపక్షమున నిప్పుడు గాంధిగారిని పేర్కొనక తొలగించుచు వచ్చిరి. తాములేకపోయినను భారతీయులు మంత్రిగారిని చూచుట ముఖ్యమని ట్రాన్స్వాలు భారతీయులకు గాంధిగారు బోధించిరి వారెల్లరు కర్తవ్యమాలోచించిరి. ఆశియావారి కార్యస్థానము వలన నుపద్రవము కలుగునని వారెఱుగుదురు; ఆశియావారి నెల్లరినొక జాతిగచూచి వారికి ప్రత్యేక చట్టములు చేయవలెనను తలంపు ప్రభుత్వమువారి కున్నట్లు స్పష్టపడెను. యుద్ధమునకు పూర్వముండిన పరిస్థితు లేర్పడుచుండెను. భారతీయులకు బ్రిటీషువారి ధర్మపరిపాలన మందలి నమ్మకము పోయినది.

అతివృష్టి; మహామ్మారి:—1904 సంవత్సరములో అతివృష్టిదోషము కలిగెను. జోహానసుబర్గు మునిగెను. 17 దినములు, అహోరాత్రములు, వర్షము కురిసెను. అంతట మహామ్మారిరోగము వచ్చెను. మ్యునిసిపాలిటీ వారిది గ్రహింపక అశ్రద్ధ చేసిరి. వారము దినములకుముందే గాంధిగారీ రోగమును గుర్తించి హెచ్చరించిరి కాని ఎవరును వినలేదు రోగము వ్యాపించినది. గనులలోనుండి చచ్చువారిని చచ్చినవారి ననేకులను తెచ్చుచుండిరి. గాంధిగారు ఈసంగతి వైద్యశాఖవారికి తెలిపి కొందరు స్వచ్ఛంద సేవకులతో పోయి మృత్యువుతో పోరాడిరి. మదనజిత్తుగారును పత్రికాధిపతియు నలుగురు స్వచ్ఛంద సేవకుల సాహాయ్యముతో నొక గిడ్డంగి పగులగొట్టి వైద్యశాలగ చేసి రోగులను చేర్చెను. గాడ్‌ఫ్రే (God frey) అను డాక్టరుగారును వీరికి సాహాయ్యము చేసిరి. రోగులనెల్లర నింకొక ప్రక్కనుంచుటవలనని జోహానసుబర్గు రక్షింపబడెను. ప్రభుత్వమువారు గాంధిగారి సేవకు సంతసించిరిగాని రోగులకు మాత్రము వైద్యశాలలందు తావులేదనిరి. పాపము భారతీయులె సభకూడి ధనము ప్రోగుచేసి మనుజులను చేర్చి, పదార్థములు తెచ్చి చచ్చువారికి ధైర్యముతో రాత్రియెల్ల సేవచేసిరి. మూడవ దినమునకు జోహానసుబర్గునుండి ఒకనర్సు, వైద్యశాలలో రోగుల కుపచరించు స్త్రీ, వచ్చెను. డాక్టరు ఫాక్సుగారు క్రొత్త వైద్యశాలకు అధికారులైరి. గాంధిగారును గాడ్‌ఫ్రేగారును అంటురోగమని యనుమానింపబడిన రోగులకొక తావు నేర్పరచిరి. గాంధిగారి దగ్గర న్యాయవాదిగ పనినేర్చుకొనుచున్న

"రిచ్చి" గారు నద్భుతముగ పనిచేసిరి. మహామ్మారి అట్లొక నెలదినములు విరామము లేకుండ వ్యాపించెను. 113 గ్గురు జనులు జోహానసుబర్గులో మరణించిరి. 25 తెల్లవారు 55 భారతీయులు 4 గురు నలుపురంగుజాతివారు 29 నేటీవులు చచ్చిరి. జోహానసుబర్గుకు నిజముగ సంభవించిన ఘోరమగు ముప్పు తెలియలేదు. కొద్దిమంది భారతీయులుచేసిన మహోపకారమును, తెలియలేదు.

ఇండియను ఒపీనియన్ పత్రిక:—భారతీయు లైకమత్యముకలిగి ఒకరిసంగతి నింకొకరెఱిగి ప్రజాభిప్రాయమును ప్రకటించుట కొకవార్తాపత్రిక యవసరమని గాంధిగారికి 1903 సం॥ లో తోచెను. అంతట తామే దానికి మూలధనము చాలవరకిచ్చి ఎమ్. హెచ్. నాజరుగారిని పత్రికాధిపతిగ నేర్పరచి The Indian Opinion ఇండియన్ ఒపీనియన్ (భారతీయ ప్రజాభిప్రాయము) అనునొక వార్తాపత్రికను స్థాపించిరి. మొదట ఇంగ్లీషు గుజరాతీ హిందీ తమిళభాషలలో ప్రచురించిరిగాని ఇంగ్లీషులోనే ప్రచురించుట యుక్తమనితోచి అట్లు చేసిరి. తామాపత్రికకు వ్యాసములు వ్రాయుచు దానిని జాగ్రత్తగ కాపాడిరి.

ఫీనిక్సు ఆశ్రమము:—1904 వ సంవత్సరాంత మగు నప్పటికి పట్టనమునుండి పత్రికను ప్రచురించుటవలన చాల వ్యయమగుచుండుట గాంధిగారు కనిపెట్టి కర్తవ్యమాలోచింపసాగిరి.

దక్షిణాఫ్రికాలోని యూరోపియనులును భారతీయులును సోదరముగ ఐకమత్యముతో స్వేచ్ఛముగ జీవించుట శ్రేయస్కరమని గాంధిగారు తలంచుచుండిరి ఉన్నతములగు ఆదర్శములతో పరోపకారదీక్షతో సోదరభావముతో వివిధజాతులవారు కాపురముచేయుటకు ఒక ఆశ్రమము స్థాపింపదలచి డర్బనుకు 12 మైళ్లదూరమున "ఫినిక్సు" అనుచోట 100 యకరముల భూమిని తామె స్వయముగకొని భారతీయులందును యూరోపియనులందును గాంధిగారు కొందరినిచ్చట కాపురముండుటకు యాహ్వానించిరి ఇచ్చటనె "ఇండియను ఒపీనియన్" వార్తాపత్రికయొక్క కార్యాలయమును గట్టిరి ఈఆశ్రమమందు కాపురముచేయువారు నిరాడంబరముగ జీవించి దారిద్ర్యమున నుండుట కిచ్చగించి నెలకు 3 పౌనులు (45 రూపాయిలు) మాత్రమె పుచ్చుకొనుచు నుండవలెను. కాపురముండుట కాశ్రమమె ఇల్లుకట్టియిచ్చును గాని పిమ్మటనప్పుడు దానికైన వ్యయమును గృహస్థుడు మెల్లగ తీర్చవలెను. ఒక్కొక పురుషుడు రెండెకరముల భూమినిపుచ్చుకొని వ్యవసాయముచేసి జీవించుచు తీరిక దొరకినప్పుడెల్ల పరోపకారము చేయుచుండవలెను. తాను పుచ్చుకొనిన భూమి విలువనుగూడ తాను సంపాదించిన ధనమువలన తీర్చవలెను. ఇల్లు తీర్చవలసిన సొమ్ముకు వడ్డియనక్కరలేదు. ఆశ్రమమును మొదటస్థాపించినప్పుడు భారతీయ ప్రజాభిప్రాయ పత్రికానిర్వాహణము ఆశ్రమవాసులు చేయవలసిన ముఖ్యకార్యముగనుండెను. తరువాత భారతీయ బాలురకు వీరు విద్యనేర్పసాగిరి.

టాల్‌స్టాయి ఆశ్రమం:—గాంధిగారు యమనియమము లనే జీవితాదర్శముగ గైకొని జీవించుచుండిరి. తామున్యాయవాదిగ జోహాన్సుబర్గులో పనిచేయవలసి యున్నందున దగ్గరగ నొకచోట కొంతభూమిని కొని రష్యాదేశపు ఋషియనదగు టాల్‌స్టాయిగారి పేర నొక వ్యవసాయ ఆశ్రమమును స్థాపించి అచ్చటను నిరాడంబర జీవనమునే చేయుచుండిరి. ఆయనయు కొమారుడు మణిలాల్ గాంధిగారును స్వయముగ వ్యవసాయముచేయుచు ఆహారము పచనముచేయుచుండిరి. గాంధిగార నేకులకుటుంబములను పోషించుచుండిరి. వత్సరమునకై దారువేల పౌనులు వచ్చుచుండిన న్యాయవాది వృత్తివిడచి స్వార్థత్యాగముచేసి పరోపకారముచేయుచు గాంధిగారు తమసతీమణితో కొన్నాళ్లకు ఆశ్రమవాసులైరి.

సెల్‌బోర్న్ ప్రభువు పరిపాలనము:—1905 లో మిల్నరు ప్రభువునకు బదులు సెల్‌బోర్న్ ప్రభువు హైకమీషనరయ్యెను. భారతీయులు రహస్యముగ దేశములోనికి వచ్చుచున్నారనియు వారిగుంపు లధికమగుచున్నవనియు ప్రజలనిరి సెల్‌బోర్న్ ఇది విచారించెను. కాని అసత్యమని తేలినది. యుద్ధపూర్వము 15,000 ప్రజలుండిన ట్రాన్సువాలులో నిప్పటికి తొమ్మిదివేల భారతీయులు మాత్రమే యుండిరి ట్రాన్సువాలు పరిపాలకవర్గమువారు భారతీయులు తమదేశములోనికి రాకూడదని రోధింపసాగిరి. ప్రాతచట్టములను పురస్కరించుకొని వారిని రాకుండగ నిషేధించుచుండిరి. చట్టమునుమీరినట్లు కొందరిపైనభియోగములు తెచ్చి శిక్షించుచుండిరి. చాలమందిని దేశము

లోనికి రానీయకుండ అనుమతి పత్రము తీయకుండ బాధించుం డిరి. సెల్ బోరన్‌గారిది చూచియు చూడనట్లూరకొనిరి. సెల్ బోరస్‌గారే ఎర్మెలో Ermelo లో మాట్లాడుచు కూలీ గిడ్డంగివారు Coolie Store keeper అని భారతీయులను పేర్కొనుటవలన భారతీయుల కవమానము కలిగెను.

గాంధిగారి రాయబారము:—గాంధిగారు నితరభారతీయులును హైకమీషనరు సెల్ బోరన్‌గారిని 1905 సం॥ నవంబరు 22 వ తేదీన దర్శించి భారతీయుల కష్టములను మనవి చేసిరి శాంతిచట్టము (Peace Preservation Ordinance and Law 3 of 1885 as amended in 1886) లో దుర్మార్గులను రానీయకూడదను నియమును పురస్కరించుకొని భారతీయులను ట్రాన్సువాలులోనికి రాకుండ అక్రమముగ నిషేధించుచున్నారనియు బ్రిటీషుబోయరు యుద్ధమునకు భయపడి పోయినవారు చాలమంది వెనుకకువచ్చుటకు వేచియున్నారనియు భార్యబిడ్డలకుకూడ అనుమతి పత్రములను తీసికొనవలెనని నిర్బంధించుచున్నారనియు ఇతరులను రానిచ్చుటయె లేదనియు అందువలన నచ్చటివారు తమదేశమునుండి న్యాయవాదులను గాని వ్యవస్థాపకులు Managers నుగానితీసికొనివచ్చుటకు వీలు లేదనియు ఈశాసనమువలన భారతీయులకు పౌరసత్వముతె లేకుండపోయినవనియు, వారికి ప్రత్యేకస్థలములందు తప్పస్థిరాస్తి యుండుటకు వీలు లేకున్నదనియు భారతీయులను ప్రత్యేక నివేశనములందుండునట్లు శాసించుచున్నదనియు వర్తకము కొఱకు వలస వచ్చువారు 3 పౌనుల తలపన్ను నిచ్చుకొనవలెనని

యు శాసించుచున్నదనియు యుద్ధానంతరము శాంతి స్థాపించి పరిపాలించు నప్పుడీ శాసనమువలని కష్టములను తొలగింతుమని బ్రిటీషుమంత్రులు వాగ్దానముచేసియు అట్లు చేయలేదనియు చెప్పి అప్పుడు ప్రభుత్వమువారు చేయదలచిన క్రొత్తశాసనమున బ్రిటీషు భారతీయులు లేక ఆసియావారికి సంబంధించునట్లు జాతిభేదమును పురస్కరించుకుని వారు ప్రత్యేక నివేశములందుండవలెనని నియమింపదలచుట యక్రమమనియు చెప్పిరి. పెరిరాయబారమును సెల్బోర్న్ గారు చూచిరిగాని దీనివలన లాభము కలుగలేదు. "కూలి" యనుపదమును ఉపయోగించినందులకు గాంధిగారు హైకమీషనరును అప్పుడే మెల్లగ మందలించిరి

జూలూపితూరీ, గాంధీసేవాదళము:—1906 వ సంవత్సరము వచ్చినది. నేటాలులో బ్రిటీషుప్రభుత్వమున నుండిన నల్లవారు తెల్లవారిపై తిరుగబడిరి. అచ్చటి ఆదిమవాసులగు జూలూలును బంటూలును పాశ్చాత్యుల బాధలను సహింపక వారిని నాశనముచేయవలెనని తలచి కుట్రలుచేసిరి. ఆదిమవాసులు విజృంభిచుటను చూచి తెల్లవారు వారిని దండింపదలచిరి. ఈసందర్భమొక యుద్ధముగ పరిణమించెను. ఇది యుద్ధముగ పరిణమించుననియు రక్తపాతము కలుగుననియు గాంధిగారు ముందుగనె గమనించి తమ సహాయకారబృందముతో యుద్ధమున సేవచేయుటకు గాయపడిన వారిని మోసికొనిపోవుటకు నొక స్వచ్ఛంద సేవకదళమును నిర్మించి సేవచేసెదమని నేటాలువారి పక్షమున ప్రభుత్వమువారితో చెప్పగవా

రెట్టకేలకంగీకరించిరి. గాంధిగారు తమకుటుంబమును ఫోనిక్సు ఆశ్రమమున కంపిరి. గాయపడినవారిని మోసికొనిపోవు "సేవాదళము" (Strecther Bearers corps) నకు తామెనాయకులుగనుండిరి. వీరుచేసిన సేవపత్రికలందు ప్రభుత్వప్రకటనలందును ప్రశంసింపబడెను. నేటాలు గవర్నరుగారు వీరికి వందనములర్పించిరి. ఈసేవాదళములోని వారికి ప్రత్యేకముగ పతకములను బహూమానముచేసిరి. 23 స్వచ్ఛందసేవకులకు దళపతిగ గాంధిగారు ఎండయనక వానయనక యుద్ధభూమియైన హ్యారాగాత్రములు పనిచేసిరి. వీరు గాయపడినవారిని మోసికొనిపోవుటయేగాక కొన్నికాలము వారిపాలము లేనిక దినమునకు ముప్పదియైదుమైళ్ళు నడువవలసివచ్చుచుండెను. నిరాయుధులై అసహాయులై క్రూరులును అనాగరకులునగు భయంకరవైరుల భూములలో నిట్లు తిరుగుచు భారతీయులు వైద్యశాలలలో సాహాయ్యము చేయుచుండిరి. వలససైనికులు నిర్దయతో కాల్చివైచిన నేటివులు భయంకర గాయములు తగిలి మరణబాధ నొందుచుండగ నసహ్యకరములగు వ్రణములను కూడ కడిగి వాసనవచ్చుచుండినను సహించి నేటివురోగుల కుపచరించిరి. మరణబాధపడుచుండిన వారిని మైళ్లకొలది మోసి ఆదుర్గంధమయ యుద్ధభూమిలోనీమంత్రిపుత్రుడేరీతిని కాలముగడపెనో ఈయనతో ఇతరభారతీయులెల్లు సేవచేసిరో చెప్పనలవికాదు. గాంధిగారి ధర్మపద్ధతులకును పరోపకారదీక్షకును దక్షిణాఫ్రికావా రాశ్చర్యపడిరి.

# దక్షిణాఫ్రికా.

## V

### సత్యాగ్రహమహోద్యమము

**సత్యాగ్రహకారణములు:**—జూలూపితూరీ యడగినది. ఇంతవరకును మఱచిన న్యాయవాది వృత్తిలో గాంధిగారు మఱల పనిచేయుటకు జోహానసుబర్గుకేగిరి అంతట పిడుగుపడి నట్లు భారతీయులకు వ్యతిరేకముగ పక్షభేదమును పురస్కరించు కొని వారివలసనె నిషేధించుటకును ట్రాన్సువాలులో నున్న వారి బ్రదుకునె దుర్భరముగ చేయుటకును భారతీయవిద్వే షుల ప్రోత్సాహమున ప్రభుత్వమువారొక ఘోరచట్టము ను చేయదలచిరను వార్తబయల్వెడెను అందువలన గాంధి గారికి చింతలుమాని దీనివిషయమై పనిచేయవలసి వచ్చెను. యుద్ధమునకు భయపడి వెడలిపోయిన భారతీయులను మఱల రాకుండ నిషేధించు నుపాయములను ట్రాన్సువాలువారు 1885 సం॥ శాంతిశాసనమును పురస్కరించుకొనియె చేయుచుండిరి. భారతీయులు అనుమతి పత్రములేనిదే ట్రాన్సువాలులోనికి రా కూడదనిరి బాలురకు స్త్రీలకు ననుమతులుగావలెననిరి. ట్రా న్సువాలులోనున్న వారెల్లరు తమ నామములను తెలుపుకొని రిజిస్టరు చేయించుకొనవలెననిరి. భారతీయులు ప్రత్యేకముగ నిర్ణయింపబడిన చోటులనె నివసింపవలెను, వర్తకము చేయ వలెననిరి. ఈనియమములను మీరిన వారిపై నభియోగము

లు దెచ్చి శిక్షలు విధింపఁజేసిరి ఇట్లు విధింపబడిన శిక్షలు అక్రమములని భారతీయులు సుప్రీము కోర్టునకు ఉపర్యభియోగము (Appeal) లజేసిరి. అంతట సుప్రీము కోర్టువారీ శిక్షలు అక్రమములని రద్దుచేసిరి. తెల్లవారికిది చూచి దానికి తగిన ప్రతిక్రియను చేయఁదలచి ప్రభుత్వము వారినీ నియమములతో నొక చట్టమును చేయుమని ప్రోత్సహించిరి. అంతట 1906 సం॥ లో ప్రభుత్వము వారీ నియమములతో ఆశియా వారి శాసనమునకు మార్పుచట్టము (Asiatic Law Amendment Ordinance) అని ఒక చట్టమును ట్రాన్సువాలు శాసనసభలో ప్రవేశపెట్టిరి. దీనివలన యుద్ధమునకు పూర్వముండిన భారతీయులు తప్ప క్రొత్తవారు దేశములోనికి రాఁగూడదు. దేశములోనున్నవారెల్లరు రిజిస్టరు చేయించుకొనవలెను అందుగురించు కొన్ని వివరములు చెప్పవలసియుండుటయే గాక వ్రేలుముద్రలు వేయవలెను అట్లు రిజిష్టరై గురుతు పత్రములు పొందనివారు శిక్షింపబడుదురు

సత్యాగ్రహదీక్ష:— భారతీయ విద్వేషుల కోరికలను ట్రాన్సువాలు ప్రభుత్వమువారు సఫలము చేసిరి. శాసనసభవారీ చట్టమును చేసిరి భారతీయులు తమ అసమ్మతిని స్పష్టముగ తెలిపి కర్తవ్యమాలోచించి ఏదైన చేసినగాని ట్రాన్సువాలులో వారికి బ్రదుకుటకే వీలుండదని గాంధిమహాత్ముడు గ్రహించెను. శాసనసభవారు శాసనమును చేయుచుండఁగ సెప్టెంబరు 11 వ తేదీన భారతీయులు జోహానసుబర్గులోని ఎంపైరు నాటకశాలలో నొక మహాసభను చేసిరి. 3000 మంది ఆసభకు వచ్చిరి. ఘోరచట్టమునకు తమ అసమ్మతిని తెలిపిరి. సామ్రాజ్యప్రభు

త్వము వారీ చట్టమునకు సమ్మతించినచో దీనిని మార్చువఱకును అచ్చటి వారెల్లరును ఆచట్టము ప్రకారము నడువక సాత్వికముగ నిరోధించి చెఱసాలకేగుటకు సభవారు తీర్మానమును చేసిరి. అచ్చటి సభ్యులెల్ల రొక్కుమ్మడిగ లేచి యంగీకరించిరి. గాంధిగారును ప్రమాణముచేసిరి. తుది ప్రయత్నముగ భారతీయులొక రాయబారము నింగ్లాండునకంపి యీచట్టమును సార్వభౌముడంగీకరింపకుండ సలహానిమ్మని మనరాజ్యాంగమంత్రిగారిని వేడుకొనుటకు నిర్ణయించిరి.

గాంధిగారి రాయబారము:—1906 సం॥ అక్టోబరు నెలలో గాంధిగారును అల్లీగారును ఇంగ్లాండునకు వెళ్లిరి. వీరు సామ్రాజ్యవలస రాజ్యాంగమంత్రి Secretary of state for colonies అగు ఎల్జిన్ ప్రభువును దర్శింపదలచిరి. దక్షిణాఫ్రికా భారతీయులయందు చాలమందికి సానుభూతి కలిగెను. ఆంప్తిల్ Ampthil ప్రభువుయొక్క నాయకత్వమున నొకసంఘము నేర్పరచిరి. దీని కార్యనిర్వాహక సభకు సర్. ఎమ్. ఎమ్. భువనగిరిగారధ్యక్షులు. నేడు ప్రీవీకవున్సిల్ సభ్యులగు అమీర్ అలీగారును గాంధిగారు ఇతరులును ఎల్జిన్ ప్రభువుగారిని దర్శించిరి. తమకు భారతీయుల యెడల సానుభూతికలదని ఎల్జిన్గారు చెప్పిరి. అప్పుడుసామ్రాజ్య ప్రభుత్వమువారు దక్షిణాఫ్రికాకు వలసరాజ్యపరిపాలన Colonial self government దయచేయుచుండిరి. ఈసంస్కరణముల ప్రకారమెన్నికలు జరిగి మజిల . శాసనసభలు

ఈవిషయమునుగూర్చి చర్చించువరకు నీశాసనము నిలుపుచేసె దమనియు చక్రవర్తిగా రంగీకరింపరనియు తెలవిచ్చిరి.

రాజ్యాంగ సంస్కరణము:— క్రొత్తసంస్కరణములైనవి. ఎన్నికలు జరుగుచుండెను. యూరోపావారు కానివారలను గూర్చి పాశ్చాత్త్యులకు లేని చిక్కులు అడ్డములు కలిగించు శాసనమును బ్రిటీషువారు నిలుపవచ్చునని రాజ్యాంగ సంస్కరణ చట్టము గలదు. కాని ఎల్గిన్ గారే సెల్బోర్న్ ప్రభువునకు ప్రజా ప్రతినిధులు అట్టి శాసనమేదైన చేసినచో అది నిలుపుచేయబడు దనియు చక్రవర్తిగారి అంగీకారము పడయుననియు వ్రాసెను! అప్పుడు ఇంగ్లాండులో ట్రాన్సువాలు ప్రతినిధి సోలమన్ గారు నూతన సంస్కరణమున దక్షిణాఫ్రికాకు ముఖ్యమంత్రి కాగోరి ఇంగ్లాండునుండివచ్చి ఎన్నికలలో నుపన్యసింపుచు నీయధికారము బ్రిటీషువారు ప్రయోగింపరని చెప్పిరి. బోథాసేనాని తన పక్షమువార నెన్నుకొనినచో కూలీలను నాటాలుండ్లలో వెడలగొట్టెదమని చెప్పిరని ప్రచురింపబడినది. 1906 లోనే భారతీయుల సంఖ్య తగ్గినది ప్రోగ్రెసీవు పార్టీవారైన అబ్రి బెయిలీగారు "ఆశియావారు ట్రాన్సువాలునుండి పోవుదినమును తాను కోరుచున్నట్లు ఒక సభలో చెప్పెను. ఇంతకన్నను ఘనులుకలరు. హెట్వోల్కుపార్టీ [HETVOLK] వారి న్యాయవాదియగు జె సీ. స్మట్సు గారు నేటాలుకార్మికపార్టీవారికి లేఖవ్రాయుచు "దక్షిణాఫ్రికా ఆయువుపట్టులోనికి తిని వేయుచున్న ఆశియా వేరుపురుగు రోగమును పూర్తిగ పెరికివేయవలెను" అనెను. ఈయన ఎన్నికలైన తరువాత ట్రాన్సువాలు వలసకార్యదర్శి

(Colonial Secretary)యయ్యెను. ఇట్లు ట్రాన్సువాలువారెల్లరు భారతీయులను మురికి ప్రదేశములో వసించి వర్తకముచేయునట్లు శాసించియు మెల్లమెల్లగ దేశమునుండి వెడలగొట్టుటకును వలసిన శాసనములను చేయ నిశ్చయించిరి. ట్రాన్సువాలు పార్లమెంటు 1907 మార్చిలోకూడెను అప్పుడు జాతివైషమ్యము పూర్తిగ సభ్యుల నావరించియుండెను. అంతటనేకగ్రీవముగ, ఆలోచన లేకుండగ పార్లమెంటువారు 24 గంటలలో త్వరితముగ 1907 సంవత్సరపు రెండవచట్టమను పేర ప్రాత ఆర్డినెన్సు చట్టమునె మఱల శాసనముగచేసిరి! భారతీయు లిచ్చుకొనిన వినతి పత్రములు, మొఱలు, పెడచెవినిపెట్టిరి. వానిని చదువకనె పారవైచుటకును కొందఱు ప్రోత్సహించిరి. జోహానసుబర్గులోని "ట్రాన్సువాలు లీడరు" అనుపత్రిక "కాలనీయొక్క హక్కులను స్వాతంత్ర్యమును స్వయంనిర్ణయసూత్రమున పరిష్కరించు నిట్టిచట్టమె పార్లమెంటుచేసిన మొదటికార్యము. ఇది చాలబాగుగనున్నది" అని ప్రశంసించినది!! హక్కులులేని ప్రజలకొఱకు నియమింపఁబడిన సెల్‌బోరన్ ప్రభువుగారె దానిని బాగున్నదని హర్షింపగ నిది రాజాజ్ఞనిమిత్తమింగ్లాండునకుపంపబడెను. అప్పుడు సామ్రాజ్యప్రతినిధుల సభకుపోవుచు బోథాప్రధానమంత్రియు దానితో నింగ్లాండునకుఁబోయెను. ఈసమయమున నింగ్లాండులో సామ్రాజ్యమును గూర్చిన అభిమాన మధికముగనుండెను. సెల్‌బోరన్ గారును బోథాగారును లండన్‌లో ట్రాన్సువాలు ప్రతినిధియగు `సోలమనుగారును Agent general in London దీనిని అంగీ

కరించునట్లు చక్రవర్తిగారికి సలహానివ్వవలసినదని వలసరాజ్యాంగమంత్రియగు ఎల్గిన్ ప్రభుని ప్రోత్సహించి అట్లు చేయించిరి.

సత్యాగ్రహప్రారంభము:—1907 వ సంవత్సరము అక్టోబరు ముగియులోపల ట్రాన్సువాలులోని భారతీయులెల్లరును రిజస్టరు చేయించుకొనవలెనని శాసించిరి చట్టము షరతుల ప్రకారము రిజస్టరు చేయించుకోని ఎడల భారతీయులను దేశమున నుండతగని ప్రజలుగ తీర్మానించి శిక్షించుటకు మేజస్ట్రేటుల కధికారమివ్వబడెను. విద్యాధికులగు భారతీయులనుగూడ, ఈచట్టమువచ్చి బహిష్కరించెను. దీనిని భారతీయులు సాత్వికముగనె నిరోధింపదలచి అప్పుడు దేశములోనున్న 8000 మంది భారతీయులును సత్యాగ్రహ దీక్షను గైకొనిరి. ఎవ్వరును రిజస్టరు చేయించికొనలేదు. ఈక్రొత్తచట్టమును చక్రవర్తిగారు 1907 సంవత్సరము డిశంబరు 26 తేదీన అంగీకరించిరను వార్తవచ్చెను. అప్పుడె ఆశియావారి నాయకులకు రిజిస్ట్రేషను చేసికొననందున ట్రాన్సువాలును విడిచిపోవసినదిగ నేల ఆజ్ఞాపింప బడకూడదో తెలుపుకొన వలసినదిగ మేజస్ట్రేటుగారిచ్చిన నోటీసులును వచ్చినవి! వారేమనలేదు. వారిని దేశమువదలిపొమ్మని ఆజ్ఞాపించిరి వారుపోలేదు. అంతట వారిని అరెస్టుచేసి ఒక్కొక్కరికి రెండు నెలల విడిశిక్షైదు శిక్షవిధించిరి. 29-12-1907 వ తేదీన గాంధిగారు కోర్టులో తమకు పూర్తిగ శిక్ష విధింపుడనికోరిరి. కాని ఆయనకు రెండు నెలలు మాత్రమే శిక్షవిధించిరి. ఇంతలో క్రొత్తరిజస్ట్రేషన్ పత్రములను తీసికొని

రానందున భారతీయులకు, వీధులలో నమ్ముకొనుటకును, వర్తకము చేయుటకును (లైసెన్సు) అనుజ్ఞలివ్వక అట్టిలైసెన్సులు లేకుండ నమ్మినవారిని పట్టి శిక్షింపసాగిరి జోహానెసుబర్గు కారాగృహము నిండినది సత్యాగ్రహమహోద్యమము ఆగు సూచనలు కనబడుటలేదు. ప్రపంచమున పలువురు దీనినిగూర్చి విమర్శించిరి. నాగరక దేశముల కిది యాశ్చర్యము కలిగించెను. రిజిస్టరు చేయించుకొనవలసిన నియమితకాలము నారు నెలలని హెచ్చు చేసి ఎట్టకేలకు నష్టమునకు భయమునను 500 మందిని మాత్రమె ప్రభుత్వమువారు రిజిష్టరు చేయించగలిగిరి. దేశములోని భారతీయులు 7500 మందియు నీచట్టమును సాత్త్వికముగ నిరోధింప దీక్షవహించి నిర్భయముగ నిలచిరి. భారతీయుల పట్టుదలచూచి 1908 సం॥ జనేవరు నెలలో బోయరు ప్రభుత్వమువారు గాంధీ ప్రభృతులతో సంధిమాటలాడసాగిరి. అప్పుడు ట్రాన్సువాలు పరిభుత్వవలస కార్యదర్శి Colonial Secretary యగు స్మట్సు సేనాని ప్రభుత్వమువారు ఆశియావారి చట్టమును రద్దుపరుపవలెనన్నచో అందఱును రిజిష్టరు చేయించుకొనవలెనని. మెల్లగ నొకసంధి కుదిరెను. అప్పటికది గౌరవపాత్రముగనె కనబడెను. ఈసంధి వ్రాతమూలకముగ జరుగలేదు. 1907 సంవత్సరపు ఆశియావారి చట్టమును రద్దు చేయుటకును భారతీయులు తమంతట తామె ఇచ్ఛాపూర్వకముగ రిజిష్టరు చేయించుకొనుటకును వలసినగూర్చి ప్రభుత్వమువారేమైన్న నియమములను చేసికొనదలచినచో ఆశియావారికి మాత్రమెగాక ఎల్లరకును సమానముగ వర్తించు శాసనమును

**Imigration Registration Act** వలసనుగూర్చియు రిజస్టరుచే యించుకొనుటకును ప్రభుత్వమువా రేర్పరచు నియమములెల్లప్ర త్యేకవిధులందుగాక శాసనమునందెనిర్ణయించుటకును ఉభయ పక్షమువారు నంగీకరించిరి. గాంధీప్రభృతులను కారాగారము లనుండి వదలిరి. ప్రభుత్వమువారు స్మట్సుసేనానియు తమ వా గ్దానమును నెరవేర్చు కొందురని తలచి గాంధిగారు భారతీయు లనెల్లరను రిజస్టరు చేయించుకొనుడని బోధింపసాగిరి. అందుకు కొందఱు పఠానులకు కోపమువచ్చి గాంధిగారిని కొట్టిరి. కాని మూడునాలుగు నెలలలో భారతీయులెల్లరు రిజస్టరు చేయించు కొనిరి. కాని ప్రభుత్వమువారు తమమాట చెల్లింపలేదు. ఇంతి లో వారియుద్దేశ్యము బయల్పడెను. స్మట్సుసేనాని తనవాగ్దాన మును చెల్లింపడయ్యెను. భారతీయులు మొఱపెట్టుకొన్నను స్మట్సుసేనాని వినలేదు. నాయకులమాటలు లక్ష్యపెట్టలేదు. ఎట్టకేలకు గాంధిగారిని స్మట్సుసేనాని పిలచి ఆశియాశాసనము ను రద్దుచేయు చిత్తుచట్టమునొకదానిని ఆయనకు కనపరచి భా రతీయులలో కొందరిని దేశములోనుండి బహిష్కరించదలచితి మనియు అందుకు గాంధిగారంగీకరించినచో దీనిని చట్టముగ చేయించెదననియు పలికెను. స్మట్సుసేనాని యొక్క మోసము ను గాంధిగారు గ్రహించిరి. ఇందుల కంగీకరింపమనిరి. ఆశి యాచట్టమును రద్దుచేయుదునని వాగ్దానమె చేయలేదనియు అం దఱును పొరబాటు పడినారనియు స్మట్సుగారనిరి! గాంధిగారు మఱల సత్యాగ్రహసమరముచేయ నిశ్చయించిరి. చెరసాలల ను నింపిరి. ఈసందర్భమున నేటాలుకాంగ్రెసు అధ్యక్షుడు

దావూద్ మహమ్మదు, ఉపాధ్యక్షుడు రస్తుంజీ వాంజీగోర్ఖా షూ, కార్యదర్శి ఆంగ్లియాగారలును ఇతరవిద్యాధికులును ప్రభుత్వమువారి ద్విభాషులును, పూర్వము ప్రభుత్వమువారి పనులు చేసినవారును, దక్షిణాఫ్రికాలో బ్రిటీషుబోయరు యుద్ధమున, జూలూపితూరీలో పనిచేసి, పతకములనందిన స్వచ్ఛంద సేవకులును తమసోదరుల హక్కులకొఱకు వారి బాములఁ బాపుటకు ఇష్టపడి వారితో కష్టముల బడుటకువచ్చిరి. వారిని గవర్నమెంటు వారరెస్టుచేసిరి. ఎనిమిదిదివసములలో దేశమువిడిచి పొమ్మని ఆజ్ఞాపించిరి. వారట్లు పోవనందున వారికి కఠినశిక్షలు విధించిరి. గాంధిగారు మఱల చెఱసాలకేగి శిక్షననుభవించిరి.

మోసపోయి, వృధగ తెచ్చుకున్న" రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్టు"ల కొఱకిచ్చిన దరఖాస్తులు మాకు ఇచ్చివేయుడని భారతీయులుకోరిరి. కోర్టులలో వ్యాజ్యములు వేసిరి, కాని లాభము లేకపోయెను. జోహానసుబర్గులో సభ జేసిరి. అందు క్రొత్తగ నివ్వఁబడిన 2500 సర్టిఫికెట్టులను తగులబెట్టిరి. ఇందువలన గవర్నమెంటువారికి గుర్తించు నాధారమె పోయినది. వారు కండ్లు తెరచిరి.

మఱల సామము ప్రయోగించి గవర్నమెంటువారు సత్యాగ్రహనాయకులతో రాయబారములు సాగించిరి. 1907 వ సంవత్సరపు చట్టమును రద్దుచేయకుండగనె భారతీయుల బహిష్కారమును కొంతవఱకు తొలగించుచట్టమును జేసెదమనిరి. కాని ఇందువలన వారికిష్టమువచ్చినప్పుడు ప్రాతచట్టముయొక్క షరతులు మఱల నమలులోనికి వచ్చును. ఇదియుఁ

గాక క్రొత్తచట్టమువలన విద్యార్థులగు భారతీయుల స్థితియు బాగుపడలేదు. ఆశియాతెగవారి నాయకులు సభకూడిరి. గవర్నమెంటువారి రాజీపరతుల నేకగ్రీవముగ తిరస్కరించిరి. గవర్నమెంటును నమ్మజాలమనిరి ఇది నిజమైయున్నను. ఈనూతనచట్టమును పురస్కరించుకొని కొన్నిశిక్షలువేసిరి! భారతీయులిష్టపడనప్పటికిని క్రొత్తశాసనమును 1908 వ సంవత్సరపు 36 వ చట్టముగ పార్లమెంటువారు నిర్మాణముచేసిరి. భారతీయులు తుదియత్నముగ నింగ్లాండులోని వలసరాజ్యాంగ మంత్రిగారికి మొఱపెట్టుకొనుటకు మహాజరు పంపుకొనిరి. ఇది ప్రాతచట్టమంత యన్యాయముగ లేనప్పటికిని అక్రమముగనె యున్నదనియు గవర్నమెంటువారు ప్రాతచట్టమును రద్దుచేయుదుమని చేసిన వాగ్దానములను చెల్లింపనంతవఱకది తాముసహించి యూరకుండజాలమనియు, విద్యార్థులగు భారతీయులపైన కల బహిష్కారమును తొలగింపకపోవుట ఘోరమనియు చెప్పుకొనిరి. ఇదివారు చూచి పరిహారములు కలిగింపనిచో బ్రిటిషుపౌరసత్వపు హక్కులకు అర్థమేయుండదనియు ఇది చేయనిచో అందరిని సమానముగా పరిపాలింతుమని చేయబడిన విక్టోరియా రాణీగారు 1858 వ సంవత్సరపు ప్రకటనమె రద్దుపరచుటనియు హెచ్చరించిరి. ఈదీనాలాపములను బట్టి భారతీయులెంత నిరాసఁజెందిరో తెలియఁగలదు. అయినను "సెల్బోర్న్"గారు ట్రాన్సువాలు గవర్నమెంటువారు, వారి ఏజెంటు గారు, ఈమహాజరు సంగతిని తలపెట్టకుండగనె చక్రవర్తిగారి

చేత శాసనము నంగీకరింపఁజేసి అమలులోనికి తక్షణము వచ్చునట్లుజేసిరి.

గాంధిగారిని మూడవమారు శిక్షించిన తరువాత ఆయనను వదలిపెట్టి ఇతరులను కఠినముగ శిక్షించినచో ప్రజలు భయపడుదురని తలచి అప్పటినుండి భారతీయులను వందలకొలదిఅరెస్టుచేసి కఠినవరకములు విధించి దేశాంతరములకంపి బాధించు పద్ధతిని ప్రభుత్వమువారు మొదలిడిరి. భారతీయుల నెల్లరను క్రూరముగ చూచిరి. ఈసాత్త్విక నిరోధమహోద్యమమున 2500 మంది భారతీయులను దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారు చెరసాలలకంపిరి. వీరికి మూడు నెలలు మొదలు ఆరు నెలలవరకు వివిధములగు శిక్షలను ట్రాన్సువాలు కోర్టులు విధించెను. బాలమాదికి కఠినవరకమె విధింపఁబడెను. కొందఱు మఱలమఱల శిక్షింపఁబడుచుండిరి. అయిదారు మాఱులిట్లు జైలుకు పోయి వచ్చినవారును కలరు. పదునారేండ్ల బాలురు మొదలరువదేండ్లవృద్ధులవరకు కారాగారముల కేగిరి.

చెరసాలలోని కష్టములు:— చెరసాలకేగిన భారతీయులను ఆదిమనివాసులగు కాఫరుఖైదీలట్లు చూచిరి వీరువారను భేదము లేకుండ మొదటిరాత్రి ఎల్లర నొకగదిలోనే మూసియుంచుచుండిరి. ఇట్లొకమారు గాంధిగారిని ఒకమూకతో మూసియుంచిరి. ఆచీకటికొట్టులో జరిగిన ఘోరపాతకములు వర్ణనాతీతములు. ఇందొకమారు గాంధిగారికి ప్రాణభయము కూడకలిగెను. అచ్చటి యనారోగ్యము చెప్పనలవికాదు. అల్పావమాన అధికావమానములు చేయుటకు వలసిన సౌకర్య

ములైనలేవు గాంధిగారు దేహబాధ తీర్చుకొను నవసరమున నొక కాఫరువచ్చి తన రెండుచేతులతో నాయన నెత్తి కఠినమగు నేలపైఁ బడవైచెను. ఇట్టి యుదాహరణము లెఱిగియు తారతమ్యము లేకుండ నెల్లర నొక్కచోపడవైచి మూయుచుండిరి. చెఱసాలలోని నిర్బంధితుల కిచ్చు నాహారమును మా



ప్రిటోరియా చెఱసాల.

నవులకు తగినదికాదు. శుభ్రముగను లేకుండెను. కాఫరులకును భారతీయులకు నొకేవిధమగు నాహారమునిచ్చిరి. కొన్ని కారాగారములలో కాఫరులచేతనే వంట చేయించుచుండిరి. వారికి ప్రియమగు నెమ్ముకలు, క్రొవ్వును భారతీయుల కసహ్యకరములు. కొన్ని చోట్లలో మాత్రము దయదలచి నెయ్యినిచ్చిరి.

గాంధీగారిని ప్రిటోరియాజైలులోనుంచిరి. ఆయన ఒక పూటమాత్రమె భోజనముచేయుచు కాలముగడపెను. ఆయనకు నేతినిచ్చెదమనినను అందఱికిచ్చినగాని తానుతినననెను. ఆయన ఆరువారము లుపవాసముజేసి సోదరఖైదీల కష్టములను కొంత వఱకు తగ్గింపగలిగెను. ఆయనకు మూడుమాసముల కఠిన శిక్షవిధించియుండినను అదిచాలదని కాబోలు ఏకాంతవాస శిక్ష విధింపబడినవానివలె జైలులో నేకాకిగనుంచి శ్రమపెట్టిరి. భారతీయఖైదీలు తమకష్టము లుద్యోగులకు చెప్పుకొనునప్పుడు వారు చెప్పుజవాబు ఘోరముగనుండెను. "ఇక్కడ మీకెంతకన్న నేమిలభించును? బయటకావలసినంత గడ్డియున్నది" అనిరి ఇది సత్యాగ్రహదీక్షాపరులను కారాగారముల కంపునప్పుడు విధించిన శిక్షలలోని మరతుకాదుకదా!

భారతీయఖైదీల నెల్లరను జోహాన్సుబర్గు చెరసాల నుండి డిప్క్లూఫ్ (Dicpkloof) జైలునకంపిరి. ఇందువలన వారిస్థితిగతులు బయలుపడక మఱింత కష్టములపాలైరి. వారికచ్చట ముక్కిపోయినట్టియు పుచ్చినట్టియు బియ్యమిచ్చిరి. అదివారు తినలేకపోయిరి. కాని ఏమిచేయగలరు? ఈచెడు తిండివలన హౌటుపూర్టు (Hout Poort) జైలులోని వారికి చాలమందికి రక్తగ్రహణిరోగమువచ్చెను. వీరికి పండుకొనుటకిచ్చినసాధనములు చాలమలినములై అనారోగ్యకరములై నల్లులతోను మిణ్ణల్లులతోను నిండియుండెను. ఆచలిలో నీ ఖైదీలు చాలబాధపడిరి. వీరికిచ్చిన పనులునుచాలకఠినతరములైనవి వీరిపైనకాఫరులనుకాపుంచి కాఫరులుకూడ చేయనినీచపుబనులు

వీరిచేత చేయించిరి. జైళ్లలో వీరిపైన క్రూరమగు దౌర్జన్యము చేయుచుండిరి. వీరు జీవచ్ఛవములైరి సాధారణ నేరములు చేసిన వారికిని సత్యాగ్రహశిక్షితులకును భేదమును కారాగారములందు గమనింపలేదు గాంధిగారు శిక్షననుభవించుచుండగ 1908సం॥ సెప్టెంబరులో వోక్సురస్టు (Volksrust) చెరసాలనుండి జోహానసుబర్గుకు ఆయనసాక్ష్యము కావలసి ఖైదుదుస్తులతోనే బయటకు తీసికొనివచ్చిరి. చిన్నటోపి, ఖైదీసంఖ్య తెలుపు అక్షరములతోడి ముతకపొట్టిలాగు, ఒకకాలుకు తెలుపునొక కాలుకునలుపురంగుగలచిన్నమరాయి, ముతకమేజోడుచెప్పులు, నీమహానుభావునకు దివ్యాంబరములయ్యెను! ఆయనకు దారిలో నాహారమైన నీయక వీధులలో నల్లు నడిపించిరి. అధికారు లిది జరుగలేదనిరను పోలకుగారిది స్వయముగచూచి వ్రాసినారు. ఇంకొకమారాయనను సాక్ష్యముకొఱకె ప్రిటోరియా జైలు లోనుంచి సంకెలలతో కోర్టువఱకు పట్టపగలు నడిపించిరి! గాంధిగారిస్నేహితులగు యూరోపియనులకు కూడనిది చాలకష్టము కలిగించెను. ఇదిమెల్లసత్యాగ్రహుల నెట్లయిన లొంగదీయవలెననియె గవర్నమెంటువారు చేసిరి.

గాంధిగారి చెఱసాల యనుభవములు:—దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహసమరమున గాంధీగారు మూడుమారులు చెరసాలలోపడిరి. గాంధిగారి దారాపుత్రులును చెరసాలకేగిరి. తామనుభవించిన కష్టములను గూర్చి గుజరాతీ భాషలో గాంధిగారు ఇటీవల వ్రాసియున్నారు.

ఖైదీలను చూచుటకు పరీక్షకులు(Inspectors) వచ్చిన
ప్పుడెల్ల వీరులేచి వారికి వందనము చేయవలెను. వరుసగ నిలు
వవలెను. అచ్చట నాహారము మొక్కజొన్న అంబలియగు
టవలనచాలమందికి సరిపడలేదు అచ్చట చెరసాలలోనిగదు
లలో చాలమందినిపెట్టి యుంచుచుండిరి. 51 మంది యుండ
గినగదిలో 151 మంది నుంచిరి. దానికితోడు ఉమ్ములు
అనారోగ్యము, అంటురోగములును వచ్చెను. ప్రిటో
రియాజైలులోని గది 7 అడుగుల వెడల్పు 10 అడు
గులపొడవు. దీనినేల్పైన తారు. ఒక్కటేగవాక్షము! భార
తీయులను కాఫరులవలెనె చూచిరి. తెల్లఖైదీలకు పండుకొను
టకొక పరుపు, పలుదోముకొనుట కొక కుంచె, మోము చేతు
లు తుడుచుకొనుట కొక తుండుగుడ్డను, ఒక జేబురుమాలు
నిచ్చి భారతీయుల కేమియు నీయరు. ఈపక్షపాతమేల?" అని
గాంధిగారు వ్రాసినారు.

గాంధిగారికి కఠినవరకశిక్ష విధింపబడినప్పుడాయన చె
రసాలలో పొందిన అవమానములు పడిన కష్టములు వర్ణనాతీ
తములు. ఆయన జరిగినదానిలో సహస్రాంశమె చెప్పి యూర
కొందురు. ఒకమారొక వార్డరు మురికికుండు శుభ్రపరచుట
కిద్దరు మనుజులు కావలెనని గాంధిగారితోననెను.గాంధిగారె
మురికికుండు స్వయముగ కడిగి శుభ్రపఱచిరి. ఆయన వోక్సర
స్టు చెరసాలనుండి ప్రిటోరియాజైలునకు పోవునప్పుడు వర్షము
లో, ముండ్లవంటి రాళ్లుకలబాటపైన పాదచారియై నెత్తిమీద
మూటపెట్టుకొని నడచిరి. ఆయనను సాక్ష్యముకొఱకు తీసికొని

పోవునప్పుడు బహిరంగముగ శృంఖలములతో నడపించిరి. శిక్షల ననుభవించుచున్న భారతీయ సత్యాగ్రహులందరితో పాటునుఆయనయు చాలశ్రమలకోర్చిపనిచేయుచుండిరి., 'ప్రొద్దున 6 గంటలకే పనికి సిద్ధముగనుండవలెను. 7 గంటలకె పని ప్రారంభమగును. అది అనేకవిధములైనపని. త్రవ్వవలసిన భూమి చాలగట్టిగనుండెను. దానిని పారలతో త్రవ్వవలసి వచ్చుటవలన పని మఱింత కష్టతరముగనుండెను. దినమెల్ల చాలవేడిగనుండెను. పనిచేయు ప్రదేశమునకును జైలునకు ఒకటిన్నర మైళ్లదూరముండెను. మేము పనిచేయుటకలవాటుపడిన వారము కానందున చాలత్వరితముగనె అలసిపోవుచుంటిమి. ప్రొద్దుకడచిన కొలదిని పనిచాల కష్టతరముగ తోచుచుండెను. కావలియుండు వార్డరు [Warder] చాల కఠినచిత్తముతో నుండెను అప్పుడప్పుడు మమ్ములనదలించుచుండును. మాలోనొకని పాదములు వాచియుండెను. కొందఱేడ్చుచుండిరి. ఇదిచూచి నాగుండె పగులుచుండెను. నేను మాధర్మమునుగూర్చి హెచ్చరించుచుందును. నామట్టుకు నాపనికష్టమైనది. నాచేతులెల్ల పొక్కులెక్కెను. కొన్ని పుండ్లుపడినవి. నీరుకూడ కారుచుండెను. పారనె ఎత్తలేకపోయితిని నాకుబలము కలిగించి నేను చేయవలసినపనిని చేయునట్లనుగ్రహింపుమని పరమేశ్వరుని ప్రార్థించుచుందును. దేవునేనమ్మి పనిచేయుచుంటిని. చాల నాయాసము కలిగి కొంచెము శ్రమతీర్చుకొనుట కాగినంతనె వార్డరు నన్ను మందలించుచుండును. "అయ్యా నాధర్మము నే నెఱుగుదు" నని నేననుచుందును. జినాభాయిగారి శ్రమకోర్వలేక మూర్ఛపో

యిరి. అంతట నాయనపైన నీటిని చల్లుచు నిదియెల్ల నావలన కలిగినదికదా సత్యాగ్రహవిధానము నిట్లు నేను ఆచరించుట ప్రారబ్ధమైనచో నెంత పాపమని తలంచితిని కాని ఇదిధర్మమెయని నాకు తోచినది" అని గాంధిగారు వ్రాసినారు

వీరముత్తువాఙ్మూలము:—"వీరముత్తు అనే పేరుగలనాకు జూన్ 21 వ తారీఖున "సి" కోర్టులో 14 రోజుల కఠిన శిక్ష విధించినారు. లైసెన్సు లేకుండ బజారులో తిరిగి సరకులు అమ్మినందులకు ఈశిక్షవిధించినారు 22 వ తారీఖున నన్నితర భారతీయులతోపాటు కోటలోనుండి రోడ్డుపైన బిడారమునకు తీసికొనివెళ్లినారు. ఆబిడారములో మొక్కజొన్న అంబలి Mealie Pap తప్ప వేరుఆహారమును మాకీయలేదు మాకు అన్నము పెట్టుమని జైలువార్డరు నడుగగా బయట చాల గడ్డియున్నదని అతడు బదులుచెప్పెను. కుడారములలో చలియధికముగ నున్నను మనుష్యునకొక చాపయు నొకదుప్పటియు తప్ప వేరేదియు నీయలేదు. మాపైన కాపుంచిన ఆదిమవాసులగు వార్డరులు మమ్ముల నకారణముగ కొట్టుచు తిట్టుచు బాధించుచుండిరి. భోజనమునకు ముందు మామతాచారముల ప్రకారము పళ్లుతోముకొని స్నానముచేయవలసి యున్నను వారు మమ్మునట్లు చేయనీయలేదు. 14 రోజులట్లు నిషేధించిరి. 29 వ జూను ప్రాతఃకాలమున, నేను లేచి నాదుప్పటిని మడతపెట్టుచుండగనె ఒకవార్డరువచ్చి కఱ్ఱతో నాచేతులపైన కొట్టగా బొట్టనవ్రేలుపైన తగిలి అది చీలినది. అది యింకను మానలేదు. 6 వ తారీఖున మాతోపాటు శిక్షింపబడిన నాగప్పా అను

పదునెనిమిదేడుల కుఱ్ఱవానికి జబ్బుచేసినది. ఈసంగతి నేను ముఖ్యవార్డరుకు చెప్పితిని. అంతట నతఁడాతనిని పిలిపించి చూచి అంతయెక్కువగ లేదని జోహానస్ అను నేటీవు వార్డరు క్రింద బయట పని చేయవచ్చునని చెప్పెను. నేను పనినుండి మఱల పండ్రెండుగంటలకు వచ్చునప్పటికి ఆవార్డరు తన్ను దిట్టముగ కొట్టినాఁడనియు తనకు జబ్బుచాల నెక్కువగనున్నదనియు నాగప్పన్ చెప్పినాఁడు. ఆమరునాఁడు ఆదివారము. నాగప్పన్ వచ్చునట్లుండెను. నేను వానిని మెల్లగ ముఖ్యవార్డరు దగ్గరకు నడిపించి దీసికొనివెళ్లి రెండురోజులనుండి వీఁడేమియు తినలేదనియు చాల జబ్బుగ నున్నాఁడనియు పనిచేయలేఁడనియు చెప్పితిని. ఈపిల్లవానికెన్నాళ్లు శిక్షపడినదని వార్డరడిగినాఁడు. పది రోజుల శిక్షవిధింపబడినదనియు, బుధవారమునాఁడు విడుదలయగుననియు చెప్పితిని. అంతట నతఁడు "చావనిమ్ము" నుచు బాలుని వంకదిరిగి "గడ్డపలుగు, పార, పుచ్చుకొని తక్కినవారితో రోడ్డుమీదికిపో!" అనెను. బాలుఁడు మూల్గో వచ్చినాఁడు. అతని పనిముట్లును మేమే మోసి తీసికొని పోవుచు వానిని మెల్లగ నడిపించితిమి. పనిచేయుచోటుకు దగ్గరగవచ్చినప్పుడు అచ్చటి వార్డరు జబ్బుగానున్న బాలునిజూచి అతనినేల తీసికొని వచ్చితిరని అడిగెను అతఁడు నిలువఁబడలేనందున కూర్చుండుమనెను. రెండుగంటల తరువాత యూరపియను వార్డరు నాగప్పన్‌ను పిలచి మఱియొకచోటికి పిలుచుకొని పోవుటను చూచితిని.

నేనాసాయంకాలము బిడారము దగ్గర నాగప్పన్‌ను చూచునప్పటికి తనను మఱల పనిచేయుమనిరనియు తాను చేయలేక పో

యితఁనియు చెప్పెను. ఆమఱునాఁడు మంగళవారము నాఁడు మఱల వాఁడు మాతోఁ పనిలోనికి వచ్చెను. క్రిందటి రోజువలెనె మేమతని పనిముట్లను పుచ్చుకొని నడిపించితిమి. వాఁడు పని చేయ లేకపోయెను. వానికిం జబ్బుగనున్నచో నేల వచ్చెనని వార్డరు మఱల నడిగెను. ఆరాత్రి నాగప్పన్ నా ప్రక్కనె పండుకొనెను. మధ్యమధ్య దగ్గుచుండెను. ఆమరుసటి యుదయమున మాగుంపుతోఁ రోడ్డుపనికి రాలేదు. ఆరోజున వానిని విడిచిరి. తరువాత నాలుగవ జూలై తారీఖున మార్కెట్టువీధిలో జోహానసుబర్గులో నొకయింట మంచముపట్టి యుండగ నేను వానిని చూచితిని. నేను వానిని మాటాడించితిని. అతఁడు బదులు చెప్ప లేకపోయెను.”

వీరముత్తుప్రాలు.

ఈపైన సంగతులు యదార్థములని 1909 వ సంవత్సరము జూలై నెల 6న తారీఖున నాయెదుట ప్రమాణము మీఁద తెలియచేసినాఁడు.

డబ్ల్యు. ఎస్. కోస్.
జస్టిస్ ఆఫ్ ది పీస్.

ఇంకొక ప్రమాణవాఙ్మూలము:” ఏ. ఏ. మొదలి, అనే నాఁడు ,,షేకొట్టువాఁడు నేను లైసెన్సు లేకుండగ నమ్మకొందులకు జూన్ 21 తేదీన 10 రోజుల శిక్ష విధించినారు. తొంబ్బదిమంది

భారతీయులతో నన్ను రోడ్డుగుంపు బిడారమునకు 22 తారీఖు న తీసికొని వెళ్లిరి. అచ్చట మొక్కజొన్న అంబలి తప్ప వేఱు ఆహారమును మాకీయలేదు. మేము అన్నము అడుగగ వార్డరు బయట కావలసినంత గడ్డియున్నదనెను. గుడారములలో చాల చలిగ నుండినను వారొక్కొక్కని కొక్కొక చాపయు దుప్పటితప్ప వేఱేదియునీయలేదు. మాపైనం గావలి యుంచిన నేటీవు వార్డరులు మమ్ములను క్రూరముగ చూచిరి. సాలోమన్ జోహానస్ అను వార్డరులు నన్ను కొట్టినారు. వారినంబర్లు 115, 389, ఇతర ఖైదీలను చాల క్రూరముగ చూచిరి. మాకు శీతాకాలమున పలుదోము కొనుటకు గాని స్నానమునకు కాని నీటినీయలేదు. 18 సంవత్సరములవాడైన నాగప్పనకు 26 వ తేదిన చాలజబ్బుచేసినది. దీనిని గూర్చిరిపోర్టుచేసినాము. ముఖ్యవార్డరతనిని పిలిపించి చూచి అంతయెక్కువగ లేదనియు, పనిచేయం గలడనియు చెప్పెను. నాగప్పను పనిచేయుటను చూచితిని. ఆదివారమునాడు వాడేమియు తినలేకపోయెను. సోమవారము నాడు వాడు చాల జబ్బుగనుండెను. అయినను నాతోడిఖైదీలతనిని ముఖ్యవార్డరు దగ్గరకును తరువాత, రోడ్డుపనిచేయుచోటికిని వెంటబెట్టుకొని మెల్లగ పోవుటను నేను చూచితిని. బుధవారము ఆతనిని విడుదల చేసినారు. వాడు నడువలేక పోయెను. ఇరువుర మొకమైలు దాక మెల్లగ నతనికి చేయూతనొసంగి నడిపించితిమి. అంతట నొకబండిమీద వేసి తీసికొనిపోయితిమి. మేము రెండు గంటలన్నరకు విడువబడియు 7 గంటల కిల్లుచేరితిమి ఆపరనాడు నేను

నాగప్పను కొఱకు డాక్టరు గ్రీసు గారిని పిలువఁబోయితిని.

ఎ, వి. మొదలి వ్రాలు

పైసంగతులు నా యెదుట ప్రమాణముమీఁద తెలియ చేసినాఁడు

డబ్లియు. ఎస్. కోస్.
జస్టిస్. ఆఫ్. ది పీస్.

డాక్టరుగారి వాఙ్మూలము:—"నేను జూలై 1 వ తారీఖు నుండి నాగప్పకును చికిత్స చేసితిని. అతఁడప్పుడు చెరసాలనుండి విడుదలయై యుండెను. మొదటినుండియు అతఁడు బ్రదుకఁడని యె నాకు తోఁచినది. అతని చావునకు ముందుజరిగినవని చెప్ప బడుసంగతులు నిజములైయుండెనేని ఈచావును గూర్చి కొంత విచారణ జరుపుట యుక్తమని తోఁచుచున్నది. చెరసాల ఆవరణములలో జబ్బుగనున్న ఖైదీల విషయమున తీసికొనవలసిన జాగ్రత్తనుగూర్చి అటార్నీ జనరలుగారికి తెలుపవలెను. ఇవెల్ల నిజములైయెనచో నీపిల్లవాని చావునకు చెరసాలయొక్క ఉద్యోగులు తప్పుడినారనియె నాయభిప్రాయము.

డబ్లియు. గాడ్ఫ్రే వ్రాలు

నాగప్పన్ మరణపత్రమును Death certificate వ్రాసిన గాడ్ఫ్రేగారు చావునకు కారణము ముఖ్యముగ ఊపిరితిత్తుల రోగము (డబుల్ న్యూమోనియా) యనియు తరువాత గుండె ఆగిపోవుట యనియు జబ్బుకాలము తొమ్మిదిదినములనియు దేహమునిండ కదుములున్నవనియు వ్రాసినారు. ఈకాలమున ఇట్టి ప్రమాణ వాఙ్మూలములెన్నో ప్రకటింపఁబడియున్నవి.

ఈధర్మయుద్ధమున చాలమంది సంపదలు పోగొట్టుకొనిరి. కాచేలియాగారు గొప్పవర్తకుడు. రిజిస్టరైనట్లు గుర్తుపత్రము (సర్టిఫికెట్టు) నకలు తెచ్చుకొనందున ఆయనశిక్షకు పాత్రుడయ్యెను. మీమీసామానులను తీసికొని పొండని తనకు సరకులిచ్చిన వారిని వేడుకొనెను గాని వారంగీకరింపరైరి. ఆయనకు ఆస్తియున్నను ఆయనను దివాలా (ఇన్సాల్వెంటుగ డిక్లేరు) చేయసమకట్టిరి. ఈసమయముననె గవర్నమెంటు వారాయన నరెస్టుచేసి మూడునెలల కఠినశిక్షవిధించిరి. ఇట్లనేకులు కష్టములనొందిరి. స్వార్థత్యాగముచేసిరి. దీనివలనఅనేకులు యూరపియనులు బాగుపడిరి.

ఈశిక్షలెల్ల దక్షిణాఫ్రికాలోనుండుటకు సంపూర్ణహక్కులు అర్హతకలవారికే. చాలకాల మీదేశమునసుండి ధనమార్జించినవారు, ఉద్యోగములను సంపాదించినవారు. నాయకులు వారినెల్లరెఱుగుదురు. వారు రిజిస్ట్రైనట్లుగుఱ్తు పత్రము (సర్టిఫికెట్టు)లను తీసికొనని కారణమున గుర్తింపకలవికాకున్నదని పోలీసువారనజాలరు. వారిని పేరుపెట్టిపిలచియె గుఱ్తుకాగితము (సర్టిఫికెట్టు) నడిగి అరెస్టుచేసి శిక్షలువేయించుచుండిరి! రహస్యముగ మరల రిజిస్టరు చేయించుకొనుడని బలవంతము సేయుచుండిరి. ఇట్లు అన్యాయముగచేయించిన రిజిస్ట్రీషనుపైనను చాలలేవు కొందఱికుటుంబములలో ,,నా,, యనువారు మగవాడొక్కడైనను లేకుండ చెఱసాలలకు పోయిరి. ఒకమారు పోలకుగారు ప్రిటోరియాలో మద్రాసువారిని సభకూడమనగ పండ్రెండుగురు మాత్రము కనబడిరి. తక్కినవారేమైరని విచా

రింపగ చెరసాలలో నుంచిరని తెలిసినది. అంతట జీవనము కొఱకు పిల్లలను రక్షించుటకొఱకు మద్రాసు స్త్రీలే కూరగాయలనమ్ముకొనవలసివచ్చెను! జెర్మిస్టౌనులో నొకస్త్రీకి జీవనము సాగక తనభర్తతో తనను చెరసాలలో నుంచుడని ప్రభుత్వమువారిని వేడుకొనెను. చాలమంది ట్రాన్సువాలు స్త్రీలు మహారాజ్ఞికి మహాజరు నంపుకొనిరి. ఈబాధలు భరింపలేక సాహాయ్యము చేయువారులేక కొంతమంది లొంగిపోయి శాశ్వతముగ సిగ్గుజెంది తరువాత నపరాధముగ నీచస్వాద్యమము కొఱకు పాటుపడిరి. వీరిధనసాహాయ్యమున నింగ్లాండునకు, ఇండియాకు రాయబారములు పోయెను. ప్రతిఘాతులు దుర్భరములయ్యెను!

---

# దక్షిణాఫ్రికా

## VI

### గాంధీవిజయము

పోలకుగారు:— గాంధిమహాత్మునకు ఆరంభించిన సాత్విక నిరోధమహోద్యమమున ఆయనకు హెచ్. ఎస్. ఎల్ పోలకుగారు కుడిభుజమై మెలగిరి. పోలకుగారు చెప్పుకొనరు గాని నిజముగ నాయనపడిన శ్రమము వర్ణనాతీతము. తాను మతమున వర్ణమున భారతీయులకు భిన్నముగనున్నను, సుప్రీముకోర్టు న్యాయవాదియయ్యు, స్వార్థత్యాగముచేసి వారముల కొలది నిద్రాహారములు లేక శ్రమపడి గాంధిగారు చెరసాల లోనుండినప్పుడు భారతీయులకు నాయకుడై సత్యాగ్రహము ను చేయువారి కనేకవిధముల సహాయ్యముచేయుచు ఉపన్యాసము లిచ్చియు వ్రాసియు వారివిషయమున పనిచేయుచుండిరి.

సత్యాగ్రహ ఉద్యమతత్వము:— „గాంధిగారి యందలి భక్తి విశ్వాసములతో ప్రజలయందాత్మవిశ్వాసమును స్వార్థ త్యాగమును ఓరిమిని కష్టములనుభవ ధైర్యమును కలిగించినది. సత్యాగ్రహమును బూనిన ప్రజలనేకమారులు శిక్ష ననుభవింపబోవుచుండిరి. గాంధిగారు చావుమనినచో చచ్చుటకు సిద్ధముగనుండిరి. ఆయనకర్మయోగి. ఈచట్టమును తొలగించుట

భారతీయులస్థితిని బాగుచేయుటయు సత్యాగ్రహదీక్షాపరుల యాశయము. వారి యాశయములు న్యాయమైనవె. వారుగవర్నమెంటునకు మార్పు ప్రయత్నించుచున్నారనుట పొరబాటు. గాంధిగారి సత్యాగ్రహము భగవద్గీత, బైబిలు గ్రంథములలోని మతాచరణమె. టాల్‌స్టాయిగారి „స్వర్గము నీయందెయున్నదను వ్యాసము గాంధిగారి మతిమునకు తోడైనది„ అని దక్షిణాఫ్రికాలో నొక క్రైస్తవ గురువు అగు డోక్‌గారు „దక్షిణాఫ్రికాలోని భారతీయదేశభక్తుడు„ గ్రంథమున వ్రాసినారు. తానొకమారు గాంధిగారిని ప్రశ్నింపగ „సత్యాగ్రహమె సరియైన మార్గము, మనకిప్పటున్న కష్టముల బాపుటకేగాదు మనభరతఖండమునకు గూడ నిదియె మార్గము„ అని చెప్పిరనియు వ్రాసినారు.

గాంధిమహాత్ముడు బోధించిన సత్యాగ్రహదీక్షను అనేకమతములవారు తెగలవారు పూని ఏకమత్యముతో మెలగిరి అందరును తమసోదరుల కొరకు క్రమముగ శిక్షలననుభవింపసాగిరి.

ప్రభుత్వమువారి తంత్రము:— నేటాలుగవర్నమెంటువారితో ఇండియానుండి వచ్చువారిలో మగల రిజిష్టరు చెయించుకొనుట కంగీకరింపని వారిని తమదేశమునుండి రానీయవలదనియు తిరిగి వెనుకకు పంపుమనియు ట్రాన్సువాలువారు చెప్పిరి. మఱియు పోర్చుగీసు గవర్నమెంటువారిని అచ్చటికి దేశాంతర వాసమంపిన భారతీయులను హిందూదేశమునకు పంపివేయునట్లును పోత్సహించిరి. ఇది అక్రమమనియు, భారతీ

యులు సుప్రీముకోర్టులో నభియోగములు తెచ్చి యీవిషయ
మున జయమునొందుదురనియు వారెఱుఁగుదురు. అందువలన
నె వారిట్లు పోర్చుగీసువారితో రహస్యముగ నేర్పరచుకొనిరి.
పోర్చుగీసువారిదేశమునకు దేశాంతరము పంపి యచ్చటినుండి వా
డలగొట్టించుట న్యాయముగనె యున్నదని సామ్రాజ్యప్రభుత్వ
ము వారు హర్షించిరి! దీనికొక కారణముండెను. నిజముగా
వలసరాజ్యములలో నెలకొని హక్కులు సంపాదించియుం
డినవారిని మాత్రమె ఇట్లు వెడలనంపుచున్నామని ట్రా
న్సువాలువారు సెల్బోర్న్ ప్రభువుచేత బ్రిటిషువారికి తెలుపు
చుండిరి. అందువలననె బ్రిటీషు ప్రభుత్వము వారిది హర్షించి
సహించిరట.

ఆక్షణముననె ట్రాన్సువాలులో చాలకాలమునుండి
వసించుచుండిన మాంజీనాథూభాయిగారిపదునాఱేండ్ల కొమా
రుడు తన చిన్ననాటనుండియు నక్కడనెయుండి రిజిష్టరుకూడ
కాగడియు నీప్రకారము దేశాంతరమున కంపఁబడెను! పోలకు
గారు తాము గాంధీగారికి పోవుపంపిన యోజలోనె ఇట్లు
అక్రమముగ పంపఁబడిన వారారుగురుండినట్లు వ్రాసినారు. ఇట్టి
యుదాహరణము లింకను చాలవ్రాసియున్నారు. తరువాత కొ
న్నాళ్లకు రిజిష్టరైన వారిని దేశాంతర వాసమున కంపఁగూడ
దని సుప్రీము కోర్టువారొక వ్యాజ్యమున తీర్పుచెప్పిరి. కాని,
ఈలోపున ట్రాన్సువాలులోనె పుట్టి పెరిగినవారి ననేకులను
గవర్నమెంటువారు వెడలగొట్టి పుణ్యముఁ గట్టుకొనిరి. ఇట్టి
సందర్భములో నింగ్లాండులో సెలీగారు దేశములో నివసించు

వారినట్లు పంపుటయె లేదని పలుకసాహసించిరి! ఇట్లు దేశాంతరముల కంపబడిన వారిసంఖ్య కొన్నివందల వరకునుండెను. ఒకకోర్టులో నొక్కమారుగ 92 మందిని దేశాంతరమునకంపిరి.

భారతీయుల రాయబారములు:— ఇక నొక్కమారు తుదిపలుకుగ, కడపటి వేడుకోలుగ, నింగ్లాండు వారికొక ప్రార్థనమును భారతీయులకొక సందేశమును దక్షిణాఫ్రికా భారతీయులు పంప నిశ్చయించుకొనిరి. 1909 సం॥ జూను నెలలో రెండు రాయబారములను సిద్ధముచేసిరి ఇంగ్లాండునకు పోవుటకు ట్రాన్సువాలు బ్రిటీషు భారతీయ సంఘాధ్యక్షుడగు కాచేలియాగారును కార్యదర్శియగు గాంధిగారును ప్రిటోరియాసంఘ కార్యదర్శియగు హాజీహబీబుగారును తమిళసంఘాధ్యక్షులగు వి. ఏ. చెట్టియారుగారును, ఎన్నుకొనబడిరి. ఇండియాకు పోవుటకు పూర్వము ప్రభుత్వమువారి కొలువున జోహానసుబర్గులో తపాల కార్యస్థానాధికారి కామాగారును ట్రాన్సువాలు బ్రిటీషుఇండియన్ సంఘ కోశాధిపతి Treasurer అగు ఈ. ఎస్. కువాడియాగారును తమిళసంఘకార్యదర్శియగు ఎస్.పీ. నాయుడుగారు నెన్నుకొనబడిరి. వీరివలకు రాగనె కాచేలియా చెట్టియారుగార్లను కామానాయుడుగార్లను అరెస్టుచేసి కఠిన శిక్షలువేసిరి. అంతట హాబీబు గాంధిగార లింగ్లాండునకు పోయి 1909 సం॥ జూలై 10 వ తేదీన చేరిరి. పోలకుగారు మాత్రము ఇండియాకునచ్చిరి. నిజముచెప్పడకుండ గవర్నమెంటువారిట్లు చేసిరనగ మాకేమియు తెలియదనియు నరెస్టులకు దీనికి సంబంధము లేదనియు వారనిరి ట్రాన్సువాలు వలసకార్య

దర్శియగు స్మట్సుగారి భయమును వారిచర్యలే బయలుపరచినవి. ఇంగ్లాండునకు పోయిన గాంధిగారును హాబీబుగారును కూ్రిప్రభువుగారిని దర్శించిరికాని ప్రయోజనము లేకపోయెను.

హిందూదేశమునకు దక్షిణాఫ్రికా భారతీయసమస్య తెలియచేయుటకు వచ్చిన పోలకుగారు గోపాలకృష్ణ గోఖలే గారి ఆధిపత్యమున నున్న హిందూదేశ సేవకుల సంఘము (Servants of India Society)వారి కడకతిథియై వచ్చెను. వారు వీని నాదరించి దేశములో బొంబాయి మొదలు రంగూను వరకును, మద్రాసునుండి లాహెూరు వరకును ఎల్ల యెడల సభలనుచేసి దక్షిణాఫ్రికా సంగతి వెల్లడించిరి భారతీయుల హృదయములు కరిగెను. వారిసోదరులపైన సానుభూతియు కలిగెను. రతన్ తాతాగారు 10,000 పౌనుల విరాళము నీయుద్యమమున కొసగెను. దేశములోని వారెల్లరును విరాళముల నొసగిరి. గోఖలేగారు కలకత్తాలోని సామ్రాజ్యశాసన సభయందు వలస నాపవలసినదను తీర్మానము నుపపాదించిరి. 13 నెలలు దేశములో ఈవిషయమును గూర్చిన ఆందోళనము జరిగెను. దేశములో ప్రతిగ్రామమునుండియు ప్రజలు తమయసమ్మతిని వెల్లడించిరి. దేశాంతరముల శిక్షలు విధించి భారతీయులను వెనుకకంపవలదని ఎల్లరనిరి. హిందూదేశపు ప్రభుత్వము వారి సలహాల ననుసరించి సామ్రాజ్య గవర్న మెంటువారు ఉత్తరువులొసగిరి. తరువాత వెనుకకంపబడినవారు మరల దక్షిణాఫ్రికాకు బోయిరి.

దక్షిణాఫ్రికా సమితిస్థాపనము, భారతీయులు:—ఇంతలో దక్షిణాఫ్రికా వలస రాజ్యములు నాలుగును సామ్రాజ్య ప్రభుత్వము వారి శాసనము ననుసరించి దక్షిణాఫ్రికా సంయుక్తరాష్ట్రసమితి ప్రభుత్వమున గలసినవి. బోథాగారు ప్రధానమంత్రియైనాడు. స్మట్సుగారు స్వదేశమంత్రి (Minister for the Interior.). అంతట బ్రిటీషుసామ్రాజ్య ప్రభుత్వమువారు భారతీయసమస్యయొక్క న్యాయమును గమనించి నూతన సందర్భముల ననుసరించి 1910 అక్టోబరు 7 వ తారీఖున నొక సలహాను దక్షిణాఫ్రికా సమితి ప్రభుత్వము వారికంపిరి. 1907 సంవత్సరపు 2వ చట్టమును రద్దుపరుపవలసినదనియు వర్ణభేదముల వలని కష్టములను తొలగింపుడనియు జాతిభేదము లేని శాసనమును భారతీయులు కోరినటుల వలసను తగ్గించి భారతీయపురోభివృద్ధి కావశ్యకులగు విద్యాధికులను మాత్రమె రానిచ్చు చట్టమును చేసికొనుడనియు సముద్ర తీరమున నివసించుచున్న భారతీయులహక్కులకు భంగము కలిగించుపనులు తమకనిష్టమగుననియు హెచ్చరించిరి. దీనికి సమితి ప్రభుత్వమువారు స్నేహభావముతోనె ప్రత్యుత్తరమంపిరి. కలహముకొంచెము తగ్గెను. 1911 లో నొకసమితి వలస చట్టమును ఈతగవులను తీర్చుటకని నిర్మించిరి కాని దీని వలన 1907 వ సం॥ చట్టమును రద్దుచేయుచు కోర్టువారు మైనరుల విషయమున నిచ్చినతీర్పునిలిపి తక్కినవారి హక్కులనెల్ల ప్రాత చట్టమునందువలెనె వర్ణభేదముబట్టి నిర్ణయించెను. ఈభేదము సమితి పాలనమునందెల్లప్రాకెను. ఆరెంజి రాజ్యములోనికి పోవు

హక్కుల విషయమున ట్రాన్సువాలులోని భారతీయులకే గాక సముద్రతీరమున నుండు భారతీయుల హక్కులుకూడపోయెను. ఆందఱేక గ్రీవముగ మొఱపెట్టుకొనిరి. అంతట మఱల సమాధానపుమాటలు జరిగెను. సత్యాగ్రహులు ఈచట్టమును తీసివేసి ట్రాన్సువాలుకు మాత్రమె వర్తించుచట్టమునుచేయుమనిరి కాని యిది వినలేదు. ఈచట్టము నమలులోపెట్టుటే కష్టమయ్యెను. అందువలన నొకవిధముగ రాజీ కుదిరెను. భారతీయులు సత్యాగ్రహము నిలుపుటకును గవర్నమెంటువారు 1912 లో కొంచెము త్వ్రరితపఱు శాసనములు చేయుటకును ఈలోపుగ నేమార్పును లేకుండగనె ప్రాత శాసనములతో పరిపాలించుటకును ముఖ్యముగ ట్రాన్సువాలులోనికి వచ్చినకొందఱు భారతీయులకు సౌకర్యము నిచ్చుటకును సంధిపొసగెను. చక్రవర్తిగారి పట్టాభిషేకమహోత్సవ సందర్భమువచ్చెను. ఈరాజీయైన తరువాత కొంచెము విరామముగ నున్నందున భారతీయుల హక్కుల విషయమగు నాందోళనముయొక్క నిజస్థితిని బ్రిటీషువారికి తెల్పుటకు కొందఱను రాయబారమంపిరి. 1912 వ సంవత్సరములో చేసెదమన్న శాసనమునిష్ప్రయోజ నమైనది. రాజీకాల మింకొక సంవత్సరముపాటు పొడిగించిరి.

గోఖలేగారు:— ఈకాలముననే మాననీయు లగు గోపాలకృష్ణగోఖలేగారుదక్షిణాఫ్రికాకు వచ్చిరి. ఆయన సంగతిసందర్భములను స్వయముగ చూచి ఈవిషయమున నిదివరకెన్నడు నెవ్వరును చేయజాలని పరిశ్రమ చేసి సామ్రాజ్యప్రభుత్వము వారియందు గొప్ప సంచలనము కలిగింప కలిగెను.

ఆయన నెమ్మది, రాజనీతి వైరివర్గమును కూడ పొగడ్తనొందెను. భారతీయ ప్రభుత్వమింకొక సంవత్సరము వరకును వలస నిషేధించు పద్ధతిని 3 పౌనులు తలపన్నును తొలగించెదమని యుచ్ఛరి గవర్నమెంటు వారి కాలమున ఈయనకు వాగ్దానము చేసిరి.

క్లిష్టపరిస్థితులు:—1913 వచ్చినదికాని ప్రభుత్వమువారు వాగ్దానము నెరవేర్చలేదు. 3 పౌనలతలపన్ను తీసివేయుటకు నిరాకరించిరి. భారతీయుల వివాహములే శాసనసమ్మతములు కావని సుప్రీము కోర్టువారొక తీర్పుచేసిరి. శాంతి కావలెనన్నచో నీవిషయమున పక్షభేదమును మాని వివాహముల సమస్య పరిష్కరింపవలెనని గవర్నమెంటువారికి పలువురు చెప్పిరి. 3 పౌనులపన్ను పోలేదు. స్త్రీలకు మాత్రము తలపన్ను తీసివేయుటకొక శాసనము చేయగ నిదిమాత్ర మెందుకని ప్రతిఘటింపగ నుపసంహరింపబడెను. వివాహ చట్టమునకు మార్పులు గవర్నమెంటువారు చేసిరి. ఒక పెండ్లాము పెండ్లినంగీకరించినను సత్యాగ్రహులకిది లాభకారి కాలేదు. శాసనమును మఱల ప్రారంభింపకుండ మానుటకు వీలుండునేమో యని భారతీయ నాయకులు సామమునుపయోగించి చూచిరి మఱలవచ్చు పార్లమెంటు సభలో వీరికష్టములు తొలగించు శాసనము చేయుదుమనియైన చెప్పగలరేమోయని చూచిరి. గోఖలేగారు ఇంగ్లాండులో భారతీయుల కొఱకు పనిచేయుచుండిరి. వారికి కష్టములను వాగ్దాన భంగమును తెలుపుచు గ్రీనీస్సువారు సరియైన పరిహారము చేయనిచో సత్యాగ్రహులు ఇంక నెక్కుడు కోర్కెలు కోరి తమసమరమును ద్విగుణీకృత భావముతో చేయుదురని గ్రీనీస్సు

వారికి తెలుపుడనిరి. ఈ ప్రయత్నములు ధర్మపద్ధతులును సమితి ప్రభుత్వము వారు గమనించలేదు. లెక్కచేయలేదు. రాజోవు పార్లమెంటుసభలో భారతీయుల వివాహముల నంగీకరించి వర్ణభేదము తొలగించి ఆరెంజిరాజ్యములో దక్షిణాఫ్రికాలో పుట్టినవారికి పౌరహక్కులనిచ్చి 3 పౌనుల పన్ను తొలగించి భారతీయుల కక్రమకష్టము కలిగించు శాసన పరిపాలనము మానినగాని సత్యాగ్రహము ప్రారంభించ వలసి వచ్చునని భారతీయులనిరి. ఈ పరిస్థితులను చెప్పుటకు పోలకుగా రింగ్లాండుపోయిరి. గోఖలేగారచ్చటనె యుండి యుపన్యాసము లిచ్చుచుండిరి ఈసంగతులను గూర్చి ఆంప్తిల్ ప్రభువుగారు లార్డ్సు సభలో నుపన్యసించెను. సమితి ప్రభుత్వముఃవారు సంస్కరణము చేయుదు మనరైరి. 1913 శెప్టెంబరు 12 తారీఖున సమితి ప్రభుత్వమువారికి కాచేలియాగారు ఈ సంస్కరణములు చేసినగాని సాత్విక నిరోధము ప్రారంభింతుమని లేఖవ్రాసిరి. ఆక్షణమున గోఖలేగా రింగ్లాండునుండి అనారోగ్యముగానుండియు ఈవిషయమున భారతీయులకీ సంగతులుచెప్పి తమ హైందవ ప్రభుత్వమువారిచే నేదైన చేయింపవచ్చునని భరతఖండమునకు పోయిరి.

సాత్వికనిరోధ యుద్ధ విధానముః— సెప్టెంబరు 28 వ తేదీన స్వదేశమంత్రిగారి కీపరిస్థితులను గూర్చియు సమరము తప్పదనియు గాంధిగారు వ్రాయుచు తమ లేఖలో తమసాత్విక నిరోధ విధానమును చెప్పిరి. 3 పౌనుల నిచ్చుకొనవలసిన వారిని పన్నివ్వ వలదనియు అట్లివ్వనందున విధింపబడుశిక్షలననుభవింపుడనియు బోధించి సాత్వి

క నిరోధముచేయుట, ఒడంబడిక పత్రములువ్రాసి కూలిపనిచేయుచున్నవారిని మునుముందు తామిచ్చుకోవలసి వచ్చునట్టి ఈపన్ను రద్దుచేయువరకును పనిమానుడని ప్రోత్సహించి మాన్పించి యందులకు శిక్షలు పొందుటయు సత్యాగ్రహ విధానముగ చేయబడి సత్యాగ్రహము ప్రారంభింప బడుననియు ప్రభుత్వమువారు గోఖలేగారికి చేసిన వాగ్దానమునుగూర్చి ఆంప్టిల్ ప్రభువుకూడ ప్రభువులసభలో చెప్పియున్నందున ఇప్పుడైనను స్మట్సుసేనానిగారు తమయుద్దేశ్యమును మార్చుకొనవలసినదని గాంధిగారువ్రాసిరి. ఈలేఖను కార్యదర్శిగారు మంత్రిగారగు స్మట్సుసేనానికి చూపిరి. అతఁడేజబాబును నీయలేదు. ఈవాగ్దానము చేయబడలేదనియు చెప్పలేదు. కూలీల యజమానులకు భారతీయ నాయకులు నిర్ణయించిన సత్యాగ్రహవిధానమును గూర్చి చెప్పలేదు. ఇదిజరిగిన ఒక వారములో ఈపన్ను రద్దుచేయబడువరకును వలసకూలీలను కూడ పనిమానుడని సత్యాగ్రహనాయకులు నిర్ణయించినట్లు రైటరుతంతివార్తలుపంపినారు. ఈమూడు సత్యాగ్రహసమరమునందు భారతీయనారీమణులుకూడ ప్రవేశించిరి. భారతీయవివాహములు ధర్మశాస్త్రమునచెల్లవని ప్రభుత్వమువారి ప్రోత్సాహమున సుప్రీముకోర్టువారు తీర్మానించినందున స్త్రీలుసాత్వికనిరోధముప్రారంభించి, వీరీనిజింగ్. జెర్మిష్టన్, వోక్సురస్టులలో శిక్షను పొందగోరిరికాని వారినేమి జేయక నేటాలులోనికిబోనిచ్చిరి. నేటాలులో నుత్తరభాగమున బొగ్గుగనులలోని కూలీలను పనులుమాని ఈవలకు రమ్మనమని స్త్రీలే ప్రోత్స

ంచి సమ్మెసాగించిరి. సీ. కే. టీ. నాయుడుగారి నాయకత్వమున స్త్రీలు న్యూకాసిల్‌లో జేరి ఒకగనినుండి యింకొక గనికిపోవుచు భారతీయకూలివారిని సమ్మెకట్టుడని బోధించిరి. అంతటకూలివారు పనులుమానిరి.

స్మట్సుసేనాని అసత్యము:—గనుల యజమానులకు భయాశ్చర్యములు కలిగెను. మజిల వస్తురేమోయని కూలివారికి తిండిక భత్యమిచ్చుచుండిరి, కాని వారుపనులలోనికి రాలేదు యజమానులెల్లరు డర్బన్‌లో సభచేసి గాంధిగారిని పిలచి సమ్మెయెందుకనిరి. 3 పౌనులపన్ను రద్దుచేయువరకే సమ్మెయనియు సపన్ను రద్దుచేయబడునని ప్రభుత్వమువారు వాగ్దానము చేసియు చెల్లించలేదనియు పలికిరి. గనుల యజమానులు వాగ్దానము సంగతి యేమని స్మట్సుసేనానికి తంతినంపిరి. అంతట నతడట్టివాగ్దానమే చేయబడియుండలేదనెను! ఆయనతో ఆసమయమున నుండిన సిపయుగారు మాత్రమిది చేయబడలేదని చెప్ప సాహసింపలేకపోయిరి. గోఖలేగారు తమకట్టి వాగ్దానము చేయబడిన సంగతి వాస్తవమేయని తంతివార్త నంపెరి. గవర్నమెంటువారును గనుల అధికారులును భీష్మించుకొని కూర్చునిరి. గనులవారిని పనిచేయుమని నిర్బంధింపసాగిరి. గాంధిగారు న్యూకాసిలులో స్త్రీలను పిల్లలను పోషించుచుండిరి అక్కడి నలుప్రక్కలనుండియు భారతీయ కూలీలు గనులవారు అందరును వచ్చి చేరిరి. డండీమొదలు లేడీస్మిత్తువరకును గనులు జనశూన్యములయ్యెను. వీరికి అల్బర్టు క్రిష్టఫర్ అను ఆయనయు కొల్లెన్ బాన్ అను నాయనయు సాహాయ్యము చేసిరి మ్యూని

సిపాలిటీవారితో పోరాడిరి. బీదలను పాలించి రోగులను కాపాడిరి. స్త్రీలు కష్టమునకు ఓర్చుకొనిరి. రోడ్డుమీద నిలువ నీడలేక తనబిడ్డ చనిపోవుచుండగ నొకవీరమాత పోయినవారికై వగచిన నేమికార్యము బ్రతికియున్నవారికై పాటుపడవలెనుకాని. అనినది! స్త్రీపురుషుల కెల్లరకిట్టి దీక్షకలిగెను.

ట్రాన్సువాలుదండయాత్ర:—పనిమానివచ్చిన కూలీల గుంపులు వృద్ధియయ్యెను. సమితిప్రభుత్వము వారి పరిస్థితులను గమనించి లక్ష్యపెట్టి బాధ్యత వహించునట్లులేదు. ఈప్రజల నెల్లరను ట్రాన్సువాలులోనికి నడిపించి వలసచట్టము హద్దుమీరిననేరమునకు శిక్షలనుపొంది సాత్విక నిరోధము చేయుటయెకర్తవ్యముగ గాంధికారికి తోచినది. అంతట ప్రజల నెల్లరను ఛార్లెసుటవునుదగ్గరకు జేరుడనిరి. ఈశాంతి సైన్యమును 1913 సం॥ సెప్టెంబరు 30వ తారీఖున గాంధిగారే స్వయముగ నడిపించిరి. సైన్యము కదలుట ప్రారంభింపకముందే ప్రభుత్వమువారు కొందఱు పనివారలను అరెస్టుచేసి పనిమానినందుకు శిక్షించి చెరసాలకంపిరి. ప్రతిదినమును వందలకొలది ఛార్లెసుటవునుకు పోవుచుండిరి. ఛార్లెసుటవునులోని (హెల్తుఆఫీసరు) వైద్యాధికారిగారు వీరువిడిసిన స్థలమును జాగ్రత్తగ చూచుచుండిరి. ఇతరయూళ్లనుండి సామగ్రులను భారతీయవర్తకులంపిరి హిందూదేశమునుండి విరాళములు వచ్చుచుండెను. సమ్మెవారి సంఖ్య మూడువేలయ్యెను. పురుషులు స్త్రీలు బాలురుచేరిరి. గాంధిగారధికారులకు తాముట్రాన్సువాలులోనికి చొరబడ దలంచితిమని తెలిపినను వారులక్ష్యపె

ట్టలేదు. మఱల కొందఱిని అరెస్టు చేసిరి. ఒక వారముతరువాత స్త్రీలను బాలురను ఫాక్లెసుటంపులో విడిచి 2000 ప్రజలతో గాంధిగారు ట్రాన్సువాలు సరిహద్దుదగ్గర సాగిరి. ముందుగా పోలీసువారితో చెప్పిరి. గాంధిగారు రాత్రింబవళ్లు సామాన్యజనులతోపాటు కష్టపడిరి ఆహార నిద్రలుమాని పని చేయుచుండిరి. గాంధిగారు పోలీసువారితో మాట్లాడుచుండగనే ఈ పెద్ద సమూహము బీదరికమును తెలుపు చిన్నగుడ్డలతో నెత్తిమీది మూటలతో వోఖ్సరట్టు వీధులందు కేకలిడుచువచ్చి పోలీసువారి నొకప్రక్కనుండి త్రోసికొనిపోయి పట్టణమున కావలిప్రక్క విడిసిరి. ఈ శాంతి సైన్యము దినమున కిరువదైదు మైళ్ళచొప్పున జోహానసుబర్గుకు దగ్గరనున్న లాలీలోని "టాల్స్టాయి' ఆశ్రమమును కడకు ఎనిమిది దినములలోపోవుటకును ప్రతిసుకొను లోను ప్రభుత్వమువారికి తెలుపుచుండుటకును ఏర్పాటుచుకొనిరి. ఈలోపుగ నరస్టు చేయబడి శిక్షింపబడిన మఱియు మంచిది. ఆరాత్రి శాంతి సైన్యము **Palm Ford** పాంఫోర్డు చేరెను. అచ్చటనొకరు గాంధిగారి కాతిథ్యమీయవచ్చిరి కానిఆయన అంగీకరింపక తక్కిన వారితోనే యుండెను. గవర్నమెంటు వారూరుకొనక గాంధిగారి నరెస్టుచేయుమని వారంటు పంపిరి. ఆయన వారంటుకు లోబడి తనపైన సాక్షులనుదానే పేర్కొనెను. ఆయనసంతోషముగనే ట్రాన్సువాలు వలసచట్టముహద్దుమీఱిన నేరము సంగీకరించెను. గాని తనప్రజలకు నాయకుడు లేక అసహాయులగుదురని ఏదైన ఏర్పాటు చేసివచ్చుట యవసరమగుటవలన

భారతీయ శాంతి సైన్యము, ట్రాన్సువాలు దండయాత్ర.



'వోక్సురస్టు పట్టణమున కావల విడిసిరి.'

పుట ౧౧౪.

భారతీయ శాంతి సైన్యము, ట్రాన్సువాలు దండయాత్ర.



వోక్సురస్టులోనుండి నడచుట.

పుట ౧౧౪

తనపరివారమున 122 స్త్రీలు 50 పిల్లలు కూడ యిష్టపడి శ్రమ పడుచున్నందున ఈ అన్యాయము భరింపలేక ప్రజల గుంపుల కుపద్రవముగలుగు నేమోయనియు తన్ను వారితో పోనీయుడనియు లేనిచో వారిని రైలుపైన టాల్‌స్టాయి ఆశ్రమమునకు పంపుడనియు స్వదేశ మంత్రిగారికి తంతి నిచ్చిరి. వారు జవాబునీయలేదు అందువలన జామీనుపైన గాంధిగారు విడుదలయ్యె వచ్చి శాంతిసైన్యము చేరిరి. వీరు పార్డెబర్గు చేరిరి. కాళ్లుపుండ్లుపడి బాధపడుచున్న స్త్రీలను బాలురను "పార్డెబర్గు" దగ్గరవిడచి పెద్దగుంపు స్టాండర్టను 8 వ అక్టోబరు నాటికి చేరెను అచ్చట చాలమందిని అరెస్టుచేసిరి. గాంధిగారిని మఱల అరెస్టు చేసిరి. ఆయన పైకారణమువలననే మఱల జామీనడిగెను. ఆయనను విడువనిచో కోర్టువద్దనుండి కదలమని గుంపులు చెప్పుటవలన జామీను పుచ్చుకొని విడచిరి. 1913 సం॥ నవంబరు 9 వ తేది ఆదివారము చాలనుత్కృష్ట మయిన దినము. భరతఖండమునకు పోవలెనని సిద్ధముగనున్న పోలకు గారా దినమున గాంధిగారిని కలసి మాట్లాడ వచ్చిరి. స్టాండర్టకు దగ్గర "టీక్వర్త్" అనుచోట శాంతిసైన్యమును కలసికొనిరి. వారు మాటాడుచుండగ ఇప్పుడు పోలీసువారు వచ్చి మెల్లగా గాంధిగారి నరెస్టుచేసిరి. శస్త్రరహితముగు నుద్యమమున వారికిది సులభముగ నుండెను. అంతట పోలకుగారే నాయకులైరి. రాత్రిచాల నిశ్శబ్దముగ నుండెను. ఆ మఱునాడు మఱల శాంతిసైన్యము నడచెను. గ్రేలింగుస్టాడ్ ( Grayling Stad ) నుండి బాల్ఫరుకు 13 మైళ్లను 3½ గంటలలో చేరిరి. 9 గంట

లైనది. మూడుస్పెషలు రైళ్లు అక్కడసిద్ధముగ నుండెను (ఇమి గ్రేషన్ ఆఫీసరు) వలస యుద్యోగికి యీ సైన్యమును అరెస్టు చేయుటలో తనకు సాహాయ్యము చేయుమని పోలకుగారిని వేడుకొనెను. నిజముగ వీరిని నేటాలుకుపంపి వీరిపైన అభియోగము తెచ్చి నేరమునువిచారించునట్లయిన అరెస్టుచేయుటయందు సాహాయ్యము చేయుదుమని వీరనిరి. కాని గాంధిగారులేనందున గుంపులు శాంతిగానుండునో లేదోయనిభయపడిరి. అప్పుడు హీడెల్‌బర్గు [Heidel berg] నుండి డండీ చెరసాలకు పోవుచుండిన గాంధిమహాత్ముడు వీరి నెల్లరును శాంతముగా నుండుమని కబురుపంపెను. ఒకొక్క గుప్పెడు అన్నము కొంచెము రొట్టెయు నీ ప్రజలు త్వరగ భుజించిరి. వలసయుద్యోగియగు చామ్నీగారు వీరిని పరీక్షించి వలస రాకూడదనివారని నిషేధించిరి. జోహానసుబర్గుకు పోవదలచిన ప్రజలకిది చాలదుఃఖకరమయ్యెను. కల్లోలముకలిగెను. 25 మంది పోలీసువారిని వారుతలచుకొనినచో నిముషములో నాశనము చేయగలరు కాని వారుద్రేకము పొందుటచూచి పోలకుగారు కాచేలియా బ్యాటుగారలు వారిని వేడుకొని సత్యాగ్రహులకు జోహానసుబర్గేల ? చెరసాలయె గమ్యస్థానమని చెప్పియొప్పించిరి. నన్నుకూడ అరెస్టుచేయుడని పోలకుగారు కోరిరి కాని ఆఫీసరంగీకరించలేదు. ఘాల్లెసుటవ్రునవరకు పోలకుగారు సత్యాగ్రహులు ఎక్కిన రైలులో వెంబడించిరి. పోలీసువారు ప్లాటుఫారముపైన తిరుగాడిరి అచ్చట దిగబడియుండిన స్త్రీలు ఇదిచూచి కంట తడిపెట్టినను వారికి జాలికలుగలేదు. ఆమహోద్యమము

లోని సైన్యముయొక్క సత్యాగ్రహ దండయాత్ర అంతటితో ఆగిపోయినది ఇది నిజముగ యోటమికాదనియు సత్యాగ్రహ విజయమె యనియు ఎల్లరు గ్రహించిరి 1913 సం॥ నవంబరు 1 వ తారీఖున గాంధిగారు డండీలో వలసచట్టమునుమీరిన నేరము నంగీకరించి 9 నెలల కఠినపరిశ్రమ ననుభవింప చెరసాల కేగిరి.

భరతఖండమున సానుభూతి:—ఇదివిజయమని తరువాత జరిగిన సంగతులవలననె తేలినది. గోఖలేగారు పరిస్థితులను గూర్చి భరతఖండమున నుపన్యసించియు అసమ్మతి తెలిపియు ధనమును ప్రోగుచేసి దక్షిణాఫ్రికాకు పంపియు పనిచేయసాగిరి మన వైస్రాయిగారగు హార్డింజిప్రభువు ఈఘోర స్థితిని గూర్చి విమర్శించి సానుభూతిని కనపర్చెను ఆయన 1913 సం॥ డిశంబరులో చెన్నపురిలో నుపన్యసించుచు ,,ఈమధ్య దక్షిణాఫ్రికాలోని వీరాదేశభక్తులు అక్రమములు, అన్యాయములని బయట నుండి చూచువారలమగు మనకుకూడ తోచుచున్న శాసనముల నుల్లంఘించు సత్యాగ్రహమును వహించి వ్యవహారములను తామె పరిష్కరింప బూనినారు అట్లుచేయుటవలన వచ్చుకష్టములను శిక్షలనేరిగియె ఇష్టపడి భరింప సమకట్టియె ఉల్లంఘించుచున్నారు. ఇందు మహాభారతఖండము యొక్క సానుభూతి వారియందుకలదు భరతఖండమునకు మాత్రమేకాదు భారతీయులు కాకపోయినను ఈదేశపువారియందు అభిమానము కల నావంటి వారలెల్లరకును సానుభూతి కలదు అనిరి.

ఆండ్రూస పియర్సను గారలు:-ఇంతలో భరతఖండమున దక్షిణాఫ్రికా పరిస్థితులనుగూర్చి అసమ్మతి తెలుపు సభజరిగెను.

విశాలములను సమకూర్చిరి. దక్షిణాఫ్రికాలో చెఱసాలకేగిన నాయకులకు బదులుగ నచ్చట పనిచేయుటకును దక్షిణాఫ్రికా పరిస్థితులను చూచి ప్రకటించుటకు నచ్చటికి భారతీయ ప్రతినిధులు పోవుటకు తీర్మానింపబడెను. ఈ రాయబారమున పోవుటకు పరోపకార పారీణులగు సి. ఎఫ్. ఆండ్రూసుగారును క్రైస్తవ మిషనరీ గురువును, డబ్ల్యూ. డబ్ల్యూ. పియర్సన్ గారును పూనుకొనిరి. వీరు పాశ్చాత్యులయ్యు భరతఖండమునే తమదత్తభూమిగా నెంచి భారతీయులను సహోదరులుగా పరిగణించి మానవసేవ చేయుచుండిరి. ఆండ్రూసుగారు దక్షిణాఫ్రికా నిధికి తమ స్వల్ప ఆదాయమునుండి 1000 రూపాయల నిచ్చి త్యాగము చూపిరి. వీరిరువురును 913 డిసెంబరులో దక్షిణాఫ్రికాకు పోయిరి. వీరు పోవుచున్నప్పుడే స్మట్సుసేనాని మిమ్ములను కూడ చెరసాల కంపునని నేటాలులోని వారనిరి.

విచారణాసంఘము:—గాంధిమహాత్ముడును ఆయన సతీమణియు పోలకు గారును కొల్లెన్‌బాకు గారును ఇతరనాయకులును చెరసాలలో శ్రమపడుచునే యుండిరి. ఈ పరిస్థితులను గూర్చి ఇంగ్లాండులో ఆంప్తిల్ ప్రభువు ఉపన్యసించి భారతీయుల పక్షమున చాలపనిచేసెను. ఎట్టకేలకు సామ్రాజ్య ప్రభుత్వమువారు కన్నులు తెరచిరి. దక్షిణాఫ్రికాలోని భారతీయుల స్థితిగతులను విచారించుటకు చక్రవర్తిగారొక విచారణాసంఘము నేర్పరచిరి. కాని యందు భారతీయ ప్రతినిధులను నియమించలేదు. ఇదియే సాలమన్ విచారణాసంఘము.

గాంధీప్రభృతుల దీక్ష:—ఈ విచారణ సంఘము భారతీయ సమస్యను విమర్శించు సందర్భమున గాంధీప్రభృతులను విడుదల చేసిరి. తాము విడుదల చేయబడినందులకు గాంధిగారు దుఃఖించి దుఃఖసూచకముగ ఒంటిపూట మాత్రమే భోజనము చేయుచు వలస కూలివారివలె ముతక గుడ్డలు కట్టుకొనిరి. తమ ప్రతినిధులు లేని విచారణ సంఘమువలన లాభముండదనియు భారతీయులు అడుగుచున్న స్వల్పపు హక్కులు ప్రభుత్వము నిరాకరించినచో 1914 సం॥ జనేవరు 1 వ తారీఖునే మరల సాత్విక నిరోధము ప్రారంభించి ఇదివరకున్న నధిక కష్టములు పడుటకు సంసిద్ధులుగ నుండవలెననియు నేటాలు భారతీయసభవారు సమావేశపరచిన సభలో గాంధిగారనిరి.

ఆండ్రూసుగారి శాంతిప్రబోధము:— ఆండ్రూసుగారు గాంధిమహాత్ముని చూచినంతనే ఆయన పాదముల కెరగిరి. ఒక పాశ్చాత్యక్రైస్తవుడొక ఆశియావాసిని నమస్కరించెనను వార్త దేశమెల్లయెడల వ్యాపించెను. అప్పటి హిందూ మహమ్మదీయుల ఐకమత్యముజూచి ఆండ్రూసుగా రాశ్చర్యపడిరి. ఆండ్రూసుగారు గాంధిగారి ఫినిక్సు ఆశ్రమమునకు పోయిరి. అప్పుడు గాంధిమహాత్ముని సతీమణిని దర్శించి నమస్కరించిరి. ఆమె మూడు నెలలు కారాగారమున కష్టము ననుభవించి, చిక్కి, శల్యమై యుండెను. ఆశ్రమవాసుల నిరాడంబర జీవితములను చూచి ఆండ్రూసుగా రాశ్చర్యపడిరి. ఇంతలో తమకు దర్శనమిచ్చెదనని స్మట్సు సేనాని ఆండ్రూసుగారికిని గాంధిగారికిని తంతివంపెను.

వీరిరువురును కాఫరు రైలులో 3 వ తరగతిలో పోవలచిరిగాని పాశ్చాత్యుల సమ్మెవలన ఇనుపదారి పనివారును సమ్మెకట్టుటవలన ఏరోపావారి రైలులో నొకపెట్టెలో కూర్చుండి ప్రిటోరియాకు పోయిరి. అక్కడ 15 దినములుండిరి భారతీయ నాయకులు ప్రభుత్వమువారి విచారణసంఘము యెదుట సాక్ష్యమిచ్చుటకు నిరాకరించిరి 20,000 మంది పురుషులు స్త్రీలు మరల చెరసాలకేగ సిద్ధముగా నుండిరి. ఈమారు సాత్విక నిరోధమును మొదలిడినచో భారతీయులను తుపాకులతో కాల్చివైతుమని దక్షిణాఫ్రికా వారనిరి. ఆండ్రూసుగారీక్లిష్ట పరిస్థితుల జూచిరి. ఇదిభారతీయుల ఆత్మగౌరవమును కాపాడుకొను పోరాటమని ఆండ్రూసుగారు గ్రహించిరి. తానుకూడ వారితో చేరి చెఱసాలకేగు తలంపు ఆయనకు కలిగెను. పాశ్చాత్యుల సమ్మెవలన స్మట్సు సేనానికి తీరిక లేకుండెను ఎట్టకేలకు ఆయన వీరికి దర్శనమిచ్చి సంధిమాటలాడెను. గాంధిగారును ఆండ్రూసుగారును ఫోనిక్సు ఆశ్రమమునకు తిరిగివచ్చిరి. గాంధిగారి సతీమణికి చాలజబ్బు చేసి కుదిరెను. ఆండ్రూసుగారును పియర్సన్ గారు నెంతో శ్రమపడి పాశ్చాత్య ప్రజలకు బోధించి శాంతిని భాతృభావమును సమకూర్ప ప్రయత్నించిరి. నిజముగ వీరు లేనిచో భారతీయులకును దక్షిణాఫ్రికా ప్రభుత్వమునకును సంధియె కుదిరి యుండదు. పాశ్చాత్యుల సమ్మెయు ప్రభుత్వమువారి యదృష్టవశమున వచ్చినది. వారికష్టములలో నుండగ సత్యాగ్రహము చేయ నిచ్ఛగింపని గాంధిగారి మహౌదార్యమమున కంతరాయముగల్పించెను.

పియర్సన్‌గారు కొన్ని దినములు ట్రాన్సువాలులోను, ఒక నెలదినములు నేటాలులో నుండి పరిస్థితులనెల్ల స్వయముగ చూచి ఒక నివేదికను వ్రాసి ప్రకటించిరి. భారతీయులను తెల్లవారు ఏవగించుకొనుటయు వీరికి హక్కులు లేకపోవుటయె గాక ప్రయాణసౌకర్యము లేకపోవుటయు ఆస్తి కొనుటకు, వర్తకము చేయుటకు వీలు లేకపోవుటయు ప్రభుత్వమువారు నిర్ణయించు ప్రత్యేక గూడెములందే నివసింపవలసి వచ్చుటయు జోహానసుబర్గు ప్రిటోరియా నగరములందు ట్రాముబండ్లపైన పోవుటకు వీలు లేకుండుటయు నీయన స్వయముగ చూచిరి ఆయన వలస కూలిపనివారి స్థితిగతులను కూడ స్వయముగ చూచిరి. ఆయన వ్రాసిన నివేదికను ప్రభుత్వపక్షమువారు కూడ నిష్పక్షపాతముగనున్నదని అంగీకరించిరి.

ఆండ్రూసుగారును గాంధిగారును అప్పటి గవర్నరు జనరలగు గ్లాడ్‌స్టన్ ప్రభువుగారి సహోదరి యతిథులుగ నుండి యామెకు స్థితిగతులు చెప్పిరి. పాశ్చాత్యస్త్రీపురుషులలో కొందరు భారతీయులపట్ల తమ సానుభూతిని చూపిరి. ప్రధానమంత్రి బోథాగారి భార్యకును భారతీయులపట్ల సానుభూతి కలిగెను. ఆదినములలో ఆండ్రూసు పియర్సన్ గార్ల సేవయు ప్రతిమానముగ నుండెను. దీనివలననె దక్షిణాఫ్రికాలో నాక్షణమున శాంతిచేకూరుటకు వీలుకలిగెను. ఆండ్రూసుగారు గాంధిమహాత్మునకు ప్రాణమిత్రుడయ్యెను.

ఫలితములు:—భారతీయనాయకులనేకులను ప్రభుత్వమువారికిని సంధికుదిరెను. భారతీయుల చిక్కులు కొంతవరకు తీరెను.

సత్యాగ్రహసమరమంతమొందెను. భారతీయులెల్లరు విడువ
బడిరి. ఈసమరమునందు నాగప్పన్ చెఱసాలలో మరణించెను
వల్లియమ్మయు చెఱసాలలో మరణించెను. నారాయణస్వా
మిని ప్రభుత్వమువారు హిందూదేశమున కంపివైచుటకొఱక
రేవునుండి యింకొక రేవునకు తరుమగ నతడు నెలగో అఘాత
ప్రాంతమున మరణించెను. వోక్సురస్టు సరిహద్దు దగ్గరకు నడిచి
శిక్షింపబడి చెఱసాలకేగిన 75 సం॥లముసలి వీరుడు హర్బత్
సింగు డర్బన్ చెఱసాలలోనే మరణించెను. ఆవృద్ధుని గాంధి
గారు చెరసాలలోచూచి అతని ధైర్యస్థైర్యములకు మెచ్చుకొ
నియుండిరి. సత్యాగ్రహసమరమున ధనమును ఆరోగ్యమును
గోల్పోయిన కుటుంబములెన్నియోయుండెను ఒకకోటి రూప్య
ములు భారతీయులు నష్టపడిరి. గాంధిగారికి సాహాయ్యముచే
సిన పాశ్చాత్య ప్రముఖుడు పోలకుగారు చెరకంపబడగ నా
యన భార్యయు బిడ్డలును దిక్కులేక పోవుటవలని దుఃఖమునే
గాక తమజాతి వారివలన బహిష్కరింపబడి కష్టము ననుభవిం
చిరి. గాంధిగారికి దక్షిణాఫ్రికాలో కొందఱు పాశ్చాత్యులు
స్నేహితులై భారతీయులపట్ల సానుభూతి జూపుచుండిరి. ఆయన
ప్రాణము నొకమారు డోక్ దంపతులు కాపాడియుండిరి. డోక్
గారు బాప్టిస్టు క్రైస్తవగురువు. ఈయన రోడేశియాలో పరో
పకారకార్యమందే మరణించెను. గాంధిగారు ఆ ప్రయాసుగారి
తో ప్రిటోరియాకు పోయినప్పుడు డోక్ సతీమణి నిదర్శించి
కృతజ్ఞతచూపిరి. డోకుగారు వ్రాసియుండిన గాంధిజీవితము
డోక్ గారి కొమరుడు ప్రకటించెను.

గాంధిస్మట్సు ఒడంబడిక:—గాంధిగారు ఫోనిక్సు ఆశ్రమమునకు పోవుచు 21-1-1914 తేదిన ప్రభుత్వము వారి కొక లేఖ వ్రాసెను. ఈలేఖయె అప్పుడు ప్రభుత్వమువారికిని గాంధి ప్రభృతులకును జరిగిన తాత్కాలిక ఒడంబడికను గూర్చి తెలుపుచున్నది. "స్మట్సుగారు నాకు సందర్శనములిచ్చి నందులకు కృతజ్ఞుడను. రాబోవు కమీషనులో భారతీయ ప్రతినిధులను చేర్చుటకుగాని ఈకమీషను వారు పరిస్థితులను చూచి నిర్ణయించినచో నింకొక (కమీషను) విచారణసంఘమును భారతీయుల కష్టములు బాపుట కేర్పరచుడని నేనుకోరిన కోరికలు మంత్రిగారంగీకరించరని తోచుచున్నది. ఇందువలన నీకమీషనుపైన భారతీయులకు నమ్మిక యుండుట కష్టము. అయినను నాకుసందర్శనముల నొసగి నా మాటలు నెమ్మదిగ వినినందున సత్యాగ్రహము మరల ప్రారంభించి కమీషను వారి విచారణకు అడ్డంకి కలిగింప ప్రయత్నింపవలదని నేను మావారికి సలహానిచ్చుటకు వీలుకలిగినది. ఈసత్య నేటాలులో జరిగిన సమ్మెలో భారతీయులను పెట్టిన బాధలను గూర్చి మేము కమీషను వారి యెదుట చెప్పుకొనవీలు లేకున్నది. మాఖైదీల నెల్లరను విడుదల చేయుమని కోరుచు సత్యాగ్రహమును నిలిపితిమి. మాకు న్యాయము కలుగుటకు తీర్మానింపబడవలసిన విషయములేమన (1) 3 పౌనుల తలపన్నును రద్దుచేయుట (2) వివాహముల విషయము. ఈరెండు విషయములను గూర్చి శాసనములు చేయవలసినదని నేను మీతో చెప్పియున్నాను. (3) కేపుకాలనీలోనికి తిరిగివచ్చు విషయమున పరిపాలకుని

ఉద్యోగులను హెచ్చరించిన చాలునని మంత్రిగారికి నివేదించి యున్నాను (4) ఆ రెంజిస్ట్రేషను విషయమునను కొంచెము మార్చిన చాలును. (5) ఉన్నహక్కులు పోకుండ ప్రస్తుతపు శాసనములు న్యాయముగ పరిపాలింప బడునని వాగ్దానము చేయవలెను. ఇవి మంత్రిగా రంగీకరించినచో భారతీయులకు నేనిందు వ్రాసిన ప్రకారము చెప్పి యొప్పించెద నని వ్రాసిరి. అంతట నీపద్ధతులు మనసునం దుంచుకొని వారి సలహాలను మన్నించి బ్రిటీషు విచారణ సంఘమువారి సలహాలను గమనించి ఇండియన్ రిలీఫుచట్టము అను భారతీయ విమోచన శాసనము ( Indian Relief Act ) దక్షిణాఫ్రికా పార్లమెంటులో ప్రవేశపెట్టి 1914 సం॥ 22 చట్టముగ సమిలి ప్రభుత్వమువారు జూలై నెలలో తీర్మానించిరి 3 పౌనుల తలపన్ను తీసివేయబడిన భారతీయులకు అప్పటికున్న హక్కులు పోకుండ నుంతుమని స్పష్టపరచిరి. ఇంతవరకు నంగీకరింపఁబడని హిందువుల వివాహములను ప్రభుత్వము వారు అంగీకరించిరి. జాతిభేదమును వర్ణభేదమును బట్టి శాసనములు చేయమనిరి భారతీయులను నిర్బంధించి సాగనంపుటకు గాక ఇష్టమున్నవారు దేశము వదలిపోవు పద్ధతికి భారతీయుల పక్షమున గాంధిగా రంగీకరించిరి. భారతీయులను నల్లకూలికి పంపు పద్ధతి రద్దుచేయబడెను. విద్యావిషయకములు నితరములు నగు కొన్ని సంస్కరణములు చట్టమున నుదహరింప బడనప్పటికిని చేయబడునని ప్రభుత్వము వారిపక్షమున స్మట్సుగారు గాంధిగారితో చెప్పిరి. గాంధిగారట్టి సంస్కరణములను గూర్చి నివేదించి

లేఖను వ్రాసిరి. దీనిని స్మట్సుసేనాని మార్చి 30 వ తేదీన వ్రాసిన లేఖలో చర్చించి యుండెను. గాంధిగారా లేఖ కాదినమె ప్రత్యుత్తరము వ్రాసిరి. "ఇండియన్ రిలీఫు చట్టమును, మన లేఖలును సాత్విక నిరోధనోద్యమమును ముగించుచున్నవి. నేనింకను చాలినన్ని హక్కులు కోరలేదని నాదేశీయులు తలంచుచున్నారు. వివిధరాష్ట్రములలోని వైనున్న చట్టములను ట్రాన్సువాలు బంగారుచట్టములను ట్రాన్సువాలుపట్టణచట్టములను నేటాలును, అరబ్బులను, ఆసియావారును భూములను కొనరాదని ట్రాన్సువాలువారు 1885 లో శాసించిన 3వ చట్టమును మార్చలేదనియు వారు నివసించుటకు సర్టికము చేయుటకు భూములు కొనుటకును హక్కులు గలిగింపలేదనియు ననుచున్నారు. వివిధరాష్ట్రములలోని వారొకచోటినుండి యింకొకచోటికిపోవుటకు సౌకర్యములు లేవనుచున్నారు. విదేశములగు భారతీయవివాహములు శాస్త్రసమ్మతములుగ చేయుటకై లేదనుచున్నారు. ఈవిషయములెల్ల సత్యాగ్రహ సమర కారణములుగ చేర్చవలసి వారు నన్ను కోరిరిగాని నేనంగీకరింపలేదు. వీని నెప్పుడో యొకప్పుడు ప్రభుత్వమువారు చేయవలసియున్న మాట వాస్తవము. భారతీయులకు సంపూర్ణములగు హక్కులు వచ్చునగాని తృప్తికలుగదు. ఓపికతో వేచియుండి పనిచేయుడనియు పాశ్చాత్యులీహక్కులన్ని వారికి నిచ్చుట న్యాయమే యని గుర్తింపక పోవరనియు కొన్ని నెలలనుండి భారతీయ సమస్యపట్ల ప్రభుత్వమువారు చూపుచున్న సానుభూతి మీ లేఖలలో మీరు వ్రాసినట్లు శాసనములను పరిపాలించు పట్లను చూపగలరేని భార

రియులు సమితి ప్రభుత్వమున కేవిధకష్టమును లేక ఎంతొ శాంతిని పొందగలరు." అని వ్రాసిరి. ఈ లేఖలె గాంధిస్మట్సు ఒప్పందపత్రికయని ప్రసిద్ధిజెందెను.

గాంధిమహాత్ముడును ఆయనసతీమణియును దక్షిణాఫ్రికాను విడచి పోవుటకు నిశ్చయించిరి. వారు పోవునప్పు డచ్చటి ప్రజలు చూపిన ప్రేమకు మేర లేదు. గాంధిమహాత్ముడు డర్బన్, జోహానసుబర్గు మున్నగు పట్టణములందు ఉపన్యాసములనిచ్చి 1914 సం జూలై నెలలో భార్యతో లండను నగరమునకు బోయెను. అచ్చట వీరి గౌరవార్థము సిసిల్ హోటలులో ఆగష్టు 8 వ తేదీన గొప్ప సభ జరిగెను. బ్రిటిషు ప్రధానామాత్యుడు రాజకీయ నాయకులు ప్రముఖులనేకు లభినందన పత్రములంపిరి. వంగ రాజ్యాంగమంత్రిసభలోని సభ్యులగు భూపేంద్రనాథబాసుగారును నేడు ప్రీవికౌన్సిలు సభ్యులగు అమీరాలీగారును స్వాగతమిచ్చి గౌరవించిరి. గాంధిమహాత్ము డచ్చట నుండగనే యూరోపామహాసంగ్రామము వచ్చినది. అంతట 1915 సం॥ జనేవరు 9 వ తేదీన ఆయన బొంబాయి నగరము చేరెను.

# దక్షిణాఫ్రికా

## VII
## సామ్రాజ్య పౌరసత్వము.

సామ్రాజ్య ప్రతినిధుల యుద్ధసభలు:—ఐరోపా మహాసంగ్రామము వచ్చినది. జర్మనీవారితోడి ఘోరసమర సమయమున బ్రిటీషు సామ్రాజ్యములోని రాజ్యములెల్ల నైకమత్యముతో సైనికులనంపి విజయముకొఱకు ప్రయత్నించెను. భారతీయ సైనికుల యనన్యసామాన్య ధైర్యసాహసములు యుద్ధారంభముననే ప్రపంచమున కాశ్చర్యము గలిగించెను. గాంధిమహాత్ముండే స్వయముగ భరతఖండమున సైనికులను సమకూర్చెను. బ్రిటీషు సామ్రాజ్యము కొఱకు గాంధిమహాత్ముండిట్లు శ్రమపడుచుండగ నట దక్షిణాఫ్రికాలోని భారతీయుల బాధలు తప్పలేదు. గాంధిస్మట్సుల ఒడంబడికలో చేరని ఇతరకష్టములు ప్రభుత్వమువారు కలిగింప భారతీయు లనుభవించుచుండిరి. యుద్ధసమయమున నాందోళనము సలుపుట ధర్మముకాదని యూరకొనిరి. బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వమువారు యుద్ధవిషయమున నాలోచనము చేయుటకు తమ సామ్రాజ్యములోని దేశములవారి ప్రతినిధులను పిలిచి సామ్రాజ్యయుద్ధసభను చేసిరి. ఈ సభలందు సామ్రాజ్యములోని వివిధభాగముల వారి ఆర్థిక రాజకీయ సామర్థ్యములను గూర్చియు పౌరసత్వములను గూర్చియు చర్చించిరి. 1917 సంవత్సరమున భారతీ

యరాజ్యాంగ మంత్రి మాంటేగూ (Montague) గారు ను సింహా ప్రభువుగారును బికనీరు మహారాజుగారును భరతఖండ ప్రభుత్వము పక్షమున ప్రతినిధులుగ యుద్ధసభలో కూర్చుండి కార్యాలోచన చేసిరి. భారతీయుల బాధ్యతలను గూర్చి కొంత చర్చజరిగెను. బ్రిటీషు సామ్రాజ్యము స్వతంత్రరాజ్య సమ్మేళనము [Common wealth of Free Nations] అని రాజనీతిజ్ఞులు ఉపన్యాసములు జేసిరి. సామ్రాజ్యమున నొకభాగము వారింకొక భాగము వారితో సమానగౌరవము కలవారే యనియు వారికెల్లరకు సమానములగు బాధ్యతలును గలవనియు ప్రతిపాదింపబడెను. ఆ సామ్రాజ్యముల పరస్పరాభివృద్ధికి తగిన సహకారులతో కొన్ని నియమములను చేసికొనిరి. సామ్రాజ్యమున బాధ్యతాయుత ప్రాతినిధ్య స్వపరిపాలనము స్వాతంత్ర్యము లేని భరతఖండమునకు ప్రతినిధుల సభయందు ప్రాతినిధ్యము లభించుటయె గొప్పగౌరవమని కొందఱు భారతీయులు తలచిరి. కాని దీనివలన నెంతవరకు లాభముండునో ఇతరభాగములవారు భరతఖండమునెట్లు చూచు ఆదరణమువలననె తెలియవలెననియు ఈవాగాడంబరముల వలన లాభము లేదనియు జాతీయనాయకులనిరి. ఆ సామ్రాజ్యసభకు దక్షిణాఫ్రికానుండి ప్రతినిధిగ స్మట్సు సేనానివచ్చి ఉపన్యాసము జేసెను

1918 సం॥ సామ్రాజ్యసభ:—సామ్రాజ్యయుద్ధమహాసభ 1918 సంవత్సరము జూలై 25 వ తేదీన పదునైదవమారు కూడెను క్రిందటి సంవత్సరపు సభలో నంగీకరింపఁబడిన పరస్పర

సంబంధమునుగూర్చిన "రెసిప్రొసిటీ" తీర్మానమును (Reciprocity Resolution) మూఁడిం నుపపాదించిరి. (1) బ్రిటీషు సామ్రాజ్యములోని వివిధభాగముల ప్రభుత్వములును, భరతఖండమునుగూడ తమ ప్రజలయొక్క వలసనుగూర్చిన విషయము లందు సంపూర్ణమగు నధికారములు కలిగియుండుట న్యాయమని; (2) బ్రిటీషువారి దేశములలో భరతఖండమునందలి ప్రజలు కూలి చూచుటకుగాని వర్తకము చేయుటకుగాని కొన్నాళ్లుండుటకుగాని ఇతరభాగములకు పోయినప్పుడు పరస్పరసంబంధ విషయమున కొన్ని నియమములను చేసికొనవచ్చుననిరి. భరతఖండము వారితర దేశములకు పోయినప్పు డేశాసనములకు, ఆదరణకు పాత్రులగుచున్నారో ఆ యా దేశముల వారిచ్చటికి వచ్చినప్పుడు నాయావిధములగు శాసనములు చేసి ఆదరణము చూపుటకు భారతీయ ప్రభుత్వము వారికి నధికారముండుట న్యాయమనియు, వలసకు పోవువారికిచ్చు అనుమతి పత్రములలోనే వారు కొన్నాళ్లుండుట మొదలుగాఁగల షరతుల నుదాహరింపవచ్చుననియు, ఆ దేశమువారి కిష్టములేనిచో కూలిపని చేయుటకుగాని శాశ్వతముగ నెలకొనుటకుగాని అనుజ్ఞనీయకుండ నుండవచ్చుననియు శాసించిరి. ఇదివరకే బ్రిటీషుదేశములలో నెలకొనిన భారతీయులు తమభార్యలను బిడ్డలను తెసికొని రావచ్చునుగాని ఒక్కొక్కని కొక్కొక్కభార్యయు ఆమెపిల్లలును రావచ్చుననియు ప్రభుత్వమువారి వలన నిజముగ భార్యాపిల్లలయని నిర్ణయింపబడినవారు మాత్రము రావచ్చుననియు తీర్మానించిరి.

"ఈ తీర్మానము పైకి బాగుగనె కనబడుచున్నది కాని మనకితరులెట్లు చేయుచున్నారో వారికి మనమట్లు చేయగలుగుదుమని సంతసింప నక్కరలేదు. భరతఖండమునకు రాకుండ నిషేధించువారెవరు? భారతీయులను మా స్వంత దేశములకు రాకుండ నెవ్వరు నిషేధించుచున్నారు. సత్యాగ్రహము వలన దక్షిణాఫ్రికాలో జాతిభేద శాసనములను చేయుట మానిరి కాని భారతీయులకు వర్తించు శాసనములను క్రొత్తవిధముగ చేయుచున్నారు. పూర్వము నెలకొనిన భారతీయులను గూర్చిన తీర్మాన భాగము 1914 సంవత్సరములో భారతీయులతో దక్షిణాఫ్రికావారుచేసికొనిన ఒడంబడిక పద్ధతులనె మరల నేకరువుపెట్టుచున్నది ఇరువురు భార్యలు కలవారికి కూడకొంత న్యాయముచేయుట యుక్తము. పైతీర్మానము, భారతీయులకితరదేశములయందు జరుగుచున్న అకృత్యములను అవమానములను గూర్చి యోచింపకయె విడిచినది. దక్షిణాఫ్రికాలో వర్తకులైసెన్సులు పొందుటలోని కష్టములు, ట్రాన్సువాలులో ఆరెంజిదేశములో భారతీయుల బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలందు చేర్చుకొనరాదను నిషేధము, ఆదేశములలో భారతీయులకు మునిసిపలు ఎన్నికహక్కులు లేకపోవుట, వీనిని గూర్చి పైసభ యేమియు నిర్ణయింప లేదు. వలసరాజ్యముల హృదయము మారలేదు. సామ్రాజ్యమువారి బాధ్యతలు నిర్వయింపజాలేము. ఇది మన కన్నులు తెరచుటకు చేసినారు" అని గాంధిమహాత్ముండు ఆగస్టు 1918 సం॥ ఇండియన్ రివ్యూ పత్రికలో వ్రాసెను.

స్మట్సు సేనాని వాగ్దాన భంగము:— 1914 సంవత్సరములో గాంధిగారికిని స్మట్సు సేనానిగారికిని భారతీయులను గూర్చి జరిగిన సంభాషణలు స్మట్సుసేనాని అప్పుడు చేసిన బాసలు వ్యర్థంబయ్యెను. స్మట్సు సేనాని సామ్రాజ్య శాసనసభకేగివచ్చినప్పుడు దక్షిణాఫ్రికాలోని భారతీయు లీయనకు స్వాగత మిచ్చిరి. ఈయన తీయని మాటలాడెను. కాని ఇది తేనెబూసిన కత్తియని కొలది కాలమునకె బయల్పడెను.

స్మట్సుసేనాని 1919 సంవత్సరపు 37 వ శాసనమును చట్టముగ చేసెను. ఇందువలన దక్షిణాఫ్రికాలోని భారతీయులా యా భాగములలో నేవిధమైన స్థిరరూపకమగు ఆస్తిని వారి యిచ్చవచ్చిన చోటులలో సంపాదింపరాదు. భారతీయుల సంఘములు కూడ ఆస్తిని సంపాదింపరాదు. ప్రభుత్వమువారు నిర్ణయించిన స్థలములందే మాత్రమే నివసింపవలెను. ఎచ్చటనైనను వర్తకము చేయవలెనన్నచో లైసెన్సులు (అనుమతి పత్రములు) పొందవలెను. లైసెన్సు లిచ్చుట యధికారుల చిత్తమును బట్టియుండును. వలస రాజ్యములలో పూర్వమే నెలకొనిన భారతీయుల విషయమున 1895 సంవత్సరపు 3 వ చట్టమున ట్రాన్సువాలు వారుచేసిన నియమమునే ఇందుగూడ జేసిరి. 1921 సంవత్సరములో నేటాలు శాసన సభవారు భారతీయులను గూర్చి మఱియు నన్యాయములగు చట్టములను రెంటిని చేసి స్థానికపురపరిపాలక సంస్థలయందు ఎన్నిక హక్కులు వీరికి లేకుండ తీసివేయుటకును, వీరికి పురపాలక హద్దులలో వర్తకము చేయుటకుండ అనుమతి పత్రమునిచ్చు పద్ధతులు కష్టతర

ముగ చేయుటకును పూనుకొనిరి. కాని భారతీయ ప్రభుత్వము వారి మొఱలవలన దక్షిణాఫ్రికా గవర్నరు జనరలుగారు దీనికంగీకరింపరైరి. అంతట వారూరకొనక భారతీయుల కనిష్టమగు లైసెన్సుల చట్టమును 1922 సంవత్సరములో మఱల ప్రవేశపెట్టిరి. శాసనసభల కెన్నిక హక్కులు తీసివైచిరి. ఇది గాక భారతీయ విద్వేషులగు పక్షమువారి నాయకుడగు హెర్ట్సోగ్గారు భారతీయులకు మునిసిపలు ఎన్నిక హక్కులను తీసివేయుటకు నవంబరు 1923 సం॥ లో నొక శాసనమును ప్రవేశపెట్టిరి. వీనినెల్ల స్మట్సు సేనానిగారి ప్రభుత్వము హర్షించెను. వర్ణభేద తత్వము ననుసరించి భారతీయులకు వ్యతిరేకముగ శాసనముల ను చేయుచు స్మట్సు సేనాని తన వాగ్దానమును తప్పెను.

రిపాట్రియేషన్:— 1917 సంవత్సరమున సామ్రాజ్య సభయందు ,, బ్రిటీషు దేశముల పరస్పర సంబంధము విషయమున చేయబడిన తీర్మానమును భారతీయ ప్రతినిధు లంగీకరించినారు గనుక భరతఖండమునుండి దక్షిణాఫ్రికాకు అమితముగ ప్రజలు వలసవత్తురను భయము పోయినచో దక్షిణాఫ్రికాలో తక్కిన సంగతులెల్ల సులభములగు నని స్మట్సు సేనాని తన నిజోద్దేశమును సూచించెను. భారతీయులు తన దేశమున నుండుట తనకిష్టములేదని స్మట్సు సేనాని వర్ణభేదతత్వమును ప్రదర్శించిన పిదప భారతీయులు 1919 సంవత్సరపు 37వ చట్టము తమకనిష్టమని మొఱపెట్టుకొని ఆందోళనము సలుపసాగిరి. అంతట ఆశియావారి పరిస్థితులను పరిశీలించి వీరి వలసనుగూర్చి ప్రభుత్వము వారేమిచేయవలెనో సూచించుటకును, దక్షిణాఫ్రికా ప్రభు

త్వమువారొక విచారణసంఘము (కమీషన్) ను నియమించిరి ఈ విచారణ సంఘమువారియెదుట సాక్ష్యమిచ్చుటకు భారతీయ ప్రభుత్వమువారు సర్ బెంజమిన్ రాబర్టుసన్ (Robertson) గారిని ప్రతినిధిగ బంపిరి. తుదకు మార్చినెల 1921లో నీవిచారణసంఘమువారొక నివేదికను బంపిరి. వీరు ఆశియా సమస్యను విమర్శించి భారతీయులకు నష్టపరిహారము నిచ్చి వారిని తమతమ దేశములు కంపుడని ప్రభుత్వమువారికి సలహానిచ్చిరి ఈపద్ధతికె రిపాట్రియేషన్ (Repatriation) అని పేరు. ఈపద్ధతివలన ప్రభుత్వమువారు తమ దేశములో నున్న భారతీయులను నిర్బంధించి బాధించి వెనుకకు సాగనంపవచ్చును. వారిని మరల రాకుండ నిషేధింపవచ్చును. వెనుకకు పోవనిష్టపడనివారిపైన తమశాసనములను ప్రయోగించి బాధింపవచ్చును. దీనికొరకు క్రొత్త చట్టములను చేయవచ్చును. భారతీయులను వెనకకంపుట కొకకార్యస్థానమును స్థాపించిరి. "భారతీయుల కూలివారు దక్షిణాఫ్రికాలో చాలనిడుమలబడుచు నచ్చటి యాదిమజాతులగు కాఫరులకన్న నీచమగుస్థితిలో దారిద్ర్య దుఃఖముల ననుభవించుటచూచి, కన్నీటితోవచ్చి భరత ఖండమునకు దారిచూపుమని దుఃఖించినవారినిచూచి హృదయము కరిగి, వీరిట్లు వెనుకకువచ్చుటయె మంచిదని నేను 1920 సంవత్సరములో తలంచితిని కాని ఈస్థితిని పురస్కరించుకొని దక్షిణాఫ్రికా సమితిప్రభుత్వము వారు భారతీయులనెల్లరను వెనుకకు వెడల గొట్టుటయు, ఇట్లు తిరిగివచ్చువారు వారియూళ్లలో బంధుగులకు దూరమై పనిపాటలులేక దారిద్ర్యమున దుఃఖమున

బడుటయు చూచి ఈ రిపాట్రియేషన్ మంచిదె యనుకొని యుండుటకు పశ్చాత్తాపము జెందితిని ,, అని సి. ఎఫ్. ఆండ్రూసుగారు 1922 సం॥ జూలై ఇండియన్ రివ్యూపత్రికలో వ్రాసిరి.

భారతీయులను దక్షిణాఫ్రికా సమితి దేశమునుండి వెడలగొట్టుట కా ప్రభుత్వమువార నేక యుక్తుల బన్నినారు. తమ తమ దేశములకు బోవువారికి ప్రయాణమునకు కావలసిన వ్యయమును ప్రభుత్వమేభరించుననిరి. అట్లు పోవువారికి మఱల దక్షిణాఫ్రికాకు వచ్చుటకు హక్కుండదు. భరతఖండపు ప్రభుత్వమువారిట్లు వెనుకకువచ్చువారి నాహ్వానించి పనులనుకల్పించుచున్నారనియు, బొంబాయి, కలకత్తా, చెన్నపట్టణములలో కార్మిక కార్యస్థానములు (Depot) స్థాపించుచున్నారనియు, హిందూదేశమున బియ్యము చౌకమైనదనియు, రిపాట్రియేషన్ కమీషనరుగారైన హెర్బర్టు సీ. వికోల్ గారు ప్రకటించిరి.

రిపాట్రియేషన్ దుఃఖితులు:—మునిగాడికథ:—"నా రెండవభార్య 1921 సం॥ లో చనిపోయినది. నాకు మనస్సు స్థిమితమ్ముగలేక ప్రభుత్వమువారు ప్రకటించిన ప్రకటనలను జూచి నాకొమార్తెయు, పదునాల్గేడులబాలికయునగు ముత్యాలు, నాకొమాళ్లు అమికిగాడు,నారాయణస్వామి,నేను, ప్రయాణమునకు వ్యయములేకుండ ఇండియాకు తిరిగివచ్చితిమి. మన దేశములో మాయూరగు వందవాసికి పోయితిని. అచ్చట మా బంధుగులెవ్వరును కనబడరైరి. అంతట నేను చెన్నపురికివచ్చి మఱల నేటాలుకే పోవుట కనుమతిపత్రము (Passport) ను

కోరితిని. కాని నాకీయరైరి. డర్ సాలాం (Dar Saalam) కు పోవుట కనుమతినిచ్చిరి. మేముపోయితిమి. అచ్చట జ్వరములు చెలరేగుచుండెను మాకచ్చట సాహాయ్యము చేయువారెవ్వరును లేరైరి అంతట అచ్చటినుండి 8 నెలలు నడిచి మొజాంబిక్ కు పోయితిమి. అచ్చటనున్న భారతీయసోదరులు మాపైన గనికరించి 40 పౌనులు చందా ప్రోగుచేసి మమ్ము డెలగో అఖాతమునకు ఓడనెక్కించిరి. ఆక్కడ మేమిరువది దినములుంటిమి. అచ్చటకూడ మన భారతీయసోదరులె ఇరువదిపౌనుల విరాళములను ప్రోగుచేసి మాకిచ్చిరి. మేము నేటాలులో జూలూదేశమున సోమవేలీ చేరితిమి. అచ్చట పోలీసువారు మమ్ములను అరెస్టుచేసి ఇరువదిదినములు చెరసాలలోనుంచి తరువాత డర్బనులో వలసప్రజలడిపోకి పంపిరి ఈసంగతి డర్బనులోని భారతీయులకు తెలియగ వారు మమ్ము జామీనుమీద విడిపించిరి అచ్చటి వలసనిషేధకోద్యోగి మా కేసు మంత్రిగారికి తెలియపరుపగా నాయన విచారింపకుండగనే మమ్ములను మరల దేశాంతరమున కంపుడని శాసించిరి. తరువాత నాకు దక్షిణాఫ్రికాలోనే పుట్టిన పిల్లల జన్మసాధ్యతలనుగూర్చి నిర్ణయించుటకు నా కేసును భారతీయులు సుప్రీము కోర్టుకు పంపిరి. వారు వలస బోర్డువారికా కేసును పంపిరి. అచ్చట నా కేసు లింకను విచారణలో నున్నందున నా బాలుర నచ్చటనుంచి నా కొమార్తెతో మరల నిండియాకు వచ్చితిని. మేమూదేశమునకు వలసకూలి నొప్పందబడికల ప్రకారము పోయి చాలకాలముంటిమి. అందువలన నిచ్చటి బంధుగులతోడి సంబంధము

పోయినది ఆఫ్రికాలో మాకుండినహక్కులు నీచట్టమువలన పోయినవి. మేమేమిచేయవలెను?"

నాథమునికథ:—నాథముని మొదలియారనునతడు దక్షిణాఫ్రికాలోనే పుట్టిన భారతీయుడు భరతఖండమున పాడిపంటలు సమృద్ధిగానున్నవనియు, పనిదొరుకుననియు దక్షిణాఫ్రికా యుద్యోగులు చెప్పినమాటలువిని మోసపోయెను. ఇతనిని రిపాట్రియేషన్ స్కీము ప్రకారము ఇండియాకు పంపిరి. పాపము ఇతని బందుగులెల్లరును దక్షిణాఫ్రికాలో నున్నారు అతడు 19 వత్సరముల వయసువాడు. అతడు 'జిన్నింగు' ను నమ్మి నెలకు 6 పౌనులున్నర (97½ రూప్యములు)వచ్చు వేతనమును వదలుకొని హిందూదేశమునకు వచ్చినాడు. ఇతని కిచ్చట నేయుద్యోగమును దొరకలేదు. అతనికి సాహాయ్యము చేయువారెవ్వరును లేరు. ఇట్టివారసంఖ్యాకులుగ నున్నారు" అని ఇండియన్సు యబ్రాడ్ అను పత్రికలో ప్రకటింపబడినది. భారతీయులను తెల్లవారును, ప్రభుత్వమువారును తిన్నగ చూడరైరి. రైళ్ళలోను, ట్రాముబండ్లలోను భారతీయులను నీగ్రోలతో పాటు వెనుకప్రక్క కూర్చుండునట్లు చేసిరి. ఎంత శుభ్రముగనున్న-భారతీయుడైన సంతియె ఎంత ధనవంతుడైన సంతె. ఎంత మడ్డివాడైనను తెల్లవాడు ఉత్తమాసనమునలంకరించును. భారతీయులు రాత్రి తొమ్మిదిగంటలైన పిదప తిరుగరాదు. ఇట్లు ఒత్తిడిచేసిన భారతీయులెల్లరు భరతఖండమునకు పోవుదురని వారియూహ.

దక్షిణాఫ్రికాలో పశ్చిమభాగముననున్న భారతీయుల స్థితియు బాగుగ లేదు. 1922 సం॥లో జీజీభాయిగారు వైసిరాయిగారి కంపిన రాయబారము మార్చి 22 వ తేదీన వారిని దర్శించి స్థితిగతులెల్ల చెప్పెను. ఈభాగము జర్మనీవారినుండి బ్రిటీషువారు తీసికొనక పూర్వము భారతీయుల రాకను నిషేధించు చట్టములు లేవు. ఇది దక్షిణాఫ్రికాసంయుక్త సమితిలో చేర్చబడినప్పటి నుండియు నీనిషేధము వచ్చినది. వీరి బాధలు నిజముగ నన్యాయములేయని వైసిరాయిగా రంగీకరించియు ఏమియు చేయజాల రైరి. వలన రాజ్యములకు స్వపరిపాలనము కలదు. వారి నెవ్వరేమన లేరు.

భారతీయ విద్వేషులు:— దక్షిణాఫ్రికాలోని నేటాలు ప్రావెన్షియల్ కాంగ్రెసువారు స్మట్సుసేనాని నాయకత్వమున భారతీయులకు వ్యతిరేకముగ ఆందోళనము చేయుచునె యున్నారు. హెర్టుజాగ్ గారి నాయకత్వమున జాతీయ పార్టీవారు వారికన్నను తీవ్రమగు భారతీయ విద్వేషులు. స్మట్సుసేనాని భారతీయులను గూర్చి మనము చేయునది పలుకునదియెల్ల సామ్రాజ్యమునకే సంబంధించుననిచెప్పి ,,వారికి మనము చేయగల ఉపకారము వారిదేశమునకు బొమ్మనుటయె” అనెను పరిపాలనమున ఆయన తరువాత ముఖ్యుడైన సర్ థామస్ వాట్ గారును ప్రభుత్వమువారి నీవిషయమున జాగ్రత్త దీసికొనునట్లు చేయవలెననిరి. వీరికాంగ్రెసు భారతీయులకు హానికరములగు తీర్మానములు రహస్యముగ చేసెను. భారతీయు

ల నెట్లయినను దేశమునుండి వెడలగొట్టవలెనని వీరు నిశ్చయించిరి.

శాస్త్రిగారి ఆశాభంగము:— 1921 సం॥ లో రైట్ ఆనరబుల్, వి. ఎస్. శ్రీనివాస శాస్త్రిగారు భారతీయుల పక్షమున సామ్రాజ్య సభలో భారతీయులకు సమాన పౌర హక్కులనిచ్చు తీర్మానము నుపపాదించినప్పుడు దక్షిణాఫ్రికా ప్రతినిధి తప్ప తక్కిన వారెల్ల రంగీకరించి యుండినందున, ఇది భారతీయులకు లాభకరముగ నుండునను తలంపు కలిగెను 1918 సం॥నాటి పరస్పర సంబంధతీర్మానమునె 1921సం॥లో మరల తీర్మానించిరి. బ్రిటీషు సామ్రాజ్యములోని ప్రతి భాగమువలెనె వలసవిషయమున స్వయం నిర్ణయ సూత్రము ననుసరించి వలసను నిషేధించు నియమములను చేసికొనుహక్కు భారతీయ ప్రభుత్వమునకు గూడ కలదని అంగీకరింపబడెను శాస్త్రిగారు సామ్రాజ్య వలస రాజ్యములందు తరువాత పర్యటనము సలిపినప్పుడీ తీర్మానములవలన లాభములేదని తెలిసినదని వ్రాసినారు. 1921 సం॥ తీర్మానపు సూత్రమును బ్రిటీషువారు ఆచరింపలేకపోయిరి స్మట్సు సేనాని తనశక్తి నుపయోగించి భారతీయ ప్రజలపట్ల నిరంకుశముగ ప్రవర్తించెదమని చెప్ప సాగెను

1923 సం॥ సామ్రాజ్యసభ:— తెజ్ బహదూర్ సప్రూ గారు 1923 సం॥ లో హిందూదేశపు దొరతనమువారి ప్రతి

నిధిగ సామ్రాజ్యసభకుపోయిరి. ఇండియామంత్రియగు పీలు ప్రభువును వైసిరాయియగు రీడింగు ప్రభువును భారతీయుల బాధ్యతలనుగూర్చి ముచ్చటించిరి. సభలో దక్షిణాఫ్రికా ప్రతినిధి స్మట్సుసేనాని మఱల భారతీయుల విషయమున పెదవి విఱచినాడు. 1923 సం॥ అక్టోబరు 23 వ తేదీన సామ్రాజ్య సభవారు వలసరాజ్యములలోని భారతీయులయొక్క స్థితిగతులనుగూర్చి యోజింపనిశ్చయించిరి. పీలుప్రభువు భారతీయుల స్థితినిగూర్చి చెప్పి వారి ఆశయములు నివేదించెను. సప్రూగారును ఆళ్వారు మహారాజుగారును (ఇండియా ప్రతినిధులు) మహోపన్యాసములజేసిరి. బ్రిటీషువారు స్వయముగ పరిపాలించుచున్న కెన్యా, ఉగండా, ఫీజీ దేశములలోనైనను భారతీయ వలసప్రజల స్థితిని విచారించి వారికి సమానహక్కుల నిచ్చువిషయమును విచారించుటకు, 1921 వ సంవత్సరపు తీర్మానము నమలులో పెట్టుటకు మార్గము లరయుటకును, ఒక సంఘము నేర్పాటుచేసి పంపుటకును అంతవరకును, భారతీయులకు వ్యతిరేకములగు చట్టములను ఆపుటకును తీర్మానించుటకు సప్రూగారు ప్రయత్నించిరి. ప్రాతపద్ధతులను కదలించుటకంతగ నిష్టపడకున్నను, ఈ తీర్మానముయొక్క ముఖ్యోద్దేశమునకు సభవారిలో స్మట్సుసేనానితప్ప తక్కినవారెల్లరంగీకరించిరి. భారతీయులకోరిక లసంభవములనియు, కెన్యాలో గాని దక్షిణాఫ్రికాలోగాని ఇట్టిబేరములు సాగవనియు స్మట్సు సేనాని పలికెను. బ్రిటీషు ప్రధానామాత్యుడగు బాల్డ్విను (Baldwin) గారు సప్రూగారి తీర్మానమును కొంతవరకు

అంగీకరించినట్లు చెప్పెను. సప్రూగారిందుకు సంతసించిరి కాని బ్రిటీషు రాజనీతి నిజాభిప్రాయములు కెన్యావిషయ మును తరువాత బయల్పడినవి.

---

# దక్షిణాఫ్రికా

## VIII

### గాంధీస్మట్సు ఒడంబడిక యొక్క గతి.

స్మట్సుప్రభుత్వము:— "రిపాట్రియేషను" పద్ధతి ప్రకారము నయముననో భయముననో బుజ్జగించియో బాధించియో స్మట్సుసేనానిప్రభుత్వమువారు భారతీయులను వెనుక కంపసాగిరి. అందువలన భారతీయుల జనసంఖ్య తగ్గినది. 1921 నాటికి దక్షిణాఫ్రికాలో 161339 రు మాత్రముండిరి. భారతీయులను దక్షిణాఫ్రికాకు రాకుండ నిషేధింపుడని ప్రబోధము సేయుటకొక సంఘము స్థాపింపబడెను. స్మట్సుగారి పరిపాలనమున హ్యూలెట్టు ఎన్నిక చట్టమువలన భారతీయులకు పూర్వముండిన కొలది ఎన్నికహక్కులుకూడ పోయినవి. డర్బన్ భూవిక్రయముల చట్టమువలన భూములు తెల్లవారికి ప్రత్యేకింపబడెను. ఆప్రదేశములందు భారతీయులు కొనరాదు. నేటాలులోని ఎన్నిక చట్టమువలన భారతీయులు స్థానిక సంస్థల కెన్నుకొనుహక్కు నశించెను. శాస్త్రిగారు కెన్యాపర్యటనము సలిపి స్మట్సుసేనానిని దర్శించిరి. అచ్చటి పరిస్థితులనుచూచి, బ్రిటీషుసామ్రాజ్యము "తెల్లవారల సామ్రాజ్యమనియు స్వతంత్రరాష్ట్ర సమ్మేళనము కాదనియు" గ్రహించిరి. లేనిచో కెన్యావలసరాజ్యమువారి యుద్దేశములను బ్రిటీషు సామ్రాజ్యమేల యంగీకరింపవలెను? ఇది నిజమయ్యెను.

నివేశనములచట్టము:— 1924 సంవత్సరమువచ్చినది. జనవరు 8 వ తేదీననె స్మట్సుసేనాని తన సుప్రసిద్ధమగు నివేశనములచట్టము (Class Areas Bill) ను ప్రచురించెను. "ఆదిమవాసులగు నేటీవులు" గాక ఇతర జాతులవారికి ప్రత్యేకముగ నివసించుటకును వర్తకము చేసికొనుటకును దేశమున నివేశనములను నిర్ణయించుట" కు నీశాసనమును చేయుచున్నామని ఉపోద్ఘాతమున వ్రాసిరి. ఇందువలన ఆయా జాతులవారాయాస్థలములందె నివసింపవలెను, వర్తకము చేయవలెను. ఇందుకు విరుద్ధముగ నివసింపదలచువారికిని వర్తకము చేయువారికిని లైసెన్సు లీయబడవు. ఇట్లు నిర్ణయింపబడిన నివేశనములలోని ఆయాజాతివారి ప్రతినిధులు ముగ్గురును ఒక అధ్యక్షుడునుకలసి ఒక సంఘముండును. వీరి సలహాను స్థానిక పరిపాలకులు కోరినచో వీరేదైన చెప్పవచ్చును. ఈచట్టము గాంధీస్మట్సు ఒడంబడికకు విరుద్ధముగ వర్ణభేదములను పురస్కరించుకొని ఆశియావారినిబాధించుటకు చేయబడినదనియు ఆయాతావులందుండు వారాయాతావులనె వర్తకము చేసికొనునట్లు శాసించి భారతీయులింతవరకు చేసికొనుచున్న వ్యాపారమును ఇది నిషేధించుచున్నదనియు తమ దక్షిణాఫ్రికా అనుభవములనుబట్టి యిట్టి ప్రత్యేకస్థలనిర్ణయము ఘోరముగ పరిణమించుననియు గాంధిమహాత్ముడు 1924 సం॥ ఫిబ్రెవరు 14 తేదీన చెప్పెను. స్మట్సుసేనాని ప్రభుత్వమున స్వదేశ మంత్రియగు డంకన్‌గారికి భారతీయులు దీనినిగూర్చి మొఱపెట్టుకొనిరి. ఈ చిత్తుచట్టమును భారతీయ

సంఘముల కంపినప్పుడు తమ యభిప్రాయములను ప్రభుత్వము వారికంపక సభలుచేసి తృప్తిపొంది యిప్పుడిట్లీల నిషేధించుచున్నారని ఆయనపలికెను. అయినను ఈచట్టము ప్రజాభిప్రాయము ననుసరించి ప్రత్యేక నివేశనములను నిర్ణయించుచున్నదనియు నిది భారతీయులను బాధించుటకు చేయబడుట లేదనియు సెలవిచ్చిరి. 1924 సం॥ మార్చి నెలలో సరోజినీదేవియు తూర్పు ఆఫ్రికానుండివచ్చి కేపులోను ట్రాన్సువాలులోను పర్యటనముచేసెను. ఆమె స్మట్సుసేనానిని డంకను మంత్రిని సందర్శించెను. కాని స్మట్సుసేనాని రాజతంత్రజ్ఞుడు. చల్లని మాటలతో కాలయాపనముచేసెను. పాశ్చాత్యులకును నలుపురంగు మిశ్రమజాతివారికిని ఆదిమవాసులకును నిశాసనమును వర్తింపజేయక భారతీయులనె గుఱిచేసెను. తెల్లవారి సేవకులందట్టి మిశ్రమజాతివారుండుటవలన నట్లుచేసిరి. చట్టమును శాసనసభలోమార్చిప్రవేశపెట్టి మొదటిమారు శాసించిరి. ఏప్రియలులో రెండవమారు చదివిరి. ఇంతలో స్మట్సుగారి ప్రభుత్వము పోయినందున చట్టమును పోయెను.

హెర్టుజాగ్ ప్రభుత్వము:—స్మట్సుప్రభుత్వము పోయినది. 1934 జూనులోని ఎన్నికలలో విజయులై స్మట్సుసేనానికి బదులుగ హెర్టుజాగ్‌గారు (Hertzog) ప్రధానామాత్యులైనారు. సమితి ప్రభుత్వమున యితర మంత్రులును మారినారు: డంకన్‌గారికి బదులుగ డాక్టరు డి. ఎఫ్. మాలన్‌గారు స్వదేశ వ్యవహారములకు మంత్రిగా

వచ్చెను. స్మట్సుగారి పక్షమువారివలెనె వీరును భారతీయులకు వ్యతిరేకులు. దీనికితోడు దేశములోని తెల్లవారు భారతీయ విద్వేషులై సంఘములుగనేర్పడి వీరినింకను అన్యాయపు చట్టములను చేయుమని ప్రోత్సహించిరి. అయినను మాలన్‌గారి పద్ధతిపూర్వమువలె ఘోరమైన నిర్బంధక రిపాట్రియేషన్ గాక కొంచెముభిన్నము. "ఆర్థికముగ తెల్లవారికి భయంకరమగు ఆశియావారి యొత్తిడి మనవారికి కలుగనీయరాదను సూత్రము నంగీకరించుచు ఇతరవలసదేశములందు నీసమస్య యుండుటవలనను మనదేశములోని ఆశియావారక్కడనేపుట్టి పెరిగి యుండుటవల్లను వారివిషయమున కొంచెము జాగ్రత్తగ ప్రసక్తికలిగించుకోవలెను. ప్రస్తుతపు జనాభాలెక్క ప్రకారము దక్షిణాఫ్రికాలోనున్న 161000 మంది ఆశియావారిలో 102000 మంది మెల్లిగ దేశమునుండి సాగనంపబడినారు. అట్లు పోవువారిసంఖ్య తగ్గుచున్నది. గనుక వారిని పొమ్మని ప్రోత్సహించుటకును తమ దేశమునకు వెడలిపోవుట కంగీకరించినవారికి విరాళము (Bonus) గ తలకు 10 పౌనులు కుటుంబమునకు 50 పౌనులను ఇచ్చుటకు గవర్నమెంటువారు నిశ్చయించినారు. ఈపద్ధతి ప్రకారము ఆశియావారిని తమ తమ దేశములకు పొమ్మని ప్రోత్సహించుటకు ప్రయత్నములు జరుపబడును. ఈ విషయము మనజాతీయ క్షేమమునకు ముఖ్యమైనది. గనుక అందరును సాహాయ్యము చేయవలెను." అని 1924 సం॥ ఆగష్టు నెలలోనే మాలన్‌మంత్రి పలికెను.

నేటాలు ట్రాన్సువాలు పరగణాలలో ఆసియావారలు ప్రత్యేకముగ నుండుటకు వర్తకము చేయుటకు స్థలములను నిర్దేశించుటకును, ఇతరచోట్ల నిషేధించుటకును, ఆయా ప్రదేశములలో ⅔ వంతు భూస్వాములు మేజస్ట్రీటుగారి ఆధిపత్యమున తీర్మానించినచో ఆసియావారికి భూవిషయిక హక్కులను నిషేధించి కవుళ్ళు పుచ్చుకొను క్రయములుపొందు హక్కులు లేకుండచేయుటకు ఆసియావారు యూరపియను స్త్రీలను పనులకు నియమింపకుండ కఠిననిషేధము చేయుటకును, ఆసియావారి సంపర్కముకల యూరపియను సంస్థలలో యూరపియను స్త్రీ పురుషులు పనిచేయకుండుటకును, ఇకముందు ఆసియావారికి ఇతరచోట్ల వర్తక లైసెన్సు లీయకుండుటకును, ఉన్న లైసెన్సులు ట్రాన్సుఫరు చేయకుండుటకును, యూరపియనుల పేళ్లతో ఆసియావారు వర్తకము చేయకుండగను, దివాలా యైపోయినట్టిగాని ఋణదాతలతో రాజీచేసికొన్నట్టికాని ఆసియావర్తకుల లైసెన్సులు రద్దుచేయుటకును, రాబోవు పార్లమెంటులో శాసనము చేయబడవలెనని 1924 సం॥ సెప్టెంబరులో తెల్లవారు సభచేసి తీర్మానించిరి.

భారతీయ విద్వేషుల కోర్కెల ననుసరించి భారతీయులకు వ్యతిరేకములగు చట్టములుచేసియు వారిని ప్రోత్సహించియు బాధించియు దేశములోనుండి వెడలగొట్టుటకు హెర్టు

జాగు పరిపాలకవర్గమువారు కృతనిశ్చయులైరి. ఈ యుద్దేశ్యముతో నొక చిత్తు చట్టమును తయారుచేసిరి.

వర్ణభేదశాసనము:-- నేటీవులను, ఆసియావారిని గనులందును కర్మాగారములందును పనిచేయకుండ నిషేధించుటకు (Mines and Works Act) చట్టమును మాలనుమంత్రిగారు 1925 సం॥ ఫిబ్రవరిలోనే దక్షిణాఫ్రికాసమితి అసెంబ్లీ శాసనసభలో ప్రవేశపెట్టిరి. ప్రభుత్వమువారికి శాసనసభయందు వ్యతిరేకపక్షము (Opposition) నాయకుడగుస్మట్సునేతానియు నీ విషయమున గవర్నమెంటు పక్షముననే తన సమ్మతి నిచ్చెను కాని ఇతడు దూరదృష్టితో దీనివలన పెద్ద యాందోళనము పుట్టుననిఅప్పుడె పలికియుండెను. తాను 1914 సంవత్సరములో గాంధిగారితో చేసిన ఒడంబడిక కిది విరుద్ధమని అతని యంతరాత్మ బోధించియుండును. ఈ బిల్లు మొదటిసారి తీర్మానింపబడెను. తరువాత దీనిని రెండవమారు చర్చించుటకు రెండునెలలలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధానామాత్యుడగు హెర్ట్సుజాగుగారె 'అభేదభావమునకును వర్ణభేదములు లేకుండచేయుటకు' నింకను తరుణము రాలేదనియు అయినను భేదము కనబరచునప్పుడు మాత్రము ఇతరుల కెవ్వరికిని కోపము గలుగకుండ, స్మట్సుగారే ఆసియావారలకు వ్యతిరేకముగ చేయించిన శాసనములందువలెనె జాగ్రత్తగ ప్రవర్తింపవలెనియు సమితి శాసనసభలో నుపన్యసించిరి. ప్రభుత్వమునకు

వ్యతిరేక కక్షిలో స్మట్సుగారు లేనప్పుడు నాయకత్వము వహించుచుండు సర్. తామస్‌స్మార్టుగారు ఇది వర్ణభేదమును స్థాపించుచున్నదనియు, ఇది జపానువంటి గొప్ప రాజ్యములకు కష్టము గలిగించునని యు నీబిల్లును రెండవమారు తీర్మానించవలదనియు నీ శాసన విషయమును విచారించుటకు కమిటీ వారి నేర్పరచుడనియు చెప్పిరి. పూర్వము స్వదేశవిషయ మంత్రిగ నుండిన డంకన్‌గారును దీనికి ప్రతిఘటించిరి. ఈ చట్ట నిలువు చేయబడెను. ఈ చట్టమును అసెంబ్లీవారు తీర్మానింపగ సెనేటువారు త్రోసివైచిరి.

కూలిచట్టము :— నేటీవులు, నల్లవారు తక్కువకూలికి పనిచేసి తెల్లవారికి నష్టము కలిగించుచున్నందున తక్కువకూలికి పనిచేయుట నిషేధింపబడుచు నీ శాసనము చేయబడెను. ఈ బిల్లును ప్రవేశపెట్టి తీర్మానించునప్పుడు ప్రభుత్వమువారు నిర్ణీత సంఖ్యసభ్యులు అసెంబ్లీలో నుండునట్లు చేయుటయే దుస్తరమయ్యెను. తెల్లవారువరకును కూర్చొని శాసనముగ చేసివైచిరి. కొందఱు ప్రతిఘటించినను లాభములేకపోయెను.

ఆసియాచట్టము :— దక్షిణాఫ్రికాసమితి స్వదేశ విషయ మంత్రియగు డాక్టర్ మాలన్‌గారు ఆసియావారికి వ్యతిరేకమగు మఱియొక చట్టమును ప్రవేశపెట్టుట కుద్యుక్తుడై దానిని తయారుచేసెను. ఈ చట్టము సమితి పార్లమెం

టులో చర్చకుమాత్రమె ప్రవేశపెట్టబడుననియు తీర్మానము కాకముందె 1925 సంవత్సరము ఆగస్టునెల 1 తేది మొదలు కొని అమలులో పెట్టబడుననియు చెప్పినాడు. దీనినిగూర్చి దక్షిణాఫ్రికా జాతీయ కార్మిక ప్రభుత్వ పార్టీవారు ముందు గనె ఆలోచించుకొనిరి. ఈ చట్టము యొక్క చిత్తును ప్రక టించి వెంటనే అమలులో పెట్టదలచిరి. పార్లమెంటు పద్ధతు లకు భిన్నమగు నీ వింతపద్ధతిని సమితిశాసనసభ్యులుగ స్మట్సు సేనానిగాని అలెగ్జాండరుగాని విమర్శింపరైరి. ఒకే విధమగు రంగు, సంఘాచారములు కలవారు కాపుర ముండుటకును వర్తకము చేయుటకును కొన్ని ప్రదేశములు నిర్ణయించుట కును, 1908 సంవత్సరపు వలసచట్టమును 1914 వ సంవత్సరమున జరిగిన గాంధీస్మట్సు ఒడంబడికయొక్క ఫలితమగు 1914 వ సంవత్సరపు ఇండియన్ రిలీఫు చట్టమును 1908 వ సంవత్సరపు ఆసియావారి రిజస్ట్రేషన్ అమెండుమెంటు (ట్రాన్సువాలు) చట్టమును మార్చుటకును కొన్ని శాసనములు మార్చుటకును కొన్ని రద్దుచేయుటకును (Reservation, Emigration and Registration, Further Provisions Bill) ఆసియా చట్ట మును ప్రవేశపెట్టుటకు బిల్లు (చిత్తుచట్టము) తయారుచేసిరి. ఇందు తెల్లవారెల్లరకొకేవిధమగు సంఘాచారములు కలవని యుదాహరింపబడినది. ఇది నేటీవులకును కేపులోని మిశ్రమ జాతిరంగువారికని కేపు మలయులకును మారిషసు సెంటు

హెలీనావారికిని వర్తింపదు. అనగా ఆసియావారికి వర్తించును. ఆదిమవాసులకును వర్తించును. ఈ శాసనములోని ప్రథమభాగము 1924 వ సంవత్సరములో స్మట్సు గవర్నమెంటువారు తయారుచేసిన (Class areas Bill) నివేశముల చట్టముమాదిరిగనే నిర్మింపబడినది. ఏ జిల్లాలోనైనను అధికారులాయా దేశములందొక ప్రత్యేక సంఘాచారములు కలవారు చాలవరకు నివసించుచున్నారనిగాని వర్తకము చేయుచున్నారనిగాని మంత్రిగారికి తెలియపరచినచో మంత్రిగారు ముగ్గురు మెంబర్లుకల కమిటీని పంపి వారి రిపోర్టుపైన ఈ శాసనము నా ప్రదేశములో అమలుజరుపమని సిఫార్సుచేయవచ్చును అంతట ఆరునెలలలో గవర్నరుజనరలుగా రాప్రదేశములో శాసనము నమలులో పెట్టినామని ప్రచురించి ఆ ప్రదేశములో ఆ సంఘాచారములు కలవారుతప్ప ఇతరులు స్థిరాస్తిని క్రయముగాని కవులుగాని పొందరాదని శాసింపవచ్చును. ఈ శాసనము పూర్వము జరిగిన గాంధీస్మట్సు ఖరారునామాకు విరుద్ధమయినది. ఇది స్మట్సు గవర్నమెంటువారు అప్పుడు ఆచరణలో పెట్టని 1920 వ సంవత్సరములో (Asiatic Inquiry commission) ఆశియా విచారణసంఘమువారు విన్నవించిన నివేదిక యొక్క ఫలితము. ఈ శాసనముయొక్క రెండవభాగము వలసకు సంబంధించినది. అయిదు సంవత్సరము లయినతరువాత భార్యకాని మయినరు బిడ్డగాని వచ్చుటకు వీలులేదని నిషేధిం

చుచున్నది. బహు భార్యాత్వము కల (Exempted Persons) వారి భార్యలను చట్టము అంగీకరింపదు వారి వివాహమును బహిష్కరించుచున్నది. ఇదియు పై ఖరారుకు విరుద్ధమె ఇదియు భారతీయుల వలన నాపుటకె జేయబడినది. మూడవ భాగము ఆశియావారి రిజస్ట్రేషను గూర్చియు వారిని వెనుక కంపుటను గూర్చియు చేయబడిన నియమము. ఇది 1914 వ సంవత్సరపు ఇండియన్ రిలీఫు చట్టములోని 6వ శెక్షను మార్చుచున్నది. ఇందువలన భారతీయుల కోరికపైన నేరేవునకైనను ఉచితముగ కేవునిచ్చి సాగనంపు ప్రయత్నము చేయబడినది. దివాలా తీసినవారు మున్నగు మోసగాండ్రను వెనుక కంపవచ్చుననియు నిది శాసించుచున్నది.

వర్ణభేద తత్వము:-"న్యాయశాస్త్ర ముఖమున ప్రజలను పాలించుపట్ల వర్ణము జాతి భాష మతములనుబట్టి భేదము పాటింపబడకూడదు. నిష్పక్షపాతముగ నెల్లరకును న్యాయము ప్రసాదింప బడవలెను "అని 1843 సం॥ మేనెలలో నేటాలును కలుపుకొనుచు విక్టోరియా మహారాజ్ఞి ప్రకటించియుండెను. ఈవాగ్దానమునకీ క్రొత్తచట్టము భంగము కలిగించుచున్నది. పూర్వము బంగారుగనుల చట్టము 1911లో సుప్రీముకోర్టువారు చెల్లదని తీర్మానించినందున ఆ చట్టమునె మణుల గనుల చట్టమని (Mines and works Act..) క్రొత్తపేరుతో చేసి వర్ణభేదమును స్థాపించుటకు తీర్మానించినారు. ఇందువలన నేపని

నైనను చేయుటకుతగినవాడని మంత్రిలు (సర్టిఫికెట్టు) పత్రము నిచ్చినగాని పనిచేయరాదు. అట్టిపత్రమును (నేటీవు) ఆదిమ వాసులకును (ఆశియా) భారతీయులకు నీయబడదు. ఇదియె ఈవర్ణభేద చట్టము యొక్క ఉద్దేశ్యము. నివేశనముల చట్టము (Class areas Bill) యొక్క ఉద్దేశ్యము మాలన్‌మంత్రి గారె వాక్రుచ్చినారు "భారతీయులు మనదేశములో పరదేశీయులు. వీరిసంఖ్య తగ్గించనిచో నీసమస్య మనదేశమునకు అనుకూలించునట్లు పరిష్కారము కాదు. ఈ చట్టము మాప్రతికక్షిదారులు (స్మట్సుప్రభుత్వము వారు) చూపినదారినె పోవుచున్నది. కాని దీని ఉద్దేశ్యమింకను గాఢము. ఒత్తిడికలిగించుటయె ఈచట్టము యొక్క పద్ధతి." అని చెప్పియున్నారు. "ఈఒత్తిడి, ఐదు విధములు. స్థిరాస్తిని కొనుట కవులుపొందుటకు వర్తకము చేయుటకు ప్రదేశములు ప్రత్యేకించుట. ఇందువలన ఓట్లు (Votes) లేని భారతీయుల పురపారిశుద్ధ్యమును చూడువారుండరు. వారి వర్తకమును చెడును, వర్తకము చేసికొననిచ్చు అధికారమును పరిపాలకుల యిష్టమును బట్టియుండును. నేటాలులో సముద్రతీరమున ముప్పది మైళ్ళపర్యంతము తప్ప దక్షిణాఫ్రికాలోని భూములనుకొనుటగాని కవుళ్ళనుపొందుటకుగాని హక్కు లేకుండ చేయుట. దేశమునకుపోయి మరలివచ్చు భారతీయుడు తాను వచ్చుట కర్హుడెయని స్థిరపర్చుకొను వరకును జామీనుగా చెల్లించవలసిన మొత్తమును 80 పౌనుల

నుండి 100పౌనులకు హెచ్చు చేయుట. టొ్రిన్సు వాలులో యుటెి్రక్టు వె్రిహీడు జిల్లాలలో గనుల ప్రదేశములనుండి భారతీయులను వెడలగొట్టుట. భారతీయులకు కష్టములు కలుగునట్లు భార్య బిడ్డలు రాకుండ చేయుట పనులకు రిజష్టరు చేయించు కొను హక్కునుతీసివేసియు వారికి ఒత్తిడి కలిగించుట" అని ఆలివియరు ప్రభువుగారు (Lord Olivier) పత్రికలలో వ్రాసినారు.

నల్లవారు తెల్లవారిసంఖ్యనుమీరి సమానమగుహక్కులను కోరుచున్నారనియు ఉత్తరరాష్ట్రములు, ఫ్రీస్టేటు టొ్రిన్సువాలులోని బోయరులీది సహింపరనియు యుద్ధమునకు బగుదురనియు హెర్టుజాగుగా రుపన్యసించియుండిరి. నల్లవారికి ఎన్నిక హక్కులు లేకుండ చేయుటకును దక్షిణాఫ్రికాసమితి యందెల్ల వర్ణభేదము స్థాపించుటకును నల్లవారు కేతిపనులు చేయకుండ నిషేధించుటకును (White traders Unions) తెల్లవారు 1911లో జోహానసుబర్గులో తీర్మానించిన వర్ణభేదములు చెల్లవని 1923లో సుప్రీము కోర్టువారు ఇచ్చిన తీర్పును రద్దు చేయుటకు నీశాసనమును దక్షిణాఫ్రికావారు చేయుచున్నారని నెవిన్సనుగారు (H. W. Nevinson) పత్రికలలో వ్రాసినారు.

"ఆశియా శాసన మమలులోనికి వచ్చినచో గౌరవముగ బ్రతుకుచున్న హైందవ కుటుంబములు ఆరోగ్యప్రద

ములగు మెట్టప్రదేశములనుండి పోయి సన్ననితీరమున ఊబి భూములలో అనారోగ్యకరములగు పరిస్థితులలో నివసింపుమని గవర్నరుజనరలు శాసింపవచ్చును. 500 మొదలు 100 వర్తకస్థానములున్న భూములు ఈ శాసనము క్రిందికి వచ్చును. 15000 మంది భారతీయుల కీశాసనము వర్తించును. కవుళ్లుపొందిన వర్తకులు చనిపోయినచో మరల కవుళ్లు ఆ ప్రదేశములలో నీయరు. అప్పటినుండి భారతీయులు అంగడి మూసికొని పోవలసినదె. ఆ ప్రదేశములో భారతీయుల కేమైన భూములున్నచో యూరపియనులకె అమ్మవలెను. కవుళ్లీయవలెను. భారతీయుల నట్టాకమూల దూరముగ పారద్రోలి వారికి పురపారిశుద్ధ్యవసతులు కల్పింపక అనారోగ్యము తెచ్చిపెట్టవచ్చును. వారు మడ్డివారని ప్రకటించి హక్కులు దీసివేయవచ్చును. భారతీయులు తమ భార్యబిడ్డల నిండియాకంపి మరల తీసికొనివచ్చుటకు ప్రతిబంధముల నేర్పరచవచ్చును. మెల్లమెల్లగ నీదేశమున నున్నవారు పోయి మరల వచ్చుటకు వీలులేని అడ్డంకులు కల్పింపవచ్చును. ఇంకొక నిబంధనము వలన భారతీయులు విదేశీయులుగ నెంచబడుదురు. ఇప్పుడేదైన పనిపాటులు చేసికొనవలెనన్న చేసికొననిమ్మని ప్రభుత్వమును ప్రార్థించి చేసికొనుచున్నారు. ఇకముందు కొన్నిపనులు భారతీయులు చేసికొననె కాదని నిషేధించవచ్చును. ఈ చట్టమువలన భారతీయ జనసంఖ్యలో సగముమంది దేశ

మువిడిచి పోవలసివచ్చునని తోచుచున్నది.” అని ఆండ్రూసుగారు వ్రాసినారు

గాంధీస్మట్సు ఒడంబడిక కిదివిరుద్ధమె:—తాము చేయుచున్న వర్ణభేద ఆశియా శాసనములు గాంధీస్మట్సు ఒడంబడికకు విరుద్ధము కాదనియు ఆశియావారికి వ్యతిరేకముగ శాసనములు చేయమని దక్షిణాఫ్రికావారెన్నడును వాగ్దానము చేయలేదనియు అచ్చటి రాజనీతుజ్ఞులనిరి. మాలను మంత్రిగారు నిర్ణయించిరి. తమ యొడంబడికకు విపరీతార్థములను చేయుచుండినందువలన దానియుద్దేశ్యమును తెలుపుడని గాంధిగారినె ఆండ్రూసుగారు కోరగ గాంధిమహాత్ముడు 1926 సం॥ జనేవరు 21 తేదీన ఇట్లు ప్రకటించెను. “దక్షిణాఫ్రికాలో ఇరువురు క్రైస్తవ మతాచార్యులీవిషయమున నన్ను సమర్థించినారు. ఎనిమిది సంవత్సరములు జరిగిన సమరము నీ ఒడంబడిక ముగించినది. అంతకుముందు జరిగినఇతర ఏర్పాట్లును రాజీలను ఈ యొడంబడిక తనయందు చేర్చికొనినది. ఈ ఒడంబడికతో మనఇండియా గవర్నమెంటుకు సంబంధము లేదని తలంపవలదు. అప్పుడే శాసింపబడిన ఇండియన్ రిలీఫు చట్టమున కినితోడ్పడినది ఈ సందర్భమున నాకును స్మట్సు గారికిని జరిగిన ఉత్తరప్రత్యుత్తరములు మేము ఉభయులము చూచికొంటిమి. రిలీఫుచట్టమున చేరని భారతీయుల కష్టములను గూర్చి నేను స్మట్సు సేనానికి వ్రాసిన లేఖలో సూ

చించి అందు ఉదాహరింపబడని కష్టములు కూడ క్రమక్రమముగ తొలగింపబడునుకదా యని వ్రాసియుంటిని. ఎనిమిదేండ్లింతో కష్టపడిన భారతీయులు ముందు తమస్థితిలో మేలు కలుగ చేయునట్టియు ఇంకను చిక్కులు కలిగించి తమను రూపుమాపునట్టియు రాజీనామాకు అంగీకరింతురా? వేయేల, భారతీయ కాంగ్రెసు వారీవిషయమును మధ్యస్థులు చెప్పినట్లు అంగీకరించుటకు తీర్మానించినారు కదా ఇండియా గవర్నమెంటువారు దక్షిణాఫ్రికా గవర్నమెంటువారిని దీని కంగీకరింప గోరిన జాలును. తాముచేసిన వాగ్దానములును, ఏర్పాటులును, చెల్లింపక పోవుట దక్షిణాఫ్రికా మంత్రులకిది మొదటిసారి కాదు. గోఖలేగారికి 3 పౌనుల పన్నునుగూర్చి చేసిన వాగ్దానము వారు చెల్లింపలేదు. ఇది సత్యాగ్రహ సమరముననొక కారణముగచేసి ఆందోళనము చేయుగ తుదకు రద్దుపడినది. పాతమోసమునే ఇప్పుడు మరల చేసినారు 1914 సంవత్సరపు ఒడంబడిక ప్రకారము జరిగించుమని కోరుటకు ఇండియాకు హక్కుకలదు. గాంధిగారీ విషయమును గూర్చి యంగ్ ఇండియాలో వ్రాయుచు ఈ ఒడంబడిక సత్యాగ్రహసమరపు కారణములనెల్ల ముగించినది. వర్ణమునుగాని జాతినిగాని గూర్చిన శాసనములు లేకుండ చేయుటకె ఆసమరము చేయబడెను. ఈ సంగతి పలుమారు నొక్కి చెప్పబడియుండెను. ఒకప్పుడు ప్రధానామాత్యుడు బోథాగారును స్మట్సుగారును జా

తిభేదములను గూర్చి భారతీయులు తలంచుట మానినచో అన్ని విషయములలోను తాము లొంగెదమనిరి. అంతట 1908 నుండి ఆభేదమునుగూర్చిన తలంపును పురస్కరించుకొనియె సమరము జరిగినది. ఈ విషయములో లొంగమని బోథాగారు రసియుండిరి ఇట్టిస్థితిలో భారతీయులకు సంబంధించిన శాసనములందు జాతిభేద ముండకూడదని ఒడంబడిక యొక్క అభిప్రాయము కాదా? అందువలన మాలను మంత్రి బిల్లు దీనికి భిన్నము. 1883 లో భారతీయులను గూర్చి ఇండియాగవర్నమెంటువారును ట్రాన్సువాలువారును మధ్యస్థులతీర్పు నంగీకరించిరి. ఆరెంజి ఫ్రీస్టేటు ముఖ్యన్యాయాధిపతి తీర్పునిచ్చెను. ఇంకొకమారు ట్రాన్సువాలు గవర్నమెంటును బ్రిటీషుగవర్నమెంటు నిర్ణే చేసికొనెను. ఇప్పుడు నా ప్రకారము చేయరాదా? అనివ్రాసిరి.

"దక్షిణాఫ్రికా రాజనీతిజ్ఞులు భారతీయులకు న్యాయమొనరింపనిచో తమబైబిలునే, దేవునే తిరస్కరించిన వారగుదురని ఈ కాంగ్రెసువేదికనుండి ముమ్మాటికిని చెప్పుచున్నాము" అనిగాంధిమహాత్ముడు 1925 సం॥ డిశంబరులో జాతీయమహాసభయందు పలికెను.

# దక్షిణాఫ్రికా.

## IX

### రాయబారములు.

గాంధిమహాత్ముఁడు :— దక్షిణాఫ్రికాలో జీవితార్థము గడపి ఎనిమిదేండ్ల హోరాహోరాత్రములు ప్రభుత్వము వారితో సాత్త్విక నిరోధ సమరమునెఱపిన సత్యాగ్రహ మహోద్యమ నాయకుఁడగు గాంధి మహాత్ముఁడు, స్మట్సు సేనాని వాగ్దాన భంగము చేయగ, హెర్ట్జుగు ప్రభుత్వము వర్ణభేదమును పురస్కరించుకొని భారతీయులను రూపుమాపుటకు ప్రయత్నించుచుండగ, దుఃఖల నచ్చటికేలపోలేదని కొందఱడుగవచ్చును గాని గాంధిమహాత్ము డూరకొని యుండలేదు. ఆయన జీవితమె ఒక సత్యాగ్రహచరితము. ఆయన యభినవ ప్రహ్లాదుఁడనిన నతిశయోక్తి లేదు. 1915 సంవత్సరమున నాయన మనదేశమునకు వచ్చినంతనే బ్రిటీషు సామ్రాజ్యమున భరత ఖండము సమానగౌరవమును పొందవలెనన్నచో దేశరక్షణము చేసికొనుట యవసరమనియు ఆయుధములు ధరించి రణవిద్య నేర్చుకొనుట ముఖ్యమనియు నైరోపాసంగ్రామమున సైనికులుగ భారతీయులు చేరవలెననియు తలచి సైనికుల జేర్చెను. ప్రభుత్వమువారు వీరి సేవకు మెచ్చి కైసరిహింద్ బంగారుపతకము బహుమానమిచ్చిరి. ఈయన కత్యంతప్రియుఁడును గురువునగు గోపాలకృష్ణగోఖలేగారు మరణించుట దుఃఖకారణమయ్యెను. గాంధిమహాత్ముఁడాయన చేయుచుండిన పరోప

కారమును సంఘసంస్కారమును రాజకీయ సంస్కారప్రయత్నమును చేయసమకట్టెను. 1915 సంవత్సరాంతమున తాను దక్షిణాఫ్రికాలో స్థాపించిన ఆశ్రమములకన్న నుత్తమపద్ధతులతో అహమ్మదాబాదు దగ్గర సబర్మతీ సత్యాగ్రహాశ్రమమును స్థాపించెను. సత్యము, దయ, క్షమ, ధృతి, మితాహారము, ఆర్జవము, బ్రహ్మచర్యము, అస్తేయము, అహింస, శౌచము, సనుదశయమములతోపాటు స్వదేశవ్రతము, అస్పృశ్యతానివారణము దేశభాషోద్ధరణము, నూలువడుకుట, పవిత్రరాజకీయ జీవనము వ్రతములుగ దీక్షగైకొని గాంధిగారు దేశోపకారము చేయసాగిరి. ఆకాలమున నీయనచేసిన సంఘ సంస్కారప్రయత్నములునిరుపమానములు. కర్షకులకును కార్మికులకును నీయనచాలా సాహాయ్యము చేసి వారికి బ్రతుకుతెరువును చూపి రక్షించిరి. అహమ్మదాబాద్ కర్మాగార యజమానులకును కార్మికులకును సంధిచేసిరి. బీహారులో చంపారణ్ జిల్లాలో నీలిమందు తోటల యజమానులు కూలివారిని బాధించుచుండిరి. 1917 సం॥లో గాంధిగారచ్చటికి పోవదలచగ ప్రభుత్వమువారు ఆయనవచ్చుట ప్రజాశాంతికి భంగము కలుగునని నిషేధించిరగాని ఆయన ఉత్తరువును నిరాకరించి సత్యాగ్రహము ప్రారంభించిరి. తరువాత ప్రభుత్వమువారు అచ్చటి పరిస్థితులను విచారించి ఒక చట్టమునుచేసి బాధలను కొన్నిటిని మాన్పిరి. 1916—1917 సంవత్సరములలో గుజరాతు రాష్ట్రమున కైయి

రాజిల్లాలో గొప్ప కఱవువచ్చెను. శాస్త్రప్రకారము పన్నులు పుచ్చుకొనకుండ మానవలసియున్నను కెయిరా కమీషనరు గారు ఒక్క గ్రామమునతప్ప తక్కిన 600 గ్రామములందును పన్నులు వసూలుచేయ ప్రయత్నించిరి. 104 గ్రామములందు మాత్రము సగముపన్ను వసూలుచేసెదననిరి. అచ్చటి రైతులు తిండిలేక బాధపడుచుండిరి. గాంధిమహాత్ముడును వల్లభభాయి పటేలుగారును అచ్చటి పరిస్థితులను విచారించి ప్రభుత్వమువా రట్లు చేయుట న్యాయముకాదనిరిగాని వారు వినలేదు. అంతట గాంధిగారు 1918 సం॥ లో సత్యాగ్రహమును పూనుడని ప్రజలకు బోధించిరి. 200 మంది దీక్షను గైకొని పన్నులీయ నిరాకరించిరి తుదకు ప్రభుత్వమువారు బీదవారీయనక్కర లేదనిరి. చెరసాల కంపినవారిని విడచిరి. ఇట్లు గాంధిగారు సత్యాగ్రహవ్రతానుష్ఠానమును చేయుచుండిరి. ఇట్లు ప్రభుత్వముతో పోరాడియు సంగ్రామమునకు సైనికులను చేర్చుటకు కెయిరాలోనె సభచేసి ప్రబోధము చేసిరి.

ఇంతలో భరతఖండమున అరాజక విప్లవ యుద్యమములను గూర్చి ప్రభుత్వమువారు విచారించుటకు నియమించిన రౌలట్ సంఘమువారు ని వేదికను ప్రకటించిరి. ఎవరైన ననుమానము మీద పట్టుకొనవచ్చుననియు శిక్షల విధింపవచ్చుననియు నొక ఘోరచట్టమును 1919 సం॥ లో ప్రభుత్వమువారు చేయదలచిరి. గాంధీగారీచట్టములుచేయుట యన్యాయమనియు భార

తీయుల స్వేచ్ఛకు భంగకరమనియు, అవమానకరమనియు దేశమున తిరిగి బోధించి వీనిని మార్చువరకు సాత్విక విరోధమును చేయుదుమని సత్యాగ్రహ దీక్షను గైకొనుడని ప్రజలకు చెప్పి సత్యాగ్రహ మహోద్యమమును ప్రారంభించిరి. పంజాబు ప్రభుత్వమువారు భారతీయ జాతీయ పత్రికల నడగద్రొక్కిరి. నాయకుల చెరసాలలం దుంచిరి. గాంధిగారిని రావలదని నిషేధించిరి. గాంధిగారు యంగ్ ఇండియా పత్రికను స్థాపించి ప్రబోధము చేసిరి. 1919 సం॥ యేప్రిలు 9వ తేదీ స్మరింపదగిన దినము. ఆనాడు నిర్దోషులును, అసహాయ్యులు నగు భారతీయులను పంజాబులో అమృతసరమున జాలియన్ వాలాబాగ్‌లో డయ్యరు సేనాని తుపాకితో కాల్చివైచెను. సైనికచట్టము (Martial Law) ప్రకారము ప్రభుత్వమువారు ప్రజలను బాధించి అవమానపరచిరి. భారతీయ ప్రభుత్వమువారు మహమ్మదీయులకు ఖిలాఫతు విషయమున నన్యాయము చేసిరి. ఈ యవమానములను చూడగ స్వరాజ్యము చేకూరినగాని భారతీయుల ఆత్మగౌరవము నిలువదని గాంధిమహాత్మునికి దోచినది 1920 సంవత్సరము కలకత్తాలో నొక స్పెషల్ కాంగ్రెసు సమావేశమయ్యెను. ఇందు గాంధిమహాత్ముని సుప్రసిద్ధ సహాయనిరాకరణోద్యమము ప్రారంభింపబడెను. సంపూర్ణ స్వరాజ్యము చేకూరినగాని భారతీయులకు భరతఖండమునను దేశాంతరములను జరుగుచున్న అన్యాయములు

పోవని గాంధిమహాత్ముడు గ్రహించెను. ప్రభుత్వమువారిని భిక్షమడుగుట మాని స్వయంకృషి ఆత్మవిశ్వాసము నూని రాజకీయ సాంఘిక సంస్కరణముల జేసికొని ఐకమత్యముతో మెలగి ప్రభుత్వముతోడి సంబంధమె వదిలి స్వరాజ్యస్థాపనము చేయుటకు గాంధిగారు ప్రతిజ్ఞ చేసిరి. అస్పృశ్యతను బాపి త్రాగుడుమాన్పి ఖద్దరు నభివృద్ధిచేసి నిర్మాణ కార్యక్రమమును చేయదలచిరి. ప్రభుత్వసంస్థలను, శాసనసభలను న్యాయస్థానములను పాఠశాలలను భారతీయులు బహిష్కరించవలెనిరి. బిరుదములను వదలుమనిరి. బ్రిటీషు పరదేశవస్త్రములను బహిష్కరింపుడనిరి. ఈవిధానమున వేలకొలది భారతీయులు పాల్గొనిరి. ఒకకోటిరూప్యములు భారతీయ స్వరాజ్యనిధిగ లోకమాన్యుని పేరిట సమకూర్చి కార్యసాధన చేసిరి. వేలకొలది భారతీయులు చెఱసాలలకేగిరి. నాయకుల నెల్లరను చెరసాలకంపిరి. నాగపురమున స్వరాజ్యపతాకము నూరేగింపకూడదని ప్రభుత్వమువారనిరి. అందువలన గొందఱు సత్యాగ్రహముచేసి చెరలకేగిరి. గాంధిమహాత్ముడు శాసనోల్లంఘనము చేసి ప్రభుత్వమును ధిక్కరింప నిశ్చయించెను. గాని ఈదౌర్జన్యరహిత యుద్యమమున కొందఱు దౌర్జన్యము చేయుటచూచి దేశమింకను సిద్ధముగలేదని శాసనోల్లంఘనము నిలిపిరి. 1922 సంవత్సరము ఫిబ్రెవరి 15వ తేది భరతఖండమునకు స్మరింపదగిన పుణ్యదినము. ఆనాడు భారతీయ మోక్షసాధన చేయ బూనిన పుణ్య

మూర్తిని గాంధిమహాత్ముని పట్టుకొని ఆరేండ్ల శిక్షవిధించిరి. తరువాత నాయనకు ప్రాణభయమునె కలిగించిన రుగ్మత కలుగుటయు శస్త్రచికిత్సచేయుటయు ప్రభుత్వమువా రాయనను 1924 సం॥ ఫిబ్రవరి 5 వ తేదీన విడచుటయు మనమెరిగినదె. గాంధిమహాత్ముని కార్యవిధానమును జనులు పూనలేకపోయిరి. అంతట కాంగ్రెసులో అభిప్రాయభేదములు కలిగెను 1924 సం॥ డిశంబరు 26 వ తేదీన గాంధిమహాత్ముడు కాంగ్రెసు మహాసభయందె తనయుద్దేశమును తెలిపెను. "భారతీయజాతి సంసిద్ధముగ లేనందున సహాయనిరాకరణము నాపదలచితిని. కాని ప్రభుత్వమిట్లున్నంతకాలమును నే నాపద్ధతిని స్వయముగ విరమించను. అదియొక పద్ధతిమాత్రమెగాక నాకొక మతసిద్ధాంతముగనున్నది. సహాయనిరాకరణమును శాసనోల్లంఘనము నొకే సత్యాగ్రహ కల్పవృక్షము యొక్క శాఖలు. సత్యాగ్రహము సత్యాన్వేషణము. పరమేశ్వరుడే సత్యస్వరూపుడు. అహింసయె సత్యసాధనకు మార్గము చూపుచున్నది. స్వరాజ్యము సత్యాంతర్గతమని నాఅభిప్రాయము. దక్షిణాఫ్రికాలో చంపారణ్యలో కెయిరాలో నింకనెన్నో సందర్భములందు సత్యాగ్రహము నన్ను కృతకృత్యుని చేయకపోలేదు. అందు హింసకును అసహిష్ణుతకు నెడములేదు. ఇంగ్లీషువారిని నేనసహ్యించుకొనునుగాని వారి కాడిని (Yoke) నేను మోయను. బ్రిటీషు సంస్థలను బ్రిటీషు పద్ధతులను మనపైన విధించువారి

ఘోరప్రయత్నములును నేను నాజీవితాంతముపరకును సాత్వికముగ నిరోధింతును భరతఖండము సాత్వికముగనె ఇంగ్లీషు ప్రభువులతో సమరము చేయగలదు. మన ప్రయత్నమున కపజయము కలుగలేదుగాని మన మనుకున్నంత లాభము కలుగలేదు. దీని నాపుటయు నొక విధానమె. సత్యాగ్రహమునకెన్నడు నపజయముండదు. ఒక్క సత్యాగ్రహియైనను సత్యప్రదర్శమునకు జాలును. స్వరాజ్యమువలెనె సత్యాగ్రహమును మన జన్మబాధ్యత. దీనిని మనము తెలిసికొందము" అని అప్పటినుండి నిర్మాణకార్యసాధనకు గడంగినాడు. గాంధిమహాత్ముడిట్లుభరతఖండమున పాటుపడుచున్నను దక్షిణాఫ్రికాలోని భారతీయుల క్షేమమును నారయుచునెయుండెను. భరతఖండము ఆత్మరక్షణ చేసికొన గలిగినచో ఖండాంతరముల నున్న భారతీయులకును సాహాయ్యము చేయగలదనియే గాంధిమహాత్ముడు తలచి యిట్లు పాటుపడుచుండెను. ఆయనను విడచితిమని ప్రభుత్వమువారు చెప్పగ నీవార్తను సబర్మతిలో తనవారికిని డర్బనులో రుస్తుంజీగారికిని గాంధిగారు తెలుపుడనిరి. దీనివలననే ఆయనకు దక్షిణాఫ్రికా యెడలగల ప్రీతి తెలియగలదు. ఇట్లు గాంధిమహాత్ముడు భరతఖండమున దేశసేవ చేయుచు తమ పుత్రులను దక్షిణాఫ్రికాలో పనిచేయ నియోగించెను. భరతఖండమున దక్షిణాఫ్రికా సమస్యనుగూర్చి ప్రజాభిప్రాయమును కలిగించెను. గాంధిమహాత్ముని నాయకత్వమున

భారతీయ కాంగ్రెసు మహాసభ దక్షిణాఫ్రికా భారతీయుల యెడల సానుభూతిచూపెను. ఇట్లాయన దక్షిణాఫ్రికా కొఱకు పాటుపడుచునేయుండెను.

వర్ణభేద చట్టము, భారతీయుల అసమ్మతి :—వర్ణభేద ఆశియా చట్టములను దక్షిణాఫ్రికావారు శాసింప ప్రయత్నించుచుంట జూచి దక్షిణాఫ్రికాలోని భారతీయులు మేల్కొనిరి. దక్షిణాఫ్రికా భారతీయ కాంగ్రెసు సభవారు ధనము ప్రోగుజేసియు, రాజకీయ నాయకులకడకు రాయబారముల నంపియు సభలను చేసియు అసమ్మతిఁ దెలిపియు పనిచేయసాగిరి. 1925 సంవత్సరము అక్టోబరు 11 వ తేదీ అసమ్మతిఁ దెలుపు దినముగ గమనింపఁబడెను. నవంబరునెలలో దక్షిణాఫ్రికా భారతీయ కాంగ్రెసు మహాసభ కేపు టవునులో "సిటీ హాలు" భవనమున జరిగెను. పురపాలక సంఘాధ్యక్షులు (Mayor)ను భారతీయుల క్షేమమును గోరు పరోపకార పారీణుడునగు డబ్లియు. ఎ. ఫ్. ఫిషరుగా రగ్రాసనాధిపత్యము వహించిరి. దక్షిణాఫ్రికాప్రభుత్వమువారికడకు భారతీయ ప్రతినిధులను రాయబారమంపుటకు తీర్మానించిరి. ఆ సభ జరుగుచుండగనే దక్షిణాఫ్రికాస్వదేశమంత్రి మాలనుగారు భారతీయ ప్రతినిధులను జూచెదనని తంతివార్త నంపిరి. అంతట సుప్రసిద్ధన్యాయవాదియగు గాడ్ ఫ్రేగారును ఇతరభారతీయ ప్రతినిధులును మంత్రిగారిని చూచుటకు ప్రిటోరియాకు పోయిరి. భారతీ

యులకష్టములను విమర్శించి ఈసమస్యను చక్కగ తీర్మానిం
చుటకు అన్నిపక్షములవారి యొక్కయు ప్రతినిధులనాహ్వానించి
యొకసభను (Round Table Conference) సమావేశము
చేయుడని వీరుకోరిరి. "ఆశియా చట్టము" చేయుటకు వీలు
లేదనిరి. మంత్రిగారు తమ యుద్దేశ్యములను మార్చుకొనుటకు
వీలు లేదనిరి. కాని "ఆశియా" బిల్లు రెండవమారు చర్చకు వచ్చి
సెలెక్టు కమిటివారికి పంపినప్పుడు భారతీయుల అభిప్రాయమును
కూడ వినెదమనిరి. రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు సభనుగూర్చి
మంత్రిగా రెట్టి ప్రత్యుత్తరమును చెప్పలేదు. ఈ సంగతు
లిట్లుండగనె ప్రభుత్వమువారు "లిక్కర్ బిల్ (Liquor Bill)
అను సారాయచట్టమును చేయ సమకట్టిరి. ట్రాన్సువాలులో
సారాయము అమ్ముటకు లైసెన్సు పొందినవారు నేటీవులను
గాని ఆశియావారినిగాని సారాయముచేయుపనిలో కాని తీసి
కొనిపోవు పనిలో కాని నియోగింపకూడదని ఈబిల్లు శాసించు
చున్నది. దీనివలన నిరువదేండ్లనుండి ఈ వ్యాపారము చేయు
చున్న భారతీయులు 600 మంది తిండిలేక మల మల మాడి
పోవుదురు.

రాయబారములు:— ఈ అన్యాయములనుగూర్చి భర
తఖండమున సంచలనము పుట్టినది. సామ్రాజ్యసభలకు ప్రతిని
ధులుగ పోయియుండినవారికే అసంతృప్తి, ఆశాభంగము కలి
గినది. భరతఖండమున శాసనసభలందును [illegible]

ప్రశ్నింపసాగిరి. అట దక్షిణాఫ్రికాలో మంత్రిగారిని చూచిన గాడ్ ఫ్రేగారును మరికొందఱు నీ విషయములగూర్చి భరత ఖండమున ప్రచారము చేసి వైస్ రాయిగారికిని భారతీయులకు దక్షిణాఫ్రికా సమస్య మనవి చేయుటకును భారతీయసానుభూతిని సాహాయ్యమును పొందుటకును రాయబారముపంప నిశ్చయించిరి. గాడ్ ఫ్రే, పత్తర్, మీర్జా, అహమ్మదుఖాయతు, షోరబ్జీ, రుస్తుమ్జీ, భవాని దయాళుగారలు రాయబారులుగ బయలుదేరిరి. వీరితో అబ్దుర్ రహమాన్ గారును కలసి వచ్చిరి. ఇంతలో భారతీయ గవర్నమెంటువారు నూరకొనుట మంచిది కాదని తలచి దక్షిణాఫ్రికా పరిస్థితులను, ఆర్థికస్థితిని చూచుటకు సమితి అనుమతివడసి పాడ్డిసన్ గారి నాయకత్వమున కొందఱు భారతీయులనుగూడ రాయబారముగ పంపిరి ఈఘోర పరిస్థితులలో దక్షిణాఫ్రికాలోని భారతీయుల కేదైన సాహాయ్యము చేయవచ్చునని పరోపకారధురీణులగు సి. ఎఫ్. ఆండ్రూసుగారు దక్షిణాఫ్రికాకు తరలిరి. దక్షిణాఫ్రికాలోని భారతీయులపక్షమున మనదేశమునకువచ్చిన భారతీయ రాయబారులగు గాడ్ ఫ్రే, అబ్దుల్ రహమాన్, పత్తర్ మున్నగువారు 1925 సం॥ డిశంబరు 19 తేదీని వైస్ రాయిగారిని దర్శించి 1922 సంవత్సరమునవచ్చిన రాయబారము నాటికిని నేటికిని గలిగిన మార్పులను, కష్టములను విన్నవించి ఒక ప్రతినిధుల సభ సమావేశము చేసి భారతీయసమస్యను దక్షిణాఫ్రికావారు తీర్మా

పించనిచో ఆశియాచట్టమున కనుజ్ఞనీయవలదని చక్రవర్తిగారికి సలహానిమ్మని ప్రార్థించిరి.

వైస్‌రాయిగారి ప్రత్యుత్తరము:—తమ గవర్నమెంటు దక్షిణాఫ్రికావారిని రౌండ్ టేబిలు సభ కూర్చమని కోరినార నియు, వా రంగీకరింపలేదనియు, అయినను అచ్చట ఆర్థికస్థితి యు, దానిపైన నీ శాసనముయొక్క ఫలితములును తెలిసి కొనిన పిదప తమ యభిప్రాయమును తెలుపుటకు వీలగునని భారతీయ ప్రభుత్వమువారు దక్షిణాఫ్రికాకు రాయబారమం పుట కంగీకరించుమని అక్టోబరులో కోరగా దక్షిణాఫ్రికాప్రభు త్వమువారు నవంబరులో అంగీకరించిరనియు ఈలోపుగ నీరా యబారము వచ్చుచున్నసంగతి తమకు తెలిసినదనియు అందు వలన తా మంపిన పాడ్డిసన్ రాయబారము వీరిని కలసికొనలే దనియు వైస్‌రాయిగారు చెప్పి 'మీకష్టములు నేను గమనించు చున్నాను. అయిన నీసమస్య దక్షిణాఫ్రికాలోనిదనియు, దక్షి ణాఫ్రికా స్వపరిపాలన కల స్వతంత్రభాగము (Dominion) అనియు అందలి ఆంతరంగిక విషయములనుగూర్చిర శాసనము చేయుటకు వారి పార్లమెంటుకు పూర్ణాధికారము కలదనియు, మీరు గమనింపవలెను. ఇతరులు జోక్యము కలిగించుకొన్న చో వారికి కష్టముగనుండును. అయినను మనవారికి బాధకర మగు శాసనమునుగూర్చి వారికి మనము చెప్పుకొనుట యవస రమె. మనసలహాలను వారు ఇంతవరకు మన్నించుచునే యు

న్నారు. వారు మనకోరికను మన్నింపనియెడల మనము కర్తవ్యమాలోచింపవలెను. సందర్భములనుగూర్చియు భారతీయుల అభిప్రాయమునుగూర్చియు చక్రవర్తిగారి సామ్రాజ్య ప్రభుత్వమువారికి ఇండియా రాజ్యాంగమంత్రిగారిద్వారా తెలుపుచునేయున్నాము అయినను సందర్భములు నిరాశాకరములుగ లేవు. దక్షిణాఫ్రికాలోని ప్రస్తుతపు ప్రభుత్వమువారు భారతీయులకు విరోధమగు శాసనము లింక నేమియు చేయలేదు. (Colour Bar Bill) "వర్ణభేదపు" చట్టమును సెనేటువారు నిరాకరించిరి. ప్రస్తుతపు ఆసియాటికు బిల్లు ఏమగునో ఇంకను తెలియదు. ఇచ్చటి అభిప్రాయము వారికి మేము తెలుపుచునే యున్నాము.

మేము వారికిచేసిన సలహాలవలనను తెలిపిన అసమ్మతి వలనను మనకింతవరకు కలిగిన లాభములను పలువురు గమనించుటలేదు. భారతీయులకు ఎన్నికహక్కు లేకుండ చేయుటకు **1881**-వ సంవత్సరపు నేటాలు టవును షిప్పులను మార్చుటకు **1921, 22, 23, 24,** సం॥లో వారు చిత్తు చట్టములను తయారుచేయగా ఇండియా గవర్నమెంటువారు వారికి తంతుల నంపిరి. దక్షిణాఫ్రికా గవర్నరుజనరలుగారు తమ కౌన్సిలులో మొదటిదాని కనుమతింపకయు రెండవదానిని నాల్గవదాని నాలోచించుటకు నిలిపియు, మూడవదానిని ఆపివైచియు పనిచేసిరి. **1925**-వ సంవత్సరములో అయిదవమారు బిల్లు తయా

రుకాబడి మా అభిప్రాయము వారికి చేరకమునుపే గవర్నరు జనరలుగారి అనుమతి బడసి చట్టమైనది.

ఇదివరకె ఎన్నికహక్కులుండిన భారతీయులను పట్టీల నుండి దొలంగించుటకు నేటాలు టవునుషిప్పు కన్సాలిడేషను బిల్లు"ను వారు తయారుజేయగా మేము వారికి కబురంపితిమి. ఇది యోచించుటకు మరుసటి సంవత్సరము వరకును ఆపితిమ నియు అప్పుడు భారతీయుల ఎన్నికహక్కులు సాధ్యమగునంత వరకు కాపాడెదమనియు వారు చెప్పినారు నేటాలు బరోస్ ఆర్డినెన్సు 1925 వ చట్టము నేటాలువారు చేయుచుండగ మేము కబురంపితిమి. మొదట గవర్నరుజనరలుగారు దానినాపి యు రాష్ట్రీయపరిపాలనయొక్కస్వాతంత్ర్యము వారి అంత రంగిక శాసనము నాపుటవలన పోగొట్టిన వారమగుదుమని అంగీకరించిరి. అందువలన నది చట్టమైనది. "నేటాలు రూరలు డీలర్సు లైసెన్సింగు ఆర్డినెన్సు" భారతీయులు వర్తకముచేసి కొను హక్కులను తగ్గించుటకు జేయుబడినది. దీనికి 1921 సం॥ లో గవర్నరుజనరలుగా రంగీకరింపలేదు. 1924 సం॥ లో మరల చేయబడగ దానిని గూర్చి ఆలోచించుట కని ఆపి నారు. 1923 సంవత్సరం చిత్తుచట్టము విషయములో ఆశియా నాంగికు వసతులిచ్చునట్లు చూడుడని నేటాలు పరిపాలకు నకు గవర్నరుజనరలు సలహానిచ్చి అంగీకరించెను. "డర్బను 1922 సంవత్సరపులాండు అలియనేషను ఆర్డినెన్సు (Durban

Land Alienation Ordinance of 1922) ను ఇట్లే చేసి నారు. దీనివలన భూములు విక్రయవిషమున భారతీయుల హక్కులకు భంగమువాటిల్లకుండగ నీ సలహాలిచ్చినాడు. (Areas reservation and Immigration & Registration (Further Provision Bill of 1925) ఆశియాచట్టము నూతనచట్టము విషయములోను మన గవర్నమెంటువారు వారికి తంతిసంపినారు దీనిని గూర్చి జాగ్రత్తగ ఆలోచించెదమని మంత్రిలు వాగ్దానము చేసినారు. 1921 సంవత్సరపు ( Asiatic Enquiry Commission ) ఆశియావారి విచారణ సంఘము వారి రిపోర్టును గూర్చి భారతీయ గవర్నమెంటువారి అభిప్రాయము నీవరకె పంపియుంటిమి. దీనిని గూర్చి ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవి. జరుగుచున్నవి. కొన్ని విషయములలో మాసలహాలను దక్షిణాఫ్రికావారు వినినమాట వాస్తవము. (Natal Public Health Committees control ordinance of 1923 & Transval general Dealerss ordinance of 1925) నేటాలు పారిశుధ్య సంఘశాసనమును ట్రాన్సువాలు వర్తకుల శాసనమును మనకు విరోధముగనె చేయబడినవి. (South African mines and Works amendment of 1925) గనుల చట్టము,' మనకు వ్యతిరేక భావమున శాసనముగ చేయబడినది. కాని దక్షిణాఫ్రికా సెనెటువారు దానిని తోసివైచిరి. 1925 సంవత్సరములో నివేశనముల చట్టము Class areas Bill ను గూర్చియు మేము వారికి కబురంపితిమి

ఇంతలో వారిపార్లమెంటుముత్తరబు అయిపోయిక్రొత్తఎన్నికలు వచ్చినందున అది ఆగిపోయినది.' 'ఆశియాచట్టము' విషయము లో మీరు చేయు విమర్శనలను మేము జాగ్రత్తగ గమనించెద ము అని వైస్రాయిగారు బదులుచెప్పిరి. మూడు మాసములుఆపి వై చినారని వైస్రాయిగారనినట్టియు భారతీయుల ఎన్నికహక్కులను పోగొట్టినట్టియు చట్టము (Franchise ordinance) ను రాష్ట్రీయ ప్రభుత్వమువారు శాసనముగా చేసినారు. ఇంక నితర శాసనములను భారతీయులకు వ్యతిరేకముగ చేసి నారు. వీనినెల్ల సమితిప్రభుత్వము వా రంగీకరించినారు. దక్షిణాఫ్రికా సమితి రాజ్యాంగ చట్టము 65 వ విధిప్ర కారము ఆశియా చట్టమును చేయవలదని సార్వభౌముని చేత శాసింపజేయుటకు భారతీయ ప్రభుత్వమువారు కోరుట ముఖ్యమని అబ్దుర్ రహమాన్ గారు వైస్రాయిగారికి ప్ర త్యుత్తరమిచ్చిరి. వైస్రాయిగారి యుపన్యాస మాశాభంగము గలిగించెను. కేపుటవునులో నున్న ఆండ్రూసుగారు నిది తృప్తి కరముగ లేదని తంతినంపిరి. దక్షిణాఫ్రికాలోని రాండ్ మె యిల్ పత్రిక (Rand Mail) ఈ రాయబారమువలన లాభము లేదనియు నానా రాజ్య ప్రతినిధుల సభ వారు (League of Nations) సైతమేమియు చేయజాలరనియు వ్రాసి భారతీ యుల అసాహాయ్యస్థితిని వెల్లడించినది. ఈ పత్రిక దక్షిణా ఫ్రికా ప్రభుత్వాభిప్రాయమును దెలుపు పత్రిక. డిశంబరునేల

తుదివారములో కాన్పూరులో భారతీయకాంగ్రెసు సరోజినీ దేవి అధ్యక్షతక్రింద జరుగుచుండగ దక్షిణాఫ్రికా రాయబారులుపోయి పరిస్థితులు సభవారికి విన్నవించిరి. కాంగ్రెసు సభవారు తమ సానుభూతిని దెలిపిరి. దక్షిణాఫ్రికావారు చేయబోవు శాసనము వర్ణభేదమును స్థాపించుచున్నదనియు గాంధీస్మట్సు ఒడంబడికకు విరుద్ధమనియు పై యొడంబడిక యొక్క యుద్దేశమును మధ్యస్థునివలన తీర్మానించుకొనవచ్చుననియు దక్షిణాఫ్రికావారీసమస్య నొకప్రతినిధులసభ సభసమావేశముచేసి తీర్మానించని యెడల సార్వభౌముడైనను దాని నాపుట యుక్తమనియు తీర్మానించిరి. సరోజినీదేవియు గాంధిగారును మహోపన్యాసములఁ జేసిరి. ఈ చట్టము పై యొడంబడికకు విరుద్ధమని భారతీయ జాతీయవాదులెగాక మితవాదులును ప్రభుత్వపక్షమువారు ననిరి. మితవాదులు సభయందు సప్రూగారే ఇది విరుద్ధమనిరి. మనలను దక్షిణాఫ్రికాలో బాధించుచున్నది బోయరులుగాక బ్రిటీషు బోయరులె యగుట విషాదకరమని రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రిగారు 1926 సం॥ జనేవరు 9 వ తేదీన పలికిరి.

ప్రతినిధులసభ చేయుట కంగీకరించుటః—1926 సంవత్సరము జనేవరు 27వ తేదీన వర్ణభేదపుచట్టమును దక్షిణాఫ్రికాసమితి అసెంబ్లీశాసనసభవారు మరల మొదటిమారు తీర్మానించిరి. ఫిబ్రవరు 7 వ తేదీన ఆశియావారి చట్టమునుకూడ

మొదటిమారు తీర్మానించిరి! ఈ ఘోరచట్టనుల నాపుదలను
చెప్పుకొనుటకు దక్షిణాఫ్రికానుండివచ్చిన భారతీయరాయబా
రులు గాడ్ ఫ్రే మున్నగువారు ఫిబ్రవరు 17వ తేదీన మరలి
పోయిరి. దక్షిణాఫ్రికాలోను భరతఖండమునను భారతీయుల
సమస్య తీవ్రవిమర్శకు గురియైనది. మన భారతీయప్రభుత్వము
వారిచెవులకుగూడ నీపోరు వినబడినది. ఏప్రిలులో మనకు
క్రొత్తవైస్ రాయిగారగు ఇర్విన్ ప్రభువుగారు వచ్చినారు.
రీడింగు ప్రభువుగారు దక్షిణాఫ్రికా ప్రభుత్వము నొక ప్రభు
త్వప్రతినిధుల సభను సమావేశపరచుడని కోరియుండిరి ఇం
గ్లాండులో ఆలివియరు ప్రభువీసమస్యనుగూర్చి తీవ్రముగ విమ
ర్శించి పత్రికలలో వ్రాయుచుండిరి, భారతీయప్రభుత్వమువా
రు దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారు నీవిషయమునుగూర్చి
ఏదైన చేయవలెనని బ్రిటీషుసామ్రాజ్య ప్రభుత్వమువారు ననిరి.
భారతీయసమస్య తీర్మానించుటయు నవసరమె, దక్షిణాఫ్రికా
లోని తెల్లవారి యభిప్రాయములను మన్నించుటయు ముఖ్య
మె గనుక నీపద్ధతులతో నేదైన నాలోచించుట కీరెండు ప్ర
భుత్వములవారును ప్రతినిధులనంపి యొక 'రౌండ్ టేబిల్
కాన్ఫరెన్సు' సభ చేయుట కెట్టకేలకు నిశ్చయించినట్లు 1926
ఏప్రిలునెలలో ప్రకటింపబడెను. కాని దక్షిణాఫ్రికావారు
తమపద్ధతులు మానలేదు. భారతీయులను మారుమూలలకు
దరిమి బాధించుటయు వారిని వెడలగొట్టు ప్రయత్నములు

చేయుటయు మానలేదు. లైసెన్సులీయకయు చిన్న చిన్న చట్టములు చేసియు ఒత్తిడి కలిగించుచుండిరి.

అభిప్రాయములందు మార్పు:—దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారు భారతీయప్రభుత్వమువారికడకు జేయర్సుమున్నగువారిని సెప్టెంబరు 18 వ తేదీన రాయబారమంపిరి. వారీదేశమునకువచ్చి భారతీయులను గమనించిరి. వారికిచ్చట నొసగబడిన యాతిథ్యము భారతీయుల సత్స్వభావమును వెల్లడించెను. వారు పైకిచెప్పకపోయినను వారు తమదేశమునకు పోయినపిదప వారిమాటలవలన నిది స్పష్టమయ్యెను. ఇంతలో దక్షిణాఫ్రికా ప్రధానామాత్యుడగు హెర్ట్జాగుగారు ఇంగ్లాండులో బ్రిటీషు రాజనీతిజ్ఞులతోడి సంభాషణములవలన కొంత విశాలభావమువహించి వచ్చిరి. వీరు లండన్నుండివచ్చిన పిదప పలికినమాటలు దక్షిణాఫ్రికా రాజకీయజీవనమును కూ కటివేళ్ళతో పెల్లగించుచున్నదని కేపుటైమ్సుపత్రిక వ్రాసినది. వర్ణభేదపద్ధతిని పరిపూర్ణముగ తన పరిపాలనమున స్థాపించిన ఘాతనియందు నల్లవారిపైన సానుభూతి తెలుపు భావములు కలుగుటయె వింతగనుండెను. అయినను దక్షిణాఫ్రికాలోని భారతీయ విద్వేషులగు తెల్లవారు 'యంగ్ సౌత్ ఆఫ్రికా సొసైటి' యొక్క ప్రోద్బలమున సభలు చేయుచు స్వదేశమంత్రియగు మాలన్‌గారిని దర్శించి భారతీయులయెడ దయచూపవలదని చెప్పుచుండిరి.

1918 సంవత్సరాంతమున గాంధిమహాత్ముని సత్యాగ్రహము హోరాద్యమమున కష్టసమయమున భారతీయులపక్షమున చాల పనిచేసిన పరోపకారపారీణులలో పియర్సన్ గారు కీర్తి శేషులైనను ఆండ్రూసుగారు వారు లేనిలోపము కనబడకుండగ మఱల నీవర్ణభేదయుద్యమమున భారతీయులబాధలను బాపుటకును తెల్లవారికి సానుభూతిని కలిగించుటకు నెంతో కష్టపడి పనిచేయసాగిరి. కేపుటవున్, డర్బన్, మున్నగు పట్టణములలో శాంతిప్రచారము చేయుచుండిరి. మంత్రులను ఉద్యోగులను దర్శించుచుండిరి.

భారతీయప్రభుత్వమువారు రైట్ ఆనరబుల్ వి. ఎస్ శ్రీనివాసశాస్త్రిగారిని హబిబుల్లాగారిని సర్ ఫిరోజుసేత్నాగారిని సర్ జార్జిపాడిసన్ గారిని మరికొందఱు యుద్యోగులను ప్రతినిధులుగ దక్షిణాఫ్రికాకు పంపుటకు అక్టోబరులో నియమించిరి. భారతీయజాతీయ నాయకుల నెవ్వరను ఆహ్వానింపక పోవుట ప్రజల కాశాభంగము గలిగించెను. గాని నియమింపబడినవారు తగినవారేయని గాంధిమహాత్ముడు 'యంగ్ ఇండియా'లో వ్రాసి ప్రజల నూరడించెను. డిశంబరునెలలో ప్రతినిధులు దక్షిణాఫ్రికాకు వెడలిరి.

అచ్చటిపరిస్థితులు:—దక్షిణాఫ్రికాలో దేశసేవచేయుచుండిన గాంధిగారి రెండవకొమరుడు మణీలాల్ గాంధిగారచ్చటి పరిస్థితులను భరతఖండమునకు దెలిపి శాంతిప్రబోధ

ము చేయుట కిచ్చటికి వచ్చిరి. "రౌండ్ టేబిలు ప్రతినిధుల సభవారు తీర్మానించవలసిన సమస్యలలో దక్షిణాఫ్రికాలోని భారతీయులను మారుమూలలకు త్రోయు సెగ్రిగేషన్ (Segregation) సమస్యయు, వారిని దేశమునుండి వెడలగొట్టు రిపాట్రియేషన్ (Repatriation) సమస్యయు ముఖ్యములు. మన ప్రతినిధుల కచ్చట చాల చిక్కులు కలుగునుగాని దైవానుగ్రహమున శుభము చేకూరవచ్చును. భారతీయ ప్రభుత్వమువా రిదివర కంపిన పాడ్డిసన్ రాయబారమునకు దక్షిణాఫ్రికా యిచ్చిన ఆతిథ్యము బాగుగలేదు. అట్టి నడవడినిచూచి ఏ స్వతంత్రదేశమును సహింపియుండదు. ఆ రాయబారము లోని భారతీయసభ్యులకు హోటళ్ళలో స్థలము దొరకుట దుస్తరమయ్యెను. కేపు టవునులో మౌంటునెల్సన్ హోటలు వారికి తావిచ్చుటకు నిరాకరించెను. వారు జాలిదలచిన పౌరుల యాతిథ్యము పొందవలసివచ్చినది. ఆ రాయబారుల లో నొకరొక మూడవతరగతి సామాన్యపు హోటలునకు పోయి తా నొక మహారాజునని మారువేషముతో కాలక్షేపము చేయవలసివచ్చెను. పాడ్డిసన్ రాయబారుల కీ యనుభవములు దక్షిణాఫ్రికా భారతీయుల నిజస్థితి బయలుపరచియుండవలెను. అయినను వారీన్యూనత నెల్ల సహించి తుదకు రౌండ్ టేబిలు కాన్ఫరెన్సును సంపాదించితిమికదా యని మాత్రము తృప్తిపొంది యుందురు. యూనియన్ (సమితి) గవర్న

మెంటువారి రాయబారులు హిందూదేశమునకు వెళ్ళి తిరిగి వచ్చినతరువాత బహిరంగముగ తమ యభిప్రాయములు వెల్లడింపలేదు కాని వారిమాటలవలనను వ్రాతలవలనను తామెంతవిరోధముగ ప్రవర్తించినను భారతీయులు కోపింపక తమ జాతి మత భూషణమగు నాతిథ్యమిచ్చి సత్కరించుట తమ కాశ్చర్యము కలిగించినట్లు మాత్రము స్పష్టమయ్యెను. దక్షిణాఫ్రికా భారతీయులు సామ్రాజ్య ప్రభుత్వమువారి యొక్కయు, భారతీయప్రజల యొక్కయు ప్రతినిధుల సభను కోరియుండిరి. కాని దక్షిణాఫ్రికా ప్రభుత్వమును భారతీయ ప్రభుత్వము నీరౌండు టేబిలు కాన్ఫరెన్సును సమావేశపరచినారు. అయిన నీ సమస్యను పరిష్కరించుటకు ఉభయులు మనఃపూర్వకముగ ప్రయత్నించుచు నీ సభ సమావేశపరచినట్లు ప్రజలు నమ్ముచున్నారు.” అని డిశంబరు 21-వ తేదీన ఒక పత్రికా విలేఖరికి మణిలాల్ గాంధిగారు బొంబాయిలో చెప్పిరి.

# దక్షిణాఫ్రికా

## X

### దక్షిణాఫ్రికా యొడంబడిక.

ప్రతినిధుల సభ:—కేపుటవునులో 1926 సం॥ డిశంబరు 17 వ తేదీన ప్రతినిధుల సభ కూడెను. 'రౌండ్ టేబిల్' సభయను నామము సార్థకముచేయుటకో హెచ్చుతగ్గులు లేకుండ ప్రతినిధులకెల్లర సుచితాసనములనిచ్చి గౌరవించుటకో, కేంద్రీకృతభావమునకు బాహ్యచిహ్నముగ నుండుటకో వలయాకారముగల మేజాబల్లచుట్టును కుర్చీ లమర్చిరి. హబిబుల్లాగారు శ్రీనివాసశాస్త్రిగారు మాలన్‌మంత్రిగారు బేయర్సుగారు మున్నగు ప్రముఖులు 19 మంది [1] కార్యాలోచనమునకు గడంగిరి. డిశంబరు 28 తేది మొదలు 10 దినములు రహస్యాలోచనము చేసిరి. అచ్చట నేమిజరుగుచున్నది యెవ్వరికిని తెలియదు.

---

1. Mr. R. W. Brandon. Mr. C. S. Ricketts, Mr. L. A. Wyndham, Mr. Asadullah, Mr. C. S. Bajpai C. I. E C. B. E, I. C. S., Mr. C. F. Schmidt. Mr. H. N. Venn. The Hon. Sir Phiroze, C. Sethna K. T. O. B. E., The Hon Mr. F. W Beyers, K C., Sir George Paddison. K B. E. C. S. I. I. C. S. Sir D' Arcy Lindsay K. T. C. B. E, Mr. H. Pring, The Hon Mr. T. Boydell, General, The Hon. J. C. G Kemp. The Hon Mr. G. I. Corbett C. S. I. I. C. S. Dr. The Hon. D. F. Malan. The Hon Khan Bahdur Sir, Mahammad Habibullah Sahib K C. I E., Colonel The Hon. F. H. D. Creswell. D. S. O. The Right Hon. V. S. Sreenivasa Sastri P. C.

ప్రతినిధులు చేసిన తీర్మానముల నుభయప్రభుత్వము లునుఅంగీకరించి ప్రచురింతురని చెప్పి సంగతులు రహస్యముగ నుంచిరి.

దక్షిణాఫ్రికా యొడంబడిక:—దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారును భారతీయప్రభుత్వమువారును సమావేశము చేసిన ప్రతినిధులు తీర్మానించిన విషయము లెల్ల 'దక్షిణాఫ్రికా యొడంబడిక'యని సంధిపత్రరూపమున దాల్చినవి. ప్రజా ప్రతినిధులున్న శాసనసభలందైనను చర్చింపబడకమున్నే ఈ పత్రమును భారతీయప్రభుత్వమువారు ఆమోదించి ఈ సంగతి 1927 సంవత్సరము ఫిబ్రవరు నెల 21 తేదీన ఢిల్లీలో సామ్రాజ్య అసెంబ్లీ శాసనసభలోను స్టేటుకౌన్సిలుసభలోను ప్రభుత్వపక్షమున భోర్ గారును హబిబుల్లాగారును తెలిపి సంధిపత్రమును ప్రకటించిరి.

'1926 సం॥ ఏప్రిలులో దక్షిణాఫ్రికాసమితి ప్రభుత్వమువారు భారతీయ గవర్నమెంటువారును ఒక రౌండుటేబిల్ కాన్ఫరెన్సు ప్రతినిధులసభ సమావేశముచేసి దక్షిణాఫ్రికాలో పాశ్చాత్య జీవితపద్ధతులకు భంగమువాటిల్లకుండ న్యాయముగను ధర్మముగను అచ్చటి భారతీయసమస్యను పరిష్కరింపదలచినట్లు ప్రకటింపబడెను. ఈ ప్రతినిధులసభ దక్షిణాఫ్రికాలో కేపుటవున్ నగరమున 1926 సం॥ డిశంబరు 17 తారీఖు మొదలు 1927 సం॥ జనేవరు 12 వ తారీఖువరకును స

మా దేశమగుచు ఉభయపక్షములవారి చిక్కులను పరిశీలించి గమనించి సంప్రదించుకొని ఉభయులకు ముఖ్యమేయగు సమస్యను స్నేహభావమున పరిష్కరించు నుపాయమాలోచించి తీర్మానించిరి.

1 న్యాయముగ ధర్మముగ పాశ్చాత్య జీవితపద్ధతిని కాపాడుకొనుటకు దక్షిణాఫ్రికా వారికి హక్కుకలదని ఉభయప్రభుత్వములు నంగీకరించుచున్నవి.

2 దక్షిణాఫ్రికా సమితి దేశములో కాపురమున్న భారతీయులు పాశ్చాత్య పద్ధతుల ప్రకారము జీవింపదలచినచో వారట్లు జీవించుటకు వీలు కలిగించుటకు సమితి ప్రభుత్వము అంగీకరించినది.

3 పాశ్చాత్య జీవితపద్ధతు లవసరములేని భరతఖండమునకు గాని ఇతర దేశములకు గాని సమితిలో కాపురమున్న వారు పోదలచినచో అట్లు పోవుటకు సమితి ప్రభుత్వము సాహాయ్యము చేయును. సమితి దేశములోనుండి బయటకు పోయి మూడు సంవత్సరములు తిరిగి రానిచో సమితి పౌరహక్కులు నశించును. సమితివలన సాహాయ్యముపొంది ఇతర దేశములకు పోయినవారు మూడు సంవత్సరముల లోపుగ మఱలవచ్చి సమితిలో కాపురముండ దలచినచో సమితి వలన వారుపొందిన సాహాయ్యము యొక్క విలువను వాపిచ్చుకొనవలెను.

4 సమితి ప్రభుత్వమునుండి తిరిగివచ్చిన వలస ప్రజల క్షేమమును విచారించి పరిపాలించుటకు భారతీయ ప్రభుత్వము వా రంగీకరించినారు.

5 సమితి దేశములో కాపురమున్న భారతీయుల భార్యలు మైనరుబిడ్డలును సమితిదేశములోనికి వలసవచ్చు సందర్భమున 1918 సం|| సామ్రాజ్య సభవారి 21 తీర్మానము లోని 3 వ పేరాలో నుదహరింపబడిన "రెసిప్రొసిటీ" పరస్పర సంబంధ తీర్మానము (Reciprocity Resolution) ననుసరించి నిర్ణయింపబడును.

6 ఈపద్ధతు లంగీకరింపబడినందున సమితిలోని చిక్కులు తొలగగలవను నూహతో శుభప్రదముగ ఒడంబడిక నాచరణమునపెట్టి న్యాయము చూడ ప్రయత్నించుటకు "ఆశియాచట్ట"మను నివేశనస్థలములు, వలస రిజిష్ట్రేషను (Further provision) గూర్చిన బిల్లును నిలుపుటకు సమితివారు నిశ్చయించినారు.

7 ఉభయ ప్రభుత్వములును ఈ ఒడంబడిక పద్ధతుల నమలులో పెట్టుటకును దీని ఫలితములు గమనించుచు ఒండొరు లీవిషయమును గూర్చి అప్పుడప్పు డాలోచించుకొనుచుండుటకును నిశ్చయించినారు.

8 ఈరెండు ప్రభుత్వములకును ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుటకును సహకారము కలుగుటకును భారతీయ

ప్రభుత్వమువారిని దక్షిణాఫ్రికా కొక ప్రతినిధి (Agent) ని పంపుడని సమితివారు కోరుచున్నారు.

I. తబ్సీలు తెలుపుపట్టిక :—సమితివలన సహాయ్యము పొంది భారతీయుల దక్షిణాఫ్రికానుండి సాగనంపబడు విషయము:

(1) 16 సంవత్సరములవా డెవ్వడైన నీసాహాయ్యము పొంది ఇతర దేశమునకు వలసపోవచ్చును. కుటుంబము యొక్క యజమాను డంగీకరించినచో కుటుంబమెల్ల పోవలెను.

(2) వలసకు పోవువాని కొకొక్కనికి 16 సంవత్సరములకు పై బడినవారికి 20 పౌనులును ఆలోపువారికి 10 పౌనులివ్వబడును ఈసొమ్ము హిందూదేశమునకు పోయినతరువాత నచ్చుటనివ్వబడును. అశక్తుల కుపకారవేతన మివ్వబడును. సాలుకు 500 పౌనులకన్న అధిక మక్కరలేదని నమ్ముచున్నారు. కుటుంబమున కంతకును నింతకన్న నెక్కుడివ్వబడదను నియమము లేదు.

(3) అట్లు వెడలిపోవువారింటికి చేరువరకు నుచితముగ తీసికొని పోబడుదురు. ఓడకేవు, రైలుచార్జి. లేదు.

(4) వలసకు వెడలిపోవువారు బొంబాయిద్వారా కాని చెన్నపట్నము ద్వారాకాని పోవుదురు. పోవునప్పుడు నౌకల పారిశుద్ధ్యము ప్రభుత్వమువారు పరిశీలింతురు.

(5) వలసవారిట్లు తిరిగి వచ్చుచున్నారను సంగతి ఒక నెలకు ముందుగనె హిందూశముసకు తెలుపబడును. వీరి సంఖ్య, వృత్తి, పేరు, పొందిగ సాహాయ్యము తెలుపబడును. వీరుపొందిన సాహాయ్యమును వృథచేయక మఱల నేదైన వృత్తి చేసికొని జీవింపుడని వలసకేగువారికి బోధింపబడును.

(6) సాహాయ్యముపొంది వలసకుపోయినవాడు మఱల సమితికి రాదలచినచో మూడేండ్ల లోపుగ రావచ్చును కాని తానుపొందిన సాహాయ్యము విలువ తనకుటుంబము పుచ్చుకొని సొమ్ముతో కూడ తిరిగి సమితి కిచ్చివేయవలెను. చని పోయినవారి విషయమునను పెండ్లిండ్లు చేసుకొని దిగబడిన ఆడపిల్లల విషయమునను కొంత రాయితీ చేయబడును.

(7) మూడేండ్లు దాటిపోయినచో సమితిపౌర్వహక్కులు వలసకేగినవానికి పోవును. ఇందు కొక శాసనము చేయబడుచున్నది. దేశమువదలిన దినము మొదట మూడేండ్లు చూడబడును. దేశము చూచివచ్చుటకు పోదలచిన వారి పద్ధతివలని లాభమును పొంది సమితికి నష్టము కలిగింపకుండ పోయినవారొక సంవత్సరమువరకును రాకూడదనియు తీర్మానింపబడినది. కుటుంబములో మొగపిల్లలు పెద్దవారై పెండ్లి చేసికొని భార్యాబిడ్డలతో కూడ మూడేండ్లు లోపుగనైన వో రావచ్చును, కాని ఆడపిల్లలు పెండ్లిచేసికొనినచో వారి

పౌరహక్కులు పోయి, భర్తయొక్క దేశపుహక్కులు వచ్చును గనుకనట్లు తిరిగి రాకూడదు.

II. సమితిలో కాపురమున్నవారి భార్యాబిడ్డలు వచ్చు విషయము:—సామ్రాజ్యసభలో 1918 సంవత్సరమున చేయ బడిన 21 వ తీర్మానము రెసిప్రాసిటీ తీర్మానము (Reciprocity Resolution) మూడవవేరా ననుసరించి ఒక పురుషుడు కాపురమున్న దేశమున భార్యాబిడ్డలతో సుఖముగ నుండు టకు వీలుండునట్లుగ (౧) సమితిదేశములోనికి వచ్చుటకు హక్కుకలదనియు గాదలచినపురుషునికి భార్యయె అని స్త్రీని గూర్చియు బిడ్డయని బిడ్డలను గూర్చియు భారతీయ ప్రభుత్వ మువారు పూచీపత్రము (Certificate) ఇవ్వవలెను. (౨) తల్లికి సమితి పౌరహక్కులు లేనియెడల గాని మంత్రిగారు ప్రత్యేక ముగ అనుమతినిచ్చినగాని తప్ప తల్లిబ్రతికియుండగ తల్లిలేకుండ మైనరుపిల్లల నొంటరిగ పంపరాదు. (3) భార్యను వదలివేసిన పురుషుడు తాను శాస్త్రప్రకారము విడచితినని రుజువుపరచి నగాని ఇంకొక స్త్రీని భార్యయని తీసికొని రాకూడదు. (౪) 1914 సంవత్సరపు 22-వ చట్టము. ఇండియను రిలీఫ్ ఆక్టులో భార్య బిడ్డలనిన నెవరో యుదాహరింపబడియున్నం దున భార్యాబిడ్డలన్న నాయర్థమె వర్తించును.

111. భారతీయ సంఘమును బాగుచేయుపద్ధతి:

(1) నాగరకతకల ప్రతిప్రభుత్వము తన దేశములో కాపురమున్న ప్రతిసంఘమును సాధ్యమగునంతవరకు పరిపూర్ణముగ బాగుచేయుట ముఖ్యమనియు ఇతరసంఘములవారికన్న భారతీయసంఘము విద్యావిషయమున వెనుకబడగూడదనిసమితి ప్రభుత్వమువారు నిశ్చయించుకొనినారు.

(2) సమితిప్రభుత్వమువారి రాజ్యాంగ చట్టమువలన పరిపాలనము కేంద్రప్రభుత్వమునను పరిపాలకవర్గమందు (Executive) రాష్ట్రీయ (Provincial) సంస్థలందును ఇతరస్థానికసంస్థలందును (Minor local bodies) విభజింపబడియున్నందునను సమితి ప్రభుత్వమున కేపనియైన సులభముగ చేయుటకును ప్రజాభిప్రాయము ననుసరించుటకును సులభసాధ్యము కాదు కాని,

(౧) భారతీయులు నేటాలులో విద్యావిషయమున చాల వెనుకబడియుండి దీనావస్థయందుండుటవలననారాష్ట్రీయ ప్రభుత్వమువారి నీవిషయమును విచారించి భారతీయ ప్రభుత్వమువారి నొక విద్యానిపుణుని పంపి తగుసలహానివ్వమనికోరి ఒక విచారణసంఘము (కమీషన్) నేర్పరచి విచారింపుమని సమితి ప్రభుత్వమువారు కోరుచున్నారు.

(౨) ఉన్నత విద్యావిషయమున భారతీయులకు అవకాశము గలిగించు విషయమున సానుభూతి చూపుటకు ఫోర్టు

హేరులో దక్షిణాఫ్రికా నేటివు కాలేజి కొరక విద్యార్థుల వసతిగృహము నిర్మించుటకును ఆసంస్థనింక నభివృద్ధి చేసి భారతీయ విద్యార్థులకు లాభకారిగ చేయుటకును నిశ్చయించినారు.

(3) డర్బనులోను దాని చుట్టుప్రక్కలను పారిశుద్ధ్య పరిస్థితులనుగూర్చియు, నివాస గృహవసతులనుగూర్చియు పరిశీలించి భారతీయ ప్రతినిధుల సంఘములను నియమించు విషయముచు మునిసిపలు వారి స్థలములను విక్రయించు పద్ధతులను నిర్ణయించి "పబ్లిక్ హెల్తుచట్టము" (Public Health Act.) ను పురస్కరించుకొని పని చేయుటకు నిశ్చయింపబడినది.

(४) 1924 సంవత్సరము 2-వ చట్టమగు ఇండస్ట్రియల్ కన్సీలియేషన్ (Industrial Conciliation Act) శాసనము వలనను, 1925 సంవత్సరపు 27-వ చట్టమగు కూలిచట్టము (Wages Act.) వలనను అన్ని సంస్థలందును యజమానులు భారతీయ యజమానులుకూడ పనికి తగిన కూలినివ్వవలెనను సూత్రము అమలు జరుపబడును.

(౫) ప్రస్తుతమున్న వర్తక లైసెన్సులను మార్చుటకు సమయమువచ్చినప్పుడు సమితి ప్రభుత్వమువారు భారతీయ ప్రతినిధుల సలహానసుసరించి (i) లైసెన్సు నీయకపోవు నధికారమునకు శాసనములోనే నియమము లేర్పరుచుటకును (అనగా యిష్టమువచ్చినరీతిని నిరాకరింపకుండ విధుల నేర్పరుచుట)

(ii) లైసెన్సు నివ్వక నిరాకరించు అధికారి దానికారణములను తనతీర్పులో నుదహరించుటకును (iii) మొదట లైసెన్సుకు పెట్టుకొనబడు ధరఖాస్తులపైనను లైసెన్సులు పరివర్తనచేసి కొనునప్పుడు చేయబడిన దరఖాస్తులపైనను, మఱల లైసెన్సు నీయుమని పెట్టుకొన్న ధరఖాస్తులపైనను చేయబడు తీర్పుపైన ను న్యాయస్థానములకు కాని ఇతర న్యాయసంస్థలకుకాని అప్పీ లుండునట్లును చేయుదురు.

IV. ఏజంటును నియమించుట:—భారతీయ ప్రభుత్వము వారికిని దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారికిని సహకారస్నేహ ములు కుదురుటకు దక్షిణాఫ్రికాసమితి ప్రభుత్వమువారు తమ సమితిలోని కొకప్రతినిధిని పంపుడని భారతీయప్రభుత్వమువా రిని కోరుచున్నారు.

ఈ యొడంబడికను గార్బి భోరుగారు సామ్రాజ్య శాసనసభలో నుపన్యసించుచు, గవర్నమెంటువారు ఇది బా గున్నదని తలంచుచున్నారనియు, దీనినంగీకరించుటకు నిశ్చ యించినారనియు తెలిపిరి. ఈ విషయమున చాలజాగ్రత్తగ కష్టపడి కర్తవ్యము నిర్వర్తించిన భారతీయప్రభుత్వరాయబారు లను ప్రశంసించిరి. ఉభయదేశములకునుగల వ్యవహారమునం దెల్ల సమస్యలను పరిష్కరింపబడినవని తలంచుటలేదనియు కేపుటవుసభలోని స్నేహభావము శాశ్వతముగనుండెనేని

అన్ని విషయములలును సానుకూలమగునని ప్రభుత్వము వారు తలంచుచున్నారనియు పలికిరి.

గాంధిమహాత్ముని యభిప్రాయము:—భరతఖండమున సంచారము చేయుచున్న గాంధీమహాత్ము డీయొంబడికనుగూర్చి, షోలాపూరునుండి 'యంగ్ ఇండియా' పత్రికకు తనయభిప్రాయము తెలుపుచు నొకవ్యాసము వ్రాసినాడు. ఇది అత్యుత్తమముగ లేదనియు అయినను బాగుగనేయున్నదనియు వ్రాసి హబిబుల్లా గారిని ఆయనతోడి రాయబారులను ఇరుకక్షులవారికిని గౌరవపాత్రమగు యొడంబడిక చేయగలిగినందుల కభినందించుచు 'ఈ యొడంబడిక షరతులు చూచినచో తృప్తికరములుగ నేయున్నవి. కాని అన్ని రాజీలమాదిరిగనె ఇందుకూడ భయస్థలములు కలవు. ప్రత్యేకస్థలనిర్ణయచట్టము పోయినను దానికిబదులుగ దక్షిణాఫ్రికానుండి భారతీయులను వలసపంపు 'రిపాట్రియేషన్) మఱల తలయెత్తినది. ఇది మంచి పేరుగల మఱింత భయంకరమగుపద్ధతి. 'రిపాట్రియెషన్' (Repatriation) ప్రకారము హిందూదేశమునకు మాత్రమే వెనుకకంపుటకు వీలుండెను. ఈ యొడంబడికవలన సాహాయ్యముచేసి వలసకంపు 'రీయెమిగ్రేషన్' (Re-emigration) ప్రకారమే దేశమునకైనను భారతీయుని పంపవచ్చును. ఇందువలన చదువురాని బీదహైందవుడు క్రొత్తదేశములకు పంపబడినచో వానిగతియేమిః ఫీజిబ్రిటీషుగయానాదేశముల కంపవచ్చును. వీనిసంగతి భారతీ

యులెఱుగుదురుకదా? వలసపోయినవారు మూడేండ్లలో వెనుకకు రావచ్చుననుపద్ధతి రిపాట్రియేషన్ పద్ధతికన్న మేలే కాని ఎందరు తామువుచ్చుకొన్నసొమ్ము మఱలనీయగలుగుదురు? ఎందరు కుటుంబములతో రాగలుగుదురు? ఇక డర్బను భారతీయులవిషయమున చేయబడిన షరతు చాలభయంకరముగ కనుపడుచున్నది. సమితివారి అభిప్రాయము నాకు తెలియుట లేదు. కాని బలహీనులతో బలవంతులు చేయు ఒడంబడికకు బలహీనులకు వ్యతిరేకముగ విరుద్ధములగు అర్థములను చెప్పి బాధించుట నేను స్వయముగ ననుభవించియున్నందున పారిశుద్ధ్యవిషయమున నివాసగృహముల విషయమున కమిటీల నేర్పగడు విషయమును భూముల విక్రియ పద్ధతులు నిర్ణయించు విషయమును చాల భయంకరముగ నాకు తోచుచున్నవి. భారతీయులను బాధించు హక్కుల నీవరకె డర్బను పురపాలక సంఘము కలిగియున్నది. వారెరుగనిసంగతులేమి? కమిటీలు చెప్పునదేమి? వీరి రిపోర్టు పూర్వ మొక కమిటీచేసిన దానివలెనే అక్రమముగా నుండునని తలంచుచున్నాను. కేంద్ర ప్రభుత్వమువారితో నిమిత్తము లేకుండగ రాష్ట్రీయ ప్రభుత్వమువారు తమ రాష్ట్రములో కాపురముండు భారతీయుల విషయమున నే చర్యనైన తీసికొనవచ్చునని ధ్వని యిచ్చుచున్న భాగముకూడ నాకు భయాస్పదముగ కనబడుచున్నది. అయిన నీ భయస్థానము లున్నను ఈ యొడంబడిక

కొఱకుగాక ఎల్లప్పుడును భారతీయులకు బద్ధవైరమై ప్రధానముగ నుండిన దక్షిణాఫ్రికావారిలో కొంత మార్పుకలిగినట్లు తోచుచున్నందున నీ యొడంబడిక నంగీకరింపవచ్చును. భారతీయ రాయబారులకు దక్షిణాఫ్రికా ప్రభుత్వమువారును ప్రజలునుకూడ బాగుగ స్వాగతమిచ్చి యాదరించినారనియు ఆదినములలో అచ్చటి భారతీయులనుసైతము ఏ యభ్యంతరమును చెప్పక అచ్చటి గొప్ప హోటళ్ళలోనికికూడ రానిచ్చిరనియు భారతీయ రాయబారులనుగూర్చి విశేషములు చెప్పుడని అచ్చటి యూరోపియనులు ఆండ్రూసుగారి చుట్టును చేరి యడుగుచుండిరనియు ఆండ్రూసుగారె నాకు వ్రాసినారు. ఈ స్నేహభావము నిలిచియుండునేని నిశ్చయముగ దక్షిణాఫ్రికాలోని భారతీయులకు స్వాతంత్ర్యమండపము నిర్మించుటకు పునాదులుగ నుపయోగించవచ్చును.” అని వ్రాసిరి. దక్షిణాఫ్రికావారు కోరు ప్రతినిధిని పంపునపుడు భారతీయునినే పంపిన బాగుండుననియు అందుకు శ్రీనివాసశాస్త్రిగారే తగినవారనియు గాంధిగారు వ్రాసిరి.

ఒడంబడిక యొక్క మంచిచెడ్డలు :— హాబిబుల్లాగారిని దక్షిణాఫ్రికాలో నేటాలు ఇండియన్ విజిలెన్సు అసోసియేషను అధ్యక్షుడగు జాన్. ఎల్. రాబర్ట్సుగారు సందర్శించి విద్యావిషయమున తమకు అవకాశములేకుండుటనుగూర్చియు ఇచ్ఛాపూర్వకముగ దక్షిణాఫ్రికానుండి పోవుట (Voluntary

repartiation ) యని చెప్పి ప్రభుత్వమువారు బలవంతపరచి బయటకంపు పద్ధతినిగూర్చియు చెప్పకొనియుండిరి. ఇట్టి రిపాట్రియేషను పద్ధతికల యొడంబడికలు చేయవలదనియు దక్షిణాఫ్రికాలో నివసించువారి హక్కులకు భంగముకలిగించవలదనియు చెప్పియుండెరు. ఇట్టి పద్ధతి అంగీకరింపబడెనేని తమ సంఘమువారును "నేటాలు భారతీయ కలోనియల్ బార్న (Natal Indian Colonial born Association ) సంఘమువారును, నేటాలు రైతుల సంఘమును యెట్టి రిపాట్రియేషన పద్ధతికిని అంగీకరింపక విరోధింతుమని హబిబుల్లాగారికి 1927 సం॥ జనవరి 15 తేదీన లేఖలు వ్రాసిరి అట్టి రిపాట్రియేషనే మరల నింకొక పేరున దక్షిణాఫ్రికా ఒడంబడికలోనికి వచ్చియుండుట దక్షిణాఫ్రికా భారతీయులకు కొంత యసంతృప్తి కలిగించినది. ఆసియా చట్టము పోయినందుకును విద్యావిషయిక సంస్కరణములు చేయబడు సూచనలు కనపడినందుకు తృప్తిగనె యున్నను (1) ఆస్తిని విక్రయించు విషయమున చేయబడిన నియమములు (2) బ్రిటీషు గయానాకు వలసపంపబడుదురను భయము. (3) మునిసిపలు ఎన్నికహక్కులు లేకపోవుట (4) భారతీయవర్తకులకు న్యాయము దయచేయక పోవుటయు అసంతృప్తిని కలిగించినవి. అప్పటి భారతీయులిట్లు విమర్శించుచున్నారని ఆండ్రూసుగారు తంతినంపిరి.

ఒడంబడికవలనభారతీయుల కష్టములుపోవునా:—పాశ్చాత్యజీ

వితపద్ధతులు అను మాట కర్థమేమి? అట్టిజీవితము గడుపదల చియు ధనములేనివారికి విద్యగరపి సమితివారు ఉద్ధరించెదరా? లేక అట్టివారిని అట్లుజీవింపుమని యొత్తిడిచేసి బయటకంపెదరా? వాణిజ్య వ్యాపారములలో తెల్లవారితో సమానముగ భారతీయులను గూడ పోటీగా నిలిచి పని చేయనిత్తురా? ఇతరపని పాటలందును సమానగౌరవ మిచ్చెదరా? పాశ్చాత్యపద్ధతుల ననుకరించుటకు తగినవిద్య, ధనము, కూడ నున్న భారతీయులను కూడ ఇదివరకువలెనె ప్రత్యేకస్థలములందు నివసింపుడని దూరముగ మాలపల్లెలవంటి గూడెములందె యుండుమందురా లేక తెల్లవారితోపాటు స్వేచ్ఛముగ ఇచ్ఛవచ్చిన ప్రదేశములలో నివసింపనిచ్చెదరా? వ్యాపారములు చేసికొనుట కేర్పడిన లైసెన్సుచట్టములను తిరిగిసవరించి తెల్లవారు నల్లవారు అనుభేదభావము పక్షపాతమును ఏదోరూపమున మరల అమలులోనికి రానిచ్చెదరా? పాశ్చాత్యపద్ధతుల ననుకరించుటకు అర్హులైన భారతీయులను పట్టణములందుగాని పల్లెలందుగాని ఏవిధమైన ప్రతిబంధకములు లేకుండభూవసతి నేర్పరచుకొన నిచ్చెదరా? దక్షిణాఫ్రికాలో చిరకాలమునుండి కాపురమున్న భారతీయులకు రాజ్యాంగ వ్యవహారములందుగాని మునిసిపాలిటీలందుగాని వోటునిచ్చు అధికారములిప్పుడు ఎన్నుకొను హక్కులు లేని ప్రదేశములలో నిప్పింతురా? ఈసంగతులు స్పష్టముగ నిస్సందియముగ పరిష్కరించినగాని ఈయొడంబడిక లాభకర

మోనష్టకరమో చెప్పుటకు వీలులేదని సర్ శివస్వామి అయ్యర్ గారు చెప్పిరి.

'వర్ణభేదపు చట్టమునుగూర్చి యేమియు చెప్పబడలేదు. భారతీయులకు వ్యతిరేకములగు చట్టములు చేయమని సమితి వారు సూచింపనైనను లేదు. ప్రస్తుతపు ఒడంబడిక ఆచరించి చూడవలసిన తాత్కాలిక ప్రణాళికగ వారు చెప్పుచున్నారు. వారనుకొనినట్లు ఫలితములు లేనిచో దీనిని మార్చవలసివచ్చుననియు వివిధరాష్ట్రముల యొక్క దృక్పథమును మార్చుట కష్టతరమనియు వీలుండదేమో యనియుకూడ సూచించుచునేయున్నారు. మొదటినుండియు మనకువ్యతిరేకమగు ట్రాన్సువాలును వీరు సమర్థించగలరా? రౌండుటేబిలు కాన్ఫరెన్సు సమావేశపర్చునప్పుడె దక్షిణాఫ్రికా తెల్లవారి దేశముగ చేయవలెనను దక్షిణాఫ్రికా ప్రభువుల సిద్ధాంతమును పురస్కరించుకొని మాలన్ మంత్రిగారు భారతీయుల సంఖ్య తగ్గించుపద్ధతినె ప్రతినిధుల సభకంగీకరించుచున్నట్లు స్పష్టముగ చెప్పియుండి ఇప్పుడీ ఒడంబడికయం దీవిషయము స్పష్టముగ లేకపోవుట చూడగ ననుమానముగ నున్నది. నేడు ఆసియావారుగాక కాఫరులు ఇంగ్లీషువారు బోయరులు కేపులోని నలుపురంగు జాతివారును దక్షిణాఫ్రికాలో నున్నారు. మఱియు ముప్పదిచిన్నవర్ణముల వారున్నారు. ఇట్టిస్థితిలో తెల్లదక్షిణాఫ్రికా స్థాపించుటకు వీలు లేదు. ఇది యంగీకరించినచో భారతీయులు తృప్తితో సంతోష

ముగ జీవించువ్రజలుగ సమితిపరిభుత్వమున నుండుట శ్రేయ స్కరమనియు దీనివలన వితరసమస్యలును పరిష్కారమగుననియు తెలియఁగును. ఈయొడంబడిక తృప్తికరమూ కాదాయను నది దీని యాచరణమునసె తెలియవలెను.’ అని ఫిబ్రివరు 21 వ తేదీన హిందూపత్రిక వ్రాసినది. సాగనంపుపద్ధతివలన భారతీయుల కవమానము కలిగింపవీలుండుననియు పాశ్చాత్య పద్ధతులను మాటయు తెనకనుమానము కలిగించుచున్నదనియు సరోజినీ దేవి పలికినది. గ్రిడ్డిలో మెల్లయని భారతీయులు సంతోషించు చున్నను నిదియైం ఎందుల కంగీకరింపబడవలెనని దక్షిణాఫ్రికా లోని తెల్లవా రుద్ఘోషించుచున్నారని ఆండ్రూసుగారు తంతి నంపినారు. బ్లూం ఫాంటీన్‌లోని ఫ్రెండ్ (Friend) అనుపత్రిక దీనిని నిరసించుచు వ్రాసినది. ఈపత్రికకు ఆరెంజిరాజ్యమున చాలప్రచారము కలదు. డర్బన్ రాజకీయ నాయకులు దీనికి వ్యతిరేకులుగ నున్నారు. 5 సంవత్సరములు మాత్రమే ఈ యొ డంబడిక నుండుడని మునిసిపలు కవున్సిలులో తీర్మానమును ప్రవేశపెట్ట దలచినారు.

సూచనలు:—ఇది యిట్లుండగ నిజముగ దక్షిణాఫ్రికా హృదయము మారలేదని యనుమానము కలుగుచున్నది. చెన్నపురి వైద్యనాథమొదలివీధిలో కాపురమున్న ఎ. అరు ణాచలమను ధనవంతుడగు విద్యార్థియొకడు దక్షిణాఫ్రికా దేశమును అచ్చటి పరిస్థితులను స్వయముగా చూడదలచి

యిచ్చటికి పోవుటకు అనుజ్ఞపత్ర మిమ్మని ధరఖాస్తు పెట్టుకొనెను. చెన్నపురి పోలీసు కమీషనరుగారు దక్షిణాఫ్రికాసమితి ప్రభుత్వమువారి దేశములో ప్రవేశించుటకు ముందుగా వారి వలన అనుజ్ఞపత్రమును పొంది దానితో ధరఖాస్తు చేయని యెడల అతడు కోరిన ప్యాసుపోర్టు అనుజ్ఞ యివ్వబడదని వ్రాసెను. అంతట అరుణాచలముగారు సమితిప్రభుత్వము వారికి ధరఖాస్తు పంపుకొనిరి. ఆ ప్రభుత్వమునకు స్వదేశవిషయమంత్రిగారి కార్యదర్శిగా రిట్లు జవాబునిచ్చిరి. 'మీరు వ్రాసిన 1927 సం॥ జనేవరు 5 తేదీగల లేఖకు జవాబుగ మీరు కోరినట్లు సమితిప్రభుత్వమువారి దేశములో మీరు ప్రవేశించుటకు అనుమతి నిచ్చుటకు వీలులేదని తెలుపుచున్నాను.' ఇంటీరియర్ మినిష్టరు యొక్క సెక్రటరీగారి చేవ్రాలు.

“ ఈ ఒడంబడిక స్నేహము గౌరవమును దెలుపు సభిప్రాయ సమ్మేళనమె కాని ఉభయ ప్రభుత్వములను బాధించు సంధిపత్రము కాదనియు, క్రిందటి సంవత్సరము చేయదలచిన శాసనము (ఆశియా చట్టము) ను ప్రస్తుతము విరమించుటవలన అవశ్యకమైనప్పుడెల్ల న్యాయముగను తమ కిచ్చవచ్చినట్లును భారతీయుల విషయమున శాసనములు చేయు నధికారమును దక్షిణాఫ్రికా సమితిప్రభుత్వము వదలుకొనుటలేదు ” అని మాలనుమంత్రిగారు దక్షిణాఫ్రికా శాసనసభలోనె చెప్పి తెల్ల

వారికి ధైర్యముకలిగించినట్లు 1927 సం॥ ఫిబ్రవరు 25 వ తేదీన దక్షిణాఫ్రికా ఇండియన్ ఒపీనియన్ పత్రికలో ప్రకటింపబడినది. అందువలన గాంధిస్మట్సు ఒడంబడికయొక్క గతియేదనికిని గలుగునేమో యని భారతీయులకు అనుమానము కలుగుచున్నది. దీనికి తోడుగ దక్షిణాఫ్రికాలోని తెల్లవారెల్ల రీ యొడంబడికకు తమ అసమ్మతి తెలుపుచు ప్రభుత్వమువారు దీని కంగీకరింపరాదని సభలు చేయుచున్నారనియు, భారతీయ ప్రతినిధులు దక్షిణాఫ్రికాలో కొందరికి లంచముల నిచ్చిరనియప వాదులు వేయుచున్నారనియు ఇది చాల ఘోరాకారము దాల్చుచున్నదనియు ఆండ్రూసుగారు మార్చి 25 తేదీన తంతిపంపినారు. శ్రీనివాసశాస్త్రిగారిని దక్షిణాఫ్రికా ప్రతినిధిగ ప్రభుత్వమువారు నియమించుట కొంత సంతోషమునకు కారణమైనది.

శ్రీనివాసశాస్త్రిగారు దక్షిణాఫ్రికాలో తమ యుద్యోగమున జేరినారు. వారి నచ్చటి ప్రభుత్వమువారు గౌరవించిరి. వారి యుపన్యాసములకు ప్రజలు హర్షించిరి. 1927 సంవత్సరము గడచినదికాని దక్షిణాఫ్రికా హృదయము మారలేదు. వర్ణభేదచట్టము, సాగాయచట్టము భూవిషయముల చట్టమును రద్దుపరుపలేదు. 1927 డిశంబరులో చెన్నపట్టణమున జరిగిన భారతీయ జాతీయ మహాసభయందు దీనినిగూర్చి గాంధిమహాత్ముడు రెండు తీర్మానముల నుపపాదించెను. ఏ కారణము

వలననైననేమి దక్షిణాఫ్రికానుండి రిపాట్రియేషను పద్ధతిపైన వెడలిపోవుచున్నవారి సంఖ్య హెచ్చుచున్నది. 1925 లో 1358 మంది, 1926 లో 2100 మంది, 1927 లో 2986 మందియు నిట్లు ఇండియాకు వచ్చిరి. ఇంతవరకు వచ్చిన దరఖాస్తులను బట్టి చాలమంది 1928 లో వెడలిపోవుదురని తోచుచున్నదని వలస ఉద్యోగి (Protector of Indian Immigrant) చెప్పు చున్నాడు.

# దక్షిణాఫ్రికా.

## XI

### తూర్పుఆఫ్రికాలోని భారతీయులు.

మూడు నాలుగు తరములనుండి నివసించుచున్న భారతీయుల కుటుంబములుకూడ తూర్పు ఆఫ్రికాలో కలవు. శ్వాలింగుప్రభువుకాలమునాటినుండియు భారతీయు లచ్చట నుండిరి. వీరివలననె బ్రిటీషు సంపర్కము వృద్ధియైనది. భారతీయులు లేనిచో బ్రిటీషువా రచ్చట నుండుటయె సంభవించియుండదనియు, వీరివలననె బ్రిటీషువా రచ్చట బలవంతులై నెలకొనిరనియు సర్ జాన్ క్లార్కుగారు 1910 సం॥ లో పలికిరి. బ్రిటీషు ఇండియనులయొక్క వర్తక లాభముకొఱకును వారి క్షేమముకొఱకును, ఆవశ్యకమని బ్రిటీషు మంత్రులు విక్టోరియా మహారాజ్ఞికి మనవిచేసి 1888 లో బ్రిటీషు తూర్పు ఆఫ్రికా సంఘమువారికి పట్టా నిప్పించియుండిరి. ఆ ప్రాంతముల నెలకొనిన జర్మనీవారితో పోరాడియు వారితో వర్తకమునకు పోటీగ నిలిచియు దేశమును బ్రిటీషు రాజ్యమున జేర్చిరి. ధన సహాయ్యముకూడ భారతీయులుచేసిరి. భారతీయ యోధులు పోరాడిరి. భారతీయుల సహాకారముతో, కూలివారి ప్రాణములతో, ఉగండా ఇనుపదారిని బ్రిటీషువారు నిర్మించిరి. కిక్కిరిసి నివసించుచున్న భారతీయ ప్రజలకొఱకే యినుపదారి యావశ్యకమని బ్రిటీషు పరిపాలకవర్గ

ము వారింగ్లాండులో జెప్పియుండిరి. ఇట్లు వర్తి విషయము
నను భారతీయులె తూర్పు ఆఫ్రికాయొక్క అభివృద్ధికి గారణ
భూతులైరి. భారతీయ వర్తకులు చేసిన పరిశ్రమను పడిన
కష్టములను వేసిన పునాదులను బ్రిటీషువా రుపయోగించి
కొని బాగుపడిరి. లాభము నందిరి. అచ్చట నొక యూరోపు
దేశమువానికి నలుగురు భారతీయులవంతున జనసంఖ్యయున్నది.
భారతీయులె చాలవరకు పన్నుల భారమును భరించుచున్నారు.
భారతీయులలో చేతిపనులవలన జీవించువారు ననేకులున్నారు.
వీరార్థిక లాభమునకు తోడ్పడుచున్నారు. ఇదిగాక రైళ్ళలో,
షాపులలో చిన్నయుద్యోగములను జేయుచున్నవారు ననే
కులుగలరు. వీరు స్వార్థపరులుగాక తక్కిన జాతులపట్ల సమాన
బుద్ధితో ప్రవర్తించి దేశాభివృద్ధికి సహకారులుగ నున్నారు.
భారతీయులు సద్భావముతో నీదేశము యూరోపు దేశీయు
లకు వాసయోగ్యమనికూడ చెప్పిరి

మొదట బ్రిటీషు పరిపాలకవర్గమువారికిని భారతీయు
లకును స్నేహభావమె యుండెనుగాని బ్రిటీషు బోయరుయు
ద్ధానంతరము దక్షిణాఫ్రికా నుండి కొందఱు తెల్లవారు
వచ్చి యిచ్చట నారోగ్యవంతములగు నున్నత స్థలముల నాక్ర
మించికొనిన పిదప తెల్లవారు హెచ్చులాభములను ఎక్కుడు
బాధ్యతలను గోరి తెల్ల నల్ల తారతమ్యమును దెచ్చిపెట్టిరి.
క్రొత్తవారు బ్రిటీషువలనవారును వచ్చిరి. వీరు భారతీయు

నెఱుగక వారియాచారముల నేవగించుకొనియు వారి రంగును జూచి నల్లవారని నీచముగ జూచియు భారతీయుల కనిష్టముగ ప్రవర్తింపసాగిరి. భారతీయులు తమకన్న హీనులుగను వారి జాతి, గౌరవము పొందుటకు తగనిదిగను తలచి వారినవమానింప సాగిరి. వీరిని దక్షిణాఫ్రికాలోని భారతీయుల స్థితికి దీసికొని వచ్చుటకు సమకట్టిరి.

పూర్వము బ్రిటీషు దేశమున పరరాజ్య (కార్యదర్శి) రాజ్యాంగ మంత్రి గారి కార్యస్థానము (Foreign Office) యొక్క విశాలభాగము క్రొత్తగవచ్చిన వలసరాజ్యాంగ మంత్రిగారికి లేకుండెను. ఇది తెల్లవారికి లాభించెను. తూర్పు ఆఫ్రికా కెన్యా వలసరాజ్యముల యొక్క స్థానిక ప్రభుత్వము వారు, స్వేచ్ఛముగ పరిపాలింపసాగిరి. వారచ్చటి తెల్లవారి యిష్టానుసారముగ నేలసాగిరి. పాశ్చాత్యులెల్లరు, భారతీయులను కూలివారితోను బానిసలతోను సమానముగ చూచిరి.

1908 సంవత్సరమున ఎల్జిన్ గారు వలసరాజ్యాంగమంత్రిగ నుండినకాలముననె భారతీయుల హక్కులకు భంగము కలిగెను. ఆరోగ్యవంతములగు నున్నత ప్రదేశములందు భారతీయులకు దరఖాస్తుభూముల నీయరాదని పరిపాలకులు వ్రాసిరి. భారతీయుల యోగక్షేమముల కన్న యూరోపియను ప్రజల సౌఖ్యము ముఖ్యముగ నాలోచింపవలసి యున్నదని

ప్రతి సందర్భమునను పరిపాలకులు బ్రిటిషుమంత్రిగారికి చెప్పు చుండిరి. భారతీయులబాధ లధికములయ్యెను.

1920 సంవత్సరమునాటికి వీరిస్థితి భారతీయ రాజ్యాంగ మంత్రి (Secretary of State for India) గారి కన్నులు కూడ తెఱచినది. "భారతీయులకు కొంతప్రసక్తి యున్నదేశ ములో, అందు ముఖ్యముగ బ్రిటీషువారు స్వాయముగ పరి పాలించుచున్న ప్రభుత్వ వలసరాజ్యము (Crown Colony) లో ఎల్లరకును సమానహక్కులు లేకపోవుట మేమంగీకరింప జాలము......భారతీయుల కనిష్టముగ, అన్యాయముగ, పక్షు పాతము చూపుచున్నారు" అని ఇండియా మంత్రిగారే వ్రాసినారు.

1921 సంవత్సరమునాటికి కెన్యాలో 22822 భారతీయు లుండిరి. పూర్వముకన్న వీరిసంఖ్యతగ్గినది. వీరిబాధలు హెచ్చి నవి. ప్రతివిషయమునను వీరి కన్యాయమే జరిగినది. పట్టణ నిర్మాణము విషయమున సలహానిమ్మని నియమింపబడిన యు ద్యోగి సింప్సన్‌గారు భారతీయులను, యూరోపియనులకు సం బంధము లేకుండ ప్రత్యేకముగ నొక మూలనుంచినగాని నైరోబీపట్టణము ప్రత్యేకముగ యూరోపియను నగరము కానే రదని సలహానిచ్చెను. దక్షిణాఫ్రికాలో భారతీయులను మా లగూడెములవంటి మారుమూలల కంపుట కిదియొక మిష. సింప్సన్‌గారిది రాజతంత్రి దృష్టియని, సి. ఎఫ్ ఆండ్రూసు

గారు అభిప్రాయపడినారు. భారతీయులు చాలమందియుండుట వలన కొంచెము చిక్కుగనే యున్నదని ప్రభుత్వమువారికిని తోచినది

కెన్యా సమస్య:— తూర్పు ఆఫ్రికాసమస్య భయంకర రూపముదాల్చినందున భారతీయుల కష్టముల నరయుటకు హెచ్. ఎస్. ఎల్. పోలకుగారును, సి. ఎఫ్. ఆండ్రూసు గారును దీనిని విమర్శించిరి. వీరు 1922 సం॥ జూన్ 22 తేదీన తమ యభిప్రాయమును ప్రకటించిరి. కెన్యారాజ్యము స్వపరిపాలనముగల వలసరాజ్యము మాత్రమే కాదు. అది ప్రభుత్వ వలసరాజ్యము (Crown Colony). దీనిపరిపాలనము లండన్‌నగరమున వలసరాజ్యాంగమంత్రిగారి కార్యస్థానము యొక్క చిన్నప్రతిబింబము (Branch Office). కెన్యాపరిపాలకునికి పై యధికారి వలసమంత్రిగారే. దీని ప్రభుత్వమునకు బ్రిటీషుసామ్రాజ్యప్రభుత్వమువారు స్వయముగ బాధ్యులుగనున్నారు. 1918 సం॥లో జరిగిన సామ్రాజ్యమహాసభలో బ్రిటీషువారు భారతీయులను తముతో సమానులను మాత్రము నంగీకరించియున్నారు. విన్‌స్టన్ చర్చిల్ (Winston churchill) గారు కమిటీసభలోనుండి చిత్తుతీర్మానములను వ్రాసియున్నారు. వారును వలసరాజ్యాంగ కార్యస్థానము పక్షమున దీని కంగీకరించియే యున్నారు. తాము వ్రాసిన వ్రాతలపైన నున్న సిరాయైన నారకమునుపే వారు తమ యభిప్రాయమును మా

ర్చుకొన్నారు. ఈపద్ధతికి వ్యతిరేకములగు సలహానిచ్చి యొక గవర్నరు నీయన కెన్యాకు పంపినాడు. వీరి రహస్యవిధానము వలన ప్రతివిషయమునను భారతీయులు యూరపియనులకన్న నధములుగనుండునట్లు శాసింపబడినది.

కెన్యా భారతీయుల కష్టములు:— కెన్యాలోని భారతీయుల దురవస్థలు నాలుగు విధములు. (1) వారారోగ్యవంతములగు నున్నతప్రదేశములందు వ్యవసాయము చేయుటకు భూములను సంపాదింపరాదు. అమ్మరాదు. దీనినిగూర్చి భారతీయులు మొఱపెట్టుకొనగ పూర్వము 1908 సం॥లో ఎల్జిన్ గారి కాలముననే ఇట్టితారతమ్యము చూపెదమని యూరపియను ప్రజలకు వాగ్దానము చేయబడియుండినట్లును, అదిమార్చుటకు వీలు లేనట్లును చెప్పిరి. కాని ఎల్జిన్‌గారట్టి వాగ్దానమును జేసియుండలేదు. కొన్ని రాజకీయ సందర్భములనుబట్టి ప్రభుత్వము వారు భూములను యూరపియనుల కిచ్చుట యుక్తమనియు అయినను భారతీయులను గూర్చి ప్రత్యేకముగ శాసనములను చేయుటకు సామ్రాజ్య ప్రభుత్వమువా రంగీకరింపరనియు, చెప్పెను. ముందు భారతీయులకు భూము లివ్వకూడదు, అమ్మకూడదు అను నియమము లేనేలేదు. నిజముగ భారతీయులను భేదభావముతో చూడమను వాగ్దానము లనేకములు లిఖితపూర్వములవే తృణీకరించినది, యూరపియనులే. ఐరోపా మహాసంగ్రామ మొక

మూల జరుగుచుండగ దేశములో సైనిక శాసనము (Martial Law) అమలులో నుండగ భారతీయు లసాహాయ్య స్థితిలోనుండగ 1915 సం॥ లో ఇతర జాతులవారు భూములను విక్రయించుకొనరాదనియు అట్టి విక్రయములు చేసినయెడల ప్రభుత్వమువారు వానిని రద్దుచేయవచ్చుననియు శాసించి దానిని భారతీయులపైన బ్రయోగించిరి. (2) భారతీయ లుండుటకును వర్తకము చేసికొనుటకును ప్రభుత్వమువారే తమ యిచ్చవచ్చిన ప్రదేశములను నిర్ణయించి ప్రత్యేకింతురు. ఇవి మనయూరిబయటి మాలగూడెములువలె నుండును. (3) ఎన్నిక హక్కులు పూర్వము భారతీయులకున్నవానిని గూడతీసివేసి ఇకముందు లేకుండ చేయుటకు యూరపియనులు ప్రయత్నించుచు అట్లు చేయుచున్నారు. (4) కెన్యారాజ్యమును చక్కని స్వభావసిద్ధమగు బ్రిటీషువారి జాతీయ వలసరాజ్యముగ చేయుటకు, చర్చిల్ గారు చెప్పినట్లు ఆదిమజాతుల పురోభివృద్ధికొఱకై భారతీయుల వలసను నిషేధించిరి.

వలసమంత్రిగారగు చర్చిల్ గారింతటితో నూరకొనక, తూర్పు ఆఫ్రికాలోని ఇతర భాగములగు ఉగండా, టంగన్యికా, జాంజిబారులను కెన్యావలస రాజ్యముతో కలిపి పరిపాలించుటకు పూనుకొన్నారు.

కిటోషుహత్య:—జాస్పర్ అబ్రహాం, అనువాడు కిటోషును హత్యచేసెనని విచారింపబడెను. నేరము చేయలేదని

అబ్రిహాం చెప్పుకొనెను. ముద్దాయి 5 గంటలు సాక్ష్యము నిచ్చెను. కిటోషు అను 'నేటీవు' గుఱ్ఱము నెక్కి దానికి దెబ్బలు తగిలించెననియు అందువలన వానిని తాను కొఱడాతో శిక్షింపదలచితి ననియు, కొందఱు సేవకులును తనకు సహాయము చేయదలంచిరనియు వారాకుఱ్ఱవానిని నేలమీదపడ వేసిరనియు తాను 15 నిముషములు వానిని కొట్టితిననియు తరువాత మొదటి సేవకుని కొట్టుమంటి ననియు కిటోషు అల్లరి చేయుచుండెననియు, సేవకుడు బాగుగ కొట్టనందున రెండవ సేవకుని కొట్టుమంటిననియు, వాడును బాగుగ కొట్టలేనందున మూడవవానిని గొట్టుమని యాజ్ఞాపించితిననియు, అంతట కిటోషు నటన ప్రారంభించెననియు చెప్పెను. ఇతరసాక్ష్యము వలన వాడు చచ్చుచున్నాడని కొందఱు 'నేటీవు' సేవకు లని నట్లు తెలియుచున్నది. కాని ఆదెబ్బలు చాలవనియు అదినటన యనియు చెప్పి ముద్దాయి కిటోషుపైన నీటిని పోయించెను. వానికి తెలివివచ్చెను. ముద్దాయి వానిని గిడ్డంగిగదిలో పడవేసి వానినొక స్తంభమునకు వెనుకకువిరచి కట్టుమని తనవంటవాని కాజ్ఞాపించెను. వంటవాడు నీకేసులో సాక్ష్యమిచ్చెను. కిటోషు బాధతో నిటునటు పొరలుచు పొడుచుకొని చచ్చెద నొకకత్తిని తెమ్మనెననియు కొంతసేపటికి చచ్చిపోవుచున్నానని కేకవేసెననియు తెల్లవారుఝామున నాలుగు గంటలకు మరణించెననియు చెప్పెను.

ఈనేరమునుగూర్చి యింక నన్యాయములగు విశేషములు బయల్పడినవి. ఈకేసులో నుత్తరసాక్ష్యము, ముద్దాయివాదనయు నిది. ఇతరకారణములతో పాటు కొరడాదెబ్బలు చావునకు తోడ్పడినవనియు ఆబాలుని కడుపులో నాహారము స్వల్పముగ నుండెననియు నందువలన వాడు దెబ్బలకోర్వలేక పోయెననియు నుత్తరసాక్ష్యమున వైద్యునిచేత చెప్పించిరి. కిటోషు మరణింపవలెనని సంపూర్ణేచ్ఛతో నుండెననియు, ఈ సంకల్పమునకు కొరడా దెబ్బలు తోడ్పడినవనియు చెప్పిరి. ఈకేసులో న్యాయమూర్తి షెరిడన్ గారు న్యాయ సభికు (జూరీ) లకు ముద్దాయి కిటోషును చంపదలచెనా లేక, ముద్దాయి వానిని బలముగ కొట్టి బాధ కలిగింపనెంచెనా యను సంగతిని, వానికి కోపకారణముండెనాయను సంగతి నీహత్య విషయమున నిర్ణయింపుడని హెచ్చరించెను. జూరీ సభ్యు లొకగంట యోజించి ముద్దాయి కిటోషును బలముగ కొట్టి బాధకలిగించిన నేరమును చేసెనని తీర్పుచెప్పిరి. కోప కారణము లేదనిరి. న్యాయమూర్తిగారు ముద్దాయికి రెండు సంవత్సరముల శిక్షయు నేటీవు సేవకుల కొక్కొకదినము శిక్షయు విధించిరి.

ఈకేసు పార్లమెంటువారు చర్చింపదగినదనియు, తన 'నేటీవు' ప్రజలను కొరడాదెబ్బల వలన మరణములనుండి రక్షించలేని,ఇట్టి ఘోరనేరమును స్వల్పనేరముగ నిర్ణయిందు

సంతతి పక్షపాతుల హస్తములందు ధర్మపరిపాలనము నిడియుండరాదనియు సామ్రాజ్యము అనావశ్యకమనియు, కెన్యావంటి ప్రభుత్వ వలసరాజ్యమున తెల్లజూరీ సభ్యులు నేటివుల యెడల న్యాయపరిపాలనము చేయలేని స్థితిలో న్యాయపరిపాలనము వారి చేతులలోనుండి తప్పించుట ముఖ్యమనియు మాంచెస్టర్ గార్డియన్ పత్రికయె 1923 సంవత్సరములో వ్రాసినది.

టంగన్యికా భారతీయులు :— "టంగన్యికాలోని భారతీయులు పడుచున్న కష్టములు వర్ణనాతీతములు. స్మట్సు సేనానిగారు మా కిష్టమున్నను లేకున్నను వర్ణభేదము యొక్క తారతమ్యము తప్పదని చెప్పుచున్నారు. ఆఫ్రికాలోని బ్రిటిషుసామ్రాజ్యము తెల్లసామ్రాజ్యము. బ్రిటీషున్యాయమునందె నాకు నమ్మకము పోయినది. వలసవిచారణ సంఘము (Colonial Committee) తో నేను పోయి చూడగ నీ విమర్శ యనావశ్యకమని నాకు తోచినది. టంగన్యికాలోని భారతీయులు అసహాయులై పోయినారు ఆసంఘమున పని చేయుమని భారతీయనాయకులువచ్చి నన్నడిగినందున నేను పోయితిని. అచ్చటి శాసనము వలన భారతీయులు తమవర్తకపు లెక్కలను ఆంగ్లభాషలో వ్రాయవలయుననియు గుజరాతీ భాషలో వ్రాయకూడదనియు శాసించిరి. ఇందువలన మనవర్తకులను నిషేధించుటకె వారు ప్రయత్నించుచున్నారు. దీనివలన వారికి కలుగుచున్న నష్టమునకు మేరలేదు. ఫ్రెంచి

వర్తకులను ఫ్రెంచి భాషలోనే లెక్కలను వ్రాసికొన నిచ్చియు మనవారిసిట్లు దించుట యన్యాయము. వలస రాజ్యాంగమంత్రిగారి కీయన్యాయము చేయవలదన్నను వారు వినలేదు. అందువలన మనవర్తకులు సమ్మెకట్టి అంగళ్ళను మూసివైచిరి. చాలబాధ లనుభవించిరి. రాజీమాటలు జరిగెను. సమ్మెయాగెను. కాని మఱల నొక సంవత్సరములో నీయక్రమమును మఱల సాగించిరి. వారు వాగ్దానములను మీరుచున్నను నేను నమ్మియుంటిని. ఇప్పటికిక వారిని నమ్మరాదని తోచినది''అని సి. ఎఫ్. ఆండ్రూసుగారు వ్రాసినారు.

తూర్పు ఆఫ్రికాప్రభుత్వవిధానము, భారతీయుల కష్టములు:— కెన్యాప్రభుత్వమువారు 1923 సం॥ అక్టోబరులో నొక చట్టమువలన భారతీయులకును ఆదిమవాసులకును గావలసిన వస్తువులపైన పన్ను లధికముగజేసిరి. తినుబండారములపైనను, కోరాబట్టలపైనను పన్ను లధికముగ విధించిరి. అనావశ్యకములగు సామగ్రిపయిన పన్నులు తగ్గించిరి. 1923 సం॥ నవంబరులో నొక వలస చట్టమును చేసిరి. దానివలన దేశములోనికి వలస వచ్చిన ప్రజల కనేకవిధములగుఅడ్డంకులను కలిగించిరి. వారివృత్తులపయినకూడ కొన్నివిధులను నిర్ణయించిరి. ఉగండా ప్రభుత్వమువారు గుఱుతు పత్రముల చట్టము (Identity Card Bill) అను నొక శాసనమునుజేసి ట్రాన్సువాలువారుచేసిన రిజిస్ట్రేషనుచట్టమునే చేయదలచిరి. ఉగండా

టంగనీయికా ప్రభుత్వములవారు వలస చట్టముల చిత్తుశాసనములు తయారుచేసిరి

ఇంతలో తూర్పు ఆఫ్రికా భారతీయ జాతీయ సభవారు తమమహాసభకు సరోజినీదేవిని అధ్యక్షత వహింపుమని వేడుకొనిరి. 1924 సంవత్సరము జనేవరు 19 వ తేదీన ఆమె మొంబాసాపట్టణమున నధ్యక్షత వహించెను. ఆసభయందు తూర్పు ఆఫ్రికా భారతీయుల కష్టములను భారతీయులకు నాయకులు చెప్పుకొనిరి. ఆరోగ్యవంతములగు ప్రదేశములందు భారతీయులను గాపురముండనీయరు. వారికి గూడెములు ప్రత్యేకింపబడు చున్నవి. ప్రభుత్వమువారి వైద్యశాలలందు తెల్లవారికె చికిత్స చేయబడును. ఆదిమజాతులవారికి ప్రత్యేక వైద్యశాలలు కలవుగాని భారతీయుల కీవైద్యశాలలందెట్టి సౌకర్యములును లేవు. భారతీయ లాత్మరక్షణము కొఱకైనను దుపాకు లుంచుకొనరాదు. ఒక్కొక తెల్లవానికి విద్యకొరకు 24 పౌనులు వ్యయముచేయుచు భారతీయుల బిడ్డల కొక్కొక పౌనుమాత్రమె ప్రభుత్వమువారు వ్యయపరచు చున్నారు. భారతీయులకు మొంబాసాలోను నైరోబీలోను మాత్రమె పాఠశాలలు కలవు రైళ్లలో తెల్లవారికిని ఇతరులకును ఆశియావారికిని ప్రత్యేకముగ 'పెట్టెలు' నిర్మింపబడినవి. ఆదిమజాతుల క్షేమముకొఱకని చెప్పుచు భారతీయుల వలసనె నిషేధించు చట్టములు చేసిరి.

భారతీయ వర్తకు లధికసుంకముల జెల్లించుచు అనుమతి పత్రములు (Licences) పొందవలెననియు 1919 సంవత్సరము లోనే కెన్యావారు శాసించిరి. టంగన్‌యికావారు వీధుల వెంటతిరిగి యమ్ముకొను వర్తకులను నిషేధించిరి. తూర్పు ఆఫ్రికావారు ఇంక నెన్నోచట్టములను చేసి భారతీయులను బాధించుచున్నారు. తలపన్ను నిచ్చినగాని అనుమతి పత్రముల నీయరు. ఇది యన్యాయమనియు దీనిని సాత్వికముగ నిరోధింపుడనియు సరోజినీదేవి బోధించెను. అంతట కాంగ్రెసుసభయైన పిదప తలపన్నులీయక 800 మంది చెఱసాల కేగిరి. మూడు నాలుగు నెలలీయుద్యమము సరోజినీదేవి నాయకత్వమున జరిగెను. ప్రభుత్వమువారు సాత్విక నిరోధము చేసినవారి యాస్తిని జప్తుచేయించి బాధించిరి. వలస రాజ్యాంగమంత్రిగారికి భారతీయులు మొరపెట్టుకొన్నను లాభము లేకపోయెను. ఈ సమస్యను తీర్మానింపుడని 1928 సంవత్సరమున సామ్రాజ్య సభకు పోయిన సప్రూగారడిగి శ్రమపడి సంపాదించిన విచారణసంఘమువారు దీనిని విమర్శించుచుండిరి. కెన్యావారి వర్ణభేద తత్వమును దక్షిణాఫ్రికా రాజనీతిజ్ఞులు హర్షించి ప్రోత్సహించిరి. కెన్యావిధాన విషయమున దక్షిణాఫ్రికాలోని వారెల్లరు నేకాభిప్రాయము కలిగియున్నారని స్మట్సుసేనానిగారు వలసమంత్రిగారికి తంతినంపిరి. ఈ విషయమున బ్రిటీషుసామ్రాజ్య ప్రభుత్వము

వారు కెన్యావారి సిద్ధాంతములను మార్చరాదనిరి. వలస రాజ్యాంగమంత్రిగారి దగ్గరకు కెన్యాభారతీయుల ప్రతినిధిగపోయి పరిస్థితులను మనవిచేసి వచ్చిన వాలుశ్మేన్‌భాయి సులేమాన్‌గారు తలపన్ను నీయనందున ఆరువారముల కఠిన శిక్షను పొందిరి. పన్నులనీయక నిరాకరించు యుద్యోగమును పరిపాలనకవర్గము వారణవివైచిరి.

బ్రిటీషువారి కెన్యావిధానము:—బ్రిటీషు ప్రభుత్వమువారు కెన్యాసమస్యను విమర్శించి న్యాయముగ తీర్మానింతురని సప్రూగారింకను నానతోనుండిరి. ఆయన శ్రమపడి సంపాదించిన విచారణసంఘమువారు లండన్‌లో కూడి 1924 సంవత్సరం జూలై 19 తేదీన తమపని పూర్తిచేసిరి. వారు తమ సలహాలను బ్రిటీషువలసమంత్రిగారికి నివేదించిరి. దీనినిగూర్చి అప్పుడు వలసరాజ్యాంగమంత్రిగనుండిన థామస్ గారు ఆగష్టు 7-వ తారీఖున పార్లమెంటు కామన్సు సభలో చెప్పి కెన్యావిధానమును ప్రకటించిరి. "వలస విషయములో జాతి వర్ణభేదముల నటుండనిచ్చి అధికమగు వలసవలన నేటివ్వుల యొక్క ఆర్థికయోగక్షేమములకు నష్టమువచ్చునేని అవిషయమున నేను శ్రద్ధతీసికొనెదను. దేశములోనికి వచ్చుచు పోవువారినిగూర్చి క్రమమయిన లెక్కలు తేల్పించెదను. ఈ లోపుగ కెన్యా వలసచట్టమును నిలిపియుంచెదను. ఎన్నిక హక్కుల విషయమున కెన్యాలో నాలుగు ప్రత్యేకజాతులుండు

టవలన వారు చెప్పినట్లు ఒకేవిధమగు ఎన్నికపద్ధతుల నేర్పరచుట యుక్తముగ కనబడుటలేదు అందువలన వేఱు వేఱు ఎన్నిక హక్కుల నిచ్చుటే మంచిది. పూర్వము స్పష్టముగనో, అస్పష్టముగనో వ్యవసాయమునకు యూరపియనులకే యున్న స్థలములనిచ్చుటకు వాగ్దానము చేయబడియున్నది. ఈపద్ధతిని మార్చజాలము. దిగువ (ఊబి) ప్రదేశములందు కొంతభూమిని ఇండియానుండి వలసవచ్చు భారతీయులకు ప్రత్యేకింపుడని విచారణసంఘమువారు చెప్పుచున్నారు వలసవచ్చు జాతులకు భూములను ప్రత్యేకించుపద్ధతి మంచిదికాదని చెప్పుచు దరఖాస్తుల నాహ్వానింపుడనియు, తగినభూములు నిర్ణయించుట కుద్యోగుల నేర్పరచుడనియు సలహానిచ్చుచున్నారు. వలసరాజ్యము లో నేటీవుల యొక్కయు, ఆయా ప్రదేశములలోని వ్యవసాయకుల యొక్కయు అభిప్రాయములు మన మెలుగువరకును దీనినిగూర్చి ఆలోచించుటకు వీలులేదు" అనెను. సప్రూగా రాశ్చర్యపడిరి. "కెన్యా వలసచట్ట మమలులోనికి రాదను లాభమొక్కటితప్ప తక్కిన విషయములందెల్ల నా కాశాభంగము కలిగినది" అని సప్రూగారొక పత్రికావిలేఖరికి 1924 సం॥ ఆగష్టు 10 వ తేదీన చెప్పిరి.

కార్మికపక్షమువారి ప్రభుత్వముపోయి బాల్డ్విన్ గారి ప్రభుత్వము మఱల వచ్చినది. కెన్యా విధానమున నావంతయు మార్పుకలుగలేదు. వర్ణభేదతత్వమును హెర్ట్జుజాగ్ ప్రభుత్వ

మువారు దక్షిణాఫ్రికాలో ప్రారంభించిరి ఈ తత్వము 1919 సంవత్సరమునుండి తూర్పు ఆఫ్రికాలో వృద్ధి యగుచునే యుండెను. మేజర్ గ్రోగన్, డిలామేరు ప్రభువు, తెల్లదేశ సిద్ధాంతమును బోధించుచుండిరి. భారతీయులకు వ్యతిరేకము లగు శాసనములను పరిపాలకులు చేయసాగిరి. భారతీయు లను మారుమూలలకు త్రోయుటయు వారిని దేశమునుండి వెడలగొట్టుటయు నీవిధానమున ముఖ్యకార్యములుగ నుండెను. 1926 సంవత్సరము వచ్చినది సర్ ఎడ్వర్డు గ్రిగ్ గారిని కెన్యాకు గవర్నరుగ బంపిరి. వలస మంత్రిగారి యాజ్ఞానుసారము మొంబాసాలో ఆరోగ్య వంతమగు ప్రదేశమును పాశ్చాత్యు లకె ప్రత్యేకించిరి. మే నెలలో భారతీయులు గవర్నరుగారిని దర్శించి మొఱపెట్టుకొనినను లాభము లేకపోయెను. వలస మంత్రిగారి యాజ్ఞమీరుటకు వీలులేదని గవర్నరుగారనిరి. అట్లు సర్కారుగారి కాలమున నాగిన "సెగ్రిగేషన్" వఱల ప్రభుత్వమువారు ప్రయోగించిరి. 1927 సం॥ ఫిబ్రవరు 27 వ తేదీన మొంబాసా జిల్లా సంఘమువారీ విధానమును తీర్మా నించిరి.

తూర్పు ఆఫ్రికా సమ్మేళనమును గూర్చి విచారించు టకు తూర్పు ఆఫ్రికా విచారణ సంఘమును ప్రభుత్వమువారు నియమించిరి. కాని ఇందొక భారతీయునైనను నియమింపలేదు.

కెన్యాకాంగ్రెసు మహాసభ నైరోబీలో 25-12-1927 తేదీన గూడినది. అధ్యక్షుడగు త్యాబ్ అలీగారు కెన్యా ప్రభుత్వమువారు భారతీయులను మారుమూలలకు త్రోయు సెగ్రిగేషన్ పద్ధతిని శాశ్వతముగ అవలంబించు చుండుట ఘోరమనియు భూముల విషయమునను వారు కల్పించిన ప్రతిబంధకములు దేశపురోభివృద్ధికి హానికరము లనియు, ప్రభుత్వోద్యోగములందు భారతీయులు లేకుండునట్లు ప్రభుత్వమువారు చేయుచున్న అక్రమ ప్రయత్నములను గూర్చియు యూరపియనులకు మాత్రమె ఉచిత ప్రారంభవిద్యను నిర్బంధముగ చేసి తక్కినవారికి చేయకయు భారతీయుల యొక్కయు ఆఫ్రికావాసుల యొక్కయు విద్యావిషయమున తిన్నగ శ్రద్ధవహింపకుండుటయు అన్యాయమనియు నేటీవుల కూలిపనినిగూర్చియు రిజిష్ట్రేషనునుగూర్చియు చేయబడిన నియమములు బానిసత్వమునకు దారి చూపుచున్నవనియు ఆయుధము లుంచుకొను భారతీయుల విషయమున ప్రభుత్వము చేయు నియమములు బాగులేవనియు గవర్నరుగారైన సర్ ఎడ్వర్డుగారి పరిపాలనము బాగులేదనియు ఆయన భారతీయుల పట్ల ద్వేషభావముతో నున్నారనియు ఉపన్యసించిరి.